# vāvilikolanu subbārāvugāri sulabha vyākaraṇamu: samagra pariśīlana

A thesis Submitted during 2025 to the University of Hyderabad In partial fulfillment of the award of a Ph.D. degree in Department of Telugu

by

Researcher

KAPPALA SURESH

(20HTPH04)

Department of Telugu

School of Humanities

University of Hyderabad

(P.O) Central University,

Gachibowli, Hyderabad-500046

Telangana

India

# CERTIFICATE

This is to certify that the thesis titled "vāvilikolanu subbārāvugāri sulabha vyākaraṇamu: samagra parisīlana" submitted by Mr.KAPPALA SURESH bearing Registration Number 20HTPH04 in partial fulfillment of the requirements for award of Doctor of Philosophy in the school of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this or any other University or Institution for award of any degree or diploma.

Further, the student has the following publication(s) before submission of the thesis/monograph for adjudication and has produced evidence for the same in the form of acceptance letter or the reprint in the relevant area of his research:(Note: At least one publication in referred journal is required)

A. Published in the following publications:

Parts of this thesis have been (NOT EXACT PARTS) discussed in the following papers and have been presented elaborately in the chapter 1 of the thesis.

1. Vāvilikolanu subbārāvu- sāhitya sēva (with Prof. Pammi Pavan Kumar) ( ISSN 2457-0796), Pg.No 11-15, Volume-28, issu-5, March 2025, Musi magazine.
2. Vāvilikolanu subbārāvugāri'sulabhavyākaraṇamu' pariśīlana ( ISSN 3048-5908), Pg.No 41-50, Volume-2, issu-4, October 2025, sahithya tharangini.

B. Presented in the following National and International conferences:

1. Presented a paper on "Rāviśāstrigāru racin̄cina nāṭakālu: Samāja prati phalanaṁ" in the Two days National webinar on " Sri Rachakonda

Vishwanatha Sastrygari Rachana Vaibhavam" organized jointly by the Department of Telugu, and the Centre for Endangered Languages and Mother Tongue Studies(CEL&MTS). 29th,30th September, 2022.

2. Presented on paper on "Bhadrācala kṣētramu – rāmadāsuni bhakti" in the Two days National conference on "Telangana kshetralu– akshara darshanam" conducted by governament degre collage, Manchiryala. 21th, 22th March, 2025.

Further, the student has passed the following courses towards fulfillment of course work requirement for Ph.D. Telugu (recommended by doctoral committee) courses passed during Ph.D. programme.

| S.No | Course Code | Course Name | | Credits | Pass/Fail |
|---|---|---|---|---|---|
| 1 | HT-700 | Research Methodology | | 4.00 | Pass |
| 2 | HT-701 | History of Telugu Research | | 4.00 | Pass |
| 3 | HT-702 | Research and Publication Ethics | | 4.00 | Pass |
| 4 | HT-703 | Board Field and Specialized Area | | 4.00 | Pass |

Prof. Pammi Pavan Kumar

Research Supervisor

Head,

Department of Telugu

Dean,

School of Humanities.

# DECLARATION

I, KAPPALA SURESH hereby Declare that this thesis entitled "vāvilikolanu subbārāvugāri sulabha vyākaraṇamu: samagra parisīlana" submitted by me under the guidance and supervision of **Professor. Pammi Pavan Kumar** is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodhganga/ INFLIBNET. A report on plagiarism statistics from the University Librarion is enclosed.

Date:

Name: KAPPALA SURESH

Signature of The Student:

Regd. No: 20HTPH04

Thesis Title: vāvilikolanu subbārāvugāri sulabha vyākaraṇamu: samagra pariśīlana
Student Regd. No: 20HTPH04

Supervisor(s): Prof. Pammi Pavan Kumar

Department/Centre: Department of Telugu

School: School of Humanities, University of Hyderabad, Hyderabad.

**Among 17 Goals (https://sdgs.un.org/goals), under which SDG the work incorporated in the thesis will be addressed:**

**Goal : 4 Quality Education**

**How the work incorporated in the thesis addressed the above SDG(in 250 words)**

The research dissertation titled *"A Comprehensive Study of Vavilikolanu Subbarao's 'Sulabha Vyakarana'"* consists of ten chapters in total.

The Thesis begins with a research introduction, which explains the research topic, the necessity of the study, scope, previous research, field surveys and collected manuscripts, sources used, plan of the thesis, objectives, and suggestions for future researchers.

Chapter-1 describes Vavilikolanu Subbarao's birth, childhood, education, profession, marital life, pilgrimages, devotion to Lord Rama, and his literary pursuits.

Chapter-2 presents the background and structure of Sulabha Vyakarana based on the source manuscript. It covers divisions such as : saṅjñā, sandhi, tatsama, acchika-kāraka, samāsa, taddhita, kriyā, kr̥danta, prakīrṇaka, vākya, and vyāsa-paricchedas.

Chapter-3 discusses letters and sounds, classification of phonemes, points of articulation, vowel signs, anusvāra and visarga, palatal, dental, and intermediate sounds, unattested initial letters in Telugu, symbols, and dialectal variations within the Telugu language.

Chapter-4 examines various sandhis such as: Aṭva, Itva, Utva, vowel elision sandhis, compound sandhis, Druta, Samāsagata, Nugāgama, and Sanskrit-origin sandhis.

Chapter-5 discusses the formation of words, including Tatsama, Ācchika, Taddhita, and Kr̥danta word types.

Chapter-6 covers the major types of compounds: Dvandva, Tatpurusha, Bahuvrihi, and Avyayibhava, along with their subtypes.

Chapter-7 analyzes finite verbs(vartamānārthaka, bhūtārthaka, bhaviṣyadarthaka, taddharmādi, āśīḥ, śāpa, samprārthana, vyatirekārthaka) and non-finite verbs (bhāvārthaka, ktvārtha, chedārthaka, ānantaryārthaka, śatrārthaka). It also discusses verbal adjectives, causative forms, and derived verbs.

Chapter- 8 explores case relations (kāraka theory) and syntax——covering word functions, vocatives, fixed singular/plural expressions, agentive and adjectival sentences, tense-based sentences, ellipses, compounds, and case suffixes.

Chapter-9 elaborates on the components that aid essay writing, such as lexical resources, Sanskrit vocabulary, topic selection, style, errors, sentence development, rhetorical devices, references, narrative techniques, and examination procedures.

Conclusion: The final section summarizes the key findings and results of the research, consolidating the major observations.

Additionally, it mentions that two research papers were published during the course of study:

1. "Vavilikolanu Subbarao – His Literary Service"

2. "A Study of Vavilikolanu Subbarao's Sulabha Vyakarana"

copies of these papers were appended to the thesis.

# విషయసూచిక


| | పుట సంఖ్య |
|---|---|
| CERTIFICATE | i |
| DECLARETION | iii |
| SDGS | iv |
| కృతజ్ఞతలు | xii |
| సంకేత పద సూచిక | xiv |

ప్రవేశిక (xv–xxv)

| | |
|---|---|
| I. పరిశోధనాంశ వివరణ | xv |
| II. పరిశోధనా ఆవశ్యకత | xvi |
| III. పరిశోధన పరిధి | xvi |
| IV. పూర్వ పరిశోధనలు | xvii |
| V. క్షేత్రపర్యటన, పరిశోధనకు సేకరించిన ప్రతులు | xvii |
| VI. పరిశోధన గ్రంథ రచన – ప్రధాన ఆకరాలు | xviii |
| VII. పరిశోధన గ్రంథ రచన– ప్రణాళిక | xix |
| VIII. పరిశోధన లక్ష్యం / ప్రయోజనాలు | xiv |
| IX. భావి పరిశోధకులకు సూచనలు | xv |

## అధ్యాయం – 1

## కవి జీవితం – రచనా విశేషాలు (1-26)


| | |
|---|---|
| 1.0 పరిచయం | 2 |
| 1.1 జననం | 3 |
| 1.2 బాల్యం-విద్యాభ్యాసం | 3 |
| 1.3 ఉద్యోగ వివరాలు | 6 |
| 1.4 వివాహ జీవితం | 7 |
| 1.5 పుణ్య క్షేత్రాల సందర్శనం | 8 |
| 1.6 శ్రీరామ సేవ | 9 |
| 1.7 రచనా వ్యాసంగం | 10 |


## అధ్యాయం – 2

## సులభవ్యాకరణ నిర్మాణ క్రమం(27-53)


| | |
|---|---|
| 2.0. వ్యాకరణం: నిర్వచనాలు | 28 |
| 2.1 సులభవ్యాకరణము గ్రంథ కాలం/ పరిశోధనకు గ్రహించిన ప్రతి | 30 |
| 2.2 సులభవ్యాకరణము రచనా నేపథ్యం | 30 |
| 2.3 సులభ వ్యాకరణ నిర్మాణ క్రమం | 31 |


## అధ్యాయం – 3

## వర్ణ విజ్ఞానం(54-78 )


| | |
|---|---|
| 3.0 పరిచయం | 55 |
| 3.1 వర్ణాలు | 55 |

3.2 గుణింతాలు 61

3.3 పూర్ణ బిందువు 62

3.4 అర్ధ బిందు ప్రస్తావన 64

3.5 తాలవ్యాలు 66

3.6 దంత్యాలు 66

3.7 అంతస్థాలు 68

3.8 తెలుగు పదాలలో మొదట రాని అక్షరాలు 69

3.9 సంజ్ఞలు 70

3.10 కళలు– ద్రుత ప్రకృతికాలు 70

3.11 ఆంధ్ర భాష: విభజన 71

3.12. కొన్ని విశేషాంశాలు 74

అధ్యాయం – 4

సంధి విజ్ఞానం(79-112)

4.0 పరిచయం 80

4.1 అచ్సంధులు 80

4.2 స్వర లోప సంధులు 86

4.3 కళా సంధులు 88

4.4 ద్రుతసంధులు 89

4.5 సమాసగత పదసంధులు 93

4.6 నుగాగమ సంధులు 95

4.7 టుగాగమ సంధులు 98

4.8 ఆమ్రేడిత సంధులు 100

4.9 ముర్వక సంధులు 101

4.10 ధ్వన్యనుకరణ సంధులు 102

4.11 అనుకరణ సంధులు 103

4.12 సంస్కృత శబ్ద సంధులు 106

అధ్యాయం – 5

పదాంశ విజ్ఞానం(113-178)

5.0 పరిచయం 114

5.1. తత్సమ పదాల నిర్మాణం 114

5.2 ఆచ్ఛిక పదాల నిర్మాణం 134

5.3 తద్ధిత పదాల నిర్మాణం 150

5.4 కృదంత పదాల నిర్మాణం 162

5.5 ప్రకీర్ణకంలోని విశేషాంశాలు 168

అధ్యాయం – 6

సమాస విజ్ఞానం(179-207)

6.0 పరిచయం 180

6.1 ద్వంద్వ సమాసం 182

6.2 తత్పురుష సమాసం 187

6.3 బహువ్రీహి సమాసం 199

6.4 అవ్యయీభావ సమాసం 203

అధ్యాయం – 7

క్రియా రూప విజ్ఞానం(208-232)

7.0 పరిచయం 209

7.1 సమాపక క్రియలు 210

7.2 అసమాపక క్రియలు 219

7.3 ధాతుజ విశేషణాలు 221

7.4 'ఇంచుక్' ప్రకరణం – ప్రేరణార్థక క్రియలు 222

అధ్యాయం – 8

కారక, వాక్య-విజ్ఞానాలు(233-289)

8.0 పరిచయం 234

8.1 కారక విజ్ఞానం 234

8.2 వాక్య విజ్ఞానం 251

అధ్యాయం – 9

వ్యాస విజ్ఞానం(290-301)

9.0 పరిచయం 291

9.1 సులభవ్యాకరణము – వ్యాస చర్చ 293

10.0 ముగింపు 301

10.1 పరిశోధనలో గమనించిన ప్రధాన అంశాల క్రోఢీకరణ 302

10.2 పరిశోధన ఫలితాలు 303

10.3 ఆధార గ్రంథాలు 315

10.4 అనుబంధం-1 పుస్తకాల్లో ముద్రితమైన పరిశోధన పత్రాల నకళ్ళు 322

10.5 అనుబంధం-2 జాతీయ సదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాల 340

ధ్రువపత్రాల నకళ్ళు

# కృతజ్ఞతలు

తెలుగుశాఖలో ఎమ్.ఏ., పిహెచ్. డి.లు చేయడానికి అవకాశం కల్పించిన హైదరాబాదు విశ్వవిద్యాలయానికీ, తెలుగు శాఖకూ...

చదువు అన్నం పెడుతుందని నమ్మి తమ రెక్కలను కష్టాలకు తాకట్టు పెట్టి నాకు పలక, బలపం కొనిచ్చి, నన్ను బడికి పంపించి, నా అభ్యున్నతిని కోరుకున్న అమ్మా నాన్నలకు...

విద్యని, వసతిని, ఆహారాన్ని ఐదు సంవత్సరాలపాటు ఉచితంగా అందించడానికి మాతృశ్రీ ఓరియంటల్ కళాశాలను స్థాపించి నాలాంటి ఎంతోమంది పేద పిల్లలకు ఆశ్రయాన్ని కల్పించిన జిల్లెళ్ళమూడి అమ్మ శ్రీ అనసూయదేవికి...

నా విద్యాభ్యాసం మొత్తంలో ముఖ్యపాత్ర వహించిన గురువులు నాగేశ్వరరావుగారికి, వాసవిగారికి, వెంకట రామయ్యగారికి, రమాదేవిగారికి, ఫణిశర్మగారికి, సత్యనారాయణ గారికి, రాంభట్ల పార్వతీశ్వర శర్మ గారికి...

నేను పిహెచ్.డి లో చేరాక నా పరిశోధనకు పర్యవేక్షణ బాధ్యతలు వహించి, ఒక క్రమశిక్షణతో కూడిన విద్యని అందించి, బాధ్యతగల విద్యార్థిగా తీర్చిదిద్ది, నా అభిరుచికి అనుగుణంగా *"వావిలికొలను సుబ్బారావుగారి సులభ వ్యాకరణము: సమగ్ర పరిశీలన"* అన్న అంశాన్ని పరిశోధనాంశంగా స్థిరపరిచి, పరిశోధనా పద్ధతులను, వాక్య నిర్మాణ శైలిని, వ్యాసాలను రాయటం నేర్పించి, నా సందేహాలను నివృత్తి చేసి, నా పరిశోధనను సకాలంలో పూర్తిచేయడానికి సహకరించిన మా పర్యవేక్షకులు ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి...

నా పరిశోధనకు రీసర్చ్ అడ్వైసరీ కమిటీ సభ్యులుగా వ్యవహరించి అమూల్యమైన సలహాలు, సూచనలు అందించిన తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య డి. విజయలక్ష్మి గార్లకు...

హైదరాబాదు విశ్వవిద్యాలయంలో ఎమ్.ఏ., పిహెచ్.డి స్థాయిలో పాఠాలు బోధించిన అధ్యాపకులు తెలుగు శాఖకి అధ్యక్షులుగా ఉన్న ఆచార్య పిల్లలమర్రి రాములుగారికి, ఆచార్య గోనా నాయక్ గారికి, ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి గారికి, డా. బాణాల భుజంగారెడ్డి గారికి, విశ్రాంత ఆచార్యులు ఆచార్య శరత్ జ్యోత్స్నారాణిగారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి(కీర్తి శేషులు),

ఆచార్య రేమిల్ల వెంకట రామకృష్ణ శాస్త్రి గారికి. ఆచార్య జి. అరుణకుమారి గారికి, ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి(కీర్తి శేషులు), కొత్తగా వచ్చిన ఆచార్యులు ఆచార్య పి. వారిజా రాణి గారికి, ఆచార్య వంగరి త్రివేణిగారికి, ఆచార్య భూక్య తిరుపతిగారికి, డా. విజయకుమార్ గారికి, డా. బాశెట్టి లత గారికి, డా. విజయ కుమారిగారికి...

తెలుగుశాఖ బోధనేతర సిబ్బందిగా ఉన్న రామకృష్ణ, స్వాతి, దయాకర్, పూర్వం పనిచేసిన బాలాజీ, రాజశేఖర్ లకు...

నా ఈ పిహెచ్.డి కి సరిపడే ఫెలోషిప్ ను మంజూరు చేసిన యు. జి. సి. వారికి...

హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని ఇందిరాగాంధీ స్మారక గ్రంథాలయానికీ, ఏ పుస్తకం కావాలన్న వెతికి పెట్టిన గ్రంథాలయ సిబ్బందికీ....

నా పరిశోధనకు పరోక్షంగా సహకరించిన పరిశోధక మిత్రులు శివ అన్న, మల్లికార్జున్ అన్న, అప్పన్ రాజు, రాకేశ్, తేజ, అనిల్, ప్రదీప్ లకు....

నీవు ఎంచుకున్న పరిశోధనాంశం ఏదో ఒకరోజు నిన్ను మంచి స్థాయిలో నిలబెడుతుందని నిరంతరం ప్రోత్సహించే స్నేహితులు దిలీప్, మహేశ్ లకు....

నేను ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కోరుకునే కుటుంబ సభ్యులందరికీ, ప్రత్యేకంగా తమ్ముడు విజయ్, బావమరిది ఈశ్వర్ లకు....

కష్టాలుంటాయని తెలసినా నా జీవితంలోకి అడుగు పెట్టి నాతో నిలబడి మా కుటుంబాన్ని ముందుకు తీసుకువెళ్తున్న నా భార్య మోహినికి....

చక్కని చిరునవ్వుతో బుజ్జి బుజ్జి అడుగులు వేసుకుంటూ నేను ఎలాంటి పరిస్థితులలో ఉన్న నాకు ఆనందాన్ని కల్గించే నా ఇంటి చంద్రుడు, నా కుమారుడు రేయాన్ష్ కి....

కప్పల సురేశ్

20HTPH04

# సంకేత పద సూచిక

| | | |
|---|---|---|
| ఆచ్ఛిక | = | ఆచ్ఛిక పరిచ్ఛేదము |
| ఆంధ్ర. శ్రీవాసు | = | ఆంధ్ర వాల్మీకి శ్రీవాసుదాస జీవితము |
| ఆంధ్ర. వ్యా. వికాసము: పుట | = | ఆంధ్ర వ్యాకరణ వికాసము : పుట సంఖ్య |
| కారక | = | కారక పరిచ్ఛేదము |
| కృదంత | = | కృదంత పరిచ్ఛేదము |
| క్రియా | = | క్రియా పరిచ్ఛేదము |
| తత్సమ | = | తత్సమ పరిచ్ఛేదము |
| తద్ధిత | = | తద్ధిత పరిచ్ఛేదము |
| తెలుఁగు. వ్యా. చరిత్ర | = | తెలుఁగు వ్యాకరణముల చరిత్ర |
| ప్రౌఢ | = | ప్రౌఢ వ్యాకరణము |
| బాల | = | బాల వ్యాకరణము |
| సులభ | = | సులభ వ్యాకరణము |
| ప్రౌఢ. సంజ్ఞా | = | ప్రౌఢ వ్యాకరణము: సంజ్ఞా పరిచ్ఛేదము |
| బాల. సంజ్ఞా | = | బాలవ్యాకరణము : సంజ్ఞా పరిచ్ఛేదము |
| వాక్య | = | వాక్య పరిచ్ఛేదము |
| వ్యాస | = | వ్యాస పరిచ్ఛేదము |
| సంజ్ఞా | = | సంజ్ఞా పరిచ్ఛేదము |
| సంధి | = | సంధి పరిచ్ఛేదము |
| సమాస | = | సమాస పరిచ్ఛేదము |
| సంగ్రహ. వ్యా. వర్ణ | = | సంగ్రహ వ్యాకరణము : వర్ణపరిచ్ఛేదము |
| సులభ. సంజ్ఞా | = | సులభవ్యాకరణము : సంజ్ఞా పరిచ్ఛేదము |

# ప్రవేశిక

## I. పరిశోధనాంశ వివరణ

*'కడప గడపలలోన కవుల గడపలు మెండు'* అన్న నానుడి ప్రకారం రాయలసీమలోని కడప జిల్లాలో ఎందరో మహాకవులు, పండితులు జన్మించి వారి రచనలతో ఆంధ్రభారతికి సేవచేశారు. ప్రాచీన కవుల మార్గాన్ని వదలకుండా రచనలు చేసినవారు ప్రధానంగా వావిలికొలను సుబ్బారావుగారు కన్పిస్తున్నారు. ఆయన ప్రాచీన ప్రక్రియలలోను, ఆధునిక ప్రక్రియలలోను రచనలు చేశారు. వారు రాసిన గ్రంథాలన్ని కేవలం ఆయన పాండిత్యాన్ని నిరూపించేవి మాత్రమే కావు. శ్రీరాముని కోసం, భక్తుల కోసం, విద్యార్థుల కోసం, ఆంధ్రభాషా సేవ కోసం రచనలు చేసినట్లు ఆయన జీవిత చరిత్రను తెలిపే గ్రంథాలను, ఆయన రచనలను అధ్యయనం చేయడం వల్ల తెలుస్తున్నది.

వావిలికొలను సుబ్బారావుగారు 'సులభ వ్యాకరణము' పేరుతో వ్యాకరణ గ్రంథ రచన చేశారు. సులభ వ్యాకరణంలో ఒకే సూత్రంలో నాలుగు వృత్తులను కలిపి చెప్పకుండా, అందరికి అర్థమయ్యేలా ఏ వృత్తికావృత్తి విడివిడిగా విశ్లేషించి చెప్పారు. బాల, ప్రౌఢ వ్యాకరణాలను అనుసరించి ఈ గ్రంథ రచన చేసినట్లు తెలుస్తుంది. ఎన్నో ప్రత్యేకమైన శీర్షికలతో ఈ సులభ వ్యాకరణాన్ని రచించారు.

వావిలికొలను సుబ్బారావుగారు పరిచ్ఛేద పరికల్పనలోనూ, సూత్ర నిర్మాణంలోనూ, బాల, ప్రౌఢవ్యాకరణాలను అనుసరించారు. కొన్ని సూత్రాలు యథా మాతృకగా స్వీకరించినప్పటికీ బాలవ్యాకరణంలో సాధించని ప్రక్రియల్ని కూడా సాధించారు. కొన్ని సంజ్ఞలను బాల, ప్రౌవ్యాకరణాలకు భిన్నంగా నిర్వచించారు. సులభవ్యాకరణములో ఆయా పరిచ్ఛేదాలలో కొన్నిఅంశాలను విస్తృతంగా వివరించారు. ముఖ్యంగా అందులో వ్యాస పరిచ్ఛేదంలో విస్తృతమైన ప్రణాళికతో వ్యాస లేఖనానికి కావలసిన అభ్యాసం, గ్రంథ పఠనం, పసామాగ్రి, శైలి, శబ్దార్థ వాక్యదోష పరిజ్ఞానం మొదలైన విషయాలు వావిలికొలను సుబ్బారావుగారు చర్చించారు. సులభ వ్యాకరణములో కొన్ని చోట్ల విశేషాంశాలను అధస్సూచికలో ఆంగ్లంలో నిర్వచించారు. వీటన్నిటిని పరిశోధనా దృక్పథం నుంచి పరిశీలించడం జరిగింది.

## II. పరిశోధన ఆవశ్యకత

తెలుగులో వచ్చిన వివరణాత్మక వ్యాకరణాలలో 'సులభవ్యాకరణము' ముఖ్యమైనది. వావిలికొలను సుబ్బారావుగారిని ఆధునికాంధ్ర వ్యాకర్తలలో ప్రామాణికులుగా జి. లలిత, అమరేశం రాజేశ్వరశర్మ వంటి పూర్వ పరిశోధకులు వారి గ్రంథాలలో పేర్కొన్నారు. ఆయన రచించిన ఒకే ఒక్క వ్యాకరణ గ్రంథం 'సులభవ్యాకరణము'. ఇది విద్యార్థులు పరీక్షలలో రాసే తప్పులను దృష్టిలో పెట్టుకొని ఈ వ్యాకరణాన్ని రచించానని వావిలికొలనువారు చెప్పుకున్నారు.

తెలుగుభాషలో వెలువడిన వ్యాకరణ గ్రంథాలలో ప్రతి ఒక్క గ్రంథానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. తెలుగుభాష కోసం కొన్ని వ్యాకరణ గ్రంథాలు సంస్కృతంలో రాశారు. ఆ తర్వాత తెలుగులో రచింపబడ్డాయి. తెలుగులో కావ్యభాషా లక్షణాన్ని తెలిపే గ్రంథాలుగా విశేషమైన ఆదరణ పొందినవి బాల, ప్రౌఢ వ్యాకరణాలు. సామాన్య భాషా లక్షణాన్ని 'బాలవ్యాకరణము' నిర్దేశించగా, అందులో విశేష లక్షణాలను ప్రయోగాలను 'ప్రౌఢ వ్యాకరణము' వివరించింది. వావిలికొలనువారు బాల, ప్రౌఢ వ్యాకరణాల ఆధారంగా విద్యార్థుల కోసం 'సులభవ్యాకరణము' ను మూడు భాగాలుగా రచించారు. విద్యార్థులు పరీక్షలలో రాసే తప్పులను దృష్టిలో పెట్టుకొని ఈ వ్యాకరణాన్ని రచించానని వావిలికొలనువారు చెప్పుకున్నారు. ఈ గ్రంథంలో 'సంజ్ఞా పరిచ్ఛేదం' నుండి 'వ్యాస పరిచ్ఛేదం' వరకు మొత్తం పన్నెండు పరిచ్ఛేదాలు ఉన్నాయి. వీటన్నింటిని ప్రస్తుత నా సిద్ధాంత గ్రంథంలో తొమ్మిది అధ్యాయాలుగా విభజించి పరిశీలించడం జరిగింది.

## III. పరిశోధన పరిధి

తెలుగు వ్యాకరణం బోధించుటకు నేడు ప్రధాన ఆధార గ్రంథాలుగా ఉన్న బాల, ప్రౌఢ వ్యాకరణాలతో పోల్చుతూ *'సులభవ్యాకరణాన్ని'* పరిశీలిస్తాను. బాలవ్యాకరణం 19 వ శతాబ్ది మధ్యలో (1858)లో ప్రథమ ముద్రణ పొందింది. అదే 19వ శతాబ్ది చివరలో (1885)లో ప్రౌఢ వ్యాకరణం ప్రథమ ముద్రణను పొందింది. వీటి తదనంతర కాలానికి సంబంధించిన గ్రంథమే *'సులభవ్యాకరణము'*. ఇది 1905 లో ప్రథమ ముద్రణ పొందింది. *'బాలవ్యాకరణం'* లో చెప్పబడని వ్యాకరణ కార్యాలను చెప్పే ప్రధాన ఉద్దేశ్యంతో *'ప్రౌఢ వ్యాకరణం'* వెలువడింది. అయితే బాలవ్యాకరణ పూరణతో పాటు సవరణ, వివరణ సూత్రాలు కూడా ప్రౌఢ వ్యాకరణంలో ఉన్నాయి. *బాలవ్యాకరణాన్ని* చదవనిదే *ప్రౌఢవ్యాకరణాన్ని* పూర్తిగా అర్థం చేసుకోవడం కుదరదు. ఈ రెండు గ్రంథాలు చదవనిదే *'సులభవ్యాకరణము'* కూడా అర్థం కాదు. బాల, ప్రౌఢ వ్యాకరణాలు పూర్తిగా

ఆకర్షించుకొని, మరింత సమగ్రతను సాధించిన గ్రంథంగా *'సులభవ్యాకరణాన్ని'* చెప్పవచ్చు. ఈ గ్రంథంలో చాలా విషయాలు బాల, ప్రౌఢ వ్యాకరణాలలో చర్చించినవే ఉన్నాయి. కొన్ని నూతన విషయాలను కూడా ఈ గ్రంథంలో ఉన్నవి. అందుకే నా పరిశోధనకు 'సులభ వ్యాకరణము' గ్రంథాన్ని ఎంచుకొన్నాను.

వావిలికొలను సుబ్బారావుగారు 'సులభ వ్యాకరణము'లో ప్రతి పరిచ్ఛేదంలో కొత్త విషయాలను చర్చించారు. కొన్నింటిని బాల, ప్రౌఢ వ్యాకరణాల నుంచి యదాతథంగా స్వీకరించారు. వాటన్నింటిని బాల, ప్రౌఢ వ్యాకరణ గ్రంథాలతో సమన్వయం చేసుకుంటూ సవరణ, పూరణ, వివరణ కోణంలో నా పరిశోధనని పూర్తి చేశాను.

## IV. పూర్వ పరిశోధనలు

పూర్వ పరిశోధనల్లో వ్యాకరణాల మీద పరిశోధనలు చేసిన తెలుగు పరిశోధకులు కొన్ని వ్యాకరణాలను గ్రహించి వాటిపై పరిశోధన చేశారు. వాటిలో ప్రాశస్త్యంగా వావిలికొలను సుబ్బారావుగారి వ్యాకరణ గ్రంథం పై వివరణాత్మకమైన పరిశోధన జరగలేదు. కాబట్టి ఈ వ్యాకరణ గ్రంథాన్ని నా పరిశోధన గ్రంథంగా తీసుకున్నాను.

జి. లలితగారు *'తెలుగు వ్యాకరణముల చరిత్ర'* గ్రంథంలో, అమరేశం రాజేశ్వర శర్మగారు *'ఆంధ్ర వ్యాకరణ వికాసము'* అనే తమ సిద్ధాంత గ్రంథంలో 'సులభవ్యాకరణము' గురించి ఐదు పుటల లోపు సంక్షిప్త పరిచయం చేశారు. కొలకలూరి ఇనాక్ గారు ' తెలుగు వ్యాస పరిణామం' అనే తమ సిద్ధాంత గ్రంథంలో 'సులభవ్యాకరణము' లో చెప్పబడిన వ్యాసానికి సంబంధించిన విషయాలు కొన్ని చర్చించారు.

## V. క్షేత్రపర్యటన, పరిశోధనకు సేకరించిన ప్రతులు

Broad field మరియు Specialized area కి సంబంధించిన పుస్తకాల కోసం కడపలో ఉన్న సి. పి. బ్రౌన్ లైబ్రరీకి వెళ్ళాను. ***రమణీయం, ఆంధ్ర లక్షణసారాసంగ్రహం, ఆంధ్ర శబ్ద చింతామణి*** వంటి అపూర్వ గ్రంథాలను సేకరించుకున్నాను. కవి సంబంధిత రచనల కోసం తెనాలి సమీపంలో ఉన్న 'అంగలకుదురు' వెళ్ళాను. అక్కడ శ్రీ కోదండ సేవా సమాజంవారు ముద్రిస్తున్న వావిలికొలను సుబ్బారావుగారి రచనలన్నింటిని లభించినంత వరకు 40 కి పైగా తెచ్చుకున్నాను. ఈ గ్రంథాలలో 'సులభవ్యాకరణము' కూడా ఉన్నది. ఆన్లైన్ లో "శోధ్ గంగ, ఫ్రీ గురుకుల్, ఆర్కైవ్,

తెలుగు థీసెస్, తెలుగు వెలుగు" వంటి వెబ్సైట్ లలో పూర్వ పరిశోధనలను, కొన్ని వ్యాకరణ గ్రంథాలను సేకరించుకున్నాను.

## VI. పరిశోధన గ్రంథ రచన – ప్రధాన ఆకరాలు

నా పరిశోధనాంశానికి సంబంధించి పూర్వ పరిశోధనలు ప్రత్యేకంగా జరగనప్పటికీ Broad field మరియు Specialized area కి సంబంధించిన పుస్తకాలను సేకరించి అధ్యయనం చేశాను. నా పరిశోధనకి సహకరించిన గ్రంథాలలో కొన్నిటిని ఇక్కడ పేర్కొంటున్నాను.


1. భిక్షపతి, నాగబండి. 2011. *తెలుగు కృదంతాలు- ఒక అధ్యయనం.* హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి సిద్ధాంత గ్రంథం.
2. మోహన్ రెడ్డి, ఆలేటి.2014. *బాలవ్యాకరణము (తెలుగు వ్యాఖ్య).* హైదరాబాదు: ఎమెస్కో ప్రచురణలు. ప్రథమముద్రణ.
3. రామకృష్ణారావు, వంతరాం. 2017. *బాలవ్యాకరణ ఘంటాపథము.* హైదరాబాద్: నవచేతన పబ్లిషింగ్ హౌస్. ప్రథమ ముద్రణ.
4. రామకృష్ణారావు, వంతరాం.2011. *ప్రౌఢవ్యాకరణ ఘంటాపథము.* హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. ద్వితీయ ముద్రణ.
5. లలిత, జి.1996. *తెలుఁగు వ్యాకరణముల చరిత్ర.* మద్రాసు: వెలగపూడి ఫౌండేషన్.
6. మోహన్ రెడ్డి, ఆలేటి.2014. *బాలవ్యాకరణము (తెలుగు వ్యాఖ్య).* హైదరాబాదు: ఎమెస్కో ప్రచురణలు. ప్రథమముద్రణ.
7. లక్ష్మీనారాయణ, గంగిశెట్టి. 2019. *ప్రాచీన ఆధునిక తెలుగు భాషలో కారక ప్రయోగం- పరిశీలన.* హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి సిద్ధాంత గ్రంథం.
8. వనిత, బడుగుల. 2013. *వైకృత చంద్రిక- సవిమర్శక పరిశీలన.* హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి సిద్ధాంత గ్రంథం.
9. శ్యామలాంబ, పెనుముచు. 2011. *లక్షణ గ్రంథాల్లో వ్యాకరణాంశాలు – అనుశీలన.* హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి సిద్ధాంత గ్రంథం.
10. శ్రీనివాస్, ఇ. 2016. *భాషాశాస్త్ర దృష్టితో బాలప్రౌఢవ్యాకరణాల పరిశీలన.* హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి సిద్ధాంత గ్రంథం.

11. శ్రీనివాసాచార్యులు, నల్లందిగళ్. 1984. *పద్యాంధ్ర వ్యాకరణాలు సంస్కృత వ్యాకరణ సంప్రదాయాలు.* హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి సిద్ధాంత గ్రంథం.

12. సుబ్బారావు, వావిలికొలను.1963. *సులభ వ్యాకరణము.* అంగలకుదురు: శ్రీ కోదండరామసేవక ధర్మసమాజము. ప్రథమ ముద్రణ.

## VII. పరిశోధన గ్రంథ రచన– ప్రణాళిక

సులభవ్యాకరణాన్ని పర్యవేక్షకుల సూచనల మేరకు క్రింది అధ్యాయలుగా విభజించవచ్చని తెలుసుకున్నాను.

**మొదటి అధ్యాయం:** కవి జీవితం– రచనా విశేషాలు

**రెండవ అధ్యాయం:** సులభవ్యాకరణ నిర్మాణ క్రమం

**మూడవ అధ్యాయం:** వర్ణ విజ్ఞానం

**నాల్గవ అధ్యాయం:** సంధి విజ్ఞానం

**ఐదవ అధ్యాయం:** పదాంశ విజ్ఞానం

**ఆరవ అధ్యాయం:** సమాస విజ్ఞానం

**ఏడవ అధ్యాయం:** క్రియారూప విజ్ఞానం

**ఎనిమిదవ అధ్యాయం:** కారక, వాక్య–విజ్ఞానాలు

**తొమ్మిదవ అధ్యాయం:** వ్యాస విజ్ఞానం

ఈ పరిశోధన గ్రంథంలో ఉపయుక్త గ్రంథాల వివరాలను కూర్చడంలో APA నిర్మాణ పద్ధతిని అనుసరించాను.

**మొదటి అధ్యాయం:** 'కవి జీవితం– రచనా విశేషాలు' అనే అధ్యాయంలో వావిలికొలను సుబ్బారావుగారికి సంబంధించిన వ్యక్తిగత జీవితం, రచనా విశేషాల గురించి సంక్షిప్తంగా పరిచయం

చేయడం జరిగింది.'జననం, బాల్యం– విద్యాభ్యాసం, వివాహ జీవితం, పుణ్యక్షేత్రాల సందర్శనం, శ్రీరామ సేవ, రచనావ్యాసంగం' వంటి శీర్షికలతో మొదటి అధ్యాయాన్ని పూర్తి చేయడం జరిగింది.

**రెండవ అధ్యాయం:** 'సులభవ్యాకరణ నిర్మాణ క్రమం' అనే అధ్యాయంలో '*సులభవ్యాకరణము*' రచనా ఉద్దేశాన్ని చర్చించి, పరిశోధనకి గ్రహించిన *సులభవ్యాకరణ* గ్రంథం ఆధారంగా 'సంజ్ఞా పరిచ్ఛేదం, సంధి పరిచ్ఛేదం, తత్సమ పరిచ్ఛేదం, ఆచ్ఛిక పరిచ్ఛేదం, కారక పరిచ్ఛేదం, సమాస పరిచ్ఛేదం, తద్ధిత పరిచ్ఛేదం, క్రియా పరిచ్ఛేదం, కృదంత పరిచ్ఛేదం, ప్రకీర్ణక పరిచ్ఛేదం, వాక్య పరిచ్ఛేదం, వ్యాస పరిచ్ఛేదం' వంటి శీర్షికలతో నిర్మాణక్రమాన్ని తెలియజేయడం జరిగింది.

వావిలికొలను సుబ్బారావుగారు ***సులభవ్యాకరణాన్ని*** చక్కని ప్రణాళికతో రచించారు. ప్రతి పరిచ్ఛేదంలో చెప్పాలనుకున్న విషయాలను ఒక క్రమంలో చక్కగా ప్రకరణాలుగా విభజించి చర్చించారు. ఈ గ్రంథాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు పేరుకు తగిన గ్రంథంగా మనకు కనిపిస్తుంది. వావిలికొలనువారు ఈ వ్యాకరణంలో చాలా వరకు సూత్రం క్రిందనే వివరణ ఇచ్చారు. సంస్కృత సంధులను తెలుగు వ్యాకరణ గ్రంథంలో చర్చించటం, వ్యాస పరిచ్ఛేదాన్ని పొందుపరచటం ముఖ్యంగా చెప్పుకోవాల్సిన విశేషాంశాలుగా ఈ గ్రంథంలో కన్పిస్తున్నాయి. ప్రస్తుత ఈ అధ్యాయంలో సులభవ్యాకరణంలోని పరిచ్ఛేదాల వరుస క్రమాన్ని అనుసరించి, వ్యాకర్త ఏ అంశాలను చర్చించారు? వారు వేసుకున్న ప్రణాళిక ఏమిటి? వంటి విషయాలను తెలిపే విధంగా కొన్ని ఉపశీర్షకలతో ప్రాథమిక అంశాలను చర్చించాను.

**మూడవ అధ్యాయం:** 'వర్ణ విజ్ఞానం' అనే అధ్యాయంలో బాల, ప్రౌఢ, సులభ వ్యాకర్తలు నిర్దేశించిన వర్ణాల చర్చ చేశాను. వర్ణాల పేర్లను(సంజ్ఞలను), వాటి ఉత్పత్తి స్థానాలను,'గుణింతాలు' వంటి సూక్ష్మ విషయాలను, అనుస్వారం, అర్ధ బిందువు గురించి, 'యె' అనే అక్షరం సంధి వల్ల కాకుండా పదాల మద్య ఎక్కడెక్కడ వస్తుంది, 'యకారం, వు, వూ వొ వో' లతో పాటుగా 'ఙ–ళ' అనే అక్షరాలు కూడా తెలుగు పదాలలో మొదటగా ఉండవని చెప్పారు. కళలను, ద్రుత ప్రకృతికాలను,

ఆంధ్ర భాషా పదాలైన 'తద్భవ, తత్సమ, దేశ్య, గ్రామ్య' అనే వాటి గురించి బాల, ప్రౌఢ వ్యాకరణాలతో పోల్చుతూ పరిశీలించడం జరిగింది.

**నాల్గవ అధ్యాయం:** 'సంధి విజ్ఞానం' అనే అధ్యాయంలో సులభవ్యాకర్త 'సంధి' లక్షణాన్ని చిన్నయసూరిగారు చెప్పిన నిర్వచనాన్నే స్వీకరించారని తెలుస్తుంది. బాలవ్యాకర్తలాగా ఉత్వసంధి కాకుండా అత్వసంధినే మొదటగా చెప్పారు. సులభవ్యాకర్త అచ్సంధులను, హల్సంధులను చెప్పేటప్పుడు నూతన విషయ ప్రతిపాదనలను చెప్పారు. అవసరమైన చోట బాల, ప్రౌఢవ్యాకర్తలు చెప్పిన సంధి కార్యాలకు సవరణలు, పూరణలు, వివరణలు ఇచ్చారు.

వావిలికొలనువారు మాహేశ్వర సూత్రాలను అనుసరించి ప్రత్యాహారాల ద్వారా సంస్కృత సంధులను సూత్రీకరించారు. గుణాలు, వృద్ధులు వంటి సంజ్ఞలను సూత్ర రూపంలో నిర్వచించారు. సంస్కృత సంధులలైన సవర్ణదీర్ఘసంధి, యణాదేశ సంధి, పరరూప సంధి, అవాంజదేశ సంధి, ప్రకృతిభావ సంధి, శ్చుత్వ సంధి, ష్టుత్వసంధి, జశ్త్వ సంధి, అనునాశిక సంధి, పూర్వ సవర్ణ సంధి, విసర్గ సంధి, స్వాది సంధి మొదలైన సంధులను సూత్రరూపంలో సులభవ్యాకర్త నిర్వచించారు.

ఈ అధ్యాయంలో అత్వసంధి, ఇత్వ సంధి, ఉత్వ సంధి, అన్ని అచ్చులకు సంధి, స్వరలోప సంధులు, కళా సంధులు, ద్రుత సంధులు, సమాసగత సంధులు, నుగాగమ సంధులు, టుగాగమ సంధులు, ఆమ్రేడిత సంధులు, మువర్ణక సంధులు, ధ్వన్యనుకరణ సంధులు, అనుకరణ సంధులు, సంస్కృత శబ్ద సంధులు' మొదలైన సంధులను పరిశీలించడం జరిగింది.

**ఐదవ అధ్యాయం:** 'పదాంశ విజ్ఞానం' అధ్యాయంలో తత్సమ, ఆచ్ఛిక, తద్ధిత, కృదంతాలతోపాటుగా ప్రకీర్ణక పరిచ్ఛేదంలో చెప్పబడిన కొన్ని విషయాలను కూడా చర్చించడం జరిగింది. సులభవ్యాకర్త విభక్తి ప్రత్యయాలను పేర్కొంటూ 'సంబోధనా ప్రథమావిభక్తి'ని చెప్పారు. బాలవ్యాకర్త శబ్దాలను ఎన్నిరకాలుగా ఉంటాయో వాటిని ఏమని పిలుస్తారో వంటి విషయాలు ఒకేచోట వివరించలేదు. సందర్భోచితంగా చెప్పుకుంటూ వెళ్లారు, కాని సులభవ్యాకర్త వాటన్నింటిని ఒకేచోట ఆరు సూత్రాలలో ప్రస్తావించారు. సులభవ్యాకర్త అచ్చతెలుగు శబ్దాలను నిర్వచిస్తూ 'ఏకాది గణాలలో చేరిన ఒక్కడు–వాడు– వీడు– మగడు' మొదలైన శబ్దాలు కాకుండా మిగిలిన అచ్చతెలుగు శబ్దాలన్ని స్త్రీ సమాలుగా గానీ, క్లీబ సమాలుగా గాని అవుతాయని చెప్పారు. బాలవ్యాకర్త సర్వనామాల

క్రింద చెప్పిన విషయాలలో వివిధ అర్థాలలో సర్వనామ రూపాలు ఇలా ఉంటాయని చెప్పారు తప్ప వాటి ప్రక్రియ చెప్పలేదు. సులభవ్యాకర్త వాటి ప్రక్రియ కూడా చెప్పారు.

తద్ధిత ప్రత్యయాలను బాల, ప్రౌఢ వ్యాకర్తలు విధించినవే చర్చించినప్పటికీ కొన్ని సవరణలు, పూరణలు చేసారు. నూతన విషయాలను ప్రతిపాదించారు. 'ఇ' వర్ణం పరమైనపుడు అది 'లేమి' ని తెలిపేదిగా ఉంటుందని, కొన్నిచోట్ల 'గల' అనే అర్థాన్ని కూడా తెలుపుతుందని చెప్పారు. ధాతువుల నుంచి ఏర్పడే నామవాచకాలని కృదంతాలు అంటారని సులభవ్యాకర్త నిర్వచించారు. కృదంత కార్యాలు బాల, ప్రౌఢ వ్యాకరణంలో చెప్పబడ్డవే సులభవ్యాకర్త చెప్పారు. బాలవ్యాకర్త ప్రకీర్ణక పరిచ్ఛేదంలో చెప్పిన విషయాలను సులభవ్యాకర్త ప్రకీర్ణక విభాగంలో పేర్కొన్నప్పటికీ కొన్ని సందర్భోచితంగా 'సంధి, ఆచ్ఛిక' వంటి విభాగాలలో చెప్పబడ్డాయి.

**ఆరవ అధ్యాయం**: 'సమాస విజ్ఞానం' అనే అధ్యాయంలో సులభవ్యాకర్త సమాసం చర్చ చేస్తూ ప్రసిద్ధమైన పదాలు కలిసి ఒక పదంగా ఏర్పడటం సమాసమని చెప్పారు. బాల, ప్రౌఢ వ్యాకరణాల కంటె విస్తృతంగా 'ద్వంద్వ సమాసం, తత్పురుష సమాసం, బహువ్రీహి సమాసం, అవ్యయీభావ సమాసం' మొదలైన వాటిని సులభవ్యాకర్త చర్చించారు. అచ్చ తెలుగు పదాలతో ఏర్పడే సమాసాన్ని ఆచ్ఛిక సమాసమని, ఈ ఆచ్ఛికసమాసాన్ని 'సమాసకం' అని కూడా అంటారని సులభవ్యాకర్త చెప్పారు. మిశ్రసమాసంలో మొదట సంస్కృతశబ్దం ఉండదని చెప్పారు. సమాసాంతంలోని శబ్దం ఏ లింగంలో ఉంటుందో అదే లింగం ఆ సమాసం మొత్తానికి దాని విశేషణానికి కూడా అవుతుందని సులభవ్యాకర్త చెప్పారు. తెలుగులో ఒక్కొక్కసారి సమాసంలోని పూర్వపదం వ్యవహితంగా ఉన్న ఒక ఉత్తర పదంతోగాని, పెక్కు(చాలా) ఉత్తర పదాలతోగాని అన్వయించబడుతుందని సులభవ్యాకర్త చెప్పారు.

సులభవ్యాకర్త 'ద్వంద్వ సమాసం' ఇతరేతర ద్వంద్వము, సమాహార ద్వంద్వము, ఏకశేషమని మూడు రకాలుగా ఉంటుందని, 'తత్పురుష సమాసం' సమానాధికరణము, వ్యధికరణము, నఞ్, ప్రాది, ఉపపదం అని ఐదు భేదాలుగా ఉంటుందని, 'బహువ్రీహి' సమానాధికరణం, వ్యధికరణం అని రెండు రకాలుగా ఉంటుందని, ఈ సమానాధికరణంలో బహువ్రీహి మళ్ళీ ద్వితీయాది భేదాలు చేత ఆరు రకాలుగా ప్రవర్తిల్లుతుందని చెప్పారు. సమాసంలో పూర్వ పదంలోని అర్థమే ప్రధానంగా

ఉంటే దానిని అవ్యయీభావ సమాసం అంటారని సులభవ్యాకర్త చెప్పారు. ఇక్కడ చెప్పబడ్డ సమాసాలన్నింటిని ఈ అధ్యాయంలో పరిశీలించడం జరిగింది.

**ఏడవ అధ్యాయం:** 'క్రియారూప విజ్ఞానం' అనే అధ్యాయంలో సులభవ్యాకర్త క్రియలన్నింటిని తత్సమాలు, ఆచ్ఛికాలు అని రెండు రకాలుగా విభజించారని తెలుస్తుంది. సంస్కృత ధాతువులకు 'ఇంచు' చేర్చగా ఏర్పడేవి తత్సమక్రియలు'. అసమాపక క్రియలు క్రియాకాంక్షా సమాపకాలు, నామాకాంక్షా సమాపకాలు రెండు రకాలుగా ఉంటాయని చెప్పారు. క్రియాఫలం కర్తకు చెందినదైతే అది ఆత్మనేపదమని, ఆత్మనే పదాలకు 'కొను' ధాతువు అనుసరించి వస్తుందని చెప్పారు. క్రియాఫలం కర్తకు కాక ఇతరులకు చెందితే దానిని పరస్మైపదం అంటారని సులభవ్యాకర్త చెప్పారు. ఈ అధ్యాయంలో సమాక క్రియలు లైన 'వర్తమానార్థకం, భూతార్థకం, భవిష్యదర్థకం, తద్ధర్మాదులు, ఆశీశ్శాప సంప్రార్థనా విధులు, వ్యతిరేకార్థకాల్ని, అసమాపక క్రియలైన 'భావర్థకం, క్త్వార్థం, చేదర్థకం, ఆనంతర్యార్థకం, శత్రర్థకాలను,' ధాతుజ విశేషణాలు, ఇంచుక్ ప్రకరణం– ప్రేరణార్థక క్రియలను పరిశీలించడం జరిగింది.

**ఎనిమిదవ అధ్యాయం:** 'కారక, వాక్య–విజ్ఞానాలు'. ఈ అధ్యాయంలో మొదటగా 'కారక విజ్ఞానానికి సంబంధించిన విషయాలను చర్చించడం జరిగింది. బాల, ప్రౌఢ వ్యాకరణాలకు 'పూరణ' అంశాలను సులభవ్యాకర్త చెప్పారు. బాలవ్యాకర్త ప్రాతిపదికర్థంలో, సంబోధనార్థంలో, ఉక్తార్థంలో ప్రథమా విభక్తి ప్రత్యయం వస్తుందని చెప్పగా, సులభవ్యాకర్త 'పరిమాణార్థకంలో' కూడా ప్రథమా విభక్తిని చెప్పారు. కర్మార్థంలో ఉద్దేశార్థక ద్వితీయకు 'గుఱచి' అనేది అనుప్రయుక్తంగా వస్తుందని ప్రౌఢవ్యాకర్త చెప్పగా, సులభవ్యాకర్త 'గూర్చి, గుఱచి, గుఱించి' వంటి మూడు ప్రత్యయాలు వస్తాయని చెప్పారు.

సులభవ్యాకర్త 'ఆసత్తి, యోగ్యత, ఆకాంక్ష' కలిగినవే వాక్యమని, ఇవి చక్కగా ఉండేటట్లుగా పదాలు కూర్చిన విషయం బాగుగా బోధపడుతుందని చెప్పారు. 'ఒకరు మరొకరిని చూసి 'పో' అని చెప్పిన అది వాక్యం అవుతుందని సులభవ్యాకర్త చెప్పారు. ఎందుకంటే 'పో' అనేది అర్థం కలిగిన పదం, ప్రయోగయోగ్యమైనది. అన్వయం కూడా ఉన్నట్లు కన్పిస్తుంది. 'పో' అనేది మధ్యమ పురుష కాబట్టి ఇక్కడ ' నీవు' అనేది అధ్యాహార్యము. 'నీవు పో' అనేది వాక్యం. కాబట్టి 'నీవు' అనే కర్తృపదంతో

అన్వయించబడుతుంది. ఇలాగే తే– రా మొదలైనవి కూడా ఒంటి పద వాక్యాలు అని చెప్పారు. పదం, సంబోధనార్థం, నిత్య ఏకవచనాలు, నిత్య బహువచనాలు, కర్తృర్థక వాక్యాలు, విశేషణార్థక వాక్యాలు, అస్మద్– యుష్మద్ వాక్యాలు, కాలబోధక వాక్యాలు, అధ్యాహార్యం, సమాసం, విభక్తులు మొదలైన అంశాలు ఈ విభాగంలో పరిశీలించడం జరిగింది.

**తొమ్మిదవ అధ్యాయం**: 'వ్యాస విజ్ఞానం' అనే అధ్యాయంలో తెలుగు వ్యాకరణాల్లో 'వ్యాస' చర్చ చేసిన గ్రంథాలు చాలా తక్కువగా ఉన్నాయి. 'వ్యాసపరిచ్ఛేదము' అని ప్రత్యేక శీర్షిక పెట్టి వ్యాస శైలి, వ్యాసుకుని వ్యక్తిత్వ లక్షణాలు, వ్యాసంలో ఉపయోగించాల్సిన భాష మొదలైన వివిధ అంశాలను చర్చించిన మొట్టమొదటి గ్రంథంగా *సులభవ్యాకరణము* కన్పిస్తుంది. ఏదైనా ఒక విషయాన్ని విస్తరించి రాయడం వ్యాసలేఖనమని, ఆ విస్తరించి రాయబద్ధ గ్రంథం వ్యాసమని వావిలికొలను సుబ్బారావుగారు నిర్వచించారు. వ్యాసకుడు ఎలాంటి సమగ్రాతను కలిగి ఉండాలి? వ్యాస శైలి ఎలా ఉండాలి? వాసం ఎలా ఉండాలి వంటి విషయాలను సులభవ్యాకర్త చర్చించారు. బహుగ్రంథ పఠనం, వివేకం, మననం, పదసామగ్రి, సంస్కృత పద జ్ఞానము, విషయ నిర్ధారణము, పరీక్ష సమయ చర్య మొదలైన అంశాలను ఈ అధ్యాయంలో పరిశీలించడం జరిగింది.

## VIII. పరిశోధన లక్ష్యం / ప్రయోజనాలు

తెలుగు భాషా వ్యాకరణ చరిత్రలో బాల ప్రౌఢ వ్యాకరణాలు ప్రామాణిక గ్రంథాలు. వీటిని ఆధారంగా చేసుకొని వావిలికొలను సుబ్బారావుగారు రచించిన 'సులభవ్యాకరణము' పరిశీలించడం జరిగింది. బాల, ప్రౌఢ వ్యాకరణాల లోపాలను సవరించడం, విడిచిపెట్టిన అంశాలను పూరించడం, కొన్ని విషయాలను విస్తృతంగా వివరించడం, నూతన అంశాలను పరిచయం చేయడంలో 'సులభవ్యాకరణము' చూపిన ప్రత్యేకతలను విశ్లేషించడం జరిగింది.

*సులభవ్యాకరణములో* ఆయా పరిచ్ఛేదాలలో చెప్పినటువంటి కొత్తవైన నిర్వచనాలు, సూత్రాలు, విభక్తి ప్రత్యయాలు, సంజ్ఞలు, సంధులు, సమాసాలు, తద్ధిత ప్రత్యయాలు, కృదంత ప్రత్యయాలు, వాక్యం, వ్యాస పరిచ్ఛేదాల విశ్లేషణ మొదలైన అంశాలను పరిశోధనా దృక్పథం నుంచి అధ్యయనం చేయడం జరిగింది. 'సులభవ్యాకరణము' వంటి సంప్రదాయ వ్యాకరణాలు అధ్యయనం

చేయడం వల్ల ప్రాచీన కావ్య భాషాపరిణామ వికాసాన్ని తెలుసుకోవచ్చు. సులభవ్యాకర్త తనగ్రంథలో ఆధునిక ప్రయోగాలను కూడా ఉదాహరణలుగా ఇచ్చారు. *'సులభవ్యాకరణము'* బాల, ప్రౌఢ వ్యాకరణాలకు పరిశిష్ట గ్రంథంగా కూడా కన్పిస్తున్నది.

## IX. భావి పరిశోధకులకు సూచనలు

నేను పరిశోధనాంశంగా ఎంచుకున్న 'సులభవ్యాకరణము' అనే వ్యాకరణ గ్రంథంలోని విషయాలను వీలైనంతవరకు సమగ్రంగా చర్చించడానికి ప్రయత్నించాను. వ్యాకరణ రంగంలో పరిశోధన చేయాలనునే వారి కోసం కొన్ని అంశాలను మాత్రం ఈ క్రింద పేర్కొంటున్నాను.

1. వ్యావహారిక భాషపై వచ్చిన గ్రంథాలన్నింటిపైన సమగ్ర పరిశోధన చేయవచ్చు
2. ఆధునిక వ్యాకరణాలన్నింటిని సేకరించి వాటి వికాసం పైన పరిశోధన చేయవచ్చు

# అధ్యాయం – 1

# కవి జీవితం – రచనా విశేషాలు

## అధ్యాయం – 1

## కవి జీవితం – రచనా విశేషాలు

### 1.0 పరిచయం

తెలుగు సాహిత్య రంగాన్ని సస్యవంతం చేసిన మహానుభావులు ఎందరో ఉన్నారు. వీరిలో ఒక ప్రత్యేక కోణంలో అధ్యయనం చేయదగిన కవి, మహాయోగి శ్రీ వావిలికొలను సుబ్బారావుగారు. వీరు సాహిత్యరంగంలోను, ఆధ్యాత్మికరంగంలోను విశిష్టస్థానాన్ని అలంకరించారు. శ్రీకోదండరామ సేవక సమాజాన్ని స్థాపించి తెలుగునాట భక్తి ఉద్యమాన్ని వాడవాడలకు తీసుకువెళ్లారు. సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషా సాహిత్యాలలో పాండిత్యం సంపాదించి ఎన్నో భక్తి పరమైన, జ్ఞాన పరమైన, ముక్తి పరమైన రచనలను చేసి 'ఆంధ్రవాల్మీకిగా, వాసుదాసస్వామిగా' ఆంధ్రదేశంలో స్థానం సంపాదించారు. 1929వ సంవత్సరంలో *'భక్తిసంజీవని'* మాసపత్రికని నెలకొల్పి అందులో వేదశాస్త్ర పురాణేతిహాసాల్లోని అనేక విషయాలు స్పృశిస్తూ వ్యాసాలు ప్రచురించారు. వీరి సాహిత్య సేవలను గుర్తించి ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు 'కవిసార్వభౌమ' అనే బిరుదు ఇచ్చారు.

వావిలికొలను సుబ్బారావుగారు రచించిన గ్రంథాలన్నింటిని ఇష్ట దైవమైన శ్రీరామచంద్రునికి అంకితం ఇచ్చారు. వావిలికొలను సుబ్బారావుగారు శ్రీరాముడిని ఏ విధంగా సేవిస్తారో తన *'మందరము'* బాలకాండ అవతారికలో ఇలా చెప్పారు.

"రామ కథా సుధాంబుధి నిరంతర మజ్జన మాచరించెదన్
రామ కథామృతంబుఁ దమిఁ ద్రావుచు దారుణ తృష్ణ నార్చెదన్
రామ కథానులాపమున గ్రాలుచునుందు నహర్నిశంబు, నే
రామకథౌషదంబున నిరామయ శాశ్వత సౌఖ్య మందెదన్" (మందరము .47:77)

పై పద్యంలో రామకథ అనే పాల సముద్రంలో నిత్యం స్నానం చేస్తాను. భక్తి అనే విపరీతమైన దాహం తీరడానికి రామకథనే అమృతంగా తాగుతాను. రామకథ అనే ప్రకాశంలో అనుక్షణమూ వెలుగొందుతాను. రామకథ అనే మందుని తీసుకొని దుఃఖాన్ని లేకుండా శాశ్వత సౌఖ్యాన్ని అనుభవిస్తానని వావిలికొలను సుబ్బారావుగారు పేర్కొన్నారు.

## 1.1 జననం

తెలుగు సీమలో బ్రాహ్మణజాతిలో నియోగులలో గోల్కొండ వ్యాపారులనే ఒక శాఖ ఉంది. విశిష్టాద్వైతులైన వీరు దాదాపుగా ఆరువేలకు పైగా ఉండేవారు. గోల్కొండ నవాబుల కాలంలో ఈ నియోగి బ్రాహ్మణులు ముఖ్యమంత్రులుగా, వ్యాపార వర్తకులుగా వ్యవహరించేవారు. అందువల్ల వీరిని గోల్కొండ వ్యాపారులని పిలిచారు. తరువాత కాలంలో ఈ నియోగి బ్రాహ్మణులు జీవనోపాధి కోసం ఆంధ్ర దేశంలో వివిధ ప్రాంతాలకు వలస వచ్చి జీవించేవారు. ఈ విధంగా వలస వచ్చిన వారిలో వావిలికొలను సుబ్బారావుగారి పూర్వీకులు ఉన్నారు. వీరి తొలి నివాసం నల్గొండ జిల్లా దేవరకొండ తాలూకాలోని 'వావిలికొలను'. అందువల్ల వారి ఇంటిపేరు 'వావిలికొలను' అయింది. వీరు బ్రహ్మర్షి భరద్వాజ గోత్రజ సంతతివారు. వావిలికొలను సుబ్బారావుగారి ముత్తాత పేరుతో తిరుమల, కంచి శ్రీరంగ దేవాలయాలలో శాసనాలు ఉన్నాయని ప్రతీతి. దీనిని బట్టి ఆయన వంశీయులు చంగల్పట్టు ప్రాంతంలో కొంతకాలం నివశించారని తెలుస్తున్నది.

వావిలికొలను సుబ్బారావుగారి తాత కృష్ణారావుగారి తరువాత తండ్రి రామచంద్ర రావుగారు పల్నాడు ప్రాంతంలో రెవెన్యూ ఇన్స్పెక్టరుగా కొంతకాలం పని చేశారు. పల్నాటి సీమలో అరబ్బులు, సిక్కులు వచ్చి పల్లెల మీద పడి కొల్లగొడుతుంటే అలాంటి బాధలు పడలేక కలెక్టర్ దివాను సహాయంతో రామచంద్రరావుగారు కడప ప్రాంతానికి బదిలీ చేయించుకున్నారు. రామచంద్ర రావుగారు తన భార్య కనకమ్మతో కలిసి జమ్మలమడుగులో 'కూరంవారు' అనే వైష్ణవుల ఇంటిలో కాపురం ఉన్నారు. ఆ ఇంటిలో శ్రీచంద్రమాన దుందుభినామ సంవత్సర మాఘశుద్ధ చతుర్థి శుక్రవారం (23-01-1863) ఉదయం ఏడున్నర గంటలకి పూర్వాభాద్ర నక్షత్రంలో వావిలికొలను సుబ్బారావుగారు జన్మించారు.

## 1.2 బాల్యం- విద్యాభ్యాసం

రామచంద్రరావుగారు, కనకమ్మ ఇద్దరూ శ్రీరాముని భక్తులు. సుబ్బారావుగారు చిన్నతనం నుండే మాటలు కూడా రానప్పటికీ, తల్లితోపాటుగా భజనలకు వెళ్ళేవారు. సీతారాముల విగ్రహాలని బొమ్మరింటిలో పెట్టుకొని పూజించేవారు. ఆయనకి మల్లెపూలు, పత్తి అంటే భయం. అందువల్ల వీరితల్లి కనకమ్మగారు ఎప్పుడూ పూలు పెట్టుకొనేది కాదు. వావిలికొలను సుబ్బారావుగారికి 20 సంవత్సరాల ప్రాయం వరకు 'పెరుగు' అంటే ఇష్టం ఉండేది కాదు. ఆయన చిన్నప్పుడు మహాకోపిగా

ఉండేవారు. అందుకని వీరి తల్లితండ్రులు సుబ్బారావుగారిని 'దుర్వాసుదని' పిలిచేవారు. ఒకసారి కోపంతో వీరి అన్న శేషగిరిరావు గారిని కంటి మీద కొట్టి  గాయం చేశారు. ఆ సంఘటన తలుచుకొని వావిలికొలను సుబ్బారావుగారు జీవితాంతం బాధపడ్డారని తురగా కామాక్షమ్మగారు తన రచించిన గ్రంథంలో[1] పేర్కొన్నారు.

శ్రీరామచంద్రుని కరుణాకటాక్షాలవల్ల వావిలికొలనువారికి చదువుపట్ల ఆసక్తి ఎక్కువగానే ఉండేది. ఆయన మోచముపేటలో కలువలపల్లి రామారావుగారి ఇంటి బడికి వెళ్ళి చదువుకొనేవారు. ఆ బడికి ముందు ఎవరు వస్తే వారి చేతి మీద పంతులుగారు 'శ్రీ' అని రాసేవారు. రెండవ వాడి చేతి మీద 'చుక్క' ఉంచేవారు. మూడవ వాడి చేతి మీద ఒక 'దెబ్బ' కొట్టేవారు. వావిలికొలను సుబ్బారావుగారు 'శ్రీ' యని రాయించుకోవడానికి మూడు, నాలుగు గంటలకే నిద్రలేచి వెళ్ళి చీకటిలోనే బడిలో కూర్చునేవారు. ఒక్కరోజు కూడా చదువు విషయంలో దెబ్బలు తినలేదు. ఏ రోజు పాఠం  ఆరోజు అప్పచెప్పేవారు.

వావిలికొలను సుబ్బారావుగారు ఐదవ తరగతి చదువుకొనేటప్పుడు ఒకసారి ఆంధ్రపండితులు కమలాపురము రాఘవాచార్యులవారు 'పైరుల' గురించి వ్యాసం రాయమనగా అందరూ రాశారు. సుబ్బారావుగారు రాసింది చూసి, వీడు కవీశ్వరుడు అవుతాడని చెప్పారు. ఆ తరగతిలో ఉన్నప్పుడే గురజాడ శ్రీరామమమూర్తిగారు రాసిన ఒక వచన గ్రంథాన్ని పాఠ్యాంశంగా చదువుకున్నారు.

వావిలికొలను సుబ్బారావుగారు స్వయంకృషితో తెలుగు, ఆంగ్లం, సంస్కృత భాషల్లో పాండిత్యం సంపాదించారు. ఆయనకు 13 సంవత్సరాలున్నప్పుడు క్షయ రోగం వచ్చింది. 1881వ సంవత్సరం ఎఫ్. ఏ. చదువుతుండగా వ్యాధి ప్రభావం ఎక్కువయ్యి ఇబ్బంది పడ్డారు. వీరి చిన్నాన్న లక్ష్మాజీరావుగారు చాలా రకాల చికిత్సలు చేయించారు. అప్పటికీ ఆ రోగం తగ్గకపోవడంతో చదువు వద్దని లక్ష్మాజీరావుగారు మాన్పించారు. సుబ్బారావుగారికి ఆరోగ్యం కుదుటపడ్డాక మళ్ళీ చదవడం మొదలు పెట్టి చాలా ప్రవేశ పరీక్షలు రాసారు.

[1] ఆంధ్ర. శ్రీవాసు: పుట.14

వావిలికొలను సుబ్బారావుగారికి భాష పట్ల ఇష్టం ఎక్కువ. ఒక అరఅణా దొరికినా ఏదో ఒక పుస్తకాన్ని కొనుక్కొని చదువుకొనేవారు. చదువు మానమని వైద్యులు ఎంత చెప్పినా చదవడం మానేవారు కాదు. క్షయరోగం వల్ల బాధ ఎక్కువైనా దీపం పక్కన పెట్టుకొని దాదాపుగా రాత్రి సమయంలో 10 గంటల వరకు పడుకొని చదివేవారు. ఆయాసం కారణంగా పెద్దగా చదివేవారు కాదు. వీరి చిన్నాన్న లక్ష్మాజీరావుగారు కచ్చేరికి పోయిన సమయంలో, వేరే ఊరికి వెళ్ళినప్పుడు ఆయన బీరువాలోని పుస్తకాలైన *'భారత, భాగవత, రామాయణాలను'*, కొన్ని సాహిత్య గ్రంథాలను *'అమరకోశాన్ని'* కూడా చదివారు.

వావిలికొలను సుబ్బారావుగారికి చదరంగం అంటే చాలా ఇష్టం. ఆయన చిన్నాన్న లక్ష్మాజీరావుగారితో ఆడేటప్పుడు సుబ్బారావుగారు చాలాసార్లు ఓడిపోయారు. ఆ తరువాత ఆటలో కొత్త మెళుకువలు నేర్చుకొని ప్రయోగించేవారు. మొదటిలో నాలుగు నిమిషాలలో ముగిసే ఆట, క్రమక్రమంగా గంటలు, పూటలు పట్టేది. ఈ విధంగా ఆడే వేళ ఆడుతూ, చదివే వేళ చదువుతూ తన విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. సుబ్బారావుగారికి 'జ్యోతిష్యము' నేర్పించాలని లక్ష్మాజీరావుగారి కోరిక. కానీ దానిపట్ల ఆసక్తి లేక సుబ్బారావుగారు కొన్ని శ్లోకాలని మాత్రమే నేర్చుకొని ఆ విద్యను వదిలేశారు.

వావిలికొలను సుబ్బారావుగారు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని యోగ విద్యాభ్యాసం కూడా చేశారు. ఆయన ఒకసారి ఎండాకాలం సెలవుల్లో నెల్లూరు వెళ్ళినప్పుడు, బావమరిది కంచనపల్లి శేషగిరిరావుగారు *'Latest light culture'* అనే సమాజంవారు ముద్రించిన ఒక పుస్తకాన్ని ఇచ్చి చదువమన్నారు. అందులో ప్రాణాయామానికి సంబంధించిన సాధనాలు ఉన్నాయి. అవి ఆరోగ్యానికి మంచివని వాటి వల్ల శ్వాసకోశ సంబంధ రోగాలు పోతాయని గ్రహించి, అదే పుస్తకాన్ని కొత్తది తెప్పించుకొని యోగాభ్యాసం మొదలు పెట్టారు. ఆయన *'కల్పక'* అనే మాసపత్రికలో వచ్చే యోగి 'రామచరకుడు' రాసిన గ్రంథాలను చదివి యోగాభ్యాసంలో ఎక్కువ ప్రవేశం సాధించారు. అంతేకాకుండా యోగవిద్యకు సంబంధించిన సంస్కృత, ఆంధ్ర గ్రంథాలను కూడా అధ్యయనం చేశారు. యోగవిద్యలో ఆహార నియమావళిని అనుసరించే క్రమంలో కొన్ని ఆటంకాలు ఎదురైనప్పటికీ, ఆ నియమాలను తప్పనిసరిగా సుబ్బారావుగారు పాటించేవారు.

## 1.3 ఉద్యోగ వివరాలు

వావిలికొలను సుబ్బారావుగారు మొట్టమొదటగా చిన్నాన్న లక్ష్మీజీరావుగారి సూచనల మేరకు ప్రొద్దుటూరు తాలూకా కచ్చేరిలో ఒక గుమస్తాగా చేరారు. ఆయన ఎంత పెద్ద అంకెలనైన గణించే సామర్థ్యం కలవారు. ఒకసారి వీరి పై అధికారి గ్రామస్తులకు ఒక 'తాకీదు' రాసుకొని రమ్మన్నారు. వావిలికొలనువారు వ్యాకరణ దోషాలు, గ్రామ్యపదాలు లేకుండా అర్థానుస్వారం, శకటరేఫలతో ఒకటి రాసుకొని పోయి చూపించగా, పై అధికారి ఆ తాకీదును చింపి సరిగ్గా రాసుకొని రమ్మన్నారు. సుబ్బారావుగారికి అంతకన్నా బాగా ఎలా రాయాలో తెలియక హెడ్ గుమస్తాగారిని అడిగారు. ఆయన గట్టిగా నవ్వి, నువ్వు సరిగ్గా రాయటమే తప్పు, కాబట్టి నువ్వు వీధులలో ఎలా మాట్లాడుతావో అలా రాసుకొని రమ్మన్నారు. ఆ సమయంలో వావిలికొలను సుబ్బారావుగారు నేను చదివిన చదువు బూడిదలో పొయ్యాలా? అని బాధపడ్డారట!.

వావిలికొలను సుబ్బారావుగారు ఎంతటి పనినైనా ఓర్పుతో పూర్తి చేస్తుండేవారు. వీరి బుద్ధిబలం, చాతుర్యం, సామర్థ్యం చూసి తోటి గుమస్తాలు అందరూ అసూయ పడేవారు. అప్పుడప్పుడు పై అధికారి రాకపోతే వారికి సంబంధించిన బాధ్యత కూడా సుబ్బారావుగారు తీసుకొని పూర్తిచేసి అందరి మెప్పు పొందేవారు. అప్పటి ప్రభుత్వంవారు 'ప్రాసెస్ గుమస్తా' అనే పనిని ఏర్పరిచి అది సుబ్బారావుగారికి ఇచ్చి కొద్ది నెలలలోనే ఆ ఉద్యోగాన్ని తీసివేసారు. ఆ తరువాత సుబ్బారావుగారికి కనీసం పూర్వమున్న ఉద్యోగం కూడా లేక కొంతకాలం ఖాళీగా ఉండాల్సి వచ్చింది.

కడప తాలూకా కచ్చేరిలో '15 రూపాయల గుమస్తా పని', '10 రూపాయల గుమస్తా పని' ఖాళీ ఉన్నదని సుబ్బారావుగారికి తెలిసింది. సుబ్బారావుగారు '15 రూపాయల గుమస్తా పని' కి ఉత్తరం పంపగా, ప్రధాన సహాయ మండలాధిపతి 'రామ్సే దగ్లస్ బ్రాడ్ పూటుగారు' ఆయనకి '10 రూపాయల ఉద్యోగమే' ఇచ్చారు. ఆ తరువాత సుబ్బారావుగారు నేను ఇంత చదువు చదివి కూడా '15 రూపాయల ఉద్యోగం' పొందలేకపోయాను అని బాధపడ్డారు. సుబ్బారావుగారు ఉద్యోగంలో చేరాక కష్టపడి క్రమంగా 'రెవెన్యూ ఇన్స్పెక్టర్'గా ప్రమోషన్ పొంది రాజంపేట, పుల్లంపేట, టంగుటూరు వంటి ప్రాంతాలలో పనిచేశారు. ఆయన రెవెన్యూ ఇన్స్పెక్టరుగా పనిచేస్తున్న సమయంలో నేటి కాలంలో చూస్తున్న కొందరి అధికారుల్లాగా లంచం తీసుకొనే వ్యక్తికాదు. న్యాయ

దృష్టితో తనకు దైవం ఇచ్చిన దానితో సంతోషంగా జీవించారు. 1898 సంవత్సరంలో 'క్షయ వ్యాధి' బాధ వల్ల ఈ ఉద్యోగానికి కూడా సుబ్బారావుగారు రాజీనామా చేశారు.

వావిలికొలను సుబ్బారావుగారు ఆరోగ్యం కుదుటపడ్డాక శ్రీ సమర్థిరంగయ్యగారి ప్రోత్సాహంతో 'తిరువల్లిక్కేణి'లోని హిందూ ఉన్నత పాఠశాలలో ఆంధ్ర ఉపాధ్యాయులుగా ప్రవేశించి 10-02-1901 తేదీ నుండి పనిచేశారు. కొన్ని రోజులకు మళ్ళీ అనారోగ్యం కారణంగా ఆ ఉద్యోగాన్ని కూడా వదిలేశారు. కొన్ని రోజులు తరువాత మద్రాసు రాజధాని కళాశాలలో ఆంధ్ర అధ్యాపకులుగా పనిచేయడానికి 'శ్రీ పరవస్తు చిన్నయసూరిగారి' తర్వాత వారి స్థానాన్ని నిర్వహించగల సమర్థులని సుబ్బారావుగారిని ప్రభుత్వంవారు నియమించారు. ఆయన దాదాపుగా 16 సంవత్సరాలు ఆ కళాశాలలో పనిచేశారు.

## 1.4 వివాహ జీవితం

వావిలికొలను సుబ్బారావుగారు తాలూకా కచ్చేరీలో పనిచేస్తున్నప్పుడు పెళ్లి సంబంధం గురించి వీరి చిన్నాన్న లక్ష్మాజీరావుగారు ఒక ఉత్తరాన్ని పంపారు. అందులో వివాహానికి సంబంధించిన విషయాలను చర్చిస్తూ పెళ్ళికూతురికి కొంచం కాలు వంకర, నీ అభిప్రాయమేమిటి? అని అడిగారు. సుబ్బారావుగారు ఆ ప్రశ్నకు సమాధానంగా "మీకు తెలియని బాగోగులు నాకేమి తెలియును నా శ్రేయస్సును కోరిన మీ ఇష్టమునఁగన్యథా నడచుట నా పని కాదని"[2] సమాధాన మిచ్చారు.

నెల్లూరు వాస్తవ్యులైన శ్రీ కంచనపల్లి వెంకట సుబ్బారావుగారి పుత్రిక రంగనాయకమ్మతో వావిలికొలను సుబ్బారావుగారికి 1885 సంవత్సరంలో వివాహం చేశారు. శ్రీమతి రంగనాయకమ్మగారు కాపురానికి వచ్చినప్పటి నుండి గృహస్థ ధర్మాన్ని పాటిస్తూ, భర్త అడుగుజాడల్లో నడిచిన గొప్ప సాధ్వీమణి. ఆమె తమ మరిది పిల్లల్ని కూడా తన పిల్లలుగా చూసుకున్న పుణ్యమూర్తి. రంగనాయకమ్మగారు క్షయ వ్యాధితో మంచాన పడినప్పుడు సుబ్బారావుగారు ఎన్నో రకాల సేవలు చేశారు. అయితే ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించటంవల్ల 1910లో మరణించారు. రంగనాయకమ్మగారు బ్రతికున్న కాలంలో కోరిన కోరిక ప్రకారం వావిలికొలను సుబ్బారావుగారు

---

[2] ఆంధ్ర. శ్రీవాసు: పుట.39

తన తమ్ముడు కుమార్తె అయిన రుక్మిణమ్మని 1912వ సంవత్సరంలో దత్తత తీసుకొన్నారు. ఆమెకు యుక్తవయస్సు వచ్చాక సుబ్బారావుగారు తన సోదరి రెండవ కుమారుడైన రంగారావుకి ఇచ్చి వివాహం చేసి తన భార్య చివరి కోరికను నెరవేర్చారు.

## 1.5 పుణ్యక్షేత్రాల సందర్శనం

వావిలికొలను సుబ్బారావుగారు ఒకసారి పుణ్యక్షేత్రాలను దర్శించాలని అనుకున్నారు. ఆయన 1914వ సంవత్సరంలో మొట్టమొదటగా బదరీ యాత్రకి పండ్లనే ఆహారంగా తీసుకొని ఒంటరిగా వెళ్లారు. మార్గం మధ్యలో వ్యాధి వల్ల అస్వస్థులై ఉండగా, ఇద్దరు ఋషులు అక్కడికి వచ్చారు. ఆయన పాదాలు నిమిరి, పాలు తాగమని ఇచ్చారట. సుబ్బారావుగారు ఆ పాలు తాగి స్వస్థులయ్యారట. ఆ ఋషులు బదరీ నారాయణ ఆశ్రమానికి దారి చూపి అదృశ్యమయ్యారట. వారు సాక్షాత్తు రామలక్ష్మణులే అని సుబ్బారావుగారి విశ్వాసం. ఆయన పుణ్యక్షేత్రాలను దర్శించి, ఆయా ప్రాంతాలలో శయనించేటప్పుడు చేతినే దిండుగా, నేలనే పాన్పుగా చేసుకొని పవళించారు. అయోధ్య, మధుర, మాయా, కాశీ, గయ, ప్రయాగ, అవంతి, ద్వారక మొదలైన క్షేత్రాలను దర్శించి, అక్కడి పుణ్యనదులలో స్నానమాచరించారు[3].

వావిలికొలను సుబ్బారావుగారికి *'మందరము'* లోని కిష్కింధకాండ రాసే సమయంలో 'పంచవటి' వంటి ప్రదేశాలను వర్ణించాల్సిన అవసరం ఏర్పడింది. అందువల్ల ఆయనే స్వయంగా భద్రాచల యాత్ర చేసి, గోదావరి తీరాన ఉన్న ఆ భద్రగిరి క్షేత్రాన్ని, అక్కడ కొలువైయున్న శ్రీసీతారాములను దర్శించారు. సుబ్బారావుగారు దాదాపుగా 20 రోజులపాటు శ్రీవేలూరి సుబ్రహ్మణ్యంగారు, కోవూరు విశ్వనాథంగారి సహాయంతో ఆ క్షేత్రంలోనే ఉంటూ పర్ణశాల, పంచవటి వంటి ప్రదేశాలలో ఉన్న ఎన్నో అద్భుత దృశ్యాలను చూశారు. తిరుగు ప్రయాణంలో కృష్ణా, గుంటూరు జిల్లాలలోని కొన్ని ప్రదేశాలలో కూడా పర్యటించారు.

---

[3] ఆంధ్ర. శ్రీవాసు: పుట. 42

## 1.6 శ్రీరామ సేవ

వావిలికొలను సుబ్బారావుగారు తన 22వ సంవత్సరంలో చిన్నాన్న లక్ష్మాజీరావుగారి దగ్గర శ్రీమద్రామాయణం ఉపదేశం పొందారు. ఆనాటి నుండి తన జీవిత పర్యంతం 'రామ' నామమే జపిస్తూ రామపాద సేవ చేశారు. కంపసముద్రం నివాసులైన శ్రీమాన్ చెట్లూరి నరసింహాచార్యులవారు తనంతట తానే వీరి దగ్గరకు వచ్చి 'శ్రీరామ షడక్షర' మంత్రాన్ని ఉపదేశించారు. వావిలికొలనువారు శ్రీరామ తారక మంత్రాన్ని జపిస్తూ అత్యంత నిష్ఠతో రామకోటి రాస్తూ ధర్మమత నీతి బోధకాలైన అనేక కృతులు రచించి శ్రీరామచంద్రునికి అంకితం ఇచ్చారు.

వావిలికొలను సుబ్బారావుగారు 1910వ సంవత్సరంలో భార్య వియోగాన్ని తట్టుకోలేక విరక్తితో యోగసాధన కోసం ఘటికాచలం వెళ్లారు. కానీ శ్రీకోదండ రాముని స్వప్నాదేశాన్ని అనుసరించి ఒంటిమిట్టకు వెళ్ళి తమకు ఉన్న ఆస్తులన్ని శ్రీరాముని కైంకర్యానికి వినియోగించారు. స్వామి కైంకర్యానికి అవి మాత్రమే సరిపోవని తెలిసి, 'టెంకాయ చిప్ప'ను పాత్రగా చేసుకొని రామభజన చేసుకుంటూ శ్రీరామ భిక్ష కోసం అనేక పల్లెలు, పట్టణాలు తిరిగి ధనాన్ని సంపాదించారు. ఒక్క కాసైన తన స్వలాభం కోసం ఖర్చు చేయకుండా శ్రీరాముని సేవ కోసం ఉపయోగించారు.

వావిలికొలను సుబ్బారావుగారు ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ దేవాలయాన్ని పునరుద్ధరించి నిత్యం పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఒంటిమిట్టకు వచ్చే భక్తుల కోసం 'శ్రీ కోదండరామ సేవక సమాజాన్ని' 1925లో ప్రారంభించారు. అనారోగ్యంతో బాధపడే ప్రజల కోసం 'ధర్మ వైద్యశాల'ని కూడా స్థాపించారు. శ్రీకోదండ రామునికి నిత్య ఉత్సవాలు ఏర్పాటు చేశారు. సుబ్బారావుగారి సోదరి అయిన వంగూరి సీతమ్మగారు భక్తులు నడిరాత్రి వచ్చినప్పటికీ భోజనం వండిపెడుతూ సుబ్బారావుగారికి తోడుగా ఉండేవారు.

వావిలికొలను సుబ్బారావుగారు భక్తిమత ప్రచారానికై శ్రీ కోదండ రామ సేవక సమాజ సభ్యులతో కలిసి రైలులో మొట్టమొదటగా అనంతపురం వెళ్లారు. అక్కడ కొందరు భక్తుల బృందం సుబ్బారావుగారిని శ్రీరామ సప్తాహానికి అహోబిలం రావాలని ఆహ్వానించారు. ఆ సప్తాహంలో స్త్రీలకు దాంపత్య ధర్మాల గురించి, సాధువులకు వారి విధుల గురించి చెప్పారు. అంతేకాకుండ వేషధారులైన శుష్క వేదాంతుల మాయలలో పడకుండా ఉండడానికి ప్రజలకు ఎన్నో విషయాలను ప్రబోధించారు.

ఈ విధంగా సుబ్బారావుగారు ఆంధ్రదేశంలో కళ్యాణదుర్గం, ధర్మవరం, హిందూపురం, కడప, జమ్మలమడుగు, మార్కాపురం, గుంటూరు, అంగలకుదురు, కంకిపాడు, నడిగడ్డపాలెం, జమ్ములపాలెం, సత్తెనపల్లి, నరసరావుపేట వంటి ప్రాంతాలలో కూడా శ్రీరామునికి సంబంధించిన చాలా ఉపదేశాలను అందించారు. కొన్నిచోట్ల భక్తుల కోసం వాల్మీకి ఆశ్రమాలను కూడా ఏర్పాటు చేసి వారికి వసతి సౌకర్యాలను కల్పించారు. నేటి కాలంలో దేవతలుగా, యోగులుగా పూజించబడే కొందరు గొప్ప వ్యక్తులు ఆయనను ఆ కాలంలో సందర్శించారు. 'జిల్లెళ్ళమూడి అమ్మ'గా ప్రసిద్ధి చెందిన 'శ్రీఅనసూయదేవిగారు' తన తొమ్మిదవ ఏట వావిలికొలనువారిని దర్శించారు. శేషశయనదాసు, చక్కిరాల అన్నపూర్ణమ్మ, తురగా కామాక్షమ్మ, బుద్ధాం శ్రీరామ శరణ్ వంటివారు భక్తులుగా, శిష్యులుగా వావిలికొలనువారికి శ్రీరాముని సేవలో సహకరించారు.

ఈ విధంగా జీవితమంతా రామ సేవాతత్పరులై జీవించి 1936వ సంవత్సరంలో ఆగష్టు ఒకటవ తేదీన(శ్రావణ శుద్ధ చతుర్దశి) శ్రీరామునిలో ఐక్యం అయ్యారు.

## 1.7 రచనా వ్యాసంగం

వావిలికొలను సుబ్బారావుగారు తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలలో రచనలు చేశారు. పోతనగారి వంటి సహజ పాండిత్య కవితా సౌందర్యం ఆయన రచనలలో కన్పిస్తుంది. వీరు తమ సాహిత్యాన్ని పండితులను, పామరులను, బాలురను, స్త్రీలను, వృద్ధులను రంజింపచేసే విధంగా రాశారు. ఆయన కవితాశక్తికి తార్కాణంగా ప్రబంధ, నాటక, శతకాలు కనిపిస్తున్నాయి. *'మందరము'* రచనతో తెలుగు సాహిత్య లోకంలో విశిష్ట స్థానం లభించింది. వీరి రచనల్లో ప్రధానంగా నైతిక విషయాలను, శాస్త్ర విషయాలను, ఆధ్యాత్మిక విషయాలను, భాషా సంబంధ విషయాలను చర్చించారు. సాహిత్యరంగంలో ఆనాటి పెద్దలైన పూండ్ల రామకృష్ణయ్యగారు, వేదం వేంకటరాయ శాస్త్రిగారు, తిరుపతి వేంకటకవులు, కందుకూరి వీరేశలింగంగారు, ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు వంటి గొప్ప వ్యక్తులు సుబ్బారావుగారికి మిత్రులుగా ఉండేవారు.

### 1.7.1 నైతిక రచనలు

వావిలికొలను సుబ్బారావుగారు బాలలను ఉద్దేశించి ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి నుండి పఠించడానికి వీలుగా ఆర్య నీతి కథలను ఎనిమిది భాగాలుగా *'ఆర్య కథానిధులు'* అనే పేరుతో

రచించారు. ఇందులోని కథలు భారత, భాగవత, రామాయణాల నుండి గ్రహించటమే గాక కొన్ని కల్పిత కథలు కూడా ఉన్నాయి. ఒక్కొక్క విభాగంలో 30కి పైగా కథలు ఉన్నాయి. ప్రతి కథలో ముందు నీతి వాక్యం, తరువాత కథా వివరణ ఉంది. హరిశ్చంద్రుని కథలో ఆడినమాట తప్పరాదని, శ్రీరాముని కథలో తల్లితండ్రుల మాట మీరరాదని, త్రిశంకుని కథలో గురుభక్తి గురించి ఇలా నైతిక విలువలను ప్రతిబింబించే కథలను మాత్రమే '*ఆర్యకథానిధులలో*' సుబ్బారావుగారు పొందుపరిచారు. బాల్యంలో ఇలాంటి నీతి కథలను చదవడం వల్ల, 'నీతి, ధర్మం' వంటి విషయాలు పిల్లల మనసుల్లో నాటుకుపోతాయి. మంచి చెడ్డలను వివేచించే సందర్భంలో వారి అంతరాత్మ ధర్మం వైపునకు ఎక్కువుగా మొగ్గు చూపడానికి అవకాశం ఉంటుంది.

## 1.7.2 శాస్త్రీయ రచనలు

వావిలికొలను సుబ్బారావుగారు ఆంధ్ర ప్రజల హితాన్ని ఆశించి బాల్యం నుండి జీవితం ఉత్తమ పథంలో నడవడానికి వీలుగా *'బాలక హితచర్య, కుమార హితచర్య, పతిహితచర్య, కుమారీ హితచర్య, సతీహితచర్య, గర్భిణీ హితచర్య, వైధవ్య ధర్మచర్య, ముముక్షు హితచర్య'* మొదలైన హితచర్య మాలికా గ్రంథాలను రచించారు. వీటిలో కొన్ని గ్రంథాలను ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలో పాఠ్యాంశాలుగా నిర్దేశించబడ్డాయి. వావిలికొలను సుబ్బారావుగారికి శాస్త్రీయ ఆచారాలను, శాస్త్రీయ నియమ పద్ధతులను, వైదిక సంస్కారాలను అనుసరించటంలో విశ్వాసం అధికంగా ఉండేది.

### 1.7.2.1 *బాలక హితచర్య*

బాలురకు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించడానికి చేసిన రచన ఇది. బాలుర ఆరోగ్యానికి సంబంధించి కొన్ని పద్ధతులను ఈ గ్రంథంలో వావిలికొలను సుబ్బారావుగారు చర్చించారు. శంకరుడు, రాముడు అనే బాలకుల సంభాషణతో ఈ గ్రంథం మొదలవుతుంది. ఇందులో పంచేంద్రియాలను సక్రమంగా ఉపయోగించడం, ఎటువంటి ఆహారాన్ని తీసుకోవాలి, జీర్ణం అయ్యే విధానం, నవరంధ్ర ప్రయోజనం, దేహ నిర్మాణం, మనస్సు వంటి విషయాల గురించి వివరించారు.

### 1.7.2.2 *కుమార హితచర్య*

కుమారులకి యుక్త వయస్సు వచ్చాక చేయాల్సిన పనుల గురించి, చేయకూడని పనుల గురించి చర్చిస్తూ చేసిన రచన ఇది. వావిలికొలను సుబ్బారావుగారు ఈ గ్రంథాన్ని రంగన్నగారు అడిగిన ప్రశ్నలకు జవాబుగా రాశారు. ఈ గ్రంథంలో కోరికలు అదుపులో ఉంచుకోవడం, ఆత్మరక్షణ ఇచ్ఛ, సంతాన ఇచ్ఛ, శాశ్వతానందం కోసం దేహరక్షణ యొక్క ఆవశ్యకత, చదివే కాలం, చదివే విధం, అభ్యాసం, వినయం, మర్యాద, బలం, ప్రాణం, బ్రహ్మచర్యం, సుఖం వంటి విషయాల గురించి వివరించారు.

### 1.7.2.3 *కుమారీ హితచర్య*

అత్తగారింటిలో కోడలు నడుచుకోవాల్సిన నియమాల గురించి చర్చిస్తూ చేసిన రచన ఇది. వావిలికొలను సుబ్బారావుగారు మద్రాసు నుండి 28-11-1915 సంవత్సరంలో రాసిన లేఖయే ఈ *'కుమారీ హితచర్య'* గ్రంథం. అత్తగారింటిలో కోడలు ఎలా ఉండాలో సూచించారు. ప్రాతఃకాలంలో నిద్రలేవటం, గృహకృత్యాలు, వంట, స్నానం, వడ్డన, దుష్ట స్త్రీల సాంగత్యం, కీడులు, విరామ కాలంలో విజ్ఞానక గ్రంథాలను చదవడం, ఆటలాడటం, ఉన్నదాంతో సంతృప్తి చెందడం, దొంగ గురువులను నమ్మకుండా ఉండడం, మానహాని కలుగు పనులు చేయకుండా ఉండడం, భోజనం చేసేటప్పుడు గమనించదగిన జాగ్రత్తలు, ఓర్పు కలిగి గృహ కృత్యాలను నిర్వహించటం వంటి విషయాలు ఈ గ్రంథంలో ఉన్నాయి.

### 1.7.2.4 *పతి హితచర్య*

గృహస్థ ధర్మాలను బోధించటానికి చేసిన రచన ఇది. వావిలికొలను సుబ్బారావుగారు *'కుమారహితచర్య'* తరువాత రంగన్నగారికి గృహస్థ ధర్మాలను బోధించటానికి *'పతిహిత చర్య'* గ్రంథాన్ని రాశారు. ఇందులో వివాహ ప్రయోజనం, స్త్రీ, పురుష స్వభావ తారతమ్యం, భార్యాభర్తల సంబంధం, భార్య విషయంలో భర్త కర్తవ్యాలు, సంభోగ విషయాలు, వంశ పరంపరాగతం, గర్భధారణ చిహ్నాలు మొదలైన విషయాలను చర్చించారు.

### 1.7.2.5 *సతీ హితచర్య*

పతివ్రతలుగా పేరు సంపాదించడానికి స్త్రీలకు ఉండాల్సిన లక్షణాలను, అనుసరించాల్సిన నియమాలను బోధించడానికి చేసిన రచన ఇది. వావిలికొలను సుబ్బారావుగారు ఈ గ్రంథాన్ని రుక్మిణమ్మ, మహాలక్ష్మమ్మకి వివరించెను. ఆరోగ్య విషయం, యౌవ్వనంలో శారీరక మార్పులు, గర్భస్రావం, ప్రసవవేదన, ప్రసవ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈ గ్రంథంలో ఉన్నాయి.

### 1.7.2.6 *వైధవ్య ధర్మ చర్య*

భర్తలేని స్త్రీ సమాజంలో ఎలాంటి మార్గాలను అనుసరించాలో సూచించడానికి చేసిన రచన ఇది. వావిలికొలను సుబ్బారావుగారికి ఒకసారి కామేశ్వరమ్మ అనే ఆవిడ ఒక లేఖ రాశారు. అందులో భర్తలేని ఒక స్త్రీ సమాజంలో ఎలా బ్రతకాలో మార్గాలను సూచించమని అడిగారు. ఆయన ఆ ప్రశ్నకు సమాధానంగా *'వైధవ్య ధర్మ చర్య'* అనే గ్రంథాన్ని 1925లో రచించారు. ఈ గ్రంథంలో పూజ్య-అపూజ్యముల చర్చ, సహగమనం, పునర్వివాహం, ఉద్యోగంలో చేరడం, మితభాషణం మొదలైన విషయాలను బోధించారు.

### 1.7.2.7 *ముముక్షు హితచర్య*

మోక్షం పొందాలని ప్రయత్నించే వారి కోసం చేసిన రచన ఇది. శ్రీ ఒంటిమిట్ట కోదండరామ సేవా సమాజంలో సభ్యురాలుగా ఉన్న వెంకట సుబ్బమ్మగారి వల్ల *'ముముక్షు హిత చర్య'* అనే గ్రంథం వెలవడింది. ఆమె నిత్య జిజ్ఞాసి అవ్వటంతో నిత్యం ఎన్నో సందేహాలతో సుబ్బారావుగారిని ప్రశ్నలు అడుగుతూ ఉండేది. ఆయన జవాబులు ఇచ్చేవారు. సుబ్బారావుగారు సందేహాలను ధైర్యంగా అడగలేని వాళ్ళను దృష్టిలో పెట్టుకొని ఈ గ్రంథాన్ని రచించారు. మోక్షం పొందాలని ప్రయత్నించువాడు 'ముముక్షువు'. అలాంటి ముముక్షువు కార్య సాధనకు మేలు కలిగించే చర్యను బోధించే గ్రంథమవ్వడం వల్ల దీనికి *'ముముక్షు హితచర్య'* అనే పేరుపెట్టారు. ఇందులో సర్వ ముముక్షువులకు భక్తియే కార్యమని, భగవంతుని అనుగ్రహం పొందడానికి కొన్ని మార్గాలను అనుసరించాలని సుబ్బారావుగారు చెప్పారు.

### 1.7.3. వ్యాకరణ రచన : *సులభ వ్యాకరణము*

వావిలికొలనువారు బాలురను దృష్టిలో పెట్టుకొని భాషకు సంబంధించిన శాస్త్ర గ్రంథంగా *'సులభ వ్యాకరణము'* రచించారు. వావిలికొలను సుబ్బారావుగారు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా *'సులభ వ్యాకరణము'* అనే వ్యాకరణ సర్వస్వాన్ని రచించి మూడు భాగాలుగా ప్రకటించారు. వ్యాస లేఖనంలో విద్యార్థులు చేసే తప్పులను దృష్టిలో పెట్టుకొని వాటికి పరిష్కార మార్గంగా ఈ వ్యాకరణాన్ని రచించారు. ఈ గ్రంథ పీఠికలో గ్రామ్యభాషా ప్రయోగ నిరసనం, చెన్నపురి తెలుగు, చేగల్ నాటి తెలుగు, గుంటూరు తెలుగు, కర్నూల్ తెలుగు, కళింగ రాష్ట్రపు తెలుగు, అర్ధానుస్వారం, అన్య భాషా పదాలు, వ్యాస నియమాలు మొదలైన అంశాలను ప్రస్తావించారు.

వావిలికొలను సుబ్బారావుగారు *'సులభవ్యాకరణము'* రచనా ప్రణాళికలో బాల, ప్రౌఢ వ్యాకరణాలను అనుసరించారు. కొన్ని సూత్రాలు యథా మాతృకగా స్వీకరించినప్పటికీ *'బాలవ్యాకరణము'* లో సాధించని ప్రక్రియల్ని కూడా సాధించారు. కొన్ని సంజ్ఞలను బాల, ప్రౌఢ వ్యాకరణాలకు భిన్నంగా నిర్వచించారు. ఈ వ్యాకరణంలో కొన్నిచోట్ల విశేషాంశాలను అథస్సూచికలో ఆంగ్లంలో నిర్వచించారు. ఉదాహరణకు “karaka is the name given to the relation subsisting, between a noun and a verb in a sentence”[4].

### 1.7.4 ఆధ్యాత్మిక రచనలు

వావిలికొలను సుబ్బారావుగారు *'ఆంధ్ర వాల్మీకి రామాయణము, భక్తి ప్రాశస్త్యము, భక్తి విజయము , శ్రీరామ నామ మాహాత్మ్యము, శ్రీకృష్ణ లీలామృతము, భగవదారాధన విధానము, యోగ విద్య, ప్రమేయ రత్నావళి, పరమార్థ తత్త్వము'* మొదలైన ఆధ్యాత్మిక గ్రంథాలను రచించారు. ఆయన చెప్పిన భక్తి పరమైన విషయాలనే కొన్ని గ్రంథాలుగా ప్రకటించారు.

#### 1.7.4.1 *ఆంధ్ర వాల్మీకి రామాయణము*

వావిలికొలను సుబ్బారావుగారు *'ఆంధ్రవాల్మీకి రామయణాన్ని'* మూలాన్ని అనుసరించి ఏడు కాండలలో 24 వేల శ్లోకాలను 1904–1908 సంవత్సరాల మధ్య కాలంలో 24 వేల పద్యాలుగా

[4] సులభ. కారక : పుట.173

రాశారు. ఆయన ఈ గ్రంథాన్ని 1908వ సంవత్సరం అక్టోబరు 9,10,11 తేదీల్లో ఒంటిమిట్టలో జరిగిన సభల్లో 50 వేల భక్తుల సమక్షంలో శ్రీకోదండరామ స్వామివారికి అంకితం ఇచ్చారు. వీరి ఆహ్వానాన్ని గౌరవించి వివిధ ప్రాంతాలనుండి గొప్ప కవులు, విద్వాంసులు, అధికారులు మొదలైన పూజ్యులు ఎందరో ఆ సభలకి వచ్చారు. ఆనాటి సభలకు అధ్యక్షుడిగా శ్రీధర్మవరం కృష్ణమాచార్యులు నియమించబడ్డారు. వీరు ఆంధ్రభాషా విషయాదుల గురించి ఉపన్యాసం ఇచ్చారు.

వావిలికొలనువారు *'ఆంధ్రవాల్మీకి రామాయణము'* రాయడానికి భక్తియే కారణమని, ఆ శ్రీరామచంద్రుడే ఈ గ్రంథ రచనకి ఎన్నో విధాలుగా సహకరించారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న పండితులు ఎవ్వరైనా ఈ రామాయణాన్ని పరీక్షించవచ్చని సెలవిచ్చారు. విద్వత్కవులందరూ ఈ రామాయణ రచనని పరీక్షించి వారి అభిప్రాయాలను పద్యరూపంలో, ఉపన్యాసరూపంలో చెప్పి ఆశీర్వదించారు. అంతేకాకుండా సుబ్బారావుగారికి 'ఆంధ్రవాల్మీకి' అనే బిరుదు కూడా ఇచ్చారు. వాల్మీకి హృదయాన్ని ఆవిష్కరించిన మొట్టమొదటి గ్రంథం *'ఆంధ్రవాల్మీకి రామాయణమే'* నని పండితుల అభిప్రాయం.

### 1.7.4.2 *భక్తి ప్రాశస్త్యము*

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీకోదండరామ కైంకర్యానికి గుంటూరు వెళ్ళినప్పుడు 'శ్రీ సీతారామ భక్త సంఘం' వారు ద్వితీయ మహాజన సభ జరిపి ఆయనను అధ్యక్షులుగా ఉంచారు. సుబ్బారావుగారు 1926వ సంవత్సరంలో భక్తి మార్గ ప్రాశస్త్యాన్ని చక్కగా వివరిస్తూ అధ్యక్ష ఉపన్యాసాన్ని ఇచ్చారు. ఆ ఉపన్యాసంలో చెప్పిన విషయాలనే తరువాత *'భక్తి ప్రాశస్త్యము'* అనే గ్రంథంగా ప్రకటించారు. సుబ్బారావుగారు ఈ గ్రంథంలో భక్తియే అన్నింటికన్నా శ్రేష్ఠమైనదని సిద్ధాంతీకరించారు.

### 1.7.4.3 *భక్తి విజయము*

వావిలికొలను సుబ్బారావుగారు ఈ గ్రంథంలో నవవిధ భక్తి మార్గాల గురించి చర్చించారు. శుష్క వేదాంతుల మాయ మాటలకు మోసపోయి భ్రష్టులు కాకుండా అన్ని మతాలవారు, అన్ని వర్ణాలవారు, అన్ని వయస్సులవారు భక్తి మార్గంతో తమ ఇష్ట దేవతలను సంప్రదాయాల ప్రకారం సేవిస్తే కృతార్థులు అవుతారని సుబ్బారావుగారు ఈ గ్రంథంలో చెప్పారు.

### 1.7.4.4 *శ్రీరామనామ మాహాత్మ్యము*

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీకోదండ రామ కైంకర్యం కోసం ఒకసారి 'చాగంటి వారి పాలెం' అనే ఊరికి వెళ్లారు. అక్కడ కృష్ణమ్మ, రామమ్మ, సీతమ్మ, రంగారెడ్డి, మహానందిరెడ్డి అనే భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పిన విషయాలే తరువాత కాలంలో *'శ్రీరామ మహాత్మ్యము'* అనే గ్రంథంగా ప్రకటించారు. ఈ గ్రంథంలో 'శ్రీరామ' నామ శబ్ద ఔచిత్యాన్ని, వైశిష్ట్యాన్ని పురాణ సంబంధ పాత్రలు ద్వారా వివరించారు.

### 1.7.4.5 *శ్రీకృష్ణ లీలామృతము*

వావిలికొలను సుబ్బారావుగారు *'శ్రీకృష్ణ లీలామృతము'* అనే గ్రంథాన్ని నాలుగు భాగాలుగా రచించారు. ఆయన సోదరుడు రంగారావుగారు ఒకరోజు ఆయన సన్నిధికి వచ్చి, శ్రీకృష్ణుని చరిత్రను లోకహితం కోసం రాయమని కోరగా ఈ గ్రంథాన్ని రాశారు. నాలుగు భాగాలుగా ప్రకటించబడిన ఈ గ్రంథంలో శ్రీకృష్ణజన్మ లీల, శైశవ లీల, బృందావన లీల, కళ్యాణ లీల, మహాత్మ్య లీల, విజయ లీల, క్రతురక్షా లీల, దూత కృష్ణ లీల, సూత కృష్ణ లీల, సాంత్వన లీల, దేశిక లీల, ద్వారక లీల, చిత్ర లీల, గర్వభంజన లీల అనే శీర్షికలతో శ్రీకృష్ణుని చరిత్ర మొత్తాన్ని సమగ్రంగా రాశారు.

### 1.7.4.6 *భగవదారాధన విధానము*

శ్రీకోదండరామ సేవక సమాజంలో సభ్యులుగా చేరిన కొందరు స్త్రీలు భగవంతుని ఆరాధన గురించి కొన్ని సందేహాలను వావిలికొలను సుబ్బారావుగారిని అడిగారు. వారికి సమాధానంగా *'భగవదారాధన విధానము'* అను గ్రంథాన్ని రచించారు. భగవంతుని ఆరాధనకు సంబంధించి *'ప్రపన్న ధర్మ సారసముచ్చయము'* అనే రచనలోని అనేక విషయాలను తెలుగులో అనువదించి ఈ గ్రంథ పీఠికలో పేర్కొన్నారు. పూజావిధానంలో ఉండే ఉపచారాలు స్వామికి ఎలా సమర్పించాలో ఉత్తర పీఠికలో పొందుపరిచారు. ఆరాధన మార్గాలు, పూజోపకరణాల విషయంలో పాటించవలిసిన శాస్త్ర ధర్మాలు ఈ గ్రంథంలో ఉన్నాయి.

### 1.7.5 ఉపదేశాత్మక రచనలు

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీ కోదండరామ సేవక సమాజానికి అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఆ సమాజ సభ్యులను ఉద్దేశించి కొన్ని రచనలు చేశారు. వాటిలో *'హనుమదాచార్యోపదేశము, శ్రీసీతోపదేశము, బ్రాహ్మణుల కాత్మావలోకనము'* వంటివి ముఖ్యమైనవి.

#### 1.7.5.1 *హనుమదాచార్యోపదేశము*

వావిలికొలను సుబ్బారావుగారు ఈ గ్రంథంలో హనుమంతుని జననం, బాల్యం, బ్రహ్మచర్య విశిష్టత వంటి విషయాలను పేర్కొన్నారు. అంతేకాకుండా హనుమంతుడి ఆచార్యత్వాన్ని తెలిపే విధంగా రామాయణంలోని కొన్ని ఘట్టాలను తీసుకొని వివరించారు. లంకలో ఉన్న సీతమ్మతో హనుమంతుడు నమస్కరించి సంభాషించిన విధానం అతని ఆచార్యత్వాన్ని తెలుపుతున్నాయని వావిలికొలనువారు బోధించారు. శ్రీరాముని పట్ల హనుమంతుడు కలిగి ఉన్న భక్తి భావాలను ఈ గ్రంథంలో పొందుపరిచారు.

#### 1.7.5.2 *శ్రీ సీతోపదేశము*

భగవంతుని పట్ల భక్తులు అలక్ష్యంగా ఉండటం వల్ల ఎటువంటి సమస్యలు వస్తాయో *'శ్రీ సీతోపదేశము'*లో చాలా కథలు ఉన్నాయి. ఈ గ్రంథ ఆరంభంలో నవాబు బావమరిది మూర్ఖత్వాన్ని తెలిపే కథ, భుక్కని కథలు ఉన్నాయి. వావిలికొలను సుబ్బారావుగారు శ్రీరామునితో పాటుగా సీతమ్మ వారిని సమానంగా పూజించాలని ఆమె పాతివ్రత్యాన్ని తెలిపే వివిధ ఘట్టాలను ఈ గ్రంథంలో సూచన ప్రాయంగా చెప్పారు.

#### 1.7.5.3 బ్రాహ్మణుల కాత్మావలోకనము

బ్రాహ్మణులు చేయాల్సిన నిత్య కర్మల గురించి, సంధ్యా వందనం చేసేటప్పుడు పాటించవలసిన నియమాలను గురించి ఈ గ్రంథంలో వావిలికొలను సుబ్బారావుగారు పేర్కొన్నారు. ఆత్మ విద్య, యోగ విద్యల గొప్పతనాన్ని వశిష్ఠుడు, విశ్వామిత్రుల పాత్రల ద్వారా పరిచయం చేశారు.

### 1.7.6 పురాణ కథా గ్రంథాలు

వావిలికొలను సుబ్బారావుగారు జనశ్రుతిలో ఉన్న ప్రసిద్ధమైన పాత్రలను చిన్న కథల రూపంలో రచించారు. వాటిలో *'హరిశ్చంద్ర చరిత్రము, శకుంతలా చరిత్రము, నల చరిత్రము, రుక్మాంగద చరిత్రము, హనుమంతుని చరిత్రము, వామన చరిత్రము'* వంటి గ్రంథాలు ముఖ్యమైనవి.

#### 1.7.6.1. *హరిశ్చంద్ర చరిత్రము*

వావిలికొలను సుబ్బారావుగారు ఈ గ్రంథాన్ని రాముడు, కృష్ణుడనే ఇద్దరు బాలకుల సంభాషణతో ప్రారంభించారు. ఈ గ్రంథంలో హరిశ్చంద్రుడు, చంద్రమతి, వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, నక్షత్రకుడు మొదలైన పాత్రల ద్వారా సత్యం, ధర్మం యొక్క ఔన్నత్యాన్ని సంక్షిప్తంగా పరిచయం చేశారు.

#### 1.7.6.2 *శకుంతలా చరిత్రము*

వావిలికొలను సుబ్బారావుగారు సంస్కృతంలో కాళిదాస మహాకవి రచించిన *'అభిజ్ఞానశాకుంతలము'* నాటకంలోని ఇతివృత్తాన్ని కాకుండా, మహాభారతంలోని కథను ఆధారంగా చేసుకొని ఈ గ్రంథాన్ని రచించారు. శకుంతల, దుష్యంతుల సంభాషణను చక్కగా రాశారు. ఈ గ్రంథాంతంలో విద్య వల్ల కలిగే లాభాలను కొన్నింటిని పేర్కొన్నారు.

#### 1.7.6.3 *హనుమంతుని చరిత్రము*

వావిలికొలను సుబ్బారావుగారు ఈ గ్రంథాన్ని రెండు భాగాలుగా రచించారు. వీటిలో హనుమంతుడు సూర్యున్ని మింగడం, మైనాకుడు హనుమంతునికి అడ్డంగా రావడం, హనుమంతుడు లంకను చూడటం, హనుమంతుడు జంబుమాలిని వధించటం, రావణుడు ఇంద్రజిత్తున్ని హనుమంతుని మీదకు పంపడం, విభీషణున్ని గ్రహించవచ్చని హనుమంతుడు చెప్పటం వంటి విషయాలు ఇందులో ఉన్నాయి.

### 1.7.6.4 *వామన చరిత్రము*

వావిలికొలను సుబ్బారావుగారు వామన వృత్తాంతాన్ని వచనంలో చక్కగా రాశారు. విష్ణుమూర్తి దశావతారాలలో వామన అవతారం కూడా ఒకటి. ఇందులో బలిచక్రవర్తిని దానం అడగడానికి విష్ణుమూర్తి ఒక వామనుడు రూపంలో వచ్చి బలిచక్రవర్తిని పాతాళ లోకానికి పంపిస్తారు. ఈ వృత్తాంతాన్ని వావిలికొలను సుబ్బారావుగారు కంటే ముందు పోతానామాత్యుడు *'శ్రీమద్భాగవతము'* లో చంపూ రూపంలో రాశారు.

## 1.7.7 విమర్శనా గ్రంథాలు

వావిలికొలను సుబ్బారావుగారు ఆధునిక వచనం, జాతీయవిద్య, అస్పృశ్యత, రామావతారతత్త్వం మొదలగు అంశాలకు సంబంధించి విరివిగా విమర్శనాత్మకంగా వ్యాసాలు రాశారు. సాధారణంగా సుబ్బారావుగారు వాద ప్రతివాదనలకు చోటు ఇచ్చేవారు కాదు. భాషకి, సమాజానికి, సాహిత్యానికి సంబంధించి అవసరమైన విషయాలను మాత్రమే తమ వ్యాసాలలో చర్చించారు. ఈ వ్యాసాలే తరువాత కాలంలో గ్రంథాలుగా ప్రకటించబడ్డాయి.

### 1.7.7.1 *ఆధునిక వచన రచనా విమర్శనము*

వావిలికొలను సుబ్బారావుగారు మద్రాసు రాజధాని కళాశాలలో ఆంధ్రపండితులుగా పనిచేస్తున్నప్పుడు ఆ కళాశాలలో *'ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం'* అనేది ఏర్పడింది. వారు ఆంధ్ర భాషకు సంబంధించిన సభలు జరిపేవారు. ఈ సమాజంవారు శ్రీ శెట్టి లక్ష్మీనరసింహంగారు రచించిన *'గ్రీకు పురాణకథలు'* అనే నవీనాంధ్ర గ్రంథాన్ని వావిలికొలను సుబ్బారావుగారికి ఇచ్చి దీనిలోని శైలి సాధువా? అసాధువా? దీనిలో సూచించిన మార్గాలను అనుసరించి మేము పోవచ్చునా? పోకూడదా? అని వారి అభిప్రాయాన్ని కోరారు. వావిలికొలనువారు ఆ గ్రంథాన్ని చదివి అందులోని శైలిని పాటిస్తే ఆంధ్ర భాషకు నష్టం వాటిల్లితుందని గ్రహించి *'ఆధునిక వచన రచనా విమర్శనము'* రచించారు.

వావిలికొలను సుబ్బారావుగారు *'గ్రీకుపురాణ కథలు'* అనే పుస్తకంలో ప్రధానంగా 1. సంభాషణ శైలి, 2. సంధి జ్ఞానమనావశ్యకం, 3. సంస్కృతం, తెలుగు, ఉర్దూ అని తేడా లేకుండా సర్వ

పదాలు ప్రయోగించుట, 4. అర్ధానుస్వారం, శకట రేఫలను విడుచుట, 5. ఈ గ్రంథం విద్యార్థులకు ఉద్దేశించబడింది– అనే విషయాలను విమర్శించారు. ఈ నియామలు పరోక్షంగా గ్రామ్యవాద ఖండనాన్ని తెలపుతున్నాయి. నాటి పండిత కవులైన శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు, శ్రీ కొక్కొండ వెంకటరత్నంగారు, శ్రీ వేదం వేంకటరాయశాస్త్రిగారు వంటి వారు ఈ గ్రామ్యవాద ఖండనం అనే అంశంలో సుబ్బారావుగారికి సహకరించారు.

## 1.7.7.2 *బమ్మెర పోతన నికేతన చర్చ – పోతరాజ విజయముల వృత్తాంతము*

వావిలికొలను సుబ్బారావుగారువారి *'ఆంధ్రవాల్మీకి రామాయణము'* లో బమ్మెర పోతనామాత్యుడు ఒంటిమిట్టవాడని పేర్కొన్నారు. కొందరు ప్రతివాదులు ఆధారాలు తెల్పమని ఆయనకు ఉత్తరాలు పంపారు. సుబ్బారావుగారు వారితో వాదించటం ఇష్టం లేక ప్రత్యుత్తరంగా వ్యాసాలను రాసి ప్రకటించారు. ఆయన వ్యాసాలను ఖండిస్తూ జయంతి రామయ్యపంతులు వంటివారు పోతానామాత్యుడి జన్మస్థలం ఏకశిలా నగరమని వ్యాసాలు రాశారు. వీరిద్దరి వాదనలన్ని *'ఆంధ్ర కవులచరిత్రము'* లోని *'పోతన నికేతనచర్చ'* లో ఉన్నాయి.

వావిలికొలను సుబ్బారావుగారి వ్యాసాలను చదివి కందుకూరి వీరేశలింగం పంతులుగారు కూడా ప్రత్యుత్తరంగా ఒక వ్యాసం రాశారు. సుబ్బారావుగారు కందుకూరి వారి అభిప్రాయాన్ని ఖండిస్తూ ఐదు వ్యాసాలను కలిపి *'బమ్మెర పోతరాజ విజయము'* అనే గ్రంథంగా ప్రకటించారు. ఈ గ్రంథంలో పోతన ఒంటిమిట్టవాడని నిరూపించడానికి ప్రధానంగా ఎనిమిది కారణాలను చూపించారు. ఆయన అభిప్రాయయాన్ని సమర్థించిన మంత్రిప్రెగడ భుజంగరావుగారు, శ్రీనాగపూడి కుప్పస్వామయ్యగారు వంటివారిని కూడా ఈ గ్రంథంలో ప్రస్తావించారు.

## 1.7.7.3 *ఆర్య విద్యోపన్యాసములు*

వావిలికొలను సుబ్బారావుగారు ఈ గ్రంథాన్ని జగన్నాథపురం జాతీయ పాఠశాలలో తానే స్వయంగా చదివి వినిపించారు. ఇందులో పాశ్చాత్య నాగరికత, స్వదేశీ నాగరికతలను విమర్శించారు. మన ప్రాచీన విద్యాభ్యాసానికి సంబంధించిన సంప్రదాయాలను పూర్తిగా వివరించారు.

### 1.7.7.4 *అస్పృశ్యత*

*'ఆంధ్ర పరిషత్తు'* ద్వితీయ వార్షిక సందర్భంగా వావిలికొలను సుబ్బారావుగారు అధ్యక్షత్వంలో *'అస్పృశ్యత'* అనే విషయం గురించి ఒక సభ జరిగింది. ఆ సభలో ఎన్నో రకాల ప్రశ్నలు ఉద్భవించగా వాటన్నిటికీ చివరలో అధ్యక్షోపన్యాసంలో వివరించారు. తరువాత ఆ ఉపన్యాసాన్నే *'అస్పృశ్యత'* గ్రంథంగా ప్రకటించారు.

## 1.7.8 శతక రచనలు

వావిలికొలను సుబ్బారావుగారు *'తల్పగిరి రంగనాయక శతకము, టెంకాయ చిప్ప శతకము, శ్రీ కల్పద్రుమ శతకము'* అనే మూడు శతకాలని రాశారు. ఇందులో మొదటిది ఆయన పాండిత్య నిరూపణ కోసం రాయగా, మిగిలిన రెండు శ్రీకోదండ రామ కైంకర్యానికి వెళ్ళినప్పుడు ఎదురైన వారి అనుభవాలను గురించి రాశారు.

### 1.7.8.1 *తల్పగిరి రంగనాయక శతకము*

వావిలికొలను సుబ్బారావుగారు *'శ్రీకుమారాభ్యుదయము'* అనే ప్రౌఢ ప్రబంధాన్ని రచించినందుకు నెల్లూరులో సి.శరభలింగంగారు సన్మానసభ ఏర్పాటుచేశారు. ఆ సభలో కొంతమంది పండితులు ఆ గ్రంథం సుబ్బారావుగారు రాయలేదని, ఆయన పేరుతో వారి పెద్దలెవరో రాసి ఉంటారని విమర్శించారు. రెండు రోజుల తరువాత ఆ పండితుల విమర్శలు సుబ్బారావుగారికి తెలిశాయి. ఆయన వారి వాదనలు ఖండించలేక మరుసటి రోజు *'తల్పగిరి రంగనాయక శతకము'* రచించి పూండ్ల రామకృష్ణయ్యగారికి అంకితం ఇచ్చారు.

విక్రమ సింహపురి రంగనాయకులస్వామివారికి గిరియే తల్పము కాబట్టి సుబ్బారావుగారు ఈ శతకానికి *'తల్పగిరి రంగనాయక శతకము'* అని పేరుపెట్టారు. ఈ శతకంలో మొదటి పద్యం నుండి పన్నెండు వరకు గల పద్యాలలో మొదటి అక్షరాలను కలిపి చదివితే *'శ్రీ రంగ నాయకీ నాయకాయ నమః'* అని వస్తుంది. అంతేకాకుండా ఈ శతకంలో 81వ పద్యం నుండి 90వ పద్యం వరకు గల పద్యాలలో మొదటి పాదంలోని ప్రాసాక్షరాలను చదివితే 'వావిలికొలను సుబ్బారావు' అని వస్తుంది. ఇలాంటి విశేషమైన ప్రయోగాలను సుబ్బారావుగారు ఈ శతకంలో రాశారు.

### 1.7.8.2 *టెంకాయ చిప్ప శతకము*

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీకోదండరామస్వామి వారి కైంకర్యం కోసం వివిధ ప్రాంతాలకి వెళ్ళినప్పుడు తనకు ఎదురైన అనుభవాలన్నింటిని పోగుచేసి *'టెంకాయ చిప్ప శతకాన్ని'* రచించారు. ఈ గ్రంథంలో రామ కైంకర్యానికి మొట్టమొదటిగా తమకు సహకరించిన 'టెంకాయ చిప్ప' మీద అతి రమ్యంగా పద్యాన్ని ఇలా చెప్పారు.

"ఆంధ్ర వాల్మీకి హస్తంబు నందు నిలిచి
రూప్యములు వీణ వేలుగఁ బ్రోగు చేసి
దమ్మిడైనను వానిలో దాచుకొనక
ధరణిజాపతి కర్పించి ధన్యవైతి
కలదె నీకంటె గొప్ప టెంకాయ చిప్ప" (టెంకాయ.1:30)

వావిలికొలను సుబ్బారావుగారు 1995వ సంవత్సరంలో జరిగిన బ్రహ్మోత్సవాలలో శ్రీ ఒంటిమిట్ట కోదండరామస్వామి వారి ఎదురుగా సభలో టెంకాయచిప్ప శతకాన్ని చదివి, కొన్ని ప్రతులను ఆ స్వామివారి పాదాల దగ్గర సమర్పించారు.

### 1.7.8.3 *శ్రీభక్త కల్పద్రుమ శతకము*

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీకోదండరామస్వామివారి సామ్రాజ్య పట్టాభిషేకాన్ని గురించి ఈ శతకాన్ని రాశారు. దీనిలో కూడా టెంకాయ చిప్ప శతకం లాగా శ్రీకోదండరామ కైంకర్యానికి వెళ్ళినప్పుడు కలిగిన కొన్ని అనుభవాలను సూత్రప్రాయంగా ఈ శతకంలో చెప్పారు.

### 1.7.9 ప్రబంధాలు

వావిలికొలను సుబ్బారావుగారు *'శ్రీ కుమారాభ్యుదయము, శ్రీ కౌసల్య పరిణయము'* అనే రెండు ప్రబంధాలు రచించారు. వీటిలో వరుసగా మొదటి గ్రంథాన్ని ప్రౌఢ కావ్యంగా రచించగా, పాఠకుల అభిప్రాయాలను అనుసరించి రెండవ గ్రంథాన్ని కొద్దిపాటి సరళంగా రాశారు.

### 1.7.9.1 *శ్రీ కుమారాభ్యుదయము*

వావిలికొలను సుబ్బారావుగారు కడపజిల్లా, రాజంపేట తాలూకా టంగుటూరులో పనిచేస్తున్నప్పుడు రచించిన తెలుగు పద్యకావ్యం *'శ్రీకుమారాభ్యుదయము'*. ఈ కాలంలో నూతనంగా రచించబడిన మిశ్ర ప్రబంధాలలో *'శ్రీకుమారాభ్యుదయము'* లాంటి పదగుంఫనం కలిగిన చమత్కారమైన కావ్యం లేదని ప్రతీతి. ఇందులో మూడు ఆశ్వాసాలు ఉన్నాయి. మొదటి ఆశ్వాసంలో మన్మథ సంహారం, ద్వితీయాశ్వాసంలో శ్రీకృష్ణుని రుక్మిణీ కళ్యాణం– ప్రద్యుమ్నుని జననం, మూడవ ఆశ్వాసంలో ప్రద్యుమ్నుని విజయం మొదలైన ఘట్టాలు ఉన్నాయి. ఈ కావ్యంలో పద్మబంధం, నాగబంధం, ఛత్రబంధం, శ్వేతబంధం, ఖడ్గబంధం వంటి పద్యబంధాలు ఉన్నాయి.

వావిలికొలను సుబ్బారావుగారి మిత్రులైన శ్రీలంకలపల్లి వేంకటసుబ్బయ్యగారు *'శ్రీకుమారాభ్యుదయము'* పాఠకలోకానికి సుబోధకంగా అర్థమవ్వడానికి *'సుమనోల్లాసము'* అనే పేరుతో టీకాతాత్పర్యాలను రాశారు. పూండ్ల రామకృష్ణయ్యగారు *'శ్రీ కుమారాభ్యుదయానికి'* కృతి విమర్శనం చేస్తూ ఇందులోని దండకం దాదాపుగా భోగినీదండక శైలిని పోలియున్నదని, కొన్ని పద్యాలు 'శృంగార నైషధము, రామాభ్యుదయము' లోని పద్యాల లాగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

### 1.7.9.2 *శ్రీ కౌసల్యా పరిణయము*

వావిలికొలను సుబ్బారావుగారు మాతృ ప్రేరణతో, మిత్రుని బోధనలతో *'శ్రీకౌసల్యా పరిణయము'* అను ప్రబంధాన్ని 1894వ సంవత్సరం మార్చి నెలలో ప్రారంభించి నవంబరు నెల నాటికి పూర్తిచేశారు. ఇది ఆరు ఆశ్వాసాల చంపూ కావ్యం. ఈ కావ్యానికి మాతృకలు మరాఠీ భాషలో గేయాల రూపంలో ఉన్నాయని సుబ్బారావుగారు పీఠికలో ప్రస్తావించారు. ఇందులో మొదటిగా ఇష్టదైవమైన శ్రీరామ చంద్రుని స్తుతించారు. తరువాత సంస్కృతాంధ్ర కవులైన వాల్మీకి మహర్షి, వ్యాసభగవానుడు, కాళిదాస మహాకవి, దండి, నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, నాచన సోమన, శ్రీనాథుడు, రామరాజ భూషణుడు మొదలైన వారిని ప్రస్తావించారు.

వావిలికొలను సుబ్బారావుగారు *'శ్రీకౌసల్యా పరిణయము'* లో స్త్రీ వర్ణనల కంటే ప్రకృతి వర్ణలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఈ కావ్యంలో అయోధ్యని వర్ణిస్తూ స్వర్గపురి అయిన అమరావతితో పోల్చారు.

## 1.7.10 వ్యాఖ్యాన గ్రంథాలు

వావిలికొలను సుబ్బారావుగారు *'మందరము, శ్రీమద్భగవద్గీత'* అనే రెండు వ్యాఖ్యాన గ్రంథాలు రాశారు.

### 1.7.10.1 *మందరము*

వావిలికొలను సుబ్బారావుగారు *'ఆంధ్రవాల్మీకి రామాయణానికి'* సులభ శైలిలో పాఠకులకు అర్థమయ్యే విధంగా *'మందరము'* అనే పేరుతో విపులమైన వ్యాఖ్యానం రాశారు. గ్రంథకర్త, వ్యాఖ్యాత ఒక్కరే అవ్వడం వల్ల అన్ని విషయాలు ఉన్నది ఉన్నట్టుగా అందించారు. *'మందరము'* వ్యాఖ్యానంలోని బాలకాండను ఒంటిమిట్ట శృంగి పర్వతంపైన వాల్మీకి ఆశ్రమంలో, అయోధ్యకాండను మేల్పట్టు గ్రామంలో దొరైస్వామి నాయిడుగారి ఇంట్లో, అరణ్యకాండను నడిగడ్డపాలెం వాల్మీకి ఆశ్రమంలో, కిష్కింధ–సుందర–యుద్ధ–ఉత్తరకాండలను కోలంకవరం జమీందారిణి రామాయమ్మగారి తోటలో పూర్తిచేసి జ్యేష్ఠ శుద్ధ ద్వాదశినాడు విశేష పూజానంతరం ఒంటిమిట్ట శ్రీరామునికి సమర్పించారు.

*'మందరము'* రచనలో రామాయణం కాలంనాటి మనదేశ విభాగాలను (Geography) సీతారామలక్ష్మణులు సంచరించిన ప్రదేశాలను తెలిపే పటాలను పొందుపరిచారు. రామాయణానికి సంబంధించిన సందేహాలను నివృత్తి చేసేలా కొన్ని చోట్ల విశేషాంశాలను పేర్కొన్నారు. వావిలికొలనువారు ఈ గ్రంథంలో ప్రతిపదార్థ తాత్పర్యాలతో పాటుగా విశేషార్థాలు, శాస్త్రచర్చలు, ఛందో అలంకారాలు, వ్యాకరణ విశేషాలను కూడా చర్చించారు.

### 1.7.10.2 *శ్రీ మద్భగవద్గీత*

వావిలికొలను సుబ్బారావుగారు *'శ్రీమద్భగవద్గీత'* లోని శ్లోకాలను చెప్పకుండా దాని సారాన్ని మాత్రమే *'శ్రీకృష్ణలీలామృతము'* ద్వితీయ భాగంలో ప్రస్తావించారు. ఈ సారాన్ని శ్లోక సహితంగా అందిస్తే పాఠకులకు ఉపయోగపడుతుందని శ్రీ కోదండరామ సమాజ సభ్యులు *'శ్రీమద్భగవద్గీత'* ను ముద్రించారు. ఇందులో భగవద్గీత ఉపదేశ గ్రంథమా? వాద గ్రంథమా? అన్న విషయాలు చర్చించబడ్డాయి. ఉపదేశాత్మకమైన రచనలో ప్రధానంగా వక్తృ, విషయ, నాయక వైలక్షణ్యం వంటివి చూడాలని *'శ్రీమద్భగవద్గీత'* కి అన్వయించి చూపారు.

## 1.7.11 గేయ రచనలు

వావిలికొలను సుబ్బారావుగారు *'నుతి త్రయము, శ్రీ వాసుదాసు కీర్తనలు'* అనే రెండు గేయ సంబంధించిన రచనలు చేశారు.

### 1.7.11.1 *నుతి త్రయము*

వావిలికొలను సుబ్బారావుగారు **'స్తుతి'** కి పర్యాయపదంగా **'నుతి'** శబ్దం ప్రయోగించారు. *'నుతి త్రయము'* లో బమ్మెరపోతనకి, శ్రీరాముడికి, శ్రీకృష్ణునికి సంబంధించిన స్తుతి ఉన్నది. బమ్మెర పోతన స్తుతిలో నాలుగు పాదాలు గల 'నుతి' లు ధన్యాసి, మోహన రాగంలో ఉన్నాయి. ఇందులో పోతనని సత్కవిగా పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి సంస్కృత భాషలో రచించిన శ్రీమద్రామాయణ సంక్షిప్త రూపమే శ్రీరామనుతి. ఇందులో శ్రీరామునుకి సంబంధించిన 108 నామాలతో నుతించారు. భాగవతంలోని దశమ స్కంధ కథాభాగ సంక్షిప్త రూపమే శ్రీకృష్ణనుతి. ఇందులో శ్రీకృష్ణునికి సంబంధించిన 108 నామాలతో నుతించారు.

### 1.7.11.2 *శ్రీ వాసుదాసు కీర్తనలు*

వావిలికొలను సుబ్బారావుగారు *'శ్రీ వాసుదాసు కీర్తనలు'* రెండు భాగాలుగా రచించారు. ఇందులో మొదటి భాగాన్ని శ్రీ ఒంటిమిట్ట కోదండ రాములవారి సామ్రాజ్య పట్టాభిషేకం కోసం రాశారు. రెండవ భాగాన్ని శ్రీరామ సేవ సమాజ సభ్యులు కోసం ఉత్సవాలలో భజనలు చేయడానికి వీలుగా కీర్తనలు రచించారు. ఇందులో గణపతి ప్రార్ధన, సరస్వతి ప్రార్ధన, గురు ప్రార్ధన, ఆంజనేయ ప్రార్ధన, ప్రభాత సేవ, ఏకాంత సేవకి సంబంధించిన కీర్తనలు ఉన్నాయి. ఈ గ్రంథ పీఠికలో నవవిధ భక్తిమార్గాలను కూడా పేర్కొన్నారు. ఈ మార్గాలలో ఏ ఒక్కటైనా పరిపూర్ణంగా పాటించినా మోక్షం పొందవచ్చని చెప్పారు.

## 1.7.12 నాటక రచన

వావిలికొలను సుబ్బారావుగారు మద్రాసులో అధ్యాపకులుగా పనిచేస్తున్నప్పుడు *'సుభద్రా విజయ నాటకము'* రచించారు. ఇది ఐదు అంకాలు గల నాటకం. విద్యార్థులు కోరడంవల్ల *'విజయవిలాసం'* లోని కథనే గ్రహించి నాటకంగా మలిచారు. వావిలికొలనువారు ఈ నాటకం పాఠకుల మన్ననలు పొందుతుందో? లేదో? అని సందేహపడ్డారు. కాని కోలాచలం

శ్రీనివాసరావుగారు, కట్టమంచి రామలింగారెడ్డిగారు మొదలైన కవి పండితుల ప్రోత్సాహంతో ఈ *'సుభద్రావిజయ నాటకము'* ముద్రించి విశేష ఆదరణ పొందారు.

## 1.7.13 దండక రచనలు

వావిలికొలను సుబ్బారావుగారు *'శ్రీరాముని దండకము, ఆంజనేయ దండకము, వాసుదాసు దండకము'* మొదలైన దండక రచనలు చేశారు.

## 1.7.14 సంకలన గ్రంథాలు

వావిలికొలను సుబ్బారావుగారు *'బమ్మెరపోతన రత్నములు,రహస్య రత్నాకరము'* అనే రెండు సంకలన గ్రంథాలను రచించారు.

## 1.7.15 అనువాద రచనలు

వావిలికొలను సుబ్బారావుగారు *'చతుశ్లోకి, శరణాగతి గద్య'* అనే రెండు అనువాద రచనలు చేశారు.

### ముగింపు

*'కడప గడపలలోన కవుల గడపలు మెండు'* అన్న నానుడి ప్రకారం రాయలసీమలోని కడప జిల్లాలో ఎందరో మహాకవులు, పండితులు జన్మించి వారి రచనలతో ఆంధ్రభారతికి సేవచేశారు. ప్రాచీన కవుల మార్గాన్ని వదలకుండా రచనలు చేసినవారు ప్రధానంగా వావిలికొలను సుబ్బారావుగారు కన్పిస్తున్నారు. ఆయన ప్రాచీన ప్రక్రియలలోను, ఆధునిక ప్రక్రియలలోను రచనలు చేశారు. వారు రాసిన గ్రంథాలన్ని కేవలం ఆయన పాండిత్యాన్ని నిరూపించేవి మాత్రమే కావు. శ్రీరాముని కోసం, భక్తుల కోసం, విద్యార్థుల కోసం, ఆంధ్రభాషా సేవ కోసం రచనలు చేసినట్లు ఆయన జీవిత చరిత్రను తెలిపే గ్రంథాలను, ఆయన రచనలను అధ్యయనం చేయడం వల్ల తెలుస్తున్నది.

**రెండవ అధ్యాయం:** 'సులభవ్యాకరణ నిర్మాణ క్రమం' అనే అధ్యాయంలో భాగంగా సులభవ్యాకరణ నిర్మాణక్రమాన్ని చర్చిస్తాను.

# అధ్యాయం – 2

# సులభవ్యాకరణ నిర్మాణ క్రమం

# అధ్యాయం – 2

## సులభవ్యాకరణ నిర్మాణ క్రమం

### 2.0 వ్యాకరణం: నిర్వచనాలు

అపశబ్ద సుశబ్ద లక్షణము తెలుపేది వ్యాకరణశాస్త్రమని దీనినే 'శబ్దశాస్త్రం' అంటారని వావిలికొలనువారు నిర్వచించారు. శాస్త్రం అనగా నేర్పేది, శాసించేది. మనం చేసేపనుల విషయంలో ఏది ధర్మమో, ఏది అధర్మమో ధర్మశాస్త్రం ఎలా నిర్ణయించగలదో అలాగే మనం ఉచ్చరించే మాటలలో, రాసే రాతలలో ఏది అపశబ్దమో వ్యాకరణశాస్త్రం తెలియజేస్తుంది.

వ్యాకరణం మానవ భాషా వ్యవహారాన్ని, దాని స్వరూప స్వభావాన్ని శాస్త్రీయంగా చర్చిస్తుంది. వివిధ కాలాల్లోగాని, ఒకే కాలానికిగాని సంబంధించిన భాషను శాస్త్రీయంగా విభజించి వివరిస్తుంది. ఆయా కాలాల్లోని భాషలోని మార్పుల ఆధారంగా ప్రకృతి – ప్రత్యయ, పద – పదాంశ ఇత్యాది విభాగాలు చేసి భాషా వ్యవహారాన్ని తెలుపుతుంది.

భాష నిత్యపరిణామశీలాన్ని కలిగి ఉంటుంది. ఎప్పటికప్పుడు జనుల వాగ్వ్యవహారంలో నిత్యనూతనంగా మారుతూ, దేశ కాల ప్రాంతాది ప్రభావాలకు లోనవుతూ తదనుగుణమైన రూపాన్ని పొందుతూ ఉంటుంది. ఇలాంటి మార్పులకి పరిమితి లేదు. వాగ్వ్యవహారంలో ఉన్న భాష ఇలా ఉంటుందని తెలుసుకోవాలి తప్ప, ఇలా ఉండాలని నిర్దేశించలేము. పరిమితిలేని ఈ భాషా స్వరూపాన్ని సంగ్రహంగా నిరూపించాలంటే సాధ్యం కాదు. ఈ మార్పుల్ని శాస్త్రీయమైన పద్ధతుల ద్వారా వైయాకరణులు వివేచన చేసి వ్యాకరణాల్ని నిర్మిస్తారు.

ఒక భాష యొక్క గొప్పదనం దానిని వ్యవహరించే జనుల సంఖ్య పైన, దాని తాలూకా సాహిత్యాల ఔన్నత్యాల మీద ఆధారపడి ఉంటుంది. మాతృభాష తప్ప, ఏ భాషనైనా అభ్యసించాలంటే దాని సమగ్ర స్వరూపం తెలియాల్సి ఉంటుంది. అప్పుడు మాత్రమే మనం ఆ భాషలో వ్యవహరించగలం. భాష యొక్క సమగ్ర స్వరూపాన్ని ఆవిష్కరించేది వ్యాకరణం. భాషాధ్యాయనానికి వ్యాకరణం పట్టుకొమ్మ.

వ్యాకరణం వేదంగాలలో ఒకటిగానే కాకుండా ముఖ్యమైనదిగా కూడా భావించారు. భాషను వ్యాకరించేవాడు, యజ్ఞ విధానాన్ని చర్చించేవాడు– వీళ్ళిద్దరూ పుణ్యకర్మలు చేసినవాళ్ళని, గొప్ప పవిత్రులని భావించి ప్రాచీన భారతీయ సమాజం వైయాకరణుల్ని, మీమాంసకుల్ని గౌరవించింది. *"ప్రథమే హి విద్వాంసో వైయాకరణా:"(ధ్వన్యా.లోచన. ఆంధ్ర:208)* అని ధ్వనికారుడు తన గ్రంథంలో వ్యాకరణకారుడినే మొదటగా గౌరవించాలని చెప్పారు. భారతీయుల గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిన వాటిలో వ్యాకరణ శాస్త్రం కూడా ఒకటి. పాణిని, పతంజలి, భర్తృహరి వంటివారి కృషితో భారతీయ వ్యాకరణ శాస్త్రం వృద్ధి చెందింది.

పాణిని కంటే ముందు ఆపిశలి, కాశ్యప, గార్గ్య, గాలవ, చాక్రవర్మణ, భరద్వాజ, శాకటాయన, శాకల్య, సేనక, స్ఫోటాయనాది వ్యాకర్తలు ఉన్నట్లు 'పాణినీయం' ప్రస్తావిస్తోంది. పాణిని– కాత్యాయనుడు– పతంజలి వ్యాకరణ మునిత్రయంగా పేరుకెక్కారు. ప్రాతిశాఖ్యలలోనే ఎంతో మంది ప్రాచీన వ్యాకర్తల పేర్లు, వాళ్ళ అభిప్రాయాలు కనిపిస్తాయి. వ్యాకరణ సంబంధమైన పారిభాషిక పదజాలం కూడా వీటిలో కనిపిస్తుంది. ప్రాతిశాఖ్యలు వ్యాకరణ శాస్త్రపు తొలిరూపాలు. వీటికి మూలాలు బ్రాహ్మణాలలో కనిపిస్తాయి.

నన్నయ కృతంగా భావిస్తున్న *'ఆంధ్రశబ్దచింతామణి'* సంస్కృతంలో రచింపబడిన మొట్టమొదటి తెలుగువ్యాకరణ గ్రంథం. ఇందులో కేవలం వ్యాకరణ విషయాలు మాత్రమే చెప్పబడ్డాయి. తెలుగులో లాక్షణికులు *'కవిజనాశ్రయము'* వంటి ఛందో గ్రంథాలలో అక్కడక్కడ వ్యాకరణాంశాలను పొందుపరిచారు. మూలఘటిక కేతన *'ఆంధ్రభాషాభూషణము'* అనే పేరుతో వ్యాకరణాన్ని పద్యాలలో రాశారు. తెలుగులో వచ్చిన మొట్టమొదటి వ్యాకరణగ్రంథం ఇది. ఈ గ్రంథంలో కేవలం వ్యాకరణ విషయాలు మాత్రమే చెప్పబడ్డాయి.

తెలుగులో ప్రాచీన కావ్యభాషా లక్షణాన్ని తెలిపే గ్రంథాలుగా విశేషమైన ఆదరణ పొందిన గ్రంథాలు బాల, ప్రౌఢ వ్యాకరణాలు. కావ్య భాషాపరంగా, సామాన్య భాషా లక్షణాన్ని బాల వ్యాకరణం నిర్దేశించగా అందులో విశేష లక్షణాలనూ ప్రయోగాలనూ ప్రౌఢవ్యాకరణం వివరించింది. బాల, ప్రౌఢ వ్యాకరణాలలోని ప్రాథమిక విషయాలను ఒకచోట చేర్చి సవరణ, పూరణ, వివరణ, కోణంలో వావిలికొలను సుబ్బారావుగారు 'సులభవ్యాకరణము' అనే పేరుతో ఒక వ్యాకృతిని రచించారు.

## 2.1 *'సులభవ్యాకరణము'* గ్రంథ కాలం / పరిశోధనకు గ్రహించిన ప్రతి

వావిలికొలను సుబ్బారావుగారు రచించిన *'సులభవ్యాకరణము'* మొదటికూర్పు 1905వ సంవత్సరంలో మద్రాసులోని తిరువల్లిక్కేణిలో జరిగినట్లు ఆచార్య జి. లలితగారు *'తెలుగు వ్యాకరణాల చరిత్ర'* అనే గ్రంథంలో పేర్కొన్నారు. ఈ గ్రంథంలో రెండవ కూర్పు ఎప్పుడు జరిగిందో ప్రస్తావించలేదు గాని; 16-11-1916 సంవత్సరంలో మూడవ కూర్పు, 4-3-1918 సంవత్సరంలో నాల్గవ కూర్పు 'మద్రాసు' లోని సదానందనిలయ ముద్రాక్షరశాలలో జరిగినట్లు ఆచార్య జి. లలితగారు పేర్కొన్నారు.

ప్రస్తుతం నాకు లభ్యమైన *'సులభవ్యాకరణము'* అనే ప్రతిని తెనాలి సమీపంలోని దాసకుటి క్షేత్రానికి సంబంధించిన 'శ్రీ కోదండరాయ సేవక ధర్మసమాజము' వారు 1963వ సంవత్సరంలో ముద్రించారు. దీనిని జానకీరాం ముద్రాలయం ద్వారా పాఠకులకు అందించారు. విద్వాన్ బులుసు సూర్యప్రకాశశాస్త్రిగారు ఈ గ్రంథాన్ని పరిశీలించి ముద్రణకు తోడ్పడ్డారు. అప్పటివరకు మూడు భాగాలుగా ఉన్న *'సులభవ్యాకరణాన్ని'* ఒకే సంపుటిగా ముద్రించారు.

ప్రస్తుత నా పరిశోధన 'శ్రీ కోదండరాయ సేవక ధర్మసమాజము' వారు 1963వ సంవత్సరంలో ఒకే సంపుటిగా ముద్రించిన *'సులభవ్యాకరణము'* అనే గ్రంథం మీద ఆధారపడి జరిగింది.

## 2.2 *'సులభవ్యాకరణము'* రచనా నేపథ్యం

తెలుగులో వచ్చిన సంప్రదాయ వ్యాకరణాలలో *'సులభవ్యాకరణానికి'* ఒక ప్రత్యేక స్థానం ఉంది. వావిలికొలను సుబ్బారావుగారు *'సులభవ్యాకరణము'* మొదటి కూర్పు పీఠికలో ఈ గ్రంథ రచనకు పూనుకోవడానికి గల కారణాలను ప్రస్తావించారు. వ్యాసలేఖనం గురించి విద్యార్థులు తెలుసుకోవడానికి సరైన గ్రంథం లేదని, ఏది చదవాలి? ఎలా రాయాలి? అనే విషయాల పట్ల వారికి అవగాహన లేదని, వారికి బోధించే కొంతమంది అధ్యాపకులకు కూడా తెలియదని బాధపడ్డారు.

విద్యార్థులు వ్యాసం రాసేటప్పుడు వాక్యాలలో తెలుగు పదాలు, ఇంగ్లీషు పదాలు, ఉర్దూ పదాలు, గ్రామ్య పదాలు కలిపి మిశ్రమ పదాలు రాయడం, కొన్నిసార్లు ఇంగ్లీషు అక్షరాలతోనే పదాలు రాయడం, ఏకవచనంలో కర్తను ఉంచి బహువచనంలో క్రియను రాయడం, స్త్రీలింగ విశేష్యానికి పుంలింగ విశేషణం పెట్టడం ఇలా చిత్ర విచిత్రాలుగా సంకర శైలిని రాస్తున్నారని; ఇలాంటి పరిస్థితులను

పోగొట్టడానికి నా శక్తిని అనుసరించి '*సులభవ్యాకరణాన్ని*' రచించానని వావిలికొలనువారు చెప్పుకున్నారు.

వావిలికొనువారు '*సులభవ్యాకరణాన్ని*' ఆంగ్లేయుల వ్యాసలేఖన గ్రంథాలను అనుసరించి రచించానని చెప్పారు. నేను చెప్పే విషయాలకు కొంత ఉపబలాన్ని చేకూర్చే విషయాలను ఆంగ్ల గ్రంథాల నుండి అనువదించినప్పటికీ, విద్యార్థులు వ్యాసాలలో రాసే దోషాలను గ్రహించి ఈ గ్రంథంలో చేర్చి సవరించానని అన్నారు. వ్యాసాలు రాసేవారికి, క్షుద్ర గ్రంథాలు రాసేవారికి ఈ గ్రంథం ఉపయోగపడుతుందని, ఈ గ్రంథంలో చెప్పాల్సిన విషయాలు ఇంకా ఉన్నప్పటికీ, ఆవశ్యకమైన విషయాలు విడవలేదని వావిలికొలను సుబ్బారావుగారు చెప్పారు.

వావిలికొలనువారు రెండవకూర్పు పీఠికలో ***సులభవ్యాకరణము*** గురించి "తొలుత నీ గ్రంథమును గేవల విద్యార్థులకే యుద్దేశించి వ్రాసితినిగాని యనుభవమునఁ దదితరులకు నిది ప్రయోజన పడుచుండుట యెఱిఁగితిని. ఈ కూర్పునందు నెక్కువ విషయములు చేర్పఁబడినవి. అవి విద్యార్థులకేగాక కుఱ కుఱ గ్రంథకర్తలకును, సాధుభాష యందు కథలు వ్యాసములు లోనైనవి వ్రాయువారికి విశేషముగ నుపయోగపడఁగలవని నమ్మెదను"[5] అని చెప్పారు.

వావిలికొలను సుబ్బారావుగారు '*సులభవ్యాకరణాన్ని*' మూడు భాగాలుగా వెలువరించారు. సంజ్ఞా, సంధి పరిచ్ఛేదాలను ప్రథమ భాగంలో పేర్కొన్నారు. విద్యార్థుల ఆదరణతోపాటుగా పండితుల ప్రోత్సాహాన్ని పురస్కరించుకొని ద్వితీయ, తృతీయ భాగాలను కూడా రచించారు. ద్వితీయ భాగంలో తత్సమ, ఆచ్ఛిక, కారక, సమాస, తద్ధిత, క్రియా, కృదంత, ప్రకీర్ణ పరిచ్ఛేదాలు, తృతీయ భాగంలో వ్యాసపరిచ్ఛేదాన్ని పొందుపరిచారు. మొత్తంగా ఈ వ్యాకరణంలో పన్నెండు పరిచ్ఛేదాలు ఉన్నాయి.

## 2.3 '*సులభ వ్యాకరణ*' నిర్మాణ క్రమం

వావిలికొలను సుబ్బారావుగారు రచించిన '*సులభవ్యాకరణము*' అనే గ్రంథాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు బాల, ప్రౌఢ వ్యాకరణాలకు పూరక గ్రంథంగా కన్పిస్తున్నది. ఆ రెండు వ్యాకరణాలలోని విషయాలను గ్రహించి, అవి విడిచి పెట్టిన అంశాలను చేర్చి ఒక నూతన గ్రంథంగా ***సులభ వ్యాకరణాన్ని*** నిర్మించారు. ఆచార్య జి. లలితగారు "బాల ప్రౌఢ వ్యాకరణములకు పూరక గ్రంథమని

---

[5] సులభ. పీఠిక.పుట:70

నుడువకున్నను, ఆ రెంటి యందలి విషయమును గ్రహించి, అవి విడిచిన వానిని చేర్చి నిర్మించిన వ్యాకృతి "సులభ వ్యాకరణము" [6] అని తమ గ్రంథంలో ప్రస్తావించారు.

అమరేశం రాజేశ్వరశర్మగారు తమ సిద్ధాంత గ్రంథం '*ఆంధ్ర వ్యాకరణ వికాసము*' లో '*సులభ వ్యాకరణము*' లోని ప్రాథమిక అంశాలను చర్చిస్తూ "శ్రీ సుబ్బారావుగారు పరిచ్ఛేదముల విభాగముననే కాదు; సూత్ర రచనము నందుఁ గూడా బాలప్రౌఢ వ్యాకరణములను బూర్తిగా నుపయోగించుకొనిరి"[7] అని అన్నారు. వావిలికొలను సుబ్బారావుగారు ఆధునికాంధ్ర వ్యాకరణ నిర్మాతలలో ప్రామాణికులని, *సులభవ్యాకరణము* పైన ఆంగ్లవ్యాకరణ ప్రభావం ఉన్నప్పటికీ చాలా విషయాలలో ప్రామాణికతని సాధించిందని, అతివ్యాప్తి, అవ్యాప్తులు లేకుండా లక్షణ నిర్వచనాలు చెప్పబడ్డాయని[8] అమరేశం రాజేశ్వరశర్మగారు అన్నారు.

వావిలికొలను సుబ్బారావుగారు బాల, ప్రౌఢ వ్యాకరణాల నిర్మాణాన్నే అనుసరించారు. విభాగాలను 'పరిచ్ఛేదాలనే' పిలిచారు. సులభవ్యాకరణంలో సంజ్ఞ, సంధి, తత్సమ, ఆచ్ఛిక, కారక, సమాస, తద్ధిత, క్రియా, కృదంత, ప్రకీర్ణక, వాక్య, వ్యాస పరిచ్ఛేదాలు ఉన్నాయి. ఆయా పరిచ్ఛేదాలకు సంబంధించిన విషయాలు ఇతర పరిచ్ఛేదాలకు వెళ్ళకుండా వావిలికొలనువారు చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. సులభ వ్యాకరణంలో వ్యాకరణాంశాలను సూత్రాలుగా చెప్పేటప్పుడు అవ్యాప్తి, అతివ్యాప్తి దోషాలను వదిలిపెట్టారు. ఒక్కొక్క అంశానికి సంబంధించిన సూత్రాలను ఒకే చోట చెబుతూ ప్రకరణ ఔచిత్యాన్ని పాటించారు. బాల, ప్రౌఢ వ్యాకరణాలలో సూత్రం క్రింద కన్పించే వృత్తి వాక్యాలను కూడా సులభ వ్యాకరణంలో సూత్రంగా చెప్పారు.

'*సులభవ్యాకరణము*' లోని పరిచ్ఛేదాల ఆధారంగా వావిలికొలనువారు అనుసరించిన నిర్మాణ క్రమాన్ని, ఆయా పరిచ్ఛేదాలలోని ప్రాథమిక విషయాలను ఈ క్రింద చర్చిస్తాను.

## 2.3.1 సంజ్ఞాపరిచ్ఛేదం

***'సంజ్ఞా కరణ వ్యవహారార్థం లోకే'*** లోక వ్యవహారం కోసం పేర్లు పెట్టుకున్నట్లే వ్యాకరణ శాస్త్ర వ్యవహారం కోసం కల్పించే పదాలను 'సంజ్ఞలు' లేదా 'పారిభాషిక పదాలు' అంటారు. ప్రతిశాస్త్రం కొన్ని నిర్వచనాలను, సంజ్ఞలను నిర్మించుకోవడం సంప్రదాయం. వ్యాకరణశాస్త్రంలో

---

[6] తెలుఁగు. వ్యా. చరిత్ర: పుట. 181

[7] ఆంధ్ర. వ్యా. వికాసము: పుట. 358

[8] ఆంధ్ర. వ్యా. వికాసము: పుట. 366

సంజ్ఞలను సూత్రరూపంలో, వచన రూపంలో వ్యాకర్తలు వివరించారు. ఇవి సాధారణ సంజ్ఞలు, విశేష సంజ్ఞలు అని రెండు రకాలుగా మనకు కనిపిస్తున్నాయి. అన్ని పరిచ్ఛేదాలకు సంబంధించినవి (అచ్చులు, హల్లులు, పరుషాలు, సరళాలు, స్థిరాలు, తత్సమాలు, తద్భవాలు) సాధారణ సంజ్ఞలు. ఆయా పరిచ్ఛేదాలలో చెప్పబడినవి(సంధి, వికల్పం, విభాష, కారకం, సమాసం, క్రియ) విశేష సంజ్ఞలు.

వావిలికొలను సుబ్బారావుగారు సంజ్ఞాపరిచ్ఛేదాన్ని 78 సూత్రాలలో చెప్పారు. బాలవ్యాకరణంలో 'సంజ్ఞా పరిచ్ఛేదం'లో చెప్పబడిన 23 సూత్రాలలోని అంశాలను వదలకుండా సులభవ్యాకర్త తన వ్యాకరణంలో చెప్పారు. ప్రౌఢవ్యాకరణంలో 'సంజ్ఞా పరిచ్ఛేదం' లో చెప్పబడిన అంశాలను పెద్దగా చర్చించలేదు. బాలవ్యాకరణంలో ఒకే సూత్రంలో చెప్పిన నాలుగు, ఐదు విషయాలని సులభ వ్యాకర్త విడివడిగా సూత్రాలుగా చెప్పారు. సంజ్ఞాపరిచ్ఛేదంలో ప్రధానమైన సంజ్ఞలను ప్రకరణాలుగా విభజించి వివరించారు. అక్షర ప్రకరణం, గుణింత ప్రకరణం, వర్ణ విభాగ ప్రకరణం, అనుస్వార ప్రకరణం, అర్థబిందు నిర్దేశ ప్రకరణం, దంత్య తాలవ్య ప్రకరణం, అంతస్థ ప్రకరణం, సంజ్ఞా ప్రకరణం, కళా ప్రకరణం, ద్రుత ప్రకృతికాలు, ఆంధ్ర భాష విభజన మొదలైన అంశాలు ఉన్నాయి.

### 2.3.1.1 అక్షర ప్రకరణం

తెలుగు భాషకు ప్రారంభదశ నుండి సంస్కృత, ప్రాకృత భాషలతో సన్నిహిత సంబంధమున్నది. అందుకే వావిలికొలనువారు తెలుగు భాషకు మొదటి ఉత్పత్తి స్థానంగా(ఆద్య ప్రకృతి) సంస్కృతాన్ని, రెండవ ఉత్పత్తి స్థానంగా( ద్వితీయ ప్రకృతి) ప్రాకృతాన్ని ఆయా సూత్రాల్లో పేర్కొన్నారు. అనేక పదాలు సంస్కృత– ప్రాకృతాల నుండి తెలుగుభాషలోకి వచ్చాయి. కొన్ని పదాలు స్వతంత్రంగా దేశ్య పదాలుగా తెలుగులో ఉన్నాయి. ఈ దేశ్య పదాలకు సంస్కృత– ప్రాకృత భాషలలో మూలాలు కనిపించవు.

ఏ భాషలోనైనా ప్రాథమికమైనవి వర్ణాలు. అందువల్ల వ్యాకర్తలందరూ దాదాపుగా వర్ణ సమామ్నాయంతో వారి గ్రంథాలను ప్రారంభించారు. తెలుగు భాషలో కన్పిస్తున్న 56 వర్ణాలలో కొన్ని సంస్కృత భాష నుండి గ్రహించినవే. వావిలికొలనువారు సంస్కృత భాషకి యాభై వర్ణాలను, ప్రాకృత

భాషకి నలభై వర్ణాలను, అచ్చ తెలుగు భాషకి ముప్పై ఏడు వర్ణాలను, ఆంధ్ర భాషకి యాభై ఆరు వర్ణాలను ఈ అక్షర ప్రకరణంలో చెప్పారు.

## 2.3.1.2 గుణింత ప్రకరణం

వావిలికొలనువారు 'గుణింతాలు' వంటి సూక్ష్మ విషయాలను కూడా  పిల్లలకు అర్థమయ్యేరీతిలో సులభవ్యాకరణంలో పొందుపరిచారు. తలకట్టులు లేని అక్షరాలను( **ఖ జ ఙ ఞ ఝ ట ణ బ ఱ ల**)  సూత్రంగా చెప్పారు. గుణింత చిహ్నాలను  అన్నిటిని చెప్పి అవి తలకట్టు ఉన్న అక్షరాలలో ఎక్కడ(ఏ స్థానంలో) వస్తాయో వివరించారు. 'ఖ, ఘ' వంటి ఒత్తక్షరాలలో  కింద ఒత్తుగీత ఉన్నట్లు  'ఠ' కారానికి  ఇవ్వకూడదని చెప్పారు.

## 2.3.1.3 వర్ణ విభాగ ప్రకరణం

ఈ ప్రకరణంలో వర్ణాల పేర్లను(సంజ్ఞలను), వాటి ఉత్పత్తి స్థానాలను చెప్పారు. ఆంధ్రభాషలో ప్రవేశించిన తత్సమ, అన్యదేశ్య, అనుకరణ వర్ణాల ప్రస్తావన ఈ ప్రకరణంలో కనిపిస్తుంది.

## 2.3.1.4 అనుస్వార ప్రకరణం

సున్నని 'అనుస్వారం' లేదా 'బిందువు' అని పిలుస్తారని వావిలికొలనువారు చెప్పారు. సున్న అనేది ఎప్పుడూ అచ్చును అనుసరించే పదాలలో వస్తుందని అందుకే దీనికి 'అనుస్వారం' అనే పేరు వచ్చిందని చెప్పారు. వావిలికొలనువారు అనుస్వారం ఎన్ని రకాలుగా ఉంటుందో? ఎక్కడెక్కడ వస్తుందో? వంటి చర్చ ఈ ప్రకరణంలో చర్చించారు. పంక్త్యాదిలో అనుస్వారం, పొల్లుహల్లులు రావని వావిలికొలనువారు సూత్రీకరించారు. అనుస్వారం పూర్ణానుస్వారం, ఖండానుస్వారమని రెండు రకాలని,  పూర్ణానుస్వారం మరలా సిద్ధం, సాధ్యమని  రెండు రకాలుగా ఉంటుందని ఈ ప్రకరణంలో చెప్పారు.

## 2.3.1.5 అర్ధ బిందు నిర్దేశ ప్రకరణం

అర్ధ బిందువు  ఎక్కడెక్కడ వస్తుందో  ఈ ప్రకరణంలో వావిలికొలనువారు వివరించారు. అర్ధ బిందువు వచ్చే సందర్భాలను సులభ వ్యాకరణం వివరించినంత  విపులంగా  ఇతర వ్యాకరణాలు చెప్పలేదు. మహదర్థక బోధక పదాలలో(రాముఁడు, భీముఁడు, మగఁడు, లేఁడు, పోఁడు),

పరిమాణార్థకమైన 'ఎఁడు' వర్ణకం చేరిన రూపాలలో(గోనెఁడు, తూమెఁడు, బానెఁడు), మధ్యమ పురుష బహువచన రూపాలలో(చూడుఁడు, చేయుఁడు), మహత్యర్థక ప్రత్యయమైన 'ఆఁడి' లోని 'డి' అక్షరం ముందు ( వగలాఁడి, వన్నెలాఁడి, మాయలాఁడి), యకారం చివరగా కలిగిన ధాతువులలో కృదంత ప్రత్యయాలు చేరు సందర్భంలో ( అలయు– అలఁత, మూయు – మూఁత) అర్ధబిందువు వస్తుందని సులభవ్యాకర్త ఈ ప్రకరణంలో చర్చించారు.

## 2.3.1.6 దంత తాలవ్య ప్రకరణం

వావిలికొలను సుబ్బారావుగారు దంత్య, తాలవ్య సంజ్ఞలను ఈ ప్రకరణంలో నిర్వచించారు. తాలువు సహాయంతో ఉచ్చరింపబడేవి తాలవ్యాలు. అచ్చతెలుగు మాటలలో 'చ–జ' లు 'ఇ– ఈ– ఎ–ఏ' అనే అచ్చులతో కూడి ఉన్నపుడు (చిలుక – జేజె') తాలవ్యాలవుతాయి. దంతాల సహాయంతో పలుకబడే చజలు అచ్చతెలుగు మాటలలో చకార, జకారాలు 'అ–ఆ–ఉ–ఊ–ఒ–ఓ–ఔ'లతో కూడితే (చందమామ, జౌకు) దంత్యాలవుతాయి.

## 2.3.1.7 అంతస్థ ప్రకరణం

వావిలకొలనువారు అంతస్థాలుకు సంబంధించిన చర్చ ఈ ప్రకరణంలో చేశారు. 'య–ర–ల–వ' అనే అక్షరాలను అంతస్థాలు అంటారని, ఇవి లఘువులు, అలఘువులని రెండు రకాలని చెప్పారు. ఏ వర్ణాన్ని ఉచ్చరించేటప్పుడు నాలుక శిథిలంగా (సడలు– వదులుగా) అవుతుందో ఆవర్ణం లఘువు. అటువంటి శైథిల్యం లేక సాధారణంగా ఉచ్చరించబడితే ఆవర్ణం అలఘువు. వావిలికొలనువారు 'య–ర–ల–వ'లు ఏ సందర్భంలో లఘువులు, అలఘువులు అవుతాయో నిర్దేశించడంతోపాటుగా 'యె' అనే అక్షరం సంధి వల్ల కాకుండా పదాల మధ్య ఎక్కడెక్కడ వస్తుందో రెండు సూత్రాలలో ఈ ప్రకరణంలో వివరించారు.

## 2.3.1.8 సంజ్ఞా ప్రకరణం

వావిలికొలనువారు ఈ ప్రకరణంలో సంజ్ఞలన్నిటిని కలిపి సూత్రాలుగా చెప్పారు. నామం, వర్ణకం, క్రియ, ద్రుతం, లోపం, ద్విత్వం, సంశ్లేష, పరుషాలు, సరళాలు, వర్గయుక్కులు, స్పర్శాలు, స్థిరాలు, అంతస్థాలు, ఊష్మాలు, ఆగమం, ఆదేశం, విభాష, పదం మొదలైన సంజ్ఞలను

నిర్వచించారు. వావిలికొలనువారు ఆంధ్రశబ్ద చింతామణిని అనుసరించి సాధారణ సంజ్ఞలను, విశేష సంజ్ఞలను కొన్నింటిని సూత్రాలుగా సంజ్ఞా పరిచ్ఛేదంలోనే పేర్కొన్నారు. "అనుస్వారము సున్న" (సులభ.సంజ్ఞ:18), "ప్రాతిపదికము నామము"(సులభ. సంజ్ఞ:50), "ప్రత్యయము వర్ణకము" (సులభ. సంజ్ఞ:51). "ధాతువు క్రియ" (సులభ. సంజ్ఞ:52) మొదలైనవి.

### 2.3.1.9 కళా ప్రకరణం

తెలుగు శబ్దాలు కళలని ద్రుతప్రకృతికాలని రెండు రకాలుగా ఉంటాయని వావిలికొలనువారు చెప్పారు. ద్రుతం అంతంగా లేని శబ్దాలు కళలని, ద్రుతం అంతంగా కలిగిన పదాలు ద్రుతప్రకృతికాలని నిర్వచించారు. ఇవి ఎక్కడెక్కడ కన్పిస్తాయో సులభవ్యాకర్త ఈ ప్రకరణంలో చర్చించారు.

### 2.3.1.10 ఆంధ్ర భాష: విభజన

తెలుగు మాట్లాడు ప్రజలు నివసించే దేశానికే ఆంధ్రదేశమని పేరు. ఆ ప్రదేశంలో ప్రజలు మాట్లాడే భాష ఆంధ్ర భాషయని వావిలికొలనువారు నిర్వచించారు. పూర్వ లాక్షణికులు చెప్పినట్లుగానే ఆంధ్ర భాషా పదాలను తద్భవాలు, తత్సమాలు, దేశ్యాలు, గ్రామ్యాలని నాలుగు రకాలుగా వర్గీకరించారు. దేశ్యాలను నిర్వచించేటప్పుడు అన్యదేశ్యాలను నిర్వచించారు.

### 2.3.2 సంధి పరిచ్ఛేదం

వావిలికొలను సుబ్బారావుగారు 'సంధి పరిచ్ఛేదం'లో తెలుగు సంధులకు సంబంధించి 90 సూత్రాలు, సంస్కృత సంధులకు సంబంధించి 30 సూత్రాలను పేర్కొన్నారు. బాల, ప్రౌఢ వ్యాకరణాలలోని కొన్ని అంశాలను సులభవ్యాకర్త చర్చించారు. బాలవ్యాకరణంలో ప్రకీర్ణక పరిచ్ఛేదంలో చెప్పిన కొన్ని సూత్రాలను సందర్భోచితంగా సులభవ్యాకర్త 'సంధి పరిచ్ఛేదం'లో వివరించారు. అచ్సంధులను అకారాది క్రమంలో సూత్రీకరించారు. కొన్ని విశేష సంజ్ఞలను సూత్రాలుగా చెప్పారు. ఈ సంధి పరిచ్ఛేదంలో అచ్సంధి ప్రకరణం, స్వరలోప ప్రకరణం, కళాసంధి ప్రకరణం, ద్రుతసంధి ప్రకరణం, సమాసగత పద సంధి ప్రకరణం, నుగాగమ ప్రకరణం, తుగాగమ

ప్రకరణం, ఆమ్రేడిత ప్రకరణం, మువర్ణక ప్రకరణం, ధ్వన్యనుకరణ ప్రకరణం, సంస్కృత శబ్ద ప్రయోగ ప్రకరణం, సంస్కృత శబ్ద సంధి ప్రకరణం మొదలైనవి ఉన్నాయి.

## 2.3.2.1 అచ్సంధి ప్రకరణం

అచ్చులకు సంబంధించిన సంధులను 'అచ్సంధులు' అంటారు. అవి అత్వసంధి, ఇత్వ సంధి, ఉత్వ సంధి మొదలైనవి. వావిలికొలనువారు బాలవ్యాకరణంలో చెప్పినట్లు ఉత్వ సంధి కాకుండా అత్వసంధినే మొదటగా చెప్పారు. వావిలికొలను సుబ్బారావుగారు 'సంధి' లక్షణాన్ని చిన్నయసూరిగారు చెప్పిన నిర్వచనాన్నే స్వీకరించి "పూర్వపరస్వరంబులకుం బరస్వరం బేకాదేశంబగుట సంధి"(సులభ. సంధి:1) అని సంధి గురించి సూత్రీకరించారు. వావిలికొలనువారు అచ్చుకు అచ్చు పరమైనప్పుడే సంధి అవుతుందని చెప్పారు. ఈ సూత్ర వివరణలో వావిలికొలనువారు తెలుగుభాషలో 'అ–ఇ–ఉ' అనే మూడచ్చుల మీద అచ్చులు వచ్చినప్పుడే మాత్రమే సంధి వస్తుంది తప్ప మిగిలిన అచ్చుల మీద అచ్చులు వచ్చిన సంధి జరగదని సులభవ్యాకర్త చెప్పారు. అచ్సంధులకు సంబంధించిన విషయాలను వావిలికొలనువారు ఈ ప్రకరణంలో చర్చించారు.

## 2.3.2.2 స్వరలోప ప్రకరణం

సులభవ్యాకర్త సంధి జరిగేటప్పుడు స్వరం లోపించే రూపాలను ఈ ప్రకరణంలో చర్చించారు. హల్లు పరమైనప్పుడు 'ఏని' లోని ఇకారానికి లోపం వికల్పంగా వస్తుందని సులభవ్యాకర్త చెప్పారు. 'వచ్చెనేని చూచెద' వంటి రూపాలలో ఇకారం లోపించగా 'వచ్చెనేన్ జూచెద– వచ్చె జూచెద' అవుతుంది. ఏ శబ్దాలకైన 'అది–అవి' శబ్దాలు పరమై సమాసాలుగా ఏర్పడ్డప్పుడు అది, అవి లోని మొదటి అకారం బహుళంగా లోపిస్తుందని సులభవ్యాకర్త చెప్పారు. ఇలా సంధి జరిగేటప్పుడు స్వరం లోపించే రూపాలను ఒకచోట చేర్చి ఈ ప్రకరణంలో చర్చించారు.

## 2.3.2.3 కళాసంధి ప్రకరణం

వావిలికొలనువారు ఈ ప్రకరణంలో కళలకు హల్లు పరమైనప్పుడు జరిగే మార్పులు వివరించారు. ప్రథమల మీద పరుషాలకు 'గ–స–డ–ద–వ' లు బహుళంగా వస్తాయని, తెలుగు

శబ్దాలకు పరమైన తత్సమ శబ్దాలలోని 'క-చ-ట-త-ప' లకు 'గ- స- డ-ద-వ' లు రావని సులభవ్యాకర్త ఈ ప్రకరణంలో చర్చించారు.

## 2.3.2.4 ద్రుతసంధి ప్రకరణం

వావిలికొలనువారు ద్రుతం పరమైనపుడు కలిగే సంధి కార్యాలను ఈ ప్రకరణంలో చర్చించారు. ద్రుతప్రకృతాలకు అచ్చు పరమమైనప్పుడు లోపం గాని, సంశ్లేష గాని చెప్పకూడదని, ఒకవేళ పూర్వ కవుల ప్రయోగాలలో అటువంటి రూపాలు కన్పించినా వాటిని అనుసరించరాదని వావిలికొలనువారు ఈ ప్రకరణంలో మొదటి సూత్రంలో చెప్పారు. వావిలికొలనువారు 'ద్రుత ప్రకృతికం' తరువాత ఉన్న పరుషాలకు సరళాలు ఆదేశంగా వస్తాయని, ఆదేశ సరళాల ముందున్న ద్రుతానికి బిందువు, సంశ్లేషలు వికల్పంగా వస్తాయని చెప్పారు.

## 2.3.2.5. సమాసగత పదసంధి ప్రకరణం

వేర్వేరు అర్థాలు గల రెండు శబ్దాలు కలిసి ఒకే అర్థాన్నిచ్చేలాగా ఒక పదంగా ఏర్పడిన 'సమాసమని' వావిలికొలనువారు నిర్వచించారు. విభక్తి మొదలగు పదాలను విడిచిపెట్టి సంగ్రహించి చెప్పిన సమాసమని ప్రస్తావించారు. సమాసంలో ద్రుతానికి లోపం వస్తుందని చెప్పారు. ద్వంద్వ సమాసంలో మొదటి పదం తరువాత ఉన్న పదంలో పరుషాక్షరాలు ఉంటే వాటి స్థానంలో 'గ-స-డ-ద-వ'లు వస్తాయని 'తల్లిదండ్రి, కాలుసేతులు' వంటి రూపాలను ఉదాహరణలుగా చెప్పారు. ద్విరుక్తటకారసంధికి సంబంధించిన విషయాలను, కర్మధారయ సమాసంలో 'ము' వర్ణానికి 'పు-ంపు' వస్తాయని వావలికొలనువారు ఈ ప్రకరణంలో చర్చించారు.

## 2.3.2.6 నుగాగమ ప్రకరణం

వావిలికొలను సుబ్బారావుగారు ఈ ప్రకరణంలో సమాసాలలో 'ను' ఆగమం ఏయే సందర్భాలలో వస్తుందో చెప్పారు. సమాసాలలో ఉదంత స్త్రీ సమాలకు, 'పు-ంపు' వర్ణాలకు పరుషాక్షరాలుగాని, సరళాక్షరాలుగాని పరమైతే 'ను' వర్ణం వస్తుందని ' మంచు+ ను+ కొండ = మంచును గొండ, మంచు గొండ' వంటి రూపాలను సులభవ్యాకర్త పేర్కొన్నారు. ఉదంత తద్ధర్మార్థ విశేషణానికి అచ్చు పరమైనపుడు 'ను' ఆగమంగా వస్తుందని చెప్పారు.

### 2.3.2.7 టుగాగమ ప్రకరణం

కర్మధారయ సమాసంలో టు' వర్ణం ఆగమం ఎన్ని సందర్భాలలో వస్తుందో సులభవ్యాకర్త ఈ ప్రకరణంలో చర్చించారు. కర్మధారయ సమాసాలలో ఉకారాంత పదాలపైన అచ్చు పరమైనపుడు 'టు' వర్ణం ఆగమంగా వస్తుందని 'కఱకుటమ్ము. వేలుపుటావు' వంటి రూపాలను చెప్పారు. 'పేరు' మొదలైన శబ్దాలకు 'టు' ఆగమాన్ని వికల్పంగా చెప్పారు. కొన్ని శబ్దాలలో ఉకారం అంతంగా లేకపోయినప్పటికీ 'టు' వర్ణం ఆగమంగా వస్తుందని 'దుక్కిటెద్దు, తేనెటీగ, పల్లెటూరు' వంటి రూపాలను సులభవ్యాకర్త చెప్పారు.

### 2.3.2.8 ఆమ్రేడిత ప్రకరణం

అచ్చు మొదటగల ఆమ్రేడితానికి పూర్వపదంతో సంధి కలగడం ఆమ్రేడిత సంధి అని సులభవ్యాకర్త చెప్పారు. ఆమ్రేడిత రూపాలకి సంబంధించిన విషయాలను ఈ ప్రకరణంలో చెప్పారు. ఆమ్రేడితం పరమైనప్పుడు విభక్తికి లోపం బహుళంగా వస్తుందని, ఆమ్రేడితం పరమైనపుడు కృత హ్రస్వానికి దీర్ఘం వస్తుందని మొదలైన విషయాలను సులభవ్యాకర్త ఈ ప్రకరణంలో చెప్పారు.

### 2.3.2.9 మువర్ణక ప్రకరణం

సంధి కార్యాలు జరిగేటప్పుడు 'ము' వర్ణం ప్రవర్తిల్లే తీరు ఈ ప్రకరణంలో సులభవ్యాకర్త చర్చించారు. 'పడు- పఱచు- పట్టి' శబ్దాలకు ప్రథమావిభక్తి ప్రత్యయమైన 'ము' వర్ణం పరమైనప్పుడు, ఆ ముపర్ణానికి లోపం, కొన్నిసార్లు నిండు సున్నా వికల్పంగా వస్తుందని 'శ్రమంపడు- శ్రమపడు- శ్రమముపడు' వంటి రూపాలను ఉదాహరణలుగా చర్చించారు. ఆమ్రేడితం పరమైనపుడు మధ్యమపురుష 'ము' వికల్పంగా లోపిస్తుందని సులభవ్యాకర్త చెప్పారు.

### 2.3.2.10 ధ్వన్యనుకరుణ ప్రకరణం

సంధి కార్యాలు జరిగేటప్పుడు ధ్వన్యనుకరణ శబ్దాలు ప్రవర్తిల్లే తీరును ఈ ప్రకరణంలో సులభవ్యాకర్త చర్చించారు. ధ్వన్యనుకరణ శబ్దాలు రెండు, మూడు, నాలుగు సార్లయిన చెప్పవచ్చునని 'గడ గడ, తళతళ, ఘల్లురు ఘల్లు ఘల్లురని ఘల్లని' వంటి ఉదాహరణలను సులభ

వ్యాకర్త పేర్కొన్నారు. ధ్వన్యనుకరణ శబ్దాలకు 'అను' ధాతువు అనుసరించి వచ్చేటప్పుడు కొన్నిసార్లు ముపర్ణం ఆగమంగా వస్తుందని 'సలసలమని' వంటి రూపాలను సులభవ్యాకర్త ఉదాహరించారు.

## 2.3.2.11 సంస్కృత శబ్ద ప్రయోగ ప్రకరణం

ఈ ప్రకరణంలో అనుకరణ సంధులలో జరిగే మార్పులను సులభవ్యాకర్త చర్చించారు. సంస్కృత భాషలో ఉండే సుబంతాలు, తిజంతాలు, క్త్వాంతాలు, తుమున్నంతాలు మొదలైన శబ్దాలు ఆంధ్రభాషలో యథాతథంగా ప్రయోగించ కూడదని, 'వాడురాముడు' అనడానికి బదులుగా 'వాడు రామః' అనరాదని సులభ వ్యాకర్త ఈ ప్రకరణంలో చర్చించారు. సదా, సర్వత్రా, నహి, నాస్తి, స్వస్తి ఈ శబ్దాలకు తెలుగు భాషలో స్వతంత్ర ప్రయోగం కనిపిస్తుంది. 'యథా యధము' అనే సంస్కృత అవ్యయాలు తెలుగులో 'యథాయధలు' అని, 'వృథా' అనేది 'వృథ, వృథలు' అని ప్రయోగాలలో కనబడుతున్నాయని సులభవ్యాకర్త పేర్కొన్నారు.

## 2.3.2.12 సంస్కృత శబ్ద సంధి ప్రకరణం

సంస్కృత శబ్దం సంస్కృత శబ్దంతో కలిసి సంధి ఏర్పడే విధానం ఈ ప్రకరణంలో వావిలికొలనువారు చెప్పారు. తెలుగు, సంస్కృత భాషలు వేరు వేరు కాబట్టి వాటి సంప్రదాయాలు వేరుగా ఉన్నాయి. తెలుగు వ్యాకరణాల్లో వావిలికొలనువారి కంటే ముందు ఎవ్వరూ సంస్కృత సంధులను ప్రస్తావించకపోవడంతో వాటిలో కొన్నింటిని అయినా తమ వ్యాకరణంలో ప్రస్తావిస్తే విద్యార్థులు రాసే వ్యాసాలలో దోషాలను తెలుసుకుంటారని భావించి వావిలికొలనువారు *'సులభవ్యాకరణము'* లో 'సంస్కృత సంధులను' కూడా చేర్చి ఉంటారు.

వావిలికొలనువారు మాహేశ్వర సూత్రాలను అనుసరించి ప్రత్యాహారాల ద్వారా అచ్చుల, హల్లుల విభజన చేసారు. గుణాలు, వృద్ధులు వంటి సంజ్ఞలను సూత్ర రూపంలో నిర్వచించారు. సంధులను అచ్సంధులు, హల్సంధులు అని రెండు రకాలుగా విభజించి కొన్ని ప్రధానమైన సంధులను సూత్రరూపంలో చెప్పారు.

## 2.3.3 తత్సమ పరిచ్ఛేదం

అజంతాలు, హలంతాలైన సంస్కృత పదాలు తెలుగులో ఉపయోగించినప్పుడు ఆ సంస్కృత ప్రాతిపదికలను తెలుగు పదాలుగా మార్చే విధానం ఇందులో ఉంటుంది. సులభ వ్యాకర్త తత్సమ పరిచ్ఛేదంలో మొదట ఎనిమిది సూత్రాలలో నామ విభక్తి ప్రత్యయాలను పేర్కొన్నాడు. తరువాత ఆ విభక్తులు ఏకవచనంలో ఏవేవి వస్తాయో, బహువచనంలో ఏవేవి వస్తాయో పేర్కొన్నారు. ఈ పరిచ్ఛేదంలో మొత్తం103 సూత్రాలు ఉన్నాయి.

'ంఁడు' మొదలైన వాటికే వర్ణకాలని, ప్రత్యయాలని పిలుస్తారని సులభవ్యాకర్త చెప్పారు. ఒక శబ్దానికి ఆయావిభక్తియందు రూపం చెప్పాలనుకున్నపుడు ఆయా విభక్తికి ఎదురుగ ఉండే ప్రత్యయాలలో ఒకటి చేర్చాలి. ఉదాహరణకు 'రామ'శబ్దానికి తృతీయావిభక్తి రూపం 'రాము చేత-రాము చే-రాముతోడ-రాముతోనని చెప్పాలి. వావిలికొలనువారు శబ్దాలను మహదర్థకాలు, అమహదార్థకాలు, మహత్యర్థకాలు, మహన్మహదర్థకాలు, అవ్యయాలు అని ఐదు రకాలుగా విభజించి సంజ్ఞలను నిర్వచించారు.

### 2.3.3.1 అజంత ప్రకరణం

సులభవ్యాకర్త ఈ ప్రకరణంలో సంస్కృత అజంత శబ్దాలు తెలుగులో తత్సమ రూపాలను పొందే విధానాన్ని వివరించారు. సులభవ్యాకర్త అకారాంత శబ్దాలు, ఆకారాంత శబ్దాలు, ఇకారాంత శబ్దాలు, ఉకారంత శబ్దాలు, ఐ-ఔ కారాంత శబ్దాలు సంస్కృతం నుంచి తెలుగులో మారేటప్పుడు ఎటువంటి కార్యాలు జరుగుతాయో చర్చించారు.

సులభవ్యాకర్త"అకారాంత పుంలింగ మహద్వాచకంబునకు డుజగు" (సులభ. తత్సమ:18) అని సూత్రీకరించి అకారం గాని, ఆకారంగాని చివర గల పుంలింగ మహద్వాచకాలకి బిందు పూర్వక డువర్ణకం వస్తుందని చెప్పారు. 'డుజ్' ప్రత్యయం వచ్చేటప్పుడు పుంలింగ మహద్వాచకమైన ప్రాతిపదిక చివర అత్వానికి, ఉత్వం వచ్చి 'రాముడు' వంటి రూపాలు ఏర్పడతాయని సులభవ్యాకర్త చెప్పారు.

ప్రథమా ఏకవచన ప్రత్యయాలైన 'డు-ము-వు-లు' ఇకారం చివరగల శబ్దాలకు రావని ఉదాహరణగా 'హరి, మతి' వంటి రూపాలను సులభవ్యాకర్త పేర్కొన్నారు. అన్ని లింగాలలోని శబ్దాలు, ఉకారం అంతంగా కలిగి ఉంటే 'వు' ప్రత్యయం వస్తుందని ఉదాహరణగా 'తరు- తరువు', గురు- గురువు' వంటి రూపాలను సులభవ్యాకర్త పేర్కొన్నారు

సులభవ్యాకర్త ఔకారాంత స్త్రీలింగ శబ్దమైన 'నౌ 'శబ్దానికి నావ అవుతుందని, 'నౌ' శబ్దానికి స్త్రీలింగ కార్యాలు జరగకుండా 'నావ' గా నిపతించబడిందని చెప్పారు. అలాగే 'రై' శబ్దం 'రోలు'గా నిపతించబడిందని చెప్పారు.

'కుశ' మొదలైన శబ్దాలకు 'ము' లోపం, 'ధర్మ' మొదలైన శబ్దాలకు 'వు' ఆగమం, 'మిత్ర' మొదలైన శబ్దాలకు వికల్పంగా పుంలింగత్వం, ఋకారంత శబ్దాలు అకారంతాలుగా మారి స్త్రీసమాలు అవ్వటం, సంబోధ్యవాచకానికి ముందు 'ఓ' వికల్పంగా రావడం, 'అసుర' శబ్దం వికల్పంగా స్త్రీసమం అవ్వటం మొదలైన కార్యాలను ఈ అజంత ప్రకరణంలో సులభవ్యకార్త చర్చించారు.

## 2.3.3.2 హలంత ప్రకరణం

సులభవ్యాకర్త ఈ ప్రకరణంలో 'హల్లు' అంతంగా ఉండే సంస్కృత శబ్దాలు తెలుగులో తత్సమరూపాలను పొందే విధానాన్ని చర్చించారు. "ప్రాతిపదికంబు సంస్కృత ప్రథమైకవచన తుల్యంబు" (సులభ.తత్సమ:77) అని సూత్రీకరించి హలంతాలైన సంస్కృత శబ్దాల ప్రథమా ఏకవచన రూపాలే ప్రాతిపదికలుగా తెలుగులో గ్రహించబడతాయని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'దృక్- ప్రేమన్'.

సులభవ్యాకర్త హ్రస్వం తరువాత ఉన్న హల్లులకు ఉత్వం, ద్విత్వం నిత్యంగా వస్తాయని, దీర్ఘం పూర్వం గల హల్లులకు ద్విత్వం బహుళంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'దిక్- దిక్కు', వాక్- వాకు- వాక్కు'. జగత్తు, ఇంద్రజిత్తు వంటి శబ్దాలలో ఉండే 'త' కారానికి లోపం వికల్పంగా వస్తుందని 'జగత్- జగము- జగత్తు', ఇంద్రజిత్- ఇంద్రజి- ఇంద్రజిత్తు' వంటి రూపాలను సులభవ్యాకర్త చెప్పారు.

'పయస్' మొదలైన శబ్దాలలో ఉండే 'స' కారానికి  ఉత్వం, ద్విత్వం రెండు నిత్యంగా వస్తాయని,'మనస్' మొదలైన శబ్దాలలో ఉండే 'స' కారానికి వికల్పంగా ద్విత్వం వస్తుందని సులభవ్యాకర్త చెప్పారు.

## 2.3.4 ఆచ్ఛిక పరిచ్ఛేదం

సంస్కృత సమాలు కాకుండా సంస్కృత భవాలు, ప్రాకృత సమాలు, ప్రాకృత భవాలు, దేశ్యాలు అయిన పదాలను 'ఆచ్ఛికాలు' లేదా 'అచ్చ తెలుగు' పదాలు అంటారు. వీటి రూప నిష్పాదన సులభవ్యాకర్త ఈ పరిచ్ఛేదంలో చర్చించారు. సులభవ్యాకర్త 'ఆచ్ఛికం' అంటే 'అచ్చ తెలుగు' అని చెప్పారు. దేశ్యము, తద్భవం కలిసినది ఆచ్చికమని చెప్పారు. ఏకాది గణాలలో చేరిన 'ఒక్కదు- వాడు- వీడు- మగడు' మొదలైన శబ్దాలు కాకుండా మిగిలిన అచ్చతెలుగు శబ్దాలన్ని స్త్రీ సమాలు గానీ, క్లీబ సమాలు గానీ అవుతాయని సులభవ్యాకర్త చెప్పారు. ఈ ఆచ్ఛిక పరిచ్ఛేదంలో మొత్తం 71 సూత్రాలు ఉన్నాయి.

### 2.3.4.1 ఏకవచన రూపములు

సులభవ్యాకర్త 'ఆచ్ఛికపరిచ్ఛేదం' లో మొదటగా 'డు-ము-వు' లు అనే ప్రత్యయాలను ఏకవచన రూపాలకు విధించారు. సులభవ్యాకర్త "అక్కజాదులు సంస్కృత తుల్యంబులు" (సులభ.ఆచ్ఛిక:2) అని సూత్రీకరించి 'అక్కజ' మొదలైన తెలుగు ప్రాతిపదికలకు విభక్తిని వివక్షించేటపుడు, వాటిని సంస్కృత ప్రాతిపదికలతో సమానంగా గ్రహించి వ్యాకరణ కార్యాలు చేయాలని చెప్పారు. ఉదాహరణకు 'అక్కజ- అక్కజుడు- అక్కజము'.

సులభవ్యాకర్త మహద్వాచకాలైన మగాదులకు, అమహద్వాచకాలైన కయిరాదులకు 'దుక్' వస్తుందని, ఉత్వం రాదని చెప్పారు. 'బిడ్డ' మొదలైన శబ్దాలకు 'దుక్' వికల్పంగా, 'నెట్టన' మొదలైన శబ్దాలు స్త్రీ సమాలుగా, క్లీబ సమాలుగా ఉంటాయని, అకర్వాదులకు 'వు' లోపం వికల్పం వస్తుందని మొదలైన విషయాలను చెప్పారు.

### 2.3.4.2 బహువచన రూపములు

సులభవ్యాకర్త బహువచనంలో ఆచ్ఛిక పదాలు ఎలాంటి వ్యాకరణ కార్యాలు జరుగుతాయో చెప్పారు. 'పగత' మొదలైన ఆచ్ఛిక నామాలకి బహువచనం విధించేటప్పుడు లకారానికి బదులుగా రేఫ వస్తుందని 'పగతుడు– పగతురు' వంటి రూపాలను సులభవ్యాకర్త చెప్పారు.

సులభవ్యాకర్త 'ఆలు' మొదలైన శబ్దాల బహువచనలకారానికి రేఫ, దానికి ముందున్న లువర్ణానికి పూర్ణబిందువుతో కూడిన డకారం వస్తుందని, 'ఠే' మొదలైన శబ్దాలలోని బహువచన ప్రత్యయానికి ముందు 'డుజ్' అనే ప్రత్యయం ఆగమంగా వస్తుందని, బహువచన ప్రత్యయం పరమవుతున్నపుడు ప్రత్యయానికి ముందుండే ప్రాతిపదిక చివరగల డ ల ట ర – అనే వర్ణాలపై ఉండే ఉత్వానికి బహుళంగా లోపం వస్తుందని మొదలైన విషయాలను చర్చించారు.

### 2.3.4.3 సర్వనామ ప్రకరణం

సులభవ్యాకర్త సర్వనామాలను పేర్కొంటూ ఆ– ఈ– ఏ — అన్ని– ఇన్ని — ఎన్ని — కొన్ని– అంత– ఇంత– ఎంత — కొంత –నా– నీ– మన–తా– ఒకటి, రెండు మొదలైన సంఖ్యావాచకాలు సర్వనామాలు అని చెప్పారు. సులభవ్యాకర్త 'అన్ని' వంటి సర్వనామ శబ్దాలలో సంఖ్యార్థాన్ని తెలిపేది వాస్తవంగా 'న్ని' మాత్రమేనని ఉచ్చారణ సౌలభ్యం కోసం 'అ' చేర్చబడి 'అన్ని' అయిందని చెప్పారు. అనునాసిక అక్షరాలు అనుస్వారంగా మారడం తెలుగులో ఉన్నది కాబట్టి 'త' పరమైనపుడు 'న్ని' పూర్ణబిందువుగా మారి 'అంత' అవుతుందని చెప్పారు. 'అంత' అనేది ఇతర అచ్చులకు పరమైనపుడు ఉచ్చారణ సౌలభ్యం కోసం వచ్చిన 'అ' అనేది లోపిస్తుంది. ఉదాహరణకు 'ఆ+అంత= ఆ+ంత=అంత', ఈ+అంత= ఈ+ంత=ఇంత' మొదలైనవి. సులభవ్యాకర్త సర్వనామాలకు సంబంధించిన విషయాలను 28 సూత్రాలలో చెప్పారు.

### 2.3.4.4 ఔపవిభక్తిక ప్రకరణం

సులభవ్యాకర్త ఉప విభక్తులను గురించి తెలుపు ప్రకరణం ఔపవిభక్తిక ప్రకరణమని చెప్పారు. కొన్ని నామాలకు ఏకవచనంలో విభక్తుల ముందు చేరేవాటిని ఉపవిభక్తికాలు అంటారని

సులభవ్యాకర్త నిర్వచించారు. అవి 'ఇ–టి–ంటి–తి' వర్ణకాలు. ఉదాహరణకు ' కూదు+ కుండ = కూటికుండ. కాలు+ ఇ + చేత= కాలిచేత.

సులభవ్యాకర్త హ్రస్వాక్షరంమీద ఆదేశంగాగాని, ఆగమంగాగాని వచ్చే ఔపవిభక్తిక 'టి' వర్ణానికి ముందు నిండుసున్న బహుళంగా వస్తుందని 'అన్నిటికి–అన్నింటికి, వేయిటికి– వేయింటికి' వంటి రూపాలను పేర్కొన్నారు.

పదం యొక్క మొదటి అక్షరం హ్రస్వంగా ఉండి, ఆ పదానికి ఔపవిభక్తిక ప్రత్యయం 'టి' ఆగమంగాకాని, ఆదేశంగాని వస్తే దానికి ముందు నిండు సున్నా వస్తుందని సులభవ్యాకర్త చెప్పారు. విభక్తి ప్రత్యయాలు పరమైనపుడు 'గోయి' మొదలైన శబ్దాలలో చివర ఉండే 'యి' మొదలైన అక్షరాలు 'తి' మారుతాయని సులభవ్యాకర్త చెప్పారు.

## 2.3.5 కారక పరిచ్ఛేదం

సులభవ్యాకర్త "వాక్యంబునఁ గర్తకుఁ గ్రియకుఁ గల యన్వయ సంబంధమును దెలుపునది కారకము. ఇది కర్త–కర్మము–కరణము–సంప్రదానము–అపాదానము–అధికరణము అని యాఱు విధములు" (సులభ. కారక:1) అని కారకాన్ని నిర్వచించారు. వాక్యంలో కర్తకు క్రియకు గల అన్వయ సంబంధాన్ని తెల్పేది కారకం. ఇది కర్త, కర్మ, కరణ, సంప్రదాన, అపాదాన, అధికరణం అని ఆరు రకాలు. ఈ కారక పరిచ్ఛేదంలో 43 సూత్రాలున్నాయి.

సులభవ్యాకర్త ఏయే అర్థాలలో ఏయే విభక్తులు వస్తాయో ఈ పరిచ్ఛేదంలో చెప్పారు. "ప్రాతిపదికార్థ, పరిమాణ, సంబోధ, నోక్తార్థంబులం బ్రథమయగు" (సులభ.కారక:2) అని సూత్రీకరించి ప్రాతిపదికర్థంలో, పరిమాణార్థకంలో, సంబోధనార్థంలో, ఉక్తార్థంలో ప్రథమా విభక్తి ప్రత్యయం వస్తుందని చెప్పారు. ప్రాతిపదికర్థకానికి ఉదాహరణ 'కృష్ణుడు, పరిమాణార్థకానికి ఉదాహరణ 'చెట్లకు నీళ్ళు రెండు కడవలు పోయుము'. ఇందులో రెండు కడవల కొలత గల నీళ్ళని అర్థం. కాబట్టి 'కడవలు' అనే పదం ప్రథమావిభక్తిలో ఉన్నది.

సులభవ్యాకర్త కర్మార్థంలో ద్వితీయా విభక్తి వస్తుందని 'సజ్జనుని శుభములు పొందును' వంటి ఉదాహరణని ఇచ్చారు. కర్మార్థంలో ఉద్దేశార్థక ద్వితీయకు 'గూర్చి, గుఱచి, గుఱించి' వంటి ప్రత్యయాలు వస్తాయని సులభవ్యాకర్త చెప్పారు.

సులభవ్యాకర్త 'చేత' అనే తృతీయా విభక్తి ప్రత్యయం కర్తృర్థకంలో, కరణార్థకంలో, హేత్వర్థకంలో, ప్రకృతార్థకంలో, గోత్రార్థకంలో, గ్రహ్యాదులకు వస్తుందని, సంప్రదానార్థంలో చతుర్థీ ప్రత్యయమైన 'కొఱకు' ప్రత్యయం, షష్ఠి విభక్తి ప్రత్యయమైన 'కు' వస్తుందని, సంబంధం తెలుపు అర్థంలో షష్ఠి విభక్తి ప్రత్యయాలైన 'యొక్క-కు' వస్తాయని, అధికరణార్థంలో, దూరార్థంలో, సమీపార్థంలో సప్తమీ విభక్తి ప్రత్యయాలైన 'అందు- న' వస్తాయని మొదలైన విషయాలను చర్చించారు.

## 2.3.6 సమాస పరిచ్ఛేదం

సులభవ్యాకర్త సమాస నిర్మాణం గురించి చాలా విపులంగా చర్చించారు. సంస్కృతంలో చెప్పబడిన సమాస ఉప విభాగాలను కూడా పేర్కొన్నారు. రెండుగాని, అంతకంటే ఎక్కువగాని పదాలు కలిసి ఏకపదంగా ఏర్పడితే దానిని 'సమాసం' అంటారని సులభవ్యాకర్త నిర్వచించారు. ఒకే పదం కావడం అంటే అర్థంలోను, శబ్దంలోను సమ్మేళనం చెందడం. అప్పుడు వేర్వేరు శబ్దాల అర్థాలు కలిసిపోయి ఒకే అర్థాన్ని అవి బోధిస్తాయి. పదాల మధ్య ఉన్న విభక్తి ప్రత్యయాలు లోపించి సంగ్రహ రూపాన్ని పొందుతాయి. ఈ సమాస పరిచ్ఛేదంలో 70 సూత్రాలు ఉన్నాయి.

"ప్రసిద్ధముగ వేఱువేఱగు నర్థంబులు గల పదంబు లేకపదం బగుట సమాసంబు" (సులభ.సమాస:1). అని సమాస లక్షణాన్ని వావిలికొలను వారు నిర్వచించారు. ఆయన దృష్టిలో ప్రసిద్ధమైన పదాలు కలిసి ఒక పదంగా ఏర్పడటం సమాసమని అర్థమవుతుంది.

భాషా భేదం చేత సమాసం మూడు రకాలని సులభవ్యాకర్త చెప్పారు. అవి సాంస్కృతికం, ఆచ్ఛికం, మిశ్రమం. సాంస్కృతికం మళ్ళీ సిద్ధము, సాధ్యము అని రెండు రకాలు. కేవల సంస్కృత శబ్దాలతో సంస్కృత వ్యాకరణానుసారంగా సమాసం ఏర్పడి తెలుగు విభక్తిని స్వీకరించేది సిద్ధ సాంస్కృతికం. సంస్కృత శబ్దాలు తెలుగులో తత్సమాలుగా ప్రవేశించిన తరువాత ఆ తత్సమాలకు తెలుగు వ్యాకరణాను సారంగా సమాసం ఏర్పడితే సాధ్య సాంస్కృతికం.

విభక్తి లోపం వల్ల సమాసం రెండు విధాలని సులభవ్యాకర్త చెప్పారు. విభక్తి లోపిస్తే 'లుక్సమాసమని, విభక్తి లోపించకపోతే 'అలుక్సమాసమని అంటారు. అర్థ భేదం చేత సమాసం

నాలుగు రకాలని అవి 1. ద్వంద్వము 2. తత్పురుష 3. బహువ్రీహి 4. అవ్యయీ భావం మొదలైనవాటిని సులభవ్యాకర్త వివరించారు.

ద్వంద్వ సమాసం మూడు రకాలని సులభవ్యాకర్త చెప్పారు. అవి 1. ఇతరేతర ద్వంద్వము 2. సమాహార ద్వంద్వము 3.ఏకశేషము. తత్పురుష సమాసం ఐదు రకాలని సులభవ్యాకర్త చెప్పారు. 1. సమానాధికరణము 2. వ్యధికరణము 3. నఞ్ 4. ప్రాది, 5. ఉపపదం

అన్య పదార్థం ప్రధానంగా కలిగినది బహువ్రీహి అని సులభవ్యాకర్త నిర్వచించారు. అనగా సమాసంలో పూర్వ పదం బోధించు దానికంటే, ఉత్తర పదం బోధించు దానికంటే మరొక వస్తువు యొక్క అర్థమే ముఖ్యంగా కలిగినది. ఉదాహరణకు ‘ పీతాంబరుడు’. బహువ్రీహి సమానాధికరణం, వ్యధికరణం అని రెండు రకాలు. ఈ సమానాధికరణం ద్వితీయాది భేదాలు చేత ఆరు రకాలని సులభవ్యాకర్త చెప్పారు.

సమాసంలో పూర్వ పదంలోని అర్థమే ప్రధానంగా ఉంటే దానిని అవ్యయీభావ సమాసం అంటారని సులభవ్యాకర్త నిర్వచించారు. ఈ సమాసంలో ప్రాయికంగా మొదటి పదం అవ్యయంగా, రెండవది నామవాచకంగా ఉంటుంది. ఉదాహరణకు ‘నిర్+ జనము= నిర్జనము’.

## 2.3.7 తద్ధిత పరిచ్ఛేదం

సులభవ్యాకర్త భావాద్యర్థాలలో ‘తన’ మొదలైన తద్ధిత ప్రత్యయాలు ఆచ్ఛిక ప్రాతిపదికల మీద చేరే విధానం మొదలైన వివరణ ఈ పరిచ్ఛేదంలో చర్చించారు. “విశేష్యములకుగాని విశేషణములకుగాని భావార్థము స్వార్థములోనగు నర్థంబుల రాదగిన యొక విధమైన ప్రత్యయములు తద్ధితము లనబడును” (సులభ.తద్ధిత:1) అనగా నామాలకుగాని, విశేషణాలకుగాని భావార్థం, స్వార్థం, మతుబర్థం మొదలైన అర్థాలలో చేరే వివిధ ప్రత్యయాలను **‘తద్ధితాలు’** అంటారని వావిలికొలనువారు నిర్వచించారు. ఈ ప్రత్యయాలు పరమైనప్పుడు ‘డు’ వర్ణకం మొదలైన ప్రత్యయాలు లోపిస్తాయి. ఈ తద్ధిత పరిచ్ఛేదంలో 41 సూత్రాలు ఉన్నాయి.

సులభవ్యాకర్త వివధ అర్థాలలో వివిధ ప్రత్యయాలను నామపదాలపైన విధించారు. ‘తన, రిక, ఇమి, న, ఇక, కర,కార, టి’ మొదలైన ప్రత్యయాలు భావార్థంలో వస్తాయి. ‘ఇక, ఉక, కాడు,

కత్తియ వంటి ప్రత్యయాలు' కొన్ని స్వార్థంలో చేరుతాయి. మతుబర్థంలో 'కా, కత్తియ, ఈ, అరి, త, ఆడి, ఆ, అ, ఇడి, ఇద, మారి, అము' మొదలైన ప్రత్యయాలు చేరుతాయని చెప్పారు.

## 2.3.8 క్రియా పరిచ్ఛేదం

వావిలికొలనువారు క్రియలకు సంబంధించి చాలా విషయాలు ఇందులో చర్చించారు. బాలవ్యాకరణంతోపాటుగా ఆంగ్లవ్యాకరణాలను కూడా అనుసరించి నట్లుగా ఈ క్రియా పరిచ్ఛేదంలో కొన్ని సూత్రాలను బట్టి అర్థమవుతుంది. ఈ పరచ్ఛేదంలో 136 సూత్రాలు ఉన్నాయి. వావిలికొలనువారు క్రియలను తత్సమాలు, ఆచ్ఛికాలు అని రెండు రకాలుగా విభజించారు. "సంస్కృత ధాత్వాదులకు 'ఇంచు' చేర్పఁగా నైనవి తత్సమక్రియలు" (సులభ. క్రియా:1). సంస్కృత ధాతువులకు 'ఇంచు' చేర్చగా ఏర్పడేవి తత్సమక్రియలు. తత్సమక్రియలకు ఉదాహరణ 'రంజించు, పోషించు, స్తుతించు, ఆచ్ఛిక క్రియలకు ఉదాహరణ 'చేయు, కొట్టు, తిట్టు'.

సులభ వ్యాకర్త క్రియలను రెండు రకాలుగా చెప్పారు. "కర్మమును గోరునది సకర్మము" (సులభ. క్రియా:2). కర్మను కోరేది సకర్మకం . ఉదాహరణకు 'శూరుడు శత్రువులను కొట్టును'. "కర్మమును గోరనిది అకర్మకము" (సులభ. క్రియా:3). కర్మను కోరనిది అకర్మకం. ఉదాహరణకు 'అవివేకి పట్టిన కార్యము పాడగును'.

ఈ సకర్మక , అకర్మక క్రియలు మళ్ళీ రెండు రకాలు . "కార్యము కొఱఁత లేక ముగియునట్టు చెప్పునది సమాపక క్రియ" (సులభ. క్రియా:4). కార్యం కొరత లేకుండా ముగిసినట్లు చెప్పేది సమాపక క్రియ. ఉదాహరణకు 'వాడు వచ్చెను'. "కార్యము పూర్ణముగ ముగియనట్టు చెప్పునది యసమాపక క్రియ" (సులభ. క్రియా:5). కార్యం పూర్తి అవ్వనట్లు చెప్పేది అసమాపక క్రియ. ఉదాహరణకు ' వాడు వచ్చిచూ బోవుచూ నాతో మాట్లాడెను.

అసమాపక క్రియలు రెండు రకాలు. క్రియాకాంక్షా సమాపకాలు, నామాకాంక్షా సమాపకాలు. "క్త్వార్థకము లోనగు క్రియలు క్రియాకాంక్షా సమాపకములు"(సులభ. క్రియా:6) 'క్త్వార్థం' మొదలైన క్రియలు 'క్రియాకాంక్ష అసమాపకాలు'."క్రియాజన్య విశేషణములు నామాకాంక్షా సమాపకములు"(సులభ.క్రియా:7). క్రియాజన్య విశేషణాలను 'నామాకాంక్ష అసమాపకాలు' అంటారు.

వావిలికొలనువారు కాలాలను బట్టి క్రియలను నాలుగు రకాలుగా విభజించారు. అవి వర్తమానార్థకం, భూతార్థకం, భవిష్యదర్థకం, తద్ధర్మార్థకం. ఈ సమాపక క్రియలకు ఉత్తమపురుష, మధ్యమ పురుష, ప్రథమ పురుష అని మూడు పురుషలు ఉన్నాయి. వీటి సంజ్ఞలను కూడా వావిలికొలనువారు సూత్ర రూపంలో నిర్వచించారు.

సులభవ్యాకర్త సంస్కృత ధాతువులకూ, 'అంగల' మొదలైన ఆచ్చిక ధాతువులకి 'ఇంచుక్' ప్రత్యయం ఆగమంగా చేరుతుందని, అన్వాదులకు, అడ్డాదులకు, శబ్దపల్లవాలకు సంబంధించిన వ్యాకరణ కార్యాలను చెప్పారు

## 2.3.9 కృదంత పరిచ్ఛేదం

ధాతువుల నుంచి ఏర్పడే నామవాచకాలని కృదంతాలు అంటారని సులభవ్యాకర్త మొదటి సూత్రంలో నిర్వచించారు. ఈ ధాతువుల మీద చేరే ప్రత్యయాలను 'కృత్తులు' అంటారని రెండవ సూత్రంలో చెప్పారు. అంతేకాకుండా 'కృత్' ప్రత్యయాలు చేరేటప్పుడు ధాతువుల చివర ఉండే ప్రత్యయాలు కొన్ని లోపిస్తాయని తరువాత సూత్రంలో వావిలికొలనువారు చెప్పారు. ఈ కృదంత పరిచ్ఛేదంలో 23 సూత్రాలు ఉన్నాయి.

సులభవ్యాకర్త 'అలుగు' మొదలైన ధాతువులు నామవాచకాలైనప్పుడు 'క' ప్రత్యయం వస్తుందని ఉదాహరణలుగా 'అలుగు– అలుక' నడచు– నడక' వంటి వాటిని ఇచ్చారు. 'కలుగు' మొదలైన శబ్దాలకు 'ఇమి' వర్ణకం, 'చేయు' మొదలైన ధాతువులకు 'తజ్' వర్ణకం, 'తిరియు' మొదలైన ధాతువులకు 'ప' అనే కృత్ ప్రత్యయం వస్తుందని సులభవ్యాకర్త చెప్పారు. 'వడి' మొదలైన ప్రత్యయాలు ధాతువులపైన చేరే విధానాన్ని మహా కవులు ప్రయోగాలను బట్టి తెలుసుకోవాలని చివరి సూత్రాన్ని వావిలికొలనువారు చెప్పారు. ఉదాహరణకు ' కొలువడి, నడవడి, లేమిడి.

## 2.3.10 ప్రకీర్ణక పరిచ్ఛేదం

సులభవ్యాకర్త ముందు పరిచ్ఛేదాలలో చెప్పగా మిగిలిన కొన్ని భాషారూపాల ప్రక్రియలను ప్రకీర్ణక పరిచ్ఛేదంలో పేర్కొన్నారు. ప్రధానంగా ఆచ్చిక శబ్దాలలో కలిగే ధ్వనుల మార్పులు ఈ పరిచ్ఛేదంలో వావిలికొలనువారు చెప్పారు. ప్రకీర్ణక పరిచ్ఛేదంలో మొత్తం 17 సూత్రాలు ఉన్నాయి.

సులభవ్యాకర్త కూడా బాలవ్యాకర్త లాగా "పదాద్యంబులు ఋ ౠ వర్ణంబులు, ర ల తుల్యంబులు" (సులభ. ప్రకీర్ణక:1) అని సూత్రీకరించారు. పదంలో మొదట అక్షరాలుగా ఉండే 'ఋ –ౠ' వర్ణాలు రకార, లకారాలతో సమానం. అనగా ఋ ౠ అచ్చులైనను వాటికి సంధి కార్యాలు చేసేటప్పుడు హల్లులైన 'ర–ల' లు పరమైనపుడు ఎటువంటి కార్యాలు జరుగుతాయో అటువంటి కార్యాలు వీటికి కూడా వర్తిస్తాయని సులభ వ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'అతఁడు ఋషి , ఆ ఋషి . వచ్చెన్ ఋషి, వచ్చెను ఋషి'.

అచ్చ తెలుగు పదాల చివర వర్ణం 'రులుడు' లో ఏదైన అక్షరం ఉత్తమాలుగా ఉంటే దానికి ముందు ఉన్న ఏకారానికి హ్రస్వం వికల్పం వస్తుందని, ఊయేల– ఊయాల' అనే శబ్దాలలో గల దీర్ఘానికి ఒక్కొక్కదానికి హ్రస్వరూపం వికల్పంగా వస్తుందని, 'అక్కట' మొదలైన శబ్దాల (జడ్డ) ద్విత్వానికి లోపం వికల్పంగా వస్తుందని, 'ఓయారము' మొదలైన శబ్దాలలో తొలి దీర్ఘానికి హ్రస్వం వికల్పంగా వస్తుందని, ఏత' మొదలైన శబ్దాలకు 'ము' వర్ణకం పరమైనప్పుడు దీర్ఘం వికల్పంగా వస్తుందని, 'పయ్యెద' శబ్దానికి 'పయ్యద' అనేది రూపాంతరమని మొదలైన విషయాలను సులభవ్యాకర్త చర్చించారు.

## 2.3. 11 వాక్య పరిచ్ఛేదం

వాక్యం గురించి *'సులభవ్యాకరణము'* ఇచ్చిన నిర్వచనం కొంత భిన్నంగా ఉన్నది. 'విషయబోధక పద రచన వాక్యంబు'.(సులభ. వాక్య:1). విషయాన్ని బోధించు పదాలను లేదా పద సముదాయాన్ని వాక్యమని వావిలికొలను సుబ్బారావుగారు నిర్వచించారు. కొన్ని విషయాలను సైగల చేత తెలుపవచ్చని అలాంటి చేష్టలు వాక్యాలు కావని సులభవ్యాకర్త చెప్పారు. నోటి నుండి వచ్చు ధ్వనులన్నీ పదాలు కావని, మూగవారు, శిశువులు సైగలచేత తమ అభిప్రాయాన్ని తెల్పినప్పటికీ అవి వాక్యాలు అనిపించుకోవని సులభవ్యాకర్త చెప్పారు. ఈ వాక్య పరిచ్ఛేదంలో 65 సూత్రాలు ఉన్నాయి.

"అర్థవంతమై, యన్వయయుక్తమై, ప్రయోగర్హంబైనది పదంబు" (సులభ. వాక్య:2). పదాలు అర్థవంతాలై ప్రయోగార్హతతో దేనితో ఏది అన్వయించునో ఆ పదాలు చేరి ఉండాలి. అన్వయం సంబంధం గల రెండు పదాల మధ్యలో సంబంధం లేని వేరొక పదం రాకూడదు. పదానికి ఖచ్చితంగా

ఏదో ఒక అర్థం ఉండాలి. ఈ పదాలను వావిలికొలనువారు ఐదు రకాలుగా సూత్రీకరించారు. అవి 1.నామాలు,2. క్రియలు., 3. అవ్యయాలు 4. విశేషణాలు 5. సర్వనామాలు.

సులభవ్యాకర్త కర్త, కర్మ, క్రియలను నిర్వచించి కర్తరి వాక్యాన్ని, కర్మణి వాక్యాన్ని నిర్వచించారు. 'సమాపక క్రియగల వాక్యం సంపూర్ణ వాక్యమని, అసమాపక క్రియగల వాక్యం అసంపూర్ణ వాక్యమని సులభవ్యాకర్త నిర్వచించారు.

ఏకపదాలలో, ధాతువుకి ఉపసర్గని కల్గియున్నప్పుడు, సమాసాలలో సంధి నిత్యంగా వస్తుందని వావిలికొలనువారు నిర్వచించారు. ఏకపదాలనగా విడదీయడానికి వీలులేని సంధితో కూడిన పదం. ఉదాహరణకు 'గోనెడు' దీనిని 'గోనె ఎడు' అని విడదీసి రాయకూడదు. అలాగే ధాతువు ఉపసర్గను కల్గినప్పుడు విసంధిగా రాయకూడదు. ఉదాహరణకు 'ప్రాప్తి' దీనిని 'ప్ర ఆప్తి' అని రాయకూడదు. సమాసాలలో కూడా విసంధి రాకూడదు. ఉదాహరణకు 'దశరథాత్మజులు' దీనిని 'దశరథ ఆత్మజులు' అని రాయకూడదు.

సులభవ్యాకర్త నిత్య ఏకవచనాలుగా సస్య వాచకాలను( పైరు. వరి, కంది, సెనగ, జొన్న, పెసర, మినుము, ప్రత్తి), లోహవాచకాలను (ఇనుము, రాగి, వెండి, బంగారు , కంచు), కొన్ని సంభారపు దినుసులు (నూనె, ఆముదము, నెయ్యి, చమురు, ఉప్పు, ఇంగువ, చింతపండు, పసుపు) కొన్ని ధాన్యవాచకాలు(బియ్యము, జీలకర్ర), గుణవాచకవిశేషణాలను ( తెలుపు, నలుపు, పసుపు, ఎరుపు) కేల్వాదులను (కేలు, ఇరులు, అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడు, అక్కడ, ఇక్కడ, ఎక్కడ, అచ్చట, ఇచ్చట, ఎచ్చట) పేర్కొన్నారు. వీటికి బహువచన రూపం లేదు.

సులభవ్యాకర్త నిత్య బహువచనాలుగా క్రీడావిశేషక వాచక శబ్దాలను (అమ్మన బంతులు, దాగురు మూతలు, అలంకులు, గుంటచాళ్ళు, గుడి గుడి గుంచాలు, గుజ్జెనగూళ్ళు, గొబ్బిళ్ళు, అచ్చన గాయలు, గీరన గింజలు). ధాన్యవాచక శబ్దాలను (వడ్లు, పెసలు, కందులు, మినుములు, సెనగలు, ఆళ్లు, జొన్నలు). 'అందఱు' మొదలైన శబ్దాలను (అందఱు, ఇందఱు, ఎందఱు, పెక్కండ్రు, పెక్కురు, గుగ్గిళ్లు, కురులు, అక్షతలు, పులకలు, అగచాట్లు, పేలలు, పేలాలు) పేర్కొన్నారు.

సాధారణంగా వాక్యంలో కార్యం పూర్తయిందని చెప్పడానికి సమాపక క్రియనే ఉండదాల్సిన అవసరం లేదు. ఆ కార్యం నామవాచకంతోగాని, విశేషణముతోగాని ముగిసినట్లు తెలియజేయవచ్చు.

ఉదాహరణకు 'రాముడు సుగుణాభిరాముడు', సంపద యాపదలకు నెలవు'.ఇలాంటి ఉదాహరణలలో అగు – కల– ఉండు మొదలైన క్రియలు అధ్యాహార్యాలుగా కర్తతో అన్వయించ బడతాయని సులభవ్యాకర్త వివరించారు.

## 2.3.12 వ్యాస పరిచ్ఛేదం

వావిలికొలను సుబ్బారావుగారు *వ్యాస పరిచ్ఛేదంలో* వ్యాసం రాసేటప్పుడు విద్యార్థులు చేసే తప్పులను ప్రస్తావించారు. వ్యాసం రాసేటప్పుడు ఒక విద్యార్థికి ఉండాల్సిన లక్షణాలను, నియమాలను 21 భాగాలుగా విభజించి పూర్వభాగంలో చెప్పారు. వీటిలో పద సామాగ్రి, విషయ నిర్ధారణం, శైలి, దోషములు, స్పష్టత్వం, వాక్యపరిమాణము, అన్యదేశ్యములు, పరీక్ష సమయ చర్య వంటి అంశాలు పేర్కొనదగినవి. ద్వితీయ భాగంలో సంస్కృత శబ్దాలను, తెలుగు శబ్దాలను రాసేటప్పుడు విద్యార్థులు చేసే తప్పులను కొన్నింటిని ఉదాహరించారు.

ఏదైనా ఒక విషయాన్ని విస్తరించి రాయడం వ్యాసలేఖనమని, ఆ విస్తరించి రాయబడ్డ గ్రంథం వ్యాసమని వావిలికొలను సుబ్బారావుగారు నిర్వచించారు. వ్యాసంలో మొదటి నుండి చివర వరకు ఒకే అంశాన్ని వివరించాలి. అప్రస్తుత వర్ణనలకు, వివిధ కథలకు వ్యాసంలో చోటు ఉండదు. వ్యాసకునికి వస్తుతత్వ జ్ఞానం, పూర్వ అభ్యాసం ఎంతో అవసరమని చెప్పారు.

కొంతమందికి వ్యాకరణ సూత్రాలు తెలిసినప్పటికి వారు ప్రయోగించే శబ్దాలను తప్పుగా రాస్తున్నారు. వాటిని దృష్టిలో పెట్టుకొని సంస్కృత శబ్ద దోషాలను, ఆంధ్ర శబ్ద దోషాలను వావిలికొలనువారు కొన్నింటిని ఈ వ్యాసపరిచ్ఛేదంలో పేర్కొన్నారు. వట్రు సుడికి బదులుగా క్రావడి రాయడం 'క్రుషి– కృషి', థకార ధకారాలు విపర్యాసం పొందటం 'అర్ధము– అర్థము'. మొదలైన విషయాలను సులభవ్యాకర్త పేర్కొన్నారు.

విద్యార్థులు పరీక్షకోసం పరీక్షాశాలకు వెళ్ళినప్పుడు వారు గుర్తుంచుకోవాల్సిన విషయాలను కూడా వావిలికొను సుబ్బారావుగారు ఈ వ్యాస పరిచ్ఛేదంలో ప్రస్తావించారు.

ముగింపు:

వావిలికొలను సుబ్బారావుగారు ***సులభవ్యాకరణాన్ని*** చక్కని ప్రణాళికతో రచించారు. ప్రతి పరిచ్ఛేదంలో చెప్పాలనుకున్న విషయాలను ఒక క్రమంలో చక్కగా ప్రకరణాలుగా విభజించి చర్చించారు. ఈ గ్రంథాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు పేరుకు తగిన గ్రంథంగా మనకు కనిపిస్తుంది. వావిలికొలనువారు ఈ వ్యాకరణంలో చాలా వరకు సూత్రం క్రిందనే వివరణ ఇచ్చారు. సంస్కృత సంధులను తెలుగు వ్యాకరణ గ్రంథంలో చర్చించటం, వ్యాస పరిచ్ఛేదాన్ని పొందుపరచటం ముఖ్యంగా చెప్పుకోవాల్సిన విశేషాంశాలుగా ఈ గ్రంథంలో కన్పిస్తున్నాయి. ప్రస్తుత ఈ అధ్యాయంలో సులభవ్యాకరణంలోని పరిచ్ఛేదాల వరుస క్రమాన్ని అనుసరించి, వ్యాకర్త ఏ అంశాలను చర్చించారు? వారు వేసుకున్న ప్రణాళిక ఏమిటి? వంటి విషయాలను తెలిపే విధంగా కొన్ని ఉపశీర్షకలతో ప్రాథమిక అంశాలను చర్చించాను.

**మూడవ అధ్యాయం:** 'వర్ణ విజ్ఞానం' అనే అధ్యాయంలో భాగంగా వర్ణాలు, వర్ణ విభాగ చర్చ, వర్ణోత్పత్తి స్థానాలు మొదలైన అంశాలను చర్చిస్తాను.

# అధ్యాయం – 3

# వర్ణ విజ్ఞానం

# అధ్యాయం – 3

# వర్ణ విజ్ఞానం

## 3.0 పరిచయం

ఏ భాషలోనైనా ప్రాథమికమైనవి వర్ణాలు. అందువల్ల వ్యాకర్తలందరూ దాదాపుగా వర్ణ సమామ్నాయంతో వారి గ్రంథాలను ప్రారంభించారు. తెలుగు భాషలో కన్పిస్తున్న 56 వర్ణాలలో కొన్ని సంస్కృత భాష నుండి గ్రహించినవే. వ్యాకరణ గ్రంథాలు 'వర్ణ' శబ్దాన్ని ప్రత్యేకంగా నిర్వచించలేదు కాని 'వర్ణ' శబ్ద వాడుకను బట్టి 'అక్షరం' అనే అర్థంలో 'వర్ణం' వాడబడిందని తెలుస్తుంది. వ్యాకరణ గ్రంథాలు కొంత విస్తృతార్థంలో 'వర్ణ' సంజ్ఞను వాడాయి. కందుకూరి వీరేశలింగంపంతులుగారు "వివిధములగు ధ్వనులను వేర్వేఱ నెఱింగించు కొఱకు వ్రాఁత యందేర్పఱుచు కోఁబడిన గుఱుతులు వర్ణములని కాని, అక్షరములని కాని చెప్పబడును"[9] అని వర్ణవిభజన చేశారు. వ్యాకరణశాస్త్రం ప్రకారం కేవలం అచ్చయినా, కేవల హల్లయినా, లేదా అచ్చుతో కూడిన హల్లయినా 'వర్ణ' మనే వాడారు. బాల, ప్రౌఢ, సులభవ్యాకర్తలు అక్షరాలను కూడా 'వర్ణాలని' పేర్కొనడం సూత్రాలను బట్టి తెలుస్తుంది.

## 3.1 వర్ణాలు

వావిలికొలనువారు 'అక్షరప్రకరణము' అనే శీర్షికలో 'వర్ణ' చర్చ చేశారు. మన నోటి నుంచి వెలువడే మాటలు కంటికి కనబడవు. వాటికి ఒక రూపాన్ని కలిగిస్తే కళ్ళతో చూడగలం. నోటి ధ్వనులను కంటికి కనబడేలాగా చేసే ప్రక్రియనే రాయడం అంటారు. ఉదాహరణకు 'నిజము చెప్పుట మేలు' అన్న వాక్యంలో ఒక్కొక్క అక్షరానికి ఒక్కొక్క విధమైన ధ్వని మన నోటినుండి వెలువడుతుంది. ఇలా వెలువడిన ఒక్కొక్క ధ్వనికి ఒక్కొక్క విధమైన గుర్తుపెట్టుకొని ఆధ్వనిని సూచించిన ప్రతిసారి ఆ గుర్తునే ఉపయోగించాలి. ఇలా ధ్వనులను సూచించు గుర్తులకే అక్షరాలు, వర్ణాలు, అక్కరాలు అని పేర్లు ఉన్నాయని సులభవ్యాకర్త చెప్పారు.

---

[9] సంగ్రహ. వ్యా. వర్ణ:1

ఏ భాషావ్యవహర్తలైనా సాధారణంగా ఒకరి అభిప్రాయాన్ని మరొకరికి వాక్యాల చేత తెలియజేస్తారు. వాక్యాలు మాటలతో కూర్చబడతాయి. మాటలు అక్షరాల సమూహంతో ఏర్పడతాయి. కాబట్టి మొదటగా అక్షరాలు నేర్చుకోవాలి. ఒక భాషలోని అక్షరాలను ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా రాయకూడదు. ఒక ఆంధ్రభాషా వ్యవహర్త రాసినది; ఇతర దేశంలో ఉండే ఆంధ్రభాషా వ్యవహర్తకు కూడా అర్థమయ్యేలాగా ఉండాలి.

ఆంగ్లేయుల అక్షరాలలో చాలా లోపాలు ఉన్నాయని సులభవ్యాకర్త చెప్పారు. ఆంగ్లభాషలో ఒకే అక్షరానికి రెండు విధాలైన ధ్వనులు ఉపయోగిస్తారు. ఉదాహరణకు 'Accent' అన్న పదంలో మొదటి 'c' 'k' ధ్వనిని కలిగి ఉంది. రెండవ 'c' 's' ధ్వనిని కలిగి ఉంది. ఒక ధ్వనికి రెండు అక్షరాలు ఉండటం వంటి లోపాలు సంస్కృత భాషలోగాని, దానిని అనుసరించిన తెలుగు భాషలో లేవని సులభవ్యాకర్త చెప్పారు.

సంస్కృత భాష నుండి ప్రాకృతము పుట్టినదని ఆ రెండు భాషల నుండి అనేకపదాలు తెలుగులోకి వచ్చాయని సులభవ్యాకర్త చెప్పారు. సంస్కృత, ప్రాకృతాల నుండి చాలా పదాలు తెలుగులో వచ్చినప్పటికీ, ఆ రెండు భాషాలకి సంబంధంలేని శుద్ధాంధ్ర పదాలు చాలా తెలుగు భాషలో ఉన్నాయని సులభవ్యాకర్త చెప్పారు. ఒక్కొక్క భాషకి ఒక్కొక్క అక్షర నిర్మాణం ఉంటుందని సంస్కృత, ప్రాకృత, తెలుగుభాషలకు వేరు వేరు అక్షరాలు ఉన్నాయని సులభవ్యాకర్త చెప్పారు.

వావిలికొలనువారు "సంస్కృతమునకు వర్ణంబు లేఁబది" (సులభ. సంజ్ఞ:9 ) అని సంస్కృత వర్ణాలను మొదటగా చెప్పారు. "ప్రాకృతమునకు వర్ణములు నలువది" (సులభ. సంజ్ఞ:10) సంస్కృత భాషలో ఉండే అక్షరాలలో పది (ఋ ౠ ఌ, ౡ ఐ ఔ ఙ ఞ శ ష) తప్ప మిగిలిన అక్షరాలన్ని ప్రాకృత భాషలో ఉన్నాయని చెప్పారు. బాలవ్యాకరణలో చిన్నయసూరిగారు "కొందఱ మతంబున హ్రస్వ వక్రంబులును బ్రాకృతంబునందుఁ గలవు. కొందరి మతంబున వక్రతంబులుం గలవు".[10] అని ప్రాకృత భాషలో కొందరి అభిప్రాయాన్ని అనుసరించి హ్రస్వ వక్రాలు 'ఎ, ఒ' లు, ఇంకొందరి అభిప్రాయాన్ని అనుసరించి వక్రతాలైన 'ఐ, ఔ' ఉన్నాయని చెప్పారు. సంస్కృత భాషలో లేకుండా ప్రాకృత భాషలో ఎక్కువుగా ఉండే అక్షరాలు లేవని సులభవ్యాకర్త చెప్పారు. దీనిని బట్టి

[10] బాల. సంజ్ఞా. వృ. పుట:9

హ్రస్వ వక్రాలు‘ఎ,ఒ’ లు, వక్రతాలైన ‘ఐ, ఔ’లు ప్రాకృతంలో ఉన్నట్టు సులభవ్యాకర్త అంగీకరించలేదు.

బాల, ప్రౌఢ వ్యాకర్తలు తెలుగు/ఆంధ్ర భాషకు వర్ణాలు చెప్పేటప్పుడు బాల వ్యాకర్త “తెనుఁగునకు వర్ణములు ముప్పది యాఱు” (బాల. సంజ్ఞ:3) అని, ప్రౌఢ వ్యాకర్త “ ఆంధ్ర భాషకు వర్ణంబు లేఁబది యైదు” (ప్రౌఢ. సంజ్ఞ:1)అని చెప్పారు. వ్యాకర్తలిద్దరు శకటరేఫని(ఱ) వర్ణంగా పేర్కొనలేదు. సులభ వ్యాకర్త దానిని వర్ణంగా భావించి “తెలుఁగునకు వర్ణములు ముప్పదియేడు” (సులభ. సంజ్ఞ:11)”, “*ఆంధ్ర భాషకు వర్ణంబులు లేఁబది యాఱు*” (సులభ. సంజ్ఞ:12) అని సూత్రాలను చెప్పారు.

సంస్కృతాక్షరాలైన ‘ఋ ౠ ఌ, ౡ ః ఖ ఘ ఙ ఛ ఝ ఞ ఠ ఢ థ ధ ఫ భ శ ష’ అనే పంతొమ్మిది అక్షరాలు అచ్చ తెలుగుభాషలో లేవుగాని, ఆ భాషలో లేని ‘ఎ, ఒ, ఁ, ౘ ౙ ఱ’ అనే ఆరు అక్షరాలు అచ్చతెలుగు భాషలో ఉన్నాయని సులభవ్యాకర్త చెప్పారు. సంస్కృతంలోని 50 అక్షరాలు, అచ్చతెలుగులో మాత్రమే ఉన్న ఆరు అక్షరాలను కలుపుకొని ఆంధ్ర భాషకి అక్షరాలు 56 అయ్యాయి.

### అచ్చులు: 19

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ, ౡ ఎ ఏ ఐ ఒ ఓ ఔ ఁ ం ః.

### హల్లులు: 37

క ఖ గ ఘ ఙ

చ ౘ ఛ జ ౙ ఝ ఞ

ట ఠ డ ఢ ణ

త థ ద ధ న

ప ఫ బ భ మ

య ర ఱ ల వ

శ ష స హ ళ.

పైన చెప్పిన వర్ణాలలో 'అ'కారాదులు అచ్చులుగా, 'క'కారాదులు హల్లులుగా చెప్పబడుతున్నాయి. అచ్చులకు 'స్వరాలని, ప్రాణాలని' పేర్లు. హల్లులకి 'వ్యంజనాలని, ప్రాణులని' పేర్లు. వర్ణ నిర్దేశమందు 'కార' ప్రత్యయం చేర్చి అకారం, ఇకారం, ఉకారమని పిలుస్తారు.

బాలవ్యాకర్త సంస్కృత వర్ణాలు ఏ విధంగా తెలుగులో చేరుతున్నాయో చెప్పారు. 'ఋ ౠ ఌ, ౡ విసర్గ ఖ ఛ ఠ థ ఫ ఘ ఝ ఢ ధ భ ఙ ఞ శ ష–మొదలైన 19 వర్ణాలు సంస్కృత సమశబ్దాలతో కూడుకొని తెలుగులో వ్యవహరించబడతాయని పేర్కొన్నారు.[11]సులభవ్యాకర్త "ఋ ౠ ఌ ౡ విసర్గ వర్గయుగ్ఙఞశష లు తత్సమాన్య దేశ్యానుకరణంబులఁ గూడి యాంధ్ర భాషం జొచ్చు"(సులభ. సంజ్ఞా:17) అని సూత్రీకరించి సంస్కృత భాషలోని 19 అక్షరాలు తత్సమ పదాలుగాను, అన్యదేశ్య పదాలుగాను, ధ్వన్యనుకరణ పదాలుగాను కలిసి ఆంధ్రభాషలోకి వచ్చాయని చెప్పారు.

బాలవ్యాకర్త సంస్కృతంలోని 19 అక్షరాలు 'తత్సమాలుగా' మాత్రమే తెలుగు వచ్చి చేరుతాయని చెప్పారు. సులభవ్యాకర్త తత్సమాలలోనే కాక అన్యదేశ్యాలుగా, ధ్వన్యనుకరణ పదాలుగా తెలుగులోకి ప్రవేశిస్తున్నాయని చెప్పారు.

## 3.1.1 వర్ణ విభాగ చర్చ

వావిలికొలనువారు 'వర్ణ విభాగ ప్రకరణం' లో వర్ణాల పేర్లను(సంజ్ఞలను), వాటి ఉత్పత్తి స్థానాలను చెప్పారు.

క ఖ గ ఘ ఙ

చ ఛ జ ఝ ఞ

ట ఠ డ ఢ ణ

త థ ద ధ న

ప ఫ బ భ మ

---

[11] బాల. సంజ్ఞా:4

‘ఐదు’ అక్షరాలను కలిపి ఒక వర్గం అంటారు. ‘క’ మొదలుగా గల ‘ఐదు’ అక్షరాలు ‘క’వర్గం అంటారు. అలాగే మిగిలినవి చవర్గం, టవర్గం, తవర్గం, పవర్గం అవుతాయని సులభవ్యాకర్త సూచించారు. హల్లులను సులభవ్యాకర్త స్థిరాలు, పరుషాలు, సరళాలు అనిగాని; స్పర్శాలు, అంతస్థాలు, ఊష్మాలు, ళ అనిగాని చెప్పవచ్చని సులభవ్యాకర్త చెప్పారు. బాల, ప్రౌఢ వ్యాకరణాలు సందర్భోచితంగా వర్ణాలు వాటి సంజ్ఞలను చెప్పాయి తప్ప ప్రత్యేకంగా వర్ణవిభాగ చర్చ చేయలేదు.

### 3.1.1.1 స్పర్శాలు

‘క’ నుంచి ‘మ’ వరకు గల(25) అక్షరాలను స్పర్శాలు అంటారు.

### 3.1.1.2 పరుషాలు

‘క చ ట త ప ’ అనే (5) అక్షరాలు పరుషాలు,

### 3.1.1.3 సరళాలు

‘గ జ డ ద బ’ అనే (5) అక్షరాలు సరళాలు,

### 3.1.1.4 వర్గ యుక్కులు

‘ఖ, ఛ, ఠ, థ, ఫ, ఘ, ఝ, ఢ, ధ, భ’ అనే (10) అక్షరాలు వర్గ యుక్కులు,

### 3.1.1.5 అనునాసికా

‘ఙ ఞ ణ న మ’ అనే (5) అక్షరాలు అనునాసికాలు.

### 3.1.1.6 స్థిరాలు

పరుష సరళాలు కాక మిగిలిన ‘ఖ ఘ ఙ ఛ ఝ ఞ ఠ ఢ ణ థ ధ న ఫ భ మ య ర ల వ శ స ష హ ళ’ (24) అక్షరాలను స్థిరాలు అంటారు.

### 3.1.1.7 అంతస్థాలు

స్థిరాక్షరాలలో ఉన్న ‘య ర ల వ’ అనే (4) అక్షరాలను అంతస్థాలంటారు.

#### 3.1.1.8 ఊష్మాలు

'శ ష స హ' అనే (4) అక్షరాలను ఊష్మాలని పిలిస్తారు.

### 3.1.2 వర్ణోత్పత్తిస్థానాలు

#### 3.1.2.1 కంఠ్యాలు

కంఠం సహాయంతో పుట్టు అక్షరాలు : అ ఆ క ఖ గ ఘ ఙ హ.

#### 3.1.2.2 తాలవ్యాలు

తాలువు సహాయంతో పుట్టు అక్షరాలు: ఇ ఈ చ ఛ జ ఝ ఞ య శ.

#### 3.1.2.3 మూర్ధన్యాలు

మూర్ధం సహాయంతో పుట్టు అక్షరాలు: ఋ ౠ ట ఠ డ ఢ ణ ర ష.

#### 3.1.2.4 దంత్యాలు

దంతాల సహాయంతో పుట్టు అక్షరాలు: త థ ద ధ న ల స.

#### 3.1.2.5 ఓష్ఠ్యాలు

పెదాల సహాయంతో పుట్టు అక్షరాలు: ఉ ఊ ప ఫ బ భ మ.

#### 3.1.2.6 అనునాసికాలు

నాసిక సహాయంతో పుట్టు అక్షరాలు: ఙ ఞ ణ న మ.

#### 3.1.2.7 కంఠ తాలవ్యాలు

కంఠం, తాలువు సహాయంతో పుట్టు అక్షరాలు: ఏ ఐ.

#### 3.1.2.8 కంఠోష్ఠ్యాలు

కంఠం, ఓష్ఠ్యం సహాయంతో పుట్టు అక్షరాలు : ఓ, ఔ

### 3.1.2.9 దంత్యోష్ఠ్యం

దంతం, ఓష్ఠ్యం సహాయంతో పుట్టు అక్షరాలు : వ

## 3.2 గుణింతాలు

వావిలికొలనువారు 'గుణింతాలు' వంటి సూక్ష్మ విషయాలను కూడా పిల్లలకు అర్థమయ్యేరీతిలో పొందుపరిచారు. తలకట్టులు లేని అక్షరాలను ఒక చోట చేర్చి "ఖ జ ఞ జే ఈ ట ణ బ ఊ ల" (సులభ.సంజ్ఞ:15) అని సూత్రంగా చెప్పారు. గుణింత చిహ్నాలను అన్నిటిని చెప్పి అవి తలకట్టు ఉన్న అక్షరాలలో ఎక్కడ(ఏ స్థానంలో) వస్తాయో వివరించారు. గుణింతాల విషయంలో అనుసరించాల్సిన సూచనలు చేశారు. వాటిలో కొన్నింటిని ఈక్రింద ప్రస్తావిస్తాను.

1. 'ఖ, ఘ' వంటి ఒత్తక్షరాలలో కింద ఒత్తుగీత ఉన్నట్లు 'ఠ' కారానికి ఇవ్వకూడదని చెప్పారు.
2. కొమ్ములేని హల్లులకు దీర్ఘం రాసేటప్పుడు తలకట్టుకు బదులుగా ' ా' వంటి గుర్తు పెట్టాలి. ఉదాహరణకు 'క–కా'.
3. కొమ్ము ఉన్నవాటికి, తలకట్టు లేని అక్షరాలకు ఆకార (దీర్ఘ) చిహ్నం రాయాల్సినపుడు అక్షరాల చివర కొన నుండి ' ా' వంటి చిహ్నం రాయాలి. ఉదాహరణకు ' మా–యా–ఖా–జా–ఞా– బా– టా–లా'.
4. సుడితో అక్షరం ముగిసి, అక్షరానికి అడుగు భాగంలో ఆ సుడి ఉన్నట్లయితే, ఆకార (దీర్ఘ) చిహ్నం రాయాల్సినపుడు ఆ అక్షరం పైన ' ా' అని రాయాలి. ఉదాహరణకు 'ణ–ణా'.
5. అక్షరంలోని చివర కొనభాగం ఆ అక్షరంలోని ఏ భాగంతోనైన కలిసి పోయేలాగా ఉన్నప్పుడు దాని పైభాగంలో ఆకార (దీర్ఘ) చిహ్నం రాయాల్సినపుడు ' ా' రాయాలి 'ఊ–ఊా'.
6. ' ి దీనిని గుడి అంటారు. ఇది ఇకారాన్ని తెల్పుతుంది. దీనిని తలకట్టుగాని దీర్ఘం గాని( ా ) రాసే చోట రాయాలి. ఉదాహరణకు ' కి– జి– టి– ణి'.

ఈ విధంగా మిగిలిన గుణింతాలను, వత్తులను చెప్పారు. సంస్కృతం నుండి రావడం వల్ల, కర్ణాటక భాషలో ఉండటం వల్ల 'ర్' వలపలగిలక సాధువే అవుతుందని 'స్వర్గము-స్వగ ర్ అని రెండు రూపాలు రాయవచ్చని సులభవ్యాకర్త చెప్పారు.

సులభ వ్యాకర్త రెండు రకాల పదాలకు చిహ్నాలని సూచించారు. ఆంగ్ల పదాలైన మాప్ (Map) ఆక్సంట్ (Accent) బాచిలర్(Bachelor) ప్లాన్ (Plan) మైల్ (Mail) డైలీ(Daily) వంటివి తెలుగు అక్షరాలలో రాయాల్సినప్పుడు ఆయా పదాల మొదటి అక్షరం పైన 'ు' వంటి చిహ్నం ఇవ్వాలి. లేకపోతే ఇది ఆంగ్లపదమో లేక తెలుగు పదమో అని తేడా తెలియదని పేర్కొన్నారు. అచ్చతెలుగు పదాలపై 'ు' ఇలాంటి గుర్తులు రాయడం మనం కొన్ని పదాలలో చూస్తూనే ఉన్నాం.

## 3.3 అనుస్వారం / బిందువు

'సున్న' కు అనుస్వారం అని పేరు. 'సున్న' అనేది ఎప్పుడు అచ్చు వెనకనే అంటుకొని వస్తుంది కాబట్టి దీనిని 'అనుస్వారం' అంటారు. అనుస్వారానికి ''బిందువు అని కూడా పేరు ఉంది. సులభవ్యాకర్త అనుస్వారాన్ని పూర్ణానుస్వారం, ఖండానుస్వారం రెండు విధాలని చెప్పారు. మళ్ళీ ఇవి సిద్ధము, సాధ్యము అని రెండు రకాలు. సిద్ధ పూర్ణానుస్వారం అనగా శబ్దంతోనే పుట్టేది. ఉదాహరణకు 'చెండు, పండు, వంక, డొంక'. ఈ శబ్దాలలో ఉండే 'నిండు సున్నలు' శబ్దం పుట్టినప్పుడే పుట్టినవి; మధ్యలో వచ్చి చేరినవి కావు. కాబట్టి వీటిలో ఉన్న సున్నని 'సిద్ధ అనుస్వారం' అనవచ్చు. వ్యాకరణ సూత్రాలతో సాధించబడినది సాధ్య అనుస్వారం. ఉదాహరణకు 'చెన్ను-తొవ' అని రెండు శబ్దాలలో నిండుసున్న లేదు. సంధికార్యాలు జరిగినపుడు 'చెందొవ' అనే రూపం ఏర్పడుతుంది. ఇందులోని పూర్ణబిందువు సాధ్య అనుస్వారం అనవచ్చు. 'కాఁక-వీఁక- ఈఁక- తోఁక' వంటి వాటిలో ఉండే అరసున్నని సిద్ధ ఖండానుస్వారం అంటారు. 'వచ్చెన్ కమలాక్షుడు' అనేది సంధికార్యాలు జరిగేటప్పుడు 'వచ్చెఁ గమలాక్షుడు' అవుతుంది. ఇందులోని అరసున్న సాధ్య ఖండానుస్వారం.

బాల ప్రౌఢవ్యాకర్తలు 'అనుస్వారం' గురించి సులభవ్యాకర్త చెప్పినంత వివరంగా వాళ్ళు వర్గీకరించలేదు. పూర్ణ బిందువు, ఖండ బిందువు వంటి విషయాలను ప్రస్తావించారు గాని వాటిని వివరించే ప్రయత్నం చేయలేదు. వీరి గ్రంథాలకు వ్యాఖ్యానం రాసిన వ్యాకర్తలు తదనంతరం వారి గ్రంథాలలో అనుస్వారం ఎన్ని రకాలుగా కన్పిస్తుందో ప్రస్తావించారు.

బాలవ్యాకరణంలోని 'సంజ్ఞా పరిచ్ఛేదం'లో మూడు సూత్రాలలో చేసిన బిందు చర్చని సులభ వ్యాకర్త గ్రహించారు. "సంస్కృత సమేతరములయిన తెలుఁగు శబ్దముల యందుఁబరుష సరళంబులకు ముందే బిందువు కానంబడుచున్నది"( బాల. సంజ్ఞ:16) అని బాల వ్యాకర్త సంస్కృత సమాలు కాకుండా మిగిలిన సంస్కృత భవ, ప్రాకృత సమ, ప్రాకృత భవ , దేశ్య శబ్దాలలో పరుష సరళ వర్ణాలకు ముందు మాత్రమే సిద్ధ సాధ్యాలైన పూర్ణ బిందువుగాని ఖండబిందువుగాని ఉంటుందని నిర్వచించారు. ఈ రెండు బిందువులు పరుష సరళేతరాలైన హల్లులకు(స్థిరాలకు) ముందు కనబడితే అవి సంస్కృత సమాలుగా మనం గుర్తించవచ్చు.

ఇదే విషయాన్ని సులభ వ్యాకర్త "వికృత బిందువు పరుష సరళ పరకంబ" (సులభ. సంజ్ఞ:21), అని సూత్రీకరించారు. ఈ సూత్రంలో అచ్చతెలుగు మాటలలో అరసున్నగాని , నిండు సున్నగాని పరుష సరళాలకు పక్కనే ఉంటుందని నిర్వచించారు. 'వికృత బిందువు' అనగ తెలుగు మాటలలో ఉండే అరసున్న లేదా నిండు సున్న అని అర్థం. అనుస్వారం తత్సమ రూపాలలో అనునాసిక ఉచ్చారణని కలిగి ఉంటుందని 'సంశయము, సంవత్సరము' వంటి రూపాలను సులభ వ్యాకర్త వివరణలో చెప్పారు. హ్రస్వం తరవాత వచ్చే అరసున్నకి, నిండు సున్న వికల్పంగా వస్తుందని బాల, సులభ వ్యాకర్తలు ఇద్దరూ చెప్పారు. ఉదాహరణకు 'కలఁగి– కలంగి'

బాల, ప్రౌఢ వ్యాకర్తలు చెప్పిన విషయాలనే కాక 'అనుస్వారం' ఇంకా ఏయే సందర్భాలలో వస్తుంది? ఏ సందర్భాలలో రాదు? వంటి నూతన అంశాలను సులభవ్యాకర్త సూత్రీకరించారు. "అసమాసంబున సంయుక్తాక్షరమునకు గాని ద్విత్వాక్షరమునకు గాని ముందర బిందు ఉండదు"(సులభ.సంజ్ఞ:22). సమాసం కాని పదాలలో సంయుక్తాక్షరానికి, ద్విత్వాక్షరానికి ముందు అరసున్న, నిండు సున్నా ఉండదని చెప్పారు. ఉదాహరణకు 'ముదుఁగు, వేఁడుకొను', వంటి రూపాలు సంయుక్తాలుగా మారేటప్పుడు 'ముద్గు, వేడ్కొను' అని 'అరసున్న' లేనివి అసమాసంలో ఏర్పడుతున్నాయి. సమాసంలో సంయుక్తాక్షరానికి, ద్విత్వాక్షరానికి ముందు అరసున్న, నిండు సున్నా ఉంటుందని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'తలఁబ్రాలు'. "పంక్త్యాది ననుస్వారము పొల్లులు లేవు" (సులభ. సంజ్ఞ:23). అనగా మనం ఏదైన అంశాన్ని గురించి రాసేటప్పుడు వరుసలోని మొదటి అక్షరాలుగా సున్నా, అరసున్నా, పొల్లు హల్లులు రావని సులభ వ్యాకర్త చెప్పారు.

## 3.4 అర్ధ బిందు ప్రస్తావన

వావిలికొలనువారు అర్ధ బిందువును కూడా సిద్ధము, సాధ్యము అని రెండు రకాలుగా చెప్పారు. అర్ధ బిందువు గురించి విపులమైన చర్చ వావిలికొలనువారు *సులభ వ్యాకరణం*లో చేశారు. బాల ప్రౌఢ వ్యాకరణాలు అర్ధబిందువు గురించి పెద్దగా చర్చించలేదు. ఈ విభాగంలో చాలా వరకు సులభవ్యాకర్త చెప్పిన విషయాలు మాత్రమే ఉన్నాయి.

మాటలోని మొదటి అక్షరం హ్రస్వంగా ఉండి దానిమీద అరసున్న కల్గినవి 'అఁట, ఇఁక, చుఁడు' అనే శబ్దాలు తప్ప, మిగిలిన పదాలలో మొదటి హ్రస్వం తర్వాత అరసున్న ఉండదని సులభవ్యాకర్త చెప్పారు[12]. 'ఇఁగ' అనేది ' ఇఁక' అనే పదానికి రూపాంతరం కాబట్టి దీనిలో అరసున్న ఉంటుంది. 'వాఁడు వచ్చినాఁడట' అనే ఉదాహరణలో 'అఁట' అనేది 'అనుట' అర్థంలో వాడబడింది. కాబట్టి ఇక్కడ 'ను' స్థానంలో అరసున్న వచ్చింది. 'అటకు వాఁడు పోయె' అనే ఉదాహరణలో 'అట' అనేది 'అచ్చట' అనే అర్థంలో వాడబడింది. ఇక్కడ అరసున్న రాదు. పరిమాణాకర్థమైన 'ఎఁడు' అనేది పదం కాదు కాబట్టి దానిని సూత్రంలో చేర్చలేదని సులభవ్యాకర్త చెప్పారు.

మహదర్థక బోధక పదాలలో(రాముఁడు, భీముఁడు, మగఁడు, లేఁడు, పోఁడు), పరిమాణార్థకమైన 'ఎఁడు' వర్ణకం చేరిన రూపాలలో(గోనెఁడు, తూమెఁడు, బానెఁడు), మధ్యమ పురుష బహువచన రూపాలలో(చూడుఁడు, చేయుఁడు), అర్ధబిందువు వస్తుందని చెప్పారు. మధ్యమ పురుష ఏకవచనంలో అరసున్న లేదు. ఉదాహరణకు 'చూడు'. "మహత్యర్థక బోధకంబగు 'ఆఁడి'యందు 'డి' వర్ణకంబునకు ముందరసున్న యుండును" (సులభ.సంజ్ఞ:26). స్త్రీలను బోధించు సందర్భాలలో వచ్చే 'ఆఁడి' ప్రత్యయమలోని 'డి' వర్ణకం ముందు అరసున్న వస్తుందని వావిలికొలనువారు సూత్రీకరించారు. ఉదాహరణకు 'మాయలాఁడి, వగలాఁడి, వన్నెలాఁడి'.

సులభవ్యాకర్త"యకారం కడపట గల ధాతువుల కృదంత రూపంబులందలి త వర్ణంబునకు ముందరసున్న యుండును"(సులభ.సంజ్ఞ:27) అనే సూత్రంలో 'య' వర్ణం అంతంగా ఉండే

---

[12] సులభ. సంజ్ఞా:24

ధాతవులు కృదంత రూపాలుగా మారే సందర్భంలో వచ్చే ‘త’ వర్ణానికి ముందు అరసున్నా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు ‘అలయు–అలత’, మూయు– మూఁత’ మోయు–మోఁత.

“దీర్ఘాక్షరము ముందుగా గల ‘ము’ వర్ణమునకు నౌప విభక్తికమైన ‘ప’ యాదేశమైనపుడు దానికి ముందుగ ‘ఁ’ నరసున్న యుండును” (సులభ.సంజ్ఞ:28). దీర్ఘాక్షరాలకి తరువాత వచ్చే ‘ము’ వర్ణానికి ఉపవిభక్తిగా ‘ప’ ఆదేశంగా వచ్చే సందర్భాలలో ముందు అరసున్న వస్తుంది. ఉదాహరణకు ‘నాము– నాఁపచేను, వేము– వేఁప చెట్టు’. ‘దీర్ఘాక్షరం ముందుగా గల’ అని అనడం వల్ల ‘ఇనుపకుండ– మినుప పప్పు– జనపనార’ మొదలైన వాటిలో ‘ప’ వర్ణానికి ముందు అరసున్న లేదని సులభవ్యాకర్త చెప్పారు.“లేమిని దెలుపు ‘ఇఁడి ప్రత్యయంబున ‘డి’ వర్ణమునకు ముందరసున్న యుండును” (సులభ.సంజ్ఞ:30) అనే సూత్రంలో ‘లేమిని’ తెలుపు సందర్భాలలో వచ్చే ‘ఇఁడి’ ప్రత్యయంలోని ‘డి’ వర్ణానికి ముందు అరసున్న వస్తుందని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ‘ముక్కిఁడి, వాలిఁడి, సిగ్గిఁడి’ మొదలైనవి.

‘ను’ వర్ణం చివరగల విశేష్యాలకు రూపాంతరంలో ‘ను’ కు బదులుగా ‘కు’ వర్ణంగాని ‘గు’ వర్ణంగాని వచ్చినపుడు వాటి ముందు అరసున్న వస్తుందని[13] సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ‘కలను– కలఁకు, గోను– గోఁగు’ మొదలైనవి.

అనునాసికాక్షరాలు గల ప్రకృతి(సంస్కృత) శబ్దం తద్భవ రూపంగా మారేటప్పుడు అనునాసికం స్థానంలో నిండు సున్నగాని, అరసున్నగాని వస్తుందని[14] సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ‘ కళంఙ్కః– కలఁక, కాణ్డః– కాఁడ’ మొదలైనవి.

“దీర్ఘం మీఁద సాధ్య పూర్ణము లేదు”( బాల. సంజ్ఞ:15) అని బాల వ్యాకర్త సూత్రీకరించారు. దీర్ఘం తర్వాత వ్యాకరణ కార్యాలతో సాధింపబడిన నిండు సున్నా ఉండదని, అరసున్న మాత్రమే ఉంటుందని బాల వ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ‘వీఁడు, రాఁడు’ రూపాలను పేర్కొన్నారు. బహువచన రూపాలకు కూడా దీర్ఘం తరువాత అరసున్న మాత్రమే వస్తుందని ‘రేఁగులు, గోఁగులు’ వంటి రూపాలను పేర్కొన్నారు.

---

[13] సులభ. సంజ్ఞా:29

[14] సులభ. సంజ్ఞా:31

“దీర్ఘము మీది ఖండంబు ఖండంబ” (సులభ. సంజ్ఞ:34) అనే సూత్రంలో సులభ వ్యాకర్త కూడా దీర్ఘం మీద అరసున్న ఉంటే , అది అరసున్నగానే ఉంటుందని చెప్పారు. ‘వాఁడు’ అనేది ‘వాండు’ అవ్వదని చెప్పారు. సులభ వ్యాకర్త బహువచనంలో అరసున్న నిండు సున్నగా మారుతుందని ‘వాండ్రు, వీండ్రు, ఏండ్లు, వూండ్లు’ వంటి రూపాలను పేర్కొన్నారు.

బాలవ్యాకర్త దీర్ఘం మీద అరసున్నకు నిండుసున్న రాదని ఏకవచనరూపాలకు, బహువచన రూపాలకు రెండింటికీ నిర్దేశించారు. సులభవ్యాకర్త ఏకవచన రూపాలలో దీర్ఘం తరువాత అరసున్నకు నిండు సున్నరాదని అంగీకరించినా, బహువచనంలో దీర్ఘం తర్వాత నిండుసున్న వస్తుందని చెప్పారు. ఇది బాలవ్యారణానికి సవరణ సూత్రంగా కన్పిస్తుంది.

## 3.5 తాలవ్యాలు

బాల వ్యాకర్త చెప్పిన విధంగానే తాలవ్యాలను“ఇఈఎఏలం గూడిన చజ-లు తాలవ్యంబులు” (సులభ. సంజ్ఞ:35) అని సులభవ్యాకర్త నిర్వచించారు. అచ్చతెలుగు మాటలలో చకార, జకారాలు ‘ఇ, ఈ, ఎ, ఏ’ అనే అచ్చులతో కూడి ఉన్నపుడు తాలవ్యాలవుతాయి. ఉదాహరణకు ‘చిలుక – జేజె’.

## 3.6 దంత్యాలు

బాలవ్యాకర్త చెప్పిన విధంగానే సులభ వ్యాకర్త కూడా “అఆఉఊఒఓఔ-లం గూడినచజలు దంత్యంబులు” (సులభ. సంజ్ఞ:36) అని నిర్వచించారు. అచ్చతెలుగు మాటలలో చకార, జకారాలు అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ, ఔ లతో కూడితే దంత్యాలవుతాయి. ఉదాహరణకు ‘చందమామ, జౌకు’. దంత్య తాలవ్య చజలను బాలవ్యాకర్త సవర్ణాలు అని చెప్పగా సులభ వ్యాకర్త “ దంత్య తాలవ్యంబులయిన చ-జలు మిత్రములు” (సులభ. సంజ్ఞ:38) అని మిత్ర వర్ణాలుగా చెప్పారు.

బాల వ్యాకర్త “ఐదంతములయిన చజలు సమేతర శబ్దములందు లేవు” (బాల. సంజ్ఞ:9) అని సూత్రంలో వృత్తి వాక్యంగా చెప్పారు. అనగా అచ్చ తెలుగులో చజలు ఐకారంతో కలిసి ఉండవు. ఈ విషయాన్నే సులభ వ్యాకర్త “చై జై – తెలుఁగుమాటలందు మొదట లేవు”(సులభ.సంజ్ఞ:37) అని సూత్రీకరించారు. తెలుగు మాటలలో కనిపించకపోయిన తత్సమ రూపాలలో కన్పిస్తున్నాయని ‘చైత్రము-జైత్రుడు’ వంటి రూపాలను సులభవ్యాకర్త పేర్కొన్నారు.

బాలవ్యాకర్త "దంత్య తాలవ్యంబులయిన చజలు సవర్ణంబులు"(బాల. సంజ్ఞ:7) అని సూత్రీకరించి దంత్య చజలను, తాలవ్య చజలను 'సమాన వర్ణాలు' అని చెప్పారు. సవర్ణాలు అనగా స్థాన ప్రయత్నాలు సమానంగా గల వర్ణాలు అని అర్థం. సులభ వ్యాకర్త"దంత్య తాలవ్యంబులయిన చజ-లు మిత్రములు" (సులభ. సంజ్ఞ. 38). దంత్య తాలవ్య చజలను మిత్ర వర్ణాలుగా చెప్పారు. అనగా తాలవ్య చకారానికి దంత్య చరానికి, తాలవ్య జకారానికి దంత్య జకారానికి యతి ప్రాసలు కూర్చ వచ్చని చెప్పారు.

బాల వ్యాకర్త "సంస్కృత సమంబులం దికారాంతములయిన శబ్దముల యుపధా చజలు బహువచనంబు పరంబగునపుడు దంత్యములగును"(బాల.సంజ్ఞ.16). సంస్కృత సమాలలో 'చ-జ'లు ఉపథగా ఉండే ఇకారాంత శబ్దాలకు బహువచనం పరమైతే ఆ ఉపథగా ఉండే చజలు దంత్యాలవుతాయని చెప్పి 'అర్చి+ లు = అర్చులు' వంటి రూపాలను చర్చించారు. ఈ సూత్రంలోనే ' రాజు' శబ్దంబొక్కటి దంత్యయుక్తంబు కానంబడియెడి' అని 'రాజు' అనే తత్సమ రూపం మాత్రమే దంత్యమవుతుందని చెప్పారు. ఇదికాక సంస్కృత సమాలలో దంత్యాలు లేవని చెప్పారు.

సులభ వ్యాకర్త "సంస్కృత సమంబులందు దంత్యములు లేవు" (సులభ. సంజ్ఞ:39) అని సూత్రీకరించి బాలవ్యాకర్త చెప్పిన విషయాన్నే చెప్పారు. అనగా తత్సమాలలో కన్పిస్తున్న 'చ-జ'లు 'చే జే' లుగా ఉచ్చరింపకూడదు. 'చక్రం, చందనం, చంపకం, చకోరం, చామరం, చుంబనం, చూడామణి' వంటి శబ్దాలలోని 'చ' కారం 'అ,ఆ,ఉ, ఊ' అనే అచ్చులతో కూడి ఉన్నప్పటికీ దంత్యాలు కావు. తత్సమ రూపాలు కాబట్టి అవి తాలవ్యాలే అవుతాయి. తత్సమాలలో తాలవ్య 'చ-జ'లు కొన్నిచోట్ల దంత్యాలుగా మారుతున్నాయి. ఉదాహరణకు అర్చి+ లు = అర్చులు.

సులభ వ్యాకర్త 'రాజు' శబ్దం ఉకారాంతంగా ఉన్న అది దంత్యమే అవుతుందని రాజు+ ఇతడు= రాజితడు' రూపాన్ని చెప్పారు. 'పాండురాజయశము' ఇందులో ఉన్న 'రాజ' శబ్దాన్ని తాలవ్యంగానే చెప్పారు. ప్రౌఢవ్యాకర్త "రాజు వైకృతంబని కొందఱందురు"[15] అని అనడం వల్ల ఆయన కూడా దీనిని సంస్కృత సమంగానే భావించారని చెప్పవచ్చు. బాల, ప్రౌఢ, సులభ వ్యాకర్తలు ముగ్గురూ 'రాజు' శబ్దాన్ని సంస్కృత సమంగా భావించారని తెలుస్తుంది.

---

[15] ప్రౌఢ. సంజ్ఞా:6

## 3.7 అంతస్థాలు

'య-ర-ల-వ' అనే నాలుగు అక్షరాలను అంతస్థాలు అంటారు. ఈ నాలుగు అక్షరాలు లఘువు, అలఘువులని రెండు విధాలు. 'లఘువు' అనగా తేలికగా పలకబడేది. 'అలఘువు' అనగా కొంత ప్రయత్నంతో పలకబడేది."యరలవలు లఘువులని యలఘువులని ద్వివిధంబులగు" (బాల.సంజ్ఞ:18) అని ఒకే సూత్రంలో బాలవ్యాకర్త చెప్పిన విషయాన్ని, సులభ వ్యాకర్త ఐదు సూత్రాలలో విడివిడిగా అందరికి అర్థమయ్యేవిధంగా వివరించారు.

"సిద్ధ యకార మలఘువు" (సులభ. సంజ్ఞ:41 ). శబ్దంతోనే పుట్టిన 'య' కారం అలఘువు అవుతుంది. ఉదాహరణకు 'చాయ'. "సాధ్యము లఘువు"(సులభ. సంజ్ఞ:42). శబ్దం పుట్టినప్పుడు ఏదైనా అచ్చుతో ఉండి, ఆ అచ్చు 'య' కారంతో కూడి మారినట్లయితే ఆ మారి వచ్చిన 'య' కారం లఘువు. ఉదాహరణకు 'మేన+ అత్త= మేనయత్త'.

'ర'కారాన్ని లఘురేఫమని, 'ఱ'కారాన్ని అలఘు రేఫమని బాలవ్యాకరణంలో చిన్నయ సూరి చెప్పారు. ఈ విషయాన్ని కొంత వివరణ ఇస్తూ వావిలికొలనువారు కొత్త సూత్రాన్ని పేర్కొని కొంత చర్చ విపులంగా చేశారు. "సంయుక్తాక్షర క్రియాంతములం దలఘు రేఫము, ద్విత్వాక్షరమందు లఘు రేఫము లేదు"(సులభ. సంజ్ఞ:43) అని సంయుక్తాక్షరాలలో, క్రియాంత రూపాలలో అలఘురేఫం లేదని, అలాగే ద్విత్వాక్షరాలలో లఘురేఫం లేదని సులభ వ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'గుఱుతు-గుర్తు, కాఱుకొను = కార్కొను'. కఱ్ఱ-జెఱ్ఱి'. 'గుఱుతు' అనే పదంలో అలఘురేఫం గురువుగా ఉచ్చరించినా దానిలోని అచ్చు తొలగించినప్పుడు గురుత్వం పోయి లఘువుగానే(గుర్తు) ఉచ్చరింప బడుతున్నది. కాబట్టి 'గుఱ్తు' అని రాయటం సరైనది కాదు. అలాగే సమాపక క్రియల చివర లఘురేఫమేకాని యలఘురేఫం రాదు. ఉదాహరణకు 'వచ్చిరి-పోయిరి'. టర్రని, గుఱ్ఱని వంటి ద్విత్వాక్షరాలలో లఘు రేఫం లేదని సులభవ్యాకర్త చెప్పారు. బాల వ్యాకర్త శకటరేఫ తత్సమ, తద్భవ రూపాలలో ఉండదని చెప్పారు. సులభ వ్యాకర్త ఈ విషయాన్ని ప్రస్తావించలేదు.

"సిద్ధలకారము లఘువు"(సులభ.సంజ్ఞ:44) అని శబ్దముతోనే పుట్టిన 'ల'కారం లఘువు అవుతుందని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'కలువ, విలువ, నలువ'. "సాధ్య లకారంబలఘువు"(సులభ.సంజ్ఞ:45). బహువచన శబ్దాల చివర 'ఱ, ర, ల, డ' అనే అక్షరాలు

స్థానంలో వచ్చిన 'ళ'కారం అలఘువు. ఉదాహరణకు 'గోరు– గోరులు–గోళ్ళు; పాలు– పాలులు–పాళ్ళు'. వర్ణమాలలో చెప్పినటువంటి 'ళ' కారం అలఘువు కాదు. కూళ, బాళి, తళుకు, బెళుకు వంటి రూపాలలో ఉన్న 'ళ'కారం లఘువో, అలఘువో చెప్పలేము. ఈ పదాలలోని 'ళ'కారం బహువచనార్థంలో 'అ, ర, ల, డ' స్థానంలో వచ్చినది కాదు. సహజంగానే ఆయా శబ్దాలలో ఉన్నది.

"ఆదేశ వకారము లఘువు. సిద్ధ వకారమలఘువు"(సులభ.సంజ్ఞ:46) అని ఆదేశ 'వ'కారం లఘువు అవుతుందని సులభవ్యాకర్త చెప్పారు. 'రాముడు+పలికె' అనే రూపంలో సంధి సూత్రాన్ని అనుసరించి 'ప'కార స్థానంలో 'వ'కారం ఆదేశంగా వచ్చి 'రాముడు వలికె' అయింది. శబ్దంతో పుట్టిన 'వ'కారం అలఘువు. ఉదాహరణకు 'తావి, మోవి' .

సులభ వ్యాకర్త సంజ్ఞాపరిచ్ఛేదంలో 'యె' అనే అక్షరం సంధి వల్ల కాకుండా పదాల మధ్య ఎక్కడెక్కడ వస్తుందో(47–48) రెండు సూత్రాలలో వివరించారు. భూతార్థ క్రియల (కనియెను, చనియెను, పోయెను), తద్ధర్మార్థక క్రియలైన(కనియెదున్, చనియెదున్, వినియెదన్) వంటి క్రియల మధ్యలో 'యె' కారం మాత్రమే రాయాలి 'య'కారం రాయకూడదు. అలాగే ఉయ్యేల, పయ్యెద, తాయెతులు వంటి శబ్దాల మధ్య కూడా 'యె'కారం మాత్రమే రాయాలి. పదాది యకారం తెలుగు పదాలలో మొదటగా ఉండదు. ఈ యె' కార చర్చ బాల, ప్రౌఢ వ్యాకర్తలు చేయలేదు.

## 3.8 తెలుగు పదాలలో మొదట రాని అక్షరాలు

బాలవ్యాకర్త " యకారంబును వు వూ వొ వోలును దెలుగు మాటలకు మొదట లేవు" (బాల.సంజ్ఞా:17) అని కొన్ని అక్షరాలను తెలుగు మాటలలో మొదటగా ఉండవని చెప్పారు. సులభ వ్యాకర్త దానిని కొంత పూరిస్తూ " ఙ, య, ళ, వు, వూ, వొ, వో, యను నక్షరములు తెనుగు మాటలకు మొదట నుండవు"(సులభ. సంజ్ఞ:49) అని ఙ, ళ అనే అక్షరాలు కూడా తెలుగు పదాలలో మొదటగా ఉండవని చెప్పారు.

వావిలికొలనువారు పైన చెప్పిన సూత్ర వివరణలో రేఫతో కూడిన సంయుక్తాక్షరాలు తప్ప, వేరే హల్లుతో కూడుకొన్న సంయుక్త అక్షరాలు తెలుగు మాటలలో మొదటగా ఉండవని చెప్పారు. ఉదాహరణకు 'వ్రాలు, ప్రాలు' ఇవి తెలుగు మాటలు.

## 3.9 సంజ్ఞలు

బాలవ్యాకరణంలో సూత్ర రూపంలో చెప్పిన సంజ్ఞలను “వావిలికొలనువారు కూడా సూత్ర రూపంలోనే చెప్పారు. “‘న’ కారము ద్రుతము”(సులభ. సంజ్ఞ:53), “కచటతపలు పరుషములు” (సులభ. సంజ్ఞ:57), “గజడదబలు సరళములు”(సులభ. సంజ్ఞ:58), “పరుష సరళేతరములు స్థిరములు” (సులభ. సంజ్ఞ:61). బాల వ్యాకరణంలో సందర్భోచితంగా ఆయా పరిచ్ఛేదాల్లో చెప్పిన సంజ్ఞలను కూడా సులభవ్యాకర్త సూత్రాలుగా నిర్వచించారు. “ప్రాతిపదికము నామము” (సులభ. సంజ్ఞ:50), “ప్రత్యయము వర్ణకము” (సులభ. సంజ్ఞ:51). “అదర్శనము లోపము” (సులభ. సంజ్ఞ:54) మొదలైనవి.

సులభవ్యాకర్త కొన్ని సంజ్ఞలను బాలవ్యాకరణం నుండి గ్రహించనప్పటికీ, కొన్ని పాణినీయము, ఆంధ్రశబ్ద చింతామణి నుండి గ్రహించారని తెలుస్తుంది. సంస్కృత వ్యాకరణాన్ని కూడా సులభ వ్యాకరణంలో చర్చించేందుకు వీలుగా “ సుబంతము తిఙ్గంతము పదము” (సులభ.సంజ్ఞ:67) వంటి సంస్కృత సంజ్ఞలను కూడా చెప్పారు.

సంజ్ఞలన్నింటిని సూత్రాలుగా చెప్పటం ఈ వ్యాకరణంలో ఒక విశేషంగా మనకు కన్పిస్తున్నది. సాధారణ సంజ్ఞలను మాత్రమే కాకుండా విశేష సంజ్ఞలను కూడా సంజ్ఞా పరిచ్ఛేదంలో సులభ వ్యాకర్త చెప్పారు. కొన్ని సంజ్ఞలకు నిర్వచనాన్ని కొత్తగా ఇచ్చారు. ఉదాహరణకు “దేశమున వాడబడునది దేశ్యము” (సులభ.సంజ్ఞ:73), “స్థానాక్రమంబాదేశంబు” (సులభ.సంజ్ఞ:65).

## 3.10 కళలు– ద్రుత ప్రకృతికాలు

బాలవ్యాకరణంలో చెప్పిన విధంగానే వావిలికొలనువారు కళలను, ద్రుత ప్రకృతికాలను సూత్రీకరించారు. తెలుగు శబ్దాలు కళలని, ద్రుతప్రకృతికాలని రెండు రకాలుగా ఉన్నాయి. వావిలికొలనువారు ‘ఆంధ్ర శబ్దచింతామణి’ లాగా ముందుగా కళలను చర్చించారు.

“ద్రుతమంతమందు లేని శబ్దాలు కళలు”(సులభ. సంజ్ఞ:68). ఇవి ప్రధానంగా విభక్తులలో(డు, ము,వు,లు, కూర్చి, కై,పట్టి, యొక్క), సమాపక క్రియలైన ప్రథమ, మధ్యమ,

ఉత్తమపురుష బహువచనంలో, అసమాపక క్రియలైన క్త్వార్థకాలలో, అర్థకాలలో (కించిదర్థం-ఇంచుక, ప్రశంసార్థకం-అయ్యారే, కిమర్థకం-ఏమి, ఏది) కన్పిస్తున్నాయి.

"ద్రుత మంతమందు గల శబ్దములు ద్రుతప్రకృతికములు"(సులభ.సంజ్ఞ:68). ఇవి ద్వితీయాది విభక్తులలో, ఉత్తమ పురుష ఏకవచనాలలో, ప్రథమావిభక్తి శబ్దాలలో, భూత తద్ధర్మార్థక ప్రథమ పురుష ఏకవచనాలలో, శత్రర్థక, తుమున్నర్థక, ఆనంతర్యార్థక, చేదర్థక రూపాలలో, సముచ్చయార్థ రూపాలలో, ఎల్లాదులలో కన్పిస్తున్నాయి.

## 3.11 ఆంధ్ర భాష: విభజన

తెలుగు మాట్లాడు ప్రజలు నివసించే దేశానికే ఆంధ్రదేశమని పేరు. ఆ ప్రదేశంలో ప్రజలు మాట్లాడే భాష ఆంధ్ర భాషయని వావిలికొలనువారు నిర్వచించారు. బాల వ్యాకరణంలో చిన్నయసూరి చెప్పినట్లుగానే ఆంధ్ర భాషా పదాలను నాలుగు రకాలుగా వర్గీకరించారు.

### 3.11.1 తద్భవం

బాలవ్యాకర్త "సంస్కృత ప్రాకృత భవంబగు భాష తద్భవంబు"(బాల.సంజ్ఞ:20) అని కేవలం సంస్కృత, ప్రాకృత భాషల నుండి పుట్టిన భాషనే తద్భవంగా చెప్పారు. వావిలికొలనువారు తద్భవానికి ఇచ్చిన నిర్వచనం చాలా అర్థవంతంగా మనకు కన్పిస్తున్నది."వర్ణలోప వర్ణాగమ వర్ణ వ్యత్యయములచేఁ దద్భవంబులగు" (సులభ.సంజ్ఞ:71). సులభ వ్యాకర్త ఏయే విధాలుగా మార్పు చెంది తద్భవ రూపాలుగా ఏర్పడుతున్నాయో పై సూత్రంలో వివరించారు. సంస్కృత శబ్దాలు, ప్రాకృత శబ్దాలు వాటిలోని అక్షరాలను విడవటాన్ని(భోజనమ్- బోనము) వర్ణలోపం అంటారు. క్రొత్త అక్షరాలు ఎక్కువుగా చేర్చడం వల్ల ఏర్పడేది (చంద్రః- చందురుడు) వర్ణాగమం. ముందక్షరం వెనుకకి, వెనుకటి అక్షరము ముందుగా మార్చ రాయటాన్ని(శుచిః- చిచ్చు) వర్ణవ్యత్యయం అంటారు. పైన చెప్పిన మూడు ప్రక్రియల వల్ల ఏర్పడ్డ రూపాలనే తద్భవాలుగా వావిలికొలనువారు పేర్కొన్నారు.

## 3.11.2 తత్సమం

బాలవ్యాకర్త"సంస్కృత ప్రాకృత తుల్యంబగు భాష తత్సమంబు" (బాల.సంజ్ఞ:19). సంస్కృత శబ్దంతో, ప్రాకృత శబ్దంతో సమానమైన రూపం కలిగిన పదాన్ని తత్సమం అంటారని నిర్వచించారు. సులభ వ్యాకర్త "సంస్కృత శబ్దముతోను బ్రాకృత శబ్దముతోను సమానమైన రూపము గలది తత్సమము"(సులభ. సంజ్ఞ:72). అని బాలవ్యాకర్త నిర్వచనాన్నే చెప్పారు. ఈ సూత్ర వివరణలో సంస్కృత ప్రాకృత శబ్దాల చివర విసర్గగాని, పొల్లునుగాని, దీర్ఘంగాని తీసివేసి వాటి స్థానంలో డు, ము, వు ప్రత్యయాలు చేర్చితే తత్సమాలు అవుతాయని చెప్పారు. ఉదాహరణకు ' రామః – రాముడు, విష్ణుః– విష్ణువు'.

సులభ వ్యాకర్త తత్సమాలని తెలుసుకోవడానికి ఐదు రకాల విషయాలను చెప్పారు.

i. సంస్కృతంలో ఉండి తెలుగులో లేని 19 అక్షరాలలో ఏదో ఒక అక్షరం ఉన్న శబ్దాలు. ఉదాహరణ ' రాక్షసుఁడు, అవధారు'.

ii. యకారం– చై–జై –వు–వూ–వొ–వో అనే అక్షరాలు మొదట ఉండే శబ్దాలు. ఉదాహరణకు ' చైత్రము, జైత్రుడు'.

iii. అనుస్వారం పక్కన పరుష సరళాలు, కాకుండా 'కల' శబ్దంతో కూడుకున్న మిగిలిన శబ్దాలు. ఉదాహరణకు ' శృంఖలము'.

iv. 'వ్యాజ్యం' అనే శబ్దం తప్ప (రేఫ కాకుండా) వేరే హల్లులతో సంయుక్తమైన వర్ణాలు మొదటి అక్షరంగా ఉండే శబ్దాలు. ఉదాహరణకు 'స్యందనం'

v. రెండు కంటే ఎక్కువ హల్లులు సంయుక్తమైన శబ్దాలు. ఉదాహరణకు ' మత్స్యము, ముత్త్రోవ'.

## 3.11.3 దేశ్యం

బాలవ్యాకర్త "త్రిలింగ దేశ వ్యవహార సిద్ధంబగు భాష దేశ్యంబు" (బాల. సంజ్ఞ. 21) అని నిర్వచించారు. మూడు శివలింగాల( శ్రీశైలం, ద్రాక్షారామం, కాళేశ్వరం) మధ్య నివసిస్తున్న ప్రజలు వ్యవహరించే భాషను దేశ్యంగా బాల వ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ' ఊరు, పేరు, తావి'.

వావిలికొలనువారు ఏదైన ఒక దేశంలో వ్యవహరించే భాష దేశ్యమని నిర్వచించారు. "దేశమున వాడబడునది దేశ్యము" (సులభ. సంజ్ఞ:73). 'ఆంధ్రదేశ్యం' అనగా ఆంధ్ర దేశంలో పుట్టి ఆంధ్ర ప్రజలతో వాడబడే అచ్చతెలుగు. బాలవ్యాకర్త చెప్పినట్లుగా మూడు లింగాల సరిహద్దుగా గల ప్రదేశంలో భాషా వ్యవహర్తలు మాట్లాడే భాష దేశ్యమని చెప్పలేదు. వావిలికొలనువారు చెప్పిన నిర్వచనం విస్తృతంగా కన్పిస్తున్నది.

వావిలికొలనువారు దేశ్యాలతోపాటుగా అన్యదేశ్యాల చర్చ కూడా ఈ సూత్ర వివరణలో చేశారు. ఆంధ్రులు ఇతర భాషల నుండి తమ భాషలోకి చేర్చుకొనే పదాలను అన్యదేశ్యాలు అంటారని చెప్పారు. ఉదాహరణకు 'పురే' ఇది మరాఠి భాషా పదం. దీనికి చాలు అని అర్థం. ఇది ప్రశంసార్థకమైన 'బాపురే' నుండి ఏర్పడినది కాదని చెప్పారు.

## 3.11.4 గ్రామ్యం

బాలవ్యాకర్త "లక్షణ విరుద్ధంబగు భాష గ్రామ్యంబు" (బాల. సంజ్ఞ:22) అని వ్యాకరణ శాస్త్రానికి విరుద్ధమైన భాషని గ్రామ్యంగా నిర్వచించారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త కూడా నిర్వచించారు. "శాస్త్ర నిషిద్ధము గ్రామ్యము" (సులభ. సంజ్ఞ:74). వ్యాకరణశాస్త్రానికి విరుద్ధంగా ఉన్న భాషకు గ్రామ్య మని పేరు. ఉదాహరణకు 'మా ఊరికి నీవెప్పుడొచ్చావు', 'వాడు వస్తాడా'.

బాలవ్యాకర్త "ఆర్య వ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు" (బాల. సంజ్ఞ:23 ) అని శిష్ట కవుల ప్రయోగాలలో కన్పించే పదాలు గ్రామ్యాలైనా మనం గ్రహించాలి అని చెప్పారు. సులభ వ్యాకర్త కూడా గ్రామ్యాలుగా ఉన్న కొన్ని పదాలను (కఱకంఠుడు, కపిల గడ్డము) పేర్కొని వాటిని అనింద్య గ్రామ్యాలని[16] చెప్పారు. ప్రాణగొడ్డము, కఱ కంఠుడు' వంటివి తద్భవాలవుతాయని కొందరి అభిప్రాయమని ప్రౌఢవ్యాకర్త అభిప్రాయాన్ని ఇక్కడ పేర్కొన్నప్పటికీ తాను మాత్రం వాటిని తద్భవాలుగా భావించలేదని తెలుస్తుంది.

[16] సులభ. సంజ్ఞా. పుట: 40

## 3.12 కొన్ని విశేషాంశాలు

"నామ బిరుదంబులు లక్షణా తీతంబులు" (సులభ.సంజ్ఞ:75) అని వావిలికొలనువారు ఈ సూత్రంలో నామవాచకాలలో ఉండే బిరుదులు శాస్త్రానికి విరుద్ధమైనప్పటికీ వాటిని మార్చకుండా ఉన్నది ఉన్నట్టుగా రాయాలని చెప్పారు. ఉదాహరణకు ' రామారెడ్డి, సీతారావు, సుబ్బారాయుడు'.

నిందార్థంలో, అనుకరణార్థంలో గ్రామ్య పదాలు ప్రయోగించవచ్చుగాని, ఉత్తమ కావ్యాలలో ఉండకూడదు, అధమ కావ్యాలలో ఉండవచ్చని నిర్వచించారు. మహాకవులు ప్రయోగించిన ప్రసిద్ధమైన పదాలనే ప్రయోగించాలి గాని, వారు ఇష్ట ప్రకారం కొండగుర్తులు పెట్టుకున్న పదాలు ప్రయోగించకూడదుదని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'సదా పశ్యంతిగాడు'.

"అదోషంబున కప్రయుక్తమను దోషంబు లేదు" (సులభ. సంజ్ఞ:78) అని పూర్వకవుల ప్రయోగాలలో కొన్ని పదాలు కనిపించకపోయినా, శాస్త్ర నిషిద్ధం గాని దేశ్య భాషా పదాలను ప్రయోగించవచ్చని సులభవ్యాకర్త చెప్పారు.

### ముగింపు:

ఈ అధ్యాయంలో బాల, ప్రౌఢ, సులభ వ్యాకర్తలు నిర్దేశించిన వర్ణాల చర్చ చేశాను. వర్ణాల పేర్లను(సంజ్ఞలను), వాటి ఉత్పత్తి స్థానాలను,'గుణింతాలు' వంటి సూక్ష్మ విషయాలను, అనుస్వారం, అర్ధ బిందువు గురించి, 'యె' అనే అక్షరం సంధి వల్ల కాకుండా పదాల మధ్య ఎక్కడెక్కడ వస్తుంది, 'యకారం, వు, వూ వొ వో' లతో పాటుగా 'ఱ-ళ' అనే అక్షరాలు కూడా తెలుగు పదాలలో మొదటగా ఉండవని చెప్పారు. కళలను, ద్రుత ప్రకృతికాలను, ఆంధ్ర భాషా పదాలైన 'తద్భవ, తత్సమ, దేశ్య, గ్రామ్య' అనే వాటి గురించి బాల, ప్రౌఢ వ్యాకరణాలతో పోల్చుతూ పరిశీలించడం జరిగింది.

**నాల్గవ అధ్యాయం**: 'సంధి విజ్ఞానం' అనే అధ్యాయంలో భాగంగా 'అత్వసంధి, ఇత్వ సంధి, ఉత్వ సంధి, అన్ని అచ్చులకు సంధి, అనుకరణసంధి, సంస్కృత శబ్ద సంధులు మొదలైన సంధులను విశ్లేషిస్తాను.

# మూడవ అధ్యాయం

## వర్ణ విజ్ఞానం– సూత్రాల పట్టిక

| క్రమ సంఖ్య | బాలవ్యాకరణము సూత్రము: సంఖ్య | సులభవ్యాకరణము సూత్రము: సంఖ్య | సవరణ | పూరణ | వివరణ | నూతన విషయ ప్రతిపాదన |
|---|---|---|---|---|---|---|
| 1. | తెనుఁగునకు వర్ణములు.. సంజ్ఞ:3 | తెలుగునకు వర్ణములు.. సంజ్ఞ: 11 | ✓ | –– | –– | –– |
| 2. | –– | వర్ణోత్పత్తి స్థానాలు.. సంజ్ఞ: 16 | –– | –– | –– | ✓ |
| 3. | ఋఋా ఌౡ విసర్గ... సంజ్ఞ:4 | ఋఋా ఌౡవిసర్గ... సంజ్ఞ:17 | –– | ✓ | –– | –– |
| 4. | –– | ఖఛఝఞటణ (గుణింతాలు) సంజ్ఞ: 16 | –– | –– | –– | ✓ |
| 5. | హ్రస్వము మీఁది ఖండ బిందువు... సంజ్ఞ:14 | అనుస్వారము... (విభజన) సంజ్ఞ: 18, 19, 20, | –– | –– | –– | ✓ |
| 6. | –– | అసమాసంబున సంయుక్తాక్షరము.. సంజ్ఞ:22 | –– | –– | –– | ✓ |
| 7. | –– | పంక్త్యాది ననుస్వారము... సంజ్ఞ:23 | –– | –– | –– | ✓ |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 8. | –– | అఁటాదులఁ దప్పఁ బదంబున.. సంజ్ఞ: 24 | –– | –– | –– | ✓ |
| 9. | –– | మహదర్థక బోధకంబగు.. సంజ్ఞ: 25 | –– | –– | –– | ✓ |
| 10. | –– | మహత్యర్థక బోధకంబు.. సంజ్ఞ:26 | –– | –– | –– | ✓ |
| 11. | –– | యకారము కడపటఁ గల ధాతువుల.. సంజ్ఞ: 27 | –– | –– | –– | ✓ |
| 12. | –– | దీర్ఘాక్షరము ముందుగాఁగల.. సంజ్ఞ: 28 | –– | –– | –– | ✓ |
| 13. | –– | 'ను' వర్ణము కడపటఁగల విశేష్య.. సంజ్ఞ: 29 | –– | –– | –– | ✓ |
| 14. | –– | లేమిని దెలుపు 'ఇఁడి'ప్రత్యయంబు సంజ్ఞ: 30 | –– | –– | –– | ✓ |
| 15. | –– | అనునాసికాక్షార ము గల ప్రకృతి శబ్దము.. సంజ్ఞ: 31 | –– | –– | –– | ✓ |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 16. | –– | వికృతి హ్రస్వంబులకు ననునాసికములు.. సంజ్ఞ:32 | –– | –– | –– | ✓ |
| 17. | దీర్ఘం మీఁద సాధ్య పూర్ణము.. సంజ్ఞ: 15 | దీర్ఘము మీది ఖండంబు ఖండంబు.. సంజ్ఞ: | ✓ | –– | –– | –– |
| 18. | ఐదంతములయిన చజలు...(వృత్తి వాక్యం) సంజ్ఞ:9 | చైజై–తెలుఁగు మాట లందు మొదట లేవు... సంజ్ఞ: 37 | –– | –– | –– | ✓ |
| 19. | సంస్కృత సమంబుల.... సంజ్ఞ: 16 | సంస్కృత సమంబుల.... సంజ్ఞ: 39 | –– | –– | ✓ | –– |
| 20. | యరవలు లఘువులని యలఘువులని.. సంజ్ఞ: 18 | సిద్ధ యకార మలఘువు... సంజ్ఞ:41,42,44, 45,46, | –– | –– | ✓ | –– |
| 21. | –– | సంయుక్తాక్షర క్రియాంతము.... సంజ్ఞ: 43 | –– | –– | –– | ✓ |
| 22. | –– | 'యె' అనే అక్షరం.. సంజ్ఞ :47,48 | | –– | –– | –– |
| 23. | త్రిలింగ దేశ వ్యవహార... సంజ్ఞ:21 | దేశమున వాడబడునది... సంజ్ఞ: 73 | –– | –– | ✓ | –– |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 24. | సంస్కృతప్రాకృత భవంబగు.. సంజ్ఞ: 20 | వర్ణలోప వర్ణాగమ వర్ణ వ్యత్యములచే ... సంజ్ఞ:71 | ―― | ―― | ✓ | ―― |
| 25. | సంస్కృతప్రాకృత తుల్యంబగు... సంజ్ఞ:19 | సంస్కృత శబ్దముతోనూ... సంజ్ఞ: 72 | ―― | ―― | ✓ | ―― |
| 26. | లక్షణ విరుద్ధం బగు భాష.. సంజ్ఞ: 22 | శాస్త్ర నిషిద్ధము గ్రామ్యము.. సంజ్ఞ:74 | ―― | ―― | ✓ | ―― |
| 27. | ―― | నామ బిరుదంబులు లక్షణాతీతంబులు.. సంజ్ఞ: 75 | ―― | ―― | ―― | ✓ |
| 28. | ―― | నిందానుకరుణంబుల గ్రామ్యంబు.... సంజ్ఞ: 76 | ―― | ―― | ―― | ✓ |
| 29. | ―― | కవి సంకేతిత సుప్రసిద్ధ పదంబె.. అదోషంబున.. సంజ్ఞ: 78 | ―― | ―― | ―― | ✓ |
| 30. | ―― | అదోషంబున కప్రయుక్తమను.. సంజ్ఞ: 77 | ―― | ―― | ―― | ✓ |

# అధ్యాయం – 4

# సంధి విజ్ఞానం

# అధ్యాయం – 4

# సంధి విజ్ఞానం

## 4.0 పరిచయం

రెండు పదాల కలయికని 'సంధి' అనవచ్చు. వర్ణాలకుగాని శబ్దాలకుగాని అవ్యవహితమైన ఉచ్చారణవల్ల కలిగిన కలయికను సంధి అంటారు. ఇదివర్ణాగమ, వర్ణాదేశ, వర్ణ లోప, వర్ణ వ్యత్యయాలను పొందుతుంది. సంధి కొన్నిచోట్ల జరుగుతుంది, కొన్నిచోట్ల జరగదు. ఎటువంటి చోట్ల సంధి జరుగుతుందో, ఎక్కడ సంధి జరగదో తెలుగు వ్యాకర్తలు తమ వ్యాకరణ గ్రంథాలలో పొందుపరిచారు. రెండు మాటలు ఒకటిగా చేరేటప్పుడు మొదటి మాటలో చివరన ఉండే అచ్చు పోయి దానికి బదులు రెండవ మాట లోని మొదట ఉండే అచ్చు నిలవడం 'సంధి' అనబడుతుందని సులభవ్యాకర్త[17] నిర్వచించారు.

వావిలికొలనుసుబ్బారావుగారు సంధి లక్షణాన్ని చిన్నయసూరిగారు చెప్పిన నిర్వచనాన్నే స్వీకరించి "పూర్వపరస్వరంబులకుం బరస్వరం బేకాదేశంబగుట సంధి" (సులభ. సంధి:1) అని నిర్వచించారు. ఈ సూత్ర వివరణలో వావిలికొలనువారు తెలుగుభాషలో 'అ–ఇ–ఉ' అనే మూడచ్చుల మీద అచ్చులు వచ్చినప్పు మాత్రమే సంధి జరుగుతుంది. మిగిలిన అచ్చుల మీద అచ్చులు వచ్చినపుడు సంధి జరగదని చెప్పారు.

## 4.1 అచ్సంధులు

అచ్చులకు మధ్య జరిగే సంధులను 'అచ్సంధులు' అంటారు. అవి అత్వసంధి, ఇత్వ సంధి, ఉత్వ సంధి మొదలైనవి. వావిలికొలనువారు బాలవ్యాకరణంలో చెప్పినట్లు ఉత్వ సంధి కాకుండా అత్వ సంధినే మొదటగా చెప్పారు.

---

[17] సులభ. సంధి. పుట:42

### 4.1.1 అత్వసంధి

బాలవ్యాకర్త "అత్తునకు సంధి బహుళముగా నగు" (బాల.సంధి:4) అని సూత్రీకరించి హ్రస్వ అకారానికి అచ్చుపరంగా ఉన్నప్పుడు సంధి బహుళంగా (ప్రవృత్తి, అప్రవృత్తి, విభాష, అన్యరీతి) వస్తుందని చెప్పారు. సులభ వ్యాకర్త కూడా "అత్తునకచ్చు పరమైనపుడు సంధి బహుళము"(సులభ. సంధి:2) హ్రస్వ అకారానికి అచ్చుపరంగా ఉన్నప్పుడు సంధి బహుళంగానే చెప్పారు. బాలవ్యాకర్త "అత్తునకు సంధి బహుళముగానగు" (బాల. సంధి:4) అనే సూత్రంలో వృత్తి వాక్యంలో బహుళగ్రహణం చేత స్త్రీ వాచక, తత్సమ, సంబోధన, పదాలలోని అకారానికి అచ్చు పరమైనప్పుడు సంధి జరగదని చెప్పారు. ఉదాహరణకు 'స్త్రీవాచకానికి – అమ్మయిచ్చెను', తత్సమానికి – దూతయితడు', సంబోధనాంతానికి– చెలువుఁడ ఇందము.

బాలవ్యాకర్త పైన సూత్ర వృత్తిలో చర్చించిన విషయాలకు ఒక అంశాన్ని జోడించి సులభవ్యాకర్త సూత్రీకరించారు. "స్త్రీ వాచక, తత్సమ, సంబోధ, నావధారణంబులకు సంధి లేదు" (సులభ. సంధి.4) అని అవధారణార్థానికి కూడా సంధి లేదని చెప్పారు. ఉదాహరణకు 'అమ్మ+ ఎక్కడ= అమ్మ యెక్కడ(స్త్రీ వాచకం), హంస+ ఏది =హంసయేది(తత్సమం), చెలువుడ + ఇటురమ్ము= చెలువుడ యిటురమ్ము (సంబోధనం), రాముఁడ + అతడు= రాముఁడ యతడు(అవధారణం). ఇది బాలవ్యాకరణ సూత్రానికి పూరణ సూత్రంగా కన్పిస్తుంది.

బాలవ్యాకర్త "అత్తునకు సంధి బాహుళముగానగు" (బాల. సంధి:4) అనే సూత్రంలో వృత్తిలో సంస్కృత సమాలకి అత్వసంధి ఆధునిక కావ్యాలలో అరుదుగా కన్పిస్తున్నదని చెప్పి 'గంగనుకాసె, నెలఁతిచ్చెను' వంటి ఉదాహరణలను ఇచ్చారు. బాలవ్యాకర్త వృత్తిలో చెప్పిన విషయాన్నే సులభవ్యాకర్త "తత్సమంబులకు గొండకచో సంధి చూపట్టెడి"(సులభ. సంధి: 6) అని సూత్రీకరించారు. ఉదాహరణగా 'పరమాత్మందురు', గంగనుకాసె' అనే రూపాలను ఇచ్చారు. బాలవ్యాకర్త వృత్తివాక్యాలలో చెప్పిన విషయాలను కూడా సూత్రంగా చెప్పి వాటి ప్రాముఖ్యాన్ని సులభవ్యాకర్త తెలియజేశాడు.

ప్రౌఢవ్యాకర్త "శ్రేష్ఠతా వాచకములగు నార్యాంబాద్యర్థక శబ్దంబులు పరంబులగుచో నన్ని యచ్చులకు సంధి నిత్యము" (ప్రౌఢ.సంధి:1) అని శ్రేష్ఠతని బోధించే ఆర్య(అయ్య), అంబా(అమ్మ),

అన్న, అక్క, అప్ప మొదలైన శబ్దాలు పరమైతే అచ్చులన్నింటికి సంధి నిత్యంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'రామ+అయ్య= రామయ్య ', లక్ష్మి+అమ్మ= లక్ష్మమ్మ'. ప్రౌఢవ్యాకర్త శ్రేష్ఠతా వాచకాలు పరమైనప్పుడు అన్ని అచ్చులకు ఒకే సూత్రంలో సంధి నిత్యమని చెప్పారు.

సులభ వ్యాకర్త అకారాంత రూపాలకి, ఇకారాంత రూపాలకి సంధికార్యాలను వేరువేరు సూత్రాలలో చెప్పారు. ఇకారాంత నామాలకు శ్రేష్ఠార్థాన్నిచ్చే అన్నాదులు పరంగా ఉంటే సంధి ప్రాయికంగా వస్తుందని సులభ వ్యాకర్త చెప్పారు.

సులభవ్యాకర్త"నామంబుల తుది అకారమునకుఁబరముగ శ్రేష్ఠార్థకంబులగు అన్నాదులును, ఆకును బరమైనచో సంధి నిత్యము"( సులభ. సంధి:3) అని అకారాంత నామాలకు శ్రేష్ఠార్థాన్ని ఇచ్చే అన్నాదులు(అన్న, అయ్య, అక్క, అమ్మ), ఆకు పరంగా ఉంటే సంధి నిత్యంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'రామ+అయ్య= రామయ్య, చింత+ఆకు= చింతాకు'.

## 4.1.2 ఇత్వసంధి

ఇత్వసంధిలో సంధి నిత్యంగా జరిగిన రూపాల కన్నా జరగని రూపాలే ఎక్కువ. సులభవ్యాకర్త "ఇకారాంత నామవాచకంబులకు శ్రేష్ఠార్థకంబులైన అన్నాదులు బరమైనపుడు సంధి ప్రాయికంబు"(సులభ. సంధి:5) అని ఇకారాంత నామాలకు శ్రేష్ఠార్థాన్ని ఇచ్చే అన్నాదులు(అన్న, అయ్య, అక్క, అమ్మ) పరంగా ఉంటే సంధి ప్రాయికంగా వస్తుందని చెప్పారు. అంటే కొన్నిచోట్ల సంధి జరగక యడాగమం వస్తుంది. ఉదాహరణకు 'లక్ష్మి+ అమ్మ= లక్ష్మమ్మ', అమ్మాజి +అమ్మ =అమ్మాజమ్మ, అమ్మాజియమ్మ'.

బాలవ్యాకర్త "మధ్యమ పురుష క్రియలందిత్తునకు సంధియగును"(బాల. సంధి:7) మధ్యమ పురుష క్రియాపదాల్లోని ఇత్వానికి అచ్చుపరంగా ఉన్నప్పుడు సంధి నిత్యంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'ఏలితివి+ అపుడు =ఏలితివపుడు'. బాలవ్యాకర్త ప్రథమ పురుష, ఉత్తమ పురుష క్రియల ఇత్వానికి సంధిని ప్రత్యేకంగా చెప్పలేదుగాని 'క్రియాపదంబులం దిత్తునకు సంధి వైకల్పికముగానగు'(బాల. సంధి:6) అనే సూత్రంలో ఉదాహరణలుగా ప్రథమ పురుష, ఉత్తమ పురుష బహువచనానికి సంబంధించినవి ఇచ్చారు.

సులభవ్యాకర్త "మధ్యమ పురుషమున ఇకారమునకు సంధి నిత్యము"(సులభ. సంధి:7) అని సూత్రీకరించి మధ్యమ పురుష క్రియాపదాల్లోని ఇత్వానికి అచ్చు పరంగా ఉన్నప్పుడు సంధి నిత్యంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'సేవించితివి+ అచ్యుతుని= సేవించితివచ్యుతుని'. సులభ వ్యాకర్త ఈ సూత్ర వివరణలో ప్రథమ, ఉత్తమ పురుష క్రియల బహువచనరూపాలకు సంధి వికల్పంగా వస్తుందని చెప్పారు. ప్రత్యేకంగా సూత్రీకరించలేదు. ఉదాహరణకు 'వచ్చిరి+ అసురులు= వచ్చిరసురులు– వచ్చిరియసురులు (ప్ర.పు.బహువచనం),'వచ్చితిమి+ ఇచటికి = వచ్చితిమిచటికి– వచ్చితిమి యిచటికి(ఉ.పు. బహువచనం)'.

బాలవ్యాకర్త "ఏమ్యాదుల యిత్తునకు సంధి వైకల్పికముగానగు"(బాల.సంధి:5) ఏమ్యాదుల్లోని, క్రియా పదాల్లోని హ్రస్వ ఇకారానికి సంధివికల్పంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'ఏమి+ అంటివి= ఏమంటివి'. సులభ వ్యాకర్త కూడా ఏమ్యాదుల ఇత్వానికి సంధి వికల్పంగానే చెప్పారు. "ఏమ్యాదుల ఇత్తునకు సంధి వైకల్పికము" (సులభ. సంధి:8). ఉదాహరణకు 'అది+ఎవతె= అదెవతె, అదియెవతె'.

బాల వ్యాకర్త క్త్వార్థగత ఇత్వానికి సంధి ఉండదని చెప్పారు. ఉదాహరణకు 'వచ్చి+ఇచ్చెను = వచ్చియిచ్చెను'. సులభ వ్యాకర్త కూడా."క్త్వార్థకంబైన యిత్తునకు సంధిలేదు"(సులభ.సంధి:9) అని సూత్రీకరించి క్త్వార్థగత ఇత్వానికి సంధిలేదని చెప్పారు. ఉదాహరణకు 'చూచి+ ఆడెను= చూచియాడెను'.

## 4.1.3 ఉత్వసంధి

బాలవ్యాకర్త "ఉత్తునకచ్చుపరంబగునపుడు సంధియగు" (బాల.సంధి:1) అని ఉత్వసంధి నిత్యంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'రాముడు+ అతడు = రాముడతడు. సులభ వ్యాకర్త కూడా "ఉత్తునకు సంధి నిత్యం"(సులభ. సంధి:10) అని నిర్వచించారు. సులభవ్యాకర్త ఉత్వసంధి నిత్యంగా ఏ సందర్భాలలో వస్తుందో ఈ సూత్ర వివరణలో చెప్పారు. ప్రథమావిభక్తి, సమాపక క్రియలలోని చివర ఉన్న ఉకారానికి అచ్చు పరంగా ఉన్నప్పుడు సంధి నిత్యమని చెప్పారు. ఉదాహరణకు 'రాముడు+ అతడు = రాముడతడు, 'రాదు+అతడు= రాఁడతడు'. 'కూరుచు+ఉండు= కూరుచుండు'.

బాలవ్యాకర్త ప్రథమేతర విభక్తుల్లో చివర ఉన్న ఉకారానికి , శత్రర్థక చువర్ణం(చున్)లోని ఉకారానికి సంధి వికల్పమని చెప్పారు. సులభ వ్యాకర్త కూడా "ప్రథమేతరవిభక్తి, శత్రర్థక చువర్ణంబులంగల ఉత్తునకు సంధి వైకల్పికము" (సులభ.సంధి:11) అని సూత్రీకరించారు.'ఉదాహరణకు 'నా కొఱకున్+ ఇచ్చె= నాకొఱకిచ్చె, నా కొఱకునిచ్చె (చతుర్థీ విభక్తి). పోవుచున్+ఉన్నాడు= పోవుచున్నాడు, పోవుచునున్నాడు (శత్రర్థకం)'.

సులభవ్యాకర్త "రూపాంతరమందు ద్విత్వము గలిగిన శబ్దముల 'ఉ' కారమున కచ్చు పరమైనపుడు సంధి లేదు" (సులభ.సంధి:12) అని సూత్రీకరించారు. రూపాంతరం వల్ల ద్విత్వం కలిగిన ఉకారాంత శబ్దాలకు(కను- కన్ను, మిను-మిన్ను) అచ్చు పరమైనప్పుడు సంధి జరగదు. ఉదాహరణకు 'కన్ను+ అదిరె= కన్నదరె' అవుతుంది. 'కను+ అదరె= కనదరె' అని చెప్పకూడదు. ఇటువంటి రూపాల ప్రసక్తి బాల, ప్రౌఢ వ్యాకరణాలలో లేదు.

## 4.1.4 అన్ని అచ్చులకు సంధి

బాలవ్యాకర్త వాక్యం చివరలో సంధి చేయకపోయిన దోషంకాదని పూర్వ లాక్షణికులు చెప్పిన విషయాన్ని బాలవ్యాకర్త గ్రహించి సూత్రీకరించారు. సులభవ్యాకర్త కూడా "వాక్య విరామంబున సంధిలేమి దోషంబు గాదు"(సులభ. సంధి: 13) అని సూత్రీకరించారు. ఉదాహరణగా 'రాముఁడు మంచి వాఁడు. అతని నమ్మిన వారికి మేలిచ్చును'. మొదటి వాక్యం చివరి శబ్దం 'వాడు' ఉకారాంతం. దానికి రెండవ వాక్యం మొదటి అక్షరం 'అ' పరంగా ఉన్నది. ఇక్కడ వాక్య విరామంలో సంధి చేయకపోయిన తప్పుకాదని సులభ వ్యాకర్త చెప్పారు. వాక్య విరామంలో అచ్చుకుగాని , హల్లుకుగాని అచ్చు పరమైనప్పటికీ సంధి చేయకపోతే తప్పుకాదని సులభ వ్యాకర్త చెప్పారు. ఈ సూత్ర వివరణలో సులభ వ్యాకర్త వాక్యాన్ని నిర్వచిస్తూ 'కర్త, సమాపకక్రియ కలిగి సంపూర్ణమైన అర్థంగల శబ్ద సమూహాన్ని, పద్యములలో ఉండే ఒక్కొక్క పాదాన్ని వాక్యమని' చెప్పారు.

బాలవ్యాకర్త "అంద్వవగాగమంబులందప్ప నపదాదిస్వరంబు పరంబగున పుడచ్చునకు సంధి యగు" (బాల.సంధి:11) అని అపదాలకు(పదం కానివి) ఈ సూత్రం ద్వారా సంధి నిత్యంగా చెప్పెను. 'అందు- అవక్' ఆగమాలకు మాత్రం ప్రయోగానుసారం గ్రహించాలని చెప్పారు. ఉదాహరణకు 'మూర+ఎడు= మూరెడు', రాముల+అందు= రాములందు, రాములయందు'.

సులభవ్యాకర్త కూడా ఇదే విషయాన్ని చెబుతూ "అంద్వం తాగాగమంబులందప్ప నపదాది స్వరంబున కచ్చు పరంబగు నపుడన్ని యచ్చులకు సంధి నిత్యము "(సులభ. సంధి:14) అని సూత్రీకరించారు. 'అందు-అంత-అవక్' అనే శబ్దాలు పరమైనప్పుడు తప్ప మిగిలిన అపదాలకు(నామవాచకం, క్రియ కాకుండా అర్థం లేని మాటలు) అచ్చుపరమైనప్పుడు అన్ని అచ్చులకు సంధి నిత్యమని చెప్పారు. ఉదాహరణకు 'బార+ ఎదు= బారెదు, తూము+ ఎదు= తూమెదు, రాముల+అందు= రాములందు, రాములయందు. ఈ సూత్రంలో బాలవ్యాకర్త చెప్పిన విషయాలనే కాకుండా సులభవ్యాకర్త 'అందు-అవ' శబ్దాలలాగా 'అంత' అనే శబ్దానికి కూడా ప్రయోగానుసారం సంధి జరుగుతుందని చెప్పారు. ఉదాహరణకు 'గంప+అంత= గంపంత, గంప యంత'. ఇది బాలవ్యాకరణానికి పూరణ సూత్రంగా కన్పిస్తుంది.

సులభ వ్యాకర్త "ఏసి పరమైనప్పుడు సర్వ ప్రాణులకు సంధి నిత్యము"(సులభ. సంధి: 15) అని సూత్రీకరించారు. అనగా 'ఏసి' శబ్దం పరమైనప్పుడు అన్ని అచ్చులకు సంధి నిత్యంగా వస్తుంది. ఉదాహరణకు 'గంపడు+ఏసి= గంపడేసి. నాలుగు+ఏసి= నాలుగేసి'. 'ఏసి' అనేది పరిమాణార్థంలో వస్తుందని సులభ వ్యాకర్త చెప్పారు. ఇటువంటి రూపాల ప్రసక్తి బాల, ప్రౌఢ వ్యాకరణాలలో లేదు.

సులభవ్యాకర్త "దీర్ఘాచ్చునకు సంధి లేదు"(సులభ. సంధి. 16) అని సూత్రీకరించారు. దీర్ఘమైన అచ్చుకు అచ్చులు పరమైనపుడు సంధి జరగదని అర్థం. సంధి రాని సందర్భాలలో 'యట్' ప్రత్యయం ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు ' మా+ ఊరు= మా+య్+ఊరు= మాయూరు'. బాల, ప్రౌఢవ్యాకర్తలు ఈ విషయాన్ని చెప్పలేదు.

బాలవ్యాకర్త ఆమ్రేడితం పరమైనప్పుడు ఏ అచ్చుకైనా సంధి తఱచుగా వస్తుందని చెప్పారు. పూర్వ వ్యాకర్తలు చెప్పిన విధంగానే ద్విరుక్తం యొక్క పరరూపాన్నే 'ఆమ్రేడితం'అని చెప్పారు. ఉదాహరణకు 'ఔర+ఔర= ఔరౌర', ఏమి + ఏమి = ఏమేమి, ఏమియేమి'. సులభవ్యాకర్త కూడా"అచ్చున కామ్రేడితంబు పరంబగునపుడు సంధి తఱుచుగ నగు"(సులభ.సంధి:17)అని సూత్రీకరించి బాలవ్యాకరణంలోని విషయాలనే చర్చించినప్పటికీ కొంత వివరణ కూడా ఇచ్చారు. ఒకమాటని రెండు సార్లు చెప్పినపుడు రెండవసారి చెప్పిన శబ్దానికి ఆమ్రేడితమని వ్యాకరణ సంజ్ఞ అవుతుందని చెప్పారు. వ్యాకరణంలో కాకుండా వేరే చోట్ల చెప్పేటప్పుడు ఒక మాట రెండు, మూడు సార్లు చెప్తే వాటిలోని మొదటి శబ్దం కాకుండా మిగిలిన ప్రతి శబ్దం ఆమ్రేడితమని సులభవ్యాకర్త

చెప్పారు. 'ఔర+ఔర' ఇందులో రెండవసారి చెప్పిన 'ఔర' ఆమ్రేడితం అవుతుంది. కొందరు 'ఔరౌర' ఆమ్రేడితం అంటారు. అలా ఉచ్చరించడం తప్పని సులభవ్యాకర్త చెప్పారు.

## 4.2 స్వరలోప సంధులు

సులభ వ్యాకర్త "హల్లు పరమైనప్పుడు ఏని లోని ఇకారమునకు లోపము వైకల్పికము" (సులభ. సంధి.18) అని సూత్రీకరించారు. హల్లు పరమైనప్పుడు 'ఏని' లోని ఇకారానికి లోపం వికల్పంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'వచ్చెనేని చూచెద' ఇకారం లోపించగా 'వచ్చెనేన్ జూచెద- వచ్చె జూచెద'. బాల, ప్రౌఢ వ్యాకర్తలు ఈ విషయాన్ని చర్చించలేదు.

సులభవ్యాకర్త" 'ను' వర్ణకము కడపటఁగల ధాతువులకు శత్రర్థక 'చు' వర్ణము పరమైనపు 'డా' ను వర్ణములోని 'ఉ' కారమునకు వైకల్పికముగలోపము" (సులభ.సంధి:19) అని సూత్రీకరించారు. అను, విను మొదలైన ధాతువులలో 'ను' వర్ణం చివరగా ఉంటుంది. వీటికి చువర్ణం పరమైనపుడు అనుచున్, వినుచున్ అనే రూపాలు ఏర్పడతాయి. ఇలాంటి సందర్భాలలో ధాతువుల చివర ఉన్న 'ను' లోని ఉకారానికి లోపం వికల్పంగా వస్తుంది. ఉకారం లోపించినపుడు 'అన్చు, విన్చు' అవుతాయి. కొన్నిసార్లు 'న్' స్థానంలో నిండుసున్న వికల్పంగా వచ్చి 'అంచు, వించు' వంటి రూపాలు ఏర్పడతాయి. 'చనుచు' వంటి రూపాలలో ధాతువు చివర ఉన్న 'న్' స్థానంలో నిండుసున్న రాదని 'చంచు' వంటి ప్రయోగాలు లేవని సులభవ్యాకర్త చెప్పారు. ఈ ప్రక్రియని బాల, ప్రౌఢ వ్యాకర్తలు చెప్పలేదు.

బాలవ్యాకర్త 'అది-అవి' శబ్దాల హ్రస్వమైన అకారానికి సమాసంలో లోపం బహుళంగా వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "అది అవి శబ్దంబుల యత్తునకు వృత్తిని లోపంబు బాహుళంబు" (సులభ.సంధి:20) అని సూత్రీకరించారు. ఏ శబ్దాలకైన 'అది- అవి' అనే శబ్దాలు పరమై సమాసాలుగా ఏర్పడ్డప్పుడు 'అది- అవి' లోని మొదటి అకారం బహుళంగా లోపిస్తుంది. ఉదాహరణకు 'చిన్న+ అది, చిన్న+ది= చిన్నది. చిన్న+అది= చిన్నయది' .

బాలవ్యాకర్త"ఆచ్ఛికంబులం బదమధ్యంబుల న ల డ రల యుత్వంబునకు లోపంబు బహుళంబుగనగు" (బాల. ప్రకీర్ణక:17) అని ప్రకీర్ణక పరిచ్ఛేదంలో చెప్పిన విషయాన్ని సులభవ్యాకర్త సందర్భోచితంగా ఈ విభాగంలో చెప్పారు. సులభవ్యాకర్త"ఆచ్ఛికంబులఁ బదమధ్య

ను లు డు రుల యుత్వంబునకు లోపంబు బహుళంబు"(సులభ. సంధి:21) అని సూత్రీకరించారు. ఆచ్ఛిక పదాల మధ్య 'ను, లు, డు, రు' అనే అక్షరాలు ఉన్నట్లయితే వాటి ఉత్వానికి లోపం బహుళంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'మినుకు= మిన్+ఉ+కు=మిన్కు, చిలుక- చిల్క, పెరుగు-పెర్గు'. పదాంతాల్లో అసంయుక్త 'ను-లు-రు'ల ఉత్వానికి లోపం వస్తుంది. ఉదాహరణకు 'మ్రానుపడె= మ్రాన్+ఉ+ పడె = మ్రాన్పడె'.

సులభవ్యాకర్త "ఇట్టిలోపం బొకానొకచో నితర స్వరంబులకుఁ బ్రయోగంబులఁ జూపట్టు"(సులభ. సంధి: 22) అని సూత్రీకరించారు. అచ్చతెలుగు పదాల మధ్యలో అచ్చు లోపంచడం అనేది కొన్ని చోట్ల ఉకారానికి మాత్రమే కాక ఇతర అచ్చులైన అకారం, ఇకారం ఉన్నపుడు కూడా జరుగుతుందని ప్రయోగాలు కన్పిస్తున్నాయని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'చూడికి- చూడ్కి', కలికి- కల్కి, పొలఁతి- పొల్తి, మెలఁత- మెల్త'. 'కోరికె' వంటి శబ్దాల మధ్యలో అచ్చు లోపింపచేసి 'కోర్కె' అనే చెప్పకూడదు. ఇది అసాధు రూపం అవుతుందని సులభవ్యాకర్త చెప్పారు. ఈ విషయాలను బాల, ప్రౌఢ వ్యాకర్తలు చర్చించలేదు.

సులభవ్యాకర్త "ఏ యక్షరంబు మీఁది యే స్వరంబునాకైన లోపం బెందేని మహాకవి ప్రయోగంబులఁ గాననాయ్యెడు" (సులభ. సంధి:23) అని సూత్రీకరించారు. అక్షరాలతో సంబంధం లేకుండా ఒక అక్షరంలో ఉన్న స్వరంతో, ఇతర అక్షరాలలో ఉండే ఏ స్వరంతోనైనా లోపం చేసినట్లు మహాకవుల ప్రయోగాలలో కన్పిస్తున్నాయి. ఉదాహరణకు చెయువులు- చెయ్వులు, ఉంగరము- ఉంగ్రము, కుదురుచు-కుద్రుచు. విషయాలను బాల, ప్రౌఢ వ్యాకర్తలు చర్చించలేదు.

బాలవ్యాకర్త "అబ్బురాదులం దుత్వంబునకు లోపంబు విభాషనగు"(బాల. ప్రకీర్ణక:19) అని ప్రకీర్ణక పరిచ్ఛేదంలో చెప్పిన విషయాన్ని సులభవ్యాకర్త సందర్భోచితంగా సంధి పరిచ్ఛేదంలోనే చెప్పారు."అబ్బురాదులం దుత్వంబునకు లోపంబు విభాషనగు" (సులభ. సంధి:24) అని సూత్రీకరించి అబ్బురాదులకు ఉత్వలోపాన్ని వికల్పంగా చెప్పారు. ఉదాహరణకు 'అబ్బురము= అబ్+బ్+ఉ+రము= అబ్రము' అవుతుంది.

బాలవ్యాకర్త "పదాంతంబులయి యసంయుక్తంబులయిన నులురుల యుత్వంబునకు లోపంబు బహుళంబుగనగు"(బాల. ప్రకీర్ణక:16) అని సూత్రీకరించారు. పదాంతాలై,

అసంయుక్తంలైన 'ను-లు-రు' అనే వర్ణాలలోని ఉత్వానికి లోపం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు 'మ్రాను+పడె'. ఉత్వం లోపించి 'మ్రాన్+పడె=మ్రాన్పడె'. వత్తురు+వారు =వత్తుర్+వారు=వత్తుర్వారు, వత్తురువారు'. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త "పదాంతంబు లయి యసంయుక్తంబు లయిన ను-లు-రు-ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు" (సులభ. సంధి:25) అని సూత్రీకరించారు. పదాంతాలై, అసంయుక్తంలైన 'ను-లు-రు' అనే వర్ణాలలోని ఉత్వానికి లోపం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు 'మ్రాను+ పడు'. ఇందులో ఉత్వానికి లోపం వచ్చి ' మ్రాన్పడు' అయింది.

## 4.3 కళా సంధులు

బాలవ్యాకర్త "ప్రథమమీఁది పరుషములకు గసడదవలు బహుళముగానగు" (బాల.సంధి:13) అని ప్రథమా విభక్తి తరువాత ఉన్న కచటతపల స్థానంలో వరుసగా గసడదవలు బహుళంగా వస్తాయని చెప్పారు. ఉదాహరణగా 'వాఁడు+కొట్టె= వాడు గొట్టె, అపుడు+చనియె=అపుడు సనియె, రారు+ కదా=రారుకదా". వంటి రూపాలను సాధించారు. బాల వ్యాకర్త ఈ సూత్రంలో ప్రథమా విభక్తి ప్రత్యయాలు చివరగా ఉన్నప్పుడు మాత్రమే పరుషాలకు గసడదవలు వస్తాయని చెప్పి వివరణలో కళలుగా ఉండే క్రియల మీద, కళలుగా ఉండే అవ్యయాల మీద పరుషాలు పరమైన 'గ-స-డ-ద-వ'లు వస్తాయని చెప్పారు.

సులభ వ్యాకర్త "ప్రథమల మీది పరుషములకు గ-స-డ-ద-వలు బాహుళంబుగానగు" (సులభ. సంధి:26). ఈ సూత్రంలో కేవలం ప్రథమావిభక్తి తరువాత ఉన్న పరుషాలకు మాత్రమే గ-స-డ-ద-వలు వస్తాయి అనే అర్థంలో చెప్పలేదు. అందుకే 'ప్రథమల' మీద అని సూత్రీకరించారు. 'ప్రథమలు' అని ప్రథమా విభక్తి ప్రత్యయాలతోపాటుగా ఇతర సందర్భాలలో అనగా కళలుగా ఉండే అవ్యయాల మీద, కళలుగా ఉండే క్రియల మీద పరుషాలకు 'గ-స-డ-ద-వ' లు వస్తాయని చెప్పారు. ఉదాహరణకు ' వాడు కొట్టె= వాడుగొట్టె', ఏమి చెప్పితివి= ఏమి సెప్పితివి'. రావు+ కదా= రావుగదా'. ఈ సూత్రంలో ' ప్రథమలు' అనడం వల్ల బాలవ్యాకర్త వృత్తి వాక్యంలో చెప్పిన విషయాలు కూడా సూత్రంలోనే చెప్పబడ్డాయి.

బాలవ్యాకర్త అచ్చతెలుగు శబ్దాల మీద  ఉన్న సంస్కృతసమంలోని పరుషాలకు గసడదవలు రావని 'వాఁడు కంసారి' వంటి రూపాన్ని ఉదాహరణగా ఇచ్చారు.  ఇదే విషయాన్ని సులభవ్యాకర్త కూడా "తెలుఁగుల మీఁది తత్సమశబ్దంబుల క-చ-ట-త-ప-లకు గ-స-డ-ద-వ-లు రావు" (సులభ. సంధి:27) అని సూత్రీకరించి దేశ్య, తద్భవ శబ్దాలకు తత్సమ శబ్దాలతో సంధి చేసేటప్పుడు తత్సమ శబ్దాలలోని క-చ-ట-త-పలకు గ-స-డ-ద-వలు రావని వావిలికొలను చెప్పారు. సూత్ర వివరణలో తత్సమ పదాలకు తత్సమాలు పరమైనా, తత్సమాలకు  తెలుగు పదాలు పరమైనా , తెలుగు పదాలకు తెలుగు పదాలు పరమైనా 'గ-స-డ-ద-వ' లు  బహుళంగా వస్తాయని చెప్పారు. ఇది బాలవ్యాకరణానికి సవరణ సూత్రంలాగా కన్పిస్తుంది.

సులభవ్యాకర్త "భిన్నపద ప్రథమల మీఁది పకారమునకు 'వ' కారాదేశంబు  ప్రాసంబున నిత్యంబు. యతిస్థానంబున నిషేధంబు. తక్కినయెడ  వైకల్పికంబు" (సులభ. సంధి:28) అని సూత్రీకరించారు. ఇక్కడ 'భిన్న పదాలు' అంటే తత్సమ పదాలకు తత్సమాలు పరమైనపుడు, తత్సమాలకు  తెలుగు పదాలు పరమైనపుడు, తెలుగు పదాలకు తెలుగు పదాలు పరమైనపుడు అని అర్థం. 'ప్రథమలు' అని  ప్రథమా విభక్తి ప్రత్యయాలతోపాటుగా ఇతర సందర్భాలలో అనగా  కళలుగా ఉండే అవ్యయాల మీద, కళలుగా ఉండే క్రియల మీద పరుషాక్షరమైన 'ప' కారనికి బదులుగా 'వ'కారం ఆదేశంగా ప్రాసస్థానంలో నిత్యంగా, యతి స్థానంలో నిషేధంగా, మిగిలిన చోట్ల వికల్పంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'పెంపు+పరీక్షింపమో=పెంపు వరీక్షింపమో'. సులభవ్యాకర్త ఈ సూత్ర వివరణలో కేవలం 'ప'కారనికి మాత్రమే కాక మిగిలిన పరుషాక్షరాలకు కూడా 'గ-స-డ-ద-వ'లు ఇదేవిధంగా వస్తాయని చెప్పారు. ఉదాహరణకు 'ఇట్లు+ తపంబు చేయుచుండుదు= ఇట్లు దపంబు చేయుచుండుదు. ఇది కూడా సవరణ సూత్రంలాగా కన్పిస్తుంది.

## 4.4 ద్రుతసంధులు

సులభవ్యాకర్త "ద్రుత ప్రకృతికమున కచ్చు పరంబగునపుడు లుక్సంశ్లేషంబులు లేవు" (సులభ. సంధి:29) అని సూత్రీకరించారు. ద్రుతప్రకృతాలకు అచ్చు పరమమైనప్పుడు లోపం గాని, సంశ్లేష గాని చెప్పకూడదు. ఒకవేళ పూర్వ కవుల ప్రయోగాలలో అటువంటి రూపాలు కన్పించినా వాటిని అనుసరించరాదని వావిలికొలనువారు ఈ ప్రకరణంలో మొదటి సూత్రంలో చెప్పారు.

ఉదాహరణకు 'చూచెన్+అతఁడు' అని ఉండగా ఇక్కడ 'చూచెన్' అనేది భూతార్థక క్రియ. ద్రుతప్రకృతికము కలిగి ఉన్న పదము. దీనికి అచ్చు పరమైనది. ఈ పదం చివర నకారాన్ని లోపింప జేసి చూచె+అతఁడు= చూచతఁడు గాని, చూచె యతఁడని గాని రాయకూడదు. చూచెన్నతఁడు అని కూడా రాయకూడదని వావిలికొలనువారు చెప్పారు.

బాలవ్యాకర్త "ఇఁకాదులకుఁ దప్ప ద్రుత ప్రకృతికములకు సంధిలేదు" (బాల.సంధి:9) అని సూత్రీకరించారు. 'ఇఁక' మొదలైన వాటికి తప్ప మిగిలిన ద్రుతప్రకృతికాలకు సంధి లేదు. బాలవ్యాకర్త వృత్తి వాక్యంలో ఇఁక, ఇఁగ, ఎట్టకేలకు, ఎట్టకేని మొదలైనవి ఇకాదులని వీటికి సంధి వికల్పంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'ఇఁకన్+ఏల= ఇఁకేల, ఇఁకనేల'. మిగిలిన ద్రుతప్రకృతికాలకు సంధి లేదు. ఉదాహరణకు 'వచ్చున్+ఇపుడు= వచ్చునిపుడు'.

సులభవ్యాకర్త "ఇఁకాదులకచ్చు పరంబగునపుడు సంధి వైకల్పికము" (సులభ. సంధి:30) అని సూత్రీకరించారు. ఈ ప్రకరణంలో చెప్పిన మొదటి సూత్ర నియమానికి అపవాద సూత్రం. ఉదాహరణకు 'ఇకన్+ ఏమి= ఇకనేమి, ఇకేమి'. ప్రథమేతర విభక్తి శత్రర్థక సూత్రం(సులభ. సంధి:11) ప్రకారం కూడా ద్రుతప్రకృతిలకు వికల్పసంధి జరుగుతుంది. బాలవ్యాకర్త వృత్తి వాక్యంలో ఇకాదులకు సంధి వైకల్పికం అని చెప్పారు. దానిని సులభవ్యాకర్త సూత్ర రూపంలో చెప్పారు. ద్రుతప్రకృతాలకు సంధి జరగదని సులభవ్యాకర్త చెప్పలేదు. ఇది ఒక సవరణ సూత్రంలాగా కన్పిస్తుంది.

బాలవ్యాకర్త "ద్రుతప్రకృతికం తరువాత ఉన్న పరుషాలకు సరళాలు వస్తాయి. ఉదాహరణకు ' పూచెను+కలువలు= పూచెను గలువలు, కూసెను+ పక్షులు= కూసెను బక్షులు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త కూడా చెప్పారు. "ద్రుతప్రకృతికము మీఁది పరుషములకు సరళములగు" (సులభ.సంధి:31) అని సూత్రీకరించి ద్రుతప్రకృతికం తరువాత ఉన్న పరుషాలకు సరళాలు నిత్యంగా వస్తాయి. ఉదాహరణకు ' చూచెను+ కంజాక్షుడు= చూచెను గంజాక్షుడు చెప్పారు.

బాలవ్యాకర్త పరుషాక్షరాల స్థానంలో ఆదేశంగా వచ్చిన సరళాలకు ముందున్న ద్రుతానికి బిందువు, సంశ్లేష రెండు వికల్పంగా వస్తాయని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "ఆదేశసరళంబులకు ముందున్న ద్రుతంబునకు బిందు సంశ్లేషంబులు విభాషనగు"(సులభ. సంధి:32) అని

సూత్రీకరించారు. ఆదేశ సరళాల ముందున్న ద్రుతానికి బిందువుని, సంశ్లేషని చెప్పారు. ఉదాహరణకు 'చూచెను+ కంజాక్షుడు= చూచెను+ గంజాక్షుడు= చూచెం గంజాక్షుడు, చూచెన్గంజాక్షుడు'.

బాలవ్యాకర్త "వర్గయుక్సరళములు పరములగునపు డొకానొకచో ద్రుతమునకుఁ బూర్ణబిందువును గానంబడియెడి" (బాల.సంధి:19) అని సూత్రీకరించారు. వర్గయుక్కులు, సరళాక్షరాలు పరమైనపుడు ఒక్కొక్కసారి ద్రుతానికి అరుదుగా పూర్ణబిందువు కూడా కనబడుతుంది. ఉదాహరణకు 'వచ్చెను+ధాత్రీపతి= వచ్చెంధాత్రీపతి'.

సులభవ్యాకర్త "వర్గయుక్సరళంబులు పరంబులగునపుడు ద్రుతంబునకు లోప, స్వత్వ, పూర్ణ బిందు, సంశ్లేషంబులు విభాషనగు"(సులభ. సంధి:33) అని సూత్రీకరించారు. ద్రుతానికి వర్గయుక్కులు, సరళాలు పరమైనప్పుడు లోపం, స్వత్వం, పూర్ణ బిందువు, సంశ్లేషను విభాషగా చెప్పారు. వర్గ యుక్కులకు ఉదాహరణ 'చచ్చె ఖరుఁడు– చచ్చెను ఖరుఁడు– చచ్చెం ఖరుఁడు– చచ్చెన్ఖరుఁడు', సరళాలకు 'ఉదాహరణ 'వచ్చె జలజాక్షుడు–వచ్చెను జలజాక్షుడు– వచ్చెం జలజాక్షుడు– వచ్చెన్జలజాక్షుడు'. ఇది బాలవ్యాకరణానికి పూరణ సూత్రం

సులభవ్యాకర్త "అనునాసి, కాంత, స్థోష్మంబులు పరంబులగునపుడు ద్రుతంబునకుఁపూర్ణ బిందువు దక్కఁ దక్కినవి యగు"(సులభ. సంధి:34) అని సూత్రీకరించారు. ద్రుతానికి అనునాసికాలు, అంతస్థాలు, ఊష్మాలు పరమైతే పూర్ణ బిందు తప్ప మిగిలిన కార్యాలు అవుతాయి. ఉదాహరణకు 'కొలిచెద నారాయణుని, కొలిచెదను నారాయణుని, కొలిచెదన్నారాయణుని'.ఈ ప్రక్రియను బాల,ప్రౌఢ వ్యాకర్తలు చర్చించలేదు.

బాలవ్యాకర్త అవసానంలో ఉండే ద్రుతంలోని అచ్చుకుగాని, ద్రుతానికిగాని లోపం బహుళంగా వస్తుందని చెప్పారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త "అవసానంబున ద్రుతస్వరంబునకేని ద్రుతంబునకేని లోపంబు బాహుళంబు" (సులభ. సంధి:35) అని సూత్రీకరించారు. అవసానంలో ఉండే ద్రుతంలోని అచ్చుకుగాని, ద్రుతానికిగాని లోపం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు 'వాఁడు వచ్చెను– వాఁడు వచ్చెన్– వాఁడు వచ్చె'.

బాలవ్యాకర్త "కొన్నియెడల ద్రుతంబుమీఁద నకారంబు గానంబడియెడి. అదియునున్గాక, దివంబునుంబోలె" (బాల. సంధి:21) అని సూత్రీకరించారు. కొన్నిచోట్ల ద్రుతము మీద మరల ద్రుతము కనబడుతున్నది. ఉదాహరణకు ' అదియును+కాక= ఇక్కడ నువర్ణం ద్రుతము. దీనిపై మరలా ద్రుతము చేరినట్లయితే ' అదియును+ను+కాక= అదియునును+గాక+ అదియునున్గాక'. దివంబును+పోలె= దివంబునును+పోలె= దివంబునును+బోలె= దివంబునుం బోలె.

సులభవ్యాకర్త "కొన్ని యెడల ద్రుతంబు మీఁద నకారంబు గానంబడియెడి"(సులభ. సంధి:36) అని సూత్రీకరించారు. కొన్నిచోట్ల ద్రుతము మీద మరల ద్రుతము కనబడుతున్నది. ఉదాహరణకు 'అదియునున్గాక'. దివంబునుం బోలె. పద్యకావ్యాలలో, గద్య కావ్యాలలో ఇలాంటి ప్రయోగాలు ఉంటే ఉండచ్చుగాని సామాన్య గద్యలలో ఇలాంటివి ఉండకూడదని సులభవ్యాకర్త చెప్పారు. వానిని జూచెను, వానిఁ జూచెను, వానిం జూచెను' అని రాయవచ్చును. ఎక్కువ ద్రుతాలను పక్కపక్కనే చేర్చి రాయకూడదు. ఒకటిన్నర, రెండున్నర వంటి రూపాలలో ద్రుతం మీద ద్రుతం చేర్చి రాయడం సాధువు అవుతుందని సులభవ్యాకర్త చెప్పారు. ఒకటి+ యున్+ అర =ఒకటియున్ +ను+అర= ఒకటిన్+ను+అర= ఒకటిన్నర అయింది. సులభవ్యాకర్త ఈ సూత్రంలో బాలవ్యాకర్త కంటె మంచిగా వివరణ ఇచ్చారు.

బాలవ్యాకర్త "తాను నేను పదంబులద్రుతంబునకు సంశ్లేషంబు లేదు" (బాల.సంధి:23) అని సూత్రీకరించారు. 'తాను, నేను' అనే పదాల యొక్క ద్రుతానికి సంశ్లేష రూపం లేదు. ఉదాహరణకు 'తాఁను జదివె– తాను జదివె', ' నేఁ జదివితి– నేను జదివితిని'. వంటి రూపాలను సాధించారు. సులభవ్యాకర్త "ఏను నేను తాను పదంబుల ద్రుతంబునకుఁ బూర్ణ బిందు సంశ్లేషంబులు లేవు"(సులభ. సంధి:37) అని సూత్రీకరించి 'ఏను–నేను–తాను' పదాలలోని ద్రుతానికి పూర్ణ బిందువు, సంశ్లేష రూపాలు ఉండవని సులభవ్యాకర్త చెప్పారు. ఇక్కడ 'ఏను' అనే పదానికి కూడా బిందువు, సంశ్లేష రూపాలు ఉండవని చెప్పడం వల్ల ఇది బాలవ్యాకరణానికి పూరణగా కన్పిస్తుంది.

బాలవ్యాకర్త "ద్రుతంబునకు సరళ స్థిరంబులు పరంబులగునపుడు లోప సంశ్లేషంబులు విభాష నగు" (బాల.సంధి:18) అని సూత్రీకరించారు. సరళ స్థిరాలు పరమైనపుడు ద్రుతానికి లోప సంశ్లేషలు వికల్పంగా వస్తాయి. ఉదాహరణకు 'వచ్చె గోవులు–వచ్చెన్గోవులు–వచ్చెను గోవులు'.

సులభవ్యాకర్త "పరుషేతరంబులు పరంబు లగునపు డా ద్రుతమునకు లోప స్వత్వంబులు మాత్రము గలవు"(సులభ. సంధి:38) అని సూత్రీకరించారు. సరళాలు, స్థిరాలు పరమైనప్పుడు మాత్రం లోపం, స్వత్వం అవుతాయి. ఉదాహరణకు ' తాను+ వినె = తావినె'. బాలవ్యాకర్త లోప, సంశ్లేష వికల్పంగా చెప్పారు. సులభవ్యాకర్త మాత్రం లోపం, సత్వం మాత్రమే చెప్పారు. సంశ్లేష చెప్పలేదు.

## 4.5 సమాసగత పదసంధులు

వేర్వేరు అర్థాలు గల రెండు శబ్దాలు కలిసి ఒకే అర్థాన్నిచ్చేలాగా ఒక పదంగా ఏర్పడిన సమాసమని వావిలికొలనువారు నిర్వచించారు. విభక్తి మొదలగు పదాలను విడిచిపెట్టి సంగ్రహించి చెప్పిన సమాసమని ప్రస్తావించారు.

బాలవ్యాకర్త "కుఱు చిఱు కడు నడు నిడు శబ్దముల ఱడల కచ్చుపరం బగునపుడు ద్విరుక్తటకారంబగు" (బాల.సంధి:12) అని సూత్రీకరించారు. ఈ ఐదు పదాల చివరి అక్షరమైన ఱ, డ లకు అచ్చు పరమైతే దానికి ద్విరుక్తటకారం ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు 'కుట్టుసురు, చిట్టెలుక, కట్టెదురు, నట్టిల్లు, నిట్టూరుపు'.

సులభవ్యాకర్త "కుఱు చిఱు కడు నడు నిడు శబ్దంబుల ఱడ–ల కచ్చు పరమైనప్పుడు ద్విరుక్త టకారంబగు" (సులభ. సంధి:39) అని సూత్రీకరించారు. ఈ ఐదు పదాల చివరి అక్షరమైన ఱ, డ లకు అచ్చు అయిన ఉకారం పరమైతే దానికి ద్విరుక్తటకారం ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు 'కుఱు+ఉసురు= కుట్టుసురు, చిట్టెలుక, కట్టెదురు, నట్టిల్లు, నిట్టూర్పు'. చిట్టెలుక మొదలైన వాటిలో మొదటి శబ్దం చిట్టి అని కొందరి అభిప్రాయమని సులభవ్యాకర్త చెప్పారు. ఈ సూత్రం సమాసంలోనే వర్తించును కాబట్టి 'కడున్+ఎండ=కడునెండ అనే రూపం సాధువు అవుతుంది.

బాలవ్యాకర్త ద్వంద్వ సమాసంలో మొదటి పదం మీద ఉన్న పరుషాలకు అంటే 'క–చ–ట–త–ప' లకు వరుసగా 'గ–స–డ–ద–వ' లు ఆదేశంగా వస్తాయని చెప్పారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త "ద్వంద్వ సమాసంబున బదంబుకంటె బరంబయిన పరుషములకు గసడదవ –లు ప్రాయికముగనగును" ( సులభ.సంధి:40) అని సూత్రీకరించి ద్వంద్వ సమాసంలో మొదటి పదం

తరువాత ఉన్న పదంలో పరుషాక్షరాలు ఉంటే వాటి స్థానంలో 'గ-స-డ-ద-వ' లు వస్తాయని చెప్పారు. ఉదాహరణకు 'తల్లి+ తండ్రి'=తల్లిదండ్రి'

బాలవ్యాకర్త సమాసాల్లో మొదటి పదం మీద ఉండే ద్రుతానికి లోపం వస్తుంది. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త "సమాసంబున ద్రుతంబునకు లోపంబగు"(సులభ. సంధి:41) అని సూత్రీకరించారు. సమాసాల్లో మొదటి పదం మీద ఉండే ద్రుతానికి లోపం వస్తుంది. ఉదాహరణకు 'ఎల్లప్పుడు ఎల్లయర్థములు, ఎల్లతాపములు, కడు కావరము'. ఎల్లన్ అనేది ద్రుతం అంతమందుగల అవ్యయం. సర్వమని అర్థం. ఎల్లన్+అప్పుడు, ఎల్లన్+అర్థములు సమాసాలుగా చేరేటప్పుడు ఎల్ల+అప్పుడు, ఎల్ల+అర్థములు అని నిల్చి 'ఎల్లప్పుడు, ఎల్లయర్థము' అని అవుతుంది.

సులభవ్యాకర్త "ద్విత్వయుక్తములయిన నులు ఌ మొదలగు వర్ణములు కడపటఁగల శబ్దములు పరమైన హలాది శబ్దములతోఁ గూడి సమాసమైనపుడు ద్విత్వము వైకల్పికముగ లోపించును"(సులభ. సంధి:42) అని సూత్రీకరించారు. ద్విత్వంతో కూడిన ను, లు, ఌ మొదలైన వర్ణాలు చివరగల శబ్దాలకు హల్లు ఆది శబ్దాలు పరమై సమాసం ఏర్పడేటప్పుడు ద్విత్వం వికల్పంగా లోపిస్తుంది. ఉదాహరణకు 'మిన్ను+వాఁక= మిన్నువాఁక. ఇక్కడ 'న్ను' ద్విత్వాక్షరంలోని మొదటి అక్షరం 'న్' లోపించగా 'మిను' మిగిలి 'మినువాఁక' అయింది. ఇలాగే 'కల్లు+కుండ= కల్లు కుండ, కలుకుండ'. గొఱ్ఱె+ తోలు= గొఱ్ఱెతోలు, గొఱెతోలు. ఇటువంటి రూపాల ప్రసక్తి బాల, ప్రౌఢ వ్యాకరణాలలో లేదు.

సులభవ్యాకర్త "ఇట్టి ద్విత్వ యుక్తములయిన శబ్దములకు ద్విత్వ రహితంగబులుగ రూపాంతరము లుండెనేని యసమాసమునను ద్విత్వరహితంగఁ బ్రయోగంబులు కలవు" (సులభ. సంధి:43) అని సూత్రీకరించారు. ఇలాంటి (ను, లు, ఌ ) ద్విత్వంతో కూడిన మొదలైన వర్ణాలు చివరగల శబ్దాలకు హల్లు ఆది శబ్దాలు పరమై సమాసం ఏర్పడేటప్పుడు, ద్విత్వం లేకుండా సమాసాలలో రూపపాంతరాలు ఎలా కన్పిస్తున్నాయో, అలాగే అసమాసాలలో కూడా ద్విత్వం లేకుండా ప్రయోగాలు కన్పిస్తున్నాయి. ఉదాహరణకు ' కన్ను దెఱచె- కను దెఱచె'. ఇలాంటి శబ్దాలకు అచ్చు పరమైనపుడు ద్విత్వం లోపం రాదు. ఇటువంటి రూపాల ప్రసక్తి బాల, ప్రౌఢ వ్యాకరణాలలో లేదు.

బాలవ్యాకర్త కర్మధారయ సమాసాల్లో ఉండే ము ప్రత్యయానికి 'పు, ంపు' లు ఆదేశంగా వస్తాయని చెప్పారు. ఇదే విషయాన్ని చర్చిస్తూసులభవ్యాకర్త "కర్మధారయంబులందు మువర్ణకంబునకుఁ బు-ంపులగు" (సులభ.సంధి:44) అని సూత్రీకరించారు. కర్మధారయ సమాసంలో మొదటి శబ్దంలోగల 'ము' వర్ణకానికి బదులుగా పు, ంపు' లలో ఏదో ఒకటి ఆదేశంగా వస్తాయి. ఉదాహరణకు 'సరసపు పలుకు, సరసంపు పలుకు'. కర్మధారయ సమాసాలలో అని చెప్పటం వల్ల ఈ 'పు, ంపు' అనేవి ఇతర సమాసాలలో వస్తుందని పెద్దలు చెప్తారని సులభవ్యాకర్త ప్రస్తావించారు. 'సరసఁపు' అని అర్థ బిందువు పూర్వంగా గల పువర్ణాన్ని రాయడం సరైనది కాదని సులభవ్యాకర్త చెప్పారు.

## 4.6 నుగాగమ సంధులు

బాలవ్యాకర్త "సమాసంబుల నుదంతంబులగు స్త్రీసమంబులకుం బుంపులకుం బరుషసరళంబులు పరంబులగునపుడు నుగాగమంబగు" (బాల. సంధి:25) అని సూత్రీకరించారు. ఉదంతాలు, స్త్రీసమాలు, పుంపులతో కూడిన సమాసాలకు పరుషాలు లేదా సరళాలు పరమైతే 'ను' ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'చిగురుంగయిదువు– చిగురుఁగయిదువు–చిగురున్గయిదువు'.

సులభవ్యాకర్త కూడా "సమాసంబుల నుదంతంబులగు స్త్రీ సమంబులకును పుంపు –లకును బరుష సరళంబులు పరంబులగునపుడు నుగాగమంబగు" (సులభ. సంధి:45) అని సూత్రీకరించారు. సమాసాలలో ఉదంత స్త్రీ సమాలకు 'పు–ంపు' వర్ణాలు వస్తాయి . అలా వచ్చే సందర్భాలలో పరుషాక్షరాలుగాని, సరళాక్షరాలుగాని పరమైతే ' ను' వర్ణం వస్తుంది. ఉదాహరణకు ' మంచు+ ను+ కొండ = మంచును గొండ, మంచు గొండ'.

బాలవ్యాకర్త "సమాసంబులందు ద్రుతంబునకు స్వత్వంబులేదు" (బాల.సంధి:26) అని సూత్రీకరించారు. సమాసాల్లో ద్రుతానికి స్వత్వ రూపం ఉండదని సులభవ్యకర్త కూడా చెప్పారు.

బాలవ్యాకర్త "తలఁబ్రాలు మొదలగు సమాసంబుల ద్రుతమునకు లోపము లేదు" (బాల.సంధి:27) అని సూత్రీకరించారు. సమాసాల్లో ద్రుతం మామూలుగా లోపిస్తుంది కానీ ఈ సూత్రం ప్రకారం తలఁబ్రాలు మొదలైన సమాసాల్లో ద్రుతం లోపించదు. ఉదాహరణకు 'తలఁబ్రాలు,

ఒడిఁబ్రాలు, సేసఁబ్రాలు'. సులభవ్యాకర్త కూడా "తలఁబ్రాలు లోనగు నలుక్సమాసంబుల ద్రుతంబునకు లోపము లేదు" (సులభ. సంధి:47) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త. షష్ఠీ సమాసాల్లో ఉకారానికిగానీ ఋకారానికిగానీ అచ్చు పరమైతే 'ను' ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'రాజునాజ్ఞ, విధాతృనానతి'. సులభవ్యాకర్త కూడా "షష్ఠీ సమాసంబునందుకార ఋకారముల కచ్చు పరమైనపుడు నుగాగమంబగు" (సులభ. సంధి:49) అని సూత్రీకరించారు. షష్ఠీ సమాసాల్లో ఉకారానికి గానీ ఋకారానికి గానీ అచ్చు పరమైతే ను ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'రాజునాజ్ఞ, విధాతృనానతి'.

బాలవ్యాకర్త. తనము శబ్దం ఉత్తు చివర కల్గిన స్త్రీసమాలకు, పుంపులకు, అత్తు చివర కల్గిన గుణ వాచకాలైన పదాలకు తనము శబ్దం పరమైతే 'ను' ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'సొగసుందనము, సొగసుఁదనము, సొగసున్దనము'. సులభవ్యాకర్త కూడా "ఉదంత స్త్రీ సమంబులకును, పుంపు-లకును అదంత గుణవాచకంబులకును దనంబు పరంబగునపుడు నుగాగమంబగు" (సులభ. సంధి:50) అని సూత్రీకరించారు. తనము శబ్దం ఉత్తు చివర కల్గిన స్త్రీసమాలకు, పుంపులకు, అత్తు చివర కల్గిన గుణ వాచకాలైన పదాలకు తనము శబ్దం పరమైతే ను ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'సొగసుందనము, సొగసుఁదనము, సొగసున్దనము'.

సులభవ్యాకర్త "పట్టి ప్రత్యయము పరమైనపుడు సర్వత్ర నుగాగమంబగు" (సులభ. సంధి:51) అని సూత్రీకరించారు. పట్టి ప్రత్యయం పరమైతే అన్నిచోట్లా 'ను' ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'జ్ఞానముంబట్టి మోక్షము'. ఇటువంటి రూపాల ప్రసక్తి బాల, ప్రౌఢ వ్యాకరణాలలో లేదు.

బాలవ్యాకర్త సమాసాల్లో ప్రాత మొదలైన పదాల మొదటి అచ్చుపై ఉండే వర్ణాలన్నీ బహుళంగా లోపిస్తాయి. ఉదాహరణకు 'ప్రాయిల్లు- ప్రాఁతయిల్లు'. సులభవ్యాకర్త కూడా "సమాసమునఁ బ్రాఁతాదులఁ దొలి యచ్చు మీఁది వర్ణంబులకెల్ల లోపంబు బాహుళంబు" (సులభ. సంధి:52) అని సూత్రీకరించారు. సమాసాల్లో 'ప్రాత' మొదలైన పదాల మొదటి అచ్చుపై ఉండే వర్ణాలన్నీ బహుళంగా లోపిస్తాయి. ఉదాహరణకు 'ప్రాయిల్లు- ప్రాఁతయిల్లు'.

బాలవ్యాకర్త "'ప్రాత' మొదలైన పదాలలో లోపించగా మిగిలిన దానికి పరుషాలు పరమైతే 'ను' ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'ప్రాఁగెంపు, లేఁగొమ్మ, పూఁదోట'. సులభవ్యాకర్త కూడా "లుప్త శేషంబునకుఁ బరుషంబులు పరంబులగునపుడు నుగాగమంబగు" (సులభ. సంధి:53) అని సూత్రీకరించారు. ప్రాత మొదలైన పదాలలో లోపించగా మిగిలిన దానికి పరుషాలు పరమైతే ను ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'ప్రాఁబలుకు'.

బాలవ్యాకర్త "క్రొత్త శబ్దమున కాద్యక్షర శేషంబునం గొన్ని యెడల నుగాగమంబునుం గొన్నియెడల మీఁది హల్లునకు ద్విత్వంబునగు" (బాల.సంధి:38) అని సూత్రీకరించారు. 'క్రొత్త' అనే పదంలో లోపించగా మిగిలిన దానికి కొన్నిసార్లు ను ఆగమంగా వస్తుంది, కొన్నిసార్లు మీది హల్లు కు ద్విత్వం వస్తుంది. ఉదాహరణకు 'క్రొంజాయ, క్రొంజెమట, క్రొగ్గండి, క్రొన్నన, క్రొమ్మావి'.

"క్రొత్త, కెంపు, క్రింద శబ్దముల కాద్యక్షర శేషంబునకుఁ గొన్ని యెడల నుగాగమంబును, గొన్ని యెడల మీఁది హల్లునకు ద్విత్వంబును బాహుళంబుగానగు" (సులభ. సంధి:54) అని సూత్రీకరించారు. క్రొత్త, కెంపు, క్రింద మొదలైన పదాల్లో లోపించగా మిగిలిన దానికి కొన్నిసార్లు ను ఆగమంగా కొన్నిసార్లు మీది హల్లు కు ద్విత్వం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు 'క్రొంజాయ, క్రొంజెమట, క్రొత్తావి, క్రొగ్గండి, క్రొన్నన, క్రొమ్మావి'. క్రొత్త, కెంపు, క్రింద మూడు పదాలకు 'ను' ఆగమన్ని సులభవ్యాకర్త చెప్పారు.

ప్రౌఢవ్యాకర్త "తఱచుగఁ గర్మధారయ సమాసంబునం బెన్వాదుల కడ హల్లున కచ్చు పరంబగునపుడు ద్విత్వంబు గానం బడియెడి"(ప్రౌఢ. సంధి:9) అని సూత్రీకరించారు. కర్మధారయ సమాసాల్లో పెను మొదలైన పదాల చివరి హల్లుకు అచ్చు పరమైతే తరచుగా ద్విత్వం కనబడుతుంది. ఉదాహరణకు 'పెన్నదరులు, పెన్నరదము, పెన్నుద్ది'.

సులభవ్యాకర్త "అచ్చులు పరంబులగుచో విశేషణంబులయిన పెన్వాదుల కడ హల్లునకు ద్విత్వంబగు" (సులభ. సంధి:55) అని సూత్రీకరించారు. విశేషణాలైన 'పెను' మొదలైన పదాల చివరి హల్లుకు అచ్చు పరమైతే ద్విత్వం ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు 'పెన్నురము, పెన్నుద్ది, పెన్నూఁత'.

బాలవ్యాకర్త "అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచోఁ గానంబడియెడి" (బాల.సంధి:39) అని సూత్రీకరించారు. ప్రాతాదుల కంటే భిన్నమైన శబ్దాలకు కూడా లోపద్విత్వాలు, లోపనుగాగమాలు  కొన్ని సందర్భాలలో వస్తాయి. ఉదాహరణకు 'పందొమ్మిది, తొంబది, వంజెరగు'.

సులభవ్యాకర్త కూడా "సమాసంబుల లోపనుగాగమ, లోప ద్విత్వంబు లన్య శబ్దంబుల మీఁదను గానంబడెడి" (సులభ. సంధి:56) అని సూత్రీకరించారు. పై శబ్దాలు కాక ఇతర శబ్దాలకు కూడా లోపద్విత్వాలు, లోపనుగాగమాలు కొన్ని సందర్భాలలో వస్తాయి. ఉదాహరణకు 'పందొమ్మిది, తొంబది, వంజెరగు'.

## 4.7 టుగాగమ సంధులు

బాలవ్యాకర్త "కర్మధారయంబులం దుత్తున కచ్చుపరంబగునపుడు టుగాగమంబగు" (బాల.సంధి:28) అని సూత్రీకరించారు.  సూత్రంలో కర్మధారయ సమాసాల్లో అని బహువచనంలో చెప్పటం వల్ల సమానాధికరణంలోను, వ్యధికారణంలోను ఉకారాంత పదాలపైన అచ్చు పరమైనపుడు 'టు' వర్ణం ఆగమంగా వస్తుందని అర్థం. ఉదాహరణకు 'కఱకు+ అమ్ము = కఱకు+ టు+ అమ్ము =కఱకుటమ్ము, నిగ్గు+అద్దము = నిగ్గు టద్దము'.

సులభవ్యాకర్త "కర్మధారయంబులం దుత్తునకచ్చు పరమైనపుడు టుగామంబు బహుళంబుగ నగు" (సులభ. సంధి:57) అని సూత్రీకరించారు. సులభవ్యాకర్త కూడా కర్మధారయాలలో అని బహువచన పదం చెప్పడంవల్ల సమానాధికరణంలో, కొన్నిసార్లు అసమానాధికరణంలో ఉకారాంత పదాలపైన అచ్చు పరమైనపుడు 'టు' వర్ణం ఆగమం బహుళంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'కఱకు+ అమ్ము = కఱకు+ టు+ అమ్ము =కఱకుటమ్ము. అసమానాధికరణానికి ఉదాహరణ 'వేలుపుల యొక్క ఆవు= వేలుపు+ఆవు= వేలుపు+టు+ఆవు= వేలుపుటావు. దీనిని సమానాధికరణంగా కూడా చెప్పవచ్చు. బాలవ్యాకర్త 'టు' వర్ణ ఆగమాన్ని నిత్యంగా చెప్పారు. కాని సులభవ్యాకర్త 'టు' వర్ణ ఆగమన్ని బహుళంగా చెప్పారు. బాలవ్యాకర్త వ్యధికరణంలో 'టు' వర్ణం ఆగమంగా వచ్చిన ప్రయోగాన్ని ఉదాహరణగా ఇవ్వలేదు. కాని సులభవ్యాకర్త ఇచ్చారు. ఇది సవరణ సూత్రంగా కన్పిస్తుంది.

బాలవ్యాకర్త పేర్వాది శబ్దాలకు 'టు' వర్ణం ఆగమం వికల్పంగా వస్తుంది. 'పేరు+ఉరము= పేరుటురము, పేరురము'. . కర్మధారయ సమాసాల్లో 'పేద' మొదలైన శబ్దాలకు 'ఆలు' శబ్దం పరమైతే 'రు' ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'పేదరాలు, బీదరాలు'.

సులభవ్యాకర్త "కర్మధారయంబున నదంత శబ్దముల కాలుశబ్దంబు పరంబగునపుడు నిత్యముగ, నుదంతముల మీఁద బాహుళంబుగ రుగాగమంబగు" (సులభ. సంధి:58) అని సూత్రీకరించారు. బాలవ్యాకర్త రెండు సూత్రాలలో చెప్పిన విషయాన్ని ఒకే సూత్రంలో చెప్పారు.

బాలవ్యాకర్త "కర్మధారయంబునం దత్సమంబుల కాలుశబ్దము పరంబగునపుడత్వంబున కుత్వంబును రుగాగమంబునగు" (బాల.సంధి:31) అని సూత్రీకరించారు. తత్సమశబ్దాలతో ఏర్పడే కర్మధారాయాల్లో పూర్వ పదం చివరి అ, ఉ గా మారి రు ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'ధీరురాలు, గుణవంతురాలు'. సులభవ్యకర్థ కూడా "కర్మధారయమందుఁ దత్సమంబుల కాలు శబ్దము పరమగునపు దత్వంబున కుత్వంబును, రుగాగమంబును నగు" (సులభ. సంధి:59) అని సూత్రీకరించారు.

ప్రౌఢవ్యాకర్త "అను కొను లోనగు ధాతుజ విశేషణముల యంత్యోకారమునకు హల్లు పరంబగునపుడు లోపంబు వైకల్పికంబు"(ప్రౌఢ. సంధి:13) అని సూత్రీకరించారు. అను, కొను మొదలైన ధాతుజ విశేషణాల చివరి ఉకారానికి హల్లు పరమైనపుడు లోపం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'గిరివ్రజ మన్పురంబు'. సులభవ్యాకర్త కూడా "హల్లు పరంబగుచో నను, కొను, చను లోనగు క్రియాజన్య విశేషముల కడపటి యుత్తునకు లోపంబు వైకల్పికము" (సులభ. సంధి:60) అని సూత్రీకరించారు.

సులభవ్యాకర్త " కర్మధారయంబునఁ బరంబైన పరుషములకు గ స డ ద వ-లు వైకల్పికము నగు" (సులభ. సంధి:61) అని సూత్రీకరించారు. కర్మధారయ సమాసంలో పరమైన పరుషాలకు 'గ- స- డ-ద-వ' లు వికల్పంగా వస్తాయని చెప్పారు. ఉదాహరణకు 'ఏ చుట్టంబులు- ఏ సుట్టంబులు' బాల, ప్రౌఢ వ్యాకర్తలు ఈ రూపాల ప్రసక్తి చేయలేదు.

ప్రౌఢవ్యాకర్త "షష్ఠీ సమాసమందలి నిలల మీఁది యచ్చులకు హల్లు పరంబగుచోఁ గొన్ని యెడల లోపంబు గానంబడియెడి"(ప్రౌఢ. సంధి:17) అని సూత్రీకరించారు. షష్ఠీ సమాసాల్లో ని, ల

లకు హల్లు పరమైతే వాటి అచ్చు లోపిస్తుంది. ఉదాహరణకు 'ఇంద్రున్వలెన్'. సులభవ్యాకర్త కూడా "షష్ఠీ సమాసమందలి 'ని ల'– ల మీఁది యచ్చులకు నెందేని లోపంబు వైకల్పికంబు" (సులభ. సంధి:62) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "చేత తోడ వలనల కిత్వంబు సమాసంబులందగు" (బాల.సంధి:43) అని సూత్రీకరించారు. సమాసాల్లో చేత, తోడ, వలన లకు ఇత్వం వస్తుంది. ఉదాహరణకు 'నీ చేతి ప్రోపు, నా తోడి చెలిమి, నీ వలని భయము'. సులభవ్యాకర్త కూడా "చేత, తోడ, వలన–ల కిత్వంబు సమాసంబులందగు" (సులభ. సంధి:63) అని సూత్రీకరించారు.

## 4. 8 ఆమ్రేడిత సంధులు

బాలవ్యాకర్త 'కడ' మొదలైన వాటికి ఆమ్రేడితం పరమైతే వాటి మొదటి అచ్చు మీది వర్ణాల స్థానంలో 'ట్ట' ఆదేశంగా వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "ఆమ్రేడితంబు పరంబగునపుడు కడాదులఁ దొలియచ్చు మీది వర్ణంబుల కెల్ల నదంతమగు ద్విరుక్తటకారంబగు" (సులభ. సంధి:65) అని సూత్రీకరించారు. ఆమ్రేడితం పరమైనపుడు మొదటి అచ్చు తరువాత ఉన్న అక్షరాల మొత్తానికి అదంతమైన ద్విత్వ టకారం వస్తుంది.  ఉదాహరణకు ' ఎదురు+ ఎదురు= ఎట్టయెదురు, కొన+ కొన= కొట్టకొన'.

బాలవ్యాకర్త కొన్ని పదాలకు ఆమ్రేడితం పరమైతే వాటి విభక్తి బహుళంగా లోపిస్తుంది. ఉదాహరణకు 'అప్పటప్పటికిన్–అప్పటికప్పటికిన్, అక్కడక్కడన్–అక్కడనక్కడన్'. సులభవ్యాకర్త కూడా "ఆమ్రేడితంబు పరంబగునప్పుడు విభక్తిలోపంబు  బహుళంబుగానగు" (సులభ. సంధి:66) అని సూత్రీకరించారు.  ఆమ్రేడితం పరమైనప్పుడు విభక్తికి లోపం బహుళంగా వస్తుంది. అప్పటికిన్+ అప్పటికిన్= అప్పటప్పటికిన్, అప్పటికప్పటికిన్. ఇందులో రెండవ శబ్దం ఆమ్రేడితం పరంకాగా మొదటి శబ్దంలోని విభక్తి బహుళంగా లోపించింది.

బాలవ్యాకర్త "అందుదుకు ప్రభృతులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు" (బాల.సంధి:42) అని సూత్రీకరించారు. ఆమ్రేడితం పరమైతే అందుదుకు మొదలైన రూపాలు ఏర్పడుతాయి. వీటిని ప్రయోగానుసారంగా గ్రహించాలి. ఉదాహరణకు 'అందుదుకు, ఇఱ్ఱింకులు,

ఇల్లిగ్గలు'. సులభవ్యాకర్త కూడా "అందదుకు ప్రభృతులు యధాప్రయోగంబుగ గ్రాహ్యంబులు" (సులభ. సంధి:67) అని సూత్రీకరించారు.

ప్రౌఢవ్యాకర్త వ్యాకరణ నియమానుసారంగా వచ్చిన హ్రస్వానికి ఆమ్రేడితం పరమైతే ఆ హ్రస్వం తిరిగి దీర్ఘం అవుతుందని ఉదాహరణకు 'లేలెమ్ము, పోపొమ్ము' వంటి ఉదాహరణలను ఇచ్చారు. సులభవ్యాకర్త కూడా "ఆమ్రేడితంబు పరంబగునపుడు కృత హ్రస్వంబునకు దీర్ఘంబును నగు" (సులభ. సంధి:68) అని సూత్రీకరించారు. ఆమ్రేడితం పరమైనపుడు కృత హ్రస్వానికి దీర్ఘం వస్తుంది. 'లేచు' ధాతువుకు ప్రార్థనార్థక రూపం 'లెమ్ము' గా మారుతుంది. ఇలా మారిన కృత హ్రస్వానికి ఆమ్రేడితంలో దీర్ఘం వస్తుంది. ఉదాహరణకు 'లెమ్ము+ లెమ్ము = లేలెమ్ము'.

## 4.9 ముువర్ణక సంధులు

బాలవ్యాకర్త 'పడు' మొదలైనవి పరమైనపుడు 'ము' ప్రత్యయానికి లోపం, పూర్ణబిందువులు వికల్పంగా వస్తాయి. ఉదాహరణకు 'భయపడె, భయంపడె, భయముపడె'. సులభవ్యాకర్త కూడా "పడ్వాదులు పరంబులగునపుడు మువర్ణకంబునకు లోప, పూర్ణ బిందువులు విభాషనగు"(సులభ. సంధి:69) అని సూత్రీకరించారు. 'పడు, పఱచు, పట్టి శబ్దాలకు ప్రథమావిభక్తి ప్రత్యయమైన 'ము' వర్ణం పరమైనప్పుడు, ఆ మువర్ణానికి లోపం, కొన్నిసార్లు నిండు సున్నా వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'శ్రమము+ పడు= శ్రమంపడు, శ్రమపడు, శ్రమముపడు'.

బాలవ్యాకర్త "మధ్యమపురుష మువర్ణకంబునకు హలవసానంబులు పరంబులగునపుడు లోపము విభాషనగును" (బాల.సంధి:47) అని సూత్రీకరించారు. మధ్యమ పురుష లో వచ్చే 'ము' ప్రత్యయానికి హల్లు పరమైతే లేదా అది అవసానంలో వస్తే వికల్పంగా లోపిస్తుంది. ఉదాహరణకు 'చూడు నన్ను, చూడుము నన్ను'. సులభవ్యాకర్త కూడా "మధ్యమ పురుష మువర్ణకంబునకు హలవసానంబులు పరంబులగునపుడు లోపము విభాష నగు" (సులభ. సంధి:70) అని సూత్రీకరించి మధ్యమపురుష మువర్ణకానికి హల్లుపరమైన, మువర్ణంతోనే ఆ వాక్యం ముగిసినా ఆ మువర్ణానికి లోపం విభాషగా వస్తుంది. ఉదాహరణకు 'చూడుము+ నన్ను= చూడు నన్ను, చూడుము నన్ను'. 'ఇటుచూడు– ఇటుచూడుము'.

బాలవ్యాకర్త "వ్యతిరేక మధ్యమ ముపర్ణకంబున కెల్ల యెడల లోపంబు విభాషనగు" (బాల.సంధి:48) అని సూత్రీకరించారు. ఉదాహరణకు 'నమ్మకిట, నమ్మకుమిట'. సులభవ్యాకర్త కూడా "వ్యతిరేక మధ్యమ ముపర్ణకంబున కెల్ల యెడల లోపంబు విభాషనగు" (సులభ. సంధి:71) అని సూత్రీకరించి వ్యతిరేకార్థంలో మధ్యమపురుష ముపర్ణం వచ్చి దానికి అచ్చుగాని, హల్లుగాని పరమైతే ఆ ముపర్ణానికి వికల్పంగా లోపం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు ' నమ్మకుము ఇట– నమ్మకిట– నమ్మకు మిట'.

బాలవ్యాకర్త "ఆమ్రేడితంబు పరంబగునపుడు మధ్యమ ముడుజ్జులకు లోపంబు విభాషనగు" (బాల.సంధి:49) అని సూత్రీకరించారు. మధ్యమ పురుష ఏకవచన, బహువచనాల్లో వచ్చే 'ము' 'డు' ప్రత్యయాలకు ఆమ్రేడితం పరమైతే లోపం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'ఉండుండుము– ఉండుముండుము, కొట్టుకొట్టుడు– కొట్టుడుకొట్టుడు'. సులభవ్యాకర్త కూడా "ఆమ్రేడితంబు పరంబగునపుడు మధ్యమ 'ము''ఁడు'లకు లోపంబు విభాషనగు" (సులభ. సంధి:72) అని సూత్రీకరించారు.

## 4.10 ధ్వన్యనుకరణ సంధులు

సులభవ్యాకర్త "ధ్వన్యనుకరణంబులు ద్వి, త్రి, చతురుక్తంబులునగు" "(సులభ. సంధి:73)అని సూత్రీకరించి ధ్వన్యనుకరణ శబ్దాలు రెండు, మూడు, నాలుగు సార్లయిన చెప్పవచ్చును. ఉదాహరణకు 'గడ గడ, తళతళ, భగ భగ'. ఈ విషయాలను బాల, ప్రౌఢవ్యాకరణాలు చెప్పలేదు.

ప్రౌఢవ్యాకర్త "ధ్వన్యనుకరణ శబ్దముల కనుధాతువు పరంబగుచోఁగొన్ని యెడల ముగాగమంబగు" (ప్రౌఢ.సంధి:19) అని సూత్రీకరించారు. ధ్వన్యనుకరణ శబ్దాలకు అను అనే ధాతువు పరమైతే కొన్నిచోట్ల ము ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'కనకనమను, సలసలమను'.

సులభవ్యాకర్త కూడా "ధ్వన్యనుకరణంబులకు ననుధాతు వనుప్రయుక్తంబైనపుడు కొన్ని యెడల ముగాగమంబగు"(సులభ.సంధి:74) అని సూత్రీకరించారు. ధ్వన్యనుకరణ శబ్దాలకు 'అను' ధాతువు అనుసరించి వచ్చేటప్పుడు కొన్నిసార్లు ముపర్ణం ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు ' సలసల+ అని =సల+ము+ సల= సలసలమని'.

సులభవ్యాకర్త "అనుధాతు వనుప్రయుక్తమైనపుడు ధ్వన్యనుకరణంబులఁదుది హల్లునకు ద్విత్వంబగు" (సులభ. సంధి:75) అని సూత్రీకరించి 'అను' ధాతువు అనుసరించి వచ్చేటప్పుడు ధ్వన్యనుకరణ శబ్దాలలో చివర ఉన్న హల్లుకు ద్విత్వం వస్తుందని 'భామ్+ అని= భామ్మని, పటిల్+ అని= పటిల్లని' వంటి ఉదాహరణలను ఇచ్చారు. తర్వాత సూత్రంలో "ముగాగమం బగుచో ద్విత్వంబు విభాష నగు" (సులభ.సంధి:76) అని సూత్రీకరించారు. ముවర్ణం ఆగమంగా వస్తే ద్విత్వం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ' పటీల్మని'. ఈ రూపాల ప్రసక్తి బాల, ప్రౌఢ వ్యాకరణాలు చర్చించ లేదు.

## 4.11 అనుకరణ సంధులు

సులభ వ్యాకర్త 'తెలుగు' శబ్దానికి 'సంస్కృత' శబ్దం పరమైనప్పుడు 'తెలుగు సంధి' సూత్రాలే అన్వయించాలని చెప్పారు. ఉదాహరణకు 'తెప్ప + ఉత్సవము= తెప్ప యుత్సవము' అవుతుంది. అంతేగానీ 'తెప్పోత్సవము' అని రాయకూడదు. సమాసంలో సంస్కృత శబ్దానికి పరంగా తెలుగు శబ్దం రాకూడదు. అనుకృతిలో రావచ్చును.

సులభవ్యాకర్త "సంస్కృత సు, బ్తి, జ్క్వా, తుమున్నంతము లిందప్రయోక్తంబులు"( సులభ. సంధి:77) అని సూత్రీకరించారు. సంస్కృత భాషలో ఉండే సుబంతాలు, తిజంతాలు, క్త్వాంతాలు, తుమున్నంతాలు మొదలైన శబ్దాలు ఆంధ్రభాషలో యథాతథంగా ప్రయోగించకూడదని చెప్పారు. ఉదాహరణకు 'వాడురాముడు' అనడానికి బదులుగా 'వాడు రామః' అనరాదు.

బాలవ్యాకర్త "భవచ్ఛత్రాదుల కిందుఁ బ్రయోగంబు లేదు"(బాల. తత్సమ:87) అని సూత్రీకరించారు. భవత్ మొదలైన సంస్కృత శబ్దాలకు తెలుగులో యథాతథంగా ప్రయోగించరాదు. సులభవ్యాకర్త కూడా "భవచ్ఛత్రాదులు నిట్టివ"(సులభ. సంధి:78), "సదాద్యవ్యయంబులు గ్రాహ్యంబులు"(సులభ. సంధి:79), "యథా యథలు వృథా వృథలు"( సులభ. సంధి: 80) అని సూత్రీకరించారు. భవత్ మొదలైన సంస్కృత శబ్దాలకు తెలుగులో యథాతథంగా ప్రయోగించరాదని చెప్పారు. సూత్ర వివరణలో సదా, సర్వత్రా, నహి, నాస్తి, స్వస్తి ఈ శబ్దాలకు తెలుగు భాషలో స్వతంత్ర

ప్రయోగం కనిపిస్తుందని చెప్పారు. 'యథా యధము' అనే సంస్కృత అవ్యయాలు తెలుగులో 'యథాయధలు' అని, 'వృథా' అనేది 'వృథ, వృథలు' అని ప్రయోగాలలో కనబడుతున్నది.

సులభవ్యాకర్త"నిషిద్ధంబులను కరణపరకంబులై ప్రయోగార్హంబులగు"(సులభ.సంధి:81) అని సూత్రీకరించారు. నిషేధించబడిన సంస్కృత శబ్దాలకు 'అను' ధాతువు పరంగా వస్తే ఆంధ్ర భాషలో ప్రయోగార్హతను పొందుతాయి. అనుకరణం అనగా ' అను' ధాతువు పరంగా కలిగినవి అని అర్థం. 'అను' ధాతువు చేరేటప్పుడు సంస్కృత శబ్దాలలో కొన్ని మార్పులు వస్తాయి.

బాలవ్యాకర్త "విసర్గంబున కనుకరణంబున లోపంబగు" (బాల.సంధి:50) అని సూత్రీకరించారు. అనుకరించి చెప్పే సందర్భంలో విసర్గ నిత్యంగా లోపిస్తుంది. ఉదాహరణకు 'వర్ధతాం శ్రీ యనియె'. సులభవ్యాకర్త కూడా "అను ధాతువు పరంబగుచో విసర్గమునకు లోపంబగు "(సులభ.సంధి:82) అని సూత్రీకరించారు. 'అను' ధాతువు పరంగా వచ్చేటప్పుడు విసర్గకు లోపం వస్తుంది. ఉదాహరణకు 'వాడు రామః అనియె', వాడు రామ అనియె'.

బాలవ్యాకర్త "అనుకరించి చెప్పే సందర్భంలో నమః అనే శబ్దం చివరి అత్వానికి ఓత్వం వికల్పంగా వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "అనుకరణంబున నమశ్శబ్దము కడపటి యత్తున కోత్వము విభాష నగు" (సులభ.సంధి:83) అని సూత్రీకరించారు. అనుకరణార్థంలో 'నమః' శబ్దానికి 'అను' ధాతువు పరంగా రావడం వల్ల విసర్గ లోపించి 'నమ' అవుతుంది . ఈ 'నమ' శబ్దం చివర ఉన్న అత్వానికి ఓత్వం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ' రామాయ నమో యనియె', రామాయ నమ యనియె'.

బాలవ్యాకర్త అనుకరించి చెప్పే సందర్భంలో ఉత్తు అంతంలో ఉండే నామానికి 'వు' ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'ఇయం ధేను వనె'. సులభవ్యాకర్త కూడా "ఉదంత నామంబునకు ననుకరణమందు వుగాగమంబగు"(సులభ.సంధి:84) అని సూత్రీకరించారు. అనుకరణార్థంలో ఉకారం చివర కలిగిన ధాతువులకి 'వు' వర్ణం ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'ఇయం ధేను అనియె' , ఇయం ధేను వనియె'.

బాలవ్యాకర్త "అనుకరణంబునం దుదిహల్లునకు ద్విర్వచనంబగు" (బాల.సంధి:52) అని సూత్రీకరించారు. అనుకరించి చెప్పే సందర్భంలో ఒక పదం చివరి హల్లుకు ద్విత్వం వస్తుంది. ఉదాహరణకు 'కింతత్తనియె, కస్త్వమనియె'.

బాలవ్యాకర్త "అనుకరణార్థంలో 'అహమ్' మొదలైన వాటి మకారానికి ద్విత్వం విభాషగా వస్తుంది. ఉదాహరణకు 'దాసోహమ్+అనె= దాసోహమ్మనె, దాసోహమనె'. "అనుకరణంబునం దుది హల్లునకు ద్విర్వచనంబగు "(సులభ.సంధి:85) అని సూత్రీకరించారు. అనుకరణార్థంలో చివర హల్లుకి ద్విత్వం వస్తుంది. ఉదాహరణకు కింతత్+ అనియె= కింతత్తనియె'. 'అహమ్' మొదలైన మకారాంత శబ్దాలకు ద్విత్వం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ' దాసోహమ్+ అనె = దాసోహమ్మనె'. దాసోహ మనె'.

సులభవ్యాకర్త "అనుకరణంబున దీర్ఘంబు హ్రస్వంబు గాదు"(సులభ.సంధి:87) అని సూత్రీకరించి అనుకరణార్థంలో శబ్దంలోని  దీర్ఘానికి హ్రస్వం రాదని చెప్పారు. ఉదాహరణకు 'దుర్బలస్య బలం రాజా'.  ఈ విషయాన్ని  బాల, ప్రౌఢవ్యాకర్తలు చెప్పలేదు.

సులభవ్యాకర్త"ఆశ్చర్య సంతాపాద్యర్థంబుల ననుకరణంబు లేమి దోషంబు గాదు"(సులభ.సంధి:88) అని సూత్రీకరించారు. ఆశ్చర్యార్థంలో, సంతాపాద్యర్థంలో చెప్పేటప్పుడు అనుకురణ చేయకుండ సంస్కృత పదాలను యాదావిధిగా ప్రయోగించన దోషం లేదని 'అంటితి 'నమశ్శివాయ' పాపాత్మురాలి'  వంటి ఉదాహరణని ఇచ్చారు.  ఈ విషయాన్ని బాల, ప్రౌఢవ్యాకర్తలు చెప్పలేదు.

సులభవ్యాకర్త "ద్విత్వయుక్తంబు మఱియొక హల్లుతో సంయుక్త మగునపుడు ద్విత్వమునకు లోపంబు" (సులభ.సంధి:89) అని సూత్రీకరించారు. ద్విత్వంతో కూడిన హల్లు వేరొక హల్లుతో కలిసి సంయుక్తంగా ఏర్పడేటప్పుడు ద్విత్వానికి లోపం వస్తుంది. ఉదాహరణకు 'గొద్దురాలు– గొద్రాలు',  ఈ విషయాన్ని  బాల, ప్రౌఢవ్యాకర్తలు చెప్పలేదు.

సులభవ్యాకర్త "అపవాదంబులు విధులు కావు. ప్రమాదంబులు ప్రమాణంబులు గావు" (సులభ.సంధి:90) అని సూత్రీకరించారు. అపవాద రూపాలు కొన్ని ప్రయోగించవచ్చుగాని ఎక్కువుగా ప్రయోగించకూడదు. ప్రామాణిక గ్రంథాలలో నిర్బంధం వల్లగాని, ప్రమాదం వల్లగాని

ప్రయోగించబడినవి ప్రమాణంగ తీసుకొనరాదు. 'నీ విప్రభావము– ఈ ప్రభావము– ఇప్రభావము' ఇలా అవ్వకూడదు. శ్లేష వల్ల చెప్పాల్సి వచ్చింది. కాబట్టి ఇది మహాకవి ప్రయోగమని త్రికం మీద సంయుక్తాక్షరాలకు అన్నింటికి ద్విత్వం కల్పించరాదు. నిష్పన్న శబ్దాలకు శాస్త్రం బలీయము. అనిష్పన్న శబ్దాలకు ప్రయోగము బలీయము. ఈ విషయాన్ని బాల, ప్రౌఢవ్యాకర్తలు చెప్పలేదు.

## 4.12 సంస్కృత శబ్ద సంధులు

వావిలికొలనువారు మాహేశ్వర సూత్రాలను అనుసరించి ప్రత్యాహారాల ద్వారా సంస్కృత సంధులను సూత్రీకరించారు. గుణాలు, వృద్ధులు వంటి సంజ్ఞలను సూత్ర రూపంలో నిర్వచించారు. సంధులను అచ్సంధులు, హల్సంధులు అని రెండు రకాలుగా విభజించి కొన్ని ప్రధానమైన సంధులను సూత్రరూపంలో చెప్పారు.

సులభవ్యాకర్త మాహేశ్వర సూత్రాలను అన్నింటిని కలిపి "అ ఇ ఉ ణ్ , ఋ ౡ క్, ఏ ఓ ఙ్, ఐ ఔ చ్, హ య వ ర ట్, ల ణ్, ఞ మ ఙ ణ న మ్, ఝ భ ఞ్, ఘ ఢ ధ,ష్, జ బ గ డ ద శ్, ఖ ఫ ఛ ఠ థ చ ట త వ్, క ప య్, శ ష స ర్, హల్" (సులభ. సం. సంధి:1) అని ఒక సూత్రంలో చెప్పారు.

### 4.12.1 అచ్సంధులు (సంస్కృతం)

సులభవ్యాకర్త"అక్కులకు సవర్ణములైన అక్కులు పరంబులగునపుడు బూర్వపర స్థానంబుల దీర్ఘంబేకాదేశంబగు"(సులభ. సంధి. సం.శబ్ద:4) అని సూత్రీకరించారు. 'అక్కులు' అనగా 'అ–ఇ–ఉ–ఋ–ౡ' అనే నాలుగు అక్షరాలు. ఈ అచ్చులకు సవర్ణమైన అచ్చులు పరమైతే ఆ రెండు అచ్చుల స్థానంలో దీర్ఘాచ్చు వస్తుంది. దీనిని 'సవర్ణదీర్ఘసంధి' అంటారు. ఉదాహరణకు ' కుసుమ+ అంజలి= కుసుమాంజలి'. శత+ అబ్దము= శతాబ్దము'.

సులభవ్యాకర్త సవర్ణ దీర్ఘసంధి వికల్పంగా జరగుతుందని చెప్పారు. "ఋుక్కులకు హ్రస్వఋుక్కులు పరమైనపుడు పూర్వపర స్థానంబుల హ్రస్వఋుక్కులు వైకల్పికముగ నగు" (సులభ. సం. సంధి:5) అని సూత్రీకరించారు. హస్వ ఋకారమునకు హ్రస్వ ఋకారం పరమైనపుడు దీర్ఘం ఏకాదేశంతో పాటుగా రెండింటి స్థానంలో హ్రస్వ ఋకారం రావచ్చును. లేదా ప్రకృతి భావమే

ఉండవచ్చును. ఉదాహరణకు 'హోతృ+ఋకారము= హోతృకారము, హోతౄకారము, హోతృఋకారము.

సులభవ్యాకర్త "అవర్ణమునకు ఇక్కులు పరమైనపుడు గుణంబగు" (సులభ.సం. సంధి:6) అని సూత్రీకరించారు. 'అ–ఆ' లకు 'ఇక్కు' లుగా పిలవబడే 'ఇ–ఉ–ఋ–ఌ'లు పరమైనపుడు వరుసగా వాటి గుణాక్షరాలైన 'ఏ– ఓ–అర్–అల్' లు పూర్వ పరస్థానంలో ఆదేశంగా వస్తాయి. ఉదాహరణకు 'అమర+ ఇంద్రుఁడు=అమరేంద్రుఁడు, భూసుర+ ఉత్తముఁడు= భూసురోత్తముడు, మహా+ఋషి= మహర్షి, తవ+ఌకారము = తవల్కారము'. గుణసంధి జరగని అపవాదరూపలను సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ' స్వ+ఈరిణి= స్వైరిణి, అక్ష+ఊహిణి= అక్షోహిణి, అక్షౌహిణి, సుఖ+ ఋతుఁడు= సుఖార్తుఁడు'.

సులభవ్యాకర్త"అవర్ణమునకు ఏచ్చులు పరమైనచో వృద్ధియగు" (సులభ. సం. సంధి:7) అని సూత్రీకరించారు. 'అ–ఆ' లకు 'ఏచ్చు' లుగా పిలవబడే 'ఏ–ఓ–ఐ–ఔ' పరమైనపుడు 'ఏ–ఐ'ల స్థానంలో 'ఐ' కారం, 'ఓ–ఔ'ల స్థానంలో 'ఔ' ఆదేశంగా వస్తాయని చెప్పారు. ఉదాహరణకు 'భోగ+ఏకము= భోగైకము, దురిత+ ఓఘము= దురితౌఘము, మహా+ఐశ్వర్యము= మహా+ఐశ్వర్యము= మహైశ్వర్యము, కృష్ణ+ ఔత్కంఠ్యము= కృష్ణౌత్కంఠ్యము'. హ్రస్వమైన 'అ' కారానికి 'ఓం' పరమైనపుడు 'వృద్ధి' రాదని'శివాయ+ ఓం నమః= శివాయోన్నమః, శివాయోం నమః' వంటి రూపాలను ఉదాహరణలుగా సులభ వ్యాకర్త చెప్పారు. హ్రస్వమైన 'అ' అకారానికి 'ఓతువు–ఓష్ఠము' వంటి పదాలు పరమైనపుడు 'వృద్ధి సంధి' వికల్పంగా వస్తుందని 'స్థూల+ ఓతువు= స్థూలోతువు, స్థూలౌతువు, బింబ+ ఓష్ఠము= బింబోష్ఠము, బింబౌష్ఠము' వంటి ఉదాహరణలను సులభ వ్యాకర్త పేర్కొన్నారు.

ఈ విధంగా మిగిలిన అచ్సంధులైన, యణాదేశ సంధి, పరరూప సంధి, అవాంజదేశ సంధి, ప్రకృతిభావ సంధి వంటి సంధులను ప్రత్యాహారాలను అనుసరించి సూత్రరూపంలో నిర్వచించారు.

## 4.12.2 హల్సంధులు(సంస్కృతం)

సులభవ్యాకర్త "సకార తవర్గములు– శవర్ణ చవర్గములు పరస్పరము కదియునపుడు శ–స లకు శవర్ణమును, త–చ వర్గములకుఁజవర్గ వర్ణములు నాదేశంబులగు"(సులభ.సం. సంధి:16).

అని సూత్రీకరించారు. 'స' కారానికి శవర్ణంగాని, చవర్గాక్షరాలుగాని పరమైతే 'శ' వర్ణమే ఆదేశంగా వస్తుంది. అలాగే 'త'వర్గాక్షరాలకు, 'చ' వర్గాక్షరాలు పరమైతే చవర్గాక్షరాలే వస్తాయి. ఇలా వస్తే దీనిని 'శ్చుత్వ సంధి' అంటారు. ఉదాహరణకు ' మనస్+ శాంతి= మనశ్శాంతి', మనస్+ చంచలత= మనశ్చంచలత, ఉత్+ చలించు= ఉచ్చలించు'.

ఈ విధంగా ష్టుత్వసంధి, జశ్త్వ సంధి, అనునాశిక సంధి, పూర్వ సవర్ణ సంధి, విసర్గ సంధి, స్వాది సంధి మొదలైన 'హల్సంధులను' సూత్రరూపంలో సులభవ్యాకర్త నిర్వచించారు.

## ముగింపు:

సులభవ్యాకర్త 'సంధి' లక్షణాన్ని చిన్నయసూరిగారు చెప్పిన నిర్వచనాన్నే స్వీకరించారు. బాలవ్యాకర్తలాగా ఉత్వసంధి కాకుండా అత్వసంధినే మొదటగా చెప్పారు. సులభవ్యాకర్త అచ్సంధులను, హల్సంధులను చెప్పేటప్పుడు నూతన విషయ ప్రతిపాదనలను చెప్పారు. అవసరమైన చోట బాల, ప్రౌఢవ్యాకర్తలు చెప్పిన సంధి కార్యాలకు సవరణలు, పూరణలు, వివరణలు ఇచ్చారు.

వావిలికొలనువారు మాహేశ్వర సూత్రాలను అనుసరించి ప్రత్యాహారాల ద్వారా సంస్కృత సంధులను సూత్రీకరించారు. గుణాలు, వృద్ధులు వంటి సంజ్ఞలను సూత్ర రూపంలో నిర్వచించారు. సంస్కృత సంధులలైన సవర్ణదీర్ఘసంధి, యణాదేశ సంధి, పరరూప సంధి, అవాంజదేశ సంధి, ప్రకృతిభావ సంధి, శ్చుత్వ సంధి, ష్టుత్వసంధి, జశ్త్వ సంధి, అనునాశిక సంధి, పూర్వ సవర్ణ సంధి, విసర్గ సంధి, స్వాది సంధి మొదలైన సంధులను సూత్రరూపంలో సులభవ్యాకర్త నిర్వచించారు.

ఈ అధ్యాయంలో అత్వసంధి, ఇత్వ సంధి, ఉత్వ సంధి, అన్ని అచ్చులకు సంధి, స్వరలోప సంధులు, కళా సంధులు, ద్రుత సంధులు, సమాసగత సంధులు, నుగాగమ సంధులు, టుగాగమ సంధులు, ఆమ్రేడిత సంధులు, మువర్ణక సంధులు, ధ్వన్యనుకరణ సంధులు, అనుకరణ సంధులు, సంస్కృత శబ్ద సంధులు' మొదలైన సంధులను పరిశీలించడం జరిగింది.

ఐదవ అధ్యాయం: 'పదాంశ విజ్ఞానం' అనే అధ్యాయంలో 'తత్సమ పదాల నిర్మాణం, ఆచ్ఛిక పదాల నిర్మాణం, తద్ధిత పదాల నిర్మాణం, కృదంత పదాల నిర్మాణం' మొదలైన అంశాలను పరిశీలిస్తాను.

# నాల్గవ అధ్యాయం

## సంధి విజ్ఞానం– సూత్రాల పట్టిక

| క్రమ సంఖ్య | బాలవ్యాకరణము సూత్రము: సంఖ్య | సులభవ్యాకరణము సూత్రము: సంఖ్య | సవరణ | పూరణ | వివరణ | నూతన విషయ ప్రతిపాదన |
|---|---|---|---|---|---|---|
| 1. | బహుళగ్రహణం చేత స్త్రీవాచక, సంధి: 4 | స్త్రీవాచక, తత్సమ, సంబోధ, నావధా.. సంధి :4 | –– | ✓ | –– | –– |
| 2. | మధ్యమ పురుష క్రియలందిత్తున సంధి:7 | మధ్యమ పురుషమున ఇ,,, సంధి: 7 | –– | –– | ✓ | –– |
| 3. | ఉత్తునకచ్చు పరంబగునపుడు. సంధి: 1 | ఉత్తునకు సంధి నిత్యము.. సంధి:10 | –– | –– | ✓ | –– |
| 4. | | రూపాంతర మందు..... సంధి: 12 | –– | –– | –– | ✓ |
| 5. | అంద్వవగాగమం బులం దప్ప.. సంధి:11 | అంద్వం తావగాగమంబు లం. సంధి: 14 | –– | ✓ | –– | –– |
| 6. | –– | ఏసి పరమైనపుడు సర్వ ప్రాణులకు,,, సంధి: 15 | –– | –– | –– | ✓ |
| 7. | –– | దీర్ఘాచ్చునకు సంధి లేదు... సంధి: 16 | –– | –– | –– | ✓ |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 8. | అచ్చున కామ్రేడితంబు... సంధి: 10 | అచ్చున కామ్రేడితంబు... సంధి: 17 | –– | –– | ✓ | –– |
| 9. | –– | హల్లు పరమైనపుడు ఏనిలోని ఇకారము.. సంధి:18 | –– | –– | –– | ✓ |
| 10. | –– | 'ను'వర్ణము కడపటఁగల ధాతు.. సంధి:19 | –– | –– | –– | ✓ |
| 11. | ఆచ్చికంబులం బదమధ్యంబుల. ప్రకీర్ణక: 17 | ఇట్టిలోపం బొకానొకచో నిత. సంధి: 22 | –– | ✓ | –– | –– |
| 12. | –– | "ఏ యక్షరంబు మీఁది యే స్వర.. సంధి: 23 | –– | –– | –– | ✓ |
| 13. | –– | "భిన్నపద ప్రథమల మీఁది.. సంధి: 28 | –– | –– | –– | ✓ |
| 14. | –– | ద్రుత ప్రకృతికమున.. సంధి:29 | –– | –– | –– | ✓ |
| 15. | ఇఁకాదులకుఁ దప్ప... సంధి:9 | ఇఁకాదులకచ్చు పరంబగునపుడు.. సంధి:30 | –– | –– | ✓ | –– |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 16. | –– | “అనునాసి, కాంత, స్థోష్మంబులు.. సంధి: 34 | –– | –– | –– | ✓ |
| 17. | తాను నేను పదయంబుల.. సంధి:23 | ఏను నేను తాను పదంబుల.. సంధి : 37 | –– | ✓ | –– | –– |
| 18. | –– | “ద్విత్వయుక్తముల యిన నులు.. సంధి:42 | –– | –– | –– | ✓ |
| 19. | –– | ఇట్టి ద్విత్వ యుక్తములయిన. సంధి:43 | –– | –– | –– | ✓ |
| 20. | –– | పట్టి ప్రత్యయము పరమైనపుడు.. సంధి:51 | –– | –– | –– | ✓ |
| 21. | కర్మధారయంబు సంధి:28 | కర్మధారయంబు.. సంధి:28 | ✓ | –– | –– | –– |
| 22. | –– | “ధ్వన్యనుకరణం బులు ద్వి, త్రి, సంధి:73 | –– | –– | –– | ✓ |
| 23. | –– | ముగాగమం బగుచో ద్విత్వంబు సంధి:76 | –– | –– | –– | ✓ |
| 24. | –– | సంస్కృత సు, ఌ్తి, జ్క్వ.. సంధి:77 | –– | –– | –– | ✓ |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 25. | –– | సదాద్యవ్యయం సంధి:79 | | –– | –– | ✓ |
| 26. | –– | యథా యథలు వృథా:80 | –– | –– | –– | ✓ |
| 27. | –– | నిషిద్ధంబులను కరణపరకంబులై.. సంధి:81 | –– | –– | –– | ✓ |
| 28. | –– | అను ధాతువు పరంబగుచో.. సంధి:82 | –– | –– | –– | ✓ |
| 29. | –– | "ఆశ్చర్య సంతాపాద్యర్థంబు సంధి:88 | –– | –– | –– | ✓ |
| 30. | –– | "ద్విత్వయుక్తంబు మఱియొక. సంధి:89 | –– | –– | –– | ✓ |
| 31. | –– | "అపవాదంబులు విధులు కావు. సంధి:90 | –– | –– | –– | ✓ |
| 32. | –– | అక్కులకు సవర్ణములైన అక్కు సంధి: సం. శబ్ద:4 | –– | –– | –– | ✓ |
| 33. | –– | సకార తవర్గములు–.... సంధి.సం. శబ్ద:16 | –– | –– | –– | ✓ |

# అధ్యాయం – 5

# పదాంశ విజ్ఞానం

# అధ్యాయం – 5

# పదాంశ విజ్ఞానం

## 5.0 పరిచయం

సులభవ్యాకరణంలోని తత్సమ, ఆచ్ఛిక, తద్ధిత, కృదంత, ప్రకీర్ణక పరిచ్ఛేదాలలోని అంశాలను ఈ అధ్యాయంలో చర్చించడం జరిగింది.

## 5.1 తత్సమ పదాల నిర్మాణం

అజంతాలు, హలంతాలైన సంస్కృత పదాలు తెలుగులో ఉపయోగించినప్పుడు ఆ సంస్కృత ప్రాతిపదికలను తెలుగు పదాలుగా మార్చే విధానమే తత్సమ పదాల నిర్మాణం. బాలవ్యాకర్త తత్సమ పరిచ్ఛేదంలో మొదటి ఏడు సూత్రాలలో నామ విభక్తి ప్రత్యయాలను చెప్పారు.

"డు–ము–వు–లు: ప్రథమ"(బాల. తత్సమ: 1)

"నువర్ణంబు : ద్వితీయ"(బాల. తత్సమ: 2)

"చేత – తోడ : తృతీయ"(బాల. తత్సమ: 3)

"కొఱకు – కయి : చతుర్థి"(బాల. తత్సమ: 4)

"వలన – కంటె – పట్టి: పంచమి" (బాల. తత్సమ: 5)

"కు – యొక్క – లోపల : షష్ఠి"(బాల. తత్సమ: 6)

"అందు – న : సప్తమి"(బాల. తత్సమ: 7)

'డు, ము, వు, లు' అనేవి ప్రథమావిభక్తి ప్రత్యయాలు. 'ను' అనేది ద్వితీయా విభక్తి ప్రత్యయం. ఇది ద్రుతం. ఈ 'ను' వర్ణం ఇకారాంత శబ్దం మీద 'ని' గా అవుతుంది. హరి+ను > హరిని. 'చేత, తోడ' తృతీయా విభక్తి ప్రత్యయాలు. వీటి రూపాంతరాలుగా 'చే,తో, లను ఉపయోగిస్తాం. 'కొఱకు, కయి' అనేవి చతుర్థీ విభక్తి ప్రత్యయాలు, 'కయి' రూపాంతరం 'కై'. 'వలన, కంటె, పట్టి' అనేవి పంచమీ విభక్తి ప్రత్యయాలు. 'కు, యొక్క, లోపల' అనేవి షష్ఠీ విభక్తి ప్రత్యయాలు. 'లోపల'

రూపాంతరం 'లోగా కనిపిస్తుంది, ఇకారాంత శబ్దం మీద 'కు' 'కి' అవుతుంది. హరి+కు>హరికి . 'అందు, న' అనేవి సప్తమీ విభక్తి ప్రత్యయాలు.

సులభ వ్యాకర్త కూడా తత్సమ పరిచ్ఛేదంలో మొదట ఎనిమిది సూత్రాలలో నామ విభక్తి ప్రత్యయాలనే పేర్కొనా . బాలవ్యాకర్త 'సంబోధనా ప్రథమా విభక్తి' ని ప్రత్యేకంగా సూత్ర రూపంలో చెప్పలేదు. సులభ వ్యాకర్త సూత్రంలో చెప్పారు.

"ప్రథమా విభక్తి :ఁడు-ము-వు-లు"(సులభ. తత్సమ:1),

"ద్వితీయా విభక్తి: ని-ను-ల" (సులభ. తత్సమ:2)

"తృతీయా విభక్తి: చేత-చే-తోడ-తో" (సులభ. తత్సమ:3)

"చతుర్థీ : కై -కొఱకు"(సులభ. తత్సమ:4)

"పంచమీ విభక్తి: వలన- కంటె-పట్టి"(సులభ. తత్సమ:5)

"షష్ఠీ విభక్తి: కి-కు -యొక్క-లోపల-లో "(సులభ. తత్సమ:6)

"సప్తమీ విభక్తి : అందు- న"(సులభ. తత్సమ:7)

"సంబోధన ప్రథమా విభక్తి: ఓ-ఓయి-ఓరి-ఓసి"(సులభ. తత్సమ:8)

సులభవ్యాకర్త పైన చెప్పిన సూత్రాలను ఒకచోట చెప్పి క్రింద కొంత వివరణ ఇచ్చారు. 'ఁడు' మొదలైన వాటికే 'వర్ణకాలని, ప్రత్యయాలని' పిలుస్తారని సులభవ్యాకర్త చెప్పారు. ఒక శబ్దానికి ఆయావిభక్తి రూపం చెప్పాలనుకున్నపుడు ఆయా విభక్తికి ఎదురుగ ఉండే ప్రత్యయాలలో ఒకటి చేర్చాలి. ఉదాహరణకు 'రామ' శబ్దానికి తృతీయావిభక్తి రూపం 'రాము చేత-రాము చే-రాముతోడ- రాముతో' నని చెప్పాలి. పై ప్రత్యయాలలో ప్రథమ విభక్తి ప్రత్యయాలు,'కై-పట్టి యొక్క' అనేవి కళలు. మిగిలిన నుగాగమంబులు, ద్రుతప్రకృతికాలు అని సులభవ్యాకర్త చెప్పారు.

బాలవ్యాకర్త "డు-ము—వు-న లేకవచనంబులు"(బాల. తత్సమ:11) అని సూత్రీకరించారు. విభక్తి ప్రత్యయాలలో 'డు-ము-వు- న' అనేవి ఏకవచన ప్రత్యయాలు. ఏకత్వ సంఖ్యను బోధించు

ప్రత్యయాన్నే ఏకవచనం అంటారు. ఉదాహరణకు ‘రాముడు, వనము, ధేనువు’ మొదలైన వాటిలో ‘డు–ము–వు’ అనే ప్రత్యయాలు ఏకవచన బోధకాలు కాబట్టి ఇవి ఏకవచనాలు.

సులభవ్యాకర్త “ఁడు–ము–వు–న” లేకవచనంబులు”(సులభ. తత్సమ:9) అని సూత్రీకరించారు. వచన మనగా వస్తువుల సంఖ్యను తెల్పుతుంది. ఒకటిని తెలియజేసేది ఏకవచనం. ఉదాహరణకు ‘రాముఁడు గోవును వత్సమును వనమున మేపును’. రాముఁడు–గోవు– వత్సము– వనము– వంటి చోట్ల ‘డు– ము– వు ‘ అనే విభక్తి ప్రత్యయాలు. ఒక్కొక్క సంఖ్యనే తెలుపును. కాబట్టి ఇవి ఏకవచనంలో ఉన్నవి.

బాలవ్యాకర్త “లు వర్ణంబు బహువచనంబు”(బాల. తత్సమ:12) అని సూత్రీకరించారు. ‘లు’ అనే వర్ణం బహువచనాన్ని తెల్పుతుంది. ఒకటి కంటే ఎక్కువ పదార్థాలను బోధించు ప్రత్యయాన్ని బహువచనం అంటారు. ఉదాహరణకు ‘రాములు’ ఇందులో ‘లు’ అనేది ఒక రామునికంటె ఎక్కువ మంది రాములను బోధించడం వల్ల ఇది బహువచనమైనది.

సులభవ్యాకర్త“లు–ల’ లు బహువచనంబులు”(సులభ.తత్సమ:10) అని సూత్రీకరించారు. ఒకటి కంటె ఎక్కువ సంఖ్యగల వస్తువులను తెల్పేది బహువచనం. ఉదాహరణకు ‘రామకృష్ణులు గోవులను వత్సములను వనముల మేపరి’. ఈ సూత్రంలో సులభవ్యాకర్త ‘ల’ అనే ప్రత్యయాన్ని కూడా బహువచనంలో ప్రత్యేకంగా చెప్పారు.

బాలవ్యాకర్త “తక్కినవి యుభయంబులు” (బాల.తత్సమ:13) అని సూత్రీకరించారు. ‘డు–ము–వు–న–లు’ అనే ఐదు విభక్తి ప్రత్యయాలు కాక మిగిలిన విభక్తి ప్రత్యయాలు ఉభయ వాచకాలు. ఉభయాలు అనగా ఏకత్వ బహుత్వ సంఖ్యను రెండింటిని తెల్పుతాయి. ఉదాహరణకు ‘వనమును’ ఇందులో ‘ను’ అనేది ఏకవచనము. ‘వనములను’ ఇందులో ‘ను’ అనేది బహువచనాన్ని తెల్పుతుంది. సులభవ్యాకర్త “తక్కినవి యుభయంబులు” (సులభ.తత్సమ:11) అని సూత్రీకరించారు. ‘డు–ము–వు–న–లు–ల’ అనే ఆరు విభక్తి ప్రత్యయాలు కాక మిగిలిన విభక్తి ప్రత్యయాలు ఉభయ వాచకాలు. ఉభయాలు అనగా ఏకవచనంలోనే కాక బహువచనంలో కూడ వాడబడతాయి. ఉదాహరణకు ‘ రాముని యొక్క– రాముల యొక్క’.

సులభవ్యాకర్త ఈ సూత్రంలో  విభక్తి ప్రత్యయాల గురించి కొంత వివరణ ఇచ్చారు. పైన పేర్కొన్న అక్షరాలు ప్రత్యయాలుగా చెప్పినపుడే  అర్థవచనాలుగా గ్రహించాలి. ఆయా అక్షరాలలో కలిసి పదాలుగా వచ్చిన ప్రతి చోట వీటిని ఏకవచనాన్ని, బహువచనాన్ని తెలిపే ప్రత్యయాలుగా గ్రహించకూడదు. ఉదాహరణకు ‘ కాన(అడవి)’ అనే శబ్దంలో చివర ‘న’ ఉన్నదని  సప్తమీ విభక్తి ప్రత్యయం  అని అనకూడదు. ఇందులో ‘న’ అనేది అక్షరం మాత్రమే ప్రత్యయం కాదు.

బాలవ్యాకర్త “స్త్రీతిర్యగ్జడ భిన్నంబులును వాని విశేషణంబులును మహత్తులనంబడు” (బాల.తత్సమ:17) సూత్రీకరించారు. స్త్రీవాచకాలు, తిర్యక్ వాచకాలు, జడవాచకాలు కాకుండా మిగిలిన వాటిని తెలుపు శబ్దాలను, వాటి విశేషణాలను, మహద్వాచకాలు అంటారు. తిర్యక్కులు అనగా పశువులు, పక్షులు మొదలైనవి. జడములు అనగా అచేతనాలు. మహత్తులకు ఉదాహరణ ‘ రాముఁడు, రావణుఁడు, ఇంద్రుఁడు మొదలైనవి. మహత్తుల విశేషణాలు మహత్తులే అవుతాయి. ఉదాహరణకు మనోహరుఁడు రాముఁడు’.

వావిలికొలనువారు “శబ్దములు మహదర్థకములు – అమహదర్థకములు – మహత్యర్థకములు – మహన్మహత్యర్థకములు – అవ్యయములు లని యయిదు విధంబులు”(సులభ. తత్సమ:12) అని సూత్రీకరించారు. వావిలికొలనువారు శబ్దాలను మహదర్థకాలు, అమహదర్థకాలు, మహత్యర్థకాలు, మహన్మహదర్థకాలు, అవ్యయాలు  అని ఐదు రకాలుగా విభజించి సంజ్ఞలను నిర్వచించారు.

“పురుషులను దెలుపు శబ్దములును, వాని విశేషణములును మహదర్థకములు”(సులభ. తత్సమ:13)

“స్త్రీలు – తిర్యక్కులు – జడములు – వాని విశేషణములు అమహదర్థకములు” (సులభ. తత్సమ:14)

“స్త్రీలను మాత్రము దెలుపు శబ్దంబులు మహత్యర్థకంబులు” (సులభ. తత్సమ:15)

“స్త్రీలను, బురుషులను దెలుపు శబ్దంబులు మహన్మహత్యర్థకంబులు” (సులభ. తత్సమ:16)

“లింగ, విభక్తి వచనములు లేనివి యవ్యయంబులు” (సులభ. తత్సమ:17)

పురుషవాచకాలను, వారి విశేషణాలను తెలిపే శబ్దాలను మహదర్థకాలు అంటారు. ఉదాహరణకు ‘రాముఁడు భీముఁడు, రాముఁడు సుగుణాభిరాముఁడు. స్త్రీవాచకాలను, తిర్యక్

వాచకాలను (పశువులు, పక్షులు), జడవాచకాలను (ప్రాణం లేనివి, అచేతనాలు) వాటి విశేషణాలను అమహదర్థకాలు అంటారు. ఉదాహరణకు 'సీత– ద్రౌపది–పార్వతి–సీత లోకమాత, ఆవు, దూడ, చెట్టు, ఇల్లు'. స్త్రీ వాచకాలను మాత్రమే తెలు శబ్దాలను మహత్యర్థకాలు అంటారు. ఉదాహరణకు 'రుక్మిణి, జానకి, గౌరి'. స్త్రీ వాచకాలను పురుషవాచకాలను రెండింటిని తెలిపే శబ్దాలను మహత్ అమహదర్థకాలు అంటారు. ఉదాహరణకు 'అందఱు, కొందఱు, నలుగురు'. ఏ లింగమో, ఏ వచనమో, ఏ విభక్తియో చెప్పలేని శబ్దాలను అవ్యయాలు అంటారు. ఈ అవ్యయాలు ప్రతి పదోక్తాలు, లాక్షణికాలు అని రెండు రకాలు. పుట్టినవి పుట్టినట్లుగా ఉండే అవ్యయాలు ప్రతిపదోక్తులు. ఉదాహరణకు ' ఔర, ఆహా, భళీ' మొదలైనవి. శాస్త్రం వల్ల నిష్పన్నమైనవి లాక్షణికా . ఉదాహరణకు 'అట్లు, ఇట్లు, ఎట్లు , వేఁడక, చూచినన్, చదువన్' మొదలైనవి.

బాలవ్యాకర్త శబ్దాలు ఎన్నిరకాలుగా ఉంటాయి? వాటిని ఏమని పిలుస్తారు? వంటి విషయాలను ఒకేచోట వివరించలేదు. సందర్భోచితంగా చెప్పుకుంటూ వెళ్లారు. కాని, సులభ వ్యాకర్త వాటన్నింటిని ఒకేచోట ఆరు సూత్రాలలో ప్రస్తావించారు.

## 5.1.1 అజంత ప్రకరణం

### 5.1.1.1 అకారాంత శబ్దాలు

బాలవ్యాకర్త "పుంలింగమగు మహద్వాచకమునకు డుజ్జగు"(బాల. తత్సమ:22) అని సూత్రీకరించారు. పుంలింగమగు మహద్వాచకానికి 'డుజ్' ప్రత్యయం వస్తుంది. తరువాత "జిత్తు బిందుపూర్వంబగు"(బాల. తత్సమ:19) అనే సూత్రంచే 'జకారం ఇత్తుగా గల అక్షరానికి ముందు బిందువు వస్తుందని బాలవ్యాకర్త చెప్పారు. 'ఇత్తు' అనగా ఒక కార్యం జరగడం కోసం ప్రత్యయాలు మొదలైనవాటికి కూర్చబడి, ప్రయోగించేటప్పుడు విడవబడు వర్ణాన్ని ఇత్తు లేదా ఇద్వర్ణకం అంటారు. ఉదాహరణకు 'రాము+డుజ్ =రాముఁడు'.

సులభవ్యాకర్త "అకారాంత పుంలింగ మహద్వాచకంబునకు డుజగు" ( సులభ. తత్సమ:18) అని సూత్రీకరించారు. అకారం గాని, ఆకారంగాని చివర గల పుంలింగ మహద్వాచకాలకి 'డుజ్' వర్ణకం వస్తుంది. తరువాత 'జిత్తు బిందు పూర్వకంబగు' అను సూత్రంచే

'జ్' కారం ఏ అక్షరానికి చేర్చబడుతుందో ఆ అక్షరానికి ముందు బిందువు వస్తుంది. ఉదాహరణకు ' రాము + డుజ్ = రాముఁడు'.

బాలవ్యాకర్త"పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వంబున కుత్వంబగు" (బాల. తత్సమ:21) అని సూత్రీకరించారు. పుంలింగమయి మహద్వాచకమైన ప్రాతిపదికము యొక్క చివరన ఉన్న హ్రస్వమైన అకారానికి హ్రస్వమైన ఉకారం ఆదేశంగా ఇస్తుంది. ఉదాహరణకు 'రాము, భార్గవు, రాజపురుష'.

సులభవ్యాకర్త "డుజ్ ప్రత్యయము పరమగునపుడు పుంలింగంబున మహద్వాచకమైన ప్రాతిపదికము తుది అత్వమునకు ఉత్తగు(సులభ. తత్సమ:19) అని సూత్రీకరించారు. 'డుజ్' ప్రత్యయం వచ్చేటప్పుడు పుంలింగ మహద్వాచకమైన ప్రాతిపదిక చివర అత్వానికి, ఉత్వం వస్తుంది. ఉదాహరణకు 'రామ' ప్రాతిపదిక. దీనికి డుజ్' ప్రత్యయం చేరి 'రామ+డుజ్' అయినది. ప్రస్తుత సూత్రంచే అత్వానికి ఉత్వం వచ్చి 'రాము+ డుజ్= రాముఁడు' అయింది. సులభవ్యాకర్త ఈ సూత్ర వివరణలో 'డుజ్' ప్రత్యయం దేనికి చేరునో దానిని డుమంతం అంటారని చెప్పారు.

సులభవ్యాకర్త ఈ సూత్ర వివరణలో ముందు చెప్పిన సూత్రంలో (సులభ. తత్సమ:18) అకారాంతం చెప్పుటకు కారణం ఇకారాంత శబ్దాలకు 'డుజ్' రాదని, ఉకార–ఋకారాంత శబ్దాలకు 'డుజ్' బహుళంగా వస్తుందని చెప్పారు. అలాగే మహద్వాచకమని చెప్పడానికి కారణం కూడా సులభ వ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ' ఆనందః' ఇది అకారంత పుంలింగం శబ్దం. మహద్వాచకం కాదు. కాబట్టి మువర్ణకం చేర్చి 'ఆనందము' అని చెప్పాలి గాని 'డుజ్' ప్రత్యయం చేర్చకూడదు.

సులభవ్యాకర్త "నీచ, మూర్ఖ, ధూర్త, వృద్ధ, గృహస్థ, భ్రష్ట, చార్వాక శబ్దంబులకు ఉత్తగు, డుజ్ విభాషనగు" (సులభ. తత్సమ:20) అని సూత్రీకరించారు. నీచ, మూర్ఖ, ధూర్త, వృద్ధ, గృహస్థ, భ్రష్ట, చార్వాక శబ్దాలకు ఉకారం వస్తుంది. 'డుజ్' వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'డుజ్' చేరగా ఏర్పడిన రూపాలు 'నీచుఁడు, మూర్ఖుడు, ధూర్తుడు, వృద్ధుఁడు'. 'డుజ్' వికల్పంగా ఉన్నప్పుడు 'నీచు సుయోధనుడు– నీచుఁడు సుయోధనుడు' అనే రూపాలు ఏర్పడ్డాయి. 'నీచ' శబ్దానికి 'డుజ్' వచ్చినపుడు 'నీచుఁడు' అని , 'డుజ్ రానపుడు 'నీచ' అని ఉంటుందని సందేహించకూడదని విద్యార్థుల కోసం ఈ సూత్రం చెప్పానని సులభవ్యాకర్త చెప్పారు.

సులభవ్యాకర్త "భట్టశబ్దం బుదంతమాత్రం బగు" (సులభ. తత్సమ:21) అని సూత్రీకరించారు. 'భట్ట' శబ్దానికి 'ఉ' మాత్రమే వస్తుందని 'నన్నయ భట్టు, నారాయణ భట్టు, హరిభట్టు వంటి ఉదాహరణలను ఇచ్చారు. బాల, ప్రౌఢ వ్యాకరణాలు ఈ విషయాన్ని చర్చించలేదు.

బాలవ్యాకర్త "దూతాదులకు స్త్రీత్వంబు బహుళంబుగనగు"(బాల.తత్సమ:61) అని సూత్రీకరించారు . 'దూత' మొదలైన శబ్దాలకు స్త్రీలింగత్వం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు 'దూత– దూతుఁడు'. 'దూత' ప్రాతిపదిక. స్త్రీలింగత్వంగా చెప్పేటప్పుడు అనుక్త న్యాయంచేత 'సు' ప్రత్యయం వచ్చును. 'దూత+సు' ఇందులో 'సు' అనేది లోపించి 'దూత' అనే ప్రథమైకవచన రూపం వచ్చును. స్త్రీలింగం కానప్పుడు 'దూత+డుజ్= దూతుఁడు అనే రూపం ఏర్పడును. ఈ సూత్రంలో బాలవ్యాకర్త 'బహుళగ్రహణముచే నమహత్వంబు నందు స్త్రీత్వంబు నిత్యంబు' అని అమహద్వాచకానికి స్త్రీలింగత్వం నిత్యంగా చెప్పారు. ఉదాహరణకు 'సింగంబు దూతయగు జంబుకంబు'. ఇందులో 'జంబుకంబు' అనేది విశేష్య అమహత్తు , కాబట్టి విశేషణమైన 'దూత' అనేది కూడా అమహత్తు అవుతుంది. కానీ ప్రస్తుత సూత్రంలోని వృత్తి వాక్యం వల్ల అమహత్తుకు స్త్రీలింగత్వం నిత్యంగా వచ్చి 'దూత' అని స్త్రీలింగమే అవుతుంది.

సులభ వ్యాకర్త "యోధాదులు బహుళంబుగ స్త్రీ సమంబులగు" (సులభ. తత్సమ:22) అని సూత్రీకరించారు. 'యోధ' మొదలైన శబ్దాలు బహుళంగా స్త్రీసమాలుగా కన్పిస్తున్నాయి. స్త్రీ సమాలు అనగా 'డు, ము, వు' ప్రత్యయాలు రాకుండా ఉండే శబ్దాలు. ఉదాహరణకు ' హనుమంతుడు రాముని దూత' , హనుమంతుడు రాముని దూతుఁడు అని రెండు విధాలుగా చెప్పవచ్చు. కాని అమహత్వంలో స్త్రీ రూపమే గ్రహించాలి. 'భట్టు' శబ్దంలోని ఉత్వం 'డు' నిమిత్తంగా రావడం వల్ల 'డుమువు' లు లేకపోయినా ఇది స్త్రీ సమం కాదు.

బాలవ్యాకర్త"అమహన్న పుంసకముల కదంతంబులకు మువర్ణకంబగు"(బాల. తత్సమ:39) అని సూత్రీకరించారు. హ్రస్వమైన అకారమంతమందుగల అమహత్తులకును, నపుంసకలింగ శబ్దాలకును ప్రథమావిభక్తిఏకవచనంలో ముప్రత్యయం వస్తుందనిన్ చెప్పారు.

సులభవ్యాకర్త "అదంతంబైన యమహ–న్నపుంసక శబ్దమునకుఁ బ్రథమైకవచనంబున ముపర్ణకంబును, దదన్యంబున ముగాగమంబు నగు" (సులభ. తత్సమ:23) అని సూత్రీకరించారు.

అకారాంతంగా ఉన్న  అమహత్తులకును, నపుంసకలింగ శబ్దాలకును ప్రథమావిభక్తిఏకవచనంలో ముప్రత్యయం వస్తుంది. తదన్యంబున అనగా ప్రథమా బహువచనంలో, ద్వితీయా ఏకవచనం మొదలైన చోట్ల 'ము' అనే అక్షరం ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'అదంతమైన అమహత్తుకు ఉదాహరణకు 'పర్వతః ఇది అకారంతము. ప్రాణం లేనిది కాబట్టి అమహద్వాచకం. ఇది తత్సమంగా రాయాల్సినపుడు విసర్గ లోపించి 'పర్వత' అని ఉంటుంది. దీనికి ప్రస్తుత సూత్రం ద్వారా 'ము' వర్ణకము వచ్చి ' పర్వతము' అనే ఏకవచన రూపం వస్తుంది. 'పర్వత' అనే ప్రాతిపదికకి బహువచన ప్రత్యయం 'లు' చేర్చగా 'పర్వతలు' అయింది. ఈ 'లు' ప్రత్యయం 'ము' ప్రత్యయం కంటె వేరైనది కాబట్టి 'ము' అనే అక్షరం  ఆగమంగా వచ్చి  'పర్వతములు' అని ప్రథమా బహువచనరూపం ఏర్పడింది.

బాలవ్యాకర్త "మువర్ణకంబునకు మామువడియేనిం బూర్ణబిందుపూర్వక బువర్ణంబేని 'విభాషనగు"(బాల.తత్సమ:42) అని సూత్రీకరించారు. 'ము'అనే ప్రథమావిభక్తి ఏకవచన ప్రత్యయానికి మాముడి ఆగమంగాబువర్ణం ఆదేశంగా గాని;  గాని, నిండుసున్నతోకూడిన 'ం బు'వర్ణం ఆదేశంగాగాని విభాషగా వస్తాయి. సులభవ్యాకర్త కూడా  "మూలకు 'ద్విత్వ-ము,ంబు', లు విభాష నగు" (సులభ. తత్సమ:24) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "చరిత్రాదుల ముువర్ణకంబునకు లోపంబు బహుళంబుగానగు" (బాల.తత్సమ:58) అని సూత్రీకరించారు. చరిత్రాదుల 'ము' ప్రత్యయానికి లోపం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు ' చరిత్ర-చరిత్రము'. 'చరిత్ర' ప్రాతిపదిక. ప్రస్తుత సూత్రంచే ముువర్ణకం వచ్చి 'చరిత్రము'  అయింది. ముువర్ణకం  రానప్పుడు 'చరిత్ర' అని ఉంటుంది. బాలవ్యాకర్త ఈ సూత్రంలో 'బహుళకము వలన దర్భాదులకు 'ము' లోపంబు నిత్యంబు' అని చెప్పారు. అనగా 'దర్భా' మొదలైన శబ్దాలకు 'ము' లోపం నిత్యంగా వస్తుంది. ఉదాహరణకు 'దర్భ, పనస'.

సులభవ్యాకర్త "చరిత్రాదులకు ముువర్ణక లోపంబు విభాష నగు" (సులభ. తత్సమ:26) అని సూత్రీకరించారు. చరిత్రాదుల 'ము' ప్రత్యయానికి లోపం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'చరిత్రము- చరిత్ర', సర్గము-సర్గ'. 'ప్రాసము— అంశము-మధ్యము- శ్రమము' వంటి రూపాలలోని 'ము' లోపం సాధుకవి ప్రయోగాలలో లేవని వావిలికొలనువారు చెప్పారు.

సులభవ్యాకర్త "కుశాదులకు ము లోపంబు" (సులభ. తత్సమ:25) అని సూత్రీకరించారు. 'కుశ' మొదలైన శబ్దాలలో 'ము' లోపం కన్పిస్తుంది. ఉదాహరణకు'కుశ, దర్భ, కుండ, పనస'. 'కుశము, దర్భము, కుండము, పనసము' అని చెప్పకూడదు. 'పనస' శబ్దం వికృతి పదంగా ఉన్నా 'ము' రాదు. బాలవ్యాకర్త 'బహుళకము వలన దర్భాదులకు మ' లోపంబు నిత్యంబు' అని వృత్తి వాక్యంలో(బాల. తత్సమ:58) చెప్పిన విషయాన్ని సులభవ్యాకర్త ఈ సూత్రంగా చెప్పారు.

సులభవ్యాకర్త "ధర్మాదులకు వువర్ణకంబును నగు (సులభ. తత్సమ:27) అని సూత్రీకరించారు. ధర్మాదులకు 'వు' ప్రత్యయం వస్తుందని చెప్పి 'ధర్మము – ధర్మవు, అర్ఘము – అర్ఘవు' వంటి రూపాలను పేర్కొన్నారు.

బాలవ్యాకర్త "క్లీబంబులు మిత్రాదులు మహద్వాచకంబులు విభాషం బుంలింగ తుల్యంబులగు" (బాల. తత్సమ:18) అని సూత్రీకరించారు. సంస్కృతభాషలో నపుంసకలింగ శబ్దాలైన 'మిత్ర శరణ ప్రధాన పాత్ర మొదలైన శబ్దాలు తెలుగులో మహద్వాచకాలుగా ప్రయోగింపబడినపుడు వికల్పంగా పుంలింగ తుల్యాలవుతాయి. సులభవ్యాకర్త కూడా "నపుంసకంబులగు మిత్రాదులు మహద్వాచకంబులు విభాషం బుంలింగ తుల్యంబులగు" (సులభ. తత్సమ:28) అని సూత్రీకరించారు.

సులభవ్యాకర్త "మహద్వివక్ష యందుఁ గొన్ని యమహచ్ఛబ్దములకు డుజ్ఞగు" (సులభ. తత్సమ:29) అని సూత్రీకరించారు. మహత్తును వివక్షించేటప్పుడు కొన్ని అమహద్వాచకాలకు 'డుజ్' వస్తుంది. ఉదాహరణకు 'సముద్రము – సముద్రుడు', మేఘము – మేఘుఁడు'.

సులభవ్యాకర్త "అనిరాకాంతంబులకు, 'ము — వు' వర్ణకంబులకు 'ను — కు' వర్ణకంబు లాగమంబుగ నగు"(సులభ. తత్సమ:45) అని సూత్రీకరించారు. ఇకారాంతాలు కానివి వాటికి, 'ము–వు' లకు ద్వితీయావిభక్తి 'ను', షష్ఠి ప్రత్యయం 'కు' ఆగమంగా వస్తాయి. ఉదాహరణకు 'యోధను, విధాతను, వనితను, చరిత్రమును, వనమును, కొడుకును, యోధకు, వనితకు, నవలాకు, చరిత్రమునకు'.

బాలవ్యాకర్త "అదంతంబయి దీర్ఘపూర్వ లోపధంబయిన మహత్తుమీఁది విభక్తి లకారంబునకు రేఫంబగు"(బాల. తత్సమ:38) అని సూత్రీకరించారు. హ్రస్వమైన అకారమంత మందుండి, లకారం ఉపధగా ఉండి, ఆ లకారానికిముందు దీర్ఘముండే మహద్వాచక ప్రాతిపదికపైనగల బహువచన ప్రత్యయమైన లు / ల కారానికి రేఫమాదేశంగా వస్తుంది. సులభవ్యాకర్త కూడా "దీర్ఘపూర్వక లకారోపధ కాదంత సంస్కృత సమ మహచ్ఛబ్దంబుల మీఁది'లు – ల' లకు 'రు–ర' లగు "(సులభ. తత్సమ:55) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "లులనలు పరంబులగునపుడొకానొకచో ముగాగమంబునకు లోపంబును దత్పూర్వ స్వరంబునకు దీర్ఘంబును విభాషనగును"(బాల. తత్సమ:43) అని సూత్రీకరించారు. లులన అనేవి పరమవుతుంటే అక్కడక్కడ ముగాగమం లోపించి, దానికి పూర్వమున్న స్వరానికి దీర్ఘమవుతుంది. లోపదీర్ఘాలు విభాష కాబట్టి అవి రాని రూపాలు కూడా ఉంటాయి. లులన – వీనిలో లు అనేది ప్రథమాబహువచన ప్రత్యయం. ల అనేది ద్వితీయాది విభక్తులకు బహువచనంలో వచ్చే ఆగమం. న అనేది సప్తమీ ప్రత్యయంగాను, ఆగమంగాను గ్రహించాలి. సులభవ్యాకర్త కూడా "లు ల 'న'లు పరంబులగునపుడు గొండొకచో 'ము' గాగమంబునకు లోపంబును దత్పూర్వంబైన అకారంబునకు దీర్ఘంబును విభాషనగు "(సులభ. తత్సమ:57) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త " ఓ యామంత్రణంబునందగు" (బాల. తత్సమ:14) అని సూత్రీకరించారు. పిలుపు, సంబోధన అనే అర్థంలో వస్తుంది. ఓ అనే శబ్దం సంబోధనలో వస్తుంది. ఈ శబ్దం సంబోధ్యవాచకానికి (పిలువబడేదానిని తెలిపే నామపదానికి) ముందే చేరి ప్రయోగింపబడుతుంది. ఓశబ్దం లేకుండాకూడా సంబోధ్యవాచకం ప్రయోగింపవచ్చు.

సులభవ్యాకర్త "ఆమంత్రణంబున విశిష్టా విశిష్ట సంబోధ్య వాచకంబునకు ముందు విభాషగ ఓయగు" (సులభ. తత్సమ:58) అని సూత్రీకరించారు. 'ఓ' అనే శబ్దం విశిష్టా విశిష్ట సంబోధనలో వికల్పంగా వస్తుంది. అవిశిష్టం అనగా విశేషణంతో కూడనది. ఉదాహరణకు ' ఓ రాముడ – ఓరాములారా. విశిష్ట సంబోధనకి ఉదాహరణ 'ఓ దయామయుండవైన రామా'. ఇక్కడ సంబోధ్యవాచకమైన రామా అనేది 'దయామయుండవైన' అనే విశేషణంతో కూడుకొని ఉన్నది. సులభవ్యాకర్త బాలవ్యాకరణ సూత్రానికి కొంత పూరణ చేశారు.

బాలవ్యాకర్త "ఓ శబ్దంబునకుం బురుష, నీచ, స్త్రీ పురుషా మంత్రణంబు లందు యి, సి, రి వర్ణంబులు విభాష నంతాగమంబులగు" (బాల. తత్సమ:15) అని సూత్రీకరించారు. పురుషులను సంబోధించేటపుడు 'యి' అనేది, నీచస్త్రీని సంబోధించేటపుడు 'సి' అనేది, నీచపురుషుని సంబోధించేటపుడు 'రి' అనేది ఓశబ్దాంతంలో వికల్పంగా ఆగమాలుగా వస్తాయి. ఉదాహరణకు 'ఓయి రాముఁడ– ఓ రాముఁడ', 'ఓసి దుష్టురాల– ఓ దుష్టురాల', 'ఓరి దుష్టుఁడ– ఓ దుష్టుఁడ'. సులభవ్యాకర్త కూడా "ఓయి పురుషులఁ బిలుచుట యందును, నిందా మైత్రులఁ బురుషునిఁబిలుచుటయం దోరియు, స్త్రీఁ బిలుచుటయం దోసియు విభాషనగు" (సులభ. తత్సమ:59) అని సూత్రీకరించారు. ఇక్కడ బాలవ్యాకర్త చెప్పినట్లుగా 'ఓ' శబ్దానికి యి, సి, రి వర్ణాలు చెప్పకుండా పురుషులను పిలిచేటప్పుడు 'ఓయి', నిందించేటప్పుడు, స్నేహంతో పిలిచేటప్పుడు పురుషులను 'ఓరి' అని, స్త్రీలను ' ఓసి' అంటారని చెప్పారు.

బాలవ్యాకర్త "కృతోత్కంబగు సంస్కృతనామంబు సంబుద్ధిడుజ్జునకు లోపంబు విభాషనగు" (బాల. తత్సమ:34) అని సూత్రీకరించారు. వ్యాకరణ సూత్రాలచే (నియమంచే) ఉదంతంగా మారినట్టి సంస్కృతప్రాతిపదికల యొక్క డుజ్ – ప్రత్యయానికి సంబోధనలో వికల్పంగా లోపం వస్తుంది. ఉదాహరణకు ' ఓ రామా–ఓ రామ'. కూడా సులభవ్యాకర్త "కృతోత్కంబగు సంస్కృత నామంబు సంబుద్ధి డుజ్జునకు లోపంబు విభాష నగు" (సులభ. తత్సమ:62) అని సూత్రీకరించారు.

ప్రౌఢవ్యాకర్త "దేశ్యంబులం గొన్ని యెడల స్త్రీవాచక స్త్రీసమంబులగు సంబోధ్యవాచక శబ్దంబుల మీఁద నేకవచనంబునఁ గాన శబ్దం బొందును, అల యను న్వయంబొందును గానంబడియెడి. అల దీర్ఘాంతంబు నగు (ప్రౌఢ. శబ్ద:15) అని సూత్రీకరించారు. దేశ్య శబ్దాలలో కొన్నిచోట్ల స్త్రీవాచకాలైన సంబోధ్యవాచక శబ్దాలపైన, స్త్రీ సమాలైన సంబోధ్యవాచకాల మీద ఏకవచనంలో ' కాన' అనే శబ్దం, 'అల' అనే ఒక అవ్యయం కనిపిస్తున్నది. ఉదాహరణకు 'తల్లికాన' అనగా 'ఓతల్లీ' అని అర్థం. అక్క+ అల = అక్కల'. అనగా 'ఓ అక్క' అని అర్థం. 'అన్న +అలా=అన్నలా'. సులభవ్యాకర్త కూడా "దేశ్యంబున నేకవచనంబున అల–అలాయను నవ్యయంబులు సంబోధ్య వాచకంబున కుఁ బరంబుగ నొండొకచో నగు" (సులభ. తత్సమ:64) అని సూత్రీకరించారు. దేశ్య శబ్దాలలో ఏకవచనంలో 'అల–అలా' అనే అవ్యయాలు సంబోధ్యవాచకాలకు పరంగా ఒక్కోసారి అవుతాయంఇ చెప్పారు.

బాలవ్యాకర్త "మధ్యమపురుష యోగంబునం దారగాగమంబు విభాషనగు" (బాల. తత్సమ:37) అని సూత్రీకరించారు. సంబోధనలో మధ్యమపురుషక్రియతో అన్వయముంటే బహువచనంలో 'ఆరక్' అనేది ఆగమంగా వికల్పంగా వస్తుంది. సులభవ్యాకర్త కూడా "మధ్యమపురుష బహువచన యోగంబున నారగాగమంబు విభాష నగు" (సులభ. తత్సమ:67) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "సుర శబ్దంబు నిత్యంబుగా నసుర శబ్దము వైకల్పికముగా స్త్రీతుల్యంబులగు. సంస్కృత సమాసంబునఁగావు" (బాల. తత్సమ:60) అని సూత్రీకరించారు. సురశబ్దం నిత్యంగాను, అసురశబ్దం వికల్పంగాను స్త్రీతుల్యాలవుతాయి. ఈరెండు శబ్దాలుకూడ సంస్కృతసమాసం (సిద్ధసమాసం) అయినపుడు స్త్రీతుల్యత్వాన్నిపొందవు. అంటే వ్యస్తంగా ఉన్నపుడున్నూ, మిశ్రసమాసమైనపుడున్నూ సురశబ్దం నిత్యంగాను, అసురశబ్దం వికల్పంగాను స్త్రీతుల్యాలవుతాయి. సులభవ్యాకర్త కూడా ఇదే విషయాలను చెబుతూ"అసురశబ్దంబు వైకల్పికంబుగ స్త్రీ సమంబు" (సులభ. తత్సమ:69), "సిద్ధసమాసంబున సురాసుర శబ్దములు పుంలింగంబులు" (సులభ. తత్సమ:70) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "కంధరాదులు క్లీబ తుల్యంబులు బహుళంబుగా నగు" (బాల. తత్సమ:66) అని సూత్రీకరించారు. కంధరా మొదలైన శబ్దాలకు క్లీబతుల్యత్వం బహుళంగా అవుతుంది. సంస్కృతంలో కంధరా మొదలైన ఉదాహరణలన్నీ స్త్రీలింగశబ్దాలు. వీనికి క్లీబతుల్యత్వం వికల్పంగా వస్తుంది. సులభవ్యాకర్త కూడా "కంధరాదులకు మువర్ణకంబును బహుళంబుగ నగు" (సులభ. తత్సమ:73) అని సూత్రీకరించారు.

సులభవ్యాకర్త "ప్రభవాదులు స్త్రీ సమంబులు" (సులభ. తత్సమ:75) అనే సూత్రంలో 'ప్రభవ, విభవ' మొదలైన తెలుగు సంవత్సరాల పేర్లను స్త్రీ సమాలుగా చెప్పారు. తెలుగు మాసాలుగా చెప్పబడే 'చైత్రం, వైశాఖం'మొదలైన వాటిని "చైత్రాదులు నపుంసకములు" (సులభ. తత్సమ:76) అని నపుంసక లింగాలుగా సులభవ్యాకర్త చెప్పారు. వీటిని బాల, ప్రౌఢ వ్యాకర్తలు చర్చించలేదు.

## 5.1.1.2 ఆకారాంత శబ్దాలు

బాలవ్యాకర్త "నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వంబగు"(బాల. తత్సమ:54) అని సూత్రీకరించారు. తత్సమ శబ్దాల ప్రాతిపదికల చివర ఉన్న దీర్ఘానికి హ్రస్వం వస్తుందని అర్థం. సులభవ్యాకర్త"నామాంత్య దీర్ఘంబులకు హ్రస్వంబగు" (సులభ. తత్సమ:39) అని సూత్రీకరించారు. సంస్కృత శబ్దాలకు చివర దీర్ఘం ఉంటే అవి తత్సమంగా మారేటప్పుడు ఆ దీర్ఘం హ్రస్వం అవుతుంది. ఉదాహరణకు ' సీతా– సీత', 'భామా– భామ', "కృత హ్రస్వంబులు హ్రస్వంబు లట్టివ" (సులభ. తత్సమ:40) అని సూత్రీకరించారు. శబ్దాలలో సహజంగా ఉండే హ్రస్వాలకు ఎటువంటి కార్యాలు జరుగుతాయో అటువంటి కార్యాలు కృత హ్రస్వాలకు జరుగుతాయి.

సులభవ్యాకర్త "సదాద్యేక వర్ణ దేశ్యంబులకు హ్రస్వంబు లేదు" (సులభ. తత్సమ:41) అని సూత్రీకరించారు. 'సదా' శబ్దాలకు, ఒక్క అక్షరం గల శబ్దాలకు, దేశ్య శబ్దాలకు హ్రస్వం లేదు. ఉదాహరణకు ' సదా– శ్రీ– వృథా'. బాల, ప్రౌఢవ్యాకరణాలు వీటి గురించి చెప్పలేదు.

## 5.1.1.3 ఇకారాంత శబ్దాలు

సులభవ్యాకర్త "ఇదంత శబ్దములకు ప్రథమైక వచన ప్రత్యయములు రావు" (సులభ. తత్సమ:30) అని సూత్రీకరించారు. ప్రథమా ఏకవచన ప్రత్యయాలైన 'డు,ము,వు,లు' ఇకారం చివరగల శబ్దాలకు రావు. ఉదాహరణకు 'హరి, మతి'. బాల, ప్రౌఢవ్యాకరణాలు వీటి గురించి చెప్పలేదు.

సులభవ్యాకర్త "ఇదంతంబునకు బహువచన ప్రత్యయంబులు పరంబులగునపుడుపధా శవర్ణంబు సవర్ణం బగు" (సులభ: తత్సమ:74) అని సూత్రీకరించారు. ఇకారం అంతంగా గల శబ్దాలకు బహువచన ప్రత్యయం పరంగా వచ్చేటప్పుడు ఉపధగా ఉండే శవర్ణానికి సవర్ణం వస్తుంది. ఉదాహరణకు 'రాశి+లు =రాసులు'. బాల, ప్రౌఢవ్యాకరణాలు వీటి గురించి చెప్పలేదు.

### 5.1.1.4 ఉకారాంత శబ్దాలు

బాలవ్యాకర్త "ఉకారంత గోశబ్దంబుల కంతట వువర్ణకంబగు"(బాల. తత్సమ:48) అని సూత్రీకరించారు. మూడులింగాలలోని ఉకారాంత శబ్దాలకును, గోశబ్దానికిని ప్రథమావిభక్తి ఏకవచనంలో 'వు' అనే ప్రత్యయం వస్తుందని సూత్రార్థం.

"ఉకారాంత శబ్దాములకు సర్వత్ర వువర్ణకంబగు" (సులభ.తత్సమ:31). అన్ని లింగాలలోని శబ్దాలు ఉకారం అంతంగా కలిగి ఉంటే 'వు' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు ' తరు– తరువు', గురు– గురువు'.

బాలవ్యాకర్త "వువర్ణకేతర విభక్తి పరమగుచో నుకారాంతబులకు బహుళంబుగా, గోశబ్దంబునకు నిత్యంబుగా, వుగాగమంబగు"(బాల. తత్సమ:49) అని సూత్రీకరించారు. . ప్రథమావిభక్తి ఏకవచనంలో వువర్ణకంవచ్చే ప్రాతిపదికలకు వువర్ణకేతర విభక్తి పరమవుతుంటే ఉకారాంత శబ్దాలకు బహుళంగాను, గోశబ్దానికి నిత్యంగాను వుగాగమం వస్తుందని అర్థం 'తరువులు – తరులు

సులభవ్యాకర్త కూడా "లువర్ణకాది ప్రత్యయములు పరమగుచో వుగాగమంబు బహుళంబుగ నగు" (సులభ. తత్సమ:32) అని సూత్రీకరించారు. బహువచనాన్ని తెలిపే లువర్ణం పరమైతే 'వు' వర్ణం ఆగమం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు 'గురువులు– గురులు', సులభవ్యాకర్త"గోశబ్దమునకు వు నిత్యము" (సులభ. తత్సమ:33) అని సూత్రీకరించారు. 'గో' శబ్దానికి వువర్ణం నిత్యంగా వస్తుంది. ఉదాహరణకు ' గోవు– గోవులు'.

బాలవ్యాకర్త "ఉకారాంతంబగు మహత్తునకు వువర్ణకము బహుళముగానగు" (బాల. తత్సమ:50) అని సూత్రీకరించారు. ఉకారాంతమైన మహద్వాచకశబ్దాలకు ప్రథమైకవచనంలో 'వు' అనే ప్రత్యయం బహుళంగా వస్తుందని సూత్రార్థం. తత్సమ.48చే వువర్ణకం నిత్యంగా వస్తుండగా, ప్రస్తుతసూత్రంచేత ఆ విధిని మహద్వాచకాలకు బహుళంగా వస్తుందని సవరించటంచేత 'విష్ణువు' అనే రూపంతో పాటు 'విష్ణుఁడు' అనే 'డుజ్' – ప్రత్యయాంతరూపాలకు కూడ అవకాశం లభిస్తుంది. సులభవ్యాకర్త కూడా "ఉదంత మహద్వాచకంబులకు డుజ్ఞు బహుళంబుగ నగు" (సులభ. తత్సమ:34) అని సూత్రీకరించారు.

.

బాలవ్యాకర్త "కద్రువ నాగమాత" అని సూత్రీకరించారు. నాగమాత అనే అర్థంలో కద్రూ శబ్దానికి కద్రువ అనేది ప్రాతిపదిక అవుతుంది. సులభవ్యాకర్త కూడా "కద్రూ కద్రువ" (సులభ. తత్సమ:36) అని సూత్రీకరించారు.

ప్రౌఢవ్యాకర్త "కంటె వర్ణకంబు పరంబగునపుడును గొన్ని యెడల నగాగమంబు చూపట్టెడి"(ప్రౌఢ. శబ్ద:20) అని సూత్రీకరించారు. 'కంటె' ప్రత్యయం పరమైనపుడు కొన్నిసార్లు 'న' ఆగమంగా కనబడుతుంది. ఉదాహరణకు ' క్రతుశతంబు+కంటె = క్రతుశతంబు+ న+ కంటె'. ప్రౌఢవ్యాకర్త "ఉదంతములగు నమహత్తుల కందువర్ణకము పరంబగునపుడును నగాగమంబు కొన్ని యెడలఁ గానంబడియెడి"(ప్రౌఢ.శబ్ద:21) అని సూత్రీకరించారు. ఉకారాంతాలైన అమహద్వాచకాలకి 'అందు' ప్రత్యయం పరమైనపుడు 'న' ఆగమం కొన్నిసార్లు కన్పిస్తున్నది. ఉదాహరణకి ' నాయకత్వము+న+అందు= నాయకత్వమునందు'. సులభవ్యాకర్త"ఉదంతంబు లైన యమహద్వాచకంబులకు 'కంటె' 'అందు' వర్ణకంబులు పరంబు లగునపుడు కొండొకచో నగాగమంబును నగు"(సులభ. తత్సమ:51) అని సూత్రీకరించారు. ప్రౌఢవ్యాకర్త రెండు సూత్రాలలో చెప్పిన విషయాలను సులభవ్యాకర్త ఒకే సూత్రంలో చెప్పారు.

### 5.1.1.5 ఊకారాంత శబ్దాలు

సులభవ్యాకర్త"అనూదంతంబులగు దీర్ఘైక వర్ణంబులు స్త్రీ సమంబులు" (సులభ. తత్సమ:42) అని సూత్రీకరించారు. అనగా ఊకారాంతాలకు తప్ప దీర్ఘాలైన ఏక అక్షరాలకు ప్రథమావిభక్తి ప్రత్యయాలు రావు. ఉదాహరణకు 'భ్రూవు'

### 5.1.1.6 ఋకారంత శబ్దాలు

బాలవ్యాకర్త "ఋకారాంతంబున కత్వంబును స్త్రీవద్భావంబునగు"(బాల. తత్సమ:52) అని సూత్రీకరించారు. ఋకారాంత శబ్దాలకు అత్వమున్ను, స్త్రీలింగ తుల్యత్వమున్ను కలుగుతాయని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "ఋకారాంతంబు లదంతంబులును స్త్రీ సమంబులునగు" (సులభ. తత్సమ:37) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "విధాతృ ధాతృ సవితృ నేతృ శబ్దంబులకు మహత్తులకు కత్వ స్త్రీవద్భావంబులు విభాషనగు"(బాల. తత్సమ:53) అని సూత్రీకరించారు. విధాతృ, ధాతృ, దాతృ, సవితృ, నేతృ – అనే ఋకారాంత పుంలింగశబ్దాలు మహత్తులైనపుడు అత్వ స్త్రీవద్భావాలు వికల్పంగా వస్తాయని చెప్పారు . సులభవ్యాకర్త "మహత్తులగు విధాత్రాదులకు దుజ్జును నగు" (సులభ. తత్సమ:38) అని సూత్రీకరించి ' దుజ్' ని విధించారు. అత్వాన్ని, స్త్రీత్వాన్ని కలిగిన రూపాలు ఉన్నప్పటికీ ' దుజ్' తో కూడుకున్న పుంలింగ ప్రయోగాలు ఉన్నాయని ఈ సూత్రాన్ని చెప్పారు.

### 5.1.1.7 ఐ–ఔ కారాంత శబ్దాలు

బాలవ్యాకర్త "పృథ్వీ వాచి భూశబ్దంబునకు భువియగు"(బాల. తత్సమ:62) అని సూత్రీకరించారు. 'భువి' అనేది ప్రాతిపదిక రూపమవుతుంది. భూమి అనే అర్థాన్ని బోధించేటపుడు భూ అనే శబ్దం భువి అనే రూపంలో ప్రాతిపదికగా అవుతుందని ఈ సూత్రం ద్వారా నిపతింపబడింది. బాలవ్యాకర్త "నౌ శబ్దంబునకు నావయగు"(బాల. తత్సమ:63) అని సూత్రీకరించారు. నౌ శబ్దానికి నావ అనేది ఆదేశంగా వస్తుందని నిపతించాడు. నావ – నావలు. సులభవ్యాకర్త కూడా " భూ భువి; నౌ నావ" (సులభ. తత్సమ:71) అని సూత్రీకరించారు. ఔకారాంత స్త్రీలింగ శబ్దమైన 'నౌ 'శబ్దానికి 'నావ' అవుతుంది. 'నౌ' శబ్దానికి స్త్రీలింగ కార్యాలు జరగకుండా 'నావ' గా నిపతించబడింది.

బాలవ్యాకర్త "రై గ్లౌ శబ్దంబుల కోత్వంబు విభాషనగు" (బాల. తత్సమ:64) అని సూత్రీకరించారు. 'రై– గ్లౌ' అనే శబ్దాలకు వికల్పంగా ఓత్వం ఆదేశంగా వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త "రై రోలు – గ్లౌ గ్లోలు– శరణు శరణములు" (సులభ. తత్సమ:72) అని సూత్రీకరించారు. ఇక్కడ కొత్తగా ' శరణు' అనేది ' శరణములు' అని అవుతుందని సులభవ్యాకర్త నిపతించారు .

## 5.1.2 హలంత ప్రకరణం

బాలవ్యాకర్త "హలంతంబు ప్రథమైకవచనాంత తుల్యం బిందు నామంబగు" (బాల. తత్సమ: 67) అని సూత్రీకరించారు. సంస్కృతంలో హలంతశబ్దాలు ప్రథమావిభక్తి ఏకవచనంలో ఆ భాషయందు ఏరూపం కలిగి ఉంటాయో తత్తుల్యరూపం తెలుగుభాషలో ప్రాతిపదిక అవుతుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "ప్రాతిపదికంబు సంస్కృత ప్రథమైకవచన తుల్యంబు"

(సులభ.తత్సమ:77) అని సూత్రీకరించి హలంతాలైన సంస్కృత శబ్దాల ప్రథమా ఏకవచన రూపాలే ప్రాతిపదికలుగా తెలుగులో గ్రహించబడతాయని చెప్పారు. ఉదాహరణకు ' దృక్– ప్రేమన్'.

బాలవ్యాకర్త "ఉకాగమంబును ద్విత్వంబును దుది హల్లున కగు" (బాల. తత్సమ:68) అని సూత్రీకరించారు. తెలుగుభాషలోనికి వచ్చిన సంస్కృత శబ్దాల చివర హల్లుంటే, దానికి ఉత్వం ద్విత్వం ఆగమంగా వస్తాయని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "హ్రస్వం మీఁది హల్లుల కుత్వద్విత్వంబులగు" (సులభ. తత్సమ:79) అని సూత్రీకరించి హ్రస్వం తరువాత ఉన్న హల్లులకు ఉత్వం, ద్విత్వం వస్తాయని చెప్పారు.

బాలవ్యాకర్త "దీర్ఘంబు మీఁది హల్లునకు ద్విత్వంబు బహుళంబుగానగు" (బాల. తత్సమ: 69) అని సూత్రీకరించారు. దీర్ఘాక్షరంమీద ఉండే హల్లుకు ద్విత్వం బహుళంగా వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త "దీర్ఘం పూర్వక హల్లునకు ద్విత్వంబు బహుళంబు" (సులభ. తత్సమ:80) అని సూత్రీకరించి దీర్ఘం పూర్వం గల హల్లులకు ద్విత్వం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు 'దిక్– దిక్కు' , వాక్– వాకు– వాక్కు'.

### 5.1.2.1 నకారాంత శబ్దాలు

బాలవ్యాకర్త "ఒకానొకచో మహత్త్వంబునందు మతుప్తకారంబున కానాదేశంబు విభాషనగు" (బాల. తత్సమ: 74) అని సూత్రీకరించారు. ఒక్కొక్కసారి మహదర్థంలో మతుప్ ప్రత్యయంలోని తకారానికి 'ఆన' ఆదేశం వికల్పంగా వస్తుంది. సులభవ్యాకర్త కూడా "ఒకానొకచో మహత్త్వంబునందు మతుప్తకారమున కానాదేశంబు విభాష నగు" (సులభ. తత్సమ:85) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "మహద్వాచకమయి పుంలింగంబగు బ్రహ్మ శబ్దమునకు స్త్రీత్వంబగు" (బాల. తత్సమ:76) అని సూత్రీకరించారు. తెలుగులో మహద్వాచకమై, పుంలింగమైనట్టి బ్రహ్మ శబ్దానికి స్త్రీత్వం కలుగుతుంది. ఉదాహరణకు ' బ్రహ్మ– బ్రహ్మము'. "బ్రహ్మము పుంలింగ మహద్వాచకము బ్రహ్మ" (సులభ. తత్సమ:87) అని సూత్రీకరించారు. ఇక్కడ స్త్రీత్వం గురించి సులభవ్యాకర్త చెప్పలేదు.

బాలవ్యాకర్త “విశ్వకర్మాదులకు స్త్రీత్వంబగు” (బాల. తత్సమ:75) అని సూత్రీకరించారు. ‘విశ్వకర్మ’ మొదలైన శబ్దాలకు స్త్రీలింగ తుల్యత్వం కల్గుతుంది. ఉదాహరణకు ‘విశ్వకర్మ, అశ్వత్థామ’. బాలవ్యాకర్త“ఆత్మేమనిజంతంబులకు నాంతములగు మనుజ సంజ్ఞలకు స్త్రీత్వంబు బహుళంబుగానగు”(బాల. తత్సమ: 77) అని సూత్రీకరించారు. ఆత్మన్ శబ్దానికి, ఇమనిచ్ ప్రత్యయాంత శబ్దాలకు, నకారాంత మానవ సంజ్ఞానామవాచకాలకు స్త్రీత్వం బహుళంగా అవుతుంది. ఉదాహరణకు ‘ఆత్మ– ఆత్మము– ఆత్ముఁడు, మహిమ– మహిమము’, దేవశర్మ– దేవశర్ముడు’. బాలవ్యాకర్త రెండు సూత్రాలలో చెప్పిన విషయాన్ని సులభవ్యాకర్త ఒకే సూత్రంలో “విశ్వకర్మాత్మశబ్దములు ఇమనిజంతంబులు. నకారంత మనుష్యాభిధానంబులు బహుళంబుగ స్త్రీ సమంబులు” (సులభ. తత్సమ:88) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త “మహత్త్వంబున స్వార్థపరంబగు రాజశబ్దము రాజు నాఁబడు”(బాల. తత్సమ: 78) అని సూత్రీకరించారు. మహత్తులో స్వార్థంలో పరమైన రాజ శబ్దం తెలుగులో ప్రథమావిభక్తి ఏకవచనంలో ‘రాజు’గా ఉంటుంది. సులభవ్యాకర్త “విశేషార్థంబు రాజశబ్దము మహదర్థకంబున రాజు, అమహదర్థకంబున రాజము, బహువ్రీహిని రాజుఁడు” (సులభ. తత్సమ:89) అని సూత్రీకరించారు. ఇక్కడ కొత్తగా ‘ రాజుఁడు’ అనేది బహువ్రీహి అవుతుందని చెప్పారు.

### 5.1.2.2 తకారాంత శబ్దాలు

బాలవ్యాకర్త “జగదింద్రజిత్తుల తకారంబునకు లోపంబు విభాషనగు” (బాల. తత్సమ:79) అని సూత్రీకరించారు. జగత్, ఇంద్రజిత్ – శబ్దాల తకారానికి వికల్పంగా లోపం కలుగుతుందని చెప్పారు. సులభవ్యాకర్త “జగదింద్రజిత్తుల తకారంబునకు లోపంబు విభాషనగు” (సులభ. తత్సమ:91) అని సూత్రీకరించారు. జగత్తు, ఇంద్రజిత్తు వంటి శబ్దాలలో ఉండే ‘త’ కారానికి లోపం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ‘జగత్– జగము– జగత్తు’, ఇంద్రజిత్– ఇంద్రజి– ఇంద్రజిత్తు’.

### 5.1.2.3 సకారంత శబ్దాలు

బాలవ్యాకర్త “సాంతంబుల తుది సకారంబునకు లోపంబు బహుళంబుగా నగు” (బాల. తత్సమ: 80) అని సూత్రీకరించారు. సకారాంత శబ్దాలతుదిసకారానికి లోపం బహుళంగా వస్తుందని సూత్రార్థం. ఉరము – ఉరస్సు; వక్షము – వక్షస్సు; అర్చి – అర్చిస్సు; ధనువు – ధనుస్సు;

ఆయువు – ఆయుస్సు. బహుళగ్రహణంబునంజేసి పయః ప్రభృతుల సకారంబునకు లోపంబు లేదు. వయస్సు, వయస్సు, సరస్సు.

సులభవ్యాకర్త "పయః ప్రభృతుల సకారంబున కుగాగమ ద్విత్వంబులు నిత్యంబు" (సులభ. తత్సమ:92) అని సూత్రీకరించారు. 'పయస్' మొదలైన శబ్దాలలో ఉండే 'స' కారానికి ఉత్వం, ద్విత్వం రెండు నిత్యంగా వస్తాయి. ఉదాహరణకు ' పయస్సు– వయస్సు'.

బాలవ్యాకర్త "మనః ప్రభృతుల సకారంబునకు ద్విత్వంబు విభాషనగు" (బాల. తత్సమ: 83) అని సూత్రీకరించారు. మనస్ – మొదలైన శబ్దాలలో తుదిసకారానికి ద్విత్వం విభాషగా వస్తుందని సూత్రార్థం. తత్సమ.68చే నిత్యంగా వస్తుండగా ప్రస్తుతసూత్రంచే విభాషగా చెప్పటంచేత దీనిని ప్రాప్తవిభాష అంటారు. సులభవ్యాకర్త "మనః ప్రభృతుల సకారంబునకు వైకల్పికంబుగ ద్విత్వంబు" (సులభ. తత్సమ:94) 'మనస్' మొదలైన శబ్దాలలో ఉండే 'స' కారానికి వికల్పంగా ద్విత్వం వస్తుంది. ఉదాహరణకు. 'మనసు – మనస్సు',శిరము – శిరస్సు'.

బాలవ్యాకర్త "మహద్వాచకంబులగు సాంతంబుల కంత లోపంబేని ద్వితీయైక వచనాంత తుల్యత్వంబేనగు"(బాల. తత్సమ:81) అని సూత్రీకరించారు. మహత్తులైన సకారాంత శబ్దాలకు అంత్యవర్ణ (సకార) లోపం కాని, అదిరాని పక్షంలో ద్వితీయైకవచనాంత తుల్యరూపంకాని ప్రాతిపదిక అవుతుందని చెప్పారు. సులభవ్యాకర్త "సకారాంత మహద్వాచకంబులకు నంత లోపం బొందె గుణవద్గుణత్వ మొందె నగు" (సులభ. తత్సమ:96) అని సూత్రీకరించారు. .

బాలవ్యాకర్త "మహతీతరంబులగు స్త్రీలింగంబుల విశేషణంబులకుఁగ్లీబత్వంబు విభాషనగు"(బాల. తత్సమ: 86) అని సూత్రీకరించారు. స్త్రీవాచకాలు కానట్టి స్త్రీలింగ శబ్దాల విశేషణాలకు నపుంసక లింగత్వం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'పద్మలత మనోహరి'. ఇక్కడ 'లతా' శబ్దం స్త్రీ లింగమేకాని స్త్రీవాచకం కాదు. కాబట్టి దీని విశేషణానికి నపుంసకత్వం కలిగితే 'పద్మ లత మనోహరి' అవుతుంది. ఇందులో 'లత' స్త్రీలింగం. 'మనోహరి' అనే విశేషణం క్లీబం. క్లీబత్వం రానపుడు 'పద్మలత మనోహరిణి' అవుతుంది. ఇక్కడ 'మనోహరిణి' అనేది స్త్రీలింగ విశేషణం. సులభవ్యాకర్త కూడా "అమహతీవాచకంబుల విశేషణంబు లుభయ విధంబులు" (సులభ. తత్సమ:100) అని సూత్రీకరించారు.

ప్రౌఢవ్యాకర్త "హలవసానంబులు పరంబగునపుడు లురు వర్ణకంబుల యుత్వంబునకు లోపంబు వైకల్పికంబుగ నగు "(ప్రౌఢ.శబ్ద:16) అని సూత్రీకరించారు. హల్లు అవసానంగా పరమయ్యేటప్పుడు 'లు-రు' వర్ణాల ఉత్వానికి లోపం వైకల్పికంగా అవుతుంది. లువర్ణానికి ఉదాహరణకు 'ప్రతతులు+సాల్పడి= ప్రతతుల్ సాల్పడి'. రువర్ణానికి ఉదాహరణ 'తత్పాలురు+ భయంబందఁగన్ = తత్పాలుర్ భయంబందఁగన్', సులభవ్యాకర్త కూడా "హలవసానంబులు పరంబులగునపుడు లు-రు ప్రత్యయంబుల మీఁది యుత్వమునకు లోపంబు వైకల్పికంబు" (సులభ. తత్సమ:101) అని సూత్రీకరించారు.

ప్రౌఢవ్యాకర్త "మహత్సమూహార్థక శబ్దం బమహత్కార్య యుక్తం బయ్యుఁ దద్విశేషణ క్రియలు మహత్కార్య యోగ్యంబులు విభాషనగు"(ప్రౌఢ.శబ్ద:17) అని సూత్రీకరించారు. మహత్తుల యొక్క సమూహాన్ని బోధించు శబ్దం, అమహద్వాచకాలకు రావలసిన కార్యాలతో కూడుకున్నదైనప్పటికీ, వాటి విశేషణాలు, క్రియలు వికల్పంగా మహద్వాచకాలకు రావలసిన కార్యాలతో కూడుకున్నవిగా ఉంటాయి. ఉదాహరణకు ' ముని నికాయము పూజించిరి'. ఇక్కడ 'ముని' శబ్దం మహత్తు. కాబట్టి 'నికాయ' శబ్దం మహత్సమూహార్థకం. ఈ శబ్దం 'నికాయము' అని అమహద్వాచకాలకు రావలసిన 'ము' ప్రత్యయంతో కూడుకొని ఉన్నది. అయినప్పటికీ మహద్వాచకాలకి వచ్చే 'పూజించిరి' అనే క్రియ దీనికి వచ్చింది. వికల్పం కాబట్టి ' ముని నికాయము పూజించెను' అనే అమహద్వాచక కార్యం జరుగుతుంది. సులభవ్యాకర్త "మహత్సమూహార్థకశబ్దం బమహద్రూపంబును బొంది యుండెనేని దాని విశేషణ క్రియలకు వైకల్పికంబుగ మహద్రూపం బగు" (సులభ. తత్సమ:102) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త"భవచ్ఛత్రాదుల కిందుఁ బ్రయోగంబు లేదు"(బాల. తత్సమ: 87) అని సూత్రీకరించారు. 'భవత్' మొదలైన హలంత సర్వనామాలకు, 'శతృ' ప్రత్యయాంతాలకు, రేఫాంతాలకు తెలుగు భాషలో వ్యస్త ప్రయోగం లేదు. సులభవ్యాకర్త కూడా "భవచ్ఛత్రాదులకు రేఫాంతంబులకు ద్వ్యాద్యల్ప సంఖ్యలకుఁ దదాలకు నిందు యోగంబు లేదు" (సులభ. తత్సమ:103) అని సూత్రీకరించారు.

## 5.2 ఆచ్ఛిక పదాల నిర్మాణం

ఆచ్ఛికం అంటే అచ్చ తెలుగు అని అర్థం."సంస్కృత సమేతరంబయిన యీ భాష యచ్చ యనంబడు"(బాల. ఆచ్ఛిక:1) అని బాలవ్యాకర్త సూత్రీకరించారు. సంస్కృత సమాల కంటే భిన్నమైన తెలుగుభాషలోని పదజాలాన్ని అచ్చ(ఆచ్ఛికం) అంటారు. సంస్కృత భవ, ప్రాకృత సమ, ప్రాకృత భవ, దేశ్యశబ్దాలను ఆచ్ఛికాలంటారు. సులభవ్యాకర్త కూడా ఆచ్ఛికం అనగా అచ్చతెలుగు అని చెప్పారు.

బాలవ్యాకర్త"ఆచ్ఛికశబ్దంబులెల్లం దఱుచుగ స్త్రీసమంబులు, గ్లీబ సమంబులయి యుండు" (బాల. ఆచ్ఛిక:2) అని సూత్రీకరించారు. ఆచ్ఛిక శబ్దాలు సాధారణంగా స్త్రీసమాలుగా గాని క్లీబ (నపుంసక) సమాలుగా గాని ఉంటాయని అర్థం. సూత్రంలో 'తఱచుగా' అనే పదం వాడటంవల్ల కొన్ని శబ్దాలు పుంలింగ తుల్యాలు కూడ ఉంటాయని అర్థం. ఈ సూత్రంలో పేర్కొన్న 'స్త్రీ సమత్వాతిదేశంబుచేఁ బ్రథమైకవచన లోపాదికంబును, గ్లీబసమత్వాతిదేశంబుచే మువర్ణకంబు నగునని యెఱుంగునది' అన్న వాక్యాన్ని బట్టి స్త్రీ సమత్వం వల్ల ప్రథమైక వచనం లోపం, క్లీబత్వం అతిదేశిచడం వల్ల 'ము' వర్ణకం మొదలైనవి వస్తాయి. ' అన్న, మిన్న, అద్ద, గద్ద, జాణ, ఓడ, గోడ' మొదలైనవి స్త్రీసమాలు. బియ్యము, నెయ్యము, అల్లము, సున్నము, సన్నము మొదలైనవి క్లీబసమాలు. పుంలింగ తుల్య శబ్దాలకు కూడా ఉదాహరణను బాలవ్యాకర్త ఈ సూత్రంలో చెప్పారు. ఉదాహరణకు ' కొమరుఁడు, చందురుఁడు, జముఁడు, కందుఁడు'.

సులభవ్యాకర్త"ఏకాదులు తప్ప వికృతి శబ్దంబులు స్త్రీసమంబులు గ్లీబ సమంబులు" (సులభ.ఆచ్ఛిక:1) అని సూత్రీకరించారు. ఏకాది గణాలలో చేరిన ఒక్కడు-వాడు- వీడు- మగడు' మొదలైన శబ్దాలు కాకుండా మిగిలిన అచ్చతెలుగు శబ్దాలన్ని స్త్రీ సమాలుగా గానీ, క్లీబ సమాలుగా గాని అవుతాయి. స్త్రీ సమాలకు ఉదాహరణ 'బల్ల, పిల్ల, గోరు,భావి, నవలా, పల్లకీ'. క్లీబ సమాలకు ఉదాహరణ 'కయ్యము, నెయ్యము, కారము, అల్లము. తద్భవ రూపాలుగా కన్పిస్తున్న 'చందురుడు' మొదలైన పుంలింగ రూపాలు. ఏకాది గణంలో చేరుతాయని సులభవ్యాకర్త చెప్పారు.

### 5.2.1 ఏకవచన రూపములు

బాలవ్యాకర్త "బల్లిదాదులు సంస్కృత తుల్యంబులు"(బాల.ఆచ్ఛిక:3) అని సూత్రీకరించా రు. 'బల్లిద' మొదలైన శబ్దాలు సంస్కృత శబ్దాలతో సమానమైనవి. అనగా 'బల్లిద' మొదలైన శబ్దాలు మహద్వాచకవిశేషణాలైనపుడు ఉత్వడుజాదులు వచ్చి 'బల్లిదుఁడు' అని, అమహద్వాచక విశేషణాలైనపుడు 'బల్లిదము' అని, స్త్రీవాచక విశేషణమైనపుడు 'ఆలు' శబ్దంతో సమాసమై 'బల్లిదురాలు' అని అవుతుంది.

సులభవ్యాకర్త "అక్కజాదులు సంస్కృత తుల్యంబులు"(సులభ. ఆచ్ఛిక:2) అని సూత్రీకరించారు. 'అక్కజ' మొదలైన శబ్దాలు సంస్కృత శబ్దాలతో సమానమైనవి. 'అక్కజ, బల్లిద' మొదలైన తెలుగు ప్రాతిపదికలకు విభక్తిని వివక్షించేటపుడు, వాటిని సంస్కృత ప్రాతిపదికలతో సమానంగా గ్రహించి ప్రక్రియను జరపాలి. 'అక్కజ' శబ్దం మహద్వాచకమైనపుడు ('రామ' శబ్దం రాముడు అయినట్టు) 'అక్కజుఁడు' అవుతుంది. 'అక్కజ' శబ్దం అమహద్వాచకమైనపుడు (వనము–లాగా) ' అక్కజము' అవుతుంది. 'అక్కజ' శబ్దం స్త్రీవాచకమైనపుడు (ధీరురాలు–లాగా) 'అక్కజురాలు' అనే రూపాలు ఏర్పడతాయి. బాలవ్యాకర్త 'బల్లిదాదులు' అని చెప్పగా ' సులభవ్యాకర్త 'అక్కజాదులు' అని సూత్రీకరించారు.

సులభవ్యాకర్త "మహన్మహత్యర్థకంబులఁ బగత శబ్దంబు సంస్కృత తుల్యంబులు" (సులభ.ఆచ్ఛిక:3) అని సూత్రీకరించారు. 'పగత' శబ్దం మహద్వాచకంగా, మహతీ వాచకంగా ప్రయోగించేటప్పుడు సంస్కృత శబ్దాలతో సమానమైనది. అనగా 'పగత' శబ్దం మహద్వాచక మైనపుడు 'పగతుఁడు' అవుతుంది. 'పగత' శబ్దం మహతీవాచకమైనపుడు 'ఆలు' శబ్దంతో సమాసమై 'పగతురాలు' అవుతుంది. 'పగత' శబ్దానికి 'పగతము' అని అమహద్వాచక రూపం లేదని సులభవ్యాకర్త చెప్పారు.

బాలవ్యాకర్త "మహత్తులగు మగాదులకుం గయిరాదులకును డుజ్జగు నుత్వంబు గాదు" (బాల.ఆచ్ఛిక:4) అని సూత్రీకరించారు. మహద్వాచకాలైన 'మగ'మొదలైన శబ్దాలకు, అమహత్తు లైన 'కయిర' మొదలైన శబ్దాలకు ప్రథమా ఏకవచనంలో 'డుజ్' వస్తుంది. కాని ఉత్వం రాదు. ఉదాహరణకు 'మగఁడు, మనుమఁడు, కయిరఁడు, కత్తళఁడు'.

మహత్తులైన మగాదులు పుంలింగ తుల్యాలై ఉత్వ, దుజ్జులు రావాల్సి ఉండగా ప్రస్తుత సూత్రంచే ఉత్వాన్ని నిషేధించి దుజ్జును మాత్రమే కలుగజేస్తుంది. అలాగే అమహత్తులైన కయిరాదులకు మువర్ణకాన్ని నిషేదించి దుజ్జును కలుగజేస్తున్నది. మొత్తం మీద మగాదులకు ఉత్వ నిషేధం, కయిరాదులకు దుజ్జు ప్రాప్తి ఈ సూత్ర ప్రయోజనాన్ని తెలియజేస్తుంది.

సులభవ్యాకర్త "మహత్తులగు మగాదులకుం, గయిరాదులకును దుజ్జగు ఉత్వంబు గాదు" (సులభ.ఆచ్ఛిక:4) అని సూత్రీకరించారు. మహద్వాచకాలైన 'మగ'మొదలైన శబ్దాలకు, అమహత్తు లైన 'కయిర' మొదలైన శబ్దాలకు ప్రథమా ఏకవచనంలో 'దుక్' వస్తుంది. కాని ఉత్వం రాదు. ఉదాహరణకు 'మగఁడు, మనుమఁడు, కయిరఁడు, కత్తళఁడు'.

సులభవ్యాకర్త "బిడ్డాదులకు దుజ్జును విభాష నగు" (సులభ.ఆచ్ఛిక:5) అని సూత్రీకరించారు. 'బిడ్డ' మొదలైన శబ్దాలకు దుక్ వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'బిడ్డఁడు– బిడ్డ'. బిడ్డాదులలోని 'కొడుకు, చెడుగు, దుడుకు' వంటి శబ్దాలకు దుక్ వచ్చేటప్పుడు ఉత్వానికి అత్వం కూడా వస్తుందని 'కొడుకడు, చెడుగఁడు, దుడుకడు' వంటి ఉదాహరణలను చెప్పారు. మగాదులలోకి, కయిరాదులలోకి రాని 'బిడ్డాదులకు' ప్రస్తుత సూత్రం చేత సులభవ్యాకర్త 'దుక్'ని, ఉత్వానికి అత్వాన్ని విధించారు. ఇది బాలవ్యాకరణానికి పూరణ సూత్రంగా కన్పిస్తుంది.

సులభవ్యాకర్త "అక్కజాదులకును మగాదులకును సంబోధనంబున దుజ్లోపంబు లేదు" (సులభ.ఆచ్ఛిక:6) అని సూత్రీకరించారు. 'అక్కజ' మొదలైన శబ్దాలకు, 'మగ' మొదలైన శబ్దాలకు సంబోధనార్థంలో 'దుక్' లోపం రాదని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'అక్కజుఁడా– ఓ మగఁడా'. మగాదులలో చెప్పబడే 'రాయ' శబ్దం కర్మాధారయ సమాసంలో 'దుక్' లోపం వచ్చిన ప్రయోగాలు కన్పిస్తున్నాయని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'కృష్ణరాయ! – కృష్ణరాయలు. సులభవ్యాకర్త 'రాయుఁడు– రాయులు' అనే వాటిని అపశబ్దాలుగా పేర్కొన్నారు. బాలవ్యాకర్త బల్లిదాదులకు, మగాదులకు 'దుక్' వస్తుందని చెప్పారుగాని సంబోధనార్థంలో 'దుక్' లోపం రాదని చెప్పలేదు. ఆ విషయాన్ని పూరించుతూ సులభవ్యాకర్త ఈ సూత్రాన్ని రాశారనిపిస్తుంది.

సులభవ్యాకర్త "నెట్టనాదులు స్త్రీ క్లీబ సమంబులు" (సులభ.ఆచ్ఛిక:7) అని సూత్రీకరించారు. 'నెట్టన' మొదలైన శబ్దాలు ఒకసారి స్త్రీసమాలుగా, ఒకసారి క్లీబ సమాలుగా ఉంటాయి.

ఉదాహరణకు ‘ నెట్టన– నెట్టనము. అగ్గలిక– అగ్గలికము’. ఈ సూత్రాన్ని సులభవ్యాకర్త కొత్తగా చెప్పారు.

సులభవ్యాకర్త “అకర్వాదుల వులోపంబు వైకల్పికంబు” (సులభ.ఆచ్ఛిక:8) అని సూత్రీకరించారు.‘అకరువు’ మొదలలైన శబ్దాలకు ‘వు’ లోపం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ‘అకరువు– అకరువు, పుట్టువు– పుట్టు’. ఈ సూత్రాన్ని సులభవ్యాకర్త కొత్తగా చెప్పారు.

బాలవ్యాకర్త “డుమంతమునకు ద్వితీయాద్యేకవచనంబు పరంబగునపుడు నిగాగమంబు సర్వత్ర విభాషనగు”(బాల. తత్సమ:23) అని సూత్రీకరించారు. ప్రథమావిభక్తి ఏకవచనంలో డుప్రత్యయం వచ్చే ప్రాతిపదికలకు ద్వితీయా మొదలైన విభక్తులలో ఏకవచన ప్రత్యయం పరమవుతుంటే నిగాగమం అన్నిచోట్ల వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ‘ రామునిని, రాముని చేతను’. సులభవ్యాకర్త కూడా “ఉదంత డుమంతములకు ద్వితీయా ద్యేకవచనంబు పరంబగునపుడు నిగాగమంబు విభాషనగు” (సులభ.ఆచ్ఛిక:9) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త “అనుదంతమగు తెనుఁగు డుమంతమునకు నిగాగమము నిత్యముగానగును” (బాల. తత్సమ:24) అని సూత్రీకరించారు. హ్రస్వ ఉకారం అంతంగా లేకుండా డుఙ్ ప్రత్యయం వచ్చే అచ్చ తెలుగు శబ్దానికి నిగాగమం నిత్యంగా వస్తుంది. ఉదాహరణకు ‘ మగనిని, మగనిచేతను’. సులభవ్యాకర్త కూడా “ఉదంతముకాని డుమంతమునకు నిగాగమము నిత్యము” (సులభ.ఆచ్ఛిక:10) అని సూత్రీకరించారు.

## 5.2.2 బహువచన రూపములు

బాలవ్యాకర్త “పగతాదుల బహువచన లకారంబునకు రేఫంబగు”(బాల. ఆచ్ఛిక:5) అని సూత్రీకరించారు. మహద్వాచకాలైన ‘పగత’ మొదలైన అదంతాలపైన వచ్చే బహువచన లకారానికి ‘రేఫ’దేశంగా వస్తుంది. ఉదాహరణకు ‘పగతురు, అల్లురు, బలియురు’. సులభవ్యాకర్త “పగతాదుల బహువచన లకారంబునకు రేపంబగు”(సులభ.ఆచ్ఛిక:11) అని సూత్రీకరించారు. ‘పగత’ మొదలైన ఆచ్ఛిక నామాలకి బహువచనం విధించేటప్పుడు లకారానికి బదులుగా రేఫ వస్తుంది. ఉదాహరణకు ‘ పగతుడు– పగతురు’.

బాలవ్యాకర్త "ఆల్వాదుల బహువచన లకారంబునకు రేఫంబును ముందఱి లువర్ణంబునకు బిందుపూర్వక డకారంబునగు"(బాల. ఆచ్ఛిక:11) అని సూత్రీకరించారు. 'ఆలు' మొదలైన శబ్దాల బహువచనలకారానికి రేఫ, దానికి ముందున్న లువర్ణానికి పూర్ణబిందువుతో కూడిన డకారం వస్తుంది. ఉదాహరణకు 'ఆండ్రు, ఆండ్రను'. సులభవ్యాకర్త కూడా "బహువచనమ్మునఁ గొన్ని డుమంతంబుల మీఁది 'లు' వర్ణంబునకును, ఆల్వాదులలోని 'లు' వర్ణంబునకును, బూర్ణ బిందు పూర్వక డ్రకారం బాదేశంబగు" (సులభ.ఆచ్ఛిక:12) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "కా ప్రత్యయంబు మీఁది బహువచన లకారంబునకు లఘ్వ లఘు రేఫంబులును, లఘు రేఫంబునకు ముందు బిందు పుర్వక డకారంబునగు"(బాల. ఆచ్ఛిక:7) అని సూత్రీకరించారు. 'కా' ప్రత్యయంపైన వచ్చే బహువచన లకారానికి లఘు, అలఘు (ర్, ఱ్) రేఫలు, లఘు రేఫానికిముందు పూర్ణబిందుపూర్వక డకారం ఆదేశంగా అవుతాయి. ఉదాహరణకు 'విలుకాండ్రు, విలుకాఱు'. సులభవ్యాకర్త "కాఁడు లోని డుజ్జునకు బహువచనంబున శకటరేఫం బొండెఁ, బూర్ణబిందు పూర్వక డ్రువర్ణం బొండె నాదేశంబగు" (సులభ.ఆచ్ఛిక:13) అని సూత్రీకరించారు. ఇక్కడ 'కాడు' ప్రత్యయంలోని 'డు' వర్ణానికి బహువచనంలో అలఘు రేఫం ఒకసారి, బిందు పూర్వక 'డ్రు' వర్ణం ఒకసారి వస్తాయని చెప్పారు. సులభవ్యాకర్త లఘు రేఫకి బిందు పూర్వక డకారం చెప్పకుండా ఒకేసారి బిందుపూర్వక ' డ్రు' వర్ణం అని చెప్పారు.

బాలవ్యాకర్త "ఱే ప్రభృతుల బహువచనమునకు ముందు డుజ్జగు"(బాల. ఆచ్ఛిక:8) అని సూత్రీకరించారు. 'ఱే' మొదలైన శబ్దాలలోని బహువచన ప్రత్యయానికి ముందు 'డుజ్' అనే ప్రత్యయం  ఆగమంగా వస్తుంది . ఉదాహరణకు 'ఱేఁడులు, ఱేండ్లు'. సులభవ్యాకర్త  "ఱేఁడు ప్రభృతులకు 'లు' వర్ణకం బాగమంబుగ నగు" (సులభ. ఆచ్ఛిక:14) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "కూఁతు శబ్దము ప్రథమైక వచనంబునకు రువర్ణంబగు"(బాల. ఆచ్ఛిక:9) అని సూత్రీకరించారు. 'కూఁతు' అనే శబ్దానికి ప్రథమావిభక్తి ఏకవచనంలో 'రు' వర్ణం కలుగుతుంది. ఉదాహరణకు 'కూఁతురు – కూఁతులు'. బాలవ్యాకర్త 'కూఁతులు' అనే రూపాన్ని ప్రథమా బహువచనరూపంగా చెప్పారు. కూఁతురులు, కూఁతుళ్ళు , కూఁతురి మొదలైన రూపాలను గ్రామ్యాలని అన్నారు.

సులభవ్యాకర్త"కూఁతురు శబ్దంబునకు 'లు' మొదలగు ప్రత్యయంబులు పరంబగుచో రేఫంబునకు లోపంబు" (సులభ. ఆచ్ఛిక:15) అని సూత్రీకరించారు. ఉదాహరణకు 'కూఁతురు= కూఁతులు, కూఁతులను, కూఁతులచే, కూఁతులందు'. బాలవ్యాకర్త 'కూఁతు' శబ్దాన్ని గ్రహించి దానికి 'రు' వర్ణం వస్తుందని మాత్రమే చెప్పారు. సులభవ్యాకర్త 'కూతురు' శబ్దాన్ని తీసుకొని 'లు' మొదలైన ప్రత్యయాలు పరమైనపుడు రేఫకి లోపం వస్తుందని చెప్పారు. 'లు' మొదలైన ప్రత్యయాలు అనగా ప్రథమా విభక్తి బహువనం, ద్వితీయాది విభక్తుల అన్ని వచనాలు అని అర్థం. ఇది బాలవ్యాకరణానికి సవరణ సూత్రం.

బాలవ్యాకర్త "చెయువు బహువచన లకారంబున కలఘురేఫంబు విభాషనగు"(బాల. ఆచ్ఛిక:10) అని సూత్రీకరించారు. 'చెయువు' శబ్దంపై వచ్చే బహువచనలకారానికి అలఘురేఫం (ఱ) వికల్పంగా వస్తుందని సూత్రార్థం. చెయువుఱు, చెయువులు; చెయువులను, చెయువులను'. సులభవ్యాకర్త కూడా "చెయువు మీఁది లువర్ణకంబునకు శకటరేఫంబు విభాషనగు" (సులభ. ఆచ్ఛిక:16) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "బహువచనము పరంబగునపుడు డలటరల యుత్వంబునకు లోపంబు బహుళంబుగానగు"(బాల. ఆచ్ఛిక:12) అని సూత్రీకరించారు. బహువచన ప్రత్యయం పరమవుతున్నపుడు ప్రత్యయానికి ముందుండే ప్రాతిపదిక చివరగల 'డ-ల-ట-ర' అనే వర్ణాలపై ఉండే ఉత్వానికి బహుళంగా లోపం వస్తుంది. ఉదాహరణకు 'గుండ్లు- గుండులు'. సులభవ్యాకర్త కూడా "లువర్ణకమునకు ముందున్న 'డ ల ట ర' ల మీఁది యుత్వంబునకు బహుళంబుగ లోపంబు" (సులభ. ఆచ్ఛిక:19) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "బహువచనము పరంబగుపు డసంయుక్తంబులయి యుదం తంబులయిన డలరల కలఘు లకారంబు బహుళంబుగానగు"(బాల. ఆచ్ఛిక:13) అని సూత్రీకరించారు. బహువచన ప్రత్యయం పరమవుతుంటే సంయుక్తం కానటువంటి, ఉదంతాలైనటువంటి 'డ-ల-ర' లకు అలఘులకారం (ళ) బహుళంగా వస్తుంది. ఉదాహరణకు త్రాళులు – త్రాడులు. సులభవ్యాకర్త కూడా "లువర్ణకంబునకు ముందున్న యసంయుక్తములై యుదంతంబులైన 'డ ల ర' లకు నలఘు లకారంబు బహుళంబుగ నగు" (సులభ. ఆచ్ఛిక:20) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "సమానపదంబునందు సంయోగంబు పరంబగునపుడెల్లచో ఖండబిందువునకుం బూర్ణంబగు"(బాల. అచ్చిక:15). ఏకపదంలో (రెండు పదాలుగా విడదీయడానికి వీలు లేని పదంలో) సంయోగాక్షరం(సంయుక్తాక్షరం) పరమవుతుంటే దానికి ముందు ఉండే అర్థబిందువు అంతటను పూర్ణబిందువుగా అవుతుందని చెప్పి 'అనఁటులు, అనంట్లు వంటి రూపాలను బాలవ్యాకర్త సాధించారు. సులభవ్యాకర్త "మూఁడు నాఁడులం దప్ప నేకపదంబున సంయుక్తాక్షరంబు పరంబగునపు డఱసున్న నెఱసున్న యగు" (సులభ. అచ్చిక:22) అని సూత్రీకరించి ' మూఁడు నాఁడు' అనే శబ్దాలకు తప్ప అన్ని చోట్ల ఏకపదాలలో సంయుక్తాక్షరం పరమవుతుంటే అరసున్న నిండుసున్నగా మారుతుందని చెప్పారు. ఉదాహరణకు ' మూఁడు మూళ్లు తొమ్మిది, ఎన్ని నాళ్ళు' వంటి రూపాలను చెప్పారు. ఈ సూత్రం బాలవ్యాకరణానికి సవరణ సూత్రంగా కన్పిస్తుంది.

బాలవ్యాకర్త "ఔపవిభక్తికంబుల లివర్ణ సలలు వర్ణకంబులకు బహువచనంబు పరంబగునపుడు పూర్ణబిందు పూర్వక డువర్ణంబు బహుళంబుగానగు"(బాల. అచ్చిక:16) అని సూత్రీకరించారు. 'ఇ–టి–తి' అనే ఔపవిభక్తికాలు వచ్చే శబ్దాలకు బహువచనం పరమవుతుంటే, ఆ శబ్దాల చివరలో ఉండే లివర్ణానికిగాని, ల్లు వర్ణానికిగాని పూర్ణబిందుపూర్వక డువర్ణం ఆదేశంగా వస్తుంది. 'ఇ–టి–తి' అనే వాటిని ఔపవిభక్తికాలు అంటారు. ఉదాహరణకు 'కొడవలి–కొడవండులు'. సులభవ్యాకర్త కూడా "ఔపవిభక్తిక లివర్ణమునకు 'లు–ల' లు పరంబులగునపుడు పూర్ణబిందు పూర్వక డువర్ణంబులు బహుళంబుగ నగు" (సులభ. అచ్చిక:24) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "కలన్వాదుల నువర్ణంబు కుజ్జుగు: బహువచనము పరంబగునపుడు నిత్యముగానగు"(బాల. అచ్చిక:18) అని సూత్రీకరించారు. 'కలను' మొదలైన శబ్దాలలోని చివరి 'ను'వర్ణానికి ఏకవచనంలో వికల్పంగాను, బహువచనంలో నిత్యంగాను 'కుజ్జు' వస్తుంది. బహువచనం పరమవుతుంటే నిత్యంగా వస్తుందని సూత్రంలో చెప్పటంవల్ల ఏకవచనంలో వికల్పమని స్ఫురిస్తుంది. సులభవ్యాకర్త కూడా "కలను మొదలగు శబ్దంబుల నువర్ణంబున కేకవచనంబున వైకల్పికంబుగను బహువచనంబున నిత్యముగను కుజ్జగు" (సులభ. అచ్చిక:26) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "అట్లు రేను గోను శబ్దంబుల నువర్ణంబుగుజ్జుగు" "(బాల. ఆచ్ఛిక:19) అని సూత్రీకరించారు. 'రేను–గోను' శబ్దాలలోని నువర్ణానికి ఏకవచనంలో వికల్పంగా, బహువచనంలో నిత్యంగా 'గుజ్' అనేది వస్తుంది. ఉదాహరణకు 'రేఁగు, రేను; రేఁగులు. గోఁగు, గోను; గోఁగులు సులభవ్యాకర్త కూడా "రేను, గోను శబ్దంబుల నువర్ణంబునకుఁ బైయట్ల గుజ్జగు" (సులభ. ఆచ్ఛిక:27) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "బహువచనంబు పరంబగునపుడు రేయి ప్రభృతుల తుది యక్షరంబు లోపించు"(బాల. ఆచ్ఛిక:21) అని సూత్రీకరించారు. బహువచనప్రత్యయం పరమవుతుంటే రేయి మొదలైన శబ్దాల తుది అక్షరానికి లోపం కలుగుతుందని సూత్రార్థం. ఉదాహరణకు 'రేయి–రేలు; తాయి– జాలు; వేయి–వేలు; వ్రాయి– వ్రాలు; ఇత్యాదులు. ఈ లోపంబు సమాసంబులందుం జూపట్టెడు. రేరాజు, మగతాపతకము, వేవెలుఁగు

బాలవ్యాకర్త "బహువచనంబు పరంబగునపుడు చేను, పేను, మీను శబ్దంబుల నువర్ణంబు లోపించు" "(బాల. ఆచ్ఛిక:20) అని సూత్రీకరించారు. బహువచన ప్రత్యయం పరమవుతుంటే చేను–పేను–మీను శబ్దాల నువర్ణం లోపిస్తుందని అర్థం. ఉదాహరణకు 'చేను– చేలు; పేను– పేలు; మీను– మీలు'. సులభవ్యాకర్త"లు, ల'లు పరంబగునపుడు చేను–పేను–మీను–రేయి–ఊయి– వేయి– వ్రాయి– పాయి – ప్రాయి – శబ్దంబుల కడవర్ణంబులు లోపించు" (సులభ. ఆచ్ఛిక:28) అని సూత్రీకరించారు. బాలవ్యాకర్త 'చేను–పేను–మీను' మూడు శబ్దాలకే చివర ఉన్న వర్ణాన్ని లోపం చెప్పారు. కాని సులభవ్యాకర్త వాటితోపాటుగా రేయి–ఊయి–వేయి– వ్రాయి– పాయి – ప్రాయి మొదలైన శబ్దాల చివర వర్ణానికి కూడా బహువచనం పరమైనపుడు లోపం వస్తుందని చెప్పారు. ఉదాహరణలుగా ' రేలు– ఊలు– వేలు– వ్రాలు– పాలు– ప్రాలు' వంటి రూపాలను పేర్కొన్నారు.

బాలవ్యాకర్త "బహువచనంబు పరంబగు నపుడావు ప్రభృతుల తుది యక్షరంబునకు లోపంబు విభాషనగు" (బాల. ఆచ్ఛిక:22) అని సూత్రీకరించారు. బహువచన ప్రత్యయం పరమవుతుంటే 'ఆవు' మొదలైన శబ్దాలలో తుది అక్షరలోపం విభాషగా వస్తుందని చెప్పారు ఉదాహరణకు 'ఆవు ఆలు, ఆవులు; జాము – జాలు, జాములు; చుట్టము – చుట్టలు, చుట్టములు; మీసము – మీసలు, మీసములు. సులభవ్యాకర్త కూడా "బహువచనంబు పరంబగునపు డావు ప్రభృతుల తుదియక్షరమునకు లోపంబు విభాష నగు" (సులభ. ఆచ్ఛిక:29) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "ఇయకు మాఱుగా నామాంతంబున కెత్వంబు బహుళంబుగా నగు"(బాల. ఆచ్ఛిక:23) అని సూత్రీకరించారు. ప్రాతిపదికకు చివర ఉండే ఇయకు మారుగా హ్రస్వ ఎకారం బహుళంగా వస్తుంది. ఉదాహరణ కి కన్నియ కన్నె, జన్నియ, జన్నె, కొంచము కొంచియము. సులభవ్యాకర్త "నామాంతమందలి 'ఇయ' కు బహుళంబుగ నెకారం బగు" (సులభ. ఆచ్ఛిక:30) అని సూత్రీకరించారు.

సులభవ్యాకర్త"వస్తునిర్దేశమం దదె, యదిగో, లు సర్వత్ర యగు" (సులభ. ఆచ్ఛిక:32) అని సూత్రీకరించారు. కనులకు కనిపించే వస్తువును చూపే సందర్భంలో ఏకవచన, బహువచనాలలో; మహతీ, మహద్వాచక, అమహదర్థాల్లో అదె- అదిగో, ఇదె- ఇదిగో అనే అవయ్యాలు వస్తాయి. ఉదాహరణకు 'అదె రాముఁడు, ఇదె సీత, అదె వనము' మొదలైనవాటిని పేర్కొన్నారు. బాల, ప్రౌఢవ్యాకణాలలో ఈ రూపాల ప్రసక్తి లేదు.

## 5.2.3 సర్వనామ ప్రకరణం

బాలవ్యాకర్త "అన్ని ప్రభృతులు సర్వనామంబులు"(బాల. ఆచ్ఛిక:24) అని సూత్రీకరించారు. అన్ని మొదలైన శబ్దాలను సర్వనామాలంటారు సర్వనామపదాల రూపాలను సూత్రీకరణచేసి చెప్పితే సూత్రాల సంఖ్య పెరుగుటేగాక పాఠకులకు మిక్కిలిక్లేశం కలుగుతుందనే భావనతో నిపాతాలను సూచించినట్లుగా సంక్షిప్తంగా ఉండేటట్లు పట్టికరూపంలో ఉదాహరణలను చూపించారు. అవసరమైనచోట కొన్ని వివరణవాక్యాలతో సూచనలిచ్చాడు.

"ఆ-ఈ-ఏ-అన్ని - ఇన్ని - కొన్ని -అంత-ఇంత-ఎంత-కొంత-నా-నీ మన-తా - పెక్కులును, ఒకటి రెండు లోనగు సంఖ్యావాచకంబులును సర్వనామంబులు" (సులభ. ఆచ్ఛిక:33) అని సర్వనామాలనన్నింటిని సూత్రంలోనే చెప్పటానికి ప్రయత్నం చేశారు. సులభవ్యాకర్త 'అన్ని' వంటి సర్వనామ శబ్దాలలో సంఖ్యార్థాన్ని తెలిపేది వాస్తవంగా 'న్ని' మాత్రమేనని ఉచ్చారణ సౌలభ్యం కోసం 'అ' చేర్చబడి 'అన్ని' అయిందని చెప్పారు. అనునాసిక అక్షరాలు అనుస్వారంగా మారడం తెలుగులో ఉన్నది కాబట్టి 'త' పరమైనపుడు 'న్ని' పూర్ణబిందువుగా మారి 'అంత' అవుతుందని చెప్పారు. 'అంత' అనేది ఇతర అచ్చులకు పరమైనపుడు ఉచ్చారణ సౌలభ్యం కోసం వచ్చిన 'అ' అనేది

లోపిస్తుంది. ఉదాహరణకు ‘ఆ+అంత= ఆ+ంత=అంత’, ఈ+అంత= ఈ+ంత=ఇంత’ మొదలైనవి.

సులభవ్యాకర్త సర్వనామాలకు సంబంధించిన విషయాలను 28 సూత్రాలలో చెప్పారు. వాటిలోని ముఖ్యమైన విషయాలను పరిశీలిస్తాను.

1. లుప్తశేషాలుగా ‘ది–వి–న్ని– ంత’ అనేవి పరంగా ఉంటే త్రికాలుగా చెప్పబడే ‘ఆ – ఈ – ఏ’ అనే సర్వనామాలు హ్రస్వాలుగా మారతాయని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ‘ఆ+అది=ఆ+ది=అది, ఆ+అన్ని= ఆ+న్ని=అన్ని’ మొదలైనవి.
2. ‘ఒక’ అనే శబ్దానికి ‘అన్ని, అంత’ అనే సర్వనామాలు పరమైనపుడు వర్ణవ్యత్యయంతో కూడిన సంయోగం కల్గుతుందని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ‘ఒక+ అన్ని= ఒక+ న్ని=కఒ+న్ని=కొన్ని, ఒక+అంత= ఒక+ంత= కఒ+ంత= కొంత’. ఇలాంటి రూపసాధనని బాల, ప్రౌఢ వ్యాకరణాలు చెప్పలేదు.
3. మహదర్థక ఏకవచనంలో ‘డుఁ’ బహువచనంలో ‘రు’, అమహదర్థక ఏకవచనంలో ‘ది’ బహువచనంలో ‘వి’ అనేవి వస్తాయని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరాణకు ‘వాఁడు, వాఁరు, అది, అవి’.
4. సులభవ్యాకర్త త్రికాలకు ‘డుఁ’ పరమైనపుడు వాటికి పూర్వం ‘వ’ కారం ఆగమంగా వస్తుందని రెండు సూత్రాలలో[18] చెప్పారు. ‘ఆ– ఈ’ అనే త్రికాలకు ‘డుఁ’ పరమైనపుడు వాటికి పూర్వం ‘వ’ కారాగమం నిత్యంగా, ‘ఏ’ అనే త్రికానికి ‘డుఁ’ పరమైనపుడు డానికి పూర్వం ‘వ’ కారాగమం వికల్పంగా వస్తుందని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ‘ఆ+ఁడు= వ+ఆ+ఁడు= వాఁడు’, ఈ+ఁడు= వ+ఈ+ఁడు=వీఁడు’. ఏ+ఁడు= వ+ఏఁడు= వేడు, ఏ+ఁడు=ఏడు’.
5. ‘వాఁడు’ శబ్దానికి బహువచంలో ‘రు’ వర్ణం ఆగమంగా వస్తుంది. అలాంటి సందర్భంలో ‘ఁడు’ వర్ణానికి ఉత్వలోపం, అరసున్నకి ‘నిండు సున్న’ వస్తాయని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ‘వాఁడు– వాఁడురు– వాఁఁడ్రు–వాండ్రు’.

[18] సులభ. ఆచ్చిక:37, 38

6. ‘వారు– వీరు – మీరు’ శబ్దాలలోని ‘రు’ వర్ణకం మీద మళ్ళీ బహువచనం ‘లు’ వర్ణకం వస్తుందని, అలాంటి చోట్ల ‘రు’ వర్ణకంలోని ‘ఉ’కారం, ‘అ’కారంగా మారుతుందని సులభవ్యాకర్త చెప్పారు.

7. బహువచన ప్రత్యయమైన ‘లు’ వర్ణం కొన్నిసార్లు అలఘురేఫంగా అవుతుంది. అలాంటి సందర్భాలలో ‘అన్ని– ఇన్ని– కొన్ని– ఎన్ని’ వంటి శబ్దాలలోని ‘న్ని’ కి ‘పూర్ణబిందువు పూర్వక దకారం ఆదేశంగా వస్తుందది. ఉదాహరణకు ‘అందఱు–ఇందఱు–ఎందఱు–కొందఱు’.

8. ‘వాఁడు’ అనే మహదర్థకానికి బహువచన రూపాలైన ‘వాండ్రు–వారు– వారలు’ అనేవి పురుషులను, స్త్రీలను ఇద్దరిని బోధిస్తాయని సులభవ్యాకర్త చెప్పారు.

9. ‘ది–వి’ అనే అక్షరాలు పరమైనపుడు త్రికాలలోని ‘ఆ –ఈ’ అనేవి నిత్యంగాను, ‘ఏ’ అనేది వికల్పంగాను హ్రస్వం అవుతాయి. ఉదాహరణకు ‘ఆ+ది= అది, ఈ+ది=ఇది. ఏ+ది=ఎది, ఏది. అవి, ఇవి, ఏవి–ఏవి అవుతాయి.

10. అది, అవి, అన్ని, అంత మొదలైనవి అమహదర్థక రూపాలు.

11. హ్రస్వం తరువాత ‘ది–వి’ లకు ద్విత్వం కూడా వస్తుంది. సమాసంలో రాదు. ఉదాహరణకు ‘అది– అద్ది, ఇవి– ఇవ్వి. సమాసంలో ద్విత్వం రానపుడు ‘నాయది–నాయవి’ అని రూపాలు ఏర్పడతాయి.

12. మహద్వాచకంలో, ఏకవచనంలో, పూజ్యార్థంలో త్రికానికి ‘వాఁడు’ పరమవుతుంది. అలాంటప్పుడు ‘వా’ కు ‘త’ వర్ణం ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు ‘ఆ+వాఁడు–అతఁడు; ఈ+వాఁడు= ఈతడు’.

13. పూజ్యార్థంలో మహదర్థకం ఏకవచనంలో వచ్చే ‘అన్న’, మహత్యర్థక ఏకవచనంలో వచ్చే ‘అమ్మ–అప్ప– అక్క’ అనేవి ద్విత్వాన్ని కోల్పోయి త్రికానికి  అనుసరించి వస్తాయి. అలాంటి సందర్భాలలో ‘అమ్మ’ మొదలైన శబ్దాలు ఎకారం అంతంగా కలిగి, వాటి మొదట ఉండే అకారాన్ని కోల్పోతాయి. ఉదాహరణకు ‘అన్న’ అనేది పూజ్యార్థంలో ద్విత్వాన్ని కోల్పోయి ‘అన’ అవుతుంది. ‘ఏకవచనంలో ‘ఆ–ఈ–ఏ’ లకు చేర్చగా ఆయన–ఈయన–ఏయన’ వంటి రూపాలు ఏర్పడతాయి.  మహత్యర్థకంలో ‘అమ్మ’

ద్విత్వాన్ని కోల్పోయి 'అమ' గా మారి ఏకవచనంలో 'ఆ–ఈ–ఏ' లకు చేర్చగా 'ఆ+అమ' అవుతుంది. 'అమ' శబ్దం ఎకారం అంతంగా మారి మొదటి 'అకారం లోపించగా 'ఆ+ మె=ఆమె అవుతుంది.

బాలవ్యాకర్త సర్వనామాల క్రింద చెప్పిన విషయాలలో వివిధ అర్థాలలో సర్వనామ రూపాలు ఇలా ఉంటాయని చెప్పారు తప్ప వాటి ప్రక్రియ చెప్పలేదు సులభవ్యాకర్త ప్రక్రియను కూడా చెప్పారు. ప్రౌఢవ్యాకర్త పైన చెప్పబడిన అంశాలను చెప్పలేదు.

బాలవ్యాకర్త "ఆ, ఈ, ఏ యను సర్వనామంబులు త్రికంబు నాఁబడు" అని త్రికాలను 'సమాస పరిచ్ఛేదం'లో చెప్పిన నిర్వచనాన్ని సులభవ్యాకర్త ఇవి సర్వనామాలు కాబట్టి సందర్భోచితంగా "ఆ ఈ ఏ వీనికిఁ ద్రికమని పేరు" (సులభ. ఆచ్చిక:46) అని ఆచ్చికపరిచ్ఛేదంలో సర్వనామ ప్రకరణంలోనే చెప్పారు.

బాలవ్యాకర్త "సంఖ్యకుం బూరణార్థమునం దవగాగమంబగు"(బాల. ఆచ్ఛిక:25) అని సూత్రీకరించి సంఖ్యావాచకానికి పూరించటం అనే అర్థంలో 'అవక్' ఆగమంగా వస్తుందని 'రెండు+అవ=రెండవ' వంటి రూపాలను సాదించారు. దానికి కొనసాగింపుగా ప్రౌఢవ్యాకర్త "కొన్ని యెడల నవకగు కానంబడియెడి" (ప్రౌఢ. శబ్ద:103) అని కొన్ని సార్లు 'అవ' కు 'అగు' వస్తుందని చెప్పారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త "సంఖ్యాపూరణార్థంబున 'అవ' కు 'అగు' నొకానొకచో నగు(సులభ. ఆచ్చిక:58) అని సూత్రీకరించి 'ఏడవ పర్వము– ఏడగు పర్వము' వంటి రూపాలను సాధించారు. బాలవ్యాకర్త చెప్పిన విషయాన్ని చెప్పలేదుగాని, పూరణగా ప్రౌఢవ్యాకర్త చెప్పిన విషయాన్ని మాత్రం సులభవ్యాకర్త గ్రహించారు.

బాలవ్యాకర్త "అపదాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబున వకారంబు విభాషనగు" (బాల. ఆచ్ఛిక:27) అని సూత్రీకరించారు. ఆచ్ఛిక శబ్దాలలో పదాదిలో లేనటువంటి, సంయుక్తం కానటువంటి 'గ'కారం 'వ' కారమవుతుంది. ఉదాహరణకు 'పలుగురు– పలువురు'. ఇరుగురు– ఇరువురు' వంటి రూపాలను బాలవ్యాకర్త సాధించారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త చెబుతూ "అనాద్యంబును నసంయుక్తంబును నగు గకారమునకు నొకానొకచో వకారంబగు" (సులభ. ఆచ్ఛిక:61) అని సూత్రీకరించారు. బాలవ్యాకర్త 'విభాష' అని చెప్పిన విషయాన్ని సులభవ్యాకర్త

'ఒకనొకచో' అన్నారు. బాలవ్యాకర్త కేవలం వికల్పరూపాలను దృష్టిలో పెట్టుకొని పై సూత్రాన్ని చెప్పారు. కాని సులభవ్యాకర్త నిషేధ రూపాలను కూడా దృష్టిలో పెట్టుకొని చెప్పారు. ఉదాహరణకు 'వేగి– వేవి, అలిగె– అలివె, తగులు– తవులు'. సులభవ్యాకర్త సూత్రంలో చెప్పబడిన 'అసంయుక్తము' అనే పదానికి ద్విత్వాక్షరం కానిది, సంయుక్తాక్షరం కానిది అని వ్యాఖ్యానం చేశారు. 'ముగ్గురు–మువ్వురు' వంటి రూపాలలో ద్విత్వంగా ఉన్న 'గ్గ' అనేది 'వ్వ' మారలేదని ఇది 'మూగురు–మూవురు– మువ్వురు' అని ఏర్పడిందని చెప్పారు. 'ఇర్వురు' అనేది 'ఇర్గురు' నుంచి ఏర్పడలేదని 'ఇరుగురు–ఇరువురు–ఇర్వురు' అయిందని చెప్పారు. సూత్రంలో ఒకానొకచో అనడంవల్ల 'రేగు–బాగు– వాగు– లాగు– సాగు మొదలలైన వాటిలో 'వ' కారాదేశం లేదని సులభవ్యాకర్త చెప్పారు. బిందుపూర్వక 'గ' కారానికి 'వ' కారాదేశం వస్తుందని 'మెసఁగు– మెసఁవు, మఱుఁగు–మఱువు, మడుఁగు– మడువు, తీఁగ– తీవ, వేసఁగి– వేసవి' మూఁగ– మూవ' మొదలైనవాటిని సులభవ్యాకర్త పేర్కొన్నారు.

## 5.2.4 ఔపవిభక్తిక ప్రకరణం

ఉప విభక్తులను గురించి తెలుపు ప్రకరణం ఔపవిభక్తిక ప్రకరణం. "ఉపవిభక్తులనఁగాఁ గొన్ని నామంబుల యేకవచన విభక్తులకు ముందుగ వచ్చునట్టి ప్రత్యయములు" (సులభ.ఆచ్ఛిక:62) కొన్ని నామాలకు ఏకవచనంలో విభక్తుల ముందు చేరేవాటిని ఉపవిభక్తికాలు అంటారు. అవి 'ఇ–టి–ంటి–తి' వర్ణకాలు. ఉదాహరణకు ' కూడు+ కుండ = కూటికుండ. కాలు+ ఇ + చేత= కాలిచేత.

బాలవ్యాకర్త "ఇ టి తి వర్ణంబులు వక్ష్యమాణంబు లౌప విభక్తికంబులు"(బాల. ఆచ్ఛిక:28) అని సూత్రీకరించారు. ఇకముందు చెప్పబడే ఇ, టి, తి వర్ణాలను ఔపవిభక్తికాలని అంటారు. ఇవివిభక్తిని కారణంగా చేసికొని ఆదేశంగాను, ఆగమంగాను కొన్ని ప్రాతిపదికలకు వస్తాయి. ఇవి వర్ణాలేగాని వర్ణకాలు గావు.

బాలవ్యాకర్త "ఊరు మొదలగువాని కిత్వంబగు"(బాల. ఆచ్ఛిక:30) అని సూత్రీకరించారు. ఊరుమొదలైన ప్రాతిపదికలకు ద్వితీయాది ఏకవచన ప్రత్యయాలు పరమవుతుంటే 'ఇ' అనే ఔపవిభక్తికం ఆదేశంగా వస్తుందని సూత్రార్థం.

సులభవ్యాకర్త "ఊరు మొదలగు వాని కిత్వంబగు" (సులభ.ఆచ్చిక:63) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "టి వర్ణంబు కొన్నింటి యంతాక్షరంబున కాదేశంబును, గొన్నింటి కంతాగమంబును, గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయికంబుగ నగు" "(బాల. ఆచ్చిక:31) అని సూత్రీకరించారు. ద్వితీయాది ఏకవచన ప్రత్యయాలు పరమవుతుంటే 'టి' అనే ఔపవిభక్తికవర్ణం కొన్ని ప్రాతిపదికలచివరి అక్షరానికి ఆదేశంగాను, ఇంకొన్ని ప్రాతిపదికలకు ఆగమంగాను, మరికొన్ని ప్రాతిపదికలకు ఆదేశంగాను ఆగమంగాను తఱుచుగా వస్తుందని సూత్రార్థం.

సులభవ్యాకర్త"టివర్ణంబు గొన్నింటి యంత్యాక్షరంబున కాదేశంబును, గొన్నింటి కంతాగమంబును, గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయికంబుగ నగు" (సులభ.ఆచ్చిక:64) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "హ్రస్వముమీఁది టివర్ణంబునకు ముందు పూర్ణబిందువు బహుళముగానగు" (బాల. ఆచ్చిక:32) అని సూత్రీకరించారు. హ్రస్వాక్షరంమీద ఆదేశంగాగాని, ఆగమంగాగాని వచ్చే ఔపవిభక్తిక 'టి'వర్ణానికి ముందు నిండుసున్న బహుళంగా వస్తుందని బాలవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'అన్నింటిని; ఎనిమిదింటిని; పగంటిని; పగలింటిని; రెండింటిని'.

సులభవ్యాకర్త "హ్రస్వము మీఁది 'టి' వర్ణమునకు ముందు పూర్ణ బిందువు బహుళంబుగా నగు" (సులభ.ఆచ్చిక:65) అని సూత్రీకరించారు. హ్రస్వాక్షరంమీద ఆదేశంగాగాని, ఆగమంగాగాని వచ్చే ఔపవిభక్తిక 'టి'వర్ణానికి ముందు నిండుసున్న బహుళంగా వస్తుంది. ఉదాహరణకు ' అన్నిటికి– అన్నింటికి', వేయిటికి– వేయింటికి'.

సులభవ్యాకర్త వివరణలో దీర్ఘాక్షరాలకు పరంగా వచ్చే 'టి' వర్ణానికి ముందు నిండుసున్న రాదని చెప్పారు. ఉదాహరణకు ' ఏటికి' ఇందులో 'ఏ' అనేది దీర్ఘం. దీని పక్కన టివర్ణానికి నిండు సున్న రాదు. అలాగే హ్రస్వాక్షరానికి పరమైన 'టి' వర్ణానికి ముందు కొన్ని శబ్దాలలో నిండుసున్నా వస్తుంది, కొన్నిసార్లు రాదని చెప్పారు. ఉదాహరణకు 'మొదటి నుండి' దీనిని 'మొదంటినుండి' అని చెప్పకూడదు. 'మొదలిటి నుండి' అనేది 'మొదలింటినుండి' అవుతుంది.

'నుదుటికి, అంగిటికి, అంబటికి' మొదలైన శబ్దాల్లో నిండు సున్న రాదని సులభవ్యాకర్త చెప్పారు. పై సూత్రం నిండు సున్న విధిస్తుందేగాని అరసున్న విధింపదని 'అన్నిఁటికి, కొన్నిఁటికి' వంటి రూపాలు రాయడం తప్పని సులభవ్యాకర్త చెప్పారు.

బాలవ్యాకర్త "పదాద్యంబగు హ్రస్వంబు మీఁది టివర్ణంబునకు ముందు పూర్ణబిందువగు" (బాల. ఆచ్ఛిక:33) అని సూత్రీకరించారు. పదాది హ్రస్వంపైన ఆగమ ఆదేశ రూపంగా వచ్చే ఔపవిభక్తిక టివర్ణానికి ముందు పూర్ణబిందువు నిత్యంగా వస్తుంది. ఉదాహరణకు ' కన్ను- కంటిని', మిన్ను- మింటిని'.

సులభవ్యాకర్త "పదాద్యంబగు హ్రస్వంబుమీఁది 'టి' వర్ణంబునకు ముందు పూర్ణబిందువు వగు" (సులభ.ఆచ్ఛిక:66) అని సూత్రీకరించారు. పదం యొక్క మొదటి అక్షరం హ్రస్వంగా ఉండి, ఆ పదానికి ఔపవిభక్తిక ప్రత్యయం 'టి' ఆగమంగాకాని, ఆదేశంగాని వస్తే దానికి ముందు నిండు సున్నా వస్తుంది. ఉదాహరణకు ' కన్ను – కంటిని', 'మిన్ను- మింటిని'

బాలవ్యాకర్త "అఱ్ఱు మొదలగు శబ్దముల కంతాగమంబు తివర్ణంబును రేఫంబున కొక్కటికి లోపంబునగు" "(బాల. ఆచ్ఛిక:34) అని సూత్రీకరించారు. 'అఱ్ఱు' మొదలైన శబ్దాలకు అంతంలో ఆగమంగా తి-అనే ఔపవిభక్తిక వర్ణం వస్తుంది. అప్పుడు అఱ్ఱు మొదలగువానిలోని ద్విరుక్తశకటరేఫం అద్విరుక్తమవుతుంది.

సులభవ్యాకర్త"అఱ్ఱు మొదలగు శబ్దముల తివర్ణం బంతాగమంబును రేఫంబున కొక్కటికి లోపంబు నగు" (సులభ.ఆచ్చిక:67) అని సూత్రీకరించారు. 'అఱ్ఱు' మొదలైన శబ్దాలకు చివర ఔపవిభక్తికమైన 'తి' వర్ణం ఆగమంగా వస్తుంది. అలా వచ్చే సందర్భంలో 'అఱ్ఱు' మొదలగువాటిలోని ద్విత్వ శకటరేఫలో ఒక రేఫ లోపిస్తుంది. ఉదాహరణకు ' అఱ్ఱు+తి-అఱు+తిని =అఱితిని'.

బాలవ్యాకర్త "విభక్తి పరంబగునపుడు గోయి ప్రభృతుల తుది యక్షరంబు తివర్ణంబగు "(బాల. ఆచ్ఛిక:35) అని సూత్రీకరించారు. ప్రథమావిభక్తి ఏకవచన ప్రత్యయాలు తప్ప మిగిలిన ప్రత్యయాలు ఏకవచనంలో గానీ, బహువచనంలోగానీ పరమవుతుంటే 'గోయి' మొదలైనశబ్దాల చివరి అక్షరానికి తి – అనే ఔపవిభక్తికవర్ణం ఆదేశంగా వస్తుందని బాలవ్యాకర్త చెప్పారు. ఔపవిభక్తికాలు ద్వితీయాదిఏకవచనాలు పరమవుతుంటేనే ప్రాతిపదికలకు ఆగమాదేశాలుగా

వస్తాయి. కానీ 'గోయి' మొదలైనవానికి ద్వితీయాది ఏకవచనాలేగాక, ప్రథమాదిబహువచనాలు పరమవుతుంటే కూడ ఔపవిభక్తిక 'తి'వర్ణం వస్తుండటంవల్ల సూత్రంలో 'విభక్తి పరంబగునపుడు' అని చెప్పాడు. ఉదాహరణకు 'గోయి – గోతులు; గోతిని – గోతులను'.

సులభవ్యాకర్త "విభక్తి పరంబగునపుడు గోయి ప్రభృతుల తుది యక్షరంబు తివర్ణంబగు(సులభ.ఆచ్ఛిక:68) అని సూత్రీకరించారు. విభక్తి ప్రత్యయాలు పరమైనపుడు 'గోయి' మొదలైన శబ్దాలలో చివర ఉండే 'యి' మొదలైన అక్షరాలు 'తి' మారుతాయి. ఉదాహరణకు 'గోయి' దీనికి బహువచనం చేర్చగా ' గోయి+లు'. ప్రస్తుత సూత్రంచే 'గోతి+లు=గోతులు'. అయింది. 'చేఁదు' అనే శబ్దం సమాసంలో 'చేఁతి' అవుతుందని 'చేతి వేము' అనే ఉదాహరణను వావిలికొలనువారు ఈ సూత్రంలో ఇచ్చారు.

బాలవ్యాకర్త "టితివర్ణంబులు పరంబులగునపు దుత్వంబున కిత్వంబగు"(బాల.ఆచ్ఛిక:36) అని సూత్రీకరించారు. 'టి, తి' ఔపవిభక్తిక వర్ణాలు పరమవుతుంటే ప్రాతిపదికలోని ఉత్వానికి ఇత్వం ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు ' రెండిటికి, మూఁడిటికి, నాలుగిటికి'.

సులభవ్యాకర్త"టి తి వర్ణంబులు పరంబులగునపుడు దుత్వంబున కిత్వంబగు" (సులభ. ఆచ్ఛిక:69) అని సూత్రీకరించారు. ఔపవిభక్తికాలు అంతంగా కలిగిన, ఉకారాంత శబ్దాలకు 'టి–తి' వర్ణాలు పరమైనపుడు ఉకారం ఇకారంగా మారుతుంది. ఉదాహరణకు ' రెండిటికి, రెంటిని'. 'రెండు' ఇది ఉకారాంతం. దీనికి 'టి' రాగా 'రెండుటి' అయింది. 'డు' 'డి' అయి 'రెండిటి' అయింది. షష్ఠి విభక్తి వస్తే ' రెండిటికి', ద్వితీయా విభక్తి వస్తే 'రెంటిని' అవుతుంది.

బాలవ్యాకర్త "టివర్ణంబు పరంబగునపుడు క్రిందు, మీఁదు, ముందు, పువర్ణంబుల కత్వంబగు"(బాల. ఆచ్ఛిక:37) అని సూత్రీకరించారు. 'టి' అనే ఔపవిభక్తిక వర్ణం పరమవుతుంటే క్రిందు, మీఁదుముందు మరియు పువర్ణాలకు అత్వం నిత్యంగా వస్తుంది. ఈ సూత్రంలో ప్రత్యేకంగా ఆయా శబ్దాలలోని తుది అచ్చుకు అని చెప్పకపోయిన 'అలోంత్యస్య' అనే పాణిని సూత్రం ప్రకారం 'క్రిందు, మీఁదుముందు మరియు పువర్ణాల' చివరి ఉత్వానికే అత్వం ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు 'క్రిందు+ను– క్రిందు+టి+ను– క్రింద+టి+ను= క్రిందటిని. క్రిందటిని; మీఁదు – మీఁదటిని; ముందు – ముందటిని; మాపు – మాపటిని; అప్పుడు – అప్పటిని'.

సులభవ్యాకర్త "టి వర్ణంబు పరంబగునపుడు క్రిందు –మీఁదు –ముందు– పువర్ణంబుల యుత్వంబున కిత్వంబగు" (సులభ.ఆచ్చిక:70) అని సూత్రీకరించారు. 'టి' వర్ణకం పరమైనపుడు క్రిందు, మీఁదు, ముందు శబ్దాల చివర ఉత్వానికి, పువర్ణాంత శబ్దంలోని చివరి ఉత్వానికి అత్వం ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు ' క్రిందు– క్రిందటిని', 'మీఁదు– మీఁదటిని', ముందు– ముందటిని', మాపు– మాపటికి'.

బాలవ్యాకర్త "ఔపవిభక్తికముల తృతీయా సప్తముల కత్వం బాదేశంబు బహుళంబు గానగు"(బాల.ఆచ్చిక:38) అని సూత్రీకరించారు. ఔపవిభక్తిక శబ్దాలయొక్క తృతీయావిభక్తికిని, సప్తమీవిభక్తికిని మొత్తానికి అత్వం ఆదేశం బహుళంగా వస్తుందని బాలవ్యాకర్త ఈ సూత్రంలో చెప్పారు. ఉదాహరణకు ' 'గోరను గీఱెను, ఇంట లేదు'.

సులభవ్యాకర్త "ఔపవిభక్తికముల తృతీయాసప్తముల కత్వంబాదేశంబు బహుళంబుగా నగు" (సులభ.ఆచ్చిక:71) అని సూత్రీకరించారు. ఔపవిభక్తికాలకు తృతీయా విభక్తి యొక్క అర్థంలో, సప్తమీ విభక్తి యొక్క అర్థంలో వచ్చే విభక్తుల స్థానంలో అత్వం ఆదేశం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు తృతీయకు 'గోరు చేతను – గోరు+అ+ను = గోరను. సప్తమీకి 'ఊరు+అందును – ఊరు+అ+ను= ఊరను. బహుళంగా వస్తుందని చెప్పడం వల్ల 'గోరిచేత, ఊరియందు'. అనే రూపాలు ఏర్పడతాయి.

## 5.3 తద్ధిత పదాల నిర్మాణం

ఒక నామవాచకం నుంచి మరొక నామవాచక పదాన్ని నిష్పత్తి చేసే విధానానికి తద్ధిత వృత్తి అని పేరు. నామవాచకాల మీద, వాటి విశేషణాల మీద చేరే ప్రత్యయాలను 'తద్ధిత' ప్రత్యయాలు అంటారు. భావాద్యర్థాలలో 'తన' మొదలైన తద్ధిత ప్రత్యయాలు 'ఆచ్ఛిక' ప్రాతిపదికల మీద చేరి తద్ధిత రూపాలను ఏర్పరుస్తాయి. ఒక్క ' మయట్' ప్రత్యయం మాత్రం సంస్కృతంలో నుంచి తెలుగులోకి వచ్చింది. బాల, ప్రౌఢ వ్యాకరణాలలో ప్రయోగ బాహుళ్యం గల తద్ధిత ప్రత్యయాలు వివిధ అర్థాలలో ముప్పైకి పైగా నిర్దేశించబడ్డాయి. సులభవ్యాకర్త కూడా ఆ ప్రత్యయాలన్నింటిని వివిధ అర్థాలలో పేర్కొన్నారు.

ప్రౌఢవ్యాకర్త తద్ధితాలకు ఇచ్చిన నిర్వచనాన్ని సులభవ్యాకర్త స్వీకరించి "విశేష్యములకుగాని విశేషణములకుగాని భావార్థము స్వార్థములోనగు నర్థంబుల రాదగిన యొక విధమైన ప్రత్యయములు తద్ధితము లనబడును" (సులభ.తద్ధిత:1) అని తద్ధితాలను సూత్రంలో నిర్వచించారు. అనగా నామాలకుగాని, విశేషణాలకుగాని భావార్థంలో, స్వార్థంలో, మతుబదర్థం మొదలైన అర్థాలలో చేరే వివిధ ప్రత్యయాలను '**తద్ధితాలు**' అంటారని వావిలికొలనువారు నిర్వచించారు. ఈ ప్రత్యయాలు పరమైనప్పుడు 'డు' వర్ణకం మొదలైన ప్రత్యయాలు లోపిస్తాయి. బాల, ప్రౌఢ వ్యాకరణాలు పేర్కొన్న తద్ధిత ప్రత్యయాలను సులభవ్యాకర్త కూడా పేర్కొన్నారు. ఒకటి రెండు విషయాలలో సవరణ, పూరణలు కన్పిస్తున్నాయి.

## 5.3.1 భావార్థక ప్రత్యయాలు

ప్రాతిపదిక వల్ల కలిగే అర్థజ్ఞానం(అర్థబోధ)లో విశేషంగా తోచేది భావమని అర్థం. స్వభావం వల్ల కలిగినది తెలిపేది అని వావిలికొలనువారు నిర్వచించారు. 'తన, ఱిక, ఇమి, న, ఇక, కర, కార, టి' మొదలైన ప్రత్యయాలు భావార్థంలో వస్తాయి.

బాలవ్యాకర్త "తన వర్ణకంబు త్వార్థంబునందగు"(బాల.తద్ధిత:1) అని సూత్రీకరించి 'తన' అనే ప్రత్యయం 'త్వ' అనే సంస్కృత ప్రత్యయం వచ్చే అర్థంలో వస్తుందని చెప్పారు. త్వార్థము అనగా భావము అని అర్థం. ప్రాతిపదిక వల్ల కల్గిన అర్థ జ్ఞానంలో విశేషణంగా తోచేది భావము. ఉదాహరణకు ' రామ' ప్రాతిపదిక. 'రాముడు' ప్రకృతి జన్య విశేషము. దీనిలో విశేషంగా తోచేది రామత్వమను ధర్మం. కాబట్టి రామత్వము అనేది భావము. తెలుగులో భావార్థంలో 'తన' ప్రత్యయం వస్తుందని బాలవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ''రాముని తనము, సీత తనము, మంచి తనము, గొప్ప తనము'.

సులభవ్యాకర్త "తన వర్ణకంబు భావార్థంబునందగు" (సులభ. తద్ధిత:2) అని సూత్రీకరించారు. బాలవ్యాకర్త లాగా 'తన' ప్రత్యయం త్వార్థంలో వస్తుందని, దీనినే భావము అంటారని చెప్పకుండా సూత్రంలోనే భావార్థంలో 'తన' అనే ప్రత్యయం వస్తుందని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'రాముని తనము, సీత తనము, మంచి తనము, గొప్ప తనము.

సులభవ్యాకర్త "చిన్నాదులకు 'టిక' వర్ణకం బగు"(సులభ. తద్ధిత:3) అని సూత్రీకరించి 'చిన్న' మొదలైన శబ్దాలకు 'టిక' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణలుగా 'చిన్నటికము, కన్నెటికము, పెద్దటికము' వంటివి పేర్కొన్నారు. బాలవ్యాకర్త కూడా 'చిన్న' మొదలైన శబ్దాలకు "టిక" వర్ణకం వస్తుందని చెప్పారు.

బాలవ్యాకర్త 'టిక' ప్రత్యయం పరమైనపుడు వృత్తిలో విభక్తి ప్రత్యయం లోపించిన తరువాత శబ్దం చివర ఉన్న ఉత్వానికి అత్వం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త "టికము పరంబగునపు డుత్వంబున కత్వంబగు"(సులభ. తద్ధిత:4) అని సూత్రీకరించారు. ముందు చెప్పిన సూత్రంలో(చిన్నాదులకు) ఉదాహరణలు అకార, ఎకారాంత శబ్దాలేగాని ఉకారాంతాలు లేవు. ఉకారాంత శబ్దాలకు 'టిక' ప్రత్యయం పరమైనపుడు ఉత్వానికి అత్వం వస్తుందని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'తొత్తు యొక్క+ టిక+ము= తొత్తు+ టికము= తొత్తటికము'.

బాలవ్యాకర్త 'పేరు' మొదలైన శబ్దాలకు భావార్థంలో 'ఇమి' వర్ణకం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "ఇమి వర్ణకంబు పేర్వాదుల కగు"(సులభ. తద్ధిత:5) అని సూత్రీకరించి 'పేరు' మొదలైన శబ్దాలకు భావార్థంలో 'ఇమి' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు పేరు యొక్క + భావము= పేరు యొక్క +ఇమి = పేరు+ఇమి= పేరిమి. మేలిమి, చెలిమి, వేడిమి.

బాలవ్యాకర్త గుణవాచకాలైన 'నల్ల' మొదలైన శబ్దాలకు భావార్థంలో 'న' వర్ణకం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "నవర్ణకంబు గుణవచనంబులైన నల్లాదుల కగు"(సులభ. తద్ధిత:6) అని సూత్రీకరించి గుణవాచకాలైన 'నల్ల' మొదలైన శబ్దాలకు భావార్థంలో 'న' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'నల్ల దాని యొక్క +భావము, నల్లదాని+ యొక్క+న, నల్లదాని+న, నల్ల+న= నల్లన. తెల్లన, పచ్చన, పుల్లన, కమ్మన, చప్పన మొదలైనవి.

బాలవ్యాకర్త 'అగ్గలము' మొదలైన శబ్దాలకు భావార్థంలో 'ఇక' వర్ణకం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "ఇక వర్ణకం బగ్గలాదుల కగు"(సులభ. తద్ధిత:7) అని సూత్రీకరించి 'అగ్గలము' మొదలైన శబ్దాలకు భావార్థంలో 'ఇక' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'అగ్గలము+యొక్క+ ఇక, అగ్గలము+ఇక, అగ్గల+ఇక= అగ్గలిక. ఒమ్మిక.

ప్రౌఢవ్యాకర్త "కర వర్ణకంబు నాయఁక శబ్దమునకు భావంబు నందగు"( ప్రౌఢ.తద్ధిత:12) అని సూత్రీకరించి 'నాయఁక' శబ్దానికి భావార్థంలో 'కర' వర్ణకం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "కరవర్ణకము నాయఁకశబ్దమున కగు"(సులభ. తద్ధిత:8) అని సూత్రీకరించి 'నాయక' శబ్దానికి భావార్థంలో 'కర' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు'నాయఁక+యొక్క+కర, నాయఁక+కర, నాయఁ+కర+ము, నాయఁకర +ము=నాయఁ కరము' .

ప్రౌఢవ్యాకర్త "టివర్ణకంబొందు నంత్యవర్ణంబునకు భావంబునం దగు" (ప్రౌఢ.తద్ధిత:15) అని సూత్రీకరించి 'ఒందు' శబ్దం యొక్క చివరి వర్ణానికి భావార్థంలో 'టి' ప్రత్యయం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "టివర్ణకం బొందుశబ్దమునందలి దువర్ణంబునకగు" (సులభ. తద్ధిత:9) అని సూత్రీకరించి 'ఒందు' శబ్దంలోని చివరి అక్షరానికి బదులుగా 'టి' వర్ణకం భావార్థంలో వస్తుందని చెప్పారు. ఉదాహరణకు ' ఒందు– ఒంటి'.

బాలవ్యాకర్త 'మగటిమి' మొదలైన శబ్దాలు ప్రయోగానుసారంగా గ్రహించాలి. వీటిని చేరే తద్ధిత ప్రత్యయాలు అనేక విధాలుగా ఉంటాయని, వాటన్నింటినీ సూత్రబద్ధం చేయడం సాధ్యంకాదని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "మగఁటిమ్యాదులు యథా ప్రయోగంబుగ గ్రాహ్యంబులు"(సులభ. తద్ధిత:10) అని సూత్రీకరించి 'మగటిమి' మొదలైన శబ్దాలు యథా ప్రయోగంగా గ్రహించాలని వావిలికొలనువారు చెప్పారు. ఉదాహరణకు 'మగడు– మగటిమి', కోటరము– కోడంట్రము– కోడంట్రికము– కోడఱికము'.

## 5.3.2 స్వార్థ ప్రత్యయాలు

స్వ+ అర్థము= స్వార్థము. స్వార్థము అనగా ఒక పదానికి మొదటగా ఏ అర్థం వస్తుందో తద్దిత ప్రత్యయం చేరిన తరువాత కూడా అదే అర్థం రావడం. ఇక, ఉక, కాదు, కత్తియ వంటి ప్రత్యయాలు కొన్ని స్వార్థంలో చేరుతాయి.

బాలవ్యాకర్త 'అరమర' మొదలైన శబ్దాలకు స్వార్థంలో 'ఇక' వర్ణకం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "అరమరాదులకు స్వార్థంబునం దిక వర్ణకంబగు" (సులభ. తద్ధిత:11) అని సూత్రీకరించి 'అరమర' మొదలైన శబ్దాలకు స్వార్థంలో 'ఇక' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'అరమర+ ఇక = అరమరిక. నడవడి– నడవడిక, మెలి — మెలిక, గండి– గండిక'.

బాలవ్యాకర్త 'చిఱుత' మొదలైన శబ్దాలకు స్వార్థంలో అనగా ప్రకృతి యొక్క అర్థంలో 'ఉక' వర్ణకం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "ఉక వర్ణకంబు చిఱుతాదుల కగు"(సులభ. తద్ధిత:12) అని సూత్రీకరించి 'చిఱుత' మొదలైన శబ్దాలకు స్వార్థంలో 'ఉక' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'చిఱుత– చిఱుతుక. నాతి– నాతిక, పడతి– పడతుక, నిప్పు– నిప్పుక'.

ప్రౌఢవ్యాకర్త "వేఱున కడ వర్ణకంబు స్వార్థంబునం దగు "(ప్రౌఢ.తద్ధిత:6) అని సూత్రీకరించి 'వేఱు' శబ్దానికి 'అడ' ప్రత్యయం స్వార్థంలో వస్తుందని 'వేఱు+ అడము= వేఱడము' వంటి రూపాన్ని పేర్కొన్నారు. సులభవ్యాకర్త "అడ, యిమి, వర్ణకంబులు వేఱున కగు"(సులభ. తద్ధిత:13) అని సూత్రీకరించి 'వేఱు' శబ్దానికి 'అడ–ఇమి' అనే ప్రత్యయాలు స్వార్థంలో వస్తాయని చెప్పారు. ఉదాహరణకు 'వేఱు+ అడము= వేఱడము. వేఱు+ ఇమి= వేఱిమి'. ప్రౌఢ వ్యాకర్త 'వేఱు' శబ్దానికి 'అడ' ప్రత్యయాన్ని మాత్రమే వస్తుందని చెప్పారు. సులభ వ్యాకర్త 'ఇమి' ప్రత్యయం కూడా వస్తుందని చెప్పారు. ఇది ప్రౌఢవ్యాకరణానికి పూరణ సూత్రంగా కన్పిస్తుంది.

ప్రౌఢవ్యాకర్త "వెల్ల కడి వర్ణకంబు స్వార్థంబునం దగు "(ప్రౌఢ.తద్ధిత:7) అని సూత్రీకరించి 'వెల్ల+అడి=వెల్లడి' వంటి ఉదాహరణని పేర్కొన్నారు. సులభవ్యాకర్త కూడా "అడివర్ణకంబు వెల్ల కగు"(సులభ. తద్ధిత:14) అని సూత్రీకరించి 'వెల్ల' శబ్దానికి 'అడి' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'వెల్ల+ అడి= వెల్లడి'.

ప్రౌఢవ్యాకర్త 'తెలివి–విరివి–వినికి–లేమి–రాపు' మొదలైన శబ్దాలకు స్వార్థంలో 'ఇడి' వర్ణకం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "ఇడివర్ణకంబు తెలివి, విరివి, వినికి, లేమి, రావులకు నగు" (సులభ. తద్ధిత:15) అని సూత్రీకరించి 'తెలివి–విరివి–వినికి–లేమి–రాపు' మొదలైన శబ్దాలకు స్వార్థంలో 'ఇడి' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'తెలివిడి– విరివిడి– వినికిడి– లేమిడి– రాపిడి'.

ప్రౌఢవ్యాకర్త 'ఇంపు–బిగి–పోరు' శబ్దాలకు స్వార్థంలో 'ఇత' ప్రత్యయం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "ఇత వర్ణకం బింపు, బిగి, పోరుల కగు"(సులభ. తద్ధిత:16) అని సూత్రీకరించి 'ఇంపు– బిగి–పోరు' శబ్దాలకు ' ఇత' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'ఇంపు+ ఇతము= ఇంపితము, బిగు+ఇతము= బిగితము, పోరు+ఇతము= పోరితము'.

ప్రౌఢవ్యాకర్త "స్వార్థంబునం దిరి వర్ణకంబు వాఁపున కగు "(ప్రౌఢ. తద్ధిత:11) అని సూత్రీకరించి 'వాఁపు' శబ్దానికి స్వార్థంలో 'ఇరి' వర్ణకం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "ఇరి వర్ణకంబు వాఁపున కగు"(సులభ. తద్ధిత:17) అని సూత్రీకరించి 'వాఁపు' శబ్దానికి స్వార్థంలో 'ఇరి' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'వాఁపు+ ఇరి= వాఁపిరి.

ప్రౌఢవ్యాకర్త "కార వర్ణకంబు చెలి నయములకు భావంబునందును, నుడి కొలతలకు స్వార్థంబునందునగు. ఈకకారమునకుఁ గొన్ని యెడల గకారంబగు" (ప్రౌఢ. తద్ధిత:13) అని సూత్రీకరించి.'కార' ప్రత్యయం 'చెలి, నయము' అనే వాటికి భావార్థంలో 'నుడి, కొలత– అనే వాటికి స్వార్థంలో వస్తుందని, కొన్ని చోట్ల 'కార' కకారానికి గకారం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు ' చెలి యొక్క+కార+ము= చెలికారము. నయగారము, నుడికారము, కొలగారము' చెప్పారు.

సులభవ్యాకర్త కూడా "కార వర్ణకంబు నుడి – కొలఁత ల కగు"(సులభ. తద్ధిత:18) అని సూత్రీకరించి 'నుడి, కొలత' శబ్దాలకు స్వార్థంలో 'కార' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు ' నుడి+ కారము= నుడికారము. కొలత+ కారము= కొలగారము'. ప్రౌఢవ్యాకర్త లాగా సులభవ్యాకర్త 'చెలి– నయము' అనే శబ్దాలకు 'కార' ప్రత్యయాన్ని విధించలేదు.

ప్రౌఢవ్యాకర్త 'చలి' శబ్దానికి 'మిరి' ప్రత్యయం స్వార్థంలో వస్తుందని 'చలిమిరి' వంటి రూపాలను పేర్కొన్నారు. సులభవ్యాకర్త కూడా "మిరి వర్ణకంబు చలి కగు"(సులభ. తద్ధిత:19) అని సూత్రీకరించి 'చలి' శబ్దానికి స్వార్థంలో 'మిరి' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'చలి+ మిరి = చలిమిరి'.

బాలవ్యాకర్త "కా కత్తియలు కొండొక వానికి స్వార్థంబునం జూపట్టెడు"(బాల.తద్ధిత:13) అని సూత్రీకరించారు. పురుష వాచక శబ్దాలలో వచ్చే 'కా' ప్రత్యయం, స్త్రీ వాచక శబ్దాలలో వచ్చే 'కత్తియ' ప్రత్యయం ఆటాదులకు మతుబర్థంలో విధించబడ్డాయి. ఈ ప్రత్యయాలు కొన్ని శబ్దాలకు స్వార్థంలో కూడా వస్తాయని బాలవ్యాకర్త ఈ సూత్రాన్ని నిర్వచించారు. ఉదాహరణకు ' చెలికా+ డుజ్= చెలికాఁడు, చెలి+ కత్తియ= చెలికత్తియ'.

సులభవ్యాకర్త "కాఁడు, కత్తియలు కొండొక వానికి స్వార్థంబునం జూపట్టు"(సులభ. తద్ధిత:23) అని సూత్రీకరించారు. కాడు, కత్తియ ప్రత్యయాలు కొన్నిసార్లు స్వార్థంలో వస్తాయని

చెప్పారు. ఉదాహరణకు 'చెలికాడు– చెలికత్తియ'. 'హెగ్గడికాడు– హెగ్గడి కత్తె'. బాలవ్యాకర్త 'కా' ప్రత్యయాన్ని చెప్పి 'డుజ్' విధించగా, సులభవ్యాకర్త 'కాఁడు' ప్రత్యయం వస్తుందని చెప్పారు.

బాలవ్యాకర్త "కా వర్ణకంబు తిర్యక్కులకుం గానంబడియెడి" (బాల.తద్ధిత:14) అని సూత్రీకరించి పురుషవాచక శబ్దాలకు విధించిన 'కా' ప్రత్యయం మృగవాచకాల మీద కూడా ప్రయోగాలలో కనబడుతుందని చెప్పారు. ఉదాహరణకు 'ఇబ్బందికా+ డుజ్, ఇబ్బందిగా+డుజ్= ఇబ్బందిగాఁడు'. ఒంటిగాఁడు, కొమ్ముకాఁడు.

సులభవ్యాకర్త కూడా "కాఁడు తిర్యక్కులకుఁ గానంబడియెడి" (సులభ. తద్ధిత:24) అని సూత్రీకరించి పురుషవాచక శబ్దాలకు విధించిన 'కాడు' ప్రత్యయం మృగవాచకాల మీద కూడా ప్రయోగాలలో కనబడుతుందని చెప్పారు. ఉదాహరణకు 'ఇబ్బందికా+ డుజ్, ఇబ్బందిగా+డుజ్= ఇబ్బందిగాఁడు'. ఒంటిగాఁడు, కొమ్ముకాఁడు. బాలవ్యాకర్త 'కా' ప్రత్యయాన్ని చెప్పి 'డుజ్' విధించగా, సులభవ్యాకర్త 'కాఁడు' ప్రత్యయం వస్తుందని చెప్పారు.

బాలవ్యాకర్త "ఈ ప్రత్యయంబు కొన్నింటికి స్వార్థంబునం దగు"(బాల.తద్ధిత:16) అని సూత్రీకరించి మతుబర్థంలో విధించిన 'ఈ' ప్రత్యయం కొన్ని శబ్దాలకు స్వార్థంలో వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'మొక్కలి + ఈ + డుజ్= మొక్కలీ + డుజ్= మొక్కలీఁడు. కల్లరీఁడు.

సులభవ్యాకర్త కూడా "ఈఁడు కొన్ని యెడల స్వార్థంబునం దగు"(సులభ. తద్ధిత:26) అని సూత్రీకరించి మతుబర్థంలో విధించిన 'ఈడు' ప్రత్యయం కొన్ని శబ్దాలకు స్వార్థంలో వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'దిమ్మ+రీఁడు= దిమ్మరీఁడు. మొక్కలీఁడు. బాలవ్యాకర్త ' ఈ' అన ప్రత్యయాన్ని విధించగా సులభవ్యాకర్త ' ఈడు' ప్రత్యయాన్ని చెప్పారు.

### 5.3.3 మతుబర్థక ప్రత్యయాలు

సంస్కృత పదాలపైన 'మతుప్' ప్రత్యయం చేరే (కలది, కలవాడు) అర్థంలో తెలుగు పదాలపైన కూడా ప్రత్యయాలు చేరుతున్నాయి. వాటిని మతుబర్థకాలు అంటారు. మతుబర్థంలో కా, కత్తియ, ఈ, అరి, త, ఆడి, ఆ, అ, ఇడి, ఇద, మారి, అము మొదలైన ప్రత్యయాలు చేరుతాయి.

బాలవ్యాకర్త "కా కత్తియ వర్ణకంబులు పుంస్త్వ స్త్రీత్వంబుల మతుబర్థంబునం దాటాదుల కగు"(బాల.తద్ధిత:11) అని సూత్రీకరించి 'ఆట' మొదలైన శబ్దాలకు మతుబర్థంలో పురుష బోధకమైతే 'కా' ప్రత్యయం, స్త్రీ బోధకమైతే 'కత్తియ' ప్రత్యయం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "కాఁడు కత్తియ వర్ణకంబులు పుంస్త్వ, స్త్రీత్వంబుల మతుబర్థంబున దాటాదుల కగు" (సులభ. తద్ధిత:20) అని సూత్రీకరించి 'ఆట' మొదలైన శబ్దాలకు మతుబర్థంలో పురుష బోధకమైతే 'కాఁడు' ప్రత్యయం, స్త్రీ బోధకమైతే 'కత్తియ' ప్రత్యయం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'చెలిమి+ కాఁడు= చెలిమికాఁడు. చెలిమికత్తియ– చెలికత్తె'. బాలవ్యాకర్త పురుష బోధకానికి 'కా' ప్రత్యయం విధించగా సులభవ్యాకర్త కాఁడు' ప్రత్యయం విధించారు.

బాలవ్యాకర్త 'కా, కత్తియ' ప్రత్యయాలలోని కకారానికి, గకారం కొన్నిచోట్ల కనబడుతుంది చెప్పారు. సులభవ్యాకర్త కూడా "కాఁడు, కత్తియ, కారంబుల, కకారమునకు గకారంబు కొండొకచోఁ గానంబడియెడి"(సులభ. తద్ధిత:21) అని సూత్రీకరించి 'కాఁడు, కత్తియ' ప్రత్యయాల 'క'కారానికి, 'గ'కారం కొన్నిసార్లు వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'అందగాఁడు– అందగత్తె', 'బేరగాఁడు – బేరగత్తె'. బాలవ్యాకర్త పురుష బోధకానికి 'కా' ప్రత్యయం విధించగా సులభవ్యాకర్త కాఁడు' ప్రత్యయం విధించారు.

సులభవ్యాకర్త "కాఁడు కొండొకచోఁ దత్సమంబుల మీఁదను గానంబడియెడు" (సులభ. తద్ధిత:22) అని సూత్రీకరించారు. 'కాఁడు' ప్రత్యయం కొన్నిసార్లు తత్సమాల మీద కనబడుతున్నది. ఉదాహరణకు 'లిపికాఁడు'. కార్యగాఁడు'. బాల, ప్రౌఢ వ్యాకర్తలు ఈ విషయాన్ని చర్చించలేదు,

బాలవ్యాకర్త 'అటమటము' మొదలైన వాటికి మతుబర్థంలో 'ఈ' ప్రత్యయం పురుష బోధకాలకు వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "ఈఁడు వర్ణకంబు పుంస్త్వంబున నటమటాదుల కగు"(సులభ.తద్ధిత:25)అని సూత్రీకరించి 'అటమటము' మొదలైన వాటికి మతుబర్థంలో 'ఈడు' ప్రత్యయం పురుష బోధకాలకు వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'అటమటము+ఈడు=అటమటీఁడు'. కన్నడీఁడు, కొండీడు, ఉక్కీఁడు. బాలవ్యాకర్త 'ఈ' ప్రత్యయాన్ని విధించగా, సులభవ్యాకర్త ఈడు' ప్రత్యయాన్ని చెప్పారు.

బాలవ్యాకర్త ‘జాల’ మొదలైన శబ్దాలకు ‘అరి’ వర్ణకం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా “అరివర్ణకంబు జాలాదుల కగు”(సులభ.తద్ధిత:27) అని సూత్రీకరించి ‘జాల’ మొదలైన శబ్దాలకు ‘అరి’ వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు ‘జాలము + అరి = జాలరి. చదువరి, కల్లరి, నేరుపరి.

ప్రౌఢవ్యాకర్త ‘మతుబర్థంబున దరి వర్ణకంబు పరంబగునపుడు పూజ సొన్నముల కడయచ్చునకు వైకల్పికముగాను నిత్యముగాను దీర్ఘంబగు”(ప్రౌఢ.తద్ధిత:3) అనే సూత్రంలో ‘పూజ’ శబ్దంలో చివర అచ్చుకు వికల్పంగా ‘సొన్న’ శబ్దంలోని చివర అచ్చుకు నిత్యంగా దీర్ఘాన్ని విధించారు. సులభవ్యాకర్త ప్రత్యేకంగా సూత్రీకరించలేదు గాని “అరివర్ణకంబు జాలాదుల కగు”(సులభ. తద్ధిత:27) అనే సూత్రంలోనే పూజ, సొన్న శబ్దాల చివర అచ్చుకు దీర్ఘం వస్తుందని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ‘పూజ+అరి= పూజారి, ‘సొన్నము+ అరి, సొన్న+అరి= సొన్నారి.

బాలవ్యాకర్త ‘ఓయారము’ మొదలైన శబ్దాలకు మతుబర్థంలో ‘ఇ’ ప్రత్యయం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా “ఇవర్ణకం బోయారాదుల కగు”(సులభ. తద్ధిత:28) అని సూత్రీకరించి‘ఓయారము’ మొదలైన శబ్దాలకు ‘ఇ’ వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు ‘ఓయారము+ ఇ = ఓయారి’.

సులభవ్యాకర్త “త వర్ణకంబు కులవాచకంబునకు స్త్రీవాచ్యం బగునపు డగు”(సులభ. తద్ధిత:29) అని సూత్రీకరించారు. కులబోధకమైన స్త్రీ వాచక శబ్దాలకు మతుబర్థంలో ‘త’ ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు ‘ కొఱవ+ త= కొఱవత’. చాకిత, బోయత. ఇదే విషయాన్ని బాలవ్యాకర్త చెప్పారు.

సులభవ్యాకర్త “తవర్ణకంబు పరంబగుచో నొకానొకచో నెత్వంబు చూపట్టెడు” (సులభ. తద్ధిత:30) అని సూత్రీకరించారు. ‘ చెంచు’ మొదలైన శబ్దాలకు మతుబర్థంలో ‘త’ వర్ణకం పరమైతే ఎత్వం వస్తుంది. ఉదాహరణకు ‘ చెంచు+వు+ త= చెంచెత, మాలెత. ఇదే విషయాన్ని బాలవ్యాకర్త కూడా చెప్పారు.

ప్రౌఢవ్యాకర్త. ‘చెడుగు, దుడుకు, నిడుపు’ అనే శబ్దాలు పుంలింగ బోధకాలైనప్పుడు మతుబర్థంలో ‘అ’ ప్రత్యయం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా అదే విషయాన్ని“చెడుగు–

దుదుకు–నిదుపులకుఁ బుంస్త్వంబునం దకారం బగు" (సులభ. తద్ధిత:31) అని సూత్రీకరించారు. ఉదాహరణకు 'చెదుగు+అ+ దుజ్= చెదుగదు'. దుదుకదు, నిదుపదు'.

సులభవ్యాకర్త "యువతి–విటీ– రజస్వలలు గుబ్బెత–మిండత–ముట్టుతలు నాఁబడుదురు" (సులభ. తద్ధిత:32) అని సూత్రీకరించారు. ప్రాయపు స్త్రీ 'గుబ్బెత' అని, విటకత్తె 'మిండత' అని, ముట్టైన స్త్రీ 'ముట్టుత' అని అంటారని సులభ వ్యాకర్త చెప్పారు. గుబ్బ, మిండ, ముట్టులకు మతుబర్థంలో తవర్ణకం, 'గుబ్బ' కు ఎత్వం వస్తుంది. ఉదాహరణకు ' గుబ్బెత+ ము= గుబ్బెత'. మిండ+త= మిండత. ఇదే విషయాన్ని బాలవ్యాకర్త కూడా చెప్పారు.

బాలవ్యాకర్త "వగాదులకు బహువచనాంతంబులకు స్త్రీవాచ్యంబగునపుడు మత్వర్థంబునం దాఁడి వర్ణకంబగు","వగాదులకు బహువచనాంతం బులకుఁ బుంస్త్వంబున మతుబర్థంబాకారం బగు" (బాల.తద్ధిత:22,23) అని రెండు సూత్రాలలో బహువచనాంతాలైన 'వగ' మొదలైన శబ్దాలకు స్త్రీ వాచకాన్ని బోధించేటప్పుడు మతుబర్థంలో 'ఆడి' ప్రత్యయాన్ని, పురుష వాచకాన్ని బోధించేటప్పుడు మతుబర్థంలో 'ఆ' ప్రత్యయం వస్తుందని చెప్పారు.

సులభవ్యాకర్త బాలవ్యాకర్త రెండు సూత్రాలలో చెప్పిన విషయాన్ని "వగాదులకు బహువచనాంతంబులకుఁ బుంస్త్వంబునం దాఁడును, స్త్రీవాచ్యం బగునపు డాఁడియు నగు" (సులభ. తద్ధిత:33) అని ఒకే సూత్రంలో చెప్పారు. 'వగ' మొదలైన శబ్దాలు బహువచనాంతములై పురుష వాచకాన్ని బోధించేటప్పుడు 'ఆదు' ప్రత్యయం, స్త్రీ వాచకాన్ని బోధించేటప్పుడు 'ఆఁడి' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు 'వగలాఁడు– వగలాఁడి', మాయలాడి'. బాలవ్యాకర్త 'వగ' మొదలైన శబ్దాలు బహువచనాంతములై పురుష వాచకాన్ని బోధించేటప్పుడు 'ఆ' ప్రత్యయం వస్తుందని చెప్పగా, సులభవ్యాకర్త ' 'ఆఁడు' ప్రత్యయం వస్తుందని చెప్పారు.

సులభవ్యాకర్త పై సూత్ర వివరణలో పుంలింగ ప్రత్యయం 'ఁడు అని, ఉచ్చారణ సౌలభ్యం కోసం 'ఆ' చేరి 'ఆఁడు' అయిందని చెప్పారు. సంస్కృతంలో ఉండే స్త్రీలింగ ప్రత్యయమైన 'ఇ' పరంగా వచ్చి ' ఆఁడి' అయిందని గ్రహించాలని చెప్పారు. ఈ 'ఆఁడు' ప్రత్యయం 'వాఁడు– కాఁడు మొదలైన శబ్దాలలో ఉన్నప్పటికీ అక్కడ ' వాఁడి– విలుకాఁడి' అని స్త్రీలింగ రూపాలు రావని సులభవ్యాకర్త చెప్పారు.

బాలవ్యాకర్త .'ముక్కు' మొదలైన శబ్దాలకు 'లేమి' అనే అర్థాన్ని తెలిపే సందర్భంలో 'ఇడి' ప్రత్యయం మతుబర్థంలో వస్తుందని చెప్పారు. అదే విషయాన్ని సులభవ్యాకర్త "ముక్కులోనగువానికి వాని లేమిని దెలుపుచో నిఁడివర్ణకం బగు" (సులభ. తద్ధిత:34) అని సూత్రీకరించారు.' ఉదాహరణకు 'ముక్కు+ ఇడి = ముక్కిడి. సిగ్గిడి, ఉప్పిడి'.

సులభవ్యాకర్త " 'ఇ' వర్ణకంబు కొన్ని చోటుల లేమిని దెలుపును" (సులభ. తద్ధిత:35) అని సూత్రీకరించారు. కొన్ని శబ్దాలకు 'ఇ' వర్ణం పరమైనపుడు అది 'లేమి' ని తెలిపేదిగా ఉంటుంది. ఉదాహరణకు ' గ్రుడ్డు+ఇ= గ్రుడ్డి. కొన్నిచోట్ల 'గల' అనే అర్థాన్ని కూడా తెలుపుతుందని చెప్పారు. ఉదాహరణకు ' నల్ల+ ఇ= నల్లి. ఇక్కడ నల్ల అనగా రక్తము అని అర్థం. బాల, ప్రౌఢ వ్యాకర్తలు ఇద్దరు ఈ విషయాలను చర్చించలేదు.

సులభవ్యాకర్త "కలయను నర్థంబున 'అ' యగు"(సులభ.తద్ధిత:36) అని సూత్రీకరించారు. 'కల' అనే అర్థంలో 'అ' అనే వర్ణం వస్తుంది. ఉదాహరణకు 'చెలువు+ అ= చెలువ. దున్ను+ అ= దున్న. బాల. ప్రౌఢ వ్యాకర్తలు ఈ విషయాన్ని చర్చించలేదు.

ప్రౌఢవ్యాకర్త మతుబర్థంలో కొన్నిసార్లు 'న'వర్ణకం కనబడుతుందని చెప్పారు. అదే విషయాన్ని సులభవ్యాకర్త "మతుబర్థంబున నవర్ణకం బెందేనియగు" (సులభ. తద్ధిత:41) అని సూత్రీకరించారు. ఉదాహరణకు 'దివ్య తేజ+ము +న, దివ్యతేజంబున+ ము+వా+డుజ్= దివ్యతేజంబున వాఁడు, దివ్యతేజంబుగల వాఁడు'. సులభ వ్యాకర్త ఈ సూత్రంలోనే వివరణలో స్వభావాన్ని తెలిపేటప్పుడు ఏర్పడే తద్ధిత రూపాలను, కొన్ని విశేషరూపాలను పేర్కొని, ఇవి మహాకవుల ప్రయోగాలను బట్టి తెలుసుకోవాలని సూచించారు. ఉదాహరణకు 'మంటమారి, తంటలమారి, తిండిపోతు, నిదురపోతు, అడపము, పెండ్లము. బాల వ్యాకర్త ఈ వివరణలో చెప్పిన విషయాలను "అర్థవిశేషంబుల వర్ణకాంతరంబులును మహత్ప్రయోగంబుల నెఱుంగునది"( బాల. తద్ధిత:28) అనే సూత్రంలో చెప్పారు.

## 5.3.4 పరిమాణ– దఘ్న – ప్రాచుర్యార్థకాలు

పరిమాణ– దఘ్న – ప్రాచుర్యార్థాన్ని తెలిపే పదాలపైన వచ్చే తద్దిత ప్రత్యయాలను ఇక్కడ పేర్కొనడం జరిగింది.

బాలవ్యాకర్త పరిమాణార్థంలో ఏక వచనాంత శబ్దాల మీద 'ఎఁడు' ప్రత్యయం చేరుతుందని 'తూము+వు + ఎఁడు = తూమెఁడు' వంటి రూపాలను సాధించారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త "పరిమాణార్థంబునఁ బ్రథమైక వచనంబునంద యెఁడు వర్ణకం బగు" (సులభ. తద్ధిత:37) అని సూత్రీకరించారు. పరిమాణార్థకమై, ప్రథమా విభక్తి ఏకవచనంలోని శబ్దంపైన 'ఎఁడు' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు 'కుంచము+ ఎఁడు = కుంచెఁడు.

బాలవ్యాకర్త 'ఎఁడు' ప్రత్యయం పరమైనప్పుడు మానార్థక శబ్దం చివర ఉన్న 'లి' వర్ణం లోపిస్తుందని "కమికిలి+ ఎడు = కమికెఁడు'. వంటి రూపాలను సాధించారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త "ఎఁడువర్ణకము పరంబగునపుడు లివర్ణము లోపించు" (సులభ. తద్ధిత:38) అని సూత్రీకరించారు. ఎఁడు' వర్ణకం పరమైనప్పుడు పూర్వ పదాంతంలో ఉన్న 'లి' వర్ణం లోపిస్తుంది. ఉదాహరణకు "కమికిలి+ ఎఁడు = కమికెఁడు'. పట్టిలి+ఎఁడు= పట్టెఁడు'.

బాలవ్యాకర్త "దఘ్నార్థంబున బంటి కొలఁదులగు"(బాల.తద్ధిత:27) అని సూత్రీకరించారు. సంస్కృతంలో 'దఘ్నచ్' ప్రత్యయం లోతును తెలపుతుంది.ఈ అర్థంలో తెలుగు శబ్దాలకు 'బంటి, కొలది' అనే ప్రత్యయాలు చేరుతాయని మోఁకాలు+ వు+ బంటి= మోఁకాలి బంటి', మోఁకాలి కొలది' వంటి రూపాలను సాధించారు. సులభవ్యాకర్త "దఘ్నార్థంబున బంటి-కొలఁదు లు సర్వత్ర యగు" (సులభ. తద్ధిత:39) అని సూత్రీకరించి 'బంటి, కొలది' అనే ప్రత్యయాలు తెలుగు శబ్దాలకు మాత్రమే కాకుండా, తత్సమ శబ్దాల మీదను వస్తాయని చెప్పారు. ఉదాహరణకు ' మోకాలిబంటి, మోకాటి కొలది'. తత్సమానికి ఉదాహరణ ' కటిబంటి'.

బాలవ్యాకర్త ధఘ్నార్థంలో 'బంటి- కొలఁది' ప్రత్యయాలు ఆచ్ఛిక పదాలపైన వస్తాయని చెప్పారు. ప్రౌఢ వ్యాకర్త 'బంటి' ప్రత్యయాన్ని మాత్రమే తత్సమ పదాలలో వస్తుందని చెప్పారు. సులభ వ్యాకర్త ఆచ్ఛిక పదాలతో పాటుగా తత్సమ పదాలలో కూడా 'బంటి, కొలది' ప్రత్యయాలు వస్తాయని చెప్పారు. ఇది బాల, ప్రౌఢ వ్యాకరణాలకు పూరణ సూత్రం.

ప్రౌఢవ్యాకర్త ప్రాచుర్యార్థంలో సంస్కృత 'మయట్' ప్రత్యయం అచ్చ తెలుగు పదాలపైన కూడా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'తన యొక్క+మయ+ము= తనమయము'. ప్రాచూర్యం' అంటే విస్తరించి ఉండటం అని అర్థం. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త "ప్రాచుర్యార్థంబునం దెనుఁగు

పదంబుల మీఁదను మయట్ ప్రత్యయము చూపట్టెడు" (సులభ. తద్ధిత:40) అని సూత్రీకరించారు. ప్రాచుర్యార్థాన్ని తెలిపే 'మయట్' అనే సంస్కృత ప్రత్యయం, తెలుగు పదాలపైన కూడా వస్తుంది. ఉదాహరణకు 'తనమయము– తమమయము'.

## 5.4 కృదంత పదాల నిర్మాణం

ధాతువు నుండి నామవాచకాన్ని నిష్పత్తి చేసే విధానానికి 'కృత్ వృత్తి' అని పేరు. ఇలా నామపద నిష్పత్తి కోసం ధాతువు మీద చేరే ప్రత్యయాన్ని 'కృత్' ప్రత్యయం లేదా 'కృత్తు' అంటారు. బాలవ్యాకర్త కృత్తులను నిర్వచిస్తూ "దుఞ్భిన్న ప్రత్యయంబు కృత్తు నాఁబడు" అని ధాతువుకు విధించబడు దుఞ్–రు;వు–రు; ను–ము, అనే ప్రత్యయాలు కాక మిగిలిన ప్రత్యయాలను కృత్తులు అంటారని, అవి చేరి ఏర్పడే రూపాలను కృదంతాలని చెప్పారు. కృత్తులకు అర్థాలను ప్రయోగానుసారంగా గ్రహించాలని బాలవ్యాకర్త మొదటి సూత్రంలో చెప్పారు. 'కృత్' ప్రత్యయాలు చేరేటప్పుడు ధాతువుల చివర ఉండే ప్రత్యయాలు కొన్ని లోపిస్తాయని తరువాత సూత్రంలో చెప్పి మిగిలిన సూత్రాలలో ధాతువుకు వచ్చి చేరే కృత్ ప్రత్యయాలను చర్చించారు.

ధాతువుల నుంచి ఏర్పడే నామవాచకాలని కృదంతాలు అంటారని సులభవ్యాకర్త మొదటి సూత్రంలో నిర్వచించారు. "ధాతువుల వలన గలుగు నామవాచకములు కృదంతములు" (సులభ. కృదంత:1). ఈధాతువుల మీద చేరే ప్రత్యయాలను కృత్తులు అంటారని రెండవ సూత్రంలో చెప్పారు. "ఈ నిమిత్తమై ధాతువులకు జేర్పబడు ప్రత్యయములు కృత్తులు"(సులభ.కృదంత:2). అంతేకాకుండా 'కృత్' ప్రత్యయాలు చేరేటప్పుడు ధాతువుల చివర ఉండే ప్రత్యయాలు కొన్ని లోపిస్తాయని తరువాత సూత్రంలో వావిలికొలనువారు చెప్పారు.

సులభవ్యాకర్త "ఇట్లు కృత్తులయిన క గ త ప వ ఇమి పరమైనపుడు ధాతువుల కడపట నుండు క గ చ య వ–లకు లోపంబగు" (సులభ.కృదంత:3) అని సూత్రీకరించారు. కృత్ ప్రత్యయాలైన క, గ, త, ప,వ, ఇమి ప్రత్యయాలు పరమైనపుడు ధాతువు చివర ఉండే క, గ, చ, య, వ లకు లోపం వస్తుంది. ఇదే విషయాన్ని బాలవ్యాకర్త కూడా చెప్పారు.

## 5.4.1 కృత్ ప్రత్యయాలు

బాలవ్యాకర్త "కవర్ణకం బలుగ్వాదుల కగు"(బాల. కృదంత:3) అని సూత్రీకరించి 'అలుగు' మొదలైన ధాతువులు నామవాచకాలైనప్పుడు 'క' ప్రత్యయం వస్తుందని చెప్పారు. ఉదాహరణగా 'అలుగు+క= అలుక' వంటి రూపాన్ని పేర్కొన్నారు. బాలవ్యాకర్త సూత్ర వివరణలో మూడు నియమాలు బాలవ్యాకర్త చెప్పారు . మొదటిది "ఇట బిందు లోపంబు' అన్న వాక్యానికి ఉదాహరణలు ' ఎఱుఁగు+క= ఎఱుక. రెండవది 'ఇక–క–పు' ప్రత్యయాలు పరమైనపుడు 'కను' ధాతువుకు దీర్ఘం వస్తుంది. ఉదాహరణకు 'కను+క =కాను+క=కానుక. మూడవది కినియు, ముదియులకు ఉత్వం వస్తుంది. ఉదాహరణకు 'కినియు +క= కిని+క= కినుక, ముదియు+క= ముది+క= ముదుక.

సులభవ్యాకర్త కూడా "కవర్ణకం బలుగ్వాదుల కగు"(సులభ.కృదంత:4) అని సూత్రీకరించి 'అలుగు' మొదలైన ధాతువులు నామవాచకాలుగా మారుతున్నప్పుడు 'క' ప్రత్యయం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు ' అలుగు– అలుక' నడచు– నడక'. సులభ వ్యాకర్త కూడా పై సూత్ర వివరణలో బాలవ్యాకర్త చెప్పిన నియమాలనే చెప్పారు . మొదటిది "ఇట్లుకొన్ని శబ్దంబులందు బిందువు లోపంబగు' అన్న వాక్యానికి ఉదాహరణలు 'కడఁగు+క= కడక. రెండవది 'కను' ధాతువుకు 'ఇక, క, పు–లు  పరమైనపుడు 'క' కు దీర్ఘంబగు. ఉదాహరణకు 'కను+క =కాను+క=కానుక. మూడవది 'కినియు, ముదియులకు ఉత్వం వస్తుంది'. ఉదాహరణకు 'కినియు +క= కిని+క= కినుక, ముదియు+క= ముది+క= ముదుక.

బాలవ్యాకర్త 'కలుగు' మొదలైన శబ్దాలకు 'ఇమి' వర్ణకం వస్తుందని 'కలిమి– నేరుమి'. వంటి ఉదాహరణాలను పేర్కొన్నారు. సులభవ్యాకర్త కూడా "ఇమి వర్ణకంబు కలుగ్వాదుల కగు" (సులభ.కృదంత:5) అని సూత్రీకరించారు. 'కలుగు' మొదలైన శబ్దాలకు 'ఇమి' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' కలుగు– కలిమి', నేరుచు– నేరుమి'.

బాలవ్యాకర్త 'చేయు' మొదలైన ధాతువులకు 'తజ్' వర్ణకం వస్తుందని 'చేఁత– పూఁత' వంటి రూపాలను పేర్కొన్నారు. సులభవ్యాకర్త కూడా "తజ్వర్ణకంబు చేయ్వాదుల కగు" (సులభ.కృదంత:6) అని సూత్రీకరించారు. 'చేయు' మొదలైన ధాతువులకు 'తజ్' వర్ణకం వస్తుంది.

ఉదాహరణకు 'చేయు– చేత' . పూయు– పూత'. 'చేయు+తజ్= చే+తజ్=చేఁత'. 'పూయు+ తజ్= పూ+తజ్=పూఁత.

బాలవ్యాకర్త "కువ వర్ణకం బడంగ్వాదుల కగు "(బాల. కృదంత:6) అని సూత్రీకరించారు. 'అడఁగు' మొదలైన ధాతువులకి 'కువ' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు 'అడఁగు+కువ= అడఁకువ'.

సులభవ్యాకర్త "కువ వర్ణకం బడఁగ్వాదుల కగు" (సులభ.కృదంత:7) అని సూత్రీకరించారు 'అడఁగు' మొదలైన ధాతువులకి 'కువ' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' అడఁగు– అడఁకువ'. 'లోఁగు– లోఁకువ'

బాలవ్యాకర్త "ట వర్ణకం బాడ్వాదులకగు నగుచో నంత లోపంబగు "(బాల. కృదంత:7) అని సూత్రీకరించారు. 'ఆడు' మొదలైన ధాతువులకు 'ట' అనే కృత్ ప్రత్యయం వస్తుంది. అలా వచ్చే సందర్భాలలో ధాతువు చివర అక్షరం లోపిస్తుంది. ఉదాహరణకు ' ఆడు+ట=ఆట' , పాడు+ట= పాట'. సులభవ్యాకర్త కూడా "టవర్ణకం బాడ్వాదుల కగు. అగుచో నంత లోపం బగు" (సులభ.కృదంత:8) అని సూత్రీకరించారు. 'ఆడు' మొదలైన ధాతువులకి 'ట' వర్ణకం వస్తుంది. అలా వచ్చే సందర్భాలలో పదాంతంలో ఉండే ' డు' మొదలైన వర్ణాలు లోపిస్తాయి. ఉదాహరణకు ' ఆడు– ఆట' , పాడు– పాట'.

బాలవ్యాకర్త 'పడు' మొదలైన ధాతువులకు 'టు' అనే కృత్ ప్రత్యయం వస్తుంది. అప్పుడు ధాతువులోని తొలి అక్షరం తప్ప మిగిలినవన్నీ లోపిస్తాయి. అలా మిగిలిన ఆ తొలి అక్షరానికి దీర్ఘం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు ' పడు+టు= పాటు' , చెడు+టు= చేటు. సులభవ్యాకర్త కూడా "టువర్ణకంబు పడ్వాదుల కగు. అగుచో నవి యాద్యక్షర శేషంబు లయి దీర్ఘంబు నొందు" (సులభ.కృదంత:9) అని సూత్రీకరించారు. 'పడు' మొదలైన ధాతువులకి ' టు' వర్ణకం వస్తుంది. అలాంటి సందర్భాలలో ఆద్యక్షర శేషమై దీర్ఘం పొందుతాయి. ఉదాహరణకు ' పడు– పాటు' , చెడు –చేటు.

బాలవ్యాకర్త 'తిరియు' మొదలైన ధాతువులకు 'ప' అనే కృత్ ప్రత్యయం వస్తుందని చెప్పారు. 'తిరిపము– పొలపము' వంటి రూపాలను ఉదాహరణలుగా ఇచ్చారు. సులభవ్యాకర్త "పము వర్ణకంబు తిరియ్వాదుల కగు" (సులభ.కృదంత:10) అని సూత్రీకరించారు. 'తిరియు' మొదలైన

ధాతువులకి 'పము' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'తిరియు– తిరిపము', కలయు– కలపము'. బాలవ్యాకర్త కేవలం 'ప' వర్ణాన్ని విధించగా సులభవ్యాకర్త 'పము' వర్ణకం విధించారు.

బాలవ్యాకర్త 'ఆవులించు' మొదలైన ధాతువులకి 'త' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణగా 'ఆవులింత– కుసిలింత'. వంటి రూపాలను పేర్కొన్నారు. సులభవ్యాకర్త కూడా "తవర్ణకం బావులించు లోనగువాని కగు" (సులభ.కృదంత:11) అని సూత్రీకరించారు. 'ఆవులించు' మొదలైన ధాతువులకి 'త' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' ఆవులించు– ఆవులింత'. కుసిలించు– కుసిలింత'.

బాలవ్యాకర్త 'మాయు' మొదలైన ధాతువులకి 'పు' వర్ణకం వస్తుందని. ఉదాహరణగా 'మాపు–మేపు' వంటి రూపాలను పేర్కొన్నారు. సులభవ్యాకర్త కూడా "పువర్ణకంబు మాయ్వాదులు కగు" (సులభ.కృదంత:12) అని సూత్రీకరించారు. 'మాయు' మొదలైన ధాతువులకి 'పు' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' మాయు+ పు= మాపు. 'మేయు– మేపు'.

బాలవ్యాకర్త "ఇక వర్ణకం బంజ్వాదుల కగు "(బాల. కృదంత:12) అని సూత్రీకరించారు. 'అంజు' మొదలైన ధాతువులకు 'ఇక' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు ' అంజు + ఇక = అంజిక. 'ఓడు+ఇక = ఓడిక'. సులభవ్యాకర్త కూడా "ఇఁక వర్ణకం బంజ్వాదుల కగు"(సులభ.కృదంత:13) అని సూత్రీకరించారు. 'అంజు' మొదలైన ధాతువులకి 'ఇక' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' అంజు + ఇక = అంజిక. 'ఓడు– ఓడిక'.

బాలవ్యాకర్త "అప్పాదులకు నజి యగు"(బాల. కృదంత:13) అని సూత్రీకరించారు. 'అప్ప' మొదలైన ధాతువులకు ' నజి' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు' అప్ప+నజి= అప్పన'. వీచు+నజి= వీవన'. సులభవ్యాకర్త కూడా "అప్పాదులకు నజి యగు" (సులభ.కృదంత:14) అని సూత్రీకరించారు. 'అప్ప' మొదలైన ధాతువులకి ' నజి' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు' అప్ప– అప్పన'. వీచు– వీవన'.

బాలవ్యాకర్త "బడి యేల్వాదుల కగు "(బాల. కృదంత:14) అని సూత్రీకరించారు. 'ఏలు' మొదలైన ధాతువులకి 'బడి' అనే కృత్ ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు 'ఏలు+ బడి', కట్టు+బడి= కట్టు బడి'. సులభవ్యాకర్త కూడా "బడి యేల్వాదుల కగు" (సులభ.కృదంత:15) అని

సూత్రీకరించారు. 'ఏలు' మొదలైన ధాతువులకి 'బడి' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' ఏలుబడి', కట్టుబడి, తీరుబడి'.

బాలవ్యాకర్త "గడ చేర్వాదుల కగు"(బాల. కృదంత:15) అని సూత్రీకరించారు. చేరు' మొదలైన ధాతువులకి 'గడ' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు ' చేరు+ గడ= చేరుగడ, తిరుగు+గడ=తిరుగడ. సులభవ్యాకర్త కూడా "గడ చేర్వాదుల కగు" (సులభ.కృదంత:16) అని సూత్రీకరించారు. 'చేరు' మొదలైన ధాతువులకి 'గడ' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' చేరుగడ, మనుగడ, పన్నుగడ'.

బాలవ్యాకర్త "ఇకి కోర్వాదుల కగు "(బాల. కృదంత:16) అని సూత్రీకరించారు.'కోరు' మొదలైన ధాతువులకి 'ఇకి' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' కోరు+ ఇకి= కోరికి. పూను+ఇకి= పూనికి', పోలికి, వినికి. సులభవ్యాకర్త కూడా "ఇకి కోర్వాదుల కగు" (సులభ.కృదంత:17) అని సూత్రీకరించారు.'కోరు' మొదలైన ధాతువులకి 'ఇకి' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' కోరు+ ఇకి= కోరికి. పూనికి, పోలికి, వినికి.

బాలవ్యాకర్త "వు వర్ణకంబు మన్వాదుల కగు "(బాల. కృదంత:17) అని సూత్రీకరించారు. 'మను' మొదలైన ధాతువులకి 'వు' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు 'మను+వు= మనువు', కాచు +వు= కావు. సులభవ్యాకర్త కూడా "వువర్ణకంబు మన్వాదుల కగు" (సులభ.కృదంత:18) అని సూత్రీకరించారు. 'మను' మొదలైన ధాతువులకి' వు' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు 'మను– మనువు', చచ్చు– చావు'.

బాలవ్యాకర్త "అవర్ణకంబు గీఱ్వాదుల కగు"(బాల. కృదంత:18) అని సూత్రీకరించారు. 'గీఱు' మొదలైన ధాతువులకు 'అ' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' గీఱు+ అ= గీఱ'. ఎండ, కాయ, చదియ. సులభవ్యాకర్త కూడా "అవర్ణకంబు గీర్వాదుల కగు" (సులభ.కృదంత:19) అని సూత్రీకరించారు. 'గీఱు' మొదలైన ధాతువులకి ' అ' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' గీఱు+ అ = గీఱ. ఎండ, కాయ, చదియ.

బాలవ్యాకర్త "అక వర్ణకంబు మాఱ్వాదులకగు"(బాల. కృదంత:19) అని సూత్రీకరించారు. 'మాఱు' మొదలైన ధాతువులకు 'అక' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు 'మాఱు+అక+ము=

మాఱకము', 'అమ్ము+అక+ము= అమ్మకము'. సులభవ్యాకర్త కూడా "అకవర్ణకంబు మార్వాదుల కగు" (సులభ.కృదంత:20) అని సూత్రీకరించారు. 'మాఱు' మొదలైన ధాతువులకి ' అక' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' మాఱు– మాఱకము', 'అమ్ము– అమ్మకము'.

బాలవ్యాకర్త "దువర్ణకం బాఱ్వాదులకగు నగునపుడు పకారంబు చయలకగు"(బాల. కృదంత:20) అని సూత్రీకరించారు. 'ఆఱు' మొదలైన ధాతువులకు 'డు' వర్ణకం వస్తుంది. అలాంటి సందర్భంలో 'చ, య' లకు 'ప' కారం ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు 'ఆఱు+దు=ఆఱుడు, త్రోచు+డు= త్రోపు+డు= త్రోపుడు'. సులభవ్యాకర్త కూడా "దువర్ణకం బార్వాదుల కగు. అగునపుడు 'ప' కారంబు చ య ల కగు" (సులభ.కృదంత:21) అని సూత్రీకరించారు. 'ఆఱు' మొదలైన ధాతువులకు 'డు' వర్ణకం వస్తుంది. అలాంటి సందర్భంలో 'చ, య' లకు 'ప' కారం ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు 'ఆఱు+దు=ఆఱుడు, త్రోచు+డు= త్రోపు+డు= త్రోపుడు'.

బాలవ్యాకర్త "ఉవర్ణకం బదుక్వాదుల కగు"(బాల. కృదంత:21) అని సూత్రీకరించారు. 'అదుకు' మొదలైన ధాతువులకి 'ఉ' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' అదుకు+ఉ= అదుకు. అంటు+ఉ =అంటు'. సులభవ్యాకర్త"ఉవర్ణకం బదు క్వాదుల కగు" (సులభ.కృదంత:22)అని సూత్రీకరించారు. 'అదుకు' మొదలైన ధాతువులకి ' ఉ' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' అదుకు– అంటు', ఒప్పు, ఒసగు.

బాలవ్యాకర్త "వడి ప్రభృతు లిట్లెఱుంగునది"(బాల. కృదంత:22) అని సూత్రీకరించారు. 'వడి' మొదలైన ప్రత్యయాలు ధాతువులపైన చేరే విధానాన్ని మహా కవులు ప్రయోగాలను బట్టి తెలుసుకోవాలని బాలవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ' కొలు+వడి, నడవడి, విరియు+వి=విరివి. సులభవ్యాకర్త కూడా "వడిలోనైన విట్లెఱుంగునది" (సులభ. కృదంత:23) అని సూత్రీ కరించారు .'వడి' మొదలైన ప్రత్యయాలు ధాతువులపైన చేరే విధానాన్ని మహా కవులు ప్రయోగాలను బట్టి తెలుసుకోవాలని చివరి సూత్రాన్ని వావిలికొలనువారు చెప్పారు. ఉదాహరణకు 'కొలువడి, నడవడి, లేమిడి.

ప్రౌఢ వ్యాకర్త ఐదు సూత్రాలలో విధించిన కృత్ ప్రత్యయాలను(ఇడి, ఎన, పుర, మతి, వలి) కూడా సులభ వ్యాకర్త "వడిలోనైన విట్లెఱుంగునది"(సులభ. కృదంత:23) ఈ సూత్రంలోనే

చెప్పారు. ఉదాహరణకు 'రాయు+ఇడి= రాయుడి, ఈర్చు+ఎన= ఈర్పు+ఎన= ఈర్పెన, కాఁచు+పుర+ము=కాఁపురము, 'ఎక్కు+మతి= ఎగుమతి, కాచు+వలి= కావలి'. పై ఉదాహరణలలకు ప్రౌఢ వ్యాకర్త చెప్పిన ఐదు సూత్రాలు.

i. "రాయున కిడి వర్ణకంబు నగు"(ప్రౌఢ. కృదంత: 2),
ii. "ఈర్చుబ్బుకందుదువ్వు వడ్డించుల కెన వర్ణకంబగు; అగుచో ఈర్చు ఉబ్బుల చకార బకారంబులు పకారంబులగు; వడ్డించు నించు లుప్తంబగు. "(ప్రౌఢ. కృదంత:3)
iii. "పురవర్ణకంబు కాఁచు దాఁచు దాయ్యాదులకగు" (ప్రౌఢ. కృదంత: 4)
iv. "ఎక్కు దిగులకుం బ్రేరణార్థంబున మతి వర్ణకంబగు. అగుచో నెగు ఎక్కువ కాదేశంబగు"(ప్రౌఢ. కృదంత: 5)
v. "కాచు వీచులకు వలి వర్ణకంబగు"(ప్రౌఢ. కృదంత: 7)

ఆధునిక కృతులలో 'ఆరగింపు, ముగింపు' మొదలైన 'ఇంపు' అనే కృత్ ప్రత్యయాలు అంతంగా గల రూపాలు కన్పిస్తున్నాయని సులభ వ్యాకర్త ఈ సూత్ర వివరణలో పేర్కొన్నారు.

## 5.5 ప్రకీర్ణకంలోని విశేషాంశాలు

ముందు పరిచ్ఛేదాలలో చెప్పగా మిగిలిన కొన్ని భాషారూపాల ప్రక్రియలను ప్రతిపాదించేది ప్రకీర్ణక పరిచ్ఛేదం. ప్రధానంగా ఆచ్చిక శబ్దాలలో కలిగే ధ్వనుల మార్పులు ఈ పరిచ్ఛేదంలో వావిలికొలనువారు చెప్పారు. ఈ పరిచ్ఛేదంలో 17 సూత్రాలు ఉన్నాయి.

బాలవ్యాకర్త "పదాద్యంబులు ఋ ౠ వర్ణంబులు రల తుల్యంబులు"(బాల.ప్రకీర్ణక:1) అని సూత్రీకరించారు. పదాదిలో వచ్చే ఋ ౠ వర్ణాలు రకార లకారాలతో సమానం. రలలు స్థిరాక్షరాలు కాబట్టి పదాదిలో ఉండే ఋ ౠ వర్ణాలు స్థిరాక్షరాలు వంటివే అవుతాయి. సంధి జరిగేటప్పుడు వీటిని అచ్చుల్లాగ పరిగణించకూడదు. వీటిని హల్లులుగా భావించి సంధి కార్యాలు చేయాలి. 'అతఁడు ఋషి ,ఆఋషి, వచ్చె ఋషి– వచ్చెన్ ఋషి– వచ్చెను ఋషి' వంటి రూపాలను ఈ సూత్రం ద్వారా బాల వ్యాకర్త సాధించారు.

సులభవ్యాకర్త కూడా "పదాద్యంబులు ఋ ౠ వర్ణంబులు, ర ల తుల్యంబులు" (సులభ. ప్రకీర్ణక:1) అని సూత్రీకరించారు. పదంలో మొదట అక్షరాలుగా ఉండే ఋ ౠ వర్ణాలు రకార,

లకారాలతో సమానం. అనగా ఋ ౠ అచ్చులైనను వాటికి సంధి కార్యాలు చేసేటప్పుడు హల్లులైన 'ర-ల' లు పరమైనపుడు ఎటువంటి కార్యాలు జరుగుతాయో అటువంటి కార్యాలు వీటికి కూడా వర్తిస్తాయని సులభ వ్యాకర్త చెప్పారు . ఉదాహరణకు ' అతఁడు ఋషి , ఆ ఋషి . వచ్చెన్ ఋషి, వచ్చెను ఋషి'.

## 5.5.1 ఆచ్ఛిక పదాలలో ధ్వనులు మార్పులు

బాలవ్యాకర్త "ఆచ్ఛిక పదంబులం దుత్తమంబులగు రులుడు ల ముందఱి యేత్వంబునకు హ్రస్వంబు విభాషనగు"(బాల.ప్రకీర్ణక:2) అని సూత్రీకరించారు. మూడు అక్షరాల పదాలలో చివరి అక్షరంలోని అచ్చు ఉత్తమం. ఆచ్ఛిక పదాలలో ఉత్తమాలైన రు, లు, డు వర్ణాలకు ముందున్న ఏకారానికి వికల్పంగా హ్రస్వం వస్తుంది. ఉదాహరణకు ' నల్లేరు-నల్లెరు,పెన్నేరు-పెన్నెరు'

సులభవ్యాకర్త కూడా "ఆచ్ఛికపదంబులం దుత్తమంబులగు, రు లుడు ముందఱి యేత్వంబునకు హ్రస్వంబు విభాష నగు" (సులభ. ప్రకీర్ణక:2) అచ్చ తెలుగు పదాల చివర వర్ణం 'రులుడు' లో ఏదైన అక్షరం ఉత్తమాలుగా ఉంటే దానికి ముందు ఉన్న ఏకారానికి హ్రస్వం వికల్పం వస్తుంది. ఉదాహరణకు ' గన్నేరు- గన్నెరు' , పల్లేరు- పల్లెరు'.

బాలవ్యాకర్త "ఊయేల యూయాలల చాఁపుల నొండొంటికిం గుఱుచ యొండె నగు" (బాల.ప్రకీర్ణక:4) అని సూత్రీకరించారు. 'ఊయేల- ఊయాల' అనే శబ్దాలలో గల దీర్ఘానికి ఒక్కొక్కదానికి హ్రస్వరూపం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ' ఊయేల- ఉయేల- ఊయెల', ఊయాల- ఉయాల- ఊయల'. యకారానికి ద్విత్వం వస్తే 'ఉయ్యేల-ఉయ్యెల,ఉయ్యాల- ఉయ్యల' రూపాయలు ఏర్పడతాయి.

సులభ వ్యాకర్త కూడా "ఊయేల, యూయాలల చాఁపుల నొండొంటికిం గుఱుచ యొండె నగు" (సులభ. ప్రకీర్ణక:3) అని సూత్రీకరించారు. 'ఊయేల- ఊయాల' అనే శబ్దాలలో గల దీర్ఘానికి ఒక్కొక్కదానికి హ్రస్వరూపం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ' ఊయేల- ఉయేల- ఊయెల', ఊయాల- ఉయాల- ఊయల'. యకారానికి ద్విత్వం వచ్చే రూపాలను సులభ వ్యాకర్త కూడా చెప్పారు. 'ఉయ్యేల-ఉయ్యెల,ఉయ్యాల- ఉయ్యల' రూపాయలు ఏర్పడతాయి.

బాలవ్యాకర్త "ఊయేలాదులం దొలి యచ్చుమీఁది హల్లునకు ద్విర్వచనం బొండెనగు" (బాల.ప్రకీర్ణక:6) అని సూత్రీకరించారు.'ఊయేల' మొదలైన శబ్దాల మొదటి అచ్చు తర్వాత ఉన్న హల్లులకు ద్విత్వం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ఉయ్యేల– ఊయేల'.

సులభ వ్యాకర్త కూడా "ఊయేలాదులం దొలి యచ్చుమీఁది హల్లునకు ద్విర్వచనం బొండె నగు" (సులభ. ప్రకీర్ణక:5) అని సూత్రీకరించారు. ఉదాహరణకు 'ఊయేల' అనే శబ్దంలో మొదటి అచ్చు 'ఊ' తర్వాత ఉన్న హల్లు 'యే' దానికి ద్విత్వం వికల్పంగా వచ్చి పూర్వ అక్షరం హ్రస్వంగా మారి 'ఉయ్యేల' అనే రూపం ఏర్పడుతుందని సులభ వ్యాకర్త చెప్పారు.

బాలవ్యాకర్త "ఱకారంబు క్రింది ఱకారంబునకుం దుది ను లు ల క్రింది నలలకు లోపంబు బహుళంబు గనగు" (బాల.ప్రకీర్ణక:7) అని సూత్రీకరించారు. ద్విత్వ శకట రేఫలోని ఱకారానికి, చివర 'న్ను , ల్లు , లోని 'నకార లకారాలకు లోపం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'అఱ్ఱు– అఱు', కన్ను– కను, దున్ను– దును. పల్లు– పలు'. సూత్రంలో తుది నలలు అనడం వల్ల పదాంతంలోనే నలలు లోపిస్తాయి తప్ప పద మధ్యంలో లోపించవు. ఉదాహరణకు ' వెల్లువ'. దీనిని 'వెలువ' అని రాయకూడదు. ద్విత్వ శకట రేఫ మాత్రం పదం మధ్యలో కూడా లోపిస్తుంది. ఉదాహరణకు 'గొఱ్ఱియ– గొఱియ'.

సులభ వ్యాకర్త కూడా "ఱకారంబుక్రింది ఱకారంబునకుం, దుది నులు ర క్రింది నలలకు లోపంబు బహుళంబుగ నగు" (సులభ. ప్రకీర్ణక:6) అని సూత్రీకరించారు. ఱకార కింద ఱకారానికి, చివర 'ను,లు, కింద 'న,ల'లకు లోపం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు 'అఱ్ఱు– అఱు', కఱ్ఱ –కఱ' కన్ను– కను, దున్ను– దును. పల్లు– పలు, 'గొఱ్ఱియ– గొఱియ'.

బాలవ్యాకర్త "అక్కటాదుల జడ్డకు లోపంబు విభాషనగు"(బాల.ప్రకీర్ణక:8) అని సూత్రీకరించారు. 'అక్కట' మొదలైన శబ్దాల (జడ్డ) ద్విత్వానికి లోపం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'అక్కట– అకట', అట్టిక– అటిక'.

సులభ వ్యాకర్త కూడా "అక్కటాదుల జడ్డ కు లోపంబు విభాష నగు" (సులభ. ప్రకీర్ణక:7) అని సూత్రీకరించారు. అక్కట' మొదలైన శబ్దాల (జడ్డ) ద్విత్వానికి లోపం వికల్పంగా వస్తుంది.

ఉదాహరణకు 'అక్కట– అకట', అట్టిక– అటిక'. అక్కటాదులలో నామాలు, అవ్యయాలు, క్రియాపదాలు మొదలైనవి ఉన్నాయి.

బాలవ్యాకర్త "హాదులయు, నీలుగులోనగువాని తొలిహల్లునకు లోపంబు బహుళంబుగ నగు" (బాల.ప్రకీర్ణక:10) అని సూత్రీకరించారు.'హకారాదుల యొక్కయు, నీలుగు' మొదలైన శబ్దాల యొక్కయు మొదటి హల్లుకు లోపం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు ' హడపము – అడపము', నీలుగు – ఈలుగు'.

సులభ వ్యాకర్త కూడా "హాదులయు, నీలుగు లోనగువాని తొలిహల్లునకు లోపంబు బహుళంబుగ నగు" (సులభ. ప్రకీర్ణక:8) అని సూత్రీకరించారు. 'హకారాదులు, నీలుగు' మొదలైన శబ్దాల మొదటి హల్లుకు లోపం బహుళంగా వస్తుంది. అనగాఈ శబ్దాల మొదటి అక్షరంగా అచ్చులు ఉంటాయి. ఉదాహరణకు ' హడపము – అడపము', నీలుగు – ఈలుగు'.

బాలవ్యాకర్త "ఆరాటాదులం బ్రథమేతరదీర్ఘంబునకు హ్రస్వంబు విభాషనగు" (బాల.ప్రకీర్ణక:11) అని సూత్రీకరించారు. 'ఆరాటము' మొదలైన శబ్దాలలో మొదటి అక్షరంగాక, మిగిలిన అక్షరాలలో దీర్ఘం ఉంటే, ఆ దీర్ఘానికి వికల్పంగా హ్రస్వం వస్తుంది. ఉదాహరణకు ' ఆరాటము– ఆరటము' , బంగారము– బంగరము'.

సులభ వ్యాకర్త కూడా "ఆరాటాదులం బ్రథమేతర దీర్ఘంబునకు హ్రస్వంబు విభాష నగు"(సులభ. ప్రకీర్ణక:9) అని సూత్రీకరించారు. 'ఆరాటము' మొదలైన శబ్దాలలో మొదటి అక్షరంగాక, మిగిలిన అక్షరాలలో దీర్ఘం ఉంటే, ఆ దీర్ఘానికి వికల్పంగా హ్రస్వం వస్తుంది. ఉదాహరణకు ' ఆరాటము– ఆరటము' , పెండారము– పెండరము'.

బాలవ్యాకర్త "ఓయారాదులం దొలిదీర్ఘంబునకు హ్రస్వంబు విభాషనగు"(బాల.ప్రకీర్ణక:12) అని సూత్రీకరించారు. 'ఓయారము' మొదలైన శబ్దాలలో తొలి దీర్ఘానికి హ్రస్వం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ' ఓయారము – ఒయారము', గోరువంక– గొరువంక' మూలుగు– ములుగు'.

సులభ వ్యాకర్త కూడా "ఓయారాదులం దొలి దీర్ఘంబునకు హ్రస్వంబు విభాషనగు" (సులభ. ప్రకీర్ణక:10) అని సూత్రీకరించారు. 'ఓయారము' మొదలైన శబ్దాలలో తొలి దీర్ఘానికి హ్రస్వం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ' ఓయారము – ఒయారము', మూలుగు– ములుగు'.

బాలవ్యాకర్త "అడంగ్వాదుల డాకు ణకారంబు విభాషనగు"(బాల.ప్రకీర్ణక:13) అని సూత్రీకరించారు. 'అడగు' మొదలైన శబ్దాలలోని డకారానికి ణకారం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ' అడగు – అణగు', 'మిడుగు– మిణుగు'.

సులభ వ్యాకర్త కూడా "అడంగ్వాదుల 'డా' కు 'ణ' కారంబు విభాష నగు" (సులభ. ప్రకీర్ణక:11) అని సూత్రీకరించారు. 'అడగు' మొదలైన శబ్దాలలోని డకారానికి ణకారం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ' అడగు – అణగు', 'మిడుగు– మిణుగు'.

బాలవ్యాకర్త "దక్కు లోనగువాని దాకు డకారంబు విభాషనగు"(బాల.ప్రకీర్ణక:14) అని సూత్రీకరించారు. 'దక్కు' మొదలైన శబ్దాలలోని దాకారానికి డకారం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ' దక్కు– డక్కు', దాగు– డాగు'.

సులభ వ్యాకర్త కూడా "దక్కులోనగు వానికి 'దా' కు 'డ' కారంబు విభాషనగు" (సులభ. ప్రకీర్ణక:12) అని సూత్రీకరించారు. 'దక్కు' మొదలైన శబ్దాలలోని దకారానికి డకారం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ' దక్కు– డక్కు', దెందము–డెందెము'.

బాలవ్యాకర్త "ఏతాదులకు మువర్ణకంబు పరంబగునపుడు దీర్ఘంబు విభాషనగు" (బాల.ప్రకీర్ణక:15) అని సూత్రీకరించారు. 'ఏత' మొదలైన శబ్దాలకు 'ము' వర్ణకం పరమైనప్పుడు దీర్ఘం వికల్పంగా వస్తుంది. ఏతము– ఏతాము', జోతము – జోతాము.'.

సులభ వ్యాకర్త కూడా "ఏతాదులకు ముపర్ణకంబు పరం బగునపుడు దీర్ఘంబు విభాష నగు" (సులభ. ప్రకీర్ణక:13) అని సూత్రీకరించారు. 'ఏత' మొదలైన శబ్దాలకు 'ము' వర్ణకం పరమైనప్పుడు దీర్ఘం వికల్పంగా వస్తుంది. ఏతము– ఏతాము', జోతము – జోతాము.'.

బాలవ్యాకర్త "పదాంతంబులయి యసంయుక్తంబులయిన నులురుల యుత్వంబునకు లోపంబు బహుళంబుగనగు"(బాల.ప్రకీర్ణక:16) అని సూత్రీకరించారు. పదాంతాలలో ఉండే అసంయుక్త హల్లులైన 'ను,లు,రు' ల ఉత్వానికి లోపం బహుళంగా వస్తుంది. వీటిలో ను–రు లకు హల్లులు పరమైనప్పుడు ఉకార లోపం ప్రాయికంగా(అరుదుగా) జరుగుతుంది. వీటిలో ను–రు లకు హల్లులు పరమైనప్పుడు ఉకార లోపం ప్రాయికంగా(అరుదుగా) జరుగుతుందని బాలవ్యాకర్త

చెప్పారు . ఉదాహరణకు' మ్రానుపడె – మ్రాన్పడె', వత్తురు వారు– వత్తుర్వారు'. లువర్ణానికి కూడా హల్లు పరమైనపుడు ఉకార లోపం వస్తుంది ఉదాహరణకు 'రాములు– రాముల్'

సులభవ్యాకర్త కూడా "పదాంతంబులయి యసంయుక్తంబులయిన ను లు రు ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు" (సులభ. ప్రకీర్ణక:14) అని సూత్రీకరించారు. పదాంతాలలో ఉండే సంయుక్తం గాని 'ను, లు, రు' లలోని ఉకార బహుళంగా లోపిస్తుంది. వీటిలో ను–రు లకు హల్లులు పరమైనప్పుడు ఉకార లోపం ప్రాయికంగా(అరుదుగా) జరుగుతుందని సులభ వ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు' మ్రానుపడె – మ్రాన్పడె',రాములు– రాముల్', వత్తురు వారు– వత్తుర్వారు'.

బాలవ్యాకర్త "చుక్పరక రువర్ణంబునకు ముందఱి దువర్ణంబు నుత్వంబునకు లోపంబు విభాషను, నగుచోఁ దత్పూర్వంబు గురువు గాదు"(బాల.ప్రకీర్ణక:20) అని సూత్రీకరించారు. చుగాగమమం పరంగా ఉన్న రువర్ణానికి ముందున్న దువర్ణం యొక్క ఉత్వానికి లోపం వికల్పంగా వస్తుంది. అలాంటి సందర్భంలో దానికి పూర్వం అక్షరం ఛందశాస్త్రంలో (సంయుక్తాక్షరానికి ముందటి అక్షరం గురువు) చెప్పినట్టు గురువు కాదు. ఉదాహరణకు 'అదురుచు– అద్రుచు', విదురుచు– విద్రుచు'.

సులభ వ్యాకర్త కూడా "చుక్పరక రువర్ణంబునకు ముందఱి దువర్ణంబు నుత్వంబునకు లోపంబు విభాషనగు. అగుచోఁ దత్పూర్వంబు గురువు గాదు" (సులభ. ప్రకీర్ణక:15) అని సూత్రీకరించారు. ఒక శబ్దం చివర చువర్ణం ఉండి దానికి ముందు రువర్ణం, దానికి ముందు దువర్ణం ఉంటే దానిలోని ఉత్వానికి లోపం వికల్పంగా వస్తుంది. అలాంటి సందర్భంలో దానికి పూర్వం అక్షరం ఛందశాస్త్రంలో (సంయుక్తాక్షరానికి ముందటి అక్షరం గురువు) చెప్పినట్టు గురువు కాదు. ఉదాహరణకు 'అదురుచు– అద్రుచు', విదురుచు– విద్రుచు'.

బాలవ్యాకర్త "జూదాదుల దాకు జకారంబు విభాషనగు"(బాల.ప్రకీర్ణక:21) అని సూత్రీకరించారు. 'జూదము' శబ్దంలోని దకారానికి, జకారం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'జూదము– జూజము',

సులభ వ్యాకర్త కూడా "జూదాదుల దాకు జకారంబు విభాషనగు" (సులభ. ప్రకీర్ణక:16) అని సూత్రీకరించారు. 'జూదము' శబ్దంలోని 'ద'కారానికి, జకారం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'జూదము– జూజము',

### 5.5.2 తెలుగు భాషలో ప్రత్యేకమైన లక్షణాలు

బాలవ్యాకర్త "నిందయం దామ్రేడితంబు నాద్యక్షరములకు హ్రస్వ దీర్ఘంబులకు గిగీలగు" (బాల.ప్రకీర్ణక:22) అని సూత్రీకరించారు. నిందార్థంలో ఆమ్రేడితం తాలూకు ఆద్యక్షరం హ్రస్వం అయితే' గి' ఆదేశంగా , దీర్ఘమైతే 'గీ' ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు ' కుంభకర్ణుడు – గింభకర్ణుడు', రావణుడు– గీవణుడు'. సూత్రంలో నింద అనడం వల్ల, నిందలేనపుడు గిగీలు రావని అర్థం.

సులభ వ్యాకర్త కూడా "నిందయం దామ్రేడితంబు నాద్యక్షరములకు హ్రస్వ దీర్ఘములకు గి, గీలగు" (సులభ. ప్రకీర్ణక:17 ) అని సూత్రీకరించారు. నిందార్థంలో ఒకమాటనే రెండు సార్లు చెప్పేటప్పుడు రెండవ పదం యొక్క మొదటి అక్షరం హ్రస్వం అయితే' గి' ఆదేశంగా , దీర్ఘమైతే 'గీ' ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు ' కుంభకర్ణుడు – గింభకర్ణుడు', రావణుడు– గీవణుడు'. ఆమ్రేడిత పదంలోని మొదటి అక్షరం గి–గీ లుగా ఉంటే ఈ సూత్రం అన్వయించదని సులభ వ్యాకర్త చెప్పారు.

బాలవ్యాకర్త "పయ్యెద పయ్యద"(బాల.ప్రకీర్ణక:5) అని సూత్రీకరించారు. అనగా 'పయ్యద' శబ్దం అత్వ మధ్యమంగా కూడా ఉంటుందని అర్థం. 'పయ్యెద' శబ్దానికి 'పయ్యద' అనేది రూపాంతరం. సులభ వ్యాకర్త కూడా "పయ్యెద పయ్యద" (సులభ. ప్రకీర్ణక:4) అని సూత్రీకరించారు. 'పయ్యెద' శబ్దానికి రూపాంతరం 'పయ్యద' అని సులభ వ్యాకర్త చెప్పారు.

### ముగింపు

ఈ అధ్యాయంలో తత్సమ, ఆచ్ఛిక, తద్ధిత, కృదంతాలతోపాటుగా ప్రకీర్ణక పరిచ్ఛేదంలో చెప్పబడిన కొన్ని విషయాలను కూడా చర్చించడం జరిగింది. సులభవ్యాకర్త విభక్తి ప్రత్యయాలను పేర్కొంటూ 'సంబోధనా ప్రథమావిభక్తి'ని చెప్పారు. బాలవ్యాకర్త శబ్దాలను ఎన్నిరకాలుగా

ఉంటాయో వాటిని ఏమని పిలుస్తారో వంటి విషయాలు ఒకేచోట వివరించలేదు. సందర్భోచితంగా చెప్పుకుంటూ వెళ్లారు, కాని సులభవ్యాకర్త వాటన్నింటిని ఒకేచోట ఆరు సూత్రాలలో ప్రస్తావించారు. సులభవ్యాకర్త అచ్చతెలుగు శబ్దాలను నిర్వచిస్తూ 'ఏకాది గణాలలో చేరిన ఒక్కడు–వాడు– వీడు–మగడు' మొదలైన శబ్దాలు కాకుండా మిగిలిన అచ్చతెలుగు శబ్దాలన్ని స్త్రీ సమాలుగా గానీ, క్లీబ సమాలుగా గాని అవుతాయని చెప్పారు. బాలవ్యాకర్త సర్వనామాల క్రింద చెప్పిన విషయాలలో వివిధ అర్థాలలో సర్వనామ రూపాలు ఇలా ఉంటాయని చెప్పారు తప్ప వాటి ప్రక్రియ చెప్పలేదు. సులభవ్యాకర్త వాటి ప్రక్రియ కూడా చెప్పారు. తద్ధిత ప్రత్యయాలను బాల, ప్రౌఢ వ్యాకర్తలు విధించినవే చర్చించినప్పటికీ కొన్ని సవరణలు, పూరణలు చేసారు. నూతన విషయాలను ప్రతిపాదించారు. 'ఇ' వర్ణం పరమైనపుడు అది 'లేమి' ని తెలిపేదిగా ఉంటుందని, కొన్నిచోట్ల 'గల' అనే అర్థాన్ని కూడా తెలుపుతుందని చెప్పారు. ధాతువుల నుంచి ఏర్పడే నామవాచకాలని కృదంతాలు అంటారని సులభవ్యాకర్త నిర్వచించారు. కృదంత కార్యాలు బాల, ప్రౌఢ వ్యాకరణంలో చెప్పబడ్డవే సులభవ్యాకర్త చెప్పారు. బాలవ్యాకర్త ప్రకీర్ణక పరిచ్ఛేదంలో చెప్పిన విషయాలను సులభవ్యాకర్త ప్రకీర్ణక విభాగంలో పేర్కొన్నప్పటికీ కొన్ని సందర్భోచితంగా సంధి, ఆచ్ఛిక వంటి విభాగాలలో చెప్పబడ్డాయి.

ఆరవ అధ్యాయం: 'సమాస విజ్ఞానం' అనే అధ్యాయంలో భాగంగా 'ద్వంద్వ సమాసం, తత్పురుష సమాసం, బహువ్రీహి సమాసం, అవ్యయీభావ సమాసం' వాటిలోని ఉప విభాగాలను పరిశీలిస్తాను.

## ఐదవ అధ్యాయం

## పదాంశ విజ్ఞానం– సూత్రాల పట్టిక

| క్రమ సంఖ్య | బాలవ్యాకరణము సూత్రము: సంఖ్య | సులభవ్యాకరణము సూత్రము: సంఖ్య | సవరణ | పూరణ | వివరణ | నూతన విషయ ప్రతిపాదన |
|---|---|---|---|---|---|---|
| 1. | –– | సంబోధన ప్రథమా విభక్తి: ఓ–ఓయి–ఓరి–ఓసి.. తత్సమ:8 | –– | –– | –– | ✓ |
| 2. | లు వర్ణంబు బహువచనంబు.. తత్సమ:12 | లు–ల' లు బహువచనంబులు తత్సమ:10 | –– | ✓ | –– | –– |
| 3. | స్త్రీతిర్యగ్జడ భిన్నంబులును.. తత్సమ:17 | శబ్దములు మహదర్థకములు.. తత్సమ:12 | –– | –– | ✓ | –– |
| 4. | "పుంలింగంబయి మహద్వాచకంబ. తత్సమ:21 | డుజ్ ప్రత్యయము పరమగునపుడు.. తత్సమ:19 | –– | –– | ✓ | –– |
| 5. | –– | నీచ, మూర్ఖ, ధూర్త.. తత్సమ:20 | –– | –– | –– | ✓ |
| 6. | –– | "భట్టశబ్దం బుదంతమాత్రం తత్సమ:21 | –– | –– | –– | ✓ |
| 7. | –– | "అనిరాకాంతంబులకు, 'ము – వు' తత్సమ:45 | –– | –– | –– | ✓ |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 8. | ఆచ్ఛికశబ్దంబులె ల్లం.. ఆచ్ఛిక:1 | ఏకాదులు తప్ప వికృతి.. ఆచ్ఛిక:1 | ✓ | –– | –– | –– |
| 9. | –– | బిడ్డాదులకు దుజ్జును.. ఆచ్ఛిక:5 | –– | –– | –– | ✓ |
| 10. | –– | నెట్టనాదులు స్త్రీ క్లీబ... ఆచ్ఛిక:7 | –– | –– | –– | ✓ |
| 11. | –– | అకర్వాదుల వులోపంబు ఆచ్ఛిక:7 | –– | –– | –– | ✓ |
| 12. | కూఁతురు శబ్దంబునకు 'లు' ఆచ్ఛిక:9 | కూఁతురు శబ్దంబునకు.. ఆచ్ఛిక:15 | ✓ | –– | –– | –– |
| 13. | –– | వస్తునిర్దేశమం దదె,- - - సులభ.ఆచ్ఛిక:32 | –– | –– | –– | ✓ |
| 14. | –– | 'ఒక' కు 'నింత' లు పరములగుచో. ఆచ్ఛిక: 35 | –– | –– | –– | ✓ |
| 15. | అపదాద్యంయి యసంయు ఆచ్ఛిక: 27 | అనాద్యంబును నసంయుక్తంబును ఆచ్ఛిక: 61 | –– | ✓ | –– | –– |
| 16. | హ్రస్వముమీఁది టివర్ణంబునకు.. ఆచ్ఛిక: 32 | హ్రస్వము మీఁది 'టి'వర్ణ.. ఆచ్ఛిక: 65 | –– | –– | ✓ | –– |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 17. | “కా కత్తియలు కొండొక.. తద్ధిత:13 | “కాఁడు, కత్తియలు కొండొక.. తద్ధిత:23 | –– | –– | ✓ | –– |
| 18. | –– | కాఁడు కొండొకచోఁ దత్స. తద్ధిత:22 | –– | –– | –– | ✓ |
| 19. | వగాదుల బహువచనాంతం తద్ధిత:22,23 | వగాదులకు బహువచనాంతం తద్ధిత:33 | –– | –– | ✓ | –– |
| 20. | –– | ‘ఇ’ వర్ణకంబు కొన్ని చోటుల... తద్ధిత:35 | –– | –– | –– | ✓ |
| 21. | –– | కలయను నర్థంబున ‘అ’ .. తద్ధిత:35 | –– | –– | –– | ✓ |
| 22. | “దఘ్నార్థంబున బంటి...... తద్ధిత:27 | దఘ్నార్థంబున బంటి–కొలఁదు.. తద్ధిత:39 | –– | ✓ | –– | –– |

# అధ్యాయం – 6

# సమాస విజ్ఞానం

# అధ్యాయం – 6

# సమాస విజ్ఞానం

## 6.0 పరిచయం

రెండుగాని, అంతకంటే ఎక్కువగాని పదాలు కలిసి ఏకపదంగా ఏర్పడితే దానిని 'సమాసం' అంటారు. ఒకే పదం కావడం అంటే అర్థంలోను, శబ్దంలోను సమ్మేళనం చెందడం. అప్పుడు వేర్వేరు శబ్దాల అర్థాలు కలిసిపోయి ఒకే అర్థాన్ని బోధిస్తాయి. పదాల మధ్య ఉన్న విభక్తి ప్రత్యయాలు లోపించి సంగ్రహ రూపాన్ని పొందుతాయి.

బాలవ్యాకర్త"సమర్థంబులగు పదంబు లేకపదంబగుట సమాసంబు" (బాల.సమాస:1) అని సూత్రీకరించారు. సామర్థ్యం కలిగిన పదాలు ఏకపదంగా కావడాన్ని సమాసమని బాలవ్యాకర్త చెప్పారు. సులభవ్యాకర్త"ప్రసిద్ధముగ వేఱువేఱగు నర్థంబులు గల పదంబు లొకపదం బగుట సమాసంబు" (సులభ.సమాస:1) అని సూత్రీకరించారు. ప్రసిద్ధమైన పదాలు కలిసి ఒక పదంగా ఏర్పడటం సమాసమని దీని అర్థం.

బాలవ్యాకర్త "సాంస్కృతికకాచ్ఛిక మిశ్రభేదంబుచే సమాసంబు త్రివిధంబు"(బాల. సమాస:2) అని సూత్రీకరించారు. సాంస్కృతికం, ఆచ్ఛికం, మిశ్రమం – అని సమాసాలు మూడు విధాలుగా ఉంటాయని బాలవ్యాకర్త చెప్పారు. సమాసంలో సమసించే పదాలు భాషాభేదాన్ని బట్టి మూడు రకాలుగా చెప్పబడ్డాయి. వీటి నిర్వచనాలని, ఉదాహరణలను ఈ సూత్ర వివరణలో పేర్కొన్నారు. సంస్కృత భాషాపదాలకు సంబంధించిన సమాసానికి సాంస్కృతికమని పేరు. ఈ సాంస్కృతిక సమాసాలు సిద్ధము, సాధ్యము అని రెండు రకాలుగా ఉంటాయి.

సంస్కృత పదాలు సంస్కృతవ్యాకరణ నియమానుసారం సమాసమై వాటి చివర విభక్త్యాదులు చేరి తత్సమ సమాసాలుగా తెలుగులో చేరిన వాటిని సిద్ధ సాంస్కృతిక సమాసాలు అంటారు. ఉదాహరణకు ; రాజ+ఆజ్ఞ= రాజాజ్ఞ. సంస్కృత శబ్దాలు తెలుగు వ్యాకరణ నియమాలతో సాధించి సమాసం చేయబడితే వాటిని సాధ్య సాంస్కృతిక సమాసాలంటారు. ఉదాహరణకు రాజు+ఆజ్ఞ=రాజునాజ్ఞ'. అచ్చతెలుగు శబ్దాలతో సమాసం చేస్తే ఆచ్ఛిక సమాసం అంటారు.

ఉదాహరణకు 'తేని+ఆనతి= తేనియానతి'. ఒక తత్సమ పదం, మరొక ఆచ్ఛిక పదం కలిసి సమాసమయితే మిశ్రసమాసం అంటారు. ఉదాహరణకు ' రాజుముదల' సిరి వల్లభుడు'.

సులభవ్యాకర్త "భాషా భేదంబు వలన సమాసము మూఁడు విధంబులు" (సులభ. సమాస:2) అని సూత్రీకరించారు. భాషా భేదం చేత సమాసం మూడు రకాలని బాలవ్యాకర్త చెప్పినట్లుగానే సమాసాన్ని భాషా బేధాన్ని బట్టి ప్రధానంగా మూడు రకాలుగా సులభవ్యాకర్త కూడా చెప్పారు. అవి సాంస్కృతికం, ఆచ్ఛికం, మిశ్రమం. సాంస్కృతికం మళ్ళీ సిద్ధము, సాధ్యము అని రెండు రకాలు.

బాలవ్యాకర్త పేర్కొన్న మూడు రకాల సమాసాల నిర్వచనాలను వాక్యంలో నిర్వచిస్తే సులభవ్యాకర్త ప్రతి నిర్వచనాన్ని సూత్రంగా చెప్పారు."కేవల సంస్కృతశబ్దంబుల సమాసంబు సాంస్కృతికంబు" (సులభ. సమాస:3) అని సూత్రీకరించారు. అనగా కేవల సంస్కృత శబ్దాలతో సంస్కృత వ్యాకరణానుసారంగా సమాసం ఏర్పడి తెలుగు విభక్తిని స్వీకరించేది సిద్ధ సాంస్కృతికం. ఉదాహరణకు 'రామ+ఆజ్ఞ =రామాజ్ఞ', కుంతీ తనయుఁడు'.

సులభవ్యాకర్త "తత్సమంబుల సమాసంబు సాధ్యంబు" (సులభ. సమాస:4) అని సూత్రీకరించారు. అనగా సంస్కృత శబ్దాలు తెలుగులో తత్సమాలుగా ప్రవేశించిన తరువాత ఆ తత్సమాలకు తెలుగు వ్యాకరణానుసారంగా సమాసం ఏర్పడితే సాధ్య సాంస్కృతికం. ఉదాహరణకు 'రాము+ఆజ్ఞ= రామునాజ్ఞ ', కుంతి తనయుడు'.

సులభవ్యాకర్త "తెనుఁగు పదంబుల సమాసం బాచ్ఛికంబు. దీనిని సమాసక మందురు" (సులభ. సమాస:5) అని సూత్రీకరించారు. అచ్చ తెలుగు పదాలతో ఏర్పడే సమాసాన్ని ఆచ్ఛిక సమాసం అంటారు. ఈ ఆచ్ఛికసమాసాన్ని 'సమాసకం' అంటారని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ' గొంతి కొడుకు'. 'అలరుఁ దేనియ'.

సులభవ్యాకర్త "తెనుఁగు పదములు సంస్కృత పదములు కలిసి సమాసంబయిన మిశ్రసమాసం బగు" (సులభ. సమాస:6) అని సూత్రీకరించారు. తెలుగు పదాలు, సంస్కృత పదాలు కలిసి సమాసంగా ఏర్పడటాన్ని మిశ్రసమాసం అంటారు. ఉదాహరణకు ' రాము+ నానతి= రామునానతి', మంచి బాలకుడు'. మిశ్రసమాసంలో మొదట సంస్కృతశబ్దం ఉండదని

సులభవ్యాకర్త చెప్పారు. 'బహుమంది, అనేకమార్లు' వంటి ప్రయోగాలు దుష్ట సమాసాలుగా సులభవ్యాకర్త పేర్కొన్నారు.

విభక్తి లోపం వల్ల సమాసం రెండు విధాలు. విభక్తి లోపిస్తే 'లుక్సమాసం' అంటారు. విభక్తి లోపించకపోతే 'అలుక్సమాసం' అంటారు. ఉదాహరణకు 'కరము+వాఁడి=కరవాఁడి.

అర్థ భేదం చేత సమాసం నాలుగు రకాలు 1. ద్వంద్వము 2. తత్పురుష 3. బహువ్రీహి 4. అవ్యయీ భావం.

## 6.1. ద్వంద్వ సమాసము

సులభవ్యాకర్త "అనేక సుబంతములు సముచ్చయార్థంబు గలవై సమసించిన ద్వంద్వ సమాసమగు. ఇది యుభయ పదార్థ ప్రధానము" (సులభ.సమాస:7) అని సూత్రీకరించారు. ఒకటి కంటే ఎక్కువ సుబంతాలు సముచ్చయార్థ ప్రత్యయాలైన 'యు–ను' కలిసి సమాసంగా ఏర్పడితే దానిని ద్వంద్వ సమాసం అంటారు. ఉభయ పదార్థ ప్రధానమైనది అనగా సమాసంలో ఉండే పూర్వ, ఉత్తర పదాల రెండింటికి ప్రాధాన్యం ఉంటుంది. ఉదాహరణకు ' తల్లిదండ్రులు పూజ్యులు'. ఇక్కడ తల్లి తండ్రి అనే పదాలు సుబంతాలు(నామవాచకాలు). ఒకటి కంటే ఎక్కువ సుబంతాలు ఉన్నాయి. 'తల్లియును తండ్రియును' అన్న విగ్రహవాక్యంలో 'తల్లి తండ్రి ఇద్దరూ పూజ్యులే కాబట్టి ఉభయపదార్థ ప్రధానం కాబట్టి ఇది ద్వంద్వసమాసం. ఇదేవిధంగా 'కూరగాయలు, ఊరు పల్లెలు'.

ద్వంద్వ సమాసం మూడు రకాలు 1. ఇతరేతర ద్వంద్వము 2. సమాహార ద్వంద్వము 3.ఏకశేషము.

### 6.1.1 ఇతరేతర ద్వంద్వము

సులభవ్యాకర్త"ప్రత్యేకాన్వయము గలది యితరేతర ద్వంద్వము" (సులభ. సమాస:8) అని సూత్రీకరించారు. ప్రత్యేక అన్వయం కలిగింది ఇతరేతర ద్వంద్వం. ఉదాహరణకు ' అన్నదమ్ములు చదువరులు'. ఇక్కడ సమాసంగా కూడుకున్నప్పుడు 'అన్నయును చదువరి, తమ్ముఁడును చదువరి' అవుతుంది. అన్న, తమ్ముడు అనే రెండు పదాలు వేరు వేరుగా 'చదువరి' శబ్దంతో అన్వయించబడ్డాయి. ఇదేవిధంగా 'సీతా రామలక్ష్మణులు కానలకుఁ బోయిరి'.

సులభవ్యాకర్త "సమాసాంత శబ్దలింగమె సమాసంబునకుఁ దద్విశేషంబునకు నగు" (సులభ. సమాస:9) అని సూత్రీకరించారు. సమాసాంతంలోని శబ్దం ఏ లింగంలో ఉంటుందో అదే లింగం ఆ సమాసం మొత్తానికి దాని విశేషణానికి కూడా అవుతుంది. ఉదాహరణకు 'సీతా రాములు' ఇందులో చివర ఉన్న 'రామ' శబ్దం పుంలింగం. దాని బహువచనమే సమాసం మొత్తానికి అవుతుంది. 'రుక్మిణీ మిత్రవిందలు'. ఇక్కడ చివర 'మిత్రవింద' శబ్దం స్త్రీవాచకం. కాబట్టి దాని బహువచన రూపమే సమాసం మొత్తానికి అవుతుంది.'నలదమయంతు లిద్దఱు మనః ప్రభవానల బాధ్యమానలు'. ఇక్కడ 'నలదమయంతి' అనే సమాసంలో దమయంతి అనే స్త్రీవాచకమే చివర ఉన్నది. కాబట్టి విశేషణం 'బాధ్యమానలు' అని స్త్రీలింగ రూపం చివరగా ఉన్నది. పుంలింగరూపం అయితే 'బాధ్యమానులు' అయ్యేది.

## 6.1.2 సమాహార ద్వంద్వము

సులభవ్యాకర్త"సమాహార ద్వంద్వంబు తెనుఁగునఁ బ్రాయికంబుగ బహువచనము" (సులభ. సమాస:10) అని సూత్రీకరించారు. సమాహారం అంటే 'సమూహం' అని అర్థం. ఇందులో ప్రత్యేక అన్వయం  ముఖ్యం కాదు. సమూహార్థమే ముఖ్యం. సమాహార ద్వంద్వము తెలుగులో ప్రాయకంగా బహువచనంగా కన్పిస్తుంది. ఉదాహరణకు 'ఆహార నిద్రాభయములు, హితా హితము , కూడు గూర  దారి దాపు, కూడు గుడ్డ'

## 6.1.3 ఏకశేషము.

సులభవ్యాకర్త"ఏక విధ రూపములు గల పెక్కు శబ్దములు సమసించునపు డందొక్క శబ్దమునకు మాత్రము బహువచన ప్రత్యయం బగు. తక్కినవి లోపించు. దీనికే యేక శేషమని పేరు" (సులభ. సమాస:11) అని సూత్రీకరించారు.  ఒకే రూపం గల  అనేక  శబ్దాలు కలిసి సమాసంగా ఏర్పడేటప్పుడు అందులో ఒక్క శబ్దానికి మాత్రం బహువచన ప్రత్యయం చేర్చి మిగిలినవి లోపింపజేస్తే దానికి  'ఏకశేష సమాసం' అని పేరు. 'ఉదాహరణకు'  రాముడు+ రాముడు+ రాముడు = రాములు'. రాముడు అనే పేర్లుగలవారు ముగ్గురు ఉన్నప్పుడు అందులో ఒక 'రాముడు' పదానికి బహువచనం ప్రత్యయం చేర్చి మిగిలిన శబ్దాలు లోపించగా 'రాములు' అని అవుతుంది. అనేక సుబంతాలు లేకపోవడం వల్ల దీనిని ద్వంద్వ సమాసం కాదని కొంతమంది పెద్దలు చెప్పారు.

సులభవ్యాకర్త "పుంలింగ స్త్రీలింగ శబ్దము లేక శేషంబగుచో బుంలింగ రూపంబె యగు" (సులభ. సమాస:12) అని సూత్రీకరించారు. పురుషవాచక శబ్దాలు, స్త్రీ వాచక శబ్దాలు కలిసి ఏకశేష సమాసంగా ఏర్పడేటప్పుడు పుంలింగ రూపంగానే ఏర్పడుతుంది. ఉదాహరణకు ' శివుడు+ శివ= శివులు'. విటుడు+ విటి= విటులు'.

సులభవ్యాకర్త "సమాన రూపంబులు గల శబ్దంబుల యేక శేషము సరూపైక శేషము" " (సులభ. సమాస:13) అని సూత్రీకరించారు. సమాన రూపం గల శబ్దాలు కలసి ఏకశేషం అవ్వడం సరూప ఏక శేషము అవుతుంది. ఉదాహరణకు 'రాముఁడు+రాముఁడు+రాముడు =రాములు.

సులభవ్యాకర్త"భిన్నరూపములు గలశబ్దంబుల యేక శేషము విరూపైక శేషము" (సులభ. సమాస:14) అని సూత్రీకరించారు. వేరు వేరు రూపాలు గల శబ్దాలు కలిసి ఏకశేషం అవ్వటం విరూప ఏకశేషం అవుతుంది. ఇది ఏకార్థ విరూప ఏకశేషం, భిన్నార్థ ఏకశేషం అని రెండు రకాలుగా చెప్పారు. ఏకార్థ విరూప ఏకశేషంలో రెండు వేరు వేరు శబ్దాలు ఉన్నప్పటికీ ఒకే అర్థం బోధపడుతుంది. ఉదాహరణకు 'వక్ర దండుఁడును గుటిలదండుఁడును వచ్చిరి'. ఇక్కడ రెండు శబ్దాలు 'వంకరకట్టెగల వాడు' అని ఒకే అర్థాన్నిస్తున్నాయి. రూపాలు మాత్రం వేరుగాఉన్నాయి. కాబట్టి 'వక్ర దండ్రులు వచ్చిరి' అని గాని 'కుటిలదండులు వచ్చిరి' అనిగాని చెప్పవచ్చు.

అర్థము, రూపము రెండును వేరు వేరుగా ఉండడం భిన్నార్థ విరూప ఏకశేషము. ఉదాహరణకు ' పిత+మాత= పితలు. ఇక్కడ రెండు శబ్దాలు రూపంలో వేరు. అర్థంలో కూడా వేరుగా ఉన్నాయి. ఈ ఏకశేష సమాసంలో పుంలింగ రూపానికే 'లు' చేర్చాలి. పిత+మాత= పితలు. ఇక్కడ 'మాతలు' అనకూడదు.

బాలవ్యాకర్త "ఆచ్చిక శబ్దంబుతోడ స్త్రీసమంబు ప్రాయికంబుగా ద్వంద్వంబగు" (బాల. సమాస:07) అని సూత్రీకరించారు. అచ్చతెలుగు శబ్దంతో ప్రథమైక వచనం లోపించే అచ్చతెలుగు శబ్దం తరచుగా ద్వంద్వ సమాసమవుతుంది. మొదటిపదం స్త్రీసమంగాను, రెండవది ఏదేని ఆచ్చికశబ్దమై తెలుగుభాషలో ద్వంద్వసమాసం తరచుగా అవుతుంది. ఉదాహరణకు 'అన్నదమ్ములు'. అన్నయును తమ్ముడుయును అని విగ్రహ వాక్యం దీనిని 'అన్న+తమ్ముడు' అని విడదీయాలి.

ఇందులో మొదటి పదం 'అన్న' అనేది స్త్రీ సమం. 'తమ్ముడు' అనేది ఆచ్ఛిక పుంలింగతుల్య శబ్దం. సంధికార్యాలు జరిగి 'అన్నదమ్ములు' అవుతుంది.

సులభవ్యాకర్త"ఆచ్ఛిక ద్వంద్వంబునఁ బూర్వపదంబు స్త్రీసమం బగు" (సులభ. సమాస:15) అని సూత్రీకరించారు. ఆచ్ఛిక పదాలతో ఏర్పడే ద్వంద్వ సమాసంలో పూర్వపదంగా స్త్రీ సమం ఉంటుంది. ఉదాహరణకు 'అన్నదమ్ములు, తల్లి దండ్రులు, ఊరు వల్లెలు, ఆలుమగలు, కూరగాయలు'. ఇక్కడ అన్న, తల్లి , ఊరు, ఆలు, కూర అనేవి స్త్రీ సమాలు. 'తమ్ముడు+అన్న' వంటివి ద్వంద్వ సమాసాలు అవ్వవు. శ్రేష్ట వాచకం ముందు ఉండాలి.

బాలవ్యాకర్త "ద్వంద్వంబునందు ఋకారంబునకు రవర్ణంబు విభాషనగు" (బాల. సమాస: 24) అని సూత్రీకరించారు. ద్వంద్వసమాసంలో మొదటిపదం చివర ఉండే ఋకారానికి రవర్ణం వికల్పంగా ఆదేశమవుతుంది. మాత్రపితలు: మాతృ+ పితృ అని విడదీయాలి. ప్రస్తుతసూత్రంచే 'మాతృ' శబ్దంలోని ఋకారానికి రేఫ రాగా, మాత్ర+పితృ; తత్సమ.52 చేత తుది ఋకారానికి అత్వం రాగా, మాత్ర+పిత = మాత్రపిత – అనికాగా, తత్సమ.12చే బహువచనంలో లుప్రత్యయం రాగా, మాత్రపితలు అవుతుంది. ఇది సాధ్యద్వంద్వసమాసం. ఈ ఆదేశం రానపుడు 'మాతృ+పితృ' అని ఉండగా, సంస్కృత వ్యాకరణ నియమాలచేత 'మాతృ' శబ్దానికి ఆనజాదేశం వచ్చి, 'మాతా+పితృ' అనికాగా, తత్సమ 52 చేత మాతా పిత, తత్సమ 12 చేత 'మాతా పితలు' అవుతుంది. ఇది సిద్ధ సమాసం అవుతుంది.

సులభవ్యాకర్త "ఋకారాంతశబ్దంబులు ద్వంద్వంబగుచోఁ బూర్వపదాంత ఋత్వంబునకు రేఫంబొండె, దీర్ఘంబొండె వైకల్పికంబుగ నగు" (సులభ. సమాస:16) అని సూత్రీకరించారు. ఋకారాంత శబ్దాలు ద్వంద్వ సమాసం అయ్యేసందర్భంలో పూర్వ పదంలోని ఋకారానికి ఒకసారి రేఫ, ఒకసారి ధీర్ఘం వికల్పంగా వస్తాయి. ఉదాహరణకు 'మాతృ–పితృ' శబ్దాలు ఋకారాంత శబ్దాలు. ఇవి ద్వంద్వగా ఏర్పడేటప్పుడు 'మాత్ర పితలు' అనిగాని 'మాతాపితలు' అనిగాని అవుతుంది. ఋకారాంత శబ్దాలు ద్వంద్వసమాసం అయ్యే సందర్భంలో అని చెప్పడం వల్ల 'రామమాంధాతృ రఘుక్షి తీశులు' అన్నప్పుడు 'మాంధాతృ' శబ్దం 'మాంధాత్రి' అవ్వదు.

సులభవ్యాకర్త“ద్వంద్వాంతమందలి శబ్దము సమాసమునఁ బ్రతిపదముతో వేఱువేఱుగ సంబంధించి యుండు” (సులభ. సమాస:17) అని సూత్రీకరించారు. ద్వంద్వం అంతంగా ఉండే శబ్దం సమాసంలో ప్రతి పదంతో వేరువేరుగా సంబంధించి ఉంటుంది. ఉదాహరణకు ‘కపులనృపులచే= కపులచే +నృపులచే’. ‘కన్నవిన్నది=కన్నది +విన్నది’ .

ప్రౌఢవ్యాకర్త “కొన్ని యెడల మహద్ద్వంద్వంబున బూర్వ పదాంత్యస్వరంబునకు దీర్ఘంబునుం జూపట్టెడు”(ప్రౌఢ. సమాస:28) అని సూత్రీకరించారు. కొన్నిచోట్ల మహద్వాచకాలైన ద్వంద్వ సమాసంలో పూర్వ పదం యొక్క చివర అచ్చుకు దీర్ఘం సహితం కనబడుతుంది. ఉదాహరణకు ‘అన్నాదమ్ములు’. ‘అన్న+సు తమ్మ+డుజ్’ . బాల సమాస 25 చేత ‘అన్న+తమ్మ’, అన్న+దమ్మ’. ప్రస్తుత సూత్రం చేత ‘అన్నా+దమ్మ’ బహువచనం వచ్చి ‘అన్నా+దమ్మ+లు= అన్నాదమ్ములు.

సులభవ్యాకర్త “మహద్వాచకములు ద్వంద్వంబు లగుచోఁ దెనుఁగున నొక్కెడఁ బూర్వపదాంత స్వరంబునకు దీర్ఘంబును నగు” (సులభ. సమాస:18) అని సూత్రీకరించారు. మహద్వాచకాలు ద్వంద్వ సమాసం అయ్యేటప్పుడు తెలుగులో ఒక్కొక్కసారి పూర్వపద అంతంలో ఉండే స్వరానికి ధీర్ఘం వస్తుంది. ఉదాహరణకు ‘అన్నాదమ్ములు’, అప్పాచెల్లెండ్రు’. వాచ్యులు(వచింపబడినవారు) రక్త సంబంధంగలవారైనపుడే ఈ సూత్రం అన్వయించబడుతుందని సులభవ్యాకర్త చెప్పారు.

ప్రౌఢవ్యాకర్త “ఒకానొకచో ద్వంద్వంబున బూర్వ పదంబు క్లీబసమంబగు. అగుచో నా మువర్ణకంబునకు లోపంబగు”(ప్రౌఢ. సమాస 29) అని సూత్రీకరించారు. ద్వంద్వ సమాసంలో పూర్వ పదం క్లీబసమం అవుతుంది. అలాంటి సందర్భంలో పూర్వ పదంలోని మువర్ణానికి లోపం వస్తుంది. ఉదాహరణకు ‘అందము+చందము= అందచందములు’.

సులభవ్యాకర్త “ద్వంద్వకర్మధారయంబులఁ బూర్వపదాంత ము వర్ణకము లోపించి యొక్కెడ సమసించుటయుఁ గలదు” (సులభ. సమాస:19) అని సూత్రీకరించారు. ద్వంద్వ సమాసంలో, కర్మ ధారయ సమాసంలో పూర్వపద అంతంలో ఉండే మువర్ణం లోపించి ఒక్కొక్కసారి సమాసంగా ఏర్పడటం జరగుతుంది. ద్వంద్వసమాసానికి ఉదాహరణ ‘చుట్టము+పక్కము= చుట్టపక్కములు’.

అందము+చందము =అందచందము', కర్మధారయ సమాసానికి ఉదాహరణ 'కరము+వాఁడి= కరవాఁడి', పుట్టము+గోఁచి= పుట్ట గోఁచి'.

## 6.2 తత్పురుష సమాసము

సులభవ్యాకర్త"ఉత్తర పదార్థ ప్రధానము తత్పురుషము" (సులభ. సమాస:20) అని సూత్రీకరించారు. రెండు పదాలుగల సమాసంలో రెండవ పదం యొక్క అర్థమే ముఖ్యమైనదైతే అది తత్పురుష సమాసం. ఉదాహరణకు 'నల్లని గుఱ్ఱము పరువెత్తినది'.

తత్పురుష సమాసం ఐదు రకాలు . 1. సమానాధికరణము 2. వ్యధికరణము 3. నఞ్ 4. ప్రాది, 5. ఉపపదం

### 6.2.1 సమానాధికరణము

ఒకటే ఆధారం కలిగినది. అనగా సమాసంలోని రెండు పదాల భావం ఒక శబ్దంలోనే నిలిచి ఉండాలి. ఉదాహరణకు ' నల్లగుఱ్ఱము' . ఈ సమానాధికరణానికే 'కర్మధారయ సమాసం' అని పేరు. ఇందులో సాధారణంగా మొదటి పదం రెండవ పదానికి విశేషణంగా ఉంటుంది. విశేషణ పూర్వపదం, విశేషణోత్తర పదం, విశేషణోభయపద, ఉపమాన పూర్వ పదం, ఉపమానోత్తర పదం, సంభావనా పూర్వ పదం, అవధారణా పూర్వ పదం , ద్విగువు అనే బేధాలు ఉన్నాయి.

సమానాధికరణంలో 'మూడు' శబ్దం పూర్వపదంగా ఉన్నప్పుడు డుఙ్ లోపం వస్తుంది. ఉత్తర పదంలోని మొదటి అక్షరానికి ద్విత్వం వస్తుంది. ఉదాహరణకు ' మూడు+ మాఱులు= ముమ్మాఱు'

సులభవ్యాకర్త "సమానాధికరణమందలి రెండు పదములలో మొదటి పదము విశేషణ ముగను రెండవది విశేష్యముగ నుండిన విశేషణ పూర్వపద కర్మధారయము" (సులభ. సమాస:21) అని సూత్రీకరించారు. సమానాధికరణ సమాసంలో రెండు పదాలలో మొదటి పదం విశేషణంగా, రెండవ పదం విశేష్యంగా ఉంటే విశేషణ పూర్వపద కర్మధారాయ సమాసం అవుతుంది. ఇక్కడ విశేషణంగా త్రికముగాని, స్త్రీసమంగాని, ముగంతంగాని, ధాతుజవిశేషణంగాని ఏదో ఒకటి ఉంటుంది. త్రికానికి ఉదాహరణ 'ఈ కాలము'. స్త్రీసమానికి ఉదాహరణ 'వేఁడి పాలు'. ముగంతానికి ఉదాహరణ 'కఠినపుఁబల్కు'. ధాతుజ విశేషణానికి ఉదాహరణ ' వినెడు సభ్యులు'.

ప్రౌఢవ్యాకర్త "తమ్ముఁగుఱ్ఱలు, చిలుక మొకరి- యిత్యాదులు విశేష్య పూర్వపద కర్మధారయంబులు"(ప్రౌఢ. సమాస:16) అని సూత్రీకరించారు. తమ్ముఁగుఱ్ఱలు, చిలుక మొకరి మొదలైనవి విశేష్య పూర్వ పద కర్మధారాయ సమాసం అవుతాయి. ఉదాహరణకు ' తమ్ముఁగుఱ్ఱలు= కుఱ్ఱలగు తమ్ములు' చిలుక మొకరి= మొకరి యగు చిలుక'. ఇక్కడ తమ్ములు, చిలుక అనే పూర్వపదాలు విశేష్యాలు. 'తమ్ము+లు, కుఱ్ఱ+లు' , చిలుక+ము 'మొకరి+సు'. బాల. సమాస 25 చేత 'తమ్ము+కుఱ్ఱ', చిలుక+మొకరి' అయింది . 'తమ్ము+కుఱ్ఱ' కి నుగాగమం వచ్చి ద్రుతకార్యాలు జరిగి బహువచనం రాగా 'తమ్ముఁగుఱ్ఱలు' అయింది. 'చిలుకమొకరి+సు = 'చిలుకమొకరి అయింది.

సులభవ్యాకర్త "రెండవపదము విశేషణమైనచో విశేషణోత్తరపద కర్మధారయము" (సులభ. సమాస:22) అని సూత్రీకరించారు. కర్మధారాయ సమాసంలో రెండవ పదం విశేషణం అయితే విశేషణ ఉత్తర పద కర్మధారాయ సమాసం అవుతుంది. ఉదాహరణకు ' కపోత వృద్ధము'. ఇక్కడ విశేషణమైన 'వృద్ధ' శబ్దం ఉత్తరపదంగా ఉన్నది. ఇలాగే 'తమ్ముఁ గుఱ్ఱడు' , 'చిలుక మొకరి'.

ప్రౌఢవ్యాకర్త "ఆయీత్యాది ఘటితంబులు విశేషణోభయ పద కర్మధారయంబులు"(ప్రౌఢ. సమాస:17) అని సూత్రీకరించారు. 'ఆయీ' (ఆ+ఈ) మొదలైన కూర్చబడినవి విశేషణోభయపద కర్మధారయ సమాసాలు అవుతాయి. ఉదాహరణకు ' ఆయీ నేరములు',

సులభవ్యాకర్త "ఉభయపదములు విశేషణములైనచో విశేషణోభయపద కర్మధారయము" (సులభ. సమాస:23) అని సూత్రీకరించారు. కర్మధారయ సమాసంలో ఉభయ పదాలు విశేషణాలైతే ఉభయపద కర్మధారయ సమాసం అవుతుంది. ఉదాహరణకు 'శీతోష్ణము', 'కనని వినని విషయము'.

ప్రౌఢవ్యాకర్త "అలరుఁబోడీత్యాదు లుపమాన పూర్వపద కర్మధారయంబులు"(ప్రౌఢ. సమాస:19) అని సూత్రీకరించారు.'అలరుఁబోడి' మొదలైన శబ్దాలు ఉపమాన పూర్వపద కర్మధారాయ సమాసం అవుతుంది. ఉదాహరణకు ' అలరు' అనేది ఉపమానం. 'పోఁడి' సామాన్య ధర్మ వాచకం. కాబట్టి ఇది ఉపమాన పూర్వపద కర్మధారయం.

సులభవ్యాకర్త "ఉపమానము పూర్వపదముగనున్న నుపమాన పూర్వపదము" (సులభ. సమాస:24) అని సూత్రీకరించారు. ఉపమానం పూర్వ పదంగా ఉంటే అది ఉపమాన పూర్వపద కర్మధారయ సమాసం అవుతుంది. ఏ వస్తువును గురించి మనము మాట్లాడుతున్నామో అది ఉపమేయం. ఆ వస్తువును ఏ ఇతర వస్తువుతో సమానమని పోల్చుతామో అది ఉపమానము. ఒకరు తీయగా మాట్లాడినపుడు ఆ మాటలు గురించి చెప్పేటప్పుడు 'తేనె మాటలు' అని చెబితే , ఇందులో 'మాటలు' అనేది ఉపమేయం. 'తేనె' అనేది ఉపమానం. అనగా మాటలు తేనెవలె తియ్యగా ఉన్నాయని అర్థం. తేనె వంటి మాటలు అని విగ్రహవాక్యం. ఇక్కడ ఉపమానమైన తేనె అనేమాట ముందుగా ఉండటం వల్ల 'తేనె మాటలు' అనేది ఉపమాన పూర్వపద కర్మధారాయ సమాసం అవుతుంది. ఇలాగే 'చిగురుఁ గేలు', పూవుఁ బోడి'.

సులభవ్యాకర్త "ఉపమాన ముత్తరపదము గాఁ గలది యుపమానోత్తరపద కర్మధారయము" (సులభ. సమాస:25) అని సూత్రీకరించారు. ఉపమానం ఉత్తరపదంగా కలిగినది ఉపమాన ఉత్తర పద కర్మధారయ సమాసం. ఉదాహరణకు 'ముఖ పద్మము'. ఇక్కడ ఉపమానమైన పద్మము రెండవ పదంగా ఉన్నది. సింహము, శార్దూలము, నాగము, వ్యాఘ్రము, చంద్రుడు మొదలైన పదాలు ఉత్తరపదాలైనపుడు శ్రేష్ఠార్థాన్ని తెలుపుతాయి. పురుష సింహము, ముని కుంజరుడు మొదలైనవి. ఇక్కడ సామాన్య ధర్మం చెప్పకూడదు.

సులభవ్యాకర్త "సంభావనాపదము పూర్వమందుఁ గలది సంభావనా పూర్వపద కర్మధారయ మగు" (సులభ. సమాస:26) అని సూత్రీకరించారు. సంభావనా పదము పూర్వ పదంగా కలది సంభవనా పూర్వపద కర్మధారయ సమాసం అవుతుంది. 'సంభావనా' అనగా 'ఊహ లేదా సంజ్ఞ' అని అర్థం. ఉదాహరణకు 'వేఁప చెట్టు'. చెట్ల జాతిలో ఒక విధమైన చెట్టుకు 'వేము' అని పేరు పెట్టబడింది. కాబట్టి 'వేము' అనగానే ఆగుణములు గల చెట్టుగదా అని మనస్సుకు స్ఫురిస్తుంది. అలా ఒక పదార్థము గుర్తు తెలియడానికై దానికి ఉంచబడిన పేరు సంజ్ఞ. ఆ పదం పూర్వపదంగా ఉంటే సంభావనాపద కర్మధారయ సమాసం అవుతుంది. ఇలాగే 'చింత చెట్టు- రామారావు- నన్నయభట్టు- కృష్ణ శాస్త్రి'.

సులభవ్యాకర్త "అవధారణాపదము పూర్వమందుఁ గలది యవధారణాపూర్వపద కర్మధారయము" (సులభ. సమాస:27). అని సూత్రీకరించారు. అవధారణపదం పూర్వ పదంగా

కలిగినది అవధారణ పూర్వ పద కర్మధారయ సమాసం అవుతుంది. అవధారణ అంటే ఒకవస్తువును మరొక వస్తువుగా నిశ్చయించుట. ఉదాహరణకు 'అజ్ఞానాంధకారము'. అజ్ఞానము–అంధకారము(చీకటి) ఇవి వేరు వేరు వస్తువులు అయినప్పటికీ అజ్ఞానాన్ని చీకటిగా నిశ్చయించుట చేత అవధారణా పూర్వపద కర్మధారయ సమాసం అవుతుంది. ఇలాగే ' విద్యాధనము, సంసార సాగరము' . దీనికే రూపక సమాసం అని పేరు.

సులభవ్యాకర్త "సంఖ్యాపూర్వపదము ద్విగువు" (సులభ. సమాస:28) అని సూత్రీకరించారు. కర్మధారాయ సమాసంలో మొదటి పదము సంఖ్యావాచకం ఉంటే అది ద్విగు సమాసం అవుతుంది. ఉదాహరణకు 'మూఁడు లోకములు' . ఇక్కడ మొదటి పదమైన 'మూఁడు' సంఖ్యా వాచకం.

సులభవ్యాకర్త "సమాహారద్విగు వేకవచనము" (సులభ. సమాస:29) అని సూత్రీకరించారు. సమాహారాన్ని(సమూహాన్ని) తెలిపే సందర్భంలో ద్విగు సమాసం ఏకవచనంలో ఉంటుంది. ఉదాహరణకు ' త్రిలోకి' అనగా మూడు లోకముల సమాహారము అని అర్థం. ఇలాగే 'త్రిభువనము', పంచరాత్రము', త్రి సంధ్యము'. తెలుగులో 'బహువచనంలో ప్రయోగాలు ఉన్నాయి. ఈ సమాసం పుంలింగాంతంగా ఉండదు.

బాలవ్యాకర్త "ద్విగువున కేకవచనంబు ప్రాయికంబుగా నగు మిశ్రంబునకుఁ గాదు" (బాల.సమాస:18) అని సూత్రీకరించారు. ద్విగు సమాసంలో పూర్వోత్తరపదాలు అచ్చికపదాలైతే దాని బహువచనానికి ఏకవచనం తరచుగా వస్తుందనీ, మిశ్రసమాసమయితే ఏకవచనం రాదనీ సూత్రార్థం. మిశ్రమనగా తత్సమాచ్చిక పదాలతో సమాసం కావటం. ఉదాహరణకు 'ముచ్చిచ్చు, ముక్కారు, ముప్పాతిక, ముత్తోవ, ముివ్విధములు'.

సులభవ్యాకర్త "మిశ్రద్విగువు బహువచనము" (సులభ. సమాస:30) అని సూత్రీకరించారు. సమాసంలోని మొదటి సంఖ్యావాచకము తెలుగు శబ్దంగా, రెండవ శబ్దం తత్సమంగా ఉంటే బహువచనం అవుతుంది. ఉదాహరణకు 'రెండు లోకంబులు, నాలుగు పురుషార్థములు, ముజ్జగములు'. ఇందులో జగము శబ్దం తద్భవము. నల్దిక్కు, ముల్లోకము, ముమ్మూహూర్తము అనేవి ప్రౌఢ ప్రయోగాలు.

సులభవ్యాకర్త "అచ్చద్విగువున కేకవచనంబు ప్రాయికంబు" (సులభ. సమాస:31) అని సూత్రీకరించారు. అచ్చ తెలుగు పదాలతో ఏర్పడిన ద్విగు సమాసానికి ఏకవచనం ప్రాయికంగా వస్తుంది. ఉదాహరణకు 'ముమ్మాఱు, ముప్పొద్దు, ముత్త్రోవ, ముక్కాలు. సూత్రంలో ప్రాయికం అనడం వల్ల 'నల్గడలు, ఇరిపరియలు' వంటి రూపాలు కూడా ఏర్పడతాయి.

సులభవ్యాకర్త "మిశ్రద్విగువున విశేషణం బేకాంతంబై విశేష్యం బమహద్వాచకంబైనచో నేకవచనమే యగు" (సులభ. సమాస:32) అని సూత్రీకరించారు. మిశ్రద్విగు సమాసంలో విశేషణం ఏకాంతంగా(ఒకటి చివరగా కలిగి) ఉండి, విశేష్యం అమహద్వాచకం అయినట్లయితే ఏకవచనమే వస్తుంది. ఉదాహరణకు 'ఇరువది యొక్క పుస్తకము'. ఇక్కడ విశేషణం 'ఇరువది ఒక్క' అని ఏకాంతంగా ఉన్నది. విశేష్యం ' పుస్తకము' అనే తత్సమ శబ్దం అమహద్వాచకం. ప్రస్తుత సూత్రం చేత 'ఇరువది యొక్క పుస్తకము' ఏకవచనంగానే ఉన్నది. సమాసం కాని సందర్భంలో విశేష్యం పూర్వపదంగా ఉండి 'పుస్తకము లిరువదియొక్కటి' అని బహువచనం అవుతుంది. 'ఇరువది యొకరు భటులు'. ఇక్కడ 'భట' శబ్దం మహద్వాచకం కాబట్టి బహువచనంలో ఉన్నది.

బాలవ్యాకర్త "సమానాధికరణంబగు నుత్తరపదంబు పరంబగునపుడు మూఁడు శబ్దము డుజ్వర్ణంబునకు లోపంబును, మీఁది హల్లునకు ద్విత్వంబునగు" (బాల.సమాస:17) అని సూత్రీకరించారు. సమానాధికరణ సమాసంలో పూర్వ పదంగా మూఁడుశబ్దం ఉండి, దానికి ఉత్తరపదం పరమవుతుంటే, ఆ మూడు శబ్దంలోని 'డు' అనే అక్షరానికి లోపమును, దాని మీది హల్లుకు ద్విత్వమును నిత్యంగా అవుతాయని సూత్రార్థం. లోపద్విత్వాలు రానట్లైతే ఆ పదాలు వ్యస్తంగా ఉన్నాయని గుర్తించాలి. ఉదాహరణకు 'మూఁడు జగములు-ముజ్జగములు'.

సులభవ్యాకర్త "సమానాధికరణంబునఁ బూర్వపదంబైన మూఁడుశబ్దములోని డుజ్జునకు లోపంబును ఉత్తరపదాది హల్లునకు ద్విత్వంబును బహుళంబుగ నగు" (సులభ. సమాస:33) అని సూత్రీకరించారు. సమానాధికరణ సమాసంలో పూర్వపదంగా ఉన్న మూఁడు శబ్దంలోని 'డుజ్' అనే దానికి లోపము, ఉత్తర పదంలోని మొదటి హల్లుకు ద్విత్వము బహుళంగా వస్తాయి. ఉదాహరణకు 'మూడు+మాఱులు= మూ+ మాఱులు= ము+మ్మాఱులు=ముమ్మాఱులు' అయింది.

సులభవ్యాకర్త "త్రికంబున నేదైనఁ గర్మధారయమందుఁ దొలుత నుండెనేని త్రిక పూర్వక కర్మధారయ మగు" (సులభ. సమాస:34) అని సూత్రీకరించారు. త్రికములలో (ఆ, ఈ, ఏ) ఏదైన కర్మధారయ సమాసంలో మొదటి పదంగా ఉంటే అది త్రికపూర్వక కర్మధారయసమాసం అవుతుంది. ఉదాహరణకు ' ఆచోటు, ఈ కాలము , ఏ యూరు'.

బాలవ్యాకర్త "ద్విరుక్తంబగు హల్లు పరంబగునపు డాచ్ఛికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు"(బాల.సమాస:13) అని సూత్రీకరించారు. ద్విరుక్తమైన హల్లు పరమవుతుంటే, ఆ హల్లునకు అవ్యవహితంగా ముందుండే అచ్చతెనుగు శబ్దంలోని దీర్ఘానికి హ్రస్వం వస్తుంది.

సులభవ్యాకర్త "ద్విత్వ హల్లు పరంబగునపుడు పూర్వమందున్న యాచ్ఛిక దీర్ఘంబు హ్రస్వంబగు'(సులభ. సమాస:35) అని సూత్రీకరించారు. ద్విరుక్తమైన హల్లు పరమవుతుంటే, ఆ హల్లునకు అవ్యవహితంగా ముందుండే అచ్చతెనుగు శబ్దంలోని దీర్ఘానికి హ్రస్వం వస్తుంది. ఉదాహరణకు 'మూఁడు+మాఱులు= ముమ్మాఱు'.

బాలవ్యాకర్త "త్రికంబుమీఁది యసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగా నగు"(బాల.సమాస:14) అని సూత్రీకరించారు. త్రికానికి (ఆ ఈ ఏ) పరమవుతుండే అసంయుక్త హల్లుకు ద్విత్వం బహుళంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'ఆ కన్య– అక్కన్య'. ఈ కాలము– ఇక్కాలము' .

సులభవ్యాకర్త "త్రికంబునకు నసంయుక్తంబులును ఋకారంబును నూష్మరేఫే తరంబులునైన హల్లులు పరంబులైనపుడు వానికి ద్విత్వంబు బహుళంబుగ నగు" (సులభ. సమాస:36) అని సూత్రీకరించారు. త్రికానికి సంయుక్తంగాని హల్లులుగాని, ఋకారంగాని, ఊష్మాలు(శ స ష హ)గాని, రేఫ(ఱ, ర)గాని, ఇతరాలైన హల్లులు పరమవుతుంటే ద్విత్వం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు 'ఆదేశము– అద్దేశము, ఈ నెలవు –ఇన్నెలవు,

బాలవ్యాకర్త"కృత హ్రస్వంబగు త్రికంబు మీఁది చోటు శబ్దంబు నోత్వంబున కత్వ హ్రస్వంబులు విభాషనగు"(బాల.సమాస:15) అని సూత్రీకరించారు. వ్యాకరణ కార్యాలచే హ్రస్వంగా చేయబడిన త్రికశబ్దంపైన వచ్చే చోటు శబ్దంలోని ఓకారానికి అత్వం లేదా హ్రస్వం

వికల్పంగా వస్తాయని సూత్రార్థం. విభాషమే అత్వ హ్రస్వాలు రానపుడు దీర్ఘంగానే ఉంటుంది. ఉదాహరణకు 'అచ్చోటు– అచ్చటు– అచ్చొటు'.

సులభవ్యాకర్త "కృతహ్రస్వం బగు త్రికంబుమీఁది చోటు శబ్దంబు నోత్వంబున కత్వ హ్రస్వంబులు విభాష నగు" (సులభ. సమాస:37) అని సూత్రీకరించారు. వ్యాకరణ కార్యాలచే హ్రస్వంగా చేయబడిన త్రికశబ్దంపైన వచ్చే చోటు శబ్దంలోని ఓకారానికి అత్వం లేదా హ్రస్వం వికల్పంగా వస్తాయని సూత్రార్థం. విభాష అనడంవల్ల అత్వ హ్రస్వాలు రానపుడు దీర్ఘంగానే ఉంటుంది. ఉదాహరణకు ' అచ్చోటు– అచ్చొటు– అచ్చటు'.

బాలవ్యాకర్త "ఉత్తర పదంబగు చోటు శబ్దము టాక్షరమునకు లోపంబు విభాషనగు" (బాల.సమాస:16) అని సూత్రీకరించారు. సమాసంలో రెండవ పదంగా (చివరిపదంగా) ఉన్నట్టి 'చోటు' శబ్దంయొక్క 'ట' అనే అక్షరానికి వికల్పంగా లోపం వస్తుందని చెప్పారు. 'చోటు' అనే శబ్దం ఔపవిభక్తిక శబ్దం కాబట్టి, దాని చివరి యక్షరం సప్తమీవిభక్తికి ఆదేశంగా ఆచ్ఛిక. 38చేత వచ్చిన అకారంతో పాటుగా లోపిస్తుందని వివరణ వాక్యంవల్ల తెలుస్తున్నది. ఉత్తరపదంబగు చోటుశబ్దం అనుటవల్ల సమాసమైనపుడే ఈ విధి వర్తిస్తుందని ఉదాహరణలను బట్టి పూర్వం త్రికమే గాక ఇతర విశేషణాలు కూడ ఉండవచ్చునని గ్రహించాలి. ఉదాహరణకు 'అచ్చోనున్నాడు– అచ్చోటనున్నాడు'.

సులభవ్యాకర్త "ఉత్తరపదం బగుచోటు శబ్దము టాక్షరమునకు లోపంబు విభాష నగు"(సులభ. సమాస:38) అని సూత్రీకరించారు. సమాసంలో రెండవ పదంగా (చివరిపదంగా) ఉన్నట్టి చోటు శబ్దంయొక్క ట అనే అక్షరానికి వికల్పంగా లోపం వస్తుంది. ' చోటు' శబ్దము ఔపవిభక్తికం. దీని సప్తమీ ఏకవచన రూపం చోటన్. ఇక్కడ 'ట' కారానికి వికల్పంగా లోపం వస్తుంది. ఉదాహరణకు 'అచ్చోన్ – అచ్చోటన్ '.

సులభవ్యాకర్త "కర్మధారయంబున రెండు శబ్దములకు నడుమ నర్థగ్రహణమున కావశ్యకమైన పదము లోపించిన మధ్యమ పదలోపి యగు" (సులభ. సమాస:39) అని సూత్రీకరించారు. కర్మధారయ సమాసంలో రెండు శబ్దాలకు మధ్యలో అర్థగ్రహణానికి అవసరమైన పదం లోపించినట్లయితే మధ్యమ పదలోపి అంటారు. ఉదాహరణకు 'జవ్వాదిశెట్టి'.

జవ్వాది+అమ్మ+శెట్టి' అని అర్థం. ఇక్కడ 'అమ్మ' లోపించింది. దీనిని కొంతమది ఉత్తమపద లోపి అంటారు.

బాలవ్యాకర్త "సర్వ శబ్దంబులు సంబంధంబునందుం దచ్ఛబ్దంబుతోడ సమసించు " (బాల. సమాస:8) అని సూత్రీకరించారు. సంబంధార్థంలో అన్నిశబ్దాలు తచ్ఛబ్దాలతో సమాసాన్ని పొందుతాయి. 'సర్వశబ్దంబులు' అనేది ప్రథమాంతంగా ఉండటంవల్ల ఉపసర్జన మవుతుంది. కాబట్టి 'ఉపసర్జనం పూర్వం' అనే నియమంచే సమాసంలో మొదటిపదంగా సర్వశబ్దాలుండగా, రెండవ (ఉత్తర) పదంగా తచ్ఛబ్దం ఉండి సమాసాన్ని పొందుతాయి. సంబంధార్థంలో అని చెప్పటంవల్ల ఇవి షష్ఠీతత్పురుష సమాసాలని భావం.

సులభవ్యాకర్త "సంబంధార్థమం దన్ని శబ్దములమీఁదఁ దచ్ఛబ్దంబగు" (సులభ. సమాస:40) అని సూత్రీకరించారు. సమాసంలో సంబంధార్థంలో అన్ని శబ్దాల మీద 'తద్' శబ్దం వస్తుంది. ఉదాహరణకు 'అదినాది, వానిది, నీయది, మావాఁడు, ఇంటి వాఁడు, ఇంటిది'.

బాలవ్యాకర్త "ధాతుజ విశేషణంబులకు విభక్తి వివక్షించునపుడు తచ్ఛబ్దం బను ప్రయుక్తంబగు"(బాల. సమాస:9) అని సూత్రీకరించారు. ధాతుజవిశేషణాలకు విభక్తిప్రత్యయాలు వివక్షించాల్సి వస్తే తచ్ఛబ్దం ధాతుజ విశేషణాలపై చేరిన తరువాత విభక్తిప్రత్యయం చేరుతుంది. ముందు సూత్రంలో (బాల.సమాస:8) తచ్ఛబ్దం సంబంధార్థంలో నామపదాలపై చేరింది. కాబట్టి అది సమాసం. ఈ సూత్రంచే వచ్చే తచ్ఛబ్దం ధాతుజవిశేషణాలకు విభక్తివివక్షించేటపుడు చేరుతుంది. కాబట్టి ఇది సమాసంకాదని గ్రహించాలి. ఉదాహరణకు 'వచ్చిన వాఁడు, వచ్చినది, రానివాఁడు, రానియది'.

సులభవ్యాకర్త "ధాతుజవిశేషణంబులకు విభక్తి వివక్షించునపుడు తచ్ఛబ్దం బను ప్రయుక్తంబగు"(సులభ. సమాస:41) అని సూత్రీకరించారు. ధాతుజవిశేషణాలకు విభక్తి ప్రత్యయాలు వివక్షించాల్సి వస్తే తచ్ఛబ్దం ధాతుజ విశేషణాలపై చేరిన తరువాత విభక్తిప్రత్యయం చేరుతాయి. ఉదాహరణకు 'వచ్చిన వాఁడు, వచ్చినది, రానివాఁడు, రానిది'.

బాలవ్యాకర్త "ఎల్లయెడల ధాతుజ విశేషణంబుల కట్టి యనుపదంబు విభాషనను ప్రయుక్తంబగు" (బాల. సమాస :10) అని సూత్రీకరించారు. ధాతుజ విశేషణాలకు అంతటను అట్టి

అనే పదం వికల్పంగా అనుప్రయుక్తంగా వస్తుందని వస్తుంది. ఎల్లయెడల అనగా (బాల. సమాస. 5వసూత్రంచేత) కర్మధారయ సమాసమైనపుడుగాని, (సమాస.9చే) విభక్తి వివక్షించేటపుడుగాని వికల్పంగా 'అట్టి' అనే పదం ధాతుజవిశేషణానికి అనుప్రయుక్త మవుతుందని భావం. ఉదాహరణకు 'వచ్చినట్టిరాముఁడు, వచ్చిన రాముఁడు; వచ్చునట్టివాఁడు, వచ్చువాఁడు'.

సులభవ్యాకర్త "ఎల్లయెడలఁ గ్రియావిశేషణంబులకు 'అట్టి' యనుపదంబు వైకల్పికంబుగ ననుప్రయుక్తం బగు" (సులభ. సమాస:42) అని సూత్రీకరించారు. క్రియా విశేషణాలకు అంతటను 'అట్టి' అనే పదం వికల్పంగా అనుప్రయుక్తంగా వస్తుంది. ఉదాహరణకు 'కపులు కట్టిన సేతువు– కపులు కట్టినట్టి సేతువు'.

సులభవ్యాకర్త "షడ్వర్ణ పర్యంతంబైన యాంధ్ర శబ్దంబు తత్సమశబ్దంబుతోడ సమనించు" (సులభ. సమాస:43) అని సూత్రీకరించారు. ఆరు అక్షరాలు పరిమితిగల తెలుగు శబ్దం తత్సమ శబ్దంతో చేరి సమాసంగా (కర్మధారయ సమాసం) ఏర్పడుతుంది. ఉదాహరణకు 'వాఁడి మయూఖములు'. తెలుగు శబ్దం పూర్వంగా ఉండాలి, శుద్ధ సంస్కృత శబ్దం తెలుగు శబ్దంతో సమసించదు. ఉదాహరణకు ' అనేకమార్లు, బహుమంది' వంటివి సాధు ప్రయోగాలు కావు. 'కటికి చీఁకటి దిండికరముల గిలిగింత' అనే ప్రయోగంలో 'కటికి చీఁకటి దిండి విశేషణంగా ఉండి ఆరు అక్షరాలకు మించి ఉన్నది. ఇలాంటి ప్రయోగం ఇది ఒక్కటే ఉన్నదని సులభవ్యాకర్త చెప్పారు.

బాలవ్యాకర్త "గుణవచనంబులగు నల్లాదులకుం గర్మధారయంబునందు నిగాగమంబు బహుళంబుగా నగు"(బాల.సమాస:12) అని సూత్రీకరించారు. గుణవాచకాలైన నల్లమొదలైన శబ్దాలకు కర్మధారయసమాసంలో 'ని' అనే ఆగమం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు 'నల్ల గుఱ్ఱము'. ఇందులో 'నల్ల' అనేది గుణవాచకవిశేషణం. గుఱ్ఱము అనేది విశేష్యం. ఇది కర్మధారయ సమాసం. ప్రస్తుత సూత్రం చేత గుణవాచక శబ్దానికి నిగాగమం వస్తే 'నల్లని గుఱ్ఱము' రానపుడు 'నల్ల గుఱ్ఱము' అని ఉంటుంది.

సులభవ్యాకర్త "కర్మధారయంబునందు గుణవచనంబులకు ని గాగమంబు బహుళంబు" (సులభ. సమాస:44) అని సూత్రీకరించారు. కర్మధారయ సమాసంలో గుణవాచకాలైన నల్ల మొదలైన శబ్దాలకు 'ని' అనే ఆగమం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు 'చల్ల గాలి '. ఇందులో

'చల్లా' అనేది గుణవాచకవిశేషణం. 'గాలి' అనేది విశేష్యం. ఇది కర్మధారయ సమాసం. ప్రస్తుత సూత్రం చేత గుణవాచక శబ్దానికి నిగాగమం వస్తే 'చల్లని గాలి' రానపుడు 'చల్ల గాలి' అని ఉంటుంది. పరుషాలు పరమైనప్పుడు కొన్నిసార్లు నిగాగమానికి బిందువు వస్తుంది. ఉదాహరణకు 'కమ్మని +తేనె =కమ్మఁ దేనె, కమ్మందేనె.

సులభవ్యాకర్త "గుణవాచకంబు క్రియావిశేషణం బగుచో నొక్కెడ నవర్ణకంబునకు బిందువు గానంబడియెడి" (సులభ. సమాస:45) అని సూత్రీకరించారు. గుణవాచకం క్రియా విశేషణం అయ్యే సందర్భంలో ఒక్కొక్కసారి నవర్ణకానికి బిందువు కనబడుతుంది. ఉదాహరణకు 'చక్కంగఁ దాఁజూడ నోపనివాడు'.

సులభవ్యాకర్త "సమాసంబుల నౌపవిభక్తికంబులు దీర్ఘ పూర్వక ద్విత్వ ముపర్ణంబులకు ఖండ పూర్ణబిందు పూర్వకంబుగను, లఘు పూర్వక ముపర్ణంబునకుఁ గేవలమును పవర్ణంబునగు" (సులభ. సమాస:46) అని సూత్రీకరించారు. సమాసంలో ఔపవిభక్తికాలు దీర్ఘ పూర్వక ముపర్ణకానికి ఖండ బిందువుతో కూడిన పకారం , ద్విత్వ ముపర్ణానికి పూర్ణ బిందువు పూర్వకంగా కలిగిన పకారం, లఘు పూర్వక ముపర్ణకానికి కేవలం పవర్ణకం అవుతుంది. దీర్ఘ పూర్వక ముపర్ణానికి'ఁప' వచ్చినప్పుడు 'నాము+ చేను= నాఁపచేను'. ద్విత్వ ముపర్ణానికి 'ంప' వచ్చినప్పుడు ' అమ్ము–అంప' 'ఎమ్ము– ఎంప', లఘు పూర్వక ముపర్ణానికి కేవలం 'ప' వచ్చినప్పుడు ' ఇనుము– ఇనుప కాఁడ', 'మినుము పప్పు– మినుపపప్పు', జనుము నార– జనుపనార'.

సులభవ్యాకర్త "మయూరవ్యంసక సమాసములు" (సులభ. సమాస:47) అని సూత్రీకరించారు. మయూరవ్యంసకము(మోసపు నెమలి ) వంటివి సమాసాలు అవుతాయి. ఉదాహరణకు 'మయూరవ్యంసకము, ఉచ్చావాచము (అనేక ప్రకారములు కలది), గ్రామాంతరము, చిన్మాత్రము, అహో పురుషిక.

బాలవ్యాకర్త "యుష్మదస్మ దాత్మార్థకంబుల కుత్తర పదంబు పరంబగునపుడువ దుగాగమంబు విభాషనగు"(బాల. సమాస:11) అని సూత్రీకరించారు. 'నీ, నా, తన' శబ్దాలకు ఉత్తరపదం పరమవుతుంటే 'దు' అనేది వాని (నీ నా తనలకు) అంతమందు వికల్పంగా ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'నీదుకరుణ, నీకరుణ'. 'నీ యొక్క కరుణ' అని విగ్రహవాక్యం.

'నీ+ కరుణ' అని ఉండగా, యుష్మత్ శబ్దమైన 'నీ' అనేదానికి 'కరుణ' అనే ఉత్తర పదం పరమవుతున్నది. కాబట్టి ప్రస్తుత సూత్రం చేత దుగాగమం వచ్చినప్పుడు 'నీదుకరుణ' అని , రానపుడు 'నీకరుణ' అనే రూపాలు ఏర్పడతాయి.

సులభవ్యాకర్త "యుష్మ దస్మ దాత్మార్థకంబుల కుత్తరపదంబు పరంబగునపుడు 'దు' గాగమంబగు. ఉ॥ నీదుకరుణ నీకరుణ – నాదు నేరమి–తనదురూపు. బహువచనంబున సాధుప్రయోగంబులు లేవు" (సులభ. సమాస:49) అని సూత్రీకరించారు. యుష్మద్, అస్మద్, ఆత్మార్థక శబ్దాలకు ఉత్తర పదం పరమయ్యేటప్పుడు 'దు' ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'నీదు కరుణ–నీ కరుణ, నాదు నేరమి, తనదు రూపు'. సూత్రంలో బహువచనం పరమయ్యేటప్పుడు సాధు ప్రయోగం లేదని సులభ వ్యాకర్త చెప్పారు. 'నీ యొక్క కరుణ' అని విగ్రహవాక్యం. 'నీ+ కరుణ' అని ఉండగా, యుష్మత్ శబ్దమైన 'నీ' అనేదానికి 'కరుణ' అనే ఉత్తర పదం పరమవుతున్నది. కాబట్టి ప్రస్తుత సూత్రం చేత దుగాగమం వచ్చినప్పుడు 'నీదుకరుణ' అని , రానపుడు 'నీకరుణ' అనే రూపాలు ఏర్పడతాయి.

### 6.2.2 వ్యధికరణ తత్పురుష సమాసము

సులభవ్యాకర్త "భేదమయిన యాధారము గలది వ్యధికరణము" (సులభ. సమాస: 48) అని సూత్రీకరించారు . సమాసంలోని రెండు పదాల అర్థాలు వేరు వేరు ఆధారాలను కలిగి ఉంటాయి. ఉదాహరణకు ' రాముని కుట్టము'.

### 6.2.3 నఞ్ తత్పురుష సమాసము

సులభవ్యాకర్త "అకార నకారములు సమాసాది నుండి వ్యతిరేకార్థము బోధించునేని నఞ్ తత్పురుషము" (సులభ.సమాస: 50) అని సూత్రీకరించారు. సంస్కృతంలో 'న' వర్ణకం వ్యతిరేకార్థాన్ని తెలుపుతుంది. అచ్చు పరమైనప్పుడు ఈ 'న' వర్ణకం ' అన్' గా మారుతుంది. హల్లు పరమైతే ' అ' గా మారుతుంది. ఉదాహరణకు ' న+ ఉచితము= అన్+ ఉచితము= అనుచితము', న+ బ్రాహ్మణుడు = అ+బ్రాహ్మణుడు = అబ్రాహ్మణుడు.

### 6.2.4 ప్రాది తత్పురుష సమాసము

సులభవ్యాకర్త "ప్రాది తత్పురుషము" (సులభ. సమాస:51) అని సూత్రీకరించారు. ఉపసర్గలలో 'ప్ర' మొదటగా ఉండడం వల్ల వీటిని ప్రాదులు అంటారు. తత్పురుష సమాసంలో ఉపసర్గలు మొదటగా ఉంటే దానిని ప్రాది తత్పురుష అంటారు. ఉదాహరణకు ' ప్ర+ ఆచార్యుడు' ప్రాచార్యుడు'.

### 6.2.5 గతి తత్పురుష సమాసం

సులభవ్యాకర్త "గతి తత్పురుషము" (సులభ. సమాస:52) అని సూత్రీకరించారు. అస్తమయము, పురస్కారము, తిరస్కారము, సత్కారము మొదలైనవి గతి తత్పురుషకు ఉదాహరణలు.

సులభవ్యాకర్త "సంఖ్యావ్యయంబులు పూర్వపదంబులైనచో 'అంగుళి' అదంతమగు" (సులభ. సమాస:53) అని సూత్రీకరించారు. సంఖ్యలు, అవ్యయాలు పూర్వ పదాలుగా ఉన్నప్పుడు పరంగా ఉన్న 'అంగుళి' శబ్దం అకారాంతమవుతుంది. సంఖ్య పూర్వానికి ఉదాహరణ 'ద్వ్యంగుళము దారువు'. అనగా రెండంగుళాల ప్రమాణం గల కొయ్య అని అర్థం. అవ్యయ పూర్వానికి ఉదాహరణ 'నిరంగుళము'.

సులభవ్యాకర్త "ఏక దేశ సంఖ్యావ్యయంబులకును సర్వ – సంఖ్యాత – పుణ్యశబ్దములకును బరమైన రాత్రి శబ్దము అకారాంతమగు" (సులభ. సమాస:54) అని సూత్రీకరించారు. ఏకదేశ (భాగము) శబ్దాలకు, సంఖ్యను తెలిపే అవ్యయాలకు, 'సర్వ–సంఖ్య– పుణ్య' శబ్దాలకు పరమైన 'రాత్రి' శబ్దం అకారాంతం అవుతుంది. ఏకాదేశం అనగా భాగము అని అర్థం. ఉదాహరణ 'అర్థ రాత్రము, మధ్య రాత్రము, పూర్వ రాత్రము, అపర రాత్రము. సంఖ్య అవయ్యాలకు ఉదాహరణ 'ద్విరాత్రము, త్రిరాత్రము, సప్త రాత్రము. 'సర్వ–సంఖ్య– పుణ్య' శబ్దాలకు ఉదాహరణ ' సర్వ రాత్రము, సంఖ్యా రాత్రము, పుణ్య రాత్రము'.

'అహస్సు' పూర్వంగల రాత్రి శబ్దం ద్వంద్వ సమాసంలో 'అహోరాత్రము' అవుతుంది. 'అహన్' శబ్దం పరపదంగా ఉన్నప్పుడు ' ఏక– పుణ్య– పూర్వ– అపరా' మొదలైన శబ్దాలు తత్పురుష సమాసాలు అవుతాయి. ఉదాహరణకు ' ఏకాహము, పుణ్యాహము, పూర్వాహ్ణము, అపరాహ్నము'.

సులభవ్యాకర్త "తత్పురుషాంతమున 1 గో–గవము అగు. II అయస్ – సరస్ శబ్దములు– జాతి –సంజ్ఞలఁ దెలుపునపుడు అకారాంతములగు" (సులభ. సమాస:55) అని సూత్రీకరించారు. తత్పురుషాంతంలో 'గో శబ్దం 'గవము' అవుతుంది. 'అయస్, సరస్' శబ్దాలు శబ్దాలు జాతి– సంజ్ఞలను తెలిపేటప్పుడు అకారాంతం అవుతుంది. ఉదాహరణకు 'పరమగవము' ఇక్కడ 'పరమ గోవు' అనరాదు. 'కాలాయసము(నల్ల ఇనుము), మండూకసరము(కప్పలతో నిండిన సరము).

సులభవ్యాకర్త "కర్మధారయ–బహువ్రీహులయందుఁ దొలిపదమైనపుడును జాతీయశబ్దము పరమైనపుడును మహచ్ఛబ్దము 'మహా' యగు" (సులభ. సమాస:56) అని సూత్రీకరించారు. కర్మధారయ సమాసంలో, బహువ్రీహి సమాసంలో మొదటి పదం అయినపుడు, 'జాతీయ' శబ్దం పరమైనపుడు 'మహ' అనే శబ్దం 'మహా' అవుతుంది. కర్మధారయానికి ఉదాహరణకు 'మహత్+వృక్షము= మహా వృక్షము. బహువ్రీహికి ఉదాహరణ ' మహా బాహుడు'. మహాజాతీయము.

## 6.3 బహువ్రీహి సమాసము

సులభవ్యాకర్త "అన్యపదార్థ ప్రధానము బహువ్రీహి"(సులభ. సమాస:57) అని సూత్రీకరించారు. అన్య పదార్థం అనగా సమాసంలో పూర్వ పదం బోధించు దానికంటే, ఉత్తర పదం బోధించు దానికంటే మరొక వస్తువు యొక్క అర్థమే ముఖ్యంగా కలిగినది. ఉదాహరణకు 'రాముఁ డు సాధు బుద్ధి'. ఇక్కడ సాధుబుద్ధి అనగా 'సాధువైన బుద్ధి' అని అన్నప్పుడు కర్మధారాయ సమాసం అవుతుంది. అలాకాకుండా 'ఎవరి యొక్క బుద్ధి సాధువో వాడు సాధుబుద్ధి' అని అర్థం చెబితే ఆ పురుషుడు సాధుత్వం కంటే బుద్ధికంటే వేరైన వాడు కాబట్టి 'సాధుబుద్ధి' అనేది బహువ్రీహి అవుతుంది. బహువ్రీహి సమాసానికి విగ్రహం చెప్పేటప్పుడు 'ఏది– ఏవాఁడు–ఎవ్వతె యొక్క విభక్తి రూపాలు ఉండాలి. ఉదాహరణకు 'పీతాంబరుఁడు'. ఇక్కడ 'ఎవరి యొక్క అంబరము(వస్త్రము) పీతమో (పచ్చనయో)' వాడు పీతాంబరుడు(విష్ణువు). పీతమైన అంబరము కలవాడు అని అర్థం.

బహుబ్రీహి సమానాధికరణం, వ్యధికరణం అని రెండు రకాలు. ఈ సమానాధికరణం ద్వితీయాది భేదాలు చేత ఆరు రకాలు. ద్వితీయా బహుబ్రీహికి ఉదాహరణ ' ప్రాప్తోదకము గ్రామము. అనగా 'ఉదకము దేనిని ప్రాప్తించెనో అది' అని అర్థం. ఇక్కడ విగ్రహవాక్యంలో 'దేనిని' అని ద్వితీయా విభక్తి రూపం వచ్చినందువల్ల ఇది 'ద్వితీయా బహుబ్రీహి' అయింది. ఇలాగే మిగిలిన విభక్తులు ఆయా విగ్రహ వాక్యాలలో చేరి తృతీయా బహుబ్రీహి, చతుర్థీ బహుబ్రీహి, పంచమీ బహుబ్రీహి, షష్ఠీ బహుబ్రీహి, సప్తమీ బహుబ్రీహులను ఏర్పరుస్తున్నాయి.

తృతీయా బహుబ్రీహికి ఉదాహరణ ' లబ్ధ విద్యుఁడు కృష్ణుఁడు' . ఇక్కడ 'ఎవని చేత విద్య లబ్ధమయ్యెనో వాడు (కృష్ణుడు)' అని విగ్రహ వాక్యం.

చతుర్థీ బహుబ్రీహికి ఉదాహరణ 'దత్తాస్త్రుడు రాముడు'. 'ఎవరి కొఱకు అస్త్రములు దత్తములయ్యెనో వాడు (రాముడు)' అని విగ్రహవాక్యం.

పంచమీ బహుబ్రీహికి ఉదాహరణ ' నిరస్తదోషులు'. ఎవరి వలన నుండి దోషములు నిరస్తములయ్యెనో వారు (మునులు)' అని విగ్రహవాక్యం.

షష్ఠీ బహుబ్రీహికి ఉదాహరణ ' పీతాంబరుఁడు'.'ఎవరి యొక్క అంబరము(వస్త్రము) పీతమో (పచ్చనయో)' వాడు (విష్ణువు)' అని విగ్రహ వాక్యం.

సప్తమీ బహుబ్రీహికి ఉదాహరణ 'చక్రపాణి'. 'పాణి యందు చక్రము ఎవరికి కలదో వాడు (విష్ణువు)' అని విగ్రహ వాక్యం.

వ్యధికరణ బహుబ్రీహి షష్ఠీ, సప్తమీలలో మాత్రమే ఉండును. షష్ఠీ బహుబ్రీహికి ఉదాహరణ 'పద్మ గంధి'. పద్మము యొక్క గంధము వంటి గంధము ఎవతికి గలదో అది(దమయంతి). సప్తమీ బహుబ్రీహి ఉదాహరణ ''చక్రపాణి'. 'పాణి యందు చక్రము ఎవరికి కలదో వాడు (విష్ణువు)' అని విగ్రహ వాక్యం.

సులభవ్యాకర్త "నఞ్ పూర్వపదముగాఁ గల బహుబ్రీహి నఞ్ పూర్వపద బహుబ్రీహి" (సులభ. సమాస:58) అని సూత్రీకరించారు. 'నఞ్' పూర్వపదంగా గల బహుబ్రీహి 'నఞ్ పూర్వపద బహుబ్రీహి అంటారు. 'నఞ్' అనేది అచ్చుకు పూర్వంగా ఉంటే 'అన్' మిగులుతుంది. హల్లుకు

ముందు ఉంటే 'అ' గా ఉంటుంది. ఉదాహరణకు ' అపుత్రుఁడు'. ఇక్కడ 'పుత్రుఁడు ఎవరికి లేడో వాడు అపుత్రుఁడు అని అర్థం. అలాగే 'అనఘుఁడు' అఘము ఎవరికి లేదో వాడు అనఘుఁడు. ఈ 'నఞ్' శబ్దం లాగా కొన్ని ఉపసర్గలు పూర్వ పదంగా ఉంటాయి. ఉదాహరణకు 'ప్రపర్ణము' . దేని యొక్క పర్ణములు(ఆకులు) ప్రపతితములో (రాలిపోయినవో) అది ప్రపర్ణము.

సులభవ్యాకర్త "'సహ' శబ్దము పూర్వపదముగా నుండిన సహ పూర్వపద బహువ్రీహి" (సులభ. సమాస:59) అని సూత్రీకరించారు. 'సహ' శబ్దం పూర్వంగా ఉంటే అది 'సహ పూర్వపద బహువ్రీహి' అవుతుంది. తృతీయావిభక్తి నామవాచకంతో 'సహ' శబ్దం చేరి బహువ్రీహి అయి విశేషణం అవుతుంది. అప్పుడు 'సహ' శబ్దం 'స' అని వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు సహ పుత్రుడు, సపుత్రుడు'. ఇక్కడ 'పుత్రునితో సహ( కూడ) అని అర్థం. ఆశీస్సు(దీవెన)ను తెలిపేటప్పుడు 'సహ' శబ్దం 'స' కాదు. ఉదాహరణకు ' సహ పుత్రుఁడగు రాజునకు స్వస్తి యనవలయును'.

సులభవ్యాకర్త "సంఖ్యావాచకము సంఖ్యావాచకముతోఁ గలసి బహువ్రీహియైన యెడల సంఖ్యోభయపద బహువ్రీహి" (సులభ. సమాస:60) అని సూత్రీకరించారు. ఒక సంఖ్యావాచకం వేరొక సంఖ్యావాచకంతో కలిసి బహువ్రీహి అయితే దానిని 'సంఖ్యా ఉభయపద బహువ్రీహి' అంటారు. ఉదాహరణకు 'ద్విత్రము'. ఇద్దరో ముగ్గురో అని అర్థం. అలాగే 'ద్విదశము' రెండు పదులు అనగా ఇరవై అని అర్థం.

సులభవ్యాకర్త "దిక్కులయంతరాళమును (నడిమి ప్రదేశము) దెలుపు బహువ్రీహి దిగంతరాళ బహువ్రీహి" (సులభ. సమాస:61) అని సూత్రీకరించారు. దిక్కుల అంతరాలము లేక మధ్యగల ప్రదేశాన్ని తెలిపే బహువ్రీహిని 'దిగంతరాళ బహువ్రీహి' అంటారు. ఉదాహరణకు 'దక్షిణ పూర్వము' అనగా దక్షిణానానికి తూర్పుకి మధ్య ప్రదేశం అని అర్థం. దీనినే ఆగ్నేయ మూల అంటారు. ఇలాగే 'ఉత్తర పూర్వము'.

సులభవ్యాకర్త "వ్యతిహారలక్షణ బహువ్రీహి" (సులభ. సమాస:62) అని సూత్రీకరించారు. వ్యతిహారం అనగా తన విషయంలో ఇంకొకరు ఏ విధంగా ప్రవర్తించునో, వేరొకరి విషయంలో తను కూడా అదే విధంగా ప్రవర్తించడం. ఉదాహరణకు 'కచా కచి'. అనగా ఒకడి వెంట్రుకలు మరొకడు పట్టుకొని చేయు యుద్ధము. ఇలాగే దండా దండి, ముష్టా ముష్టి , హస్తా హస్తి'.

బాలవ్యాకర్త "స్త్రీసమ ఘటితంబ యొకానొకండు బహువ్రీహి చూపెట్టెడు"(బాల. సమాస:6) అని సూత్రీకరించారు. స్త్రీసమాలచేత కూర్చబడినది కొద్దిమాత్రంగా బహువ్రీహి సమాసం కనిపిస్తున్నది. బహువ్రీహి సమాసంలో పూర్వ, ఉత్తర పదాలు రెండు స్త్రీసమాస పదాల చేత కూర్చబడతాయని, అవి కూడా భాషలో చాలా తక్కువుగా ఉన్నాయని అర్థం. ఉదాహరణకు 'ముక్కంటి'. మూడు కన్నులు కలవాడు(శివుడు) అని విగ్రహవాక్యం. 'మూడు+కన్నులు' అని ఉండగా సమాస 25 సూత్రం చేత 'మూడు+కన్ను' అయింది. ప్రస్తుత సూత్రంచేత 'న్ను' స్థానంలో పూర్ణబిందు పూర్వక టి అనేది ఆదేశంగా రాగా 'మూడు+కంటి', సమాస 17 సూత్రం చేత 'మూ+కంటి' , సమాస 13 సూత్రం చేత 'ముక్కంటి' అని అవుతుంది. ఇది స్త్రీ సమం కాబట్టి తత్సమ 44 సూత్రం చేత ప్రథమా ఏకవచనానికి లోపం వచ్చి 'ముక్కంటి' అని ఉంటుంది.

సులభవ్యాకర్త "తెలుఁగున స్త్రీ సమఘటితంబ యొకానొకండు బహువ్రీహి చూపట్టెడు" (సులభ. సమాస:63) అని సూత్రీకరించారు. తెలుగులో స్త్రీసమాలచేత కూర్చబడినది కొద్దిమాత్రంగా బహువ్రీహి సమాసం కనిపిస్తున్నది. ఉదాహరణకు ' ముక్కంటి, వేగంటి, చలి వెలుగు'.

బాలవ్యాకర్త "బహువ్రీహి సమాసాంత కార్యంబులు గానంబడియెడి"(బాల. సమాస:22) అని సూత్రీకరించారు. బహువ్రీహి సమాసాల చివర వర్ణాదేశాది కార్యాలు కలుగటం ప్రయోగాలలో కనిపిస్తున్నాయి. ఉదాహరణకు 'ముక్కంటి'. మూడు కన్నులు కలవాడు(శివుడు) అని విగ్రహవాక్యం. 'మూడు+కన్నులు' అని ఉండగా సమాస 25 సూత్రం చేత 'మూడు+కన్ను' అయింది. ప్రస్తుత సూత్రంచేత 'న్ను' స్థానంలో పూర్ణబిందు పూర్వక టి అనేది సమాసాంత కార్యంగా ఆదేశంగా రాగా 'మూడు+కంటి', సమాస 17 సూత్రం చేత 'మూ+కంటి' , సమాస 13 సూత్రం చేత 'ముక్కంటి' అని అవుతుంది. ఇది స్త్రీ సమం కాబట్టి తత్సమ 57 సూత్రం చేత ప్రథమా ఏకవచనానికి లోపం వచ్చి 'ముక్కంటి' అని ఉంటుంది.

సులభవ్యాకర్త "తెలుఁగునను బహువ్రీహిని సమాసాంత కార్యంబులు గానంబడియెడి" (సులభ. సమాస:64) అని సూత్రీకరించారు. తెలుగులో బహువ్రీహి సమాసాల చివర వర్ణాదేశాది కార్యాలు కలుగటం ప్రయోగాలలో కనిపిస్తున్నాయి. ఉదాహరణకు 'ముక్కంటి'. కడలిరాచూలి, నలువ'.

## 6.4 అవ్యయీభావ సమాసము

సులభవ్యాకర్త "పూర్వ పదార్థ ప్రధానము అవ్యయీభావము" (సులభ. సమాస:65) అని సూత్రీకరించారు. సమాసంలో పూర్వ పదంలోని అర్థమే ప్రధానంగా ఉంటే దానిని అవ్యయీభావ సమాసం అంటారు. ఈ సమాసంలో ప్రాయికంగా మొదటి పదం అవ్యయంగా, రెండవది నామవాచకంగా ఉంటుంది. ఉదాహరణకు 'నిర్+ జనము= నిర్జనము'.

సులభవ్యాకర్త "తెనుంగున నొక్కొకచో సమాసగతపూర్వపదంబు వ్యవహితోత్తరపదం బొంటితోడను, వాని పెక్కింటితోడను నన్వయించెడి" (సులభ. సమాస:66) అని సూత్రీకరించారు. తెలుగులో ఒక్కొక్కసారి సమాసంలోని పూర్వపదం వ్యవహితంగా ఉన్న ఒక ఉత్తర పదంతోగాని, పెక్కు(చాలా) ఉత్తర పదాలతోగాని అన్వయించబడుతుంది. ఉదాహరణకు 'వాని బలమును తేజమును'. ఇక్కడ 'వాని బలమును వాని తేజమును' అని అర్థం.

సులభవ్యాకర్త "అక్షి శబ్ద మకారాంత మగు" (సులభ. సమాస:67) అని సూత్రీకరించారు. 'అక్షి' శబ్దం అకారాంతం అవుతుంది. 'జలజాక్షుడు' జలజము వంటి కన్నులు కలవాడు. 'జలజాక్ష' శబ్దం తత్సమంలో 'జలజాక్షుడు' అవుతుంది. 'జలజాక్ష' శబ్దం స్త్రీలింగరూపం 'జలజాక్షి'. సూత్రంలో 'బహువ్రీహిని' అనే పదం అధ్యాహార్యం.

సులభవ్యాకర్త"అవర్ణపూర్వకంబైన శక్తి శబ్దము వైకల్పికంబుగ అకారాంత మగు" (సులభ. సమాస:68) అని సూత్రీకరించారు. 'అ' అనే అక్షరం పూర్వంగల 'శక్తి' శబ్దం వికల్పంగా అకారాంతంగా అవుతుంది. ఉదాహరణకు ' అశక్తుదు, అశక్తి'.

సులభవ్యాకర్త"బహువ్రీహి సమాసాంతమున i. జాయ–జాని యగు ii. ఉత్ – పూతి–సు శబ్దంబులు పూర్వమందున్నను, ఉప, మానద్యోతక మగు సమాసంబునను గంధశబ్దము గంధియగు" (సులభ. సమాస:69) అని సూత్రీకరించారు. బహువ్రీహి సమాసాంతంలో 'జాయ' అనేది ' జాని' అవుతుంది. 'ఉత్', పూతి, సు శబ్దాలు పూర్వమందు కలిగి ఉపమాన బోధకాలుగా ఉండి సమాసం అయ్యేటప్పుడు 'గంధ' శబ్దం 'గంధి' అవుతుంది. ఉదాహరణకు ' వాగ్జాని' సరస్వతి ఎవరికి జాయ(భార్య) అవుతుందో అతడు. 'ఉద్గంధి' మీద వ్యాపించు గంధం కలది. 'పూతి గంధి' చెడువాసన కలది. 'సుగంధి' మంచి వాసన కలది. 'పద్మ గంధి' పద్మ గంధము వంటి గంధము

దేనికి కలదో ఆ స్త్రీ. ఉపమాన ద్యోతకం అనటం వల్ల 'యోజన గంధ' అని రూపము. 'యోజన గంధి' అనటం అసాధువు.

సులభవ్యాకర్త "సు దుస్సులు పూర్వమందుఁగల హృదయ శబ్దము హృత్తగు" (సులభ. సమాస:70) అని సూత్రీకరించారు. 'హృదయ' అనే శబ్దానికి 'సు, దుస్' అనే ప్రత్యయాలు పూర్వపదంగా ఉంటే 'హృదయ' శబ్ద స్థానంలో ' హృత్' అనేది ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు 'సుహృత్తు( స్నేహితుడు)', దుర్హృత్తు( విరోధి)'.

## ముగింపు:

సులభవ్యాకర్త ప్రసిద్ధమైన పదాలు కలిసి ఒక పదంగా ఏర్పడటం సమాసమని చెప్పారు. బాల, ప్రౌఢ వ్యాకరణాల కంటె విస్తృతంగా 'ద్వంద్వ సమాసం, తత్పురుష సమాసం, బహువ్రీహి సమాసం, అవ్యయీభావ సమాసం' మొదలైన వాటిని సులభవ్యాకర్త చర్చించారు. అచ్చ తెలుగు పదాలతో ఏర్పడే సమాసాన్ని ఆచ్చిక సమాసమని, ఈ ఆచ్చికసమాసాన్ని 'సమాసకం' అని కూడా అంటారని సులభవ్యాకర్త చెప్పారు. మిశ్రసమాసంలో మొదట సంస్కృతశబ్దం ఉండదని చెప్పారు. సమాసాంతంలోని శబ్దం ఏ లింగంలో ఉంటుందో అదే లింగం ఆ సమాసం మొత్తానికి దాని విశేషణానికి కూడా అవుతుందని సులభవ్యాకర్త చెప్పారు. తెలుగులో ఒక్కొక్కసారి సమాసంలోని పూర్వపదం వ్యవహితంగా ఉన్న ఒక ఉత్తర పదంతోగాని, పెక్కు(చాలా) ఉత్తర పదాలతోగాని అన్వయించబడుతుందని సులభవ్యాకర్త చెప్పారు.

సులభవ్యాకర్త 'ద్వంద్వ సమాసం' ఇతరేతర ద్వంద్వము, సమాహార ద్వంద్వము, ఏకశేషమని మూడు రకాలుగా ఉంటుందని, 'తత్పురుష సమాసం' సమానాధికరణము, వ్యధికరణము, నఞ్, ప్రాది, ఉపపదం అని ఐదు భేదాలుగా ఉంటుందని, 'బహువ్రీహి' సమానాధికరణం, వ్యధికరణం అని రెండు రకాలుగా ఉంటుందని, ఈ సమానాధికరణంలో బహువ్రీహి మళ్ళీ ద్వితీయాది భేదాలు చేత ఆరు రకాలుగా ప్రవర్తిల్లుతుందని చెప్పారు. సమాసంలో పూర్వ పదంలోని అర్థమే ప్రధానంగా ఉంటే దానిని అవ్యయీభావ సమాసం అంటారని సులభవ్యాకర్త చెప్పారు. ఇక్కడ చెప్పబడ్డ సమాసాలన్నింటిని ఈ అధ్యాయంలో పరిశీలించడం జరిగింది.

**ఏడవ అధ్యాయం:** 'క్రియారూప విజ్ఞానం' అనే అధ్యాయంలో సమాక క్రియ లైన 'వర్తమానార్థకం, భూతార్థకం, భవిష్యదర్థకం, తద్ధర్మాదులు, ఆశీశ్శాప సంప్రార్థనా విధులు, వ్యతిరేకార్థకాల్ని, అసమాపక క్రియలైన 'భావార్థకం, క్త్వార్థం, చేదర్థకం, ఆనంతర్యార్థకం, శత్రర్థకాలను,' ధాతుజ విశేషణాలు, ఇంచుక్ ప్రకరణం– ప్రేరణార్థక క్రియలను పరిశీలిస్తాను.

## ఆరవ అధ్యాయం

## సమాస విజ్ఞానం– సూత్రాల పట్టిక

| క్రమ సంఖ్య | బాలవ్యాకరణము సూత్రము: సంఖ్య | సులభవ్యాకరణము సూత్రము: సంఖ్య | సవరణ | పూరణ | వివరణ | నూతన విషయ ప్రతిపాదన |
|---|---|---|---|---|---|---|
| 1. | సాంస్కృతికకాచ్ఛ క మిశ్రభేదంబు.. సమాస:2 | భాషా భేదంబు వలన సమాసము సమాస:2 | –– | –– | ✓ | –– |
| 2. | –– | అనేక సుబంతములు .. సమాస:7 | –– | –– | –– | ✓ |
| 3. | –– | ప్రత్యేకాన్వయము గలది.. సమాస:8 | –– | –– | –– | ✓ |
| 4. | –– | సమాసాంత శబ్దలింగమె.. సమాస: 9 | –– | –– | –– | ✓ |
| 5. | –– | సమాహార ద్వంద్వంబు.. సమాస:10 | –– | –– | –– | ✓ |
| 6. | –– | ఏక విధ రూపములు గల .. సమాస: 11 | –– | –– | –– | ✓ |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 7. | –– | పుంలింగ స్త్రీలింగ శబ్దము లేక.. సమాస:12 | –– | –– | –– | ✓ |
| 8. | –– | సమాన రూపంబులు గల.. సమాస:13 | –– | –– | –– | ✓ |
| 9. | –– | ద్వంద్వాంతమంద లి శబ్దము.. సమాస:17 | –– | –– | –– | ✓ |
| 10. | –– | అవధారణాపదము పూర్వమందుఁ సమాస:27 | –– | –– | –– | ✓ |
| 11. | –– | మిశ్రద్విగువున విశేషణం బెకాం.. సమాస:32 | –– | –– | –– | ✓ |
| 12. | –– | "త్రికంబున నేదైనఁ గర్మధారయమం.. సమాస:34 | –– | –– | –– | ✓ |
| 13. | త్రికంబుమీఁది యసంయుక్త.. సమాస: 14 | త్రికంబునకు నసంయుక్తంబులు. సమాస:36 | –– | ✓ | –– | –– |
| 14. | –– | కర్మధారయంబున రెండు.. సమాస:39 | –– | –– | –– | ✓ |
| 15. | –– | షడ్వర్ణ పర్యంతంబైన .. సమాస:43 | –– | –– | –– | ✓ |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 16. | —— | అకార నకారములు సమాసాది.. సమాస: 50 | —— | —— | —— | ✓ |
| 17. | —— | “సంఖ్యావ్యయంబు లుపూర్వపదంబులై సమాస : 53 | —— | —— | —— | ✓ |
| 18. | —— | తెనుంగున నొక్కొకచో.. సమాస: 66 | —— | —— | —— | ✓ |
| 19. | —— | అక్షి శబ్ద మకారాంత.. సమాస:67 | —— | —— | —— | ✓ |
| 20. | —— | అవర్ణపూర్వకంబైన శక్తి.. సమాస:68 | —— | —— | —— | ✓ |
| 21. | | సు దుస్సులు పూర్వమందుఁగల సమాస:70 | | | | |

# అధ్యాయం – 7

# క్రియారూప విజ్ఞానం

# అధ్యాయం – 7

# క్రియారూప విజ్ఞానం

## 7.0 పరిచయం

'ధాతువునకు' అనే మొదటి సూత్రంతో బాలవ్యాకర్త క్రియా పరిచ్ఛేదాన్ని మొదలుపెట్టారు. క్రియా ప్రాతిపదికనే ధాతువని బాలవ్యాకర్త అన్నారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త 'సంజ్ఞా పరిచ్ఛేదం'లో సంజ్ఞలను చెప్పే క్రమంలో 'ధాతువు క్రియ'(సులభ. సంజ్ఞా:52) అని చెప్పారు. బాల, ప్రౌఢ, సులభ వ్యాకరణాల రూపనిర్మాణంలో మొదట ధాతువు మీద క్రియా ప్రత్యయమే చేరుతుంది. తరువాత మధ్యలో లకారాలు వంటి అనుబంధాలు చేరుతాయి. దీనిని బట్టి లకారాదులను తెలియజేయు రూపాలతో కలిసి ఉన్న ధాతువు ప్రాతిపదిక అనబడుతుంది. దానిపై లింగ, పురుష, వచనాలను తెలియజేయు క్రియా ప్రత్యయం మాత్రం చేరుతుంది.

వావిలికొలనువారు క్రియలన్నింటిని మొదటగా నిర్వచించిచారు. క్రియలను తత్సమాలు, ఆచ్ఛికాలు అని రెండు రకాలుగా విభజించారు. "సంస్కృత ధాత్వాదులకు 'ఇంచు' చేర్పఁగా నైనవి తత్సమక్రియలు" (సులభ. క్రియా:1). సంస్కృత ధాతువులకు 'ఇంచు' చేర్చగా ఏర్పడేవి తత్సమక్రియలు. ఉదాహరణకు ' రంజించు, పోషించు, స్తుతించు. ఆచ్ఛిక క్రియలకు ఉదాహరణ 'చేయు, కొట్టు, తిట్టు'.

సులభ వ్యాకర్త క్రియలను రెండు రకాలుగా చెప్పారు. "కర్మమును గోరునది సకర్మము" (సులభ. క్రియా:2). కర్మను కోరేది సకర్మకం . ఉదాహరణకు 'శూరుదు శత్రువులను కొట్టును'. "కర్మమును గోరనిది అకర్మకము" (సులభ. క్రియా:3). కర్మను కోరనిది అకర్మకం. ఉదాహరణకు 'అవివేకి పట్టిన కార్యము పాడగును'.

ఈ సకర్మక , అకర్మక క్రియలు మళ్ళీ రెండు రకాలు . "కార్యము కొఱంత లేక ముగియునట్టు చెప్పునది సమాపక క్రియ" (సులభ. క్రియా:4). కార్యం కొరత లేకుండా ముగిసినట్లు చెప్పేది సమాపక క్రియ. ఉదాహరణకు 'వాడు వచ్చెను'. "కార్యము పూర్ణముగ ముగియనట్టు చెప్పునది

యసమాపక క్రియ" (సులభ. క్రియా:5). కార్యం పూర్తి అవ్వనట్లు చెప్పేది అసమాపక క్రియ. ఉదాహరణకు ' వాడు వచ్చిచూ బోవుచూ  నాతో మాట్లాడెను.

అసమాపక క్రియలు రెండు రకాలు. క్రియాకాంక్షా సమాపకాలు, నామాకాంక్షా సమాపకాలు. "క్త్వార్థకము లోనగు క్రియలు క్రియాకాంక్షా సమాపకములు"(సులభ. క్రియా:6) 'క్త్వార్థం' మొదలైన క్రియలు 'క్రియాకాంక్ష అసమాపకాలు'. "క్రియాజన్య విశేషణములు నామాకాంక్షా సమాపకములు"(సులభ.క్రియా:7). క్రియాజన్య విశేషణాలను 'నామాకాంక్ష అసమాపకాలు' అంటారు.

వావిలికొలనువారు కాలాలను బట్టి క్రియలను నాలుగు రకాలుగా విభజించారు. అవి వర్తమానార్థకం, భూతార్థకం, భవిష్యదర్థకం, తద్ధర్మార్థకం. ఈ సమాపక క్రియలకు ఉత్తమపురుష, మధ్యమ పురుష, ప్రథమ పురుష అని మూడు పురుషలు ఉన్నాయి. వీటి సంజ్ఞలను కూడా వావిలికొలనువారు సూత్ర రూపంలో నిర్వచించారు. "తన్ను త్తమ పురుషము" (సులభ. క్రియా:13)"ఎదురు మధ్యమ పురుషము" (సులభ. క్రియా:14)"ఎక్క డెక్కడనో ప్రథమ పురుషము" (సులభ. క్రియా:15). బాలవ్యాకర్త కూడా ప్రథమ, మధ్యమ, ఉత్తమ పురుషలను నిర్వచించి వాటికి వచ్చే ప్రత్యయాలను చెప్పారు.

సులభవ్యాకర్త తత్సమ, ఆచ్ఛిక, సకర్మక, అకర్మక, క్రియాకాంక్షా సమాపకాలు, నామాకాంక్షా సమాపకాలు మొదలైన క్రియలను సూత్రాలలో ప్రత్యేకంగా నిర్వచించారు. బాల, ప్రౌఢ వ్యాకర్తలు సందర్భోచితంగా వీటి సంజ్ఞలను నిర్వచించారు తప్ప సూత్రాలుగా చెప్పలేదు.

## 7.1 సమాపక క్రియలు

ధాతువుల మీద పురుష ప్రత్యయాలు, కాలవాచక ప్రత్యయాలు చేరి సమాపక క్రియ ఏర్పడుతుంది. ఇది కాలాన్ని, పురుషను, వచనాన్ని అనుసరించి మారుతుంది. వివిధ అర్థాలలో క్రియారూపాలను వ్యవహరించడానికి, వేరు వేరు అర్థాలను బోధించే ప్రత్యయాలను చేర్చి వాక్యాన్ని పూర్తి చేయటానికి ఉపయోగించే క్రియలు 'సమాపక క్రియలు'. ఆ అర్థాలు తద్ధర్మాది, ఆశీస్సు, శాపార్థం, సంప్రార్థన, విధి, వ్యతిరేకార్థక క్రియలు.

## 7.1.1 వర్తమానార్థకం (లట్టు)

బాలవ్యాకర్త "వర్తమానంబున లట్టగు" (బాల. క్రియా:2) అని సూత్రీకరించి వర్తమానకాల వ్యాపారాన్ని బోధించటానికి ధాతువుకు 'లట్' అనే ప్రత్యయం వస్తుందని చెప్పి, వృత్తి వాక్యంలో 'వర్తమానార్థకాన్ని' నిర్వచించారు. సులభవ్యాకర్త "జరగుచున్న కాలమును దెలుపునది వర్తమానార్థకము" (సులభ.క్రియా:8) అని సూత్రీకరించి 'వర్తమానార్థకాన్ని' నిర్వచించి వివరణలో 'లట్' ప్రత్యయం చర్చ చేశారు. ఒక విషయం గురించి మాట్లాడుతున్నప్పుడు అప్పటికి ఆ కార్యం ముగియకుండా జరుగుతున్నచో అది వర్తమానకాలం అనబడుతుందని దీనిని 'లట్టు' అంటారని వావిలికొలనువారు నిర్వచించారు. ఉదాహరణకు 'రాముఁడు వచ్చుచున్నాడు'. అనగా ఈ మాట చెప్పబడే సమయంలో 'వచ్చుట' అనే కార్యం రాముడిచేత చేయబడుతున్నది. అప్పటికి ముగియలేదని అప్పటికి ప్రారంభంగాక ఉండలేదని అర్థం.

బాలవ్యాకర్త "ఉదంతంబునకు లట్టుపరంబగునపు డున్నానుబంధంబగు"(బాల. క్రియా:13), "ఉన్నశబ్దంబు పరంబగునపుడు చువర్ణకంబగు"(బాల.క్రియా:14) అని రెండు సూత్రాలలో ఉదంతమైన ధాతువుకు వర్తమానకాలబోధక (లట్) ప్రత్యయం పరమవుతుంటే "ఉన్న" అనే శబ్దాన్ని, దానికి ముందు 'చు' వర్ణాన్ని విధించారు. సులభవ్యాకర్త "ఉదంత ధాతువులకు వర్తమానంబున 'ఉన్న' యనుబంధమగు. అగుచో ముందు 'చు' వర్ణకంబగు" (సులభ.క్రియా:16) అని ఒకే సూత్రంలో వర్తమానార్థంలో ఉకారాంత ధాతువులకు 'ఉన్న' శబ్దం , దాని ముందు 'చు' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు ' వచ్చు+ చు+ ఉన్న= వచ్చుచున్న'.

సులభవ్యాకర్త " 'ఉన్న' వర్తమానార్థక విశేషణంబున నగు" (సులభ. క్రియా:54) అని సూత్రీకరించారు. 'ఉన్న' శబ్దం వర్తమాన బోధక విశేషణంగా ఉంటుంది. ఉదాహరణకు 'వచ్చుచున్నవాడు'. బాల, ప్రౌఢ వ్యాకర్తలు ఈ విషయాన్ని ప్రత్యేకంగా సూత్రంలో నిర్వచించలేదు.

సులభవ్యాకర్త "క్రియాఫలము కర్తనుగాక యితరునిఁ జెందుచోఁ బర స్మైపదం బగు" (సులభ. క్రియా:61) అని సూత్రీకరించారు. క్రియాఫలం కర్తకు కాక ఇతరులకు చెందితే దానిని పరస్మైపదం అంటారు. ఉదాహరణకు 'వండుచున్నాడు'. ఇక్కడ వంటకము వండినవాడికి మాత్రమే కాక ఇతరులకు కూడా అని అర్థం.

సులభవ్యాకర్త "క్రియా ఫలము కర్తను జెందుచో నది యాత్మ నేపద మనఁబడును. ఆత్మనేపదమందుఁ గొను ధాతు వనుప్రయుక్త మగు" (సులభ. క్రియా:62) క్రియాఫలం కర్తకు చెందినదైతే అది ఆత్మనేపదం అంటారు. ఆత్మనే పదాలకు 'కొను' ధాతువు అనుసరించి వస్తుంది. ఉదాహరణకు 'వండుకొనుచున్నాడు', తన్నుకొనుచున్నాడు. ఇక్కడ వంటకము చేసినవాడే తినువాడు అని అర్థం. బాల, ప్రౌఢ వ్యాకర్తలు ప్రత్యేకంగా ఆత్మనేపదం, పరస్మైపదం వంటి వాటిని ప్రత్యేకంగా సూత్ర రూపంలో నిర్వచించలేదు.

బాలవ్యాకర్త 'ఉన్న' శబ్దం పరమైనప్పుడు 'ఉండు' ధాతువుకు లోపం వస్తుందని చెప్పారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త "ఉన్న శబ్దంబు పరంబగునపు డుండు ధాతువునకు లోపం బగు" (సులభ. క్రియా:66) అని సూత్రీకరించి 'ఉండు+ ఉన్న+ ఆడు = ఉన్నాడు' వంటి రూపాన్ని పేర్కొన్నారు.

బాలవ్యాకర్త 'తి–దు–ట' అనేవి ధాతువుకు పరమవుతుంటే 'అను' మొదలైన ధాతువుల చివరి అక్షరమైన 'ను' అనే దానికి నిండు సున్నా, 'ఉండు' ధాతువులోని 'డు' అనుదానికి లోపమును, విభాషగా వస్తాయని చెప్పారు. సులభవ్యాకర్త కూడా ఇదే విషయాన్ని "తి దు ట–లు పరంబు లగునపు డన్వాదుల నుస్థానంబున సున్నయు నుండు డులోపంబును విభాష నగు" (సులభ. క్రియా:68) అని సూత్రీకరించి. 'అను+తిరి= అంతిరి, ఉండు+ట = ఉంట వంటి రూపాలను సాధించారు.

## 7.1.2 భూతార్థకం (లిట్)

బాలవ్యాకర్త "భూతంబున లిట్టగు"(బాల.క్రియా.03) భూతకాలాన్ని బోధించు వ్యాపారాన్ని తెలియజేయటానికి ధాతువుకు 'లిట్' ప్రత్యయం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త "కడచిన కాలమును దెలుపునది భూతార్థకము" (సులభ. క్రియా:9) అని భూతార్థాన్ని సూత్రీకరించి, వివరణలో ' లిట్' ప్రత్యయ చర్చ చేశారు. ఉదాహరణకు 'రాముడు వచ్చెను' అని చెప్పినపుడు 'వచ్చుట' అనే కార్యం ఈ మాట చెప్పడానికి ముందే పూర్తయింది. 'వచ్చుట' అనే కార్యం అప్పటికి జరగడం లేదని, ఇక మీద ప్రారంభం కాదని అర్థం. దీనిని 'లిట్టు' అంటారు.

సులభవ్యాకర్త “అన్వర్థంబున భూతంబునకుఁ దద్ధర్మాద్యర్థకం బగు” (సులభ. క్రియా:18) అని సూత్రీకరించారు. ‘అనుట, చెప్పుట, పలుకుట’ మొదలైనవి అన్వర్థాలు. ‘అనుట’ అనే అర్థంలో భూతార్థానికి బదులుగా ‘తద్ధర్మార్థకం’ ఉపయోగించవచ్చు. ఉదాహరణకు ‘విశ్వామిత్రుఁడు రాముని కనియెన్’ అనడానికి బదులుగా ‘ విశ్వామిత్రుఁడు రాముని కనున్’ అని చెప్పవచ్చు. బాల, ప్రౌఢ వ్యాకర్తలు ఈ విషయాన్ని చర్చించలేదు.

బాలవ్యాకర్త “భూతంబునం దిగాగమంబగు”(బాల. క్రియా.17) అని సూత్రీకరించారు. భూతకాలాన్ని బోధించేటపుడు ధాతువుకి “ఇ” అనే ఆగమం ధాతువు చివర (కిత్తుగా) వస్తుందని చెప్ప ‘వందు+ఇ+రు= వందిరి’ వంటి రూపాలను సాధించారు. సులభవ్యాకర్త “భూతంబున ధాత్వంతోత్వ మిత్వ మగు:” (సులభ. క్రియా:19) భూతకాలాన్ని బోధించేటప్పుడు ధాతువుకి చివర ఉన్న ఉకారానికి ఇకారం వస్తుందని ‘వచ్చు+ఇ= వచ్చి’ వంటి ఉదాహరణని ఇచ్చారు. బాలవ్యాకర్త భూతార్థంలో ‘ఇ’ వర్ణాన్ని ఆగమంగా చెప్పగా, సులభ వ్యాకర్త ‘ఇ’ వర్ణాన్ని ఆదేశంగా చెప్పారు.

బాలవ్యాకర్త తత్సమపరిచ్ఛేదంలో “ఇకారంబు మీది కు- ను- వు క్రియా విభక్తుల యుత్వంబున కిత్వంబగు”(బాల.తత్సమ:26) అని సూత్రీకరించి షష్ఠి విభక్తి ప్రత్యయమైన ‘కు’, ద్వితీయా విభక్తి ప్రత్యయమైన ‘ను’, ఆగమ ‘ను- వు’ వర్ణాలకు, క్రియా విభక్తి ప్రత్యయాలైన ‘వు-రు-ను-ము’ లకు ఇత్వాన్ని విధించారు. సులభవ్యాకర్త “ఇత్వంబుమీఁది ను మువురు-ల కిత్వంబగు” (సులభ.క్రియా:20) అని సూత్రీకరించారు. ఇకారం తరువాత వచ్చే ‘ను, ము, వు, రు’ లకు ఇకారం వస్తుందని క్రియా విభక్తి ప్రత్యయాల గురించి మాత్రమే సందర్భోచితంగా చెప్పి ‘వచ్చి+తి +ని=వచ్చితిని, వచ్చితిమి, వచ్చితివి, వచ్చితిరి’ వంటి రూపాలను సాధించారు.

బాలవ్యాకర్త భూతకాలమందు (లిట్టు) ధాతువుకు ప్రథమపురుష ఏకవచనంలోవచ్చే డుజ్ – అనే ప్రత్యయానికి “ఎను” అనేది, తద్ధర్మాదులందు (లాట్టు) ధాతువునకు ప్రథమపురుష ఏకవచనంలో వచ్చే డుజ్ – అనే ప్రత్యయానికి నువర్ణము ఆదేశంగా వస్తుందని చెప్పారు. అదే విషయాన్ని సులభవ్యాకర్త “భూత తద్ధర్మాద్యర్థకంబులం దేకవచనంబున ఎను – ను వర్ణకంబులగు” (సులభ. క్రియా:17) అని సూత్రీకరించి ‘వచ్చు+ ఎను= వచ్చెను, వచ్చు+ను=వచ్చును’. వంటి రూపాలను సాధించారు.

సులభవ్యాకర్త " 'ఇన' భూతార్థక విశేషణంబున నగు" (సులభ. క్రియా:55) భూతార్థక విశేషణంగా 'ఇన' కన్పిస్తుంది. ఉదాహరణకు 'వచ్చిన రాముఁడు'. బాల. ప్రౌఢ వ్యాకర్తలు ఈ విషయాన్ని ప్రత్యేకంగా సూత్రీకరించలేదు.

బాలవ్యాకర్త 'పడు' మొదలైన వాని నవర్ణానికి అత్వము, చివర హల్లుకి ద్విత్వం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'పడు+ఇ+న= పడి+న =పడి+అ= పడ్డ'. వికల్పంవల్ల అత్వం, ద్విత్వం రాకపోతే 'పడిన' అని ఉంటుందని చెప్పారు. ఇదే విషయాన్ని చెబుతూ సులభవ్యాకర్త "పడ్వాదుల 'నిన' వర్ణకంబున కత్వంబును గడహల్లునకు ద్విత్వంబును విభాష నగు" (సులభ. క్రియా:60) అని సూత్రీకరించారు. 'పడు' మొదలైనవాటికి వచ్చిన 'ఇన' అనే ప్రత్యయానికి అత్వం చివరి హల్లుకి ద్విత్వం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'పడు +ఇన= పడిన, పడు+అ= పడ్డ'. బాలవ్యాకర్త 'న' వర్ణానికి అత్వం వస్తుందని చెప్పారు. కాని సులభవ్యాకర్త 'ఇన' అనే ప్రత్యయానికి అత్వం వస్తుందని చెప్పారు.

సులభవ్యాకర్త "కొనుధాతువు పరంబగునపుడు యకారాంత ధాతువులకు నిత్యంబుగను, దదన్యంబులకు వైకల్పికంబుగను ఇగాగమం బగు" (సులభ. క్రియా:63) అని సూత్రీకరించి 'కొను' ధాతువు పరమయ్యేటప్పుడు యకారం అంతంగా ఉండే ధాతువులకు నిత్యంగా, ఇతర ధాతువులకు వికల్పంగా 'ఇ' ఆగమంగా వస్తుందని చెప్పారు. యకారాంత ధాతువులకు ఉదాహరణగా 'తీయు+కొను= తీయు+ఇ+ కొను' తీసుకొను' అవుతుంది. ఇతర ధాతువులకు 'ఇకారం' ఆగమంగా వచ్చినప్పుడు 'అడుగు+ఇ+ కొను= అడుగు కొను, అడిగి కొను'. ఇలా రెండు రకాలుగా ప్రయోగాలు ఉన్నాయని వికల్పం అన్నారు.

సులభవ్యాకర్త ఈ సూత్ర వివరణలో 'వ్రాసికొను, చేసి కొను, మూసికొను' అనే రూపాలను సాధువులుగా, 'చేసుకొను, మూసుకొను, తీసుకొను' వంటి రూపాలను అసాధువులుగా చెప్పారు. 'చేసికొను– తన్ను కొని' మొదలైన వాటిలో 'కొని' కి 'క' వర్ణాదేశం, ధాతువులోని 'య' వర్ణానికి 'స' కారం ఆధునిక ప్రయోగాలలో కన్పిస్తుందని 'తన్నుక, చేసుక' వంటి ఉదాహరణలను పేర్కొన్నారు. బాల, ప్రౌఢ వ్యాకర్తలు ఈ విషయాలను చర్చించలేదు.

## 7.1.3 భవిష్యదర్థకం(లృట్)

బాలవ్యాకర్త "భావిని లృట్టగు"(బాల.క్రియా:04) అని భవిష్యత్ కాల వ్యాపారాన్ని బోధించడానికి ధాతువులకు 'లృట్' ప్రత్యయం వస్తుందని చెప్పారు. వృత్తి వాక్యంలో భవిష్యదర్థకానికి నిర్వచనం చెప్పారు. సులభవ్యాకర్త "రాఁ గల కాలమును దెలుపునది భవిష్యదర్థకము" (సులభ. క్రియా:10) అని సూత్రంలో నిర్వచనం చెప్పి వివరణలో 'లృట్' ప్రత్యయం వస్తుందని చెప్పారు.

బాలవ్యాకర్త భవిష్యదర్థంలో 'కలజి' అనేది అన్ని పురుషలలో ధాతువు చివర అనుబంధంగా వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "భవిష్య దర్థకంబున 'కల'(కలజి) యగు" (సులభ.క్రియా:21) అని సూత్రీకరించి భవిష్యదర్థంలో ధాతువుకు 'కలజి' అనుసరించి వస్తుందని 'చేయు+ కల= చేయఁగల'. చేయంగల' అనే రూపాలను పేర్కొన్నాడు.

సులభవ్యాకర్త "కల-పడు(పడుజి)లును, బ్రార్థనాదులైన ఇమ్ము-కదె-కదవె-లును, అగు ధాతువున కన్నంతరూపంబులును, బరంబు లైనపుడును, దుమున్నర్థ భావలక్షణంబులను ధాతువుల న్ప్రత్యయాంతము లగు" (సులభ. క్రియా:22) అని సూత్రీకరించారు. భవిష్యదర్థంలో వచ్చె 'కల-పడు' అనేవి, ప్రార్థనార్థంలో వచ్చె 'ఇమ్ము- కదె- కదవె' అనేవి, 'అగు' ధాతువుకు అన్నంత రూపాలు పరమైనపుడు, తుమున్నాద్యర్థకంలో, భావలక్షణంలో ధాతువులకు ' అన్' ప్రత్యయం వస్తుందని చెప్పారు. ఉదాహరణగా భవిష్యదర్థంలో 'చేయు+ కల= చేయన్+ కల=చేయఁగల, చేయంగల', చేయన్+పడు= చేయఁబడు, ప్రార్థనార్థంలో 'చేయన్+ ఇమ్ము= చేయనిమ్ము, చేయన్+ కదె= చేయఁగదె, చేయన్+ కదవె= చేయఁగదవె, తుమున్నాద్యర్థకంలో 'చేయఁ బ్రయత్నించెను', భావలక్షణంలో 'వీఁడు చేయ నతఁడు చూచెను' వంటి వాటిని సులభవ్యాకర్త పేర్కొన్నారు. ఈ విషయాలను బాల, ప్రౌఢ వ్యాకర్తలు ప్రత్యేకంగా చెప్పలేదు.

బాలవ్యాకర్త 'ఞి' ఇత్సంజ్ఞగా కలిగిన 'లజి-కలజి-నిజి-మిజి' మొదలైనవి పరమవుతుంటే ధాత్వాంతంలో గల ఉత్వానికి అత్వం ఆదేశంగా వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "జిత్తు పరంబగునపుడు ధాతువు కడపటి యుకార మకారమగు"(సులభ. క్రియా:23) అని సూత్రీకరించారు. సులభవ్యాకర్త "(కలజి) 'కల' భవిష్యదర్థక విశేషణంబున నగు" (సులభ.

క్రియా:56) అని సూత్రీకరించి 'కల' అనేది భవిష్యదర్థక విశేషణ సూచకంగా ఉంటుందని చెప్పారు. బాల, ప్రౌఢ వ్యాకర్తలు ప్రత్యేకంగా చెప్పలేదు.

బాలవ్యాకర్త కర్మార్థంలో సకర్మ ధాతువునకు 'పడుజీ' అనే అనుబంధం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "(పడుజీ) పద్వనుబంధము కర్మార్థకంబున నగు" (సులభ. క్రియా:58) అని సూత్రీకరించి 'చూడఁబడు చున్నాఁడు– చూడఁబడు చున్నది' వంటి ఉదాహరణలను పేర్కొన్నారు.

## 7.1.4 తద్ధర్మాదులు (లాట్టు)

సులభవ్యాకర్త "మీఁదఁ జెప్పంబడిన మూఁటికన్న వేఱై యా మూఁడు కాలముల యర్థమునం దుపయోగింపఁ బడునది తద్ధర్మాద్యర్థకము"(సులభ. క్రియా11) అని సూత్రీకరించారు. వర్తమానార్థం, భూతార్థం, భావిష్యదర్థం కంటె భిన్నంగా ఉండి, ఆ మూడు కాలార్థాలను ఉపయోగించుకునేది అని తద్ధర్మాద్యర్థకాన్ని సులభవ్యకర్త నిర్వచించారు. బాలవ్యాకర్త "తద్ధర్మాదులందు లాట్టగు" అని చెప్పినట్లుగానే సులభవ్యాకర్త కూడా తద్ధర్మార్థంలో 'లాట్' ప్రత్యయం వస్తుందని చెప్పారు.

బాలవ్యాకర్త"లాట్టు రుఙ్ఞు పరంబగునపుడు దుగాగమంబగు"(బాల. క్రియా:22) అని చెప్పిన విషయాన్నే సులభవ్యాకర్త "తద్ధర్మాద్యర్థకంబున దుజీ తరంబులు పరంబులగునపుడు దుగాగమంబగు"(సులభ.క్రియా:24). తద్ధర్మార్థకాలలో 'దుజ్' కాకుండా మిగిలినవి (రు,వు,రు,ను,ము) పరమైనప్పుడు ధాతువుకి 'దు' వర్ణం ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'చేయుదును– చేయుదుము'.

బాలవ్యాకర్త"లాట్టు రుఙ్ఞు పరంబగునపు డెదగాగమంబును, బ్రథమ నువర్ణకంబు పరంబగునపు డెడు గెడి గాగమంబులును బహుళంబుగా నగు"(బాల. క్రియా:23) అని సూత్రీకరించారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త "తద్ధర్మంబున దుజితరంబులు పరంబు లగునపుడు 'ఎద' యును, 'ను' వర్ణకంబు పరంబగునపుడు 'ఎడి' 'ఎదు'లును బహుళంబుగ నగు" (సులభ. క్రియా:25) అని సూత్రీకరించారు. తద్ధర్మార్థకంలో 'దుజ్' కాకుండా మిగిలినవి(రు, వు, రు, ను, ము) పరమైనప్పుడు ధాతువుకి ' 'ఎద' ప్రత్యయం 'ను' వర్ణం పరమయ్యేటప్పుడు 'ఎడి' ప్రత్యయం ఆగమంగా వస్తాయి. ఉదాహరణకు ' వచ్చెదను — వచ్చెదము', వచ్చెడిని– వచ్చెదును'.

బాలవ్యాకర్త "లిడ్లాట్టుల వకారంబునకు లోపంబు విభాషనగు"(బాల.క్రియా:24) అని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "భూతతిద్ధర్మంబుల వకారంబునకు లోపంబు వైకల్పికంబు" (సులభ. క్రియా:26) అని సూత్రీకరించారు. తద్ధర్మార్థకంలో వచ్చే వకారానికి లోపం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'వినెదవు– వినెదు'.

బాలవ్యాకర్త "తిర్యగ్జడంబులు వాచ్యంబులగునపుడు లిడ్లాట్టుల ప్రథమ బహువచనంబున కేకవచనంబగు"(బాల.క్రియా:25) అని సూత్రీకరించారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త "తిర్యగ్జడంబులు కర్తలైనచో భూతతద్ధర్మాద్యర్థక ప్రథమాబహువచనంబున కేకవచనంబగు" (సులభ. క్రియా:27) తిర్యక్కులు, జడవాచకాలు కర్తగా వ్యవహరించేటప్పుడు తద్ధర్మార్థక రూపాలకు ప్రథమా బహువచనానికి ఏకవచనం వస్తుంది. ఉదాహరణకు ' చిగుళ్లు విలసిల్లె– విలసిల్లు– విలసిల్లెడి'.

సులభవ్యాకర్త తద్ధర్మార్థక విశేషణంగా 'నెడి– యెడు' ప్రత్యయాలు వస్తాయని చెప్పారు. ఉదాహరణకు ' వచ్చు వాడు– వచ్చెడివాడు – వచ్చెదు వాడు'.

సులభవ్యాకర్త "తద్ధర్మ భూత క్రియలకు నన్నాదులు పరములైనచోఁ బ్రశ్నార్థకంబు లగు" (సులభ. క్రియా:28) అని సూత్రీకరించారు. తద్ధర్మ క్రియలకు, భూత క్రియలకు 'అన్న' మొదలైన శబ్దాలు పరమైనపుడు అవి ప్రశ్నార్థకాలుగా కన్పిస్తాయి. ఉదాహరణకు 'పెద్దలగు వారి నెపుడు సేవింతు వన్న?, జగడ గొండివి గాకుండఁ జదువదయ్య?. బాల, ప్రౌఢవ్యాకర్తలు ఈ రూపాల ప్రసక్తి చేయలేదు.

సులభవ్యాకర్త "అన్నాదిపరకం బయిన తద్ధర్మక్రియ ప్రశ్నార్థకం బయి వ్యతిరేకార్థంబు సూచించు" (సులభ. క్రియా:29)అని సూత్రీకరించారు. 'అన్న' మొదలైన శబ్దాలు పరమైన తద్ధర్మ క్రియ ప్రశ్నార్థంగా మారి వ్యతిరేకార్థాన్ని సూచిస్తాయని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'శీలమును నీవు మఱవంగఁ జెల్లునయ్య'.

### 7.1.5 ఆశీశ్శాప సంప్రార్థనా విధులు (లూట్టు)

బాలవ్యాకర్త"ఆశీశ్శాప సంప్రార్థన విధులందు లూట్టగు"(బాల. క్రియా:06) అని సూత్రీకరించి ఆశీస్సు, శాప, సంప్రార్థనా విధులలో 'లూట్' ప్రత్యయం వస్తుందని చెప్పారు. 'లూట్'

స్థానంలో వచ్చె 'దుజ్' స్థానంలో 'ఎదు, త' ప్రత్యయాలు విధించారు. సులభవ్యాకర్త "ఆశీరాద్యర్థకంబున 'ఎదు' 'త' వర్ణకంబులగు. ఇవి ద్రుతాంతములు"(సులభ. క్రియా:30). ఆశీశ్శాప సంప్రార్థన విధులలో వచ్చే 'దుజ్, రు, వు, రు, ను, ము' లకు బదులు ద్రుతాంతములైన 'ఎదు. త' ప్రత్యయాలు వస్తాయని చెప్పారు. ఉదాహరణకు ' నీకు మేలు కలిగెదును. వీటిపై 'గాక' అనే అవ్యయం వచ్చి ' నీకు మేలు కలిగెదు గాక' అయింది. సులభవ్యాకర్త "ఆశీరాద్యర్థంబునఁ 'గాక' యను నవ్యయంబు నగు" (సులభ. క్రియా:31) చెప్పారు. ఆశీరాధ్యర్థంలో 'గాక' అనేది వస్తుందని చెప్పారు.

బాలవ్యాకర్త"ఎదుతలద్రుతంబున కచ్చు పరంబగునపుడు మకారంబగు" (బాల.క్రియా:28) అని బాలవ్యాకర్త చెప్పారు. సులభవ్యాకర్త కూడా "ఎదు త-ల ద్రుతంబున కచ్చు పరంబగునపుడు మకారం బగు" (సులభ. క్రియా:33) ఆశీశ్శాప సంప్రార్థన విధులలో వచ్చే'ఎదు. త' ద్రుతానికి అచ్చులు పరంగా వస్తే 'మ' కారం వస్తుంది. ఉదాహరణకు ' నీకు మేలుకలుగుత మనియె'

బాలవ్యాకర్త"లూణ్మధ్యమ వురులకు ముదుజ్జు లగు"(బాల.క్రియా:29) అని చెప్పిన విషయాన్ని సులభవ్యాకర్త కూడా "ఆశీరాద్యర్థక మధ్యమ పురుషంబున ముదుజ్జులగు" (సులభ. క్రియా:34) అని సూత్రీకరించారు. ఆశీరాద్యర్థకములలో వచ్చే మధ్యమ పురుష ప్రత్యయాలైన ' వు- రు' బదులు ' ము- దుజ్' లు వస్తాయి. ఉదాహరణకు ' నీవు భాగ్యవంతుడవగుము- మీరు భాగ్యవంతులరగుదు'.

బాలవ్యాకర్త"ఉభయ ప్రార్థనంబున దుగాగమంబున కత్వంబగు"(బాల.క్రియా:30) అని సూత్రీకరించి చెప్పిన విషయాన్ని సులభవ్యాకర్త కూడా "ఉభయ ప్రార్థనంబున 'దు', 'ద' యగు" (సులభ. క్రియా:35) ఉభయార్థకమైన 'మనము' అను పదానికి ప్రార్థనార్థంలో 'దు- ద' అనే ప్రత్యయాలు ఆగమంగా వస్తాయని చెప్పారు. ఉదాహరణకు ' వందుదము, తినుదము , పోదము' .

సులభవ్యాకర్త "ప్రార్థనాద్యర్థక మధ్యమమునకు నదాదులు విభాష ననుప్రయుక్తంబులగు" (సులభ. క్రియా:37) ప్రార్ధనాద్యర్థకంలో మధ్యమ పురుష వాచకాలకు ' అదాదులు'( అ ఆ ఇఈ ఎ ఏ ఒ ఓ అమ్మ-అయ్య, ర- రా) వికల్పంగా వస్తాయని చెప్పారు. ఉదాహరణకు ' చేయుమ- చేయుమా , చేయమి – చేయమీ'.

బాలవ్యాకర్త "ముజ్జు పరంబగునపుడు కోశబ్దంబు కొనునకు బహుళంబుగ నగు" (బాల. క్రియా:60) అని సూత్రీకరించి 'కొను' అనే దానికి మధ్యమపురుష 'ము– డుజ్' లు పరమవుతుంటే, 'కో' అనే శబ్దం బహుళంగా ఆదేశమవుతుందని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "ముజ్జు పరంబగునపుడు 'కొను' నకు మాఱు 'కో' శబ్దంబు బహుళంబుగ నగు" (సులభ. క్రియా:70) అని చెప్పారు.

## 7.1.6 వ్యతిరేకము

బాలవ్యాకర్త"వ్యతిరేకంబున లజియగు"(బాల.క్రియా:07) "వ్యతిరేకంబున ముజ్జు పరంబగునపుడు కుజియగు" (బాల.క్రియా:32) అని సూత్రీకరించి బాలవ్యాకర్త వ్యతిరేకార్థంలో 'లజి' ప్రత్యయం వస్తుందని చెప్పారు. వ్యతిరేకార్థంలో మధ్యమ ము, డుజ్ లు పరమవుతుంటే 'కుజి' ప్రత్యయం వస్తుందని చెప్పారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త "వ్యతిరేకంబున మధ్యమపురుషంబున 'కు' వర్ణకంబగు" (సులభ. క్రియా:36) అని సూత్రీకరించారు. వ్యతిరేకార్థంలో మధ్యమపురుషలో ' కు' వర్ణకం వస్తుందని చెప్పారు. ఉదాహరణకు ' చేయుము– చేయకుము, చేయుడు– చేయకుడు'.

## 7.2 అసమాపక క్రియలు

ముగిసిపోకుండా ఇంకా కొనసాగుతూ ఉన్న క్రియలను 'అసమాపక క్రియలు' అంటారు. ఇవి అర్థానికి ప్రాధాన్యతను ఇస్తాయి. సంస్కృతంలో వ్యవహారంలో ఉన్న వివిధ అర్థాలను తెలుగులో ఆయా అర్థాలలో తెలుగు ప్రత్యయాలను చేర్చి, ఈ క్రియారూపాలను తెలుగులో కల్పించారు వ్యాకర్తలు. ఇవి నిర్దిష్ట కాలాన్ని బోధించకుండా వివిధ అర్థాలను బోధించడానికి ఈ క్రియలను వ్యవహరిస్తారు.

## 7.2.1 భావార్థకం

బాలవ్యాకర్త "ట వర్ణకంబు భావంబు నందగు"(బాల. క్రియా:35)అ ని సూత్రీకరించారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త కూడా "ట వర్ణకంబు భావార్థకంబునందగు" (సులభ.క్రియా: 42) అని సూత్రీకరించారు. భావం అనగా ధాతువు యొక్క అర్థం. అలాంటి ధాత్వర్థం బోధించేటప్పుడు 'ట' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు 'చేయుట– వచ్చుట'.

ప్రౌఢవ్యాకర్త "కొఱకు, కంటె, పొంటె' లు పరంబు లగునపుడు భావార్థక 'ట' వర్ణకంబునకు లోపంబు విభాష నగు" (ప్రౌఢ. క్రియా:14) అని సూత్రీకరించారు. సులభవ్యాకర్త కూడా "కొఱకు–కంటె–పొంటెలు పరంబు లగునపుడు భావ టవర్ణకంబునకు లోపంబు వైకల్పికంబు" (సులభ. క్రియా:44) అని సూత్రీకరించారు.'కొఱకు, కంటె , పొంటె' వంటి ప్రత్యయాలు పరమైనప్పుడు భావార్థంలో వచ్చే 'ట' వర్ణానికి లోపం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ' చేయుట కొఱకు–చేయు కొఱకు' .

బాలవ్యాకర్త "వ్యతిరేక భావంబున మిజి యగు"(బాల.వ్యా.క్రి.37) అని సూత్రీకరించారు. సులభవ్యాకర్త కూడా "వ్యతిరేక భావార్థంబున 'మి' (మిజి) యగు" (సులభ. క్రియా:45) అని సూత్రీకరించారు. వ్యతిరేక భావార్థంలో 'మిజి' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు ' చేయు+ మి' చేయమి.

## 7.2.2 క్త్వార్థం

బాలవ్యాకర్త "సమానాశ్రయంబులం బూర్వకాలంబునం దివర్ణకంబగు"(బాల. క్రియా:38) ఒకే ఆశ్రయం గల వివిధ క్రియలలో ముందు జరిగిన క్రియను తెలిపేది క్త్వార్థకమని బాలవ్యాకర్త చెప్పారు. సులభవ్యాకర్త క్త్వార్థకంలో "ఇవర్ణకంబు క్త్వార్థంబున నగు" (సులభ. క్రియా: 46) అని ఇవర్ణకాన్ని విధించారు, ఉదాహరణకు 'చేసి, వచ్చి, కొట్టి'. "కజి వ్యతిరేక క్త్వార్థంబునందగు" (బాల.క్రియా: 39) అని 'కజి' ప్రత్యాన్ని వ్యతిరేక క్త్వార్థకంలో విధించారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త కూడా "(కజి) కవర్ణకంబు వ్యతిరేక క్త్వార్థకంబునందగు" (సులభ. క్రియా:47) అని సూత్రీకరించారు. వ్యతిరేకార్థాన్ని బోధించు క్త్వార్థానికి 'కజి' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు 'చనక, వినక'.

## 7.2.3 చేదర్థకం

బాలవ్యాకర్త"చేదర్థంబునందు వృత్తంబగు భావలక్షణంబు నందు నవర్ణకము ద్రుతాతంబగు" (బాల: క్రియా: 41) అని సూత్రీకరించారు. ఉదా : వానలు కురిసినం బంటలు పండును పంటలు పండడానికి హేతువు వానలు కురియడం. కారణభూతమైన క్రియ సందిగ్ధంగా ఉంది. కనుక చేదర్థం. వానలు కురిస్తే పంటలు పండుతాయని అర్థం.

సులభవ్యాకర్త "ఇనన్' చేదర్థంబునందగు" (సులభ. క్రియా: 48) అని సూత్రీకరించారు. చేదర్థంలో ' ఇనన్' ప్రత్యయం వస్తుందదని చెప్పారు. ఉదాహరణకు ' వాడు వచ్చినన్ నేను బోయదను'.

## 7.2.4 ఆనంతార్యార్థకం

. అనంతరం యొక్క భావం ఆనంతర్యం. సులభవ్యాకర్త "ఆనంతర్యంబున దున్వర్ణకంబగు" (సులభ.క్రియా:49). ఆనంతర్యార్థంలో ధాతువుకు ద్రుతంతో కూడిన దువర్ణకం వస్తుంది. ఉదాహరణకు 'చేయుదున్'

ప్రౌఢవ్యాకర్త "కొన్ని యెడల భావార్థక రూపము 'ను' శబ్ద పరకంబయి యానంతర్యార్థకం బయ్యెడి" (ప్రౌఢ. క్రియా :12) అని సూత్రీకరించారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త "భావ టవర్ణకంబునకు 'ను' శబ్దం బనుప్రయుక్తంబయి యానంతర్యార్థకంబు కొండొకచో నగు" (సులభ. క్రియా:50) అని సూత్రీకరించారు. కొన్నిసార్లు భావార్థక 'ట' ప్రత్యయం కూడా 'ఉ'శబ్దాన్ని చేర్చుకొని ఆనంతర్యార్థాన్ని బోధిస్తుంది. ఉదాహరణకు ' వాలియిట్లు చెప్పుటయు'.

## 7.2.5 శత్రర్థకం

బాలవ్యాకర్త "చువర్ణకంబు ద్రుతాంతంబు క్రియాన్వయంబున శత్రర్థంబునందగు" (బాల.క్రియా: 43) అని సూత్రీకరించారు. సంస్కృతంలో 'శతృ' ప్రత్యయం ఏ అర్థంలో వస్తుందో దానిని శత్రర్థమని అంటారు. అనగా వర్తమానార్థమని అర్థం. సులభవ్యాకర్త "చున్ వర్ణకంబు శత్రర్థంబునం దగు" (సులభ.క్రియా:52). తెలుగులో శత్రర్థంలో 'చున్' ప్రత్యయం వస్తుందని చెప్పారు.

## 7.3 ధాతుజ విశేషణాలు

ధాతువునుండి ఏర్పడిన క్రియల అర్థాన్ని విశేషింపచేసేవి ధాతుజ విశేషణాలు. వీటిని క్రియాజన్య విశేషణాలని అంటారు. వీటికి క్రియా ప్రత్యయం కాక సర్వనామం (తచ్ఛబ్దం) అనుప్రయుక్త మవుతుంది. అంటే సర్వనామాలకు విశేషణాలవుతాయని భావం. అర్థ విశేషాన్ని బట్టి

ధాతుజవిశేషణాలు ఏడు. అవి ఉన్న, కల, న, ని, ఎడు, ఎడి, 'ఎడు, ఎడి' లోపించిన తద్ధర్మార్థక ధాతుజ విశేషణం.

బాలవ్యాకర్త "తృవర్ణకార్థంబునం దెడి యెడి వన్నియ లగు"(బాల. క్రియా:44) అని సూత్రీకరించారు. తృవర్ణకం యొక్క అర్థంలో(సంస్కృతంలో 'తృచ్' ప్రత్యయం వచ్చే అర్థంలో) ధాతువులకి 'ఎడి – ఎడు' అనే ప్రత్యయాలు వస్తాయి. ఉదాహరణకి ' ప్ర+హృ+ఇంచు= ప్రహరించు. 'ప్రహరించు' ధాతువు. తృవర్ణకార్థం( కర్త్రర్థం)లో ధాతువుకి ప్రస్తుత సూత్రం ద్వారా ' ఎడి' రాగా 'ప్రహరించు+ఎడి'= ప్రహరించెడి. అవుతుంది. ' ఎడు' వస్తే 'ప్రహరించెడు'. అవుతుంది. 'తద్' శబ్దం వస్తే ' ప్రహరించెడి వాడు, ప్రహరించెడు వాడు' అవుతుంది.

సులభవ్యాకర్త "తద్ధర్మాద్యర్థక విశేషణంబున నెడి-యెడులగు" (సులభ. క్రియా:53) అని సూత్రీకరించారు. తద్ధర్మార్థకు, ఇతర విశేషణాలకి 'ఎడి, ఎడు' ప్రత్యయాలు వస్తాయి. వీటికి లోపం బహుళం అని సులభవ్యాకర్త చెప్పారు.ఉదాహరణకు 'వచ్చువాఁడు-వచ్చెడివాఁడు- వచ్చెడువాఁడు'.

బాలవ్యాకర్త "పడుజ్యనుబంధంబు కర్మంబునందగు" (బాల.క్రియా: 49) అని సూత్రీకరించారు. కర్మార్థంలో ధాతువుకి 'పడుజి' అనేది అనుబంధంగా వస్తుంది. ఉదాహరణకు 'కొట్టు+ పడుజి+డుజ్= కొట్ట+పడు+డుజ్= కొట్టబఁడు+డుజ్= కొట్టబఁడు+చు+ ఉన్న+డుజ్= కొట్టబడుచున్నాడు. సులభవ్యాకర్త కూడా '(పడుంజి) పడ్వను బంధము కర్మార్థకంబున నగు" (సులభ. క్రియా:58) చెప్పారు.

## 7.4 'ఇంచుక్' ప్రకరణం – ప్రేరణార్థక క్రియలు

తెలుగు ధాతువులకు ఇంచుగాగమం వస్తుందని చెప్పారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త "సంస్కృతంబున కంగలాదుల కించుక్కగు"(సులభ.క్రియా:73). సంస్కృత ధాతువులకూ, 'అంగల' మొదలైన అచ్చిక ధాతువులకి 'ఇంచుక్' ప్రత్యయం ఆగమంగా చేరుతుంది. ఉదాహరణకు 'అంగల+ ఇంచు= అంగలించు. వచించు, త్యజించు, భజించు'.

బాలవ్యాకర్త "ఇ ఉ ఋ ల కించుక్కు పరంబగునపు డయుగవు గరుక్కులగు"(బాల.క్రియా: 64) అని సూత్రీకరించారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త కూడా "ఇ ఉ ఋ-ల కించుక్కు పరంబగునపు డయుగవు గరుక్కు లగు" (సులభ. క్రియా:74) అని సూత్రీకరించారు. సంస్కృత

ధాతువులు ఇకార, ఉకార, ఋకారాంతాలుగా ఉండి వాటికి ఇంచుక్ పరమవుతుంటే వాటికి వరుసగా అయుక్–అవుక్–అరుక్ ఆదేశంగా వస్తాయని చెప్పారు. సంస్కృత ధాతువులు ఇకారాంతమైనపుడు వాటికి ఇంచు పరమయ్యేటప్పుడు ఇకారానికి బదులుగా 'అయ్' ఆదేశంగా వచ్చును. ఉదాహరణకు "జి + ఇంచు= జ్+ఇ+ఇంచు= జ్+అయ్= ఇంచు=జయించు' అయింది. ధాతువు చివర ఉకారము ఉన్నట్లయితే ''అవ్' వస్తుంది. ఉదాహరణకు 'ద్రు' ధాతువు ఉకారాంతం. ద్రు+ఇంచు= ద్+ర్+ఉ+ఇంచు= ద్+ర్+అవ్+ఇంచు= ద్ర+వించు= ద్రవించు. ధాతువు చివరలో ఋకారం ఉండిన 'అర్' వస్తుంది. 'ధృ' ధాతువు ఋకారాంతం. ధృ+ఇంచు= ధ్+ఋ+ఇంచు= ధ్+అర్+ఇంచు=ధ+రించు=ధరించు.

"నిర్జినామంబుల కయుగాగమంబు గలుగదు"(బాల.క్రియా:65) అని సూత్రీకరించారు. నిర్జి ధాతువుకు, ఇకారాంత నామధాతువులకు ఇంచుక్కు పరమవుతుంటే అయుగాగమం రాదని చెప్పారు సులభవ్యాకర్త కూడా "నిర్జి, నామంబుల కయుగాగమంబు గలుగదు" (సులభ. క్రియా:75) అని సూత్రీకరించారు. 'నిర్జి'అనే ఇకారాంత ధాతువులకు, నామ ధాతువులకు 'అయ్' ఆగమం రాదు. ఉదాహరణకు ' నిర్జించు– స్తుతించు'.

బాలవ్యాకర్త "సంస్కృతమునకు లఘూపదంబున కించుక్కు పరంబగునపుడు గుణంబగు"(బాల. క్రియా: 66) అని సూత్రీకరించారు. సులభవ్యాకర్త కూడా "సంస్కృతంబునకు లఘూపధంబునకు నించుక్కు పరంబగునపుడు గుణం బగు" (సులభ. క్రియా:76) అని సూత్రీకరించారు. లఘువు ఉపధగా కలిగిన సంస్కృత ధాతువులకి ఇంచుక్కు పరమైనప్పుడు గుణం వస్తుంది. అనగా 'ఇ, ఉ, ఋ' లకు వరుసగా 'ఏ, ఓ, అర్'లు వస్తాయి. ఉదాహరణకు 'భిద్– భేదించు', పుష్– పోషించు'.

బాలవ్యాకర్త"స్పృశికి గుణంబు విభాషనగు"(బాల.క్రియా:67) అని సూత్రీకరించారు. సులభవ్యాకర్త కూడా "స్పృశికి గుణంబు విభాషనగు" (సులభ. క్రియా:77) అని సూత్రీకరించారు. 'స్పృశ్' అనే ధాతువుకి ఉపధ లఘువుగా ఉంటే గుణాక్షరం వికల్పంగా వస్తుంది. స్పృశ్+ఇంచు= స్పృశించు. ఇక్కడ గుణము రాలేదు. గుణం వచ్చిన సందర్భంలో 'స్పృశ్+ఇంచు= స్ప్+అర్ +శ్+ఇంచు =స్పర్శించు' అవుతుంది.

సులభవ్యాకర్త "లిఖ, భుజి, రుచ, కృశంబులకు గుణంబు లేదు" (సులభ. క్రియా:78) అని సూత్రీకరించారు.'లిఖ్, భుజ్, రుచ్, కృశ్' ధాతువులు లఘువు ఉపధగా కలిగినప్పటికీ గుణము రాదు.ఉదాహరణకు ' లఖించు– భుజించు– రుచించు– కృశించు'. "

సులభవ్యాకర్త "సృజికి నిర్మితిని గుణంబు లేదు" (సులభ. క్రియా:79) అని సూత్రీకరించారు. 'సృజ్' ధాతువుకు విడుచుట అని, నిర్మించుట అని రెండు అర్థాలు ఉన్నాయి. వీటిలో 'నిర్మించు' అనే అర్థంలో ఇంచు పరమైనపుడు గుణము రాదని అర్థం. సృజ్ ధాతువునకు విడుచుట అని అర్థం కూడా ఉంది. సృజించు= సృష్టించు. 'విడుచు' అనే అర్థంలో ఇంచు పరమైనపుడు గుణం వస్తుంది. 'విసర్జించు' అనగా 'విడుచుట' అని అర్థం.

సులభవ్యాకర్త "సర్వంబునకుం బ్రేరణంబున కించుక్కగు" (సులభ.క్రియా:80) అని సూత్రీకరించారు. అన్ని విధాలైన ధాతువులకి ప్రేరణార్థంలో ' ఇంచుక్' ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు ' పచించు + ఇంచు= పచించించు' , వండు+ఇంచు= వండించు.

సులభవ్యాకర్త "ఇల్లుక్ పరంబగునపుడు తేజః ప్రజ్వలలకు రేఫం బగు" (సులభ. క్రియా:82) అని సూత్రీకరించారు. ప్రేరణార్థంలో ద్విరుక్తలకారం పరంగా ఉన్న 'తేజస్, ప్రజ్వల్' ధాతువులకు రేఫం ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు 'తేజ+స్+ ఇల్లు= తేజ+ర్+ఇల్లు= తేజరిల్లు' అవుతుంది. ప్రజ్వ+ల్+ఇల్లు= ప్రజ్వ+ర్+ఇల్లు= ప్రజ్వరిల్లు' అవుతుంది. ఈ విషయాన్ని బాల, ప్రౌఢ వ్యాకరణాలు చెప్పలేదు.

సులభవ్యాకర్త "ఇంచుక్కు పరంబగునపుడు రంజాదుల యించుక్కునకు లోపం బగు" (సులభ. క్రియా:83) అని సూత్రీకరించారు. ప్రేరణార్థంలో వచ్చే ఇంచుగాగమం పరమవుతుంటే రంజాదులకు స్వార్థంలో వచ్చే ఇంచుగాగమానికి లోపం వస్తుంది. "సంస్కృతం

సులభవ్యాకర్త "చుగాగమం బాచ్చికంబున కసంయుక్త న ల డ రాంతంబునకుం బ్రేరణంబున బహుళంబుగా నగు" (సులభ. క్రియా:84) అని సూత్రీకరించారు. అచ్చ తెలుగు పదంగా ఉండి దాని చివర సంయుక్తంగాని 'న –ల–డ–ర' లలో ఏదైనా ఉన్నప్పుడు ప్రేరణార్థంలో బహుళంగా చువర్ణం ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'పూను' అచ్చతెలుగు శబ్దం. దీని చివర నకారం ఉన్నది. ఇవే వేరే అక్షరాలతో కలిసి సంయుక్తంగా లేదు. కాబట్టి ప్రేరణార్థంలో చువర్ణం

ఆగమంగా వచ్చి 'పూనుచు' అని అయింది. సూత్రంలో బహుళం అని అనడం వల్ల చువర్ణం రానపుడు ప్రేరణార్థంలో 'ఇంచు' వచ్చి 'పూనించు' అయింది. 'తేలు-తేలుచు- తేలించు' . కుదురు- కుదురుచు-కుదిరించు'.

సులభవ్యాకర్త "అట్లు చుక్పుగాగమంబు లడంగ్వాది మాయ్వాదుల కగు. అగుచో వాని కడవ్రాలు లోపించు" (సులభ. క్రియా:87) అని సూత్రీకరించారు. ప్రేరణార్థకాలైన 'చు, పు' వర్ణాలు'అడగు' మొదలైన ధాతువులకు , మాయ్వాదులకు వస్తాయి. అలా వచ్చే సందర్భాలలో వాటి చివర అక్షరం లోపిస్తుంది. ఉదాహరణకు ' అడగు- అడచు- అడగించు', ' మాయు- మాపు- మాయించు'

సులభవ్యాకర్త "అన్వాదుల కించిక్కు పరంబగునపుడు పుగాగమం బగు. మానునకు విభాష నగు" (సులభ. క్రియా:89) అని సూత్రీకరించారు. అన్వాదులకు( అను, కాను, తిను, విను) 'ఇంచుక్' ప్రత్యయం పరమైనపుడు ' పు' ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'అనిపించు, కనిపించు, తినిపించు'. మానునకు 'పు' వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ' మానిపించు- మానించు'.

"అడ్డాదుల కించుక్కు పరంబగునపుడు గుగాగమంబగు నప్పాదులకు విభాషనగు" (బాల.క్రియా:79) అని సూత్రీకరించారు. సులభవ్యాకర్త కూడా "అడ్డాదుల కించుక్కు పరంబగునపుడు గుగాగమం బగు. అప్పాదులకు విభాష నగు" (సులభ. క్రియా:90) అని సూత్రీకరించారు. అడ్డాదులకు(అద్దము- ఓర- చిత్తము- పెల్ల) ఇంచుక్ పరమైనప్పుడు 'గు' వర్ణం ఆగమంగా వస్తుంది. అప్పాదులకు(అప్ప- ఒప్ప- పల్లము- కోప) వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'అడ్డగించు, అప్పగించు'.

బాలవ్యాకర్త "ఆడోడు కూడుల దకారంబునకుం జుక్కు పరంబగునపుడు రేఫంబగు"(బాల.క్రియా:80) అని సూత్రీకరించారు. 'ఆడు-ఓడు-కూడు' అను ధాతువులకు చుగాగమం పరమవుతుంటే, వాని డకారానికి రేఫాదేశం వస్తుందని చెప్పారు. సులభవ్యాకర్త "ఆడోడుకూడుల దకారంబునకుఁ జుక్కు పరంబగునపుడు రేఫం బగు" (సులభ. క్రియా:91) అని సూత్రీకరించారు. 'ఆడు, ఓడు, కూడు' ధాతువులలోని 'ద'కారానికి చువర్ణం పరమైనప్పుడు 'రు' వర్ణం ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు 'ఆడు+ చు= ఆరుచు, ఓడు+చు = ఓరుచు'.

బాలవ్యాకర్త "చెదునకుం జుక్పుగాగమంబులును డాకలఘు రేఫంబునగు" (బాల.క్రియా:81) అని సూత్రీకరించారు. ఇదే విషయాన్ని సులభవ్యాకర్త "చెదునకుం జుక్పు గాగమంబులును డాకు నలఘు రేఫంబు నగు" (సులభ. క్రియా:92) అని సూత్రీకరించారు. 'చెదు' ధాతువుకు ప్రేరణార్థంలో 'చుక్, పు' వర్ణాలు వస్తాయి. దానిలోని దకారానికి శకటరేఫ వస్తుంది. ఉదాహరణకు ' చెదు+ చు =చెఱుచు, చెదు+ పు= చెఱుపు'.

బాలవ్యాకర్త"పదునకుం జుక్కును డా కలఘు రేఫంబునగు"(బాల.క్రియా:82) అని సూత్రీకరించారు. సులభవ్యాకర్త కూడా "పదునకుం జుక్కును డాకు నలఘు రేఫంబు నగు" (సులభ. క్రియా:93) అని సూత్రీకరించారు. 'పదు' ధాతువుకు ప్రేరణార్థంలో చువర్ణం పరమైనప్పుడు 'ద'కారానికి శకటరేఫ వస్తుంది. ఉదాహరణకు 'పదు+ చు = పఱుచు'.

"శబ్దపల్లవంబగు పదున కించుక్కు విభాషనగు.నగుచో డాగు లఘురేఫంబగు" (బాల.క్రియా.83) అని సూత్రీకరించారు. సులభవ్యాకర్త కూడా "శబ్దపల్లవంబగు పదున కించిక్కు విభాష నగు. అగుచో డాకు లఘు రేఫం బగు" (సులభ. క్రియా:94) అని సూత్రీకరించారు. శబ్దపల్లవం ఉత్తరపదంగా ఉన్న 'పదు' ధాతువుకు 'ఇంచుక్' ప్రత్యయం వికల్పంగా వస్తుంది. అలాంటి సందర్భాలలో దకారానికి లఘు రేఫ వస్తుంది. ఉదాహరణకు ' వెలువదు+ ఇంచు = వెలువరు+ ఇంచు = వెలువరించు'.

బాలవ్యాకర్త "ప్రేరణంబునం దించుక్కు మీఁద నించుక్కు లేదు"(బాల.క్రియా:84) అని సూత్రీకరించారు. ధాతువుకు ప్రేరణార్థంలో ఇంచుక్కమీద ఇంచుక్కు రాదని చెప్పారు. సులభవ్యాకర్త కూడా "ప్రేరణంబునం దించుక్కు మీఁద నించుక్కు లేదు" (సులభ. క్రియా:95) అని సూత్రీకరించారు. ప్రేరణార్థంలో వచ్చిన 'ఇంచు' మీద మళ్ళీ 'ఇంచు' రాదు. ఉదాహరణకు 'నొచ్చు– నొంచు– నొప్పించు'.

బాలవ్యాకర్త "ప్రేరణేంచుక్కు పరంబగునపుడు పకారంబు చకారంబున కగు" (బాల.క్రియా:87) అని సూత్రీకరించారు. సులభవ్యాకర్త కూడా "ప్రేరణేంచుక్కు పరంబగునపుడు పకారంబు చకారంబున కగు" (సులభ. క్రియా:97) అని సూత్రీకరించారు.ప్రేరణార్థకమైన

‘ఇంచుక్’ పరమైనప్పుడు ధాతువు యొక్క ‘చ’ కారానికి ‘ప’ కారం వస్తుంది. ఉదాహరణకు ‘ వచించు– వచింపించు’, పిలుచు– పిలిపించు’.

బాలవ్యాకర్త “తే తేరులు తెచ్చునకగు”(బాల.క్రియా:93) అని సూత్రీకరించారు. ముత్తు పరమవుతుంటే చచ్చు ధాతువుకు చావు అనేది, నొచ్చు ధాతువుకు నోవు అనేది ఆదేశంగా వస్తుందని సూత్రార్థం. చావఁడు’. సులభవ్యాకర్త కూడా “తే– తేరు–లు తెచ్చున కగు” (సులభ. క్రియా:104) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త “చావు నోవులు చచ్చునొచ్చుల కగు”(బాల. క్రియా:94) అని సూత్రీకరించారు. ముత్తు పరమవుతుంటే ‘చచ్చు’ ధాతువుకు ‘చావు’ అనేది, ‘నొచ్చు’ ధాతువుకు ‘నోవు’ అనేది ఆదేశంగా వస్తుంది. సులభవ్యాకర్త కూడా “చావు, నోవు, లు చచ్చు, నొచ్చు, లకగు” (సులభ. క్రియా:105) అని సూత్రీకరించారు.

“ధాత్వదులకు ధాతువు లనుప్రయుక్తంబులయి విలక్షణార్థాభిధాయకంబులగు నీయని శబ్ద పల్లవంబులు నాఁబడు(బాల.క్రియా:118) అని సూత్రీకరించారు. ధాత్వాదులకు ధాతువులు అనుప్రయుక్తమయి కొత్త అర్థాన్ని తెలియజేసే శబ్దాల కూడికగల వానిని శబ్దపల్లవాలని అంటారు. ధాత్వాదుల కనుటచే శబ్దపల్లవంలోని పూర్వావయవంగా ధాతువులుగాని, నామములు (ప్రాతిపదికలు)గాని, అసమాప క్రియలుగాని ఉంటాయి. పర అవయవం మాత్రం ‘ధాతువే’ ఉంటుంది. ఉదాహరణలుగా ‘కూరుచుండు’, నిలుచుండు, పరుండు, పన్నుండు’ వంటి ఉదాహరణలను పేర్కొన్నారు. సులభవ్యాకర్త కూడా “ధాత్వాదులకు ధాతువు లనుప్రయుక్తంబులయి విలక్షణార్థాభిధాయకంబు లగు నీ యవి శబ్దపల్లవంబులు నాఁబడు” (సులభ. క్రియా:129) అని సూత్రీకరించారు.

సులభవ్యాకర్త “గతి, బుద్ధి, ప్రత్యవసానార్థ, శబ్దకర్మాకర్మకంబుల కప్రేరణంబునం గర్తయగునది ప్రేరణంబునం గర్మం బగు” (సులభ. క్రియా:134) అని సూత్రీకరించారు. గత్యర్థకం, బుద్ధ్యర్థకం, ప్రత్యవసానార్థకం, శబ్ద కర్మం, శబ్ద అకర్మం వంటి వాటికి అప్రేరణంలో ఏది కర్త అవుతుందో ప్రేరణంలో అదే కర్మ అవుతుంది. ‘పొందు’ మొదలైనవి గత్యర్థకాలు. ‘తెలియు’ మొదలైనవి బుద్ధ్యర్థకాలు. ‘తిను’ మొదలైనవి ప్రత్యవసానార్థకాలు. ‘విను–చెప్పు– చదువు’

మొదలైనవి శబ్దకర్మములు. కర్మవాచకం లేనిది అకర్మము. గత్యర్థకానికి ఉదాహరణ 'మైత్రుండు గ్రామంబుం బొందెను'. ఇది అప్రేరణం. గత్యర్థకం

సులభవ్యాకర్త "అనభిహితకర్త కొకానొకచో షష్ఠి బహుళంబుగా నగు" (సులభ. క్రియా:135) అని సూత్రీకరించారు. ఉదాహరణకు 'రాముఁడు మిథిలం గనియె'. ఇక్కడ కనుట అను కార్యం చేసినవాఁడు రాముఁడు కాబట్టి రాముఁడు కర్తృపదం అవుతుంది. 'రామునకు మిథిల గనంబడియె . ఇక్కడ కూడా కనుట అను కార్యం చేసినవాడు రాముఁడే. కానీ ఇక్కడ కర్త అనభి హితంగా ఉండడం వల్ల షష్ఠీ విభక్తి ప్రత్యయం 'కు' వచ్చింది. కొన్నిచోట్ల ' కర్తృ పదానికి తృతీయావిభక్తి ప్రత్యయం ' చే' వచ్చిన రూపాన్ని కూడా వావిలికొలనువారు చెప్పారు. ఉదాహరణకు ' రామునిచే మిథిల గనంబడియె'.

బాలవ్యాకర్త "కన్వాదియోగంబునం బ్రయోజ్యకర్తకు షష్ఠి నిత్యంబుగానగు" అన్న వాక్యాన్ని"అనభిహిత కర్త కొకానొకచో షష్ఠి బహుళంబుగా నగు"(బాల.క్రియా:124) సూత్రంలో చెప్పారు. దీనిని సులభవ్యాకర్త "కన్వాది యోగంబునఁ బ్రయోజ్య కర్తకు షష్ఠి నిత్యంబు" (సులభ. క్రియా:136) అని సూత్రీకరించారు. అనగా 'కను'లోనైనవి (ఆ అర్థం కలిగినవి)కూడినపుడు ఆ కార్యం ఒనర్చినవానిని తెలుపు కర్తృ పదానికి షష్ఠి విభక్తి నిత్యంగా వస్తుంది. ఉదాహరణకు 'విశ్వామిత్రుఁడు రామునకు మిథిలనఁ గానిపించెను'. ఇక్కడ కనినివాడు (చూసినవాడు) రాముఁడు కాబట్టి ఆ పదానికి షష్ఠి వచ్చింది.

ఈ సూత్ర వివరణలో 'అకర్మంబున కప్రేరణంబునం దాత్మనేపద కర్మానుబంధంబులు లేమింజేసి రూప బేధంబు లయిదని యెఱుంగునది' అని ఐదు రకాల రూపభేదాలు పేర్లు వాటికి ఉదాహరణలు ఇచ్చారు. 1. కర్త్రర్థకం– మైత్రుండు బ్రదికెను 2. ప్రేరణ కర్త్రర్థకం– చైత్రుండు మైత్రుని బ్రతికించెను 3. ప్రేరణాత్మనేపద కర్త్రర్థకం– చైత్రుండు మైత్రుని బ్రతికించుకొనియె 4. ప్రేరణ కర్మార్థకము – చైత్రునిచే మైత్రుఁనడు బ్రతికింపఁబడియె 5. ప్రేరణాత్మనేపద కర్మార్థకం– చైత్రునిచేత మైత్రుండు బ్రతికించుకొనఁబడియె'.

## ముగింపు:

సులభవ్యాకర్త క్రియలన్నింటిని తత్సమాలు, ఆచ్చికాలు అని రెండు రకాలుగా విభజించారు సంస్కృత ధాతువులకు 'ఇంచు' చేర్చగా ఏర్పడేవి తత్సమక్రియలు'. అసమాపక క్రియలు క్రియాకాంక్షా సమాపకాలు, నామాకాంక్షా సమాపకాలు రెండు రకాలుగా ఉంటాయని చెప్పారు. క్రియాఫలం కర్తకు చెందినదైతే అది ఆత్మనేపదమని, ఆత్మనే పదాలకు 'కొను' ధాతువు అనుసరించి వస్తుందని చెప్పారు. క్రియాఫలం కర్తకు కాక ఇతరులకు చెందితే దానిని పరస్మైపదం అంటారని సులభవ్యాకర్త చెప్పారు. ఈ అధ్యాయంలో సమాక క్రియలు లైన 'వర్తమానార్ధకం, భూతార్ధకం, భవిష్యదర్ధకం, తద్ధర్మాదులు, ఆశీశ్శాప సంప్రార్ధనా విధులు, వ్యతిరేకార్ధకాల్ని, అసమాపక క్రియలైన 'భావర్ధకం, క్త్వార్థం, చేదర్ధకం, ఆనంతర్యార్ధకం, శత్రర్ధకాలను,' ధాతుజ విశేషణాలు, ఇంచుక్ ప్రకరణం– ప్రేరణార్ధక క్రియలను పరిశీలించడం జరిగింది.

**ఎనిమిదవ అధ్యాయం**: 'కారక, వాక్య–విజ్ఞానాలు'. ఈ అధ్యాయంలో భాగంగా 'కారక విజ్ఞానానికి సంబంధించి విషయాలను చర్చించడం జరిగింది. తర్వాత 'వాక్య విజ్ఞానానికి' సంబంధించి పదం, సంబోధనార్థం, నిత్య ఏకవచనాలు, నిత్య బహువచనాలు, కర్తృర్థక వాక్యాలు, విశేషణార్ధక వాక్యాలు, అస్మద్– యుష్మద్ వాక్యాలు, కాలబోధక వాక్యాలు, అధ్యాహార్యం మొదలైన అంశాలను పరిశీలిస్తాను.

# ఏడవ అధ్యాయం

## క్రియారూప విజ్ఞానం– సూత్రాల పట్టిక

| క్రమ సంఖ్య | బాలవ్యాకరణము సూత్రము: సంఖ్య | సులభవ్యాకరణము సూత్రము: సంఖ్య | సవరణ | పూరణ | వివరణ | నూతన విషయ ప్రతిపాదన |
|---|---|---|---|---|---|---|
| 1. | —— | "సంస్కృత ధాత్వాదులకు.. క్రియా: 1 | —— | —— | ✓ | —— |
| 2. | —— | "కర్మమును గోరునది.. క్రియా:2 | —— | —— | ✓ | —— |
| 3. | —— | కర్మమును గోరనిది అకర్మకము.. క్రియా:3 | —— | —— | ✓ | —— |
| 4. | —— | కార్యము కొఱంత లేక ముగియు... క్రియా:4 | —— | —— | ✓ | —— |
| 5. | —— | "కార్యము పూర్ణముగ ముగి క్రియా:5 | —— | —— | ✓ | —— |
| 6. | —— | "క్త్వార్థకము లోనగు క్రియలు .. క్రియా:6, | —— | —— | —— | ✓ |
| 7. | —— | "క్రియాజన్య విశేషణములు.. క్రియా :7 | —— | —— | —— | ✓ |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 8. | వర్తమానంబున లట్టగు... క్రియా:2 | "జరగుచున్న కాలమును దెలు.. క్రియా:8 | –– | –– | ✓ | –– |
| 9. | –– | తన్ను త్తమ పురుషము.. క్రియా:13, 14,15 | –– | –– | ✓ | –– |
| 10. | –– | "క్రియాఫలము కర్తనుగాక యిత.. క్రియా:61 | –– | –– | –– | ✓ |
| 11. | –– | క్రియా ఫలము కర్తను జెందుచో క్రియా:62 | –– | –– | –– | ✓ |
| 12. | –– | అన్వర్థంబున భూతంబునకుఁ క్రియా:18 | –– | –– | –– | ✓ |
| 13. | ఇకారంబు మీది కు– ను–.. తత్సమ:26 | ఇత్వంబుమీఁది ను మువురు–ల కిత్వ.. క్రియా:20 | –– | –– | ✓ | –– |
| 14. | –– | 'కొనుధాతువు పరంబగునపుడు క్రియా:63 | –– | –– | –– | ✓ |
| 15. | –– | తద్ధర్మ భూత క్రియలకు... క్రియా:28 | –– | –– | –– | ✓ |
| 16. | –– | అన్నాదిపరకం బయిన... | –– | –– | –– | ✓ |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | | క్రియా: 29 | | | | |
| 17. | –– | 'ఇన' భూతార్థక విశేషణంబున.. క్రియా:55 | –– | –– | –– | ✓ |
| 18. | 'పదు' మొదలైన వాని నవర్ణానికి క్రియా:51 | పద్వాదుల 'నిన' వర్ణకంబున కత్వ.. క్రియా:60 | –– | –– | ✓ | –– |
| 19. | –– | ఆశీరాద్యర్థంబునఁ 'గాక' యను న.. క్రియా:31 | –– | –– | ✓ | –– |
| 20. | –– | పూర్వాదులు పరంబులగుచో.. క్రియా:43 | –– | –– | ✓ | –– |
| 21. | –– | ఇనన్' చేదర్థంబునందగు క్రియా:43 | –– | –– | ✓ | –– |
| 22. | –– | "తుమున్నాద్యర్థక మునకుఁ 'గన్–గ.. క్రియా :51 | –– | –– | ✓ | –– |
| 23. | –– | ఇల్లుక్ పరంబగునపుడు .. క్రియా :82 | –– | –– | –– | ✓ |
| 24. | అగతికంబులగు భ్వాదుల.. క్రియా :121 | ప్రాదు లుపసర్గంబులు.. క్రియా :132 | –– | –– | ✓ | –– |

## అధ్యాయం – 8

# కారక, వాక్య–విజ్ఞానాలు

# అధ్యాయం – 8

## కారక, వాక్య–విజ్ఞానాలు

## 8.0 పరిచయం

ఈ అధ్యాయంలో మొదటగా కారకాలకు సంబంధించిన విషయాలను, తర్వాత వాక్యానికి సంబంధించిన విషయాలను చర్చించడం జరిగింది. బాల, ప్రౌఢ, సులభ వ్యాకర్తలు కారకాల నిరూపణ ద్వారా తెలుగువాక్య నిర్మాణాన్ని చెప్పారనవచ్చు. అందుకే 'కారక' చర్చ వాక్యంతోపాటు ఈ అధ్యాయంలో పొందుపరచడం జరిగింది.

## 8.1 కారక విజ్ఞానం

వాక్యంలో కర్తకు క్రియకు గల అన్వయ సంబంధాన్ని తెల్పేది కారకం. ఇది కర్త, కర్మ, కరణ, సంప్రదాన, అపాదాన, అధికరణం అని ఆరు రకాలు. ఈ కారక పరిచ్ఛేదంలో 43 సూత్రాలున్నాయి. "వాక్యంబునఁ గర్తకుఁ గ్రియకుఁ గల యన్వయ సంబంధమును దెలుపునది కారకము. ఇది కర్త–కర్మము–కరణము–సంప్రదానము–అపాదానము–అధికరణము అని యాఱు విధములు" (సులభ. కారక:1)

### 8.1.1 ప్రథమా విభక్తి

బాలవ్యాకర్త"ప్రాతిపదిక సంబోధనోక్తార్థంబులం బ్రథమయగు"(బాల.కారక:1) అని సూత్రీకరించారు. ప్రాతిపదికర్థంలోనూ, సంబోధనార్థంలోనూ, ఉక్తార్థంలోనూ ప్రథమా విభక్తి ప్రత్యయం వస్తుంది. ప్రాతిపదికార్థం అనగా ప్రాతిపదిక ఉచ్చరించగానే, నియతంగా స్ఫురించే అర్థం. ఉదాహరణకు ' రాముఁడు, రావణుఁడు'. సంబోధనార్థానికి ఉదాహరణ 'ఓ రాముడ, ఓ రావణుఁడా'. ఉక్తార్థానికి ఉదాహరణకు 'రామునిచే రావణుఁడు సంహరింపఁ బడియె'.

సులభవ్యాకర్త "ప్రాతిపదికార్థ, పరిమాణ, సంబోధ, నోక్తార్థంబులం బ్రథమయగు" (సులభ.కారక:2) అని సూత్రీకరించారు. ప్రాతిపదికార్థంలో, పరిమాణార్థకంలో, సంబోధనార్థంలో, ఉక్తార్థంలో ప్రథమా విభక్తి ప్రత్యయం వస్తుంది. సులభవ్యాకర్త ఈ సూత్రంలో ప్రాతిపదికార్థంలో ,

సంబోధనార్థంలో, ఉక్తార్థంలోనేకాక, పరిమాణార్థంలో కూడా ప్రథమావిభక్తిని విధించారు. ఉదాహరణకు ' కృష్ణుడు, చెట్లకు నీళ్ళు రెండు కడవలు పోయుము'. ఇందులో రెండు కడవల కొలత గల నీళ్ళని అర్థం. కాబట్టి 'కడవలు' అనే పదం ప్రథమావిభక్తిలో ఉన్నది. ఇది బాలవ్యాకరణానికి పూరణగా చెప్పారు.

బాలవ్యాకర్త"కాలాధ్వములకుం బ్రాయికంబుగాఁ బ్రథమ యగు"(బాల. కారక:25) అని సూత్రీకరించారు. కాలవాచక శబ్దాలకు, అధ్వవాచక శబ్దాలకు తరచుగా ప్రథమావిభక్తి వస్తుంది. కాలవాచక శబ్దాలు 'నిన్న, నేడు, మాపు, రాత్రి, రేపు' మొదలైనవి. అధ్వవాచకాలు 'ఆమడ, క్రోశము' మొదలైనవి. ఉదాహరణకు 'వాఁడు నిన్న వచ్చె', వారు క్రోశము నడిచిరి'.

సులభవ్యాకర్త"కాలాధ్వములకుఁ దఱచుగ బ్రథమ యగు" (సులభ. కారక:3) అని సూత్రీకరించారు. కాలవాచకాలకు, దూరాన్ని తెలిపే అధ్వ వాచకాలకు తరచుగా ప్రథమావిభక్తి ప్రత్యయాలు వస్తాయి. ఉదాహరణకు 'నిన్న రాత్రి నేను మేలుకని యుంటిని', 'వాడు పది పరుగులు నడిచెను'.

సులభవ్యాకర్త "అగ్వాదివ్యవహితావ్యవహితంబు లగు విశేషణంబులకుం బ్రథమ యగు" (సులభ. కారక:35) అని సూత్రీకరించారు. అగు-అవు-ఔ -అయిన ఇవి అగ్వాదులు. 'అగు' మొదలైన శబ్దాలు వ్యవధానం లేకుండా విశేషణ విశేష్యాల మధ్యలో వచ్చిన లేదా అధ్యాహార్యంగా ఉన్న, విశేష్యం ఏ విభక్తియందున్న విశేషణం మాత్రం ప్రథమా విభక్తిలో ఉంటుంది. ఇక్కడ అవ్యవహితం అనగా అధ్యాహార్యం అనివావిలికొలనువారు చెప్పారు. ఉదాహరణకు 'సుగునాభిరాముఁడగు రామునకు జోహారు వొనర్చెద', తల్లి ద్రౌపది తోడన్- తల్లి యగు ద్రౌపది తోడన్'.

బాలవ్యాకర్త "భావార్థకాది యోగంబునంగర్తకుం బ్రథమ యగు"(బాల. కారక:32) అని సూత్రీకరించారు. భావార్థకం మొదలైన వాటితో అన్వయం ఉన్నప్పుడు కర్తకు బోధించే శబ్దానికి ప్రథమావిభక్తి వస్తుంది. ఉదాహరణకు ' రాముఁడు వచ్చుట, రాముఁడు రాఁగా లక్ష్మనుడు గాంచె'.

సులభ వ్యాకర్త "భావార్థ కాదియోగంబునఁ గర్తకుఁ బ్రథమయగు" (సులభ. కారక:37) అని సూత్రీకరించారు. భావార్థకం మొదలైన వాటితో అన్వయం ఉన్నప్పుడు కర్తకు బోధించే శబ్దానికి

ప్రథమావిభక్తి వస్తుంది. ఉదాహరణకు 'రాముఁడు వచ్చుట', రాముఁడు రాఁగా భరతుండు సంతసించె'.

## 8.1.2 ద్వితీయా విభక్తి

బాలవ్యాకర్త "కర్మంబున ద్వితీయ యగు"(బాల. కారక:2) అని సూత్రీకరించారు. కర్మార్థంలో ద్వితీయ విభక్తి వస్తుంది. ఉదాహరణ ' దేవదత్తుఁడు వంటకమును వండెను'.

సులభవ్యాకర్త "కర్మంబున ద్వితీయ" (సులభ. కారక:4) అని సూత్రీకరించారు. కర్మార్థంలో ద్వితీయా విభక్తి వస్తుంది. ఉదాహరణకు 'సజ్జనుని శుభములు పొందును'.

ప్రౌఢవ్యాకర్త"ఉద్దేశార్థమునందు ద్వితీయకు గుఱిచియు ననుప్రయుక్తం బగు"(ప్రౌఢ. కారక:2) అని సూత్రీకరించారు. కర్మార్థంలో ఉద్దేశార్థక ద్వితీయకు 'గుఱచి' అనేది అనుప్రయుక్తంగా వస్తుంది. ఉదాహరణకు 'మము గుఱిచి'. ఇది ప్రౌఢవ్యాకరణానికి పూరణగా చెప్పారు.

సులభవ్యాకర్త"కర్మప్రవచనీయోద్దేశార్థంబుల ద్వితీయ కుఁ గూర్చి- గుఱించి- గుఱించులగు" (సులభ. కారక:5) అని సూత్రీకరించారు. కర్మార్థంలో ఉద్దేశార్థక ద్వితీయకు 'గూర్చి, గుఱచి, గుఱించి' వంటి ప్రత్యయాలు వస్తాయి. ఉదాహరణకు 'దైవము గుఱించి జపము'.

## 8.1.3 తృతీయ విభక్తి

బాలవ్యాకర్త "చేత వర్ణకంబు కర్తకగు"(బాల. కారక:3) అని సూత్రీకరించారు. కర్తృవాచక శబ్దానికి 'చేత' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' దేవదత్తుని చేత వంటకము వండఁబడియె'.

బాలవ్యాకర్త "చేత వర్ణకంబు హేతు కరణంబులకు గ్రహ్యాది యోగజంబగు పంచమికిని బహుళంబుగానగు"(బాల. కారక:4). చేత వర్ణకంబు హేతువుకు, కరణానికి గ్రహించు మొదలైన వాటి సంబంధంలో వచ్చే పంచమీ విభక్తికి బహుళంగా వస్తుంది. ఉదాహరణకు ' ధనము చేత సౌఖ్యంబు కలుగు', ఖడ్గంబు చేత ఖండించె'. జరాసంధుఁడు రాజుల చేతఁ గప్పంబు గొనియె',

సులభవ్యాకర్త " కర్తృ , కరణ, హేతు, ప్రకృతి, గోత్ర, గ్రహ్యాదులకుం జేత యగు" (సులభ. కారక: 6) అని సూత్రీకరించారు. 'చేత' అనే తృతీయా విభక్తి ప్రత్యయం కర్త్రర్థకంలో, కరణార్థకంలో, హేత్వర్థకంలో, ప్రకృతార్థకంలో, గోత్రార్థకంలో, గ్రహ్యాదులకు వస్తుంది. ఉదాహరణకు 'దుర్జనులచే సజ్జనులవమానింప బడుదురు', భక్తి చేత మోక్షంబు గలుగు'. ఇది బాలవ్యాకరణానికి పూరణగా చెప్పారు.

బాలవ్యాకర్త "కరణ సహార్థ తుల్యార్థ యోగంబులం దృతీయకుం దోడ వర్ణకంబగు"(బాల. కారక:5) అని సూత్రీకరించారు. కరణార్థంలో, సహార్థంలో, తుల్యార్థయోగంబులో తృతీయకు 'తోడ' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు ' కోలతోడఁ గూలనేసె'. రాజు సేనల తోడ వచ్చె, చైత్రుని తోడ మైత్రుండు తుల్యుండు'.

సులభవ్యాకర్త "కరణ సహార్థంబులం దృతీయకుఁదోడ వర్ణకంబగు" (సులభ. కారక:7) అని సూత్రీకరించారు. కరణార్థంలో, సహార్థంలో తృతీయ విభక్తిలోని 'తోడ' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు 'కత్తితో నఱికెను', రాముడు కపులతో లంక కేగెను'.

బాలవ్యాకర్త "వచ్యర్థాముఖ్య కర్మంబులుఁదోడ కువర్ణంబులు ప్రాయికంబుగా నగు"(బాల. కారక :6) అని సూత్రీకరించారు. వచ్యర్థము యొక్క అముఖ్య కర్మకు 'తోడ-కు' ప్రత్యయాలు తఱచుగా వస్తాయి. ఉదాహరణకు 'మైత్రుండు చైత్రునితోడ నిట్లనియె, మైత్రుండు చైత్రునకిట్లనియె'.

సులభవ్యాకర్త "తుల్యార్థయోగంబునను, 'అను' లోనగు ధాతువుల యముఖ్యకర్మంబునకును బ్రాయికంబుగ 'తోడ' 'కు' వర్ణకంబులగు"(సులభ. కారక:8) అని సూత్రీకరించారు. తుల్యార్థయోగంబులో, 'చెప్పుట' అనే అర్థాన్నిచ్చే ధాతువులకు ఆముఖ్య కర్మకు తఱచుగా 'తోడ' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు 'గుణమున రామునితో సముఁడు భరతుడు', 'గుణమున రామునకు సముఁడు భరతుడు', ' రాముఁడు సీతతో నిట్లనియె',

ప్రౌఢవ్యాకర్త "కొన్ని యెడలఁ జేత విభక్త్యర్థక వర్ణకంబులకును, వలన వర్ణకంబునకును దఱచుగఁ జేసి యనుప్రయుక్తంబగు"(ప్రౌఢ.కారక:4) అని సూత్రీకరించారు. కొన్నిచోట్ల, చేత విభక్త్యర్థంలో విధించబడిన ప్రత్యయాలకు, 'వలన' ప్రత్యయానికి తఱచుగా 'చేసి' అనునది అనుప్రయుక్తంగా వస్తుంది. ఉదాహరణకు '

సులభవ్యాకర్త" చేసి-చేతవిభక్త్యర్థ కావ్యంబు. అది తత్ప్రత్యయార్థక వర్ణకంబులకును, వలనకుఁ దఱచుగ ననుప్రయుక్తమగు" (సులభ. కారక:9) అని సూత్రీకరించారు. 'చేసి' అనేది 'చేత' విభక్త్యర్థక అవ్యయం. అది 'చేత' విభక్త్యర్థంలో విధించబడిన ప్రత్యయాలకు, 'వలన' ప్రత్యయానికి తఱచుగా 'చేసి' అనునది అనుప్రయుక్తంగా వస్తుంది. ఉదాహరణకు 'విప్రసంబోధనఁజేసి= సంబోధనను+చేసి. 'సంబోధనను' అనగా 'సంబోధన చేత' అని అర్థం కాబట్టి తృతీయార్థంలో ద్వితీయ కన్పిస్తుంది. దీనికి 'చేసి' అనుప్రయుక్తంగా వస్తుంది. చేత విభక్తి యొక్క అర్థంలో వచ్చే 'చేసి' అనేది క్త్వార్థకం కాదని అవ్యయం అని వావిలికొలనువారు చెప్పారు.

ప్రౌఢవ్యాకర్త "ఒకానొకచోఁ దోడకుఁ దోడుతనని రూపాంతరంబును గలదు. అయినను దానికివలె దీనికితర కార్యంబు గలుగదు "(ప్రౌఢ. కారక:8) అని సూత్రీకరించారు. 'తోడ' ప్రత్యయానికి అరుదుగా, తోడుత-అను రూపాంతరం వస్తుంది. అలాంటి సందర్భంలో 'తోడ' కు ముందు సూత్రాలలో చెప్పబడిన(ప్రత్యేక ప్రయోగం, లోపం) ఇతర కార్యాలు జరగవు. ఉదాహరణకు 'పగతుర చేతిలోఁ బడక ప్రాణముతోడుత నున్నవాఁడవే'

సులభవ్యాకర్త "యుక్త్యర్థంబునఁ దోడకుఁ దోడుతయు నగు" (సులభ. కారక:10) అని సూత్రీకరించారు. 'యుక్తార్థం' అనగా 'కూడిక' అని అర్థం. ఈ అర్థంలో 'తోడ' కు బదులుగా 'తోడుత' వస్తుందని వావిలికొలనువారు చెప్పారు. ఉదాహరణకు 'భయముతోడుత', 'వినయముతోడుత'.

బాలవ్యాకర్త "ఉపయోగంబునం దాఖ్యాతకుం దోడ వర్ణకంబగు" (బాల. తత్సమ:7) అని సూత్రీకరించారు. నియమపూర్వక విద్యా స్వీకారంలో, ఉపాధ్యాయునికి బోధించు శబ్దానికి 'తోడ' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు 'రామకృష్ణులు సాందీపుని తోడ వేదంబులం జదివిరి'.

సులభవ్యాకర్త "ఉపయోగంబునం దాఖ్యాతకుఁ దృతీయా వలన లగు" (సులభ. కారక:11) అని సూత్రీకరించారు. నియమపూర్వక విద్యాస్వీకారం( ఉపయోగం) గూర్చి చెప్పేటప్పుడు బోధకుడికి (ఆఖ్యాతకు) 'తోడ' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు 'కుశలవులు వాల్మీకులతో రామాయణము పఠించిరి'.

సులభవ్యాకర్త "అచేతనంబులమీఁది తోడకు మై మెయిలు విభాష నగు" (సులభ. కారక:12) అని సూత్రీకరించారు. అచేతనాలలో పరమయ్యే తృతీయా విభక్తి 'తోడ' స్థానంలో 'మై, మెయి'అనేవి వికల్పంగా వస్తాయి. ఉదాహరణకు ' రయముమై', 'ఆసమెయి'.

## 8.1.4 చతుర్థీ విభక్తి

బాలవ్యాకర్త "సంప్రదానంబునకుం జతుర్థియగు"(బాల. కారక:8) అని సూత్రీకరించారు. సంప్రదానార్థంలో చతుర్థీ ప్రత్యయమైన 'కొఱకు' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు ' జనకుండు రాముని కొఱకుఁ గన్యనిచ్చెను'.

సులభవ్యాకర్త "సంప్రదానంబునకుం జతుర్థీ–కుషష్ఠులగు" (సులభ. కారక:13) అని సూత్రీకరించారు. సంప్రదానార్థంలో చతుర్థీ ప్రత్యయమైన 'కొఱకు' ప్రత్యయం, షష్ఠీ విభక్తి ప్రత్యయమైన 'కు' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు 'ఋషులు మోక్షము కొఱకు యత్నింతురు'.

సులభవ్యాకర్త "హేతుప్రయోగంబునఁ జతుర్థీ, కుషష్ఠులగు" (సులభ. కారక:14) అని సూత్రీకరించారు. హేత్వర్థక ప్రయోగంలో చతుర్థీ విభక్తి ప్రత్యయమైన 'కొఱకు', షష్ఠి ప్రత్యయమైన 'కు' అనేవి వస్తాయి. ఉదాహరణకు 'అన్నము కొఱకుఁ గాచి యున్నాడు', 'గుడ్డకు యాచించెను'.

'కొఱకు' ప్రత్యయార్థంలో కొన్నిసార్లు 'పొంటె' వస్తుందని వావిలికొలనువారు చెప్పారు. ఉదాహరణకు 'జగములు రక్షించు పొంటె' అంటే 'జగములు రక్షించు కొఱకు'. అని అర్థం.

## 8.1.5 పంచమీ విభక్తి

బాలవ్యాకర్త "అపాయ భయ జుగుప్సా పరాజయ ప్రమాద గ్రహణ భవన త్రాణ విరామాంతర్ధి వారణంబు లెద్దాన నగు దానికి వలన వర్ణకంబగు"(బాల. కారక:9) అని సూత్రీకరించారు. అపాయార్థంలో, భయార్థంలో, జుగుప్సార్థంలో, పరాజయార్థంలో, ప్రమాదార్థంలో, విరామర్థంలో, గ్రహణార్థంలో, వారణార్థంలో, హేత్వర్థంలో, త్రాణార్థంలో, పంచమీ విభక్తి ప్రత్యయమైన 'వలన' వర్ణకం వస్తుంది.

సులభవ్యాకర్త "అపాయ, జుగుప్సా, విరామ, ప్రమాద, గ్రహణ, భీ, త్రాణ, జన్మ, పరాజ, యాంతర్ధి, వారణ, హేతువులందు వలన వర్ణకం బగు" (సులభ. కారక:15) అని సూత్రీకరించారు.

అపాయార్థంలో, జుగుప్సార్థంలో, విరామర్థంలో, గ్రహణార్థంలో, వారణార్థంలో, హేత్వర్థంలో, త్రాణార్థంలో, పరాజయార్థంలో పంచమీ విభక్తి ప్రత్యయమైన 'వలన' వర్ణకం వస్తుంది.

సులభవ్యాకర్త "అధ్వ కాల నిర్మాణంబుల నుండి యగు" (సులభ. కారక:16) అని సూత్రీకరించారు. 'అధ్వం' అనగా దూరం. ఒక స్థలం నుండి మరొక స్థలానికి గల దూరాన్ని చెప్పాల్సినపుడు, ఒక కాలం నుండి మరొక కాలానికి మధ్య విళంబం  చెప్పాల్సినప్పుడు 'ఉండి' అనే ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు ' ఆ యూరి  నుండి ఈ యూరికి నొక యామడ', చైత్రము నుండి ఫాల్గునము వఱకు పండ్రెండు నెలలు'.

"ఆది ప్రభృతులకు 'ఉండి' యగు" అని పై సూత్ర వివరణలో వావిలికొలనువారు చెప్పారు. 'ఆది' మొదలైన  శబ్దాలకు 'ఉండి' వస్తుంది. ఉదాహరణకు ' ఆది నుండి', 'మొదటి నుండి', 'వెలి నుండి', 'పై నుండి', 'కడ నుండి'.

బాలవ్యాకర్త "ఉండిపదంబొకానొకచో వలన వర్ణకంబున కనుప్రయుక్తంబగు" (బాల. కారక:10) అని సూత్రీకరించారు. 'ఉండి' అనే పదం 'వలన' ప్రత్యయానికి కొన్నిచోట్ల అనుప్రయుక్తంగా వస్తుంది. ఉదాహరణకు 'హిమగిరి  వలన నుండి గంగ వొడమె'.

సులభవ్యాకర్త "వలన – న – లకు 'నుండి' యనుప్రయుక్తంబు నగు" (సులభ. కారక:17) అని సూత్రీకరించారు. 'ఉండి' అనే పదం పంచమీ విభక్తి ప్రత్యయమైన'వలన'కు, సప్తమీ విభక్తి ప్రత్యయమైన 'న' కు అనుప్రయుక్తంగా వస్తుంది. ఉదాహరణకు 'పాలసముద్రము వలన నుండి యమృతము జన్మించె', 'ఆకాశంబున నుండి గంగ డిగియె'.

బాలవ్యాకర్త "కంటె వర్ణకం బన్యార్థాది యోగజంబగు పంచమికగు"(బాల. కారక:12) అని సూత్రీకరించారు. అన్యార్థం మొదలైన వాటి అన్వయంలో వచ్చే పంచమీవిభక్తికి 'కంటె' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు 'రాముని కంటె నన్యుండు ధానుష్కుండు లేఁడు'.

సులభవ్యాకర్త "అన్య, దూర, సమీపే, తరోత్తరాద్యర్థయోగంబునఁ గంటె–కు వర్ణకంబు లగు" (సులభ. కారక:19) అని సూత్రీకరించారు. అన్యార్థంలో, దూరార్థంలో, సమీపార్థంలో, ఇతరార్థంలో, ఉత్తరాది(దిక్కులు) అర్థ యోగంలో పంచమీ విభక్తి ప్రత్యయమైన 'కంటె', షష్ఠి విభక్తి ప్రత్యయమైన 'కు' అనేవి వస్తాయి. ఉదాహరణకు 'అన్యార్థం–రామునకంటె నన్యుందు

దయాళుండెవండు', రామున కన్యుఁడు దయాళుండెవఁడు', 'దూరార్థము– రామేశ్వరమునకంటెఁ గాశి దూరము', సమీపార్థము – కాశీ కంటె రామేశ్వరము దగ్గఱ', ఇతరార్థము– దాని కంటె నితరము', ఉత్తరార్థయోగం– కాశి కంటె హిమవంత ముత్తరము'.

బాలవ్యాకర్త "కంటె వర్ణకంబు నిర్ధారణ పంచమికగు"(బాల. కారక:13) అని సూత్రీకరించారు. విభిన్నములైన జాత్యాదుల నుండి ఒకదానిని వేరు చేసేటప్పుడు పంచమీ విభక్తి ప్రత్యయమైన ' కంటె' అనేది వస్తుంది. ఉదాహరణకు 'జానపదుల కంటె నాగరులు వివేకులు'.

సులభవ్యాకర్త "కంటె వర్ణకంబు నిర్ధారణంబున నగు" (సులభ. కారక:20) అని సూత్రీకరించారు. బేధగుణాన్ని కలిగిన వ్యక్తినిగాని, వస్తువునుగాని పోల్చేటప్పుడు ' కంటె' ప్రత్యయం ఉపయోగపడుతుందని వావిలికొలనువారు చెప్పారు. ఉదాహరణకు 'నూఱశ్వమేధములకంటె సత్యము శ్రేయము', 'చదువకుండుట కంటెఁ జదివి మఱచుట మేలు'. వావిలికొలనువారు ఈ సూత్రవివరణలో 'కంటె' ప్రత్యయానికి బదులుగా ' కన్న' ప్రత్యయం కూడా వస్తుందని చెప్పారు.

బాలవ్యాకర్త "పట్టి వర్ణకంబు హేతువులగు గుణ క్రియల కగు"(బాల. కారక:14) అని సూత్రీకరించారు. హేతువులుగా కనిపించే గుణ క్రియలకు'పట్టి' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు 'జ్ఞానముఁ బట్టి ముక్తుఁడగు'.

సులభవ్యాకర్త "హేతువులగు గుణక్రియలకు, నన్నంతక్రియలమీఁదను పట్టివర్ణకంబగు" (సులభ. కారక:21) అని సూత్రీకరించారు. హేతువులుగా కనిపించే గుణ క్రియలకు, అన్నంత క్రియలకి ' పట్టి' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు 'విద్యను బట్టి గౌరవము కలుగును'.

## 8.1.6 షష్ఠి విభక్తి

బాలవ్యాకర్త "శేషషష్ఠికి యొక్కయు నగు"(బాల. కారక:15) అని సూత్రీకరించారు. సంబంధం తెలుపు అర్థంలో షష్ఠి విభక్తి ప్రత్యయమైన 'యొక్క' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు 'రాముని యొక్క గుణములు'. షష్ఠి విభక్తి ప్రత్యయమైన 'కు' అనేది కూడా సంబంధార్థంలో కొన్ని సార్లు వస్తుందని 'నాకుం దమ్ముడు', 'మీకు నెచ్చెలి' వంటి రూపాలను బాలవ్యాకర్త పేర్కొన్నారు.

సులభవ్యాకర్త "సంబంధంబున షష్ఠిని యొక్క కు లగు" (సులభ.కారక: 22) అని సూత్రీకరించారు. సంబంధం తెలుపు అర్థంలో షష్ఠి విభక్తి ప్రత్యయాలైన 'యొక్క, కు' వస్తాయి. ఉదాహరణకు' మా యొక్క ఇష్ట దైవము రాములు', మాకు నిష్టదైవము రాములు'. బాలవ్యాకర్త షష్ఠీ విభక్తి ప్రత్యయం 'కు' అనేదాన్ని సూత్రంలో కాకుండా వార్తిక రూపంలో చెప్పిన విషయాన్ని సులభవ్యాకర్త సూత్రంలో చెప్పారు.

సులభవ్యాకర్త "నామంబులకుఁ గాలావధియందు 'కి-కు' వర్ణకంబు లగు" (సులభ. కారక:23) అని సూత్రీకరించారు. నామాలకు కాల( గడువు) అవధిని తెలిపేటప్పుడు షష్ఠి విభక్తి ప్రత్యయమైన ' కు' ప్రత్యయం వస్తుంది. కొన్నింటికి 'కి' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' నీవు పదినాళ్ళకు రమ్ము', నీవేఁడాదికి రమ్ము'.

### 8.1.7 సప్తమి విభక్తి

బాలవ్యాకర్త "నిర్ధారణ షష్ఠికి లోపల వర్ణకంబగు"(బాల. కారక:16) అని సూత్రీకరించారు. ఒక సముదాయం నుండి జాతి, గుణం, క్రియ, సంజ్ఞ అనే వాటిలో దేనిచేతనైన ఆ సముదాయంలోని ఒక భాగం వేరుచేయడం నిర్ధారణం అంటారు. అలా నిర్ధారణ చేసేటప్పుడు ఆ సముదాయాన్ని బోధించు శబ్దానికి 'లోపల' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు ' మనుష్యుల లోపల క్షత్రియుండు శూరుండు'. ఈ సూత్రంలో బాలవ్యాకర్త 'ఇట సప్తమియుఁ గలదు' అని చెప్పి 'అందు' ప్రత్యయం కూడా నిర్ధారణార్థంలో వస్తుందని చెప్పారు. ఉదాహరణకు ' మనుష్యుల యందు క్షత్రియుండు శూరుండు'.

సులభవ్యాకర్త "నిర్ధారణమందు లోపల అందు వర్ణకంబు లగు" (సులభ. కారక:25) అని సూత్రీకరించారు. నిర్ధారణం అనగా అనేకవిధమైన జాతి గుణము క్రియగల గుంపు నుండి వేరుపర్చడం. అలా నిర్ధారణ చేసేటప్పుడు షష్ఠి విభక్తి ప్రత్యయం ' లోపల', సప్తమీ విభక్తి ప్రత్యయం 'అందు' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు 'విలుకాండ్రలో రాముఁడు మేటి', 'విలుకాండ్ర యందు రాముఁడు మేటి', బాలవ్యాకర్త సూత్రంలో షష్ఠివిభక్తి ప్రత్యయం 'లోపల' విధించి వాక్యంలో 'ఇట సప్తమియుఁ గలదు' అని చెప్పి 'అందు' ప్రత్యయం చెప్పారు. సులభవ్యాకర్త ఈరెండు విషయాలను కలిపి సూత్రంగా చెప్పారు.

సులభవ్యాకర్త పై సూత్ర వివరణలో 'సంస్కృత సమాసంబున నిర్ధారణమందు షష్ఠీ సమాసంబు లేదు' అని ప్రస్తావించారు. దీనిని బట్టి కేవలం సప్తమి మాత్రమే నిర్ధారణార్థంలో వస్తుందని అర్థమవుతుంది. ఉదాహరణకు ' బుధోత్తముడు- బుధుల యందుత్తముడు అనేది విగ్రహవాక్యం. బుధులలో ఉత్తముడు' అని చెప్పకూడదని వావిలికొలనువారు చెప్పారు.

బాలవ్యాకర్త "అధికరణంబున సప్తమి యగు"(బాల. కారక:17) అని సూత్రీకరించారు. అధికరణార్థంలో సప్తమీ విభక్తి ప్రత్యయాలైన 'అందు'అనే ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు 'ఘటమందు జలమున్నది' మోక్షమందిచ్ఛ గలదు'.

సులభవ్యాకర్త"అధికరణ దూరాంతికార్థంబుల సప్తమియగు" (సులభ. కారక:26) అని సూత్రీకరించారు. అధికరణార్థంలో, దూరార్థంలో, సమీపార్థంలో సప్తమీ విభక్తి ప్రత్యయాలైన 'అందు, న' వస్తాయి. ఉదాహరణకు 'వ్రేళ్ళ యందు గోళ్ళున్నవి', ఆ పుస్తకము దూరంబుననున్నది', పూర్వాభాద్రయందు నా జననము'.

## 8.1.8 ఒక విభక్తికి మరొక విభక్తి

బాలవ్యాకర్త "ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయా సప్తములు ప్రాయికంబుగ నగు"(బాల. కారక:11) అని సూత్రీకరించారు. 'ఉండి'శబ్దం పరమైనప్పుడు వలన ప్రత్యయానికి ద్వితీయావిభక్తి, సప్తమీ విభక్తి ప్రత్యయాలు తఱచుగా వస్తాయి. ఉదాహరణకు 'వనమునుండి వచ్చె', 'వనమందుండి వచ్చె'. కొందరు 'వనము నుంచి', ధనము నుంచి' అని 'ఉంచి' శబ్దము అనుప్రయుక్తం చేసి వాడుతారు. కాని అది సత్కవి సమ్మతం కాదని బాలవ్యాకర్త చెప్పారు.

సులభవ్యాకర్త "ఉండిశబ్దము పరంబగునపుడు 'వలన' కు ద్వితీయాసప్తము లాదేశంబులగు. అగుచోఁ గొండొక యెడ నుండికి లోపంబు నగు" (సులభ. కారక:18) అని సూత్రీకరించారు. 'ఉండి'శబ్దం పరమైనప్పుడు వలన ప్రత్యయానికి ద్వితీయావిభక్తి, సప్తమీ విభక్తి ప్రత్యయాలు తఱచుగా వస్తాయి. అలాంటి సందర్భంలో కొన్నిసార్లు 'ఉండి' శబ్దానికి లోపం వస్తుంది. ఉదాహరణకు 'కాశి నుండి వచ్చితి', కాశియందుండి వచ్చితి', 'ఉండి' లోపానికి ఉదాహరణ 'గర్భమున్ వెలువడుము', 'కంట నీళ్ళు గాఱెను'. 'కంటి నుంచి, ఇంటి నుంచి, నాటి నుంచి' వంటి

రూపాలు గ్రామ్యాలని వావిలికొలనువారు చెప్పారు. 'ఉండి' శబ్దానికి లోపం బాలవ్యాకర్త చెప్పిన సూత్రానికి పూరణగా ఈ సూత్రం కన్పిస్తున్నది.

సులభవ్యాకర్త "వ్యస్తంబైన కర్తృపద ప్రథమకు సమాసంబున యొక్క షష్ఠి యగు. అది యొకచో వ్యవహితంబును నగు. ఇట యొక్కకు లోపంబునిత్యంబు" (సులభ. కారక:24) అని సూత్రీకరించారు. సమాసంగా కాక వేరు వేరుగా రాసిన పదాలని వ్యస్త పదాలు అంటారు. అలాంటి వ్యస్తపదాల కర్తృవాచక ప్రథమా విభక్తికి సమాసంలో షష్ఠీ విభక్తి ప్రత్యయమైన 'యొక్క' అనేది వస్తుంది. ఈ 'యొక్క' అనేది కొన్నిసార్లు వ్యవహితంగా కూడా వస్తుంది. అలాంటి సందర్భంలో 'యొక్క' నిత్యంగా లోపిస్తుంది. ఉదాహరణకు ' నేను పఠించిన వేదములు'. ఇక్కడ 'పఠించిన' అనే క్రియకు 'నేను' అనేది కర్త ప్రథమా విభక్తి. దీనిని సమాసంగా రాసేటప్పుడు ఈ కర్తృపదానికి దాని షష్ఠీవిభక్తి రూపం వస్తుంది. 'నేను' అనుదానికి షష్ఠీవిభక్తి రూపం 'నాయొక్క' అవుతుంది. కాబట్టి 'నేను పఠించిన వేదములు' అనేది 'నాయొక్క పఠించిన వేదములు' అయింది. 'యొక్క' అనేది వ్యవహితంగా రావడంవల్ల నిత్యంగా యొక్క లోపించి 'నా పఠించిన వేదములు' అయింది.

బాలవ్యాకర్త "ఒకానొకచో నొక విభక్తికి మఱియొక విభక్తియు నగు"(బాల. కారక:21) అని సూత్రీకరించారు. కొన్నిసార్లు ఒక విభక్తి స్థానంలో వేరొక విభక్తి కూడా ప్రయోగాలలో కన్పిస్తుంది. ఉదాహరణకు 'మైత్రుండు గృహమును వెడలెను', 'మైత్రుండు గృహము నుండి వెడలెను'.

సులభవ్యాకర్త "కొన్ని యెడల నొక విభక్తికి మఱియొక విభక్తియు నగు" (సులభ. కారక:29) అని సూత్రీకరించారు. కొన్నిసార్లు ఒక విభక్తి స్థానంలో వేరొక విభక్తి కూడా ప్రయోగాలలో కన్పిస్తుంది. ఉదాహరణకు ' నీకు భక్తుడు– నీయందు భక్తుడు'.

బాలవ్యాకర్త "ఉకారాంత జడంబునకు నవర్ణకంబగు"(బాల.కారక:18) అని సూత్రీకరించారు. ఉకారాంత జడవాచకానికి అధికరణార్థంలో 'న' అనే సప్తమీ ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు 'ఘటంబున జలంబున్నది'. 'ఘటంబు' అనేది ఉకారంత జడవాచకం. కాబట్టి ఈ సూత్రం చేత 'న' వర్ణకం వచ్చి 'ఘటంబున' అయింది.

సులభవ్యాకర్త "ఉదంత జడంబు తృతీయకు 'న' వర్ణకంబగు" (సులభ. కారక:30) అని సూత్రీకరించారు. ఉకారం అంతంగా గల జడవాచకాలకు తృతీయ విభక్తి ప్రత్యయమైన ' చేత' వచ్చే

సందర్భాలలో సప్తమీ విభక్తి ప్రత్యయమైన 'న' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు 'కృష్ణుండు శిశుపాలుని కంఠంబు చక్రంబున ఖండించె'. ఇక్కడ 'చక్రంబున' అంటే 'చక్రంబుచే' అని అర్థం.

బాలవ్యాకర్త ఉకారం అంతంగా గల జడవాచకానికి అధికరణార్థంలో 'న' ప్రత్యయం విధించాడు. సులభవ్యాకర్త ఉకారంత జడవాచకానికి కరణార్థంలోని తృతీయకు 'న' ప్రత్యయం విధించారు.

బాలవ్యాకర్త "జడంబు తృతీయా సప్తములకు ద్వితీయ బహుళంబుగా నగు"(బాల. కారక:22) అని సూత్రీకరించారు. జడవాచకం యొక్క తృతీయా విభక్తికి, సప్తమీ విభక్తికి ద్వితీయా విభక్తి బహుళంగా వస్తుంది. ఉదాహరణకు 'రాముఁడు వాలి నొక్క కోలం గూలనేసె',

బాలవ్యాకర్త 'బహుళకంబుచే నిక్కార్యంబు బుదంతంబునకు బహుత్వమందెయగు' అని చెప్పడం వల్ల ఉదంత జడవాచకానికి బహువచనంలో మాత్రమే పైన చెప్పిన కార్యాలు జరుగుతాయి. ఉదాహరణకు 'అర్జునుండు శత్రు సేనలను బాణంబులను రూపు మాపె'. 'బాణము' ఉదంత జడవాచకం. తృతీయ బహువచనంలో 'బాణంబులచే' అవుతుంది. దీనికి ద్వితీయరాగా 'బాణంబులను' అయింది.

సులభవ్యాకర్త "తృతీయాసప్తములకుఁ బ్రాయికంబుగ జడంబులకు ద్వితీయ బహుళంబుగ నగు" (సులభ. కారక:31) అని సూత్రీకరించారు. తృతీయా విభక్తికి, సప్తమీ విభక్తికి ప్రాయికంగా జడవాచకాలకు ద్వితీయా విభక్తి బహుళంగా వస్తుంది. ఉదాహరణకు తృతీయకు ద్వితీయ 'ఇంద్రుడు వజ్రాహతిని వృతుని వధించె' , సప్తమికి ద్వితీయ 'శిరమును వన్నె'. సూత్రంలో ప్రాయికంగా అనడం వల్ల అజడవాచకాలకు కూడా ఈ కార్యాలు జరుగుతాయని అర్థం. ఉదాహరణకు తృతీయకు ద్వితీయ ' చక్రవాకముల నలరు కొలను',

బాలవ్యాకర్త పైసూత్రంలో 'బహుళ గ్రహణంచే అజడంబులకు నుదంతంబులకు బహువచనమంద యగు' అని చెప్పి 'వాఁడు పువులం బూజించె, వాఁడన్యదేశంబుల జారించె' వంటి ప్రయోగాలను ఉదాహరణలుగా ఇచ్చారు.

బాలవ్యాకర్త "జడంబు ద్వితీయకుం బ్రథమ బహుళంబుగా నగు"(బాల.కారక: 24) అని సూత్రీకరించారు. జడవాచకం యొక్క ద్వితీయావిభక్తికి ప్రథమా విభక్తి బహుళంగా వస్తుంది.

ఉదాహరణకు 'వాఁడు పూవులు దెచ్చె'. 'వాఁడు పూవులను దెచ్చె'. 'పూవు' శబ్దం జడవాచకం కాబట్టిఈ సూత్రంచే ద్వితీయకు ప్రథమ వచ్చి 'వాఁడు పూవులు దెచ్చె' అయింది.

బాలవ్యాకర్త పై సూత్రంలో 'బహుళకముచేఁ తృతీయాసప్తములకు విధించిన ద్వితీయకుం బ్రథమ రాదు'. అని చెప్పారు. అంటే సహజంగా సిద్ధించిన ద్వితీయకు మాత్రమే ప్రథమ వస్తుందని అర్థం. బాలవ్యాకర్త జడవాచకం యొక్క తృతీయా విభక్తికి, సప్తమీ విభక్తికి ద్వితీయా విభక్తి వస్తుందని ముందు సూత్రాలలో చెప్పారు. అలా వచ్చిన ద్వితీయకు ప్రస్తుత వాక్యంచే ప్రథమ రాదు.

సులభవ్యాకర్త "జడంబును నగు సిద్ధద్వితీయకుం బ్రథమ యగు" (సులభ. కారక:32) అని సూత్రీకరించారు. జడవాచకాలకు సహజసిద్ధంగా వచ్చి చేరిన ద్వితీయావిభక్తికి ప్రథమా విభక్తి వస్తుంది. ఉదాహరణకు 'వాఁడు వస్త్రములను నేసె', 'వాఁడు వస్త్రములు నేసె'. ఇందులో 'వస్త్రములు' అనేది జడవాచకం. ప్రస్తుత సూత్రంచే ద్వితీయకు ప్రథమ వచ్చి 'వాఁడు వస్త్రములు నేసె' అయింది. సూత్రంలో 'సిద్ధ ద్వితీయ' అనడం వల్ల ఇతర విభక్తులకు బదులుగా వచ్చి చేరిన ద్వితీయావిభక్తికి ప్రథమా విభక్తి రాదని అర్థం.

సులభవ్యాకర్త ఈ సూత్రంలోనే "జడంబును' ననుటచేఁ గ్వాచిత్కంబుగ నజడంబు ద్వితీయకుఁ బ్రథమయగు' అని చెప్పారు. అనగా అజడవాచకాలకు కూడా ద్వితీయవిభక్తి స్థానంలో ప్రథమావిభక్తి వస్తుందని అర్థం. ఉదాహరణకు 'వాఁడు హయం బొందు గొనియె', 'వాఁడు హయంబు నొందు గొనియె'.

ప్రౌఢ వ్యాకర్త "ఒక్కొకచో జడంబు సప్తమికిం బ్రథమయు నగు"(ప్రౌఢ. కారక:20) అని సూత్రీకరించారు. బాలవ్యాకర్త "జడంబు ద్వితీయకుం బ్రథమ బహుళంబుగా నగు"(బాల.కారక: 24) అని జడవాచకమైన ద్వితీయకు ప్రథమ చెప్పగా దానికి పూరణగా ప్రౌఢవ్యాకర్త సప్తమికి ప్రథమావిభక్తి ప్రత్యయం వస్తుందని పైసూత్రాన్ని చెప్పారు. ఉదాహరణకు ' తీర్థమందాడి' 'తీర్థము+ఆడి= తీర్థమాడి'.

సులభవ్యాకర్త "జడంబైన సప్తమికిఁ బ్రథమ వైకల్పికంబుగ నగు" (సులభ. కారక:33) అని సూత్రీకరించారు. జడవాచకంలో సప్తమీ విభక్తికి ప్రథమవిభక్తి ప్రత్యయం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'తీర్థమందాడి' 'తీర్థము+ఆడి= తీర్థమాడి'.

ప్రౌఢవ్యాకర్త "ఒక్కచో ద్వితీయాంత విధేయ విశేషణంబునకు బ్రథమయు నగు "(ప్రౌఢ. కారక:24) అని సూత్రీకరించారు. ద్వితీయాంత విధేయ విశేషణానికి ఒక్కొక్కసారి ప్రథమావిభక్తి వస్తుంది. విధేయవిశేషణం అనగా వక్తకు మాత్రమే తెలియదగినదని అర్థం. ఉదాహరణకు 'బ్రాహ్మణముఖ్యుఁ బురోహితుండుగా'. ఇందులో 'బ్రాహ్మణముఖ్యున్' అనేది విశేష్యం. ఇది ద్వితీయాంతంగా ఉన్నది. కాబట్టి దీని విశేషణమైన 'పురోహిత' శబ్దం ద్వితీయాంతంగా ఉండాలి. ప్రస్తుత సూత్రంచే ద్వితీయకు ప్రథమ రాగా 'బ్రాహ్మణముఖ్యుని బురోహితుండుగా= బ్రాహ్మణముఖ్యుఁ బురోహితుండుగా' అయింది.

సులభవ్యాకర్త "విధేయవిశేషణంబు ద్వితీయకుఁ బ్రథమయు నగు" (సులభ. కారక:34) అని సూత్రీకరించారు. ద్వితీయాంత విధేయ విశేషణానికి ప్రథమావిభక్తి వస్తుంది. విధేయవిశేషణం అనగా వక్తకు మాత్రమే తెలియదగినదని అర్థం. ఉదాహరణకు 'నీవు తగినవారిని మంత్రులుగాఁ జేసితివా?. ఇందులో ' నీవు తగినవారిని' అనేది విశేష్యం. 'మంత్రులంగా' అనే విధేయ విశేషణం ద్వితీయాంతంగా ఉంది. ప్రస్తుత సూత్రంచే ద్వితీయకు ప్రథమా వచ్చి' నీవు తగినవారిని మంత్రులంగాఁ జేసితివా?= నీవు తగినవారిని మంత్రులుగాఁ జేసితివా?' అనే రూపం ఏర్పడింది.

బాలవ్యాకర్త "సర్వనామ సంఖ్యాభిధాన తద్విశేష్యంబులయం దెయ్యది ముందు ప్రయోగింపంబడు దాని ద్వితీయాదులకుం బ్రథమ బహుళంబుగా నగు"(బాల. కారక:26) అని సూత్రీకరించారు. సర్వనామం, దాని విశేష్యం; సంఖ్యావాచకము, దాని విశేష్యం అనువాటిలో ఏది ముందు ప్రయోగింపబడుతుందో దాని ద్వితీయ మొదలైన విభక్తులకు ప్రథమా విభక్తి బహుళంగా వస్తుంది. ఉదాహరణకు ' అన్ని గుల్మములకు సాహిణులు ముప్వురు'. ఇక్కడ 'అన్ని' అనేది సర్వనామం, విశేషణం. 'గుల్మము' అనేది దాని విశేష్యం. బాలవ్యాకర్త ముందు చెప్పబడిన సూత్రంచే (బాల.కారక:19) 'అన్నింటికి గుల్మములకు'అయింది. ప్రస్తుత సూత్రంచే ముందు ప్రయోగింపబడిన సర్వనామపు షష్ఠికి ప్రథమ రాగా 'అన్ని గుల్మములకు' అయింది. ప్రథమా విభక్తి రాకపోతే 'అన్నింటికి గుల్మములకు' అని ఉంటుంది.

సులభవ్యాకర్త "సర్వనామ, సంఖ్యాభిధాన తద్విశేష్యంబులం దెయ్యది ముందు ప్రయోగింపఁబడు దాని ద్వితీయాదులకుఁ బ్రథమ బహుళంబుగా నగు" (సులభ. కారక:38) అని సూత్రీకరించారు. సర్వనామం, దాని విశేష్యం; సంఖ్యావాచకము, దాని విశేష్యం అనువాటిలో ఏది

ముందు ప్రయోగింపబడుతుందో దాని ద్వితీయ మొదలైన విభక్తులకు ప్రథమా విభక్తి బహుళంగా వస్తుంది. ఉదాహరణకు ' అన్ని గుఱ్ఱములకు, అన్నింటికి గుఱ్ఱములకు'. 'రెండు గుఱ్ఱములకు- రెండింటకి గుఱ్ఱములకు'.

## 8.1.9 విశేషణాలు-పురుషలు- వచనములు

బాలవ్యాకర్త "విశేష్యంబునకుంబోలె విశేషణంబునకు లింగ విభక్తి వచనంబులగు"(బాల. కారక:19) అని సూత్రీకరించారు. విశేష్యానికి వచ్చే లింగ విభక్తి వచనాలు విశేషణానికి కూడా వస్తాయి. ఉదాహరణకు 'నంద తనయుండు కృష్ణుండు నాకు దిక్కు'. ఇందులో 'కృష్ణుండు' పుంలింగం, ప్రథమావిభక్తి ఏకవచనాంతంగా ఉన్నది. కాబట్టి ఇవే లింగ విభక్తి వచనాలు విశేషణానికి వస్తాయి. 'నందతనయుండు' అనేది విశేషణం. ఇదికూడ పుంలింగం, ప్రథమావిభక్తి, ప్రథమాంతంగా ఉన్నది.

సులభవ్యాకర్త "విశేష్య విశేషణంబులు తుల్యలింగ విభక్తి వచనంబులు"(సులభ.కారక:27) అని సూత్రీకరించారు. విశేష్య విశేషణాలు సమానమైన లింగాన్ని, సమానమైన విభక్తిని, సమానమైన వచనాన్ని కల్గి ఉంటాయి. ఉదాహరణకు 'రాముడు జగదాభిరాముడు'. 'రాముడు' పుంలింగం, ప్రథమావిభక్తి ఏకవచనాంతంగా ఉన్నది. కాబట్టి ఇవే లింగ విభక్తి వచనాలు విశేషణానికి వస్తాయి. 'జగదాభిరాముడు' అనేది విశేషణం. ఇదికూడ పుంలింగం, ప్రథమావిభక్తి, ప్రథమాంతంగా ఉన్నది.

బాలవ్యాకర్త"స్త్రీసమంబులగు విశేషణంబులయు ముపర్ణకాంత విశేషణంబు లయు బహువచనంబున కేకవచనంబు బహుళంబుగా నగు"(బాల. కారక:20) అని సూత్రీకరించారు. స్త్రీ సమాలుగా ఉన్న విశేషణాలకు, ముపర్ణకాంత విశేషణాలకు బహువచనానికి ఏకవచనం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు 'మాటలు పెక్కేల- మాటలు పెక్కులేల', 'ఇష్టమగు పదార్థములు- ఇష్టములగు పదార్థములు'.

సులభవ్యాకర్త "స్త్రీసమంబులును, ముపర్ణ కాంతంబులును నగు విశేషణంబుల బహువచనంబున కేకవచనంబు బహుళంబుగ నగు" (సులభ. కారక:28) అని సూత్రీకరించారు. స్త్రీ సమాలుగా ఉన్న విశేషణాలకు, ముపర్ణకాంత విశేషణాలకు బహువచనానికి ఏకవచనం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు 'స్త్రీసమం: చిగురులు మృదువుగా నున్నవి- చిగురులు

మృదువులుగా నున్నవి', 'ముపర్ణకాంత విశేషణం:మనోహరమగు వనములు- మనోహరములగు వనములు'.

"భవిత్యర్థకంబు సన్నిహిత విశేషణంబునకును, దాని ముందు విశేషణంబుల కయి పదంబును బహుళంబుగా ననుప్రయుక్తంబగు"(బాల. కారక:29)

బాలవ్యాకర్త "అయి పదానుప్రయోగంబు లేనిచోఁదుది విశేషణంబునకేని విశేషణంబు లన్నింటికేని మీఁద సముచ్చయార్థంబు విభాషం బ్రయోగింపం బడు"(బాల. కారక:30) అని సూత్రీకరించారు.

సులభవ్యాకర్త "విశేషణంబు లనేకంబు లున్న చోఁ గడదానికి నగ్వాదులును, దత్పూర్వంబులకు 'అయి' యనుపదంబును నగు. కానిచోఁ బ్రతివిశేషణమున కేనియంత్యవిశేషణంబు మాత్రంబున కేని సముచ్చయార్థంబును వైకల్పికంబుగ నగు" (సులభ. కారక:36) అని సూత్రీకరించారు.

బాలవ్యాకర్త "ప్రథమాంతంబులగు యుష్మ దస్మద్విశేషణంబుల కేకత్వంబున వునులును, బహుత్వంబున రుములు, నంతాగమంబులు ప్రాయికంబుగ నగు"(బాల. కారక:33). "ఈ యాగమంబులు పరంబులగునపు డుత్వంబున కత్వంబగు" (బాల. కారక:34)అని సూత్రీకరించారు. ప్రథమాంతంగా ఉన్న యుష్మత్ విశేషణానికి చివర ఏకవచనంలో 'వు' వర్ణం, బహువచనంలో 'రు' వర్ణం ప్రాయికంగా ఆగమంగా వస్తాయి. అలాగే ప్రథమాంతాలైన అస్మత్ విశేషణాలకి చివర ఏకవచనంలో 'ను'వర్ణకం, బహువచనంలో 'ము'వర్ణకం ప్రాయికంగా ఆగమంగా వస్తుంది.

"వు-ను, రు-ము, అనేవి ఆగమంగా వచ్చేటపుడు ఉత్వానికి అత్వం వస్తుంది. ఉదాహరణకు 'నీవు ధన్యుఁడు+వు= నీవు ధన్యుఁడవు, మీరు ధన్యులు+రు= మీరు ధన్యులరు , నేను ధన్యుఁడు+ను= నేను ధన్యుఁడను , మేము ధన్యులు+ము= మేము ధన్యులము'.

సులభవ్యాకర్త "అస్మచ్ఛబ విశేషణంబులకు ను - ము — లును, యుష్మచ్ఛబ్ద విశేషణంబులకు వు రు –లును, నేక బహువచనంబుల నగు. అగుచో ముందున్న 'ఉ' కారంబు 'అ' కారం బగు" (సులభ. కారక:39) అని సూత్రీకరించారు. అస్మత్ శబ్దాల విశేషణాలకు ఏకవచనంలో

'ను' వర్ణకం, బహువచనంలో 'ము' వర్ణకం వస్తుంది. అలాగే యుష్మత్ శబ్ద విశేషణాలకు ఏకవచనంలో 'వు' వర్ణకం, బహువచనంలో 'రు' వర్ణకం వస్తుంది. ఇవి ఆగమంగా వచ్చే సందర్భంలో ముందున్న ఉకారానికి అకారం వస్తుంది. ఉదాహరణకు 'అస్మత్ శబ్ద విశేషణానికి : నేను మంచివాఁడను= నేను మంచివాఁడు+ను, నేను మంచి వాఁడ+ను, మేము మంచి వారము, యుష్మత్ శబ్ద విశేషణానికి: నీవు పుణ్య చరితుఁడవు, మీరు పుణ్య చరితులు'.

సులభవ్యాకర్త "కొన్ని యెడల మధ్యమౌత్తమ పురుషంబులకుఁ బ్రథమపురుష నగు"(సులభ. కారక:40)అని సూత్రీకరించారు. కొన్నిసార్లు మధ్యమ పురుష వాక్యాలు, కొన్ని ఉత్తమ పురుష వాక్యాలు ప్రథమ పురుషగా కన్పిస్తున్నాయి. ఉదాహరణకు 'పాండు భూవరునకుఁ గోడలైతి'. నీవు మంచివాడవు మీరు పెద్దలు', మేము పిన్నలు'.

బాలవ్యాకర్త "అది శబ్దంబునకు వునులు పరంబులగునపుడును సంబోధనంబు నందును దాన యను నాదేశంబగు"(బాల. కారక:35) అని సూత్రీకరించారు. 'వు-ను'లు పరమైనపుడు సంబోధనార్థంలో 'అది' అనే శబ్దానికి 'దాన' అనేది ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు ' నీవు చిన్న దానవు= నీవు చిన్న+దాన+వ'.

సులభవ్యాకర్త "సంబోధనంబునను, మధ్యమోత్తమ పురుష 'వు-ను'లు పరంబు లగునపుడును 'అది' కి 'దాన' యాదేశంబగు" (సులభ. కారక:41) అని సూత్రీకరించారు. సంబోదనార్థంలో మధ్యమ పురుష ఏకవచన ప్రత్యయం 'వు', ఉత్తమ పురుష ఏకవచనమైన 'ను' పరమయ్యేటప్పుడు 'అది' శబ్దానికి 'దాన' అనేది ఆదేశంగా వస్తుంది. ఉదాహరణకు 'నీవు పసిదానవు=నీవు పసి +అది+వు, నీవు పసి+దాన+వు, ' నేను బసిదానను'.

బాలవ్యాకర్త "అన్య యుష్మ దస్మత్కార్యంబులందుత్తరోత్తరంబు బలీయంబు" (బాల. కారక:36) అని సూత్రీకరించారు. అన్యకార్యం కంటె యుష్మత్కార్యం కంటె అస్మత్కార్యం బలవత్తరమని అర్థం. ఉదాహరణకు 'వారును వీరును ధన్యులరు'. ఇందులో ధన్యులరు అనేది యుష్మధర్థక విశేషణం. 'మీరు ధన్యులరు' అనేది యుష్మత్కార్యం. 'వారును ధన్యులరు' అనేది అన్యకార్యం. ఈ రెంటింటిలో యుష్మత్కార్యమే బలీయమగుటచే 'వారును మీరును ధన్యులరు' అని ఏర్పడింది.

సులభవ్యాకర్త“అన్య, యుష్మ, దస్మత్కార్యంబులం దుత్తరోత్తరంబు బలీయంబు” (సులభ. కారక:42) అని సూత్రీకరించారు. వాఁడు, నీవు, నేను అనే పదాలు ఏకవచన రూపంలోగాని, బహువచన రూపాలుగా ఉండి, వీటిలో ఏ రెండైన ఒక క్రియకు కర్తృ వాచక పదాలుగా ఉంటే, వాటిలో ముందటి పదంకన్న తరువాత ఉచ్చరించిన పదం బలం కలిగినది కాబట్టి దానిని అనుసరించే క్రియ వస్తుంది. ‘వాఁడు నీవు’ ఒక వాక్యంలో కర్తృ వాచకాలుగా ఉన్నప్పుడు మధ్యమపురుష క్రియ మాత్రమే ఉండాలి. ‘వాఁడు నేను’ కర్తలుగా ఉంటే ఉత్తమపురుష క్రియ మాత్రమే ఉండాలి.

సులభవ్యాకర్త “వాక్యంబునఁ బూర్వపరనియమంబు కొన్ని శబ్దంబులకుం దక్కఁగానరాదు” (సులభ. కారక:43) అని సూత్రీకరించారు. వాక్యంలో పూర్వ పర నియమం అనేది కొన్ని శబ్దాలకు మాత్రమే చెప్పబడింది. వాక్యంలో అన్నిచోట్ల ఈ నియమం కనిపించదు.

## 8.2. వాక్య విజ్ఞానం

‘వచ్’ అనే ధాతువు నుండి ‘వాక్యం’ అనే పదం ఏర్పడింది. వచించేది వాక్యం. తెలుగులో వాక్య నిర్మాణాన్ని ‘వాక్య రచన, వాక్య యోజన, వాక్య విన్యాసము’ అని కూడా పిలుస్తారు. వాక్య నిర్మాణాన్ని ఇంగ్లీషులో Syntax అని పిలుస్తారు. పాశ్చాత్యులు రచించిన తెలుగు వ్యాకరణాలు వాక్య నిరూపణ పట్ల శ్రద్ధ వహించాయి. సంస్కృతంలో పాణిని రచించిన **‘అష్టాధ్యాయి’** లో ‘వాక్యం’ గురించి ప్రత్యేకంగా చర్చించకపోయినా కారకాల నిరూపణ చేసేటప్పుడు వాక్య నిర్మాణానికి సంబంధించిన విషయాలు ఉన్నాయని ఇటీవల కాలంలో పండితులు నిరూపించారు. భర్తృహరి తన ***‘వాక్యపదీయం’*** లో ‘వాక్యకాండ’ అనే విభాగంలో వాక్యరచనపై చర్చ చేశాడు.

ప్రాచీన తెలుగు వ్యాకర్తలు ఎవరూ వాక్య నిర్మాణరీతిని గురించి ప్రత్యేకంగా చర్చించలేదు. పాపినేని అబ్బాయినాయుడుగారు మాత్రం మొట్ట మొదటగా తన *‘ఆంధ్ర వ్యాకరణ సంగ్రహం’* గ్రంథంలో రెండు చోట్ల వాక్యం గురించి చర్చ చేశారు. ఒకచోట“Rules of Syntax” అనే విభాగంలో 17 అంశాలను పొందుపరిచి వాక్య లక్షణాల చెప్పారు. మరొకచోట “వాక్య విభజన పద్ధతి” అనే శీర్షిక పెట్టి వాక్య విభజన చేసి వాక్యం ఎన్ని రకాలుగా ఉంటుందో స్పష్టం చేశారు.

బహుజనపల్లి సీతారామాచార్యులు ప్రౌఢవ్యాకరణంలో 'వాక్యపరిచ్ఛేదం' అని ప్రత్యేక శీర్షిక పెట్టి వాక్య చర్చ విస్తృతంగా చేశారు.

ప్రౌఢవ్యాకర్త "వాక్యమునా యోగ్యతాకాంక్షా సహితంబగు నర్థము గల యాసత్తియుక్త పద సముదాయంబు"(ప్రౌఢ. వాక్య:1) అని వాక్యాన్ని నిర్వచించారు. ప్రౌఢవ్యాకర్త దృష్టిలో వాక్యం అనగా యోగ్యత, ఆకాంక్ష, ఆసత్తి ఉన్న పదసముదాయం అని అర్థం. యోగ్యత అనగా పదాల అర్థాల పరస్పర సంబంధంలో బాధలేకుండా ఉండడం. ఉదాహరణకు 'నిప్పుచే తడుపుచున్నాడు'ఈ వాక్యంలో నిప్పుచే తడపడం అసంభవం కనుక ఆ రెండు పదాలకు అర్థ సంబంధంలో బాధ ఏర్పడింది. కాబట్టి ఈ పదాలకు ' యోగ్యత' లేదు. యోగ్యత ఉంటేనే వాక్యం అవుతుంది.

'ఆకాంక్ష' అంటే ఒక పదం ఉచ్చరించినపుడు దానికి సంబంధించిన ఇతర పదాలు తెలుసుకోవాలనే కోరిక కలగడం. ఉదాహరణకు ' గోవు గుఱ్ఱము'. ఇందులో 'గోవు' అనే పదానికి అన్వయ పదంగా 'గుఱ్ఱము' అనే పదం కోరదు. కాబట్టి ఇక్కడ ఆకాంక్ష లేకపోవడం వల్ల ఇది వాక్యం కాదు.

"ఆసత్తి అంటే పదాల చేరిక. వాక్యంలో పదాలు వ్యవధానం లేకుండా వెంట వెంటనే ఉచ్చరించబడాలి. ఉదాహరణకు ఈరోజు 'దేవదత్తుడు' అని చెప్పి రేపు ' పోవుచున్నాడు' అని అంటే పదాల మధ్య 'యోగ్యత', 'ఆకాంక్ష' అనే లక్షణాలు ఉన్నప్పటికీ ' ఆసత్తి' లేకపోవటం చేత ఆపద సముదాయం వాక్యం కాదు.

ప్రౌఢ వ్యాకర్త 'యోగ్యత, ఆకాంక్ష, ఆసత్తి' లోపించని వాటినే వాక్యంగా చెప్పినప్పటికీ ఉదాహరణలుగా మాత్రం ఈ మూడు లోపించినవాటిని చెప్పారు.

ప్రౌఢవ్యాకర్త "విషయబోధకము వాక్యము"(ప్రౌఢ. వాక్య:5) అని మళ్ళీ వాక్యాన్ని ఐదవ సూత్రంలో నిర్వచించారు. ఇక్కడ 'విషయ బోధకము' అంటే 'తెలియదగిన అంశము' అనే అర్థంలో ప్రౌఢవ్యాకర్త చెప్పారు. ప్రౌఢ వ్యాకర్త మొదటి సూత్రంలో వాక్యాన్ని నిర్వచించి ఈ సూత్రంలో వాక్యం ఏమి ప్రతిపాదిస్తుందో చెప్పారు.

సులభ వ్యాకర్త 'విషయబోధక పద రచన వాక్యంబు'.(సులభ. వాక్య:1) అని వాక్యాన్ని నిర్వచించారు. విషయాన్ని బోధించు పదాలను లేదా పద సముదాయాన్ని వాక్యమని నిర్వచించారు. సులభవ్యాకర్త కూడా వాక్య ప్రతిపాదనకు ప్రాధాన్యతని ఇచ్చారనిపిస్తుంది.

ఈ సూత్ర వివరణలో సులభవ్యాకర్త "కొన్ని విషయాలను సైగల చేత తెలుపవచ్చు. అలాంటి చేష్టలు వాక్యాలు కావు. నోటి నుండి వచ్చు ధనులన్నీ పదాలు కావు. మూగవారు, శిశువులు సైగలచేత తమ అభిప్రాయాన్ని తెల్పినప్పటికీ అవి వాక్యాలు అనిపించుకోవు" అని చెప్పారు. ఈ వాక్య పరిచ్ఛేదంలో 65 సూత్రాలు ఉన్నాయి.

## 8.2.1 పదం

ప్రౌఢవ్యాకర్త "పదమనఁగాఁ బ్రయోగార్హంబు ననన్వితంబు నేకంబు నర్థబోధకంబునైన వర్ణము లేక వర్ణ సముదాయము"(ప్రౌఢ. వాక్య:2) అని సూత్రీకరించారు. ప్రయోగార్హమై, అనన్వితమై ఏకమై, అర్థబోధకమైన వర్ణము లేక వర్ణ సముదాయాన్ని పదం అంటారని ప్రౌఢవ్యాకర్త చెప్పారు.

'ప్రయోగార్హము' అనడం వల్ల ప్రయోగార్హముగాని ప్రాతిపదికలు పదాలు కావు. ' ఖంబు', ఘటంబు' లోని 'ఖ, ఘట' అనే ప్రాతిపదికలు పదాలు అనిపించుకోవు.

'అనన్వితమైన' అనడంవల్ల అన్వితము కానిది అని అర్థం. అనగా అన్వయంతో కూడుకొననిది పదం అవుతుంది. ఉదాహరణకు 'ఖంబు, ఘటంబునం దోఁచెడి. ఇక్కడ 'ఖంబు' అనేది 'ఘటంబునన్' అనేవి 'తోఁచెడి' అనే క్రియతో అన్వయాన్ని కలిగి ఉన్నాయి. కాబట్టి 'ఖంబు, ఘటంబునం దోఁచెడి' అనే వాక్యం, పదం కాదు.

'ఏకంబు' అనడం వల్ల 'అనేకము'(ఏకం కానిది)పదం కాదు. అనగా ఆకాంక్షతో కూడిన అనేక పదాల మొత్తం పదం కాదు. ఉదాహరణకు 'ఖంబును ఘటంబును' అన్నప్పుడు ఇందులో పేర్కొన్న న్ని మాటలని కలిపి పదం అనకూడదు.

'అర్థ బోధకంబు' అనడం వల్ల 'అర్థ బోధకం కానివి' పదాలు కావు అని అర్థం. ఉదాహరణకు 'క, చ, ట, త, ప'. ఇవి అర్థబోధకాలుగాని వర్ణాలు. కాబట్టి ఇవి పదాలు కావు.

వర్ణ సముదాయం గల పదానికి ఉదాహరణ ‘ ఖంబు’ . ఇక్కడ ‘ఖ’ అనేది ప్రాతిపదిక. ‘ము’ విభక్తికి పూర్ణ బిందువు పూర్వక బువర్ణం కలిగింది. ఇది ఐదు వర్ణాల పదం.

సులభవ్యాకర్త “అర్థవంతమై, యన్వయయుక్తమై, ప్రయోగార్హంబైనది పదంబు” (సులభ.వాక్య:2) అని సూత్రీకరించారు. పదాలు అర్థవంతాలై ప్రయోగార్హతతో దేనితో ఏది అన్వయించునో ఆ పదాలు చేరి ఉండాలి. అన్వయం సంబంధం గల రెండు పదాల మధ్యలో సంబంధం లేని వేరొక పదం రాకూడదు. పదానికి ఖచ్చితంగా ఏదొక అర్థంఉండాలి. ఈ పదాలను వావిలికొలనువారు ఐదు రకాలుగా సూత్రీకరించారు.

అర్థవంతమైన పదానికి ఉదాహరణగా ‘భమ్ము(నక్షత్రము)’, ఖమ్ము(ఆకాశము), నభమ్ము(ఆకాశము’, నఖమ్ము(గోరు). అన్వయానికి ఉదాహరణ ‘ ఇంద్రియంబులందుఁ గన్నులు ప్రధానములు’. ప్రయోగార్హతకి ఉదాహరణ ‘ రాముడు– మంచివాఁడు. దీనిని ‘ రాముడు– మంచివా’ అని చెప్పడం సరైనది కాదని సులభవ్యాకర్త చెప్పారు.

ఈ సూత్ర వివరణలో సులభ వ్యాకర్త వాక్యం గురించి కొంత చర్చ చేశారు. ఒకరు మరొకరిని చూసి ‘పో’ అని చెప్పిన అది వాక్యం అవుతుందని సులభవ్యాకర్త చెప్పారు. ఎందుకంటే ‘పో’ అనేది అర్థం కలిగిన పదం, ప్రయోగయోగ్యమైనది. అన్వయం కూడా ఉన్నట్లు కన్పిస్తుంది. ‘పో’ అనేది మధ్యమ పురుష కాబట్టి ఇక్కడ ‘ నీవు’ అనేది అధ్యాహార్యము. ‘నీవు పో’ అనేది వాక్యం. కాబట్టి ‘నీవు’ అనే కర్తృపదంతో అన్వయించబడుతుంది. ఇలాగే తే– రా మొదలైనవి కూడా ఒంటి పద వాక్యాలు అని చెప్పారు.

‘పక్షులెగురును’, ‘రాముఁడు రావణుఁ జంపెను’. వంటి ఉదాహరణలను పద సమూహంతో ఏర్పడిన వాక్యాలని చెప్పారు.

‘వాఁడు వచ్చెనా! నేను బోదునా!’ వంటి ప్రశ్నార్థక ఉదాహరణలలో విషయం బోధపడుతుంది. కాబట్టి ఇలాంటివి వాక్యాలే అవుతాయని సులభవ్యాకర్త చెప్పారు.

‘శ్రీరాముడు నన్ను రక్షించునా! నేనంతటి యదృష్టవంతుఁడనా! నేను గడతేఱుదునా! నేనెన్నడు సుఖము గాంతునో!’ వంటి ఉదాహరణలు మనసులోని కోరికలను బయటపెడుతాయి. ఇలాంటివి కూడా వాక్యాలనే సులభవ్యాకర్త చెప్పారు.

సులభవ్యాకర్త ఆసత్తి, యోగ్యత, ఆకాంక్ష ఉన్నవి వాక్యాలు అవుతాయని ప్రౌఢవ్యాకర్త చెప్పిన విషయాన్ని సమ్మతించినట్లు ఈ సూత్రంలో ఇచ్చిన ఉదాహరణలను బట్టి తెలుస్తుంది. 'అన్వయం ఉపేక్షించు పదార్థాలను చేర్చడానికి లాక్షణికులు 'ఆసత్తి' అంటారని సులభ వ్యాకర్త చెప్పారు.

వాక్యంలో పదాలలోని అర్థాలకు పరస్పర సంబందాన్ని 'యోగ్యత' అని సులభవ్యాకర్త చెప్పారు. వాక్యంలోని పదాల అర్థాలకు పరస్పరం బాధ కలగకూడదు. ఉదాహరణకు ' వాఁడు మంచుచేఁ గొంప గాల్చెను. ఇక్కడ మంచుతో కాల్చడం అనే ప్రక్రియ జరగదు. కాబట్టి ఈ వాక్యంలో 'యోగ్యత' లోపించింది.

ఒకరు ఒకమాట చెప్పగానే వినేవారికి దాని విషయమై ఇంకా వినాలనే అపేక్ష కలగడం వల్ల తరువాత ఉచ్చరించు మాట ఆ అపేక్షను తీర్చేదిగా ఉండాలి. ఇలాంటి అపేక్షా సంబంధానికి 'ఆకాంక్ష' అని అంటారని సులభ వ్యాకర్త చెప్పారు. క్రియను వినగోరిన క్రియాకాంక్ష అవుతుంది.

సులభవ్యాకర్త 'ఆసత్తి, యోగ్యత, ఆకాంక్ష' కలిగినవే వాక్యమని, ఇవి చక్కగా ఉండేటట్లుగా పదాలు కూర్చిన విషయం బాగుగా బోధపడుతుందని చెప్పారు.

ప్రౌఢవ్యాకర్త "పదములవి నామములు క్రియ లవ్యయంబులని త్రివిధంబులు"(ప్రౌఢ. వాక్య:3) అని సూత్రీకరించారు. నామాలు, క్రియలు, అవ్యయాలు అని పదాలను ప్రౌఢవ్యాకర్త మూడు రకాలని పేర్కొన్నాడు. వీటికి నిర్వచనాలను తెలిపి అవి మళ్ళీ ప్రయోగాన్ని బట్టి ఎన్ని రకాలుగా ఏర్పడుతున్నాయో ఈ సూత్రంలోనే చెప్పారు.

వస్తువాచక శబ్దాలను నామాలుగా ప్రౌఢవ్యాకర్త పేర్కొన్నారు. ఇవి సందర్భాన్ని బట్టి కర్తగాను, కర్మాగాను వ్యవహరిస్తాయి. ధాత్వర్థమైన వ్యాపారాన్ని ఆశ్రయించేది కర్మ. ధాత్వర్థమైన ఫలాన్ని ఆశ్రయించేది కర్మ.

క్రియలు వ్యాపారార్థ బోధకాలు. ఇవి సకర్మకాలు, అకర్మకాలు అని రెండు రకాలు. కర్మను కోరే ధాతువు సకర్మకం. కర్మను కోరనిది అకర్మకం. కర్త, కర్మ, క్రియ ఈ మూడూ వాక్యంలో ఉన్నప్పుడు దానిని ప్రయోగం అంటారు. ప్రయోగం రెండు విధాలు. క్రియచేత కర్త చెప్పబడితే అది కర్తరి ప్రయోగం అవుతుంది. క్రియచేత కర్మ చెప్పబడితే అది కర్మణి ప్రయోగం అవుతుంది. కర్తరి

ప్రయోగంలో సరక్మక క్రియ వాడితే అది సకర్మక కర్తరి ప్రయోగం. అకర్మక క్రియ వాడితే అకర్మక కర్తరి ప్రయోగం.

అవ్యయాలకు లింగం విభక్తి వచనం ఉండవు. అవి ప్రతిపదోక్తాలు, లాక్షణికాలు రెండు రకాలు. ప్రతిపదోక్తాలు అనగా ప్రకృత సిద్ధములు, లాక్షణికాలు అనగా వ్యాకరణం చేత సిద్ధించినవి.

సులభవ్యాకర్త "పదములు, 1. నామములు, 2. క్రియలు, 3. అవ్యయములు, 4. విశేషణములు, 5. సర్వనామములని 5 విధంబులు" (సులభ. వాక్య:3) అని నిర్వచించారు. పదాలు నామాలని, క్రియలని, అవ్యయాలని, విశేషణాలని, సర్వనామాలని ఐదు రకాలుగా సులభవ్యాకర్త నిర్వచించారు. నామాలనగా వస్తువుల పేర్లు తెలుపు శబ్దాలు. ఉదాహరణకు 'రాముఁడు శివుని విల్లు విఱిచెను'. ఇక్కడ రాముఁడు, విల్లు, శివుని(శివుఁడు) నామవాచకాలు. 'విఱిచెను' అనేడి వస్తువు పేరు కాదు కాబట్టి ఇది నామం కాదు. నామాలు కర్తలుగాగాని, కర్మలుగాగాని ఉంటాయి.

సులభవ్యాకర్త " వ్యాపారావబోధకము క్రియ" (సులభ. వాక్య:4) అని సూత్రీకరించారు. ఒక వ్యాపారాన్ని గురించి బోధించే దానిని క్రియ అనవచ్చు . ఉదాహరణకు 'చంపెను'. ఇక్కడ 'చంపెను' అనే మాట ఒక వ్యాపారాన్ని గురించి బోధిస్తుంది. కాబట్టి 'క్రియ' అంటారు.

సులభవ్యాకర్త "ధాత్వర్థవ్యాపారాశ్రయము కర్త" (సులభ. వాక్య:5) అని సూత్రీకరించారు. ధాత్వర్థం యొక్క వ్యాపారానికి ఆశ్రయమైనది 'కర్త' అవుతుంది. ఉదాహరణకు ' రాముఁడు చంపెను'. ఇక్కడ 'చంపెను' అనేది క్రియ. 'చంపెను' అనగా చచ్చేటట్లు చేసెనని అని అర్థం. కాబట్టి చచ్చేటట్లు చేసెను అనేది ధాత్వర్థ వ్యాపారాన్ని తెలుపుతుంది. 'చంపెను' అను క్రియ 'చచ్చు' ధాతువు నుండి వచ్చింది. చచ్చేటట్లు చేయుట అనే వ్యాపారం ఎవరిని ఆశ్రయించి ఉన్నదో అనగా చచ్చేటట్లు చేసినవాడు 'రాముఁడు' కాబట్టి 'రాముఁడు' కర్త అవుతుంది.

సులభవ్యాకర్త "కర్త పదముమాత్రము. వస్తువ్యాపారము క్రియ" (సులభ. వాక్య:6) అని సూత్రీకరించారు. కర్త అనేది పదం మాత్రంగా ఉంటుంది. వస్తువు యొక్క వ్యాపారాన్ని తెలియజేసేది మాత్రం క్రియ అవుతుంది. ఉదాహరణకు 'పక్షు లెగిరెను. ఇక్కడ 'కర్త' పక్షులు అనే మాటే తప్ప ఆకాశంలో పోయే పక్షులనే జీవజంతువులు కావు. 'ఎగిరెను' అనే క్రియ 'పక్షులనే' మాట యొక్క

వ్యాపారాన్ని తెల్పదు. 'పక్షు లెగిరెను' అనే మాటచేత ఎరుగగల వస్తువులనగా ఆకాశంలో ఎగిరే జీవజంతువుల వ్యాపారాన్ని తెలపుతుంది.

సులభవ్యాకర్త "ధాత్వర్థ ఫలాశ్రయము కర్మము" (సులభ. వాక్య:7) అని సూత్రీకరించారు. ధాత్వర్థం యొక్క ఫలానికి ఆశ్రయమైనది కర్మ అవుతుంది. ఉదాహరణకు ' కృష్ణుదు తినెను'. ఇక్కడ 'తినుట' అనే ఒక కార్యం చేసెనని తెలిసెను గాని తినుటకు ఒక పదార్థం ఏదైనా ఉండవచ్చును. ఆ పదార్థం ఏమిటి? దేనిని తిన్నాడోనని తెలుసుకోవడానికి కోరిక కల్గుతుంది. ' కృష్ణుఁడు వెన్న తినెను' అన్నప్పుడు అ సందేహం తీరుతుంది. ఇలా దేనిని, ఎవరిని అనే ప్రశ్నకు ప్రత్యుత్తరం ఏమవుతుందో అది కర్మ అవుతుంది. ' తినెను' అనేది క్రియ. 'తిను' ధాతువు. 'తినుట' ధాత్వర్థం. 'తినుట' అనే వ్యాపారానికి ఆశ్రయుడు కాబట్టి 'కృష్ణుఁడు' అనే పదం కర్త అయింది. 'తినుట' అనే కార్య ఫలాన్ని ఆశ్రయమైనది కాబట్టి 'వెన్న' కర్మ అయింది. ఇలా కర్మని కోరు క్రియలు సకర్మాలు. కర్మని కోరనవి అకర్మకాలు.

సులభవ్యాకర్త "క్రియచేఁ గర్త చెప్పఁబడిన నది కర్తరి ప్రయోగము" (సులభ. వాక్య:8) అని సూత్రీకరించారు. 'క్రియచేత గర్త చెప్పబడిన కర్తరి ప్రయోగము'. ఉదాహరణకు ' వానరులు సేతువును గట్టిరి'. ఇక్కడ 'కట్టిరి' అనేది క్రియ. ఎవరు కట్టారు అన్నప్పుడు ' వానరులు' అని సమాధానం వస్తుంది. కాబట్టి 'వానరులు' 'కర్త' అవుతుంది. ఇక్కడ క్రియ చేత కర్త చెప్పబడుతున్నది కాబట్టి ఇది 'కర్తరి ప్రయోగం' అవుతుంది.

సులభవ్యాకర్త "క్రియచేఁ గర్మము చెప్పఁబడు నేని యది కర్మణి ప్రయోగము" (సులభ. వాక్య:9) అని సూత్రీకరించారు. క్రియచేత కర్మము చెప్పబడునేని యది కర్మణి ప్రయోగము'. 'వానరులచే సేతువు గట్టఁబడెను'. ఇక్కడ 'కట్టబడెను' అనేది క్రియ. 'సేతువు' అనేది కర్మ . ఇక్కడ క్రియ చేత కర్మని బోధించడం వల్ల ఇది కర్మణి ప్రయోగం అయింది.

ప్రౌఢవ్యాకర్త "సంపూర్ణ మసంపూర్ణమని వాక్యంబు ద్వివిధంబు"(ప్రౌఢ.వాక్య:7) అని సూత్రీకరించారు. సంపూర్ణం, అసంపూర్ణం అని వాక్యాన్ని రెండు రకాలుగా చెప్పారు. సమాపక క్రియగల వాక్యం సంపూర్ణ వాక్యం అవుతుంది. అసమాపకక్రియగల వాక్యం అసంపూర్ణ వాక్యం అవుతుంది.

సులభవ్యాకర్త "సమాపక క్రియ గల వాక్యంబు సంపూర్ణవాక్యంబు" (సులభ. వాక్య:10) అని సూత్రీకరించారు. సమాపకక్రియగల వాక్యం సంపూర్ణ వాక్యం అని నిర్వచించారు. ఉదాహరణకు 'రాముఁడు పితృ వాక్యముఁ బరిపాలించెను.

సులభవ్యాకర్త "అసమాపక క్రియ గల వాక్యంబు అసంపూర్ణ వాక్యంబు" (సులభ. వాక్య:11) అని సూత్రీకరించారు. సమాపకక్రియగల వాక్యం సంపూర్ణ వాక్యం అని నిర్వచించారు. ఉదాహరణకు 'రాముఁడు పితృ వాక్యముఁ బరిపాలింప సీతాలక్ష్మణులతోడ నడవి కేగి యనేక కష్టముల సహించుచు సంచరించుచు'. ఇక్కడ అన్ని అసమాపక క్రియలు ఉన్నాయి కాబట్టి ఇది అసంపూర్ణవాక్యం అవుతుంది.

సులభ వ్యాకర్త "ఏక పదంబునను, ధాతూప సర్గములందును, సమాసంబులందును, సర్వత్ర సంధి నిత్యము" (సులభ. వాక్య:12) అని సూత్రీకరించారు. ఏకపదాలలో, ధాతువుకి ఉపసర్గని కల్గియున్నప్పుడు, సమాసాలలో సంధి నిత్యంగా వస్తుందని వావిలికొలనువారు నిర్వచించారు. ఏకపదాలనగా విడదీయడానికి వీలులేని సంధితో కూడిన పదం. ఉదాహరణకు 'గోనెదు' దీనిని 'గోనె ఎడు' అని విడదీసి రాయకూడదు. అలాగే ధాతువు ఉపసర్గను కల్గినప్పుడు విసంధిగా రాయకూడదు. ఉదాహరణకు 'ప్రాప్తి' దీనిని 'ప్ర ఆప్తి' అని రాయకూడదు. సమాసాలలో కూడా విసంధి రాకూడదు. ఉదాహరణకు 'దశరథాత్మజులు' దీనిని 'దశరథ ఆత్మజులు' అని రాయకూడదు.

సులభవ్యాకర్త "గద్యంబున నుచ్చారణ శ్రవణ పారుష్య విరహితంబుగ యథాయోగ్యత వక్త యిచ్చకొలఁది సంధి విడఁదీయ నగు" (సులభ. వాక్య:13) అని సూత్రీకరించారు. గద్యంలోగాని, ఉచ్చారణ వల్ల ఏర్పడ్డ శ్రవణ పారుష్యత లేకుండా ఉండడానికి వక్త ఇష్టానికి అనుగుణంగా సంధి విడదీయవచ్చు. విసంధి అనేది వక్త యొక్కయు, శ్రోత యొక్కయు సామర్థ్యాన్ని అనుసరించి ఉండాలి. స్వభావ విరుద్ధంగా ఉండరాదు. వక్త శ్రోత ప్రౌఢులైతే విసంధి చేయక్కర్లేదు. శ్రోత బాలుడైతే అన్నిచోట్ల సంధి కలిపి చెప్పవచ్చును. 'నీ వెవ్వఁడవు, అతఁడిప్పుడెందున్నాఁడు'. వంటి స్వభావ సిద్ధమైన చోటుల విసంధిగా రాయకూడదు.

సులభవ్యాకర్త ఎక్కడెక్కడ విసంధి చేస్తే దోషం కాదోఈ సూత్ర వివరణలో చెప్పారు. వాక్యం అంతంలో, సంధి కలిపినపుడు సంధిగ్ధ దోషం కలిగే సందర్భంలో, శబ్ద స్వరూపాన్ని చెప్పే

సందర్భంలో, దీర్ఘ సమాసాల మధ్యలో, చాలా ద్రుతాలు ఒకేసారి కలిసే సందర్భంలో, సంధి కలిపినపుడు ఆశ్లీల, అమంగళ, వ్రీడా దోషాలు కలిగే సందర్భంలో, గద్యాల్లో విసంధి రాయటం దోషం కాదు.

ప్రౌఢవ్యాకర్త "కొన్ని యెడలఁ బ్రామాణిక ప్రయోగంబులం ద్రుతంబున కచ్చు పరంబగుచో ద్విత్వంబు చూపట్టెడి"(ప్రౌఢ. సంధి:3) అని సూత్రీకరించారు. కొన్నిచోట్ల ప్రామాణిక ప్రయోగాలలో ద్రుతానికి అచ్చుపరమైనపుడు ద్విత్వం కనబడుతుంది. ఉదాహరణకు 'సర్వాంగునిన్+ అనుభూత= సర్వాంగునిన్ననుభూత అవుతుంది. బాలవ్యాకరణ సంధి9చే 'సర్వాంగునిన్ + అనుభూత=సర్వాంగుని ననుభూత–వంటి రూపాలు ఏర్పడతాయి. కాబట్టి కొన్నిచోట్ల ద్విత్వం కలుగుతుందని పూరణగా చెప్పబడింది.

సులభవ్యాకర్త "ద్రుతంబున కచ్చు పరంబగుచో ద్విత్వంబు మహాప్రబంధంబులందు సకృత్తుగఁ గానఁబడెడి" (సులభ. వాక్య:14) అని సూత్రీకరించారు. ద్రుతానికి అచ్చు పరమైనపుడు ద్విత్వం మహాకావ్యాల పద్యాలలో సకృత్తుగా ప్రయోగించబడింది. ఇలా తరుచుగా ప్రయోగించకూడదని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకి ' అను+ఇష్ట సఖి'=అను+నిష్ట సఖి =అన్+నిష్టసఖి= అన్నిష్ట సఖి. 'ఏని' శబ్దం బదులుగా హలాదిగా ' నేని' అనే పదం కలదని కొందరు పెద్దలు చెప్తారని సులభవ్యాకర్త చెప్పారు.

ప్రౌఢవ్యాకర్త "మహత్సమూహార్థక శబ్దం బమహత్కార్య యుక్తం బయ్యుఁ దద్విశేషణ క్రియలు మహత్కార్య యోగ్యంబులు విభాషనగు"(ప్రౌఢ. శబ్ద:17) అని సూత్రీకరించారు. మహత్తుల యొక్క సమూహాన్ని బోధించు శబ్దం, అమహద్వాచకాలకు రావలసిన వ్యాకరణ కార్యాలతో కూడుకున్నప్పటికీ దాని విశేషణాలు, క్రియలు మహద్వాచకాలకి రావలసిన వ్యాకరణ కార్యాలకు తగినవిగా ఉంటాయి. సూత్రంలో వికల్పం అనడం వల్ల కొన్నిసార్లు అమహద్వాచక కార్యాలు కూడా జరుగుతాయి. ఉదాహరణకు 'ముని నికాయము పూజించిరి'. ఇక్కడ ముని శబ్దం మహత్తు, కాబట్టి నికాయ శబ్దం మహత్ సమూహార్థక శబ్దం. నికాయము అనేది అమహత్తులకు రావలసిన మువర్ణకంతో కూడుకొని ఉన్నది. అయినప్పటికీ మహద్వాచకాలకి రావలసిన 'పూజించిరి' అనే క్రియ దీనికి వచ్చింది. సూత్రంలో విభాషగా చెప్పటం వల్ల 'ముని నికాయము పూజించెను' అనే అమహద్వాచక రూపం ఏర్పడుతుంది.

సులభవ్యాకర్త"సమూహార్థకంబైన మహచ్ఛబ్దం బమహచ్ఛబ్దరూపంబుం బోలియుండినను దద్విశేషణ, క్రియలు వైకల్పికంబుగ మహద్వాచకంబులయి యుండు"(సులభ.వాక్య:15) అని సూత్రీకరించారు. సమూహార్థాన్ని బోధించు మహద్వాచక శబ్దాలు అమహద్వాచకాలుగా పోలియున్నప్పటికీ దాని విశేషణాలు, క్రియలు మహద్వాచకాలకి రావలసిన వ్యాకరణ కార్యాలకు తగినవిగా ఉంటాయి. సూత్రంలో వికల్పం అనడం వల్ల కొన్నిసార్లు అమహద్వాచక కార్యాలు కూడా జరుగుతాయి. ఉదాహరణకు ' పద నడుతురు నిన్నుఁ గన్నఁ బ్రమథ గణంబుల్'.

ప్రౌఢవ్యాకర్త "తెనుఁగునం గొన్ని తత్సమ దేశ్య శబ్దముల కంటెం బరంబుగ నేకవచనంబున నీచత్వ ద్యోతకంబయి యిగాయను నొక్క శబ్దంబును, దానిపై డువర్ణకాదులనుం జూపట్టెడి. సంబోధనంబు డువర్ణకంబు చూపట్టదు. తుది దీర్ఘంబునకు హ్రస్వంబు వైకల్పికంబు."(ప్రౌఢ. శబ్ద:22) అని సూత్రీకరించారు. ఆంధ్రభాషలో కొన్ని తత్సమ శబ్దాలకు దేశ్య శబ్దాలకు పరంగా ఏకత్వంలో నీచత్వం బోధించే 'ఇగా' ప్రత్యయం కన్పిస్తుంది. దీనిపైన 'డు' వర్ణకాదులు వస్తాయి. సంబోధనంలో 'డు' ప్రత్యయం లోపిస్తుంది. చివర ఉన్న దీర్ఘానికి హ్రస్వం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకి 'బాల+ ఇగా= బాలిగా+డుఙ్=బాలిగాఁడు అయింది. సంబోధనార్థంలో 'డుఙ్' లోపించి తుది దీర్ఘం వికల్పంగా హ్రస్వమయితే 'బాలిగా- బాలిగ' అనే రూపాలు ఏర్పడతాయి.

సులభవ్యాకర్త "నీచత్వంబునఁ బుంలింగంబున, నేకవచనంబునఁ గొన్ని సంజ్ఞా వాచకంబులకు 'గాఁడు' చేరుచోఁ బ్రాతిపదిక మికారాంత మగు" (సులభ. వాక్య:16) అని సూత్రీకరించారు. నీచార్థం బోధించే పుంలింగ శబ్దాల ఏకవచనంలో కొన్ని సంజ్ఞావాచకాలకి 'గాఁడు' అనే ప్రత్యయం వచ్చి చేరితే ప్రాతిపదిక ఇకారాంతగా మారుతుంది. ఉదాహరణకు 'రామ' అనే ప్రాతిపదికకి నీచార్థంలో పుంలింగ ఏకవచనంలో 'గాఁడు' ప్రత్యయం చేరగా ప్రాతిపదిక ఇకారాంతంగామారి 'రామి+గాఁడు=రామిగాఁడు' అయింది. "కాఁడు అనునది యిట్లయ్యెనని యెఱుంగునది" అనే వ్యాక్యాన్ని బట్టి 'కాఁడు' శబ్దం 'గాఁడు' అయిందని సులభవ్యాకర్త చెప్పారు.

సులభవ్యాకర్త పై సూత్ర వివరణలో సంబోధనంలో 'డుఙ్' కి లోపాన్ని నిత్యంగా చెప్పారు. గకారానికి హ్రస్వం వికల్పంగా వస్తుందని సూచించారు. ఉదాహరణకి 'రామిగా- రామిగ'.

ప్రౌఢవ్యాకర్త "తఱచుగా స్త్రీసమంబులగు దేశ్యశబ్దములకుఁ గడపలఁ గొన్నంటి కేకవచనంబునం బూజ్యతయందు గారు శబ్దంబగు"(ప్రౌఢ. శబ్ద:39) అని సూత్రీకరించారు. తరుచుగా స్త్రీసమాలైన దేశ్యశబ్దాలు ఏకవచనాంతాలైనపుడు కొన్నిసార్లు వాటి చివర పూజ్యార్థంలో 'గారు' శబ్దం వస్తుంది. ఉదాహరణకు ' అయ్య+గారు=అయ్యగారు'.

సులభవ్యాకర్త "తఱచుగా స్త్రీసమంబుల కడపలఁ గొన్నింటి కేకవచనంబునఁ బూజ్యత యందు 'గారు' శబ్దంబగు. ద్వితీయైక వచనరూపంబుమీఁద గారు వారును నగు" (సులభ. వాక్య:17) అని సూత్రీకరించారు. తరచుగా స్త్రీసమాలు ఏకవచనాలుగా ఉన్నప్పుడు వాటి చివర కొన్నిసార్లు పూజ్యార్థంలో ' గారు' శబ్దం వస్తుంది. ఉదాహరణకు 'అన్న+గారు= అన్నగారు. ద్వితీయా ఏకవచన రూపాలలో 'గారు', వారు' అనే రెండు శబ్దాలు వస్తాయి. ఉదాహరణకు 'రాయని+గారు=రాయనిగారు' రాయని+వారు=రాయనివారు'

ప్రౌఢవ్యాకర్త "దుమంతంబులగు తత్సమాది శబ్దంబులకుం గొన్నింటికి ద్వితీయా బహువచనంబు మీఁదం బూజ్యత యందు గారునకు మాఱుగ వారగు" (ప్రౌఢ. శబ్ద:41) అని సూత్రీకరించారు. దుమంతాలైన కొన్ని తత్సమాది శబ్దాలకు ద్వితీయాబహువచనం మీద పూజ్యార్థంలో 'గారు' శబ్దానికి బదులుగా 'వారు' శబ్దం వస్తుంది. ఉదాహరణకు 'శ్రీరాములను+వారు', శ్రీరాముల+వారు= శ్రీరాములవారు'.

ప్రౌఢవ్యాకర్త "అర్థవిశేషణంబునం దేకత్వంబునకు గొన్ని శబ్దముల మీఁద వారు చూపట్టెడు" ప్రౌఢ. శబ్ద: 42) అని సూత్రీకరించారు. కొన్ని అర్థవిశేషణాల్లో ఏకవచనాన్ని తెలిపే కొన్ని శబ్దాల మీద ' వారు' శబ్దం కన్పిస్తుంది. ఉదాహరణకు ' అయ్య+వారు=అయ్యవారు'. ఇక్కడ అర్థవిశేషణాన్ని బట్టి ఒకసారి 'ఉపాధ్యాయుడు', మరొకసారి 'పూజ్యుడైన బ్రాహ్మణుడు' అనే అర్థం వస్తుంది.

సులభవ్యాకర్త "తత్సమ దుమంతంబులకుఁ గొన్నింటికి ద్వితీయా బహువచనంబు మీఁదఁ బూజ్యతయందు వారగు"(సులభ. వాక్య:18) అని సూత్రీకరించారు. దుమంతాలైన కొన్ని తత్సమాది శబ్దాలకు ద్వితీయాబహువచనం మీద పూజ్యార్థంలో 'వారు' శబ్దం వస్తుంది. ఉదాహరణకు 'శ్రీరాములను+వారు= శ్రీరాముల+వారు=శ్రీరాములవారు. అర్థవిశేషణంలో ఏకవచనం మీద కొన్నిసార్లు 'వారు' కన్పిస్తున్నది. ఉదాహరణ 'అయ్యవారు, అమ్మవారు' మొదలైనవి.

ప్రౌఢవ్యాకర్త "పూజ్యతయం దొక్కచో నామ తదేతద్యుష్మ దస్మచ్ఛబ్దంబుల యేక వచనంబునకు బహువచనంబగు. అగుచో సంబోధ్యవాచకంబు బహువచనాంతంబు కాదు" (ప్రౌఢ. శబ్ద.43). అని సూత్రీకరించారు. పూజ్యార్థంలో నామ శబ్దం యొక్కయు, ఆ, ఈ, నీ, నా శబ్దాల యొక్కయు, ఏకవచనంలో కొన్నిసార్లు బహువచనం అవుతుంది. అలాంటి సందర్భంలో సంబోధ్యవాచకం బహువచనాంతం కాదు. ఏకవచనాంతమే అవుతుంది. కొన్ని చోట్ల పూజ్యార్థంలో ఏకవచమే వస్తుంది. ఉదాహరణకు 'మహితాత్మ!మీర లిమ్మహినుండ' ఇక్కడ 'మీరలు' అని యుష్మదర్థకానికి బహువచనం కలిగింది. కాని, సంబోధ్యవాచకం మహితాత్మ(మహితాత్ముడా) అని ఏకవచనాంతంగానే ఉన్నది. కొన్నిచోట్ల 'ఆచార్యుడు ద్రోణునకున్ శిష్యుఁడ' ఇక్కడ పూజ్యార్థంలో 'ఆచార్యుడు, ద్రోణునకున్' అని ఏకవచనాంతాలే వాడబడినవి. 'ఆచార్యులు, ద్రోణులకున్' అని బహువచనాంత రూపం రాలేదు.

సులభవ్యాకర్త "పూజ్యతయందు నామ వాచకంబులయు, వాఁడు వీఁడు-నా-నీ శబ్దంబులయు నేకవచనంబునకు బహువచనం బొక్కెడ నగు" (సులభ. వాక్య:19) అని సూత్రీకరించారు. పూజ్యార్థంలో నామ శబ్దం యొక్కయు, ఆ, ఈ, నీ, నా శబ్దాల యొక్కయు ఏకవచనానికి బహువచనం ఒక్కసారి వస్తుంది. ఉదాహరణకు ' శ్రీరాముడు- శ్రీరాములు'. 'మాగురు విట్లు చెప్పెను'. మా గురువు లిట్లు చెప్పిరి' . ఇక్కడ మా అనేది సంబంధంలో బహువచనం. గురువులు అనేది పూజ్యార్థంలో బహువచనం. 'మీదయ యెట్లు వచ్చిన నట్లు సేయుడు' ఇక్కడ 'నీ దయ' అనడానికి బదులుగా 'మీ దయ' అని పూజ్యార్థంలో బహువచనం చెప్పబడింది.

సులభవ్యాకర్త ఈ సూత్ర వివరణలో 'అగుచోఁ గ్రియయు సంబోధ్యవాచకం బేకవచనాంతం బగుటయుఁ గలదు'. అని చెప్పారు . అనగా పూజ్యార్థంలో నామ శబ్దం యొక్కయు, ఆ, ఈ, నీ, నా శబ్దాల యొక్కయు, ఏకవచనంలో కొన్నిసార్లు బహువచనం అవుతుంది. అలాంటి సందర్భంలో సంబోధ్యవాచకం, క్రియ ఏకవచనాంతం అవుతుంది. బహువచనాంతం కాదు. పూజ్యార్థంలో సంబోధ్య వాచకానికి ఉదాహరణ 'అనఘా! మీయట్టి వారి యాశ్రితుఁ డిట్టులుండ నొప్పరికింపఁ దగవా'. ఇక్కడ 'అనఘా'(అనఘుడా) అని సంబోధనావాచకం ఏకవచనంలోనే ఉన్నది. పూజ్యార్థంలో ఏకవచన క్రియకు ఉదాహరణ 'నెయ్యఁపు టొజ్జలు పైపై నెనయింపసాగె'. ఇక్కడ పూజ్యార్థంలో 'ఒజ్జలు' బహువచనం. 'సాగె' అనే క్రియ ఏకవచనం.

## 8.2.2 సంబోధనార్థం

ప్రౌఢవ్యాకర్త "సంబోధ్యవాచకంబు బహువచనాంతంబయ్యుఁ గ్రియలమీఁది యమ్మాదు లేకవచనాంతంబుల యగు"(ప్రౌఢ. శబ్ద:44) అని సూత్రీకరించారు. సంబోధ్య వాచకం బహువచనాంతమయినప్పటికీ క్రియా పదాలమీద 'అమ్మ' మొదలైన శబ్దాలు ఏకవచనాంతాలే అవుతాయి. ఉదాహరణకు 'చూచి వత్తుమమ్మ సుదతులార' ఇక్కడ 'సుదతులార' అనే సంబోధ్యవాచకం బహువచనాంతమై ఉన్నది. అయినప్పటికీ 'వత్తము' అనే క్రియాపదాలపైన 'అమ్మ' శబ్దం ఏకవచనాంతంగానే ఉన్నది.

సులభవ్యాకర్త "సంబోధ్యవాచకంబు బహువచనాంతంబయ్యుఁ గ్రియలమీఁది యమ్మాదు లేకవచనాంతంబుల యగు" (సులభ. వాక్య:20) అని సూత్రీకరించారు. సంబోధ్య వాచకం బహువచనాంతమయినప్పటికీ క్రియా పదాలమీద 'అమ్మ' మొదలైన శబ్దాలు ఏకవచనాంతాలే అవుతాయి. ఉదాహరణకు 'మల్లికలార! మీ పొదల మాటుల లేఁదుగదమ్మ చెప్పరే'. ఇక్కడ 'మల్లికలార' సంబోధ్యవాచకం బహువచనాంతమై ఉన్నది. 'అయినప్పటికీ 'లేదు కదా' అనే క్రియాపదాలపైన 'అమ్మ' శబ్దం ఏకవచనాంతంగానే ఉన్నది. 'మిత్రులార నాకు మీరు తోడ్పడెదరయ్య'. ఇక్కడ 'మిత్రులార' సంబోధ్యవాచకం బహువచనాంతమై ఉన్నది. 'అయినప్పటికీ 'తోడ్పడెదరు' అనే క్రియాపదాలపైన 'అయ్య' శబ్దం ఏకవచనాంతంగానే ఉన్నది.

ప్రౌఢవ్యాకర్త "పూజ్యతాతిశయంబున యుష్మదర్థ బహువచనంబునకు మాఱుగా నాత్మార్థ బహువచనంబు ప్రయుక్తంబగు"(ప్రౌఢ. శబ్ద:45)" అని సూత్రీకరించారు. ఎక్కువ పూజ్యతను (వివక్షించునపుడు) కలిగి ఉన్న సందర్భంలో యుష్మదర్థకం యొక్క (నీ– శబ్దం) బహువచనానికి బదులుగా, ఆత్మార్థకం యొక్క (తా– శబ్దం) బహువచనం వాడబడుతుంది. 'మీరు– మీరలు' అనేవి యుష్మదర్థక బహువచనాలు. 'తాము– తారు–తమరు' ఆత్మార్థక బహువచనాలు. పూజ్యత అతిశయంలో మీరు, మీరలు అనే వాటికి బదులుగా తాము, తారు, తమరు వస్తాయని సూత్రార్థం ఉదాహరణకు 'స్వామీ! తాము దయచేయవలెను'. ఇక్కడ యుష్మదర్థక బహువచనం 'మీరు, మీరలు' అని కాక, 'తాము' అనే ఆత్మార్థక బహువచనం వాడబడింది.

సులభవ్యాకర్త "పూజ్యతాతిశయంబున మీకునకుఁ దాము-తమ రగు" (సులభ. వాక్య:21) అని సూత్రీకరించారు. ఎక్కువ పూజ్యతను కలిగి ఉన్న సందర్భంలో యుష్మదర్థకం యొక్క బహువచనం 'మీ(మీరు)' బదులుగా, ఆత్మార్థకం యొక్క బహువచనాలు 'తాము- తమరు' వస్తాయి. ఉదాహరణకు ' తాము వ్రాయించిన పత్రిక' ఇక్కడ 'మీరు' అని యుష్మదర్థక బహువచనం కాకుండా, ఆత్మార్థక బహువచనం 'తాము' వచ్చింది. 'తమరంపిన గ్రంథము' ఇక్కడ 'మీరు' అని యుష్మదర్థక బహువచనం కాకుండా, ఆత్మార్థక బహువచనం 'తమరు' వచ్చింది.

ప్రౌఢవ్యాకర్త "సంబంధంబున యుష్మదస్మచ్ఛబ్దంబులకుం గొన్ని యెడల బహుత్వంబగు"(ప్రౌఢ. శబ్ద:46) అని సూత్రీకరించారు. సంబంధంలో యుష్మద్ శబ్దానికి (నీ- శబ్దం), అస్మద్ శబ్దానికి (నా- శబ్దం) కొన్ని చోట్ల బహువచనం వస్తుంది. ఉదాహరణకు ' మీ యిల్లు( మీ యొక్క ఇల్లు)' అన్నప్పుడు సంబంధంలో 'నీ' అనే యుష్మదర్థక ఏకవచనానికి, 'మీ' అని బహువచనం వచ్చింది. మా అత్త(మాయొక్క అత్త) అన్నప్పుడు సంబంధంలో 'నా' అనే అస్మదర్థ ఏకవచనానికి, 'మా' అని బహువచనం వచ్చింది.

సులభ వ్యాకర్త "సంబంధంబున 'నీ- నా' లకు బహువచనరూపం బొక్కెడ నగు" (సులభ. వాక్య:22) అని సూత్రీకరించారు. సంబంధంలో' నీ' శబ్దానికి (యుష్మద్ శబ్దం), 'నా' శబ్దానికి (అస్మద్ శబ్దం) కొన్ని చోట్ల బహువచనం వస్తుంది. ఉదాహరణకు ' మీ యూరు'( మీ యొక్క ఊరు) అన్నప్పుడు సంబంధంలో 'నీ' అనే యుష్మదర్థక ఏకవచనానికి, 'మీ' అని బహువచనం వచ్చింది. మా తల్లి (మా యొక్క తల్లి ) అన్నప్పుడు సంబంధంలో 'నా' అనే అస్మదర్థ ఏకవచనానికి, 'మా' అని బహువచనం వచ్చింది.

ప్రౌఢవ్యాకర్త "కిమేకార్థక శబ్దంబులు క్రమంబున నజ్ఞాత వస్తూద్దేశ్య ప్రశ్నమునందును, నిర్దిష్ట స్త్రీ పురుషాన్యతర ప్రశ్నమునందును; నిర్దిష్ట స్త్రీపురుషాన్యతర గ్రహణమునందును, అనిర్దిష్ట స్త్రీపురుషోద్దేశ్య వ్యాహారమునందును దఱచుగ బహువచనాంతంబు లగు"( ప్రౌఢ. శబ్ద:47) అని సూత్రీకరించారు. కిమర్థక శబ్దం(ఏ-శబ్దం), ఏకార్థక శబ్దం(ఒక- శబ్దం) వరుసగా తెలియని వస్తువును గూర్చి ఉద్దేశింపదగిన ప్రశ్నలో, నిర్దేశింపబడిన స్త్రీ పురుష వ్యక్తులను ఒక్కరిని ఉద్దేశించిన ప్రశ్నలో, స్త్రీ పురుష వ్యక్తులను నిర్దేశించి వారిలో ఒకరిని గ్రహించుటలో, స్త్రీయని కాని పురుషుడని ఉద్దేశింపక సామాన్య రీతిగా పలికేటప్పుడు తరచుగా బహువచనాంతం అవుతాయని అర్థం.

తెలియని వస్తువును ఉద్దేశించి చేసే ప్రశ్నలో బహువచనాంతం అవుతుంది. ఉదాహరణకు 'ఎవరక్కడ?' అన్నప్పుడు అక్కడ ఎవరున్నారో తెలియదు. కాబట్టి ఆ తెలియని వ్యక్తిని ఉద్దేశించి చేసే ప్రశ్నలో 'ఎవరు' అనే కిమర్థకం బహువచనాంతమవుతుంది. స్త్రీ పురుష వ్యక్తులను నిర్దేశించి వారిలో ఒకరిని గూర్చి చేసే ప్రశ్నలో కిమర్థకం బహువచనాంతం అవుతుంది. ఉదాహరణకు 'సీతారాము లిద్దఱలో నెవరు మిక్కిలి కరుణగల వారు?'. ఈ వాక్యంలో 'సీతారాములను' స్త్రీ పురుష వ్యక్తులను నిర్దేశించి వారిలో ఒకరిని గూర్చి చేసే ప్రశ్న కాబట్టి, కిమర్థకం 'ఎవరు' అని బహువచనాంతమయింది.

స్త్రీ పురుష వ్యక్తులను నిర్దేశించి వారిలో ఒకరిని గ్రహించేటప్పుడు బహువచనాంతవుతుంది. ఉదాహరణకు 'ఈ స్త్రీ పురుషులిద్దఱలో దీనినొకరికిమ్ము'. ఇక్కడ స్త్రీ పురుషులను ఇద్దరిని నిర్దేశించి వారిలో ఒక వ్యక్తినే గ్రహించుటచేత ఏకార్థం 'ఒకరికి' బహువచనాంతవుతుంది. స్త్రీయని గాని పురుషుడనిగాని ఉద్దేశించక సామాన్యరీతిని పలికేటప్పుడు బహువచనాంతమవుతుంది. ఉదాహరణకు 'ఒకరు పోయిన త్రోవ నొకరు పోరు'. ఇక్కడ స్త్రీయని గాని పురుషుడనిగాని నిర్దేశింపక పోవటం చేత ఏకార్థము 'ఒకరు' అని బహువచనాంతమైనది. అనగా ఒకడనిగాని, ఒకతె అనిగాని కాలేదు.

ప్రౌఢవ్యాకర్త ఒకే సూత్రంలో చెప్పిన విషయాలను సులభవ్యాకర్త రెండు సూత్రాల్లో చెప్పారు.

సులభవ్యాకర్త "ప్రశ్నాదుల కిమర్థక శబ్దంబులు బహువచనాంతంబులు నగు" (సులభ. వాక్య:23) అని సూత్రీకరించారు. ప్రశ్నాదులలో కిమర్థక(ఏ-శబ్దం) శబ్దాలు బహువచనాంతంగా ఉంటాయి. తెలియని వస్తువుని ఉద్దేశించి ప్రశ్న వేసేటప్పుడు ఉదాహరణకు 'ఎవరక్కడ?' అని బహువచనాంత కిమర్థక రూపం కన్పిస్తుంది. కొన్ని సార్లు 'ఎవ్వరు' అనేది 'అది' పూర్వకంబుగా ఉంటుందని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'నన్ను బిలిచిన దెవ్వరు'. ఇక్కడ పిలిచింది స్త్రీయో పురుషుడో నిర్దేశింపకుండటం చేత పిలిచినవారు ఒక్కరే కాబట్టి 'అది' అనేది ముందుగా చేర్చబడింది.

సులభవ్యాకర్త "స్త్రీపురుషుల నిర్దేశింపరానియెడను, నిర్దేశించినను వారిలో నొకరినే గ్రహింపవలసినయెడను 'ఒక్కఁడు' బహువచనాంతం బగు" (సులభ. వాక్య:24) అని సూత్రీకరించారు. స్త్రీ పురుషులను నిర్దేశింపరానప్పుడు, ఒకవేళ నిర్దేశించినను వారిలో ఒకరినే

గ్రహించాల్సినప్పుడు 'ఒక్కండు' అనేది బహువచనాంతం అవుతుంది. స్త్రీ పురుషులను నిర్దేశింపలేనప్పుడు ఉదాహరణ 'కట్టుఁబాటు లేని యింట నొకరు చెప్పినట్టు మఱియొకరు వినరు'. ఇక్కడ స్త్రీ పురుషులను నిర్దేశింపలేదు. 'ఒక్కడు' అని ఏకవచనం కాకుండా 'ఒకరు' అని బహువచనాంతమే కన్పిస్తుంది. స్త్రీ పురుషులను నిర్దేశించినప్పటికీ వారిలో ఒకరినే గ్రహించినపుడు ఉదాహరణ 'సీతారాములయందొకరి కీ సరము నొకరి కీ సరము నర్పింపుము'. ఇక్కడ స్త్రీ పురుషులను(సీతా రాములను) నిర్దేశించినప్పటికీ వారిలో ఒకరినే గ్రహించాల్సినప్పుడు 'ఒకఁడు' అని కాక 'ఒకరు' అని బహువచనాంతమే ఉన్నది.

## 8.2.3 నిత్య ఏకవచనాలు

ప్రౌఢవ్యాకర్త "దేశ్యమునం దక్కడాదులు నిత్యైక వచనాంతములు" (ప్రౌఢ.శబ్ద:28), ."సస్యవాచక శబ్దములును"(ప్రౌఢ.శబ్ద:29) "కతిపయ సంభారవాచక శబ్దములును"(ప్రౌఢ. శబ్ద:30),"లోహవాచక శబ్దములును" (ప్రౌఢ.శబ్ద:31) "గుణరసవాచక ములయిన దేశ్య విశేషణ శబ్దములను" (ప్రౌఢ.శబ్ద:33) అని ఐదు సూత్రాల్లో నిత్య ఏకవచనాల గురించి చర్చ చేశారు.

త్రిలింగ దేశంలో వ్యవహారంలో ఉన్న తత్సమ తద్భవ ఇతర భాషయిన దేశ్య పదాలలో ఉండే 'అక్కడ' మొదలైన శబ్దాలు నిత్య ఏకవచనాలు అవుతాయి. ఉదాహరణ ' అక్కడ, ఇక్కడ. ఎక్కడ, ఇచ్చటు, ఎచ్చటు' మొదలైనవి. సూత్రంలో 'అక్కడాదులు' అందం వల్ల 'ఇరులు, కేలు' అనేవాటిని కూడా ప్రయోగాలను బట్టి నిత్య ఏకవచనాలుగానే ప్రౌఢవ్యాకర్త చెప్పారు.

సస్య వాచక శబ్దాలు నిత్య ఏకవచనాలు అవుతాయని ప్రౌఢవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'ఆరుగ, చోడి, వరి, కంది, పెసర, మినుము' మొదలైనవి. కొన్ని సంభారములను(సామాగ్రి)తెలిపే శబ్దాలు నిత్యఏకవచనాలు అవుతాయి. ఉదాహరణకు ' ఆముదము, ఇంగువ, ఉప్పు, చింతపండు, చమురు, పసుపు మొదలైనవి.

లోహాన్ని బోధించే శబ్దాలు నిత్య ఏకవచనాలు అవుతాయి. ఉదాహరణకు ' ఇత్తడి, ఇనుము, కంచు, బంగారు, వెండి మొదలైనవి. గుణవాచకాలు, రసవాచకాలైన దేశ్య విశేషణ శబ్దాలు నిత్యఏకవచనాలు అవుతాయి. ఉదాహరణకు ' ఈకాళ్లు తెలుపు, ఆ కాళ్లు నలుపు, ఆపండ్లు తీపి, ఆ పండ్లు పులుపు'. మొదలైనవి.

సులభ వ్యాకర్త "(1) సస్య లోహవాచక శబ్దంబులును,(2) కొన్ని సంభార ధాన్యవాచక శబ్దంబులును, (3) గుణరస వాచకములు సమానార్థకములునైన దేశ్యవిశేషణ శబ్దంబులును, (4) కేల్వాదులును, నిత్యైకవచనాంతములు." (సులభ. వాక్య:25) అని సూత్రీకరించారు.

సులభవ్యాకర్త సస్య వాచకాలను, లోహవాచకాలను, కొన్ని సంభారపు దినుసులను, కొన్ని ధాన్యవాచకాలను, గుణవాచకవిశేషణాలను, కేల్వాదులు మొదలైన వాటిని నిత్య ఏకవచనాలుగా చెప్పారు. సస్యం అనగా పైరు. సస్య వాచకాలకు ఉదాహరణ 'వరి, కంది, సెనగ, జొన్న, పెసర, మినుము, ప్రత్తి' మొదలైనవి. లోహవాచకాలకు ఉదాహరణ 'ఇనుము, రాగి, వెండి, బంగారు, కంచు' మొదలైనవి.

కొన్ని సంభారపు దినుసులకు ఉదాహరణ 'నూనె, ఆముదము, నెయ్యి, చమురు, ఉప్పు, ఇంగువ, చింతపండు, పసుపు'. కొన్ని సంభారపు దినుసులు బహువచనంలో ఉచ్చరిస్తాము. ఉదాహరణకు ' ఆవాలు, దనియాలు, మెంతులు'. కొన్ని ధాన్యవాచకాలకు ఉదాహరణ 'బియ్యము, జీలకర్ర. గుణవాచకవిశేషణాలకు ఉదాహరణ 'తెలుపు, నలుపు, పసుపు, ఎరుపు. కేల్వాదులకు ఉదాహరణ 'కేలు, ఇరులు, అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడు, అక్కడ, ఇక్కడ, ఎక్కడ, అచ్చట, ఇచ్చట, ఎచ్చట మొదలైనవన్నీ నిత్య ఏకవచనాలు. వీటికి బహువచన రూపం లేదు.

ప్రౌఢవ్యాకర్త "కొన్ని యవ్యయంబులు బహువచనాంత తుల్యంబులు నగు" (ప్రౌఢ. శబ్ద:34) అని సూత్రీకరించారు. కొన్ని అవ్యయాలు బహువచనాంతాలతో సమానంగా కనిపిస్తాయి. ఉదాహరణకు 'అట్టు, అట్లు, ఇట్టు, ఇట్లు, ఎట్టు, ఎట్లు, నిచ్చ, నిచ్చలు'. ఇక్కడ ' అట్టు= అట్లు, అట్లు=అట్టు'వీటిలోని లువర్ణం బహుత్వబోధకం కాదు. 'అట్లు' మొదలైనవి విభక్తి అంతంగా ఉన్నట్టు కనిపించినా వాటికి విభక్త్యర్థం లేదు. ఇవి విభక్తి ప్రతిరూపక అవ్యయాలు.

సులభవ్యాకర్త "అవ్యయంబులందుఁ గొన్ని బహువచనాంతతుల్యంబులు నగు" (సులభ. వాక్య:26) అని సూత్రీకరించారు. అవ్యయాలు కొన్ని బహువచనాంతాలతో సమానంగా కనిపిస్తాయి. ఉదాహరణకు 'అట్టులు, ఇట్టులు, ఎట్టులు' మొదలైనవి.

## 8.2.4 నిత్య బహువచనాలు

ప్రౌఢవ్యాకర్త "అందఱ్వాదులు నిత్య బహువచనాంతములు"( ప్రౌఢ.శబ్ద:35) "తఱచుగ ధాన్యవాచక శబ్దములును"( ప్రౌఢ.శబ్ద:37), "క్రీడా విశేష వాచక శబ్దములును" (ప్రౌఢ.శబ్ద:38) అని మూడు సూత్రాల్లో నిత్య బహువచనాల గురించి చర్చించారు. 'అందఱు' మొదలైనవి నిత్య బహువచనాంతాలు. ఉదాహరణకు 'అందఱు, ఇందఱు, ఎందఱు,కొందఱు, పెక్కండ్రు' మొదలైనవి.

ధాన్య వాచక శబ్దాలు తఱచుగా నిత్య బహువచనాంతాలు అవుతాయి. ఉదాహరణ 'ఆళ్లు చోళ్ళు, వడ్లు, కందులు, పెసలు, మినుములు'. సూత్రంలో తరచుగా అనడం వల్ల 'బియ్యము, జీల కఱ్ఱ, అనేవి ధాన్యవాచకాలు అయినప్పటికీ 'నిత్య ఏకవచనాంతాలే అవుతాయి.

క్రీడావిశేషక వాచక శబ్దాలు కూడా నిత్య బహువచనాంతమవుతాయి. ఉదాహరణ 'అచ్చన గాయలు, ఓమన గుంటలు,కనుమూసిగంతలు, గుజ్జెనగూళ్ళు, బొమ్మ పెండ్లిండ్లు, ఉప్పెనఁబట్టెలు, కుప్పిగంతులు, గొబ్బిళ్లు, బిల్ల గోళ్లు మొదలైనవి.

సులభ వ్యాకర్త "క్రీడావిశేష వాచక శబ్దంబులును, పెక్కు ధాన్యవాచక శబ్దంబులును, అందఱు లోనైనవియు నిత్యబహువచనాంతంబులు" (సులభ. వాక్య:27) అని సూత్రీకరించారు. క్రీడావిశేషక వాచక శబ్దాలు, ధాన్యవాచక శబ్దాలు, 'అందఱు' మొదలైన శబ్దాలు నిత్య బహువచనాలు అవుతాయని సులభవ్యాకర్త ఈ సూత్రంలో చెప్పారు. క్రీడావిశేషక వాచక శబ్దాలకు ఉదాహరణ 'అమ్మన బంతులు, దాగురు మూతలు, అలంకులు, గుంటచాళ్ళు, గుడి గుడి గుంచాలు, గుజ్జెనగూళ్ళు, గొబ్బిళ్ళు, అచ్చన గాయలు, గీరన గింజలు'. ధాన్యవాచక శబ్దాలకు ఉదాహరణ 'వడ్లు, పెసలు, కందులు, మినుములు, సెనగలు, ఆళ్లు, జొన్నలు'. 'అందఱు' మొదలైన శబ్దాలకు ఉదాహరణ 'అందఱు, ఇందఱు, ఎందఱు, పెక్కండ్రు, పెక్కురు, గుగ్గిళ్లు, కురులు, అక్షతలు, పులకలు, అగచాట్లు, పేలలు, పేలాలు.

## 8.2.5 కర్తృర్థక వాక్యాలు

ప్రౌఢవ్యాకర్త "కర్తృ బహుత్వంబునఁ దన తనకుఁ దమ తమయు నగు" (ప్రౌఢ.శబ్ద :79) అని సూత్రీకరించారు. 'తా' శబ్దానికి సంబంధించిన కర్తలు అనేకం ఉన్నప్పుడు 'తనతన'అనే దానికి

బదులుగా 'తమ తమ' అవుతుంది. ఉదాహరణకు 'తమ తమ పుత్రుఁడుగా'. ఇక్కడ 'పుత్రుడు' అనేది కర్తృపదం. ఈ పదానికి ముందు 'తనతన' అనే దానికి బదులుగా 'తమతమ' అని ఉంది. ఇది బహువచనాన్ని తెలియజేస్తుంది. 'తమ తమ పుత్రుడుగా' అంటే 'తన పుత్రుడుగా' అని అర్థం.

సులభవ్యాకర్త "కర్తృ బహుత్వంబునఁ దన తనకుఁ దమ తమయు నగు" (సులభ. వాక్య:29) అని సూత్రీకరించారు. కర్తలు అనేకం ఉన్నప్పుడు 'తనతన'అనే దానికి బదులుగా 'తమ తమ ' అవుతుంది. ఉదాహరణకు 'ఆ యోధులందఱుఁ దమ తమ ప్రాణంబుల దెస నాసలు మాని పోరిరి'. ఇక్కడ 'యోధులు' కర్త్రర్థక పదం. బహువచనాన్ని సూచిస్తుంది. 'తన తన ప్రాణంబులు' అని కాకుండా 'తమ తమ ప్రాణంబులు' అని అయింది.

సులభవ్యాకర్త "కర్తృబహుత్వంబున బహువచనక్రియ యగు" (సులభ. వాక్య:36) అని సూత్రీకరించారు. ఎక్కువ మంది కర్తలు ఉన్నప్పుడు బహువచన క్రియ వస్తుంది. ఉదాహరణకు 'సీతా రామలక్ష్మణు లడవికేగిరి'. ఇందులో సీతా, రాముడు, లక్ష్మణుడు అని ముగ్గురు కర్తలు ఉన్నారు. కాబట్టి 'అడవికి ఏగిరి(వెళ్లారు) అనే క్రియ బహువచనంలో ఉంది.

ప్రౌఢవ్యాకర్త "అనేక కర్తృక క్రియకు సమీపకర్తయొక్క లింగవచనంబు లగు "(ప్రౌఢ. వాక్య:15) అని సూత్రీకరించారు. అనేక కర్తలుగల క్రియకు దగ్గర ఉన్న(సమీప) కర్త యొక్క లింగం, వచనం వస్తాయి. ఉదాహరణకు 'ఏవాని బంధుమిత్రులు, జీవ ధనంబులును డప్పిఁ జెందును. ఇక్కడ 'చెందును' అనే క్రియకు 'బంధు మిత్రులు, జీవధనంబు' అనేవి కర్తలుగా ఉన్నాయి. కాబట్టి ఇది అనేక కర్తృక క్రియ అవుతుంది. దీనికి సమీపకర్తలైన 'జీవ ధనంబులు' అనే అమహత్ బహువచనాన్ని అనుసరించి 'చెందును' అనే క్రియ ఏకవచనాంతమైనది. "తిర్యగ్జడంబులు వాచ్యంబులగునపుడు లిడ్లొట్టుల ప్రథమ బహువచనంబున కేకవచనంబగు" (బాల. క్రియా:25). ఈ సూత్రం ప్రకారం 'జీవధనంబులు' అమహత్తు కాబట్టి క్రియ ఏకవచనం అవుతుంది.

సులభవ్యాకర్త "కర్తలనేకంబు లున్న చోఁ గ్రియకు సమీపకర్తయొక్క లింగవచనంబునగు" (సులభ. వాక్య:37) అని సూత్రీకరించారు. అనేక కర్తలు ఉన్నప్పుడు క్రియకు దగ్గర ఉన్న(సమీప) కర్త యొక్క లింగం, వచనం వస్తాయి. ఉదాహరణకు 'రాముని రాజ్యంబున మనుష్యులు పశుపక్ష్యాదులు సుఖముగ జీవించెను'. ఇక్కడ కర్తలు మనుష్యులు, పశువులు, పక్షులు ఉన్నాయి.

కాబట్టి ఇది అనేక కర్తృక క్రియ అవుతుంది. దీనికి సమీపకర్తలైన 'పశుపక్ష్యాదులు' అమహత్ బహువచనాన్ని తెలియజేస్తున్నాయి. "తిర్యగ్జడంబులు వాచ్యంబులగునపుడు లిడ్లాట్టుల ప్రథమ బహువచనంబున కేకవచనంబగు" (బాల. క్రియా:25) అనే సూత్రాన్ని అనుసరించి 'పశుపక్ష్యాదులు' అమహత్తు కాబట్టి 'జీవించెను ' అనే క్రియ ఏకవచనాంతమైనది.

'రాముని రాజ్యంబునఁ బశుపక్ష్యాదులు మనుష్యులు సుఖముగ జీవించిరి'. ఇక్కడ కర్తలు పశువులు, పక్షులు, మనుష్యులు ఉన్నారు. కాబట్టి ఇది అనేక కర్తృక క్రియ అవుతుంది. దీనికి సమీప కర్తలైన 'మనుష్యులు ' మహత్ బహువచనాన్ని తెల్పుతున్నాయి. ప్రస్తుత సూత్రం చేత సమీపకర్త యొక్క లింగం, వచనాన్ని అనుసరించి 'జీవించిరి' అనే క్రియ ఏర్పడింది.

సులభవ్యాకర్త "ఒండె-కాని-లేకా దివ్యహితంబులయిన కర్తృపదంబులన్నియు నేకవచనంబున నున్నఁ క్రియయు నేకవచనమంద యుండు. భిన్న వచనంబులైనచో సమీపకర్తృ వచనంబ యగు"(సులభ. వాక్య:38) అని సూత్రీకరించారు. ఒకటి, కాని, లేక మొదలైనవి వ్యవహితంగా ఉండే కర్తృ పదాలన్నీ ఏకవచనాలు అయితే క్రియ కూడా ఏకవచనంలోనే ఉంటుంది. భిన్న వచనాలు అయితే సమీప(దగ్గరగా ఉన్న ) కర్త యొక్క వచనాలు అవుతాయి. ఉదాహరణకి 'రాముఁడు గాని లక్ష్మణుడుగాని యుద్ధమున వెనుదీయు వాఁడు కాఁడు'. ఇక్కడ కర్తృ పదాలైన రాముడు, లక్ష్మణుడు ఏకవచనంలో ఉన్నాయి. వీటి మధ్య వ్యవధానంగా 'కాని' అనేది ఉంది. కాబట్టి 'వెనుదీయు' అనే క్రియ కూడా ఏకవచనంలోనే ఉంది.

ప్రౌఢవ్యాకర్త "మహద్బహుకర్తృక క్రియకు నేకవచనంబు విభాషనగు"( ప్రౌఢ. క్రియా:6) అని సూత్రీకరించారు. పెక్కు మహద్వాచకాలు కర్తలుగాగల క్రియకు ఏకవచనం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు 'తన యెఱిఁగిన యర్థం బొరుఁ డనఘా....చెప్పనివాడును సత్యము చెప్పనివాఁడును ఘోరనరకపంకమునఁ బడున్'. ఇక్కడ 'పడున్' అనే ఏకవచన క్రియకు చెప్పని వాడును, సత్యము చెప్పనివాడును అని మహద్వాచకాలు కర్తలు. చెప్పనివాడును నరకపంకమునఁ బడున్, సత్యము చెప్పనివాఁడును నరకపంకమునఁ బడున్' అని వేరు వేరుగా అన్వయించబడాలి. సూత్రంలో వికల్పం అనడం వల్ల ఇద్దరు కర్తలకు సంబంధించి 'పడుదురు' అని క్రియ బహువచనాంతంలో ఉండాలి.

సులభవ్యాకర్త "మహద్వాచకంబులైన కర్త లనేకంబులు, సముచ్చయ వ్యవహితంబులగుచోఁ గ్రియకుఁ దఱచు బహువచనంబ యగు " (సులభ. వాక్య:52) అని సూత్రీకరించారు. మహద్వాచకాలైన కర్తలు అనేకం సముచ్చయ వ్యవహితంగా వస్తే క్రియకు తరచుగా బహువచనం వస్తుంది. ఉదాహరణకు 'తన యెఱిఁగిన యర్థం బొరుఁ దనఘా.... చెప్పనివాడును సత్యము చెప్పనివాఁడుము ఘోరనరకపంకమునఁ బడున్'. ఇక్కడ 'పడున్' అనే ఏకవచన క్రియకు చెప్పని వాడును, సత్యము చెప్పనివాడును అని మహద్వాచకాలు కర్తలు. చెప్పనివాడును నరకపంకమునఁ బడున్, సత్యము చెప్పనివాఁడుము నరకపంకమునఁ బడున్' అని వేరు వేరుగా అన్వయించబడాలి. అలా కాకుండా కలిపి చెప్పే సందర్భంలో 'పడుదురు' అని క్రియ బహువచనాంతంలో ఉండాలి.

## 8.2.6 విశేషణార్థక వాక్యాలు

ప్రౌఢవ్యాకర్త "కొన్ని యెడల నవకగు కానంబడియెడి"(ప్రౌఢ.శబ్ద.103) అని సూత్రీకరించారు. కొన్ని చోట్ల 'అవ' అనే దానికి 'అగు' అనేది కనబడుతున్నది. బాలవ్యాకరణంలో "సంఖ్యకుం బూరణార్థమునం దవగాగమంబగు" (బాల. ఆచ్ఛిక:25) అనే సూత్రాన్ని అనుసరించి సంఖ్యకు పూరణార్థంలో 'అవక్' ఆగమంగా వస్తుంది. అలా వచ్చిన 'అవ'కి కొన్నిచోట్ల 'అగు' కూడా కనిపిస్తుందని సూత్రార్థం. ఉదాహరణకు ' ఏడగు పర్వము', ఎనిమిది యగు పర్వము'. ఏడు+అవ= ఏడు+అగు. ఏడగు.

సులభవ్యాకర్త "సంఖ్యాపూరణార్థక విశేషణంబు నందలి 'అవ' కు 'అగు' నగు" (సులభ. వాక్య:30) అని సూత్రీకరించారు. సంఖ్యకు పూరణార్థంలో విశేషణాన్ని తెలిపేటప్పుడు 'అవ' అనే దానికి 'అగు' అనేది వస్తుంది. బాలవ్యాకరణంలో "సంఖ్యకుం బూరణార్థమునం దవగాగమంబగు" (బాల. ఆచ్ఛిక:25) అనే సూత్రాన్ని అనుసరించి సంఖ్యకు పూరణార్థంలో 'అవక్' ఆగమంగా వస్తుంది. అలా వచ్చిన 'అవ' కి ప్రస్తుత సూత్రాన్ని అనుసరించి విశేషణార్థంలో 'అగు' కూడా వస్తుందని సూత్రార్థం. ఉదాహరణకు ' ఏడవ పర్వము', ఏడగు పర్వము'. ఏడు+అవ= ఏడు+అగు. ఏడగు.

ప్రౌఢవ్యాకర్త "మహద్విశేషణ సంఖ్యావాచకంబులకుం గొన్ని యెడల నమహత్కార్యంబు చూపెట్టెడి" (ప్రౌఢ. శబ్ద:104) అని సూత్రీకరించారు. మహద్వాచక విశేషణాలైన సంఖ్యావాచకాలకి

కొన్ని సార్లు అమహత్ వాచకాలకు అయ్యే వ్యాకరణ కార్యాలు జరుగుతాయి. ఉదాహరణకు 'అసురులు– అఱువది వేలు'. ఇక్కడ 'అసురులు' అనేది మహత్తు. కాబట్టి దీని విశేషణమైన సంఖ్యావాచకం మహత్తుకావాలి. కాని ఇక్కడ 'అఱువది వేలు' అని అమహద్వాచక విశేషణం అయింది. సూత్రంలో కొన్ని ఎడల అనడం వల్ల మహత్ విశేషణం వచ్చి ' అసురులు అఱువది వేవురు'. అవుతుంది.

సులభవ్యాకర్త "కొన్ని యెడల మహద్వాచకంబునకు విశేషణంబయిన సంఖ్యావాచకం బమహద్రూపంబు కలదియునగు" (సులభ. వాక్య:31) అని సూత్రీకరించారు. కొన్ని సార్లు మహద్వాచక విశేషణాలైన సంఖ్యావాచకాలకి అమహత్ వాచకాలకు అయ్యే వ్యాకరణ కార్యాలు జరుగుతాయి. ఉదాహరణకు ''రాక్షసులు పది వేలు'. ఇక్కడ 'రాక్షసులు ' అనేది మహత్తు. కాబట్టి దీని విశేషణమైన సంఖ్యావాచకం మహత్తుకావాలి. కాని ఇక్కడ ' పది వేలు' అని అమహద్వాచక విశేషణం అయింది. సూత్రంలో కొన్ని ఎడల అనడం వల్ల మహత్ విశేషణం వచ్చి ' రాక్షసులు పది వేవురు'. అవుతుంది.

బాలవ్యాకర్త "కర్మాదులకుఁ బ్రాధాన్యవివక్షయందు ధాతుజవిశేషణంబులు కర్తతోడం బోలె వానితోడ సమసించు" (బాల. సమాస:26) అని సూత్రీకరించారు. 'కర్మ' మొదలైన పదాలకు ప్రాధాన్యాన్ని వివక్షించినపుడు ధాతుజవిశేషణాలు కర్తృ పదంతో సమాసాన్ని పొందినట్టుగానే కర్మాదులతో కూడ సమాసాన్ని పొందుతాయి. ఉదాహరణకు 'రాముడు రక్షించిన భృత్యుఁడు' ఇందులో 'రాముఁడు' అనేది కర్త. 'భృత్యుఁడు' అనేది కర్మ. రక్షించిన అనేది ధాతుజ విశేషణం. దీనిలో ధాతుజవిశేషణం, కర్మ పదమైన భృత్యుఁడు అనే దానితో ప్రాధాన్యవివక్షయందు సమసించి సమాసమైంది. 'రాముఁడు వాలి నేసిన బాణము'. ఇందులో బాణం అనేది కరణం. దీని ప్రాధాన్యవివక్షలో 'ఏసిన' అనే ధాతుజ విశేషణం సమసించింది.

సులభవ్యాకర్త "కర్మాదులకుఁ బ్రాధాన్యవివక్షయందు ధాతుజవిశేషణంబులు కర్తతోడం బోలె వానితోడ సమసించు" (సులభ. వాక్య:33) అని సూత్రీకరించారు. కర్మ' మొదలైన పదాలకు ప్రాధాన్యాన్ని వివక్షించినపుడు ధాతుజవిశేషణాలు కర్తృ పదంతో సమాసాన్ని పొందినట్టుగానే కర్మాదులతో కూడ సమాసాన్ని పొందుతాయి. ఉదాహరణకు 'రాముడు రక్షించిన భృత్యుఁడు లోకోత్తర చరితుఁడగును' ఇందులో 'రాముఁడు' అనేది కర్త. 'భృత్యుఁడు' అనేది కర్మ. రాముఁడు

చేత రక్షించబడిన భృత్యుఁడని అర్థం. 'రక్షించిన' అనేది ధాతుజ విశేషణం. దీనిలో ధాతుజవిశేషణం, కర్మ పదమైన భృత్యుఁడు అనే దానితో ప్రాధాన్యవివక్షయందు సమసించి సమాసమైంది. 'రాముఁ డు వాలి నేసిన బాణము'. ఇందులో బాణం అనేది కరణం. దీని ప్రాధాన్యవివక్షలో 'ఏసిన' అనే ధాతుజ విశేషణం సమసించింది.

సులభవ్యాకర్త "క్రియాకార్యంబు విశేషణ నామవాచకంబులచే నొండె నగు" (సులభ. వాక్య:39) అని సూత్రీకరించారు. సాధారణంగా వాక్యంలో కార్యం పూర్తయిందని చెప్పడానికి సమాపక క్రియనే ఉందడాల్సిన అవసరం లేదు. ఆ కార్యం నామవాచకంతోగాని, విశేషణముతోగాని ముగిసినట్లు తెలియజేయవచ్చు. ఉదాహరణకు 'రాముడు సుగుణాభిరాముడు', సంపద యాపదలకు నెలవు'.ఇలాంటి ఉదాహరణలలో అగు – కల– ఉండు మొదలైన క్రియలు అధ్యాహార్యాలుగా కర్తతో అన్వయించ బడతాయి.

ప్రౌఢ వ్యాకర్త "కొన్ని యెడల విధేయ విశేషణ మొండ బహువచనాంతంబయి విశేష్యంబులు పెక్కిటి కన్వయ యోగ్యంబు"(ప్రౌఢ.కారక:25) అని సూత్రీకరించారు. కొన్ని చోట్ల, విధేయ విశేషణానికి ఒక్కటే బహువచనాంతమై, చాలా విశేష్యాలతో(నామవాచకలతో) అన్వయించ బదుతుంది. ఉదాహరణకు 'ఇది దక్షిణాపథంబున, కిదియు విదర్భాపురమున కిది కోసల కిం,దిది యుజ్జయినికిఁదెరువులు.. మనకెద్దియగున్'. ఇక్కడ 'తెరువులు' అనే విధేయవిశేషణం ఒక్కటే బహువచనాంతమై నాలుగు 'ఇది' శబ్దాలకు . ఒక 'ఎద్ది' శబ్దానికి అన్వయించబడింది. ఏకవచనం అయితే 'తెరువు' శబ్దాలు ఐదు కావాల్సి ఉంటుంది.

సులభవ్యాకర్త "పెక్కువిశేష్యంబులతో నన్వయించు విశేషణంబునకు బహువచనంబయగు" (సులభ. వాక్య:40) అని సూత్రీకరించారు. చాలా విశేష్యాలతో(నామవాచకలతో) అన్వయించు విశేషణానికి బహువచనం వస్తుంది. ఉదాహరణకు 'దయావంతులు సీతయు రాముడును భక్తుల పరిపాలింతురు'. ఇక్కడ 'దయావంతులు' అనేది విశేషణం. ఇది 'సీత, రాముడు' అనే విశేష్యాలతో అన్వయం పొందడం వల్ల బహువచనాన్ని పొందింది. విశేష్యాలు స్త్రీ, పుంలింగాలు ఉంటే విశేషణం పుంలింగ రూపాన్ని బట్టి వచ్చును.

సులభవ్యాకర్త "ఐ యొకానొకచోఁ గలయర్థంబున నగు" (సులభ. వాక్య:63) అని సూత్రీకరించారు. 'ఐ' అనేది ఒక్కొక్కసారి 'కల' అనే అర్థంలో వస్తుంది. ఉదాహరణ 'కృష్ణుని సారథ్యమునై' ఇక్కడ 'కృష్ణుడు సారథిగా గల' అని అర్థాన్ని కూడా ఇస్తుందని అర్థం.

## 8.2.7 అస్మద్– యుష్మద్ వాక్యాలు

సులభవ్యాకర్త "ఆత్మనేపదం బనిత్యంబు"(సులభ. వాక్య:57) అని సూత్రీకరించారు. ఆత్మార్థక పదం అనిత్యంగా(నిత్యంగా రాదు) ఉంటుంది. ఉదాహరణకు 'పట్టముగట్టి యేలుము మమున్'. ఇక్కడ 'కట్టికొని' అని చెప్పడానికి బదులుగా 'గట్టి' అని మాత్రమే ప్రయోగించడం జరిగింది. ఆత్మార్థంలో విధించబడే 'కొను' ప్రత్యయం ఇక్కడ రాలేదు.

ప్రౌఢవ్యాకర్త "నామ పునర్గ్రహణంబున భిన్నంబు నభిన్నంబునయి తచ్ఛబ్దార్థంబు తత్పర్యాయంబగు"(ప్రౌఢ. శబ్ద:75) అని సూత్రీకరించారు. నామపదం మరలా గ్రహించుట యందు, ఆ నామ పదానికి కూడుకొని ఉండక వేరుగా(విడిగా) ఉన్నదియు, ఆ నామపదంతో కలసి ఉన్నదియు, అయి, తచ్ఛబ్దార్థం( అ–అనే సర్వనామం యొక్క అర్థంగల శబ్దం) ఆ నామ పదానికి సమానార్థకం అవుతాయి. నామపదంతో కూడుకొనక 'తద్' శబ్దార్థం విడిగా ఉన్నప్పుడు ఉదాహరణ 'వచ్చె సుదర్శనాయుధుఁడు. వాఁడె.. కొనిపోనిన్ను'. ఇక్కడ 'వాఁడె' అనే 'తద్' శబ్దార్థం 'సుదర్శనాయుధుఁడు' అనే నామ పదానికి పర్యాయ పదంగా వాడబడింది. నామపదంతో కూడుకున్నప్పుడు 'తద్' శబ్దార్థం విడిగా లేన్నప్పుడు ఉదాహరణ ' వచ్చె సుదర్శనాయుధుడు. ఆ సుదర్శనాయుధుఁడె.. కొనిపోవు నిన్ను'. ఇక్కడ 'సుదర్శనాయుధుడు' అనే నామపదానికి 'ఆ సుదర్శనాయుధుడు' అని పర్యాయపదంగా వాడబడింది. ఇక్కడ 'ఆ' అనే 'తద్' శబ్దార్థం నామపదంతో కలిసి వాడబడింది.

సులభవ్యాకర్త "నామ పునర్గ్రహణంబునఁ దత్పర్యాయంబుగఁ దచ్ఛబ్దం బొండె నగు" (సులభ. వాక్య:28)" అని సూత్రీకరించారు. నామపదం మరలా గ్రహించుట యందు, ఆ నామ పదానికి సమానార్థకంగ 'తద్' శబ్దం వస్తుంది. ఒక్కోసారి నామ పదమే మళ్ళీ ప్రయోగించబడుతుంది. ఉదాహరణకు ' రాముఁడు భక్త వత్సలుడు. అతని భక్తులకుఁ బరాభవంబు

లేదు'. ఇక్కడ 'రాముడు' అనే నామ పదానికి ' అతని' అనే 'తద్' శబ్దార్థం పర్యాయ పదంగా ప్రయోగించబడింది.

ప్రౌఢవ్యాకర్త "అట్లు పోలె బలె వలె శబ్దంబు లివార్థకంబులు. ఉపమేయము ప్రథమాంతమగునపు డట్లు పరంబగుచో తదస్మద్యుష్మదాత్మార్థములకు షష్ఠియు, పోలె బలెలు పరంబులగుచో నామతచ్ఛబ్దార్థములకుఁ బ్రథమయు, నస్మదర్థప్రభృతులకు ద్వితీయయు వలెలు పరంబగుచో నామతచ్ఛబ్దార్థములకు షష్ఠియు, నస్మదర్థాదులకు షష్ఠీద్వితీయలయందెదియే నొక్కటియుఁ గ్రమంబుగ నగు. ఉపమేయము ద్వితీయాద్యంతమగునపుడు పోలె ప్రభృతులు పరంబులగుచో నుపమానంబుల కుపమేయ విభక్తులయగు. పోలినయెడఁ దచ్ఛబ్దమేను పలక్షణముగా గ్రహించునది. అట్లు కరణ్యాదులకు గ్రాహకము"(ప్రౌఢ. సమాస:38) అని సూత్రీకరించారు. ప్రౌఢవ్యాకర్త  చాలా అంశాలను ఒకే సూత్రంలో చర్చించారు. అట్లు, పోలె, బలె, వలె అనేవి ఇవార్థకాలు(ఇవ- అనే సంస్కృత శబ్దం యొక్క అర్థం కలిగినవి). ఉపమేయం ప్రథమాంతమయ్యేటప్పుడు, 'అట్లు' పరమైతే ఉపమానాలైన నామార్థం, తదర్థం, అస్మదర్థం, యుష్మదర్థం, ఆత్మార్థం అనే వాటికి షష్ఠి అవుతుంది. ఉదాహరణకు 'నారాయణునట్లు.. నారాయణభట్టు .. తోడయినిర్వహింపఁగన్'. ఇక్కడ ఉపమేయమైన 'నారాయణభట్టు' ప్రథమాంతమై ఉన్నది. 'అట్లు' పరమవగా ఉపమానం, నామార్థకమైన 'నారాయణ' శబ్దానికి షష్ఠి (నారాయణు +యొక్క+అట్లు= నారాయణునట్లు) వచ్చింది.

పోలె, బలె అనేవి పరమైనపుడు ఉపమానాలైన నామార్థానికి, 'తద్' శబ్దార్థానికి ప్రథమ వస్తుంది. ఉపమేయం  ప్రథమాంతంగా ఉండటం అనే నియమం ఇక్కడ వర్తించును.  ఉదాహరణకి 'లక్ష్మియును దాను.. చంద్రికయుఁ జంద్రుడు వోలె'. ఇక్కడ 'లక్ష్మి, తాను' అనేవి ఉపమేయాలు ప్రథమాంతాలై ఉన్నవి. 'పోలె' పరమవ్వడం వల్ల ఉపమానాలైన 'చంద్రిక, చంద్రుడు' అనే నామార్థకాలకు ప్రథమ వచ్చింది. 'రాముఁడు బలె' ఇక్కడ 'బలె'  పరమవ్వడం వల్ల ఉపమానం నామార్థకమైన  'రామ' శబ్దానికి ప్రథమ వచ్చింది.

ఉపమేయం ప్రథమాంతమయ్యేటప్పుడు, 'పోలె, బలె' అనేవి పరమయితే ఉపమానాలైన అస్మదర్థం మొదలైన వాటికి అనగా అస్మద్, యుష్మద్, ఆత్మార్థకాలకి(నా, నీ , తా శబ్దాలకు) ద్వితీయా విభక్తి  వస్తుంది. యుష్మదర్థానికి ఉదాహరణ ' నినుంబోలె  విన్నా నేనున్. ఇక్కడ ఏను-

అనే ఉపమేయం ప్రథమాంతమై ఉన్నది. 'పోలె' పరమవ్వడం వల్ల 'నీ' శబ్దానికి ద్వితీయా వచ్చింది. 'నిన్నుబలె' ఇక్కడ బలె పరమవ్వడం వల్ల ద్వితీయా వచ్చింది.

ఉపమేయం ప్రథమాంతమైనపుడు వలె– పరమయితే ఉపమానాలైన నామార్థకాలకు, తదర్థకాలకు షష్ఠి వస్తుంది. నామార్థకాలకు ఉదాహరణకు ' రాముని యొక్క +వలె =రాముని వలె'. తదర్థకాలకు ఉదాహరణ 'వాని యొక్క +వలె =వాని వలె.

ఉపమేయం ప్రథమాంతమైనపుడు వలె– పరమయితే ఉపమానాలైన అస్మద్, యుష్మద్, ఆత్మార్థకాలకు(నా–నీ–తా శబ్దాలకు) షష్ఠిగాని, ద్వితీయాగాని వస్తుంది. అస్మదర్థకానికి ఉదాహరణ 'నన్నును+వలె= నన్ను వలె, నా యొక్క + వలె =నా వలె. యుష్మదర్థకానికి ఉదాహరణ 'నిన్నును+వలె= నిన్నువలె, నీ యొక్క+వలె =నీ వలె.

ఉపమేయం ద్వితీయాది విభక్తులందు కలది అయినప్పుడు, పోలె ప్రభృతులు( పోలె, బలె, వలె శబ్దాలు) పరమైనపుడు ఉపమానాలకు ఉపమేయ విభక్తులే అవుతాయి. ఉదాహరణకి 'భీరులఁబోలె నేల వెఱపించెదు మాటల మమ్ముꣳ'. ఇక్కడ 'మమ్మున్' అనే ఉపమేయము ద్వితీయాంతం అవ్వడం చేత, పోలె పరమవ్వడం వల్ల ఉపమానానికి 'భీరులను' అని ద్వితీయావిభక్తి కలిగింది. 'భీరులను+పోలె=భీరులఁబోలె'.

ప్రౌఢవ్యాకర్త పైన పేర్కొన్న సూత్రంలో ఇంకా రెండు అంశాలు ఉన్నాయి. అవి ఇక్కడ సులభవ్యాకరణ సూత్రాలతో సమన్వయం చేస్తున్నప్పుడు అప్రస్తుతమని చర్చించలేదు. ప్రౌఢవ్యాకర్త ఒకే సూత్రంలో చెప్పిన వివిధ అంశాలను సులభవ్యాకర్త అవసరమైన వరకు నాలుగు సూత్రాల్లో చెప్పారు.

సులభవ్యాకర్త "ఉపమేయము ప్రథమాంత మగునపుడు 'అట్లు' పరంబైనచో నుపమానంబులగు నామ తదస్మ ద్యుష్మ దాత్మార్థములకు షష్ఠియగు" (సులభ. వాక్య:45) అని సూత్రీకరించారు. ఉపమేయం ప్రథమాంతమయ్యేటప్పుడు, 'అట్లు' పరమైతే ఉపమానాలైన నామార్థం, తదర్థం, అస్మదర్థం, యుష్మదర్థం, ఆత్మార్థం అనే వాటికి షష్ఠి వస్తుంది. ఉదాహరణకు 'రాముఁడు తన శరంబులచే సహస్రకరునట్లు వెలిగించెను'. ఇక్కడ 'రాముడు' ఉపమేయం. 'సహస్రకరుడు' ఉపమాన నామవాచకం కాబట్టి దానికి 'అట్లు' పరమయ్యి 'సహస్రకరునట్లు'

అయింది. ఇది షష్ఠీ తత్పురుష సమాసం. తదర్థకానికి ఉదాహరణ 'దాని యట్లు- వాని యట్లు'. అస్మదర్థకానికి ఉదాహరణ 'నాయట్లు-మాయట్లు'. యుష్మదర్థానికి ఉదాహరణ 'నీ యట్లు- మీ యట్లు'. ఆత్మార్థకానికి ఉదాహరణ 'తన యట్లు – తమ యట్లు'.

సులభవ్యాకర్త "పోలె, బలె, లు పరంబులగుచో నామతచ్ఛబ్దార్థములకుఁ బ్రథమయు నస్మద్యుష్మదాత్మార్థములకు ద్వితీయయునగు" (సులభ. వాక్య:46) అని సూత్రీకరించారు. పోలె, బలె అనేవి పరమైనపుడు ఉపమానాలైన నామార్థానికి, 'తద్' శబ్దార్థానికి ప్రథమ, ఉపమానాలైన అస్మదర్థం మొదలైన వాటికి అనగా అస్మద్, యుష్మద్, ఆత్మార్థకాలకి(నా, నీ, తా శబ్దాలకు) ద్వితీయా విభక్తి వస్తుంది. నామార్థానికి ప్రథమా విభక్తి రాగా ' అమృతము వోలె', 'తామరపాకు నీరు బలె' 'తద్' శబ్దార్థానికి ప్రథమా రాగా 'వాఁడు వోలె –వాఁడు బలె'. ప్రథమల మీద పోలె-బలె- పోని' శబ్దాలు ద్రుతపూర్వకంగా ఉంటాయి. ఉదాహరణకు 'అమృత ధారాపాతంబును బోలె'.

సులభవ్యాకర్త "వలె పరంబగుచో నామతచ్ఛబ్దార్థములకు షష్ఠియు, నస్మదర్థాదులకు షష్ఠీద్వితీయలం దేదియే నొకటియు నగు" (సులభ. వాక్య:47) అని సూత్రీకరించారు. ఉపమేయం ప్రథమాంతమైనపుడు వలె- పరమయితే ఉపమానాలైన నామార్థకాలకు, తదర్థకాలకు షష్ఠి వస్తుంది. ఉపమానాలైన అస్మద్, యుష్మద్, ఆత్మార్థకాలకు(నా-నీ-తా శబ్దాలకు) షష్ఠిగాని, ద్వితీయాగాని వస్తుంది. నామార్థకాలకు ఉదాహరణకు ' రాముని యొక్క +వలె =రాముని వలె'. తదర్థకాలకు ఉదాహరణ 'వాని యొక్క +వలె =వాని వలె. అస్మదర్థకానికి ఉదాహరణ 'నన్నును+వలె= నన్ను వలె, నా యొక్క + వలె =నా వలె. యుష్మదర్థకానికి ఉదాహరణ 'నిన్నును+వలె= నిన్నువలె, నీ యొక్క+వలె =నీ వలె.

సులభవ్యాకర్త "ఉపమేయము ద్వితీయాద్యంత మగునపుడు పోలె ప్రభృతులు పరంబులగుచో నుపమానంబులకు నుపమేయ విభక్తుల యగు " (సులభ. వాక్య:48) అని సూత్రీకరించారు. ఉపమేయం ద్వితీయాది విభక్తులు అంతమందుగా కలిగినప్పుడు, పోలె ప్రభృతులు( పోలె, బలె, వలె శబ్దాలు) పరమైనపుడు ఉపమానాలకు ఉపమేయ విభక్తులే అవుతాయి. ఉదాహరణకి ' మమ్ము భీరులఁబోలె వెఱపించెదవు '. ఇక్కడ 'మమ్మున్' అనే ఉపమేయము ద్వితీయాంతం అవ్వడం చేత, 'పోలె' పరమవ్వడం వల్ల ఉపమానానికి 'భీరులను' అని ద్వితీయా విభక్తి కలిగింది. 'భీరులను+పోలె=భీరులఁబోలె'.

ప్రౌఢవ్యాకర్త“ఒకనొకచో సహార్థంబుగ యుష్మదస్మదర్థంబు లభిహితంబగుచోఁ గ్రియలు తత్కర్తృకంబులు విభాష నగు” (ప్రౌఢ. క్రియా:26) అని సూత్రీకరించారు. ఒక్కొకసారి ‘సహ’(కూడ) శబ్దం యొక్క అర్థంలో, యుష్మదర్థం (నీ- శబ్దం), అస్మదర్థం(నా–శబ్దం) క్రియా ప్రత్యయం చేత చెప్పబడునవి, అయినపుడు క్రియలు అభిహితములైన ‘నీ–నా’ శబ్దాలు కర్తలుగా కలవి వికల్పంగా అవుతాయి. ఉదాహరణకు ‘ నీవును నీ నిషాదియున్ వెల్వదుము’. ఇక్కడ ‘నీవు’–యుష్మదర్థకం. ‘నిషాది’–అన్యము. “అన్య యుష్మ దస్మత్కార్యంబులందుత్తరోత్తరంబు బలీయంబు” (బాల. కారక:36) అను బాలవ్యాకరణ సూత్రం ప్రకారం యుష్మదర్థకమే బలీయం అవ్వడం వల్ల క్రియ మధ్యమ పురుష అవ్వాలి. ‘నీవు, నిషాది’ అనేవి రెండు కర్తలవ్వడం చేత క్రియ బహువచనం అవ్వాలి. అలాకాకుండా క్రియ ఏకవచనాంతం వికల్పంగా ఉంటుందని ప్రస్తుత సూత్రం బాలవ్యాకరణ సూత్రానికి పూరించబడింది.

సులభవ్యాకర్త “ఒకనొకచో సహార్థంబుగ యుష్మదస్మదర్థంబు లభిహితంబగుచోఁ గ్రియలు తత్కర్తృకంబులు విభాష నగు” (సులభ. వాక్య:51) అని సూత్రీకరించారు. ఒక్కొకసారి ‘సహ’(కూడ) శబ్దం యొక్క అర్థంలో(ఏకవచనం అని చెప్పక చెప్పారు), యుష్మదర్థం (నీ- శబ్దం), అస్మదర్థం(నా–శబ్దం) క్రియా ప్రత్యయం చేత చెప్పబడునవి, అయినపుడు క్రియలు అభిహితములైన ‘నీ–నా’ శబ్దాలు కర్తలుగా కలవి వికల్పంగా అవుతాయి. ఉదాహరణకు ‘ఆలుం గొడుకును గోడలు నీవు నెక్కుము’“అన్య యుష్మ దస్మత్కార్యంబులందుత్తరోత్తరంబు బలీయంబు” (బాల. కారక:36) అను బాలవ్యాకరణ సూత్రం ప్రకారం యుష్మదర్థకమే బలీయం అవ్వడం వల్ల క్రియ మధ్యమ పురుష అయింది. ఆలి, కొడుకు, కోడలు, నీవు అనేవి కర్తలవ్వడం చేత క్రియ బహువచనం అవ్వాలి. అలాకాకుండా క్రియ ఏకవచనాంతం వికల్పంగా ఉంటుందని ప్రస్తుత సూత్రం బాలవ్యాకరణ సూత్రానికి పూరించబడింది.

సులభవ్యాకర్త “గ్రంథకర్తలు – పత్రికాధిపతులు – ఉత్తము – లుత్తమపురుష మందు నేకవచనమునకు మారు బహువచనము ప్రయోగింతురు”(సులభ.వాక్య:55) అని సూత్రీకరించారు. గ్రంథకర్తలు, పత్రికాధిపతులు, ఉత్తములు ఉత్తమపురుష ఏకవచనం బదులుగా బహువచనాన్ని ప్రయోగిస్తారు.

సులభవ్యాకర్త "వినీతి నుత్తమపురుషంబునకుఁ బ్రథమపురుష మొక్కెడ నగు" (సులభ. వాక్య:65) అని సూత్రీకరించారు. కవులు కొన్నిసార్లు ఉత్తమ పురుషలో చెప్పగలిగిన మాటలకు బదులుగా ప్రథమ పురుషలో ప్రయోగిస్తారు. ఉదాహరణకు 'కవి వరుండిట్లనియె'. ఇక్కడ 'నేను ఇట్లంటిని' అని ఉత్తమ పురుషలో చెప్పే బదులుగా 'కవి వరుండిట్లనియె' అని ప్రథమ పురుషలో ప్రయోగించడం జరిగింది.

## 8.2.8 కాలబోధక వాక్యాలు

సులభవ్యాకర్త "అవ్యవహిత భవిష్యత్తునకు వర్తమానభూతము లగు" (సులభ. వాక్య:41) అని సూత్రీకరించారు. అప్పటికి జరగకున్నను వెంటనే ఉత్తర కాలంలో జరగగల దానిని వర్తమానం చేత సూచింపవచ్చు. ఉదాహరణకు 'ఇదే పోవుచున్నాను, వచ్చె సుదర్శనాయుధుఁడు', 'ఆపని చేసితివా? ఇదో చేసితిని?'.

సులభవ్యాకర్త "అవ్యవహిత భూతంబునకు వర్తమాన మగు" (సులభ. వాక్య:42) అని సూత్రీకరించారు. అప్పటికి జరిగిన పనిని వెంటనే ఉత్తర కాలంలో జరగగల దానిని వర్తమానం చేత సూచింపవచ్చు. ఉదాహరణకు 'నీ వూరి నుండి యెప్పుడు వచ్చితివి? ఇప్పుడె వచ్చుచున్నాను'.

సులభవ్యాకర్త "ప్రబంధముల భూతమునకు వర్తమాన మగు" (సులభ. వాక్య:43) అని సూత్రీకరించారు. ప్రబంధాలలో అవ్యవహితంగ ప్రయోగించిన భూతకాల వాక్యాలకు వర్తమానార్థకం చేత సూచించవచ్చును. ఉదాహరణకు 'మూర్ఛిల్లిన లక్ష్మణుఁ జూచి రాముడిట్లు దుఃఖపడుచున్నాడు'.

సులభవ్యాకర్త "కిమర్థక పూర్వంబయిన తుమున్నాద్యర్థక శబ్దము తద్వ్యతిరేకార్థ వ్యంజకంబగు" (సులభ. వాక్య:61) అని సూత్రీకరించారు. కిమర్థక(ఏమి,ఏది, ఏవి) పూర్వముగా ఉన్న తుమున్నాద్యర్థక శబ్దాలు వాటి వ్యతిరేకార్థాన్ని బోధించేవిగా ఉంటాయి. ఉదాహరణకు 'బల మిఁక నేమి చెప్ప– ఏమి చెప్పుదు గురునాథ'.

సులభవ్యాకర్త "తుమున్నంతముమీఁది 'వలయు'నకు 'వలె' బహుళంబుగ నాదేశంబగు " (సులభ. వాక్య:64) అని సూత్రీకరించారు. తుమర్థకాంతం మీద వచ్చే 'వలయు' స్థానంలో 'వలె' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు ' సుస్థిరుండవు కావలె'.

### 8.2.9 అధ్యాహార్యం

సులభవ్యాకర్త "క్త్వార్థక ద్వంద్వంబున నర్థవిశేషంబునఁ బూర్వపదంబునకు దీర్ఘము విభాష నగు. దీర్ఘము రానిచో సముచ్చయ మధ్యాహార్యంబొండెనగు"(సులభ.వాక్య:58) అని సూత్రీకరించారు. క్త్వార్థక ద్వంద్వ సమాసంలో అర్థ విశేషంలో మొదట ఉన్న పదానికి దీర్ఘం వికల్పంగా వస్తుంది. దీర్ఘం రాని సందర్భంలో సముచ్చయం అధ్యాహార్యంగా కొన్నిసార్లు ఉంటుంది. ఉదాహరణకు 'నమ్మీ నమ్మక– నమ్మియు నమ్మక –నమ్మి నమ్మక'.

ప్రౌఢవ్యాకర్త "న్యూనవచో వాక్యంబునఁ దద్వచనంబు లధ్యాహార్యంబులగు"(ప్రౌఢ. వాక్య:13) అని సూత్రీకరించారు. ఐన, ఏని, ఏ, ఓ అనేవి న్యూన వచనాలు. తప్పక ప్రయోగించవలసిన న్యూన వచనాలు వాక్యంలో ప్రయోగించబడని పక్షంలో న్యూనవచనాలను అధ్యాహారం చేయదగునని సూత్రార్థం. ఉదాహరణకు 'ఎత్తెఱఁగునన్=ఎత్తెఱఁగునైనను, ఎత్తెఱఁగుననేని'. ఇందులో ఐన, ఏని అవ్యయాలు అధ్యాహార్యములు.

సులభవ్యాకర్త "న్యూనవచో వాక్యంబునఁ దద్వచనంబు లధ్యాహార్యంబు లగు " (సులభ. వాక్య:59) అని సూత్రీకరించారు. ఐన, ఏని, ఏ, ఓ అనేవి న్యూన వచనాలు. తప్పక ప్రయోగించవలసిన న్యూన వచనాలు వాక్యంలో ప్రయోగించబడని పక్షంలో న్యూనవచనాలను అధ్యాహారం చేయదగునని సూత్రార్థం. ఉదాహరణకు ' ఎట్టులు ధర్మము సేయవలయు– ఎటులైన ధర్మము సేయవలయు'. ఇక్కడ (ఎట్టులు–ఎటులైన) 'ఐన' అనేది అధ్యాహార్యం. 'ధర్మము తలఁగాచును– ధర్మమె తలఁగాచును'. ఇక్కడ (ధర్మము– ధర్మమె) 'ఎ' అనేది అధ్యాహార్యం.

ప్రౌఢవ్యాకర్త "కొన్నియెడలం గర్తృకర్మక్రియ లధ్యాహార్యంబులగు"(ప్రౌఢ. వాక్య:14) అని సూత్రీకరించారు. కొన్నిచోట్ల కర్త, కర్మ, క్రియ అధ్యాహారం చేయదగినవి అవుతాయి. ఉదాహరణ ' నన్నుఁజూచి నగరె?' ఇక్కడ ఎవ్వరు నవ్వుదురని ఆకాంక్షరాగా 'జనులు' అనే కర్త ఆ ఆకాంక్షను పూరించును. కాబట్టి ఇక్కడ 'జనులు' అనే కర్త అధ్యాహార్యం.

సులభవ్యాకర్త "కొన్ని యెడలఁ గర్తృకర్మ క్రియ లధ్యాహార్యంబు లగు" (సులభ. వాక్య:60) అని సూత్రీకరించారు. కొన్నిసార్లు కర్త, కర్మ, క్రియ అధ్యాహారం చేయదగినవి అవుతాయి. కొన్ని ఎడల అంటే సందర్భాన్ని బట్టి స్పష్టంగా తెలియని ఎడల అని అర్థం. ఉదాహరణకు ' నన్నుఁ జూచి

నగరె'. ఇక్కడ కర్త ' లోకులు' అనేది అధ్యాహార్యం. 'వాఁడు నిద్రపోయినాఁడా? పోయినాఁడు' ఇక్కడ 'పోయినాడు' అని మాత్రమే చెప్పడం వల్ల 'వాడు' అనే కర్త, ''నిద్ర' అనే కర్మ అధ్యాహార్యాలు . 'వాకిట నెవఁడున్నాడు? ద్వారపాలకుడు' ఇక్కడ ' ఉండడం' అనే క్రియ అధ్యాహార్యం.

## 8.2.10 సమాసం

ప్రౌఢవ్యాకర్త "భావ ద్వంద్వంబునం దొలిపదంబు టవర్ణకంబునకు లోపంబగు"(ప్రౌఢ. సమాస:31) అని సూత్రీకరించారు. భావద్వంద్వంలో పూర్వపదం చివర ఉన్న టవర్ణానికి లోపం వస్తుంది. ఉదాహరణకు 'అవుట+ కామి=ఔట+కామి=ఔగామి+లు= ఔగాములు'. ఈ సూత్రంలో 'ట' ప్రత్యయం కృత్ ప్రత్యయానికి ఉపలక్షణమని చెప్పబడింది. అనగా ట వర్ణకం కృత్ ప్రత్యయానికి సూచికము. టవర్ణలోపం కృత్ ప్రత్యయాల తుది అక్షరలోపానికి సూచికము. అంటే 'ట' ప్రత్యయమే కాక ఇతర భావార్థక ప్రత్యయాలు కూడా లోపిస్తాయని అర్థం . ఉదాహరణకు 'వినికి+వినిమి= విని వినిమి+లు =వినివినిములు.

సులభవ్యాకర్త "భావద్వంద్వంబునఁ దొలిపదంబు టవర్ణకంబునకు లోపంబగు, టవర్ణకంబిటఁ గృత్ప్రత్యయంబున కుపలక్షణము" (సులభ. వాక్య:34) అని సూత్రీకరించారు. భావార్థక, వ్యతిరేక భావార్థక శబ్దాలు ద్వంద్వ సమాసం అయ్యేటప్పుడు మొదటి పదంలోని 'ట'వర్ణానికి లోపం వస్తుంది. 'ట' ప్రత్యయం కృత్ ప్రత్యయానికి ఉపలక్షణమని చెప్పబడింది. ఉదాహరణకు 'అవుట+ కామి=ఔట+కామి =ఔగామి+లు= ఔగాములు'. వినుట+వినమి= విని వినములు. ఇక్కడ 'వినుట' యొక్క కృదంత రూపము 'వినికి' లోని 'కి' వర్ణానికి లోపం వచ్చింది.

ప్రౌఢవ్యాకర్త "ఒక్కొకచో సమాసగత పూర్వపదంబు వ్యవహితోత్తర పదంబొంటితోడను, వాని పెక్కింటి తోడను నన్వయించెడి" (ప్రౌఢ. సమాస:34) అని సూత్రీకరించారు. ఒక్కొకచోట సమాసంలోని పూర్వపదం వ్యవధానం కలిగిన ఒక పరపదంతోను, వ్యవధానం కలిగిన చాలా పరపదములతో అన్వయించబడుతుంది. ఉదాహరణకు 'రాహు కంఠము దెగి దేహము ధరణిఁబడియె'. ఇక్కడ 'రాహుకంఠము' అనే సమాసంలోని పూర్వ పదం 'రాహుయొక్క'. 'కంఠము తెగి' అనేది మధ్యలో చేరడం వల్ల పరపదమైన 'దేహము' అనేదానికి వ్యవధానం ఏర్పడుతున్నది. ఇలా వ్యవధానం కలిగిన పరపదానికి ప్రస్తుత సూత్రం చేత అన్వయం కలుగుతున్నది. .

సులభవ్యాకర్త "సమాసంబునందలి పూర్వపదంబు వ్యవహితంబైన యుత్తరపదంబుతోడ నన్వయించు" (సులభ. వాక్య:35) అని సూత్రీకరించారు. సమాసంలోని పూర్వపదం వ్యవధానం కలిగిన ఒక పరపదంతో అన్వయించబడుతుంది. ఉదాహరణకు 'రాహు కంఠము దెగి దేహము ధరణిఁబడియె'. ఇక్కడ 'రాహుకంఠము' అనేది సమాసం. సమాస పదంలోని పూర్వ పదం 'రాహువు'. ప్రస్తుత సూత్రం చేత వ్యవధానంగా ఉన్న పరపదమైన 'దేహము' తో అన్వయించబడుతుంది.

సులభవ్యాకర్త "ఏక దేశి సమాసంబు లాంధ్రంబునను గలవు" (సులభ. వాక్య:44) అని సూత్రీకరించారు. ఏకదేశి సమాసాలు ఆంధ్రభాషలో ఉన్నాయి. తన- నా- నీ- ఆ-ఈ- ఏలు మొదలైనవి సిద్ధ సమాసంలో అన్వయించబడతాయి. ఉదాహరణకు 'తన యశోవిశదముక్తాపాళి' ఇక్కడ 'తన' అనే తెలుగు పదం సిద్ధసమాసంలోని 'యశస్సు' అనే పదంతో అన్వయించును.

సులభవ్యాకర్త "జంట-జోడు-జత లోనగు ద్వంద్వంబుల కేకవచన క్రియ యగు" (సులభ. వాక్య:54) అని సూత్రీకరించారు. 'జంట-జోడు-జత' మొదలైన ద్వంద్వాన్ని(రెండు సంఖ్యను) తెలిపే పదాలకు ఏకవచన క్రియ వస్తుంది. ఉదాహరణకు 'జంట సరిగానున్నది- జోడు కుదిరింది'.

## 8.2.11 విభక్తులు

ప్రౌఢవ్యాకర్త "ఊరు చోటు మేన్వాదు లున్లుగ్విషయంబులు" (ప్రౌఢ. శబ్ద:106) అని సూత్రీకరించారు. ఊరు, చోటు, మేను మొదలైన శబ్దాలు 'ఉన్' లోపించుటకు విషయములు. 'ఊరు' మొదలైన శబ్దాలకు తృతీయార్థంలో అత్వం కలగదు. తృతీయా సప్తముల రెండిటి యందు అత్వమయ్యే శబ్దాలే ఈ సూత్రానికి విషయాలు అవుతాయి. 'ఊరు' మొదలైన శబ్దాలకు సప్తమ్యర్థంలోనే ప్రవర్తిల్లును. తృతీయార్థంలో రాదు. కాబట్టి ఈ శబ్దాలు ప్రస్తుత సూత్రానికి లక్ష్యాలు కావని అర్థం.

సులభవ్యాకర్త "ఊరు-చోటు- మేనులకుఁ దృతీయయం దత్వము లేదు" (సులభ. వాక్య:32) అని సూత్రీకరించారు. 'ఊరు, చోటు, మేను' శబ్దాలకు తృతీయావిభక్తి అర్థంలో విధించబడిన అత్వం రాదు. "ఔపవిభక్తిముల తృతీయాసప్తముల కత్వంబాదేశంబు బహుళంబుగా నగు" (సులభ. ఆచ్చిక:71) సూత్రం ప్రకారం సప్తమీ విభక్తిలో ఊరన్, చోటన్, మేనన్ అని

అవుతాయి. తృతీయార్థంలో కూడా అలా అత్వం రావాల్సి ఉండగా ప్రస్తుత సూత్రం ప్రకారం అత్వం రాదు.

ప్రౌఢవ్యాకర్త "కొన్ని యెడల నుపమానంబులు పెక్కులగుచో నివి కడదాని కొక్కటిగ చూపట్టెడి"(ప్రౌఢ. సమాస.40) అని సూత్రీకరించారు. ఉపమాన వాచకాలు అనేకం ఉన్నప్పుడు ఇవార్థకాలు(పోలె) చివరి ఉపమానం ఒక్కదానికే చేరడం కనిపిస్తుంది. ఉదాహరణకు 'కమల షండంబు నాగలోకంబు తలిరుఁ బాన్పు కల్పాంతమున జముబానసంబు నింటిలోపల వోలె'. ఇక్కడ 'కమల షండంబు', 'నాగలోకంబు', 'తలిరుఁ బాన్పు' అనే ఉపమానాల మీద చేరక, "కల్పాంతమున జముబానసంబు నింటిలోపల వోలె' అనే చివరి ఉపమానం ఒక్కదాని మీదే 'పోలె' చేరింది.

సులభవ్యాకర్త "ఉపమానంబు లనేకంబులగుచో నుపమావాచకంబు కడదాని కొక్క టియ కొన్ని యెడలఁ గన నగు" (సులభ. వాక్య:49) అని సూత్రీకరించారు. ఉపమాన వాచకాలు అనేకం ఉన్నప్పుడు ఇవార్థకాలు(పోలె) చివరి ఉపమానం ఒక్కదానికే చేరడం కనిపిస్తుంది. ఉదాహరణకు 'శారద నీరదము చంద్రబింబము కర్పూరమువలె నీ యశస్సు ధవళము'. ఇక్కడ 'శారద నీరదము', 'చంద్రబింబము', అనే ఉపమానాల మీద కాక 'కర్పూరము' అనే చివర ఉపమానం మీద మాత్రమే ' వలె' అనేది చేరింది.

ప్రౌఢవ్యాకర్త "శబ్దపల్లవ క్రియలు కొన్ని ద్విరుక్తంబులగుచో నుత్తరపదంబు పూర్వావయవంబునకు లోపంబు విభాషనగు"(ప్రౌఢ. క్రియా:24)

సులభవ్యాకర్త "శబ్దపల్లవాదులగు క్రియలు కొన్ని ద్విరుక్తంబులగుచో నుత్తరపదంబు పూర్వావయవంబునకు లోపంబు విభాష నగు " (సులభ. వాక్య:50) అని సూత్రీకరించారు. శబ్ద పల్లవ మొదలైన క్రియలు ద్విరుక్తాలైనప్పుడు రెండవపదం యొక్క పూర్వావయవానికి లోపం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ' చల్లు పోరాడి యాడి– చల్లు పోరాడి పోరాడి. ఇక్కడ 'పోరాడు' శబ్దపల్లవ క్రియ(పోరాడు+ఆడు). దీనికి క్త్వార్థక రూపం 'పోరాడి'. ఇది ద్విరుక్తమై 'పోరాడి+ పోరాడి'అని కాగా ప్రస్తుత సూత్రం చేత ఆమ్రేడితంలోని మొదటి అవయవానికి లోపం వచ్చి 'పోరాడి +ఆడి' యడాగమం వచ్చి 'పోరాడి యాడి' అయింది. ఇక్కడ 'పోరాడు' అనేది లోపించింది. వికల్పం కాబట్టి లోపం రానపుడు 'పోరాడి పోరాడి' అవుతుంది.

సులభవ్యాకర్త "జాతిని దెలుపుటయం దేకవచనంబు నగు" (సులభ. వాక్య:53) అని సూత్రీకరించారు. జాతిని తెలుపు సందర్భంలో ఏకవచనం వస్తుంది. ఉదాహరణకు 'అడవి మృగములలో సింహము శ్రేష్టము', ప్రాణి కోటిలో  మనుష్య దుత్తముఁడు'. ఇక్కడ సింహము, మనుష్యుడు జాతిని తెలుపే ఏకవచన రూపాలు. పై ఉదాహరణలు బహువచనంలో కూడా ఉన్నాయి.

సులభవ్యాకర్త "నామంబు బహుత్వంబున గోత్రార్థకం బగు" (సులభ. వాక్య:56) అని సూత్రీకరించారు. నామాలు బహువచనంతో గోత్రార్థకాలుగా ఉంటాయి. ఉదాహరణకు 'రఘువులలో రాముఁడు మేటి' రఘువులలో అనగా రఘువంశంలో పుట్టినవారిలో రాముఁడు మేటి అని అర్థం.

సులభవ్యాకర్త "శ్లేషయందు సబిందుక నిర్బందుకములకును లఘ్వ లఘు రేఫములకు మేళనంబు కొందఱ మతంబు" (సులభ. వాక్య:62) అని సూత్రీకరించారు. శ్లేషార్థంలో బిందువు కలిగిన లఘు రేఫం, అలఘు రేఫం, బిందువులేని లఘురేఫం, అలఘురేఫం వాడటం కొందరి కవులు ప్రయోగించారు. ఉదాహరణకు ' పొంగురాఁ+గల –పొంగు+ఱాఁగల = పొంగురాఁగల.

## ముగింపు:

ఈ అధ్యాయంలో మొదటగా 'కారక విజ్ఞానానికి సంబంధించిన విషయాలను చర్చించడం జరిగింది. బాల, ప్రౌఢ వ్యాకరణాలకు  'పూరణ'  అంశాలను సులభవ్యాకర్త చెప్పారు. బాలవ్యాకర్త ప్రాతిపదికర్థంలో, సంబోధనార్థంలో, ఉక్తార్థంలో ప్రథమా విభక్తి  ప్రత్యయం వస్తుంద ని చెప్పగా, సులభవ్యాకర్త 'పరిమాణార్థకంలో' కూడా ప్రథమా విభక్తిని చెప్పారు. కర్మార్థంలో ఉద్దేశార్థక ద్వితీయకు  'గుఱచి' అనేది  అనుప్రయుక్తంగా వస్తుందని ప్రౌఢవ్యాకర్త చెప్పగా , సులభ వ్యాకర్త 'గూర్చి, గుఱచి, గుఱించి' వంటి మూడు  ప్రత్యయాలు వస్తాయని చెప్పారు.

సులభవ్యాకర్త 'ఆసత్తి, యోగ్యత, ఆకాంక్ష' కలిగినవే వాక్యమని, ఇవి చక్కగా ఉండేటట్లుగా పదాలు కూర్చిన విషయం బాగుగా బోధపడుతుందని చెప్పారు. 'ఒకరు మరొకరిని చూసి 'పో' అని చెప్పిన అది వాక్యం అవుతుందని సులభవ్యాకర్త చెప్పారు. ఎందుకంటే 'పో' అనేది అర్థం కలిగిన పదం, ప్రయోగయోగ్యమైనది. అన్వయం కూడా ఉన్నట్లు కన్పిస్తుంది. 'పో' అనేది మధ్యమ పురుష కాబట్టి ఇక్కడ ' నీవు' అనేది అధ్యాహార్యము. 'నీవు పో' అనేది వాక్యం. కాబట్టి 'నీవు' అనే కర్తృపదంతో

అన్వయించబడుతుంది. ఇలాగే తే- రా మొదలైనవి కూడా ఒంటి పద వాక్యాలు అని చెప్పారు. పదం, సంబోధనార్థం, నిత్య ఏకవచనాలు, నిత్య బహువచనాలు, కర్త్రర్థక వాక్యాలు, విశేషణార్థక వాక్యాలు, అస్మద్- యుష్మద్ వాక్యాలు, కాలబోధక వాక్యాలు, అధ్యాహార్యం, సమాసం, విభక్తులు మొదలైన అంశాలు ఈ విభాగంలో పరిశీలించడం జరిగింది.

**తొమ్మిదవ అధ్యాయం:** 'వ్యాస విజ్ఞానం' అనే అధ్యాయంలో వ్యాసకుడికి గాని, వ్యాసానికిగాని తోడ్పడే విషయాలను పరిశీలిస్తాను.

## ఎనిమిదవ అధ్యాయం

## కారక-వాక్య విజ్ఞానాలు - సూత్రాల పట్టిక-1

| క్రమ సంఖ్య | బాలవ్యాకరణము సూత్రము: సంఖ్య | సులభవ్యాకరణము సూత్రము: సంఖ్య | సవరణ | పూరణ | వివరణ | నూతన విషయ ప్రతిపాదన |
|---|---|---|---|---|---|---|
| 1. | ప్రాతిపదిక సంబోధనోక్తార్థం బులం కారక:1 | ప్రాతిపదికార్థ, పరిమాణ, సంబోధ, కారక:2 | –– | ✓ | –– | –– |
| 2. | –– | అగ్వాదివ్యవహితా వ్యవహితంబు.. కారక:35 | –– | –– | –– | ✓ |
| 3. | చేత వర్ణకంబు హేతు.. కారక: 3 | కర్తృ , కరణ, హేతు, .. కారక: 6 | –– | ✓ | –– | –– |
| 4. | –– | యుక్త్యర్థంబునఁ దోడకుఁ దోడు కారక: 10 | –– | –– | –– | ✓ |
| 5. | –– | "అచేతనంబుల మీఁది తోడకు మై.. | –– | –– | –– | ✓ |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | | కారక:12 | | | | |
| 6. | అపాయ భయ జుగుప్సా పరా.. కారక:9 | అపాయ, జుగుప్సా, విరామ.. కారక:15 | –– | ✓ | –– | –– |
| 7. | –– | "అధ్వ కాల నిర్మాణంబుల.. కారక:16 | –– | –– | –– | ✓ |
| 8. | కంటె వర్ణకం బన్యార్థాది యోగ. కారక:12 | అన్య, దూర, సమీపే, తరోత్తరా.. కారక:19 | –– | ✓ | –– | –– |
| 9. | "పట్టి వర్ణకంబు హేతువులగు కారక:14 | హేతువులగు గుణక్రియలకు,. కారక:21 | –– | ✓ | –– | –– |
| 10. | –– | నామంబులకుఁ గాలావధియందు.. కారక:23 | –– | –– | –– | ✓ |
| 11. | "నిర్ధారణ షష్ఠికి.. కారక:16 | నిర్ధారణమందు .. కారక:25 | –– | –– | ✓ | –– |
| 12. | అధికరణంబున సప్తమి యగు కారక:17 | అధికరణ దూరాంతికార్థంబు. కారక: 26 | –– | ✓ | –– | –– |
| 13. | –– | వ్యస్తంబైన కర్తృపద ప్రథమకు.. కారక: 24 | –– | –– | –– | ✓ |
| 14. | –– | "వాక్యంబునఁ బూర్వపరనియమ. | –– | –– | –– | ✓ |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | | కారక:43 | | | | |

## కారక–వాక్య విజ్ఞానాలు – సూత్రాల పట్టిక–2

| క్రమ సంఖ్య | ప్రౌఢవ్యాకరణము సూత్రము: సంఖ్య | సులభవ్యాకరణము సూత్రము: సంఖ్య | సవరణ | పూరణ | వివరణ | నూతన విషయ ప్రతిపాదన |
|---|---|---|---|---|---|---|
| 1. | పదమనఁగాఁ బ్రయోగార్హంబు. వాక్య:2 | "అర్థవంతమై, యన్వయయుక్తమై వాక్య:2 | —— | —— | ✓ | —— |
| 2. | పదములవి నామములు క్రి. వాక్య:3 | పదములు,. నామములు.. వాక్య:3 | —— | ✓ | —— | —— |
| 3. | —— | వ్యాపారావబోధక ము క్రియ.. వాక్య:4 | —— | —— | ✓ | —— |
| 4. | —— | కర్తపదముమాత్ర ము.వస్తువ్యాపార.. వాక్య:6 | —— | —— | —— | ✓ |
| 5. | —— | ఏక పదంబునను, ధాతూపసర్గముల. వాక్య:12 | —— | —— | —— | ✓ |
| 6. | —— | "గద్యంబున నుచ్చారణ.. వాక్య:13 | —— | —— | —— | ✓ |
| 7. | తెనుఁగునం గొన్ని తత్సమ.. | నీచత్వంబునఁ బుంలింగంబున.. | —— | —— | ✓ | —— |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | శబ్ద:22 | వాక్య:16 | | | | |
| 8. | తఱచుగా స్త్రీసమంబులగు.. శబ్ద: 39 | తఱచుగా స్త్రీసమంబుల కడ. వాక్య:17 | –– | ✓ | –– | –– |
| 9. | –– | "ఐ యొకానొకచోఁ గలయర్థం.. వాక్య:63 | –– | –– | –– | ✓ |
| 10. | –– | ఆత్మనేపదం బనిత్యంబు వాక్య:57 | –– | –– | –– | ✓ |
| 11. | –– | ఉపమేయము ద్వితీయాద్యంత వాక్య:48 | –– | –– | –– | ✓ |
| 12. | –– | "గ్రంథకర్తలు – పత్రికాధిపతులు – వాక్య:55 | –– | –– | –– | ✓ |
| 13. | –– | వినీతి నుత్తమపురుషంబు వాక్య:65 | –– | –– | –– | ✓ |
| 14. | –– | అవ్యవహిత భవిష్యత్తునకు.. వాక్య:41 | –– | –– | –– | ✓ |
| 15. | –– | అవ్యవహిత భూతంబునకు.. వాక్య:42 | –– | –– | –– | ✓ |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 16. | –– | ప్రబంధముల భూతమునకు.. వాక్య:43 | –– | –– | –– | ✓ |
| 17. | –– | కిమర్థక పూర్వంబయిన .. వాక్య:61 | –– | –– | –– | ✓ |
| 18. | –– | తుమున్నంతము మీఁది ‘వల... వాక్య:64 | –– | –– | –– | ✓ |
| 19. | –– | క్త్వార్థక ద్వంద్వంబున నర్థ వాక్య:58 | –– | –– | –– | ✓ |
| 20. | –– | “ఏకదేశి సమాసంబు .. వాక్య: 44 | –– | –– | –– | ✓ |
| 21. | –– | జంట–జోడు–జత లోనగు.. వాక్య:54 | –– | –– | –– | ✓ |
| 22. | –– | జాతిని దెలుపుటయం.. వాక్య:53 | –– | –– | –– | ✓ |
| 23. | –– | నామంబు బహుత్వంబున.. వాక్య: 62 | –– | –– | –– | ✓ |
| 24. | –– | శ్లేషయందు సబిందుక.. వాక్య :62 | –– | –– | –– | ✓ |

# అధ్యాయం – 9

# వ్యాస విజ్ఞానం

# అధ్యాయం – 9

# వ్యాస విజ్ఞానం

## 9.0 పరిచయం

ఆధునిక తెలుగు సాహిత్యంలో చాలా ప్రక్రియలు ఆంగ్లసాహిత్యాన్ని అనుసరించి వచ్చాయి. అందులో 'వ్యాసం' కూడా ఒకటి. ఆంగ్లంలో 'ఎస్సె' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో 'వ్యాసం' అనే పదాన్ని వాడుతున్నాం. వ్యాసమంటే "ఏదేని యొక విషయము విరివిగా వ్రాయుట"[19], "ఏదేని యొక చరిత్రాంశము "[20] అని నిఘంటువులు అర్థాన్ని సూచిస్తున్నాయి. సాధారణంగా ఏదైన ప్రక్రియ ఆంగ్లం నుంచి తెలుగులోకి వచ్చినప్పుడు ఆంగ్లంలో ఉండే లక్షణాలే దాదాపుగా తెలుగులో రావటం సహజం. 'వ్యాసం' ఆంగ్ల ప్రక్రియ అయినప్పటికీ, తెలుగులో విమర్శకులు, పరిశోధకులు ఏ విధంగా భావించారో తెలుసుకొని, తెలుగులో పొందిన మార్పులను మనం గమనించవచ్చు.

'వ్యాసం' అనే పేరు ఈ ప్రక్రియకు చాలా కాలం తరువాత రూఢి అయింది. వ్యాసాన్ని ప్రథమాంధ్ర వ్యాసకర్త స్వామినీన ముద్దు నారసింహనాయడు 'ప్రమేయము' అనీ, పరవస్తు వేంకట రంగాచార్యులు 'సంగ్రహము' అనీ, జియ్యరు సూరి 'వచన కావ్యము' అనీ తమ వ్యాసాలకు నామకరణం చేశారు. కందుకూరి వీరేశలింగం పంతులు కాలంలో 'ఉపన్యాసం' అనే పేరు 'వ్యాస' పర్యాయపదంగా విశేష ఆదరణ పొందింది[21].

'వ్యాస' నిర్మాణం ప్రారంభకాలంలో విషయ వివరణ దృష్టితో కొనసాగింది. తదనంతరం విషయ విమర్శనమే ప్రధానంగా సృష్టింపబడింది. విషయం సాంఘికమైన, సారస్వతమైన, వ్యక్తిగతమైన రచనా గుణం వల్ల వ్యాస నిర్మాణం స్పష్టమవుతూ వచ్చింది. స్వామినీన ముద్దు నారసింహనాయడు, పరవస్తు రంగాచార్యులు, జియ్యరు సూరి కొంత వివరణలతో, కొంత విమర్శనా దృష్టితో వ్యాస నిర్మాణం చేశారు. గురజాడ, గిడుగు, పానుగంటి వివరణ విమర్శలతోపాటు,

---

[19] శబ్దార్థ చంద్రిక: పుట. 795

[20] ఆంధ్ర వాచస్పత్యమ: పుట. 2438

[21] తెలుగు వ్యాస పరిణామం: పుట.601

వర్ణనలతో వాక్య నిర్మాణం చేశారు. చలం, శ్రీశ్రీ, నార్ల ప్రధానంగా విమర్శన ఆత్మనివేద వర్ణనలతో వ్యాస నిర్మాణం చేశారు.

వ్యాసం, శైలి రెండు రచయిత వ్యక్తిత్వం మీద ఆధారపడి ఉంటాయి. వ్యాసం రచయిత వ్యక్తిత్వ ముద్రతో, భాషా ప్రయోగ నైపుణ్యంతో శోభిస్తుంది. వ్యాస శోభకు శైలి ప్రాణభూతంగా ఉంటుంది. సామాజికంగా రచయిత వ్యక్తిత్వం ఏ ధోరణిని కలిగి ఉంటుందో, అదే తీరు శైలిలో ప్రతిబింస్తుంది. రచయిత వ్యక్తిత్వం భాషకు క్రొత్త అర్థం, క్రొత్త రూపం, క్రొత్త పథం కలిగించటంతోపాటు పాత అర్థం, పాత రూపం, పాత పథం వెలిగిస్తుంది[22].

తెలుగు భాషలో ఎవరు చెప్పినా ఆంగ్ల ప్రభావ ఫలితంగానే వ్యాస లక్షణాలను, వ్యాస శైలిని నిర్వచించగలరని, ఆంగ్లవ్యాస వాఙ్మయాన్ని గురించి వ్యాసకర్తలు, విమర్శకులు చెప్పిన నిర్వచనాలను పరిశీలించి వ్యాస లక్షణాలను ఏర్పాటు చేసుకోవాలని కొలకలూరి ఇనాక్ తమ సిద్ధాంత గ్రంథంలో చెప్పారు. వచనత్వం, అవిశాలతత్వం, విశృంఖలత్వం, మిత్రత్వం, హాస్యత్వం, సృజనత్వం, అసంపూర్ణత్వం, వ్యక్తిత్వం మొదలైన ఎనిమిది లక్షణాలు ఉన్న వ్యాసం దర్శించదగినదని కొలకలూరి ఇనాక్ పేర్కొన్నారు[23].

తెలుగు వ్యాకరణాల్లో 'వ్యాస' చర్చ చేసిన గ్రంథాలు చాలా తక్కువగా ఉన్నాయి. నాకు దొరికిన ఆధారాలను బట్టి 'వ్యాసపరిచ్ఛేదము' అని ప్రత్యేక శీర్షిక పెట్టి వ్యాస శైలి, వ్యాసుకుని వ్యక్తిత్వ లక్షణాలు, వ్యాసంలో ఉపయోగించాల్సిన భాష మొదలైన వివిధ అంశాలను చర్చించిన మొట్టమొదటి గ్రంథం వావిలికొలనువారి *సులభవ్యాకరణము*.

*సులభవ్యాకరణము* తరువాత వచ్చిన వ్యాకరణ గ్రంథాలలో అక్కడక్కడ వ్యాస చర్చ కన్పిస్తుంది. 1936లో నందిరాజు చలపతిరావు రచించిన ***ఉపన్యాసదర్పణము*** అనే గ్రంథంలో 'వ్యాసముల రచన' అనే శీర్షిక పెట్టి వ్యాస రచనకు తోడ్పడే ముఖ్యాంశాలను, వ్యాస రీతులను చెప్పారు. 1942 లో శేషాద్రి రమణకవులు రచించిన ***ఆంధ్రవ్యాకరణ సర్వస్వము*** అనే గ్రంథంలో తొమ్మవదవ అధ్యాయంలో 'వ్యాసరచనా విధానము' అనే శీర్షిక పెట్టి వ్యాసరచనకు ఉపయోగపడే

[22] తెలుగు వ్యాస పరిణామం: పుట. 536

[23] తెలుగువ్యాస పరిణామం:పుట.130

అంశాలను ఐదు రకాలుగా విభజించారు. అవి 1. వస్తువర్ణనము 2. భాష 3. రచన 4. గుణము 5. గుఱుతులు.

కోర్కొండ భట్టరు వేంకటకృష్ణమాచార్యులు రచించిన *సరళ మహావ్యాకరణము*(కాలం అస్పష్టం) అనే గ్రంథంలో 'వ్యాస లేఖనము'అనే శీర్షిక పెట్టి వ్యాస భేదాలను, వ్యాసానికి తోడ్పడే సాధనాలను చర్చించారు. ఈ గ్రంథంలో వేంకట కృష్ణమాచార్యులు వ్యాసాన్ని "ఏక విషయక వాక్య సముదాయము వ్యాసము"[24] అని నిర్వచించారు. వ్యాసాలను సామాన్య, విమర్శ, వినోద అని మూడు రకాలుగా విభజించారు.

సులభవ్యాకరణం కంటే ముందు బహుజనపల్లి సీతారామాచార్యులు *ప్రౌఢవ్యాకరణము* లో వాక్యపరిచ్ఛేదంలో "వాక్య సంగ్రహంబునం దినన్నంత క్రియా పూర్వకంబులగు కాక కాన్యవ్యయంబు లనుక్తవాక్యపద గ్రాహంకబులగు"[25]," కొన్ని యెడల వ్యాస వాక్యమునకు ముందు సంగ్రహ వాక్యంబు నొండగు"[26]అనే సూత్రాలలో రెండు సార్లు 'వ్యాసం' అనే పదం ప్రయోగించారు. ప్రక్రియార్థంలో కాకపోయినా 1885 కంటే పూర్వమే 'వ్యాసం' వ్యాకరణ గతంగా కనబడుతుంది.

## 9.1 సులభవ్యాకరణము – వ్యాస చర్చ

వావిలికొలను సుబ్బారావుగారు *'వ్యాస పరిచ్ఛేదం'* లో వ్యాసం రాసేటప్పుడు విద్యార్థులు చేసే తప్పులను ప్రస్తావించారు. వ్యాసం రాసేటప్పుడు ఒక విద్యార్థికి ఉండాల్సిన లక్షణాలను, నియమాలను 21 భాగాలుగా విభజించి పూర్వభాగంలో చెప్పారు. ద్వితీయ భాగంలో సంస్కృత శబ్దాలను, తెలుగు శబ్దాలను రాసేటప్పుడు విద్యార్థులు చేసే తప్పులను కొన్నింటిని ఉదాహరించారు.

ఏదైనా ఒక విషయాన్ని విస్తరించి రాయడం వ్యాసలేఖనమని, ఆ విస్తరించి రాయబడ్డ గ్రంథం వ్యాసమని వావిలికొలను సుబ్బారావుగారు నిర్వచించారు. వ్యాసంలో మొదటి నుండి చివర వరకు ఒకే అంశాన్ని వివరించాలి. అప్రస్తుత వర్ణనలకు, వివిధ కథలకు వ్యాసంలో చోటు ఉండదు. వ్యాసకునికి వస్తుతత్వ జ్ఞానం, పూర్వ అభ్యాసం ఎంతో అవసరం.

---

[24] సరళ మహా వ్యాకరణము: పుట.152

[25] ప్రౌఢ. వాక్య: 18

[26] ప్రౌఢ. వాక్య:20

వావిలికొలను సుబ్బారావుగారు వ్యాసలేఖనాన్ని ఒక శిల్పంగా భావించారు. వడ్రంగికి కొయ్య ఎలాంటిదో, లోహకారునికి లోహం ఎలాంటిదో, వ్యాసలేఖకుడికి మాటలు ప్రధాన పదార్థాలు. మంచి పదార్థాలతో శిల్పి మంచి రూపాన్ని కల్పించినట్లుగా, మేలి మాటలతో వ్యాసలేఖకుడు ఉత్తమ వ్యాసాన్ని రాస్తున్నాడని వావిలికొలను సుబ్బారావుగారు అన్నారు. వ్యాసపరిచ్ఛేదంలో ఉన్న కొన్ని నియమాలను కొన్నింటిని ఈ క్రింద చర్చిస్తున్నాను.

## 9.1.1 జ్ఞాన సంపాదన

ప్రతిమనిషీ జ్ఞానం సంపాదించడానికి ప్రయత్నించాలి. జ్ఞానహీనుడు పశు సమానుడు. ఈ జ్ఞానం 1. బహుగ్రంథపఠనము 2. వివేకము 3. మననము

వివేకము: చదివేటప్పుడు ఇతర విషయాలపైకి పోనీయయకుండా దృష్టిని ఒకేచోట కేంద్రీకరించి అనుకున్న విధంగా భావ ప్రసారం జరుగుతుందో లేదో గమనిస్తూ తప్పొప్పుల విచారణ చేయాలి.

మననము: ఒక పుస్తకాన్ని పూర్తిగా చదివిన తర్వాత ఆ చదివిన విషయాన్ని మళ్ళీ మళ్ళీ మనస్సుకు ఎక్కించుకోవాలి.

## 9.1.2 బహుగ్రంథపఠనము

పాఠ్యక్రమాన్ని అనుసరించి మాత్రమే కాక ఇతర పుస్తకాలనూ విద్యార్థులు చదవవలసిన ఆవశ్యకత ఉంది. ప్రయోజనకరం కాని పుస్తకాలను ఎంత తక్కువగా చదివితే అంత మంచిది. ఇట్లా అనేక గ్రంథాలు చదవడం వల్ల విషయంపై పూర్తిస్థాయి అవగాహన ఏర్పడుతుంది. ఉత్తమమైన వ్యాస రచనకు అది అవసరం.

## 9.1.3 పద సామాగ్రి

మనుషులు మాట్లాడే పదాలన్ని వ్యాసరచనకు ఉపయోగపడవు. గ్రంథ రచనలో కొన్ని పదాలు కొంత అసౌకర్యాన్ని కల్గిస్తాయి. పదాలను సరైన క్రమంలో ప్రయోగించకపోయిన, ఆ పదానికి ఉన్న పర్యాయపదాలు, నానార్థాలు తెలియకపోయినా ఎటువంటి అనర్థాలు జరుగుతాయో కొన్ని ఉదాహరణలతో వావిలికొలనువారు పేర్కొన్నారు.

**ఉదాహరణ:** వాడు ప్రాతఃకాలంబున లేచి యధావిధి యుషః కాలకృత్యంబులు దీర్చె.

ఉషస్సు– ప్రాతఃకాలం అనే పదాలు సమానార్థకాలు. ఐనప్పటికి వాటి మధ్య కొద్దిపాటి వ్యత్యాసం ఉంది. రోజులో 55 వ గడియ కాలానికి ఉషస్సు అని పేరు. రోజులో 58 వ గడియకాలానికి ప్రాతఃకాలం అని పేరు. కాబట్టి ప్రాతఃకాలంలో లేచినవాడు ఉషకాలంలో జరిగే యధావిధి కార్యక్రమాలు చేయలేడు.

## 9.1.4 సంస్కృత పద జ్ఞానం

సంస్కృత శబ్దాలు ఎన్నో మనకు తెలియకుండానే తెలుగులో ప్రయోగిస్తున్నాం. రెండు భాషల వ్యాకరణ సంప్రదాయాలు వేరు. కాబట్టి ఈ రెండు భాషాపదాల కలిపి రాసేటప్పుడు వాటి సంప్రదాయాలకు భంగం కలగకుండా రాయాలి. వ్యాసలేఖకుడికి ఏది సంస్కృతమో? ఏది తెలుగు శబ్దమో? తెలియకపోతే 'శుద్ధ పప్పు, అనేకమంది, తెప్పోత్సవం' వంటి దుష్ట రూపాలను ప్రయోగిస్తారు.

## 9.1.5 విషయ నిర్ధారణం

రెండు మూడు విషయాలు ఇచ్చి ఏదైనా ఒక అంశం గురించి వ్యాసం రాయమన్నప్పుడు ముందుగా వాటిలో ఒక అంశాన్ని మాత్రమే ఎంచుకోవాలి. ఆ అంశాన్ని ప్రకరణాలుగా విభజించి వరుస క్రమంలో రాయాలి. అలా విభజించి రాయడం వల్ల అప్రస్తుత ప్రశంసలతో కాలం వృథా కాకుండా ఉంటుంది.

## 9.1.6 శైలి

మన మనస్సులోని అభిప్రాయాన్ని వేరొకరి మనస్సులో పుట్టించడానికి భావబోధక శబ్దాలతో వాక్య పరంపరగా కూర్చడం 'శైలి' అని వావిలికొలనువారు నిర్వచించారు. ఉత్తరాల శైలి, ఉపన్యాస శైలి, వ్యాస శైలి, కావ్యశైలి, పురాణ శైలి వేరుగా ఉంటాయి. ఆచార వ్యవహారాలను ధర్మశాస్త్రం లాగా శైలిని వ్యాకరణాలంకార శాస్త్రాలు శాసిస్తాయి. వ్యాకరణం అపశబ్దాది దోషాలను లేకుండా చేస్తుంది. అలంకార శాస్త్రం ఆ విషయాన్ని అలంకరించి రమణీయంగా చెప్తుంది.

### 9.1.7 దోషములు

వావిలికొలనువారు శబ్ద, వాక్య, అర్థ అని మూడు రకాల దోషాలను ప్రస్తావించారు. వాటిలో కొన్నింటిని క్రింద ప్రస్తావిస్తాను.

#### 9.1.7.1 వర్ణ వైరూప్యం

వర్ణ ఆకార సారూప్యం చేత ఒక అక్షరం బదులు ఇంకొక అక్షరం రాయడాన్ని ***వర్ణ వైరూప్యం*** అంటారు. కొందరు విద్యార్థులు 'ఖ'కారం బదులు'భ' కారం, 'ఘ'కారం బదులు 'ఫు'కారం రాస్తుంటారు.

#### 9.1.7.2 అక్రమం

వాక్యంలో మొదటి పదాల వరుసను క్రమం తప్పించి రాయకూడదు. ఉదాహరణకు **'రామ భరత లక్ష్మణ శత్రుఘ్నులు'** అని ఇలా క్రమం తప్పించి రాయడాన్ని అక్రమం అంటారు.

#### 9.1.7.3 వ్యర్థము

వాక్యంలో ప్రయోజనంలేని మాటలను వ్యర్థపదాలనవచ్చు. ఉదాహరణకు '**నురుగుతో నిండిన సముద్రమును హనుమంతుడు దాటెను**'. ఇందులో ' నురుగుతో నిండిన' అనే పదాలు వ్యర్థాలు.

#### 9.1.7.4 పునరుక్తి

ఒక మాటను చెప్పి మళ్ళీ అదే అర్థం వచ్చే మరో వాక్యాన్ని చెప్పినట్లైతే దాన్నే పునరుక్తి దోషం అంటారు. ఇది మళ్ళీ శబ్ద పునరుక్తి, అర్థ పునరుక్తి అని రెండు రకాలు.

#### 9.1.7.5 అపూర్ణము

ఒక వాక్యంలో క్రియాన్వయం సరిపోకపోతే దాన్ని అపూర్ణము అని అంటారు.

### 9.1.7.6 అప్రతీతము

అందరికీ తెలిసిన పదాలు కాక కొన్ని శాస్త్రాల్లో మాత్రమే ప్రసిద్ధమైన పదాలు శాస్త్ర సంబంధిత వ్యాసాలలో పనికి వస్తాయేమో గానీ సామాన్య వ్యాసాలలో పనికిరావు.

ఉదా. ప్రమాణము నిన్ను రక్షించుగాక.

విష్ణుసహస్రనామాల్లో ప్రమాణము అనేది విష్ణువు పేరు. ఇది అప్రతీతము.

### 9.1.7.7 దూరాన్వయము

అవసరము లేకపోయినా బంధుత్వాన్ని సాగతీసి చెప్పడం. ఒకవేళ దూరపు బంధువు అని చెప్పే సందర్భంలో అది గుణమే కానీ మిగతా సందర్భాల్లో అది దోషమే అవుతుంది.

ఇవే కాక ప్రాచీన మహకవులు వాడిన పదాలు అనేకం నేడు ఆ అర్థాల్లో వాడుకలో లేవు. వాటిని ఈ కాలంలో ప్రాచీన అర్థంలో వాడడం.

ఉదా. పన్నీరు పువ్వెంత మంచి కంపు కొట్టుచున్నది.

ఈ వాక్యంలో కంపు అనే పదానికి నన్నయ కాలంలో సువాసన అనే అర్థం ఉంది. కానీ నేడు కంపు అంటే దుర్గంధం అని అర్థం.

### 9.1.7.8 సందిగ్ధము

వాక్యంలో ఒక శబ్దం ఏ పదంతో అన్వయిస్తుందో అర్థం కాకుండా రాయకూడదు.

ఉదా. లక్ష్మణుడు రాముని ఇంటికి వెళ్ళాడు. అతడు చాలా సుకుమారుడు. ఈ వాక్యంలో అతడు అనేది రామునితో అన్వయిస్తుందా? లేదా లక్ష్మణునితో అన్వయిస్తుందా అనే సందేహం ఏర్పడుతుంది.

### 9.1.7.9 అప్రయుక్తము

వ్యాకరణ విరుద్ధంగా నిత్యైకవచనాలకు బహువచనాలు, పుంలింగానికి నపుంసకలింగం చేర్చి వాక్యాలు తయారుచేయడం.

ఉదా. ఆపత్కాలమున నా ఇష్ట దైవతుఁడు నన్ను కాపాడుగాక.

ఇందులో దైవత శబ్దానికి పుంలింగం వాడబడింది. నిజానికి ఈ శబ్దం పుంలింగంలో ఉపయోగించకూడదు.

## 9.1.7.10 అపసంస్కృతము

దర్శనము స్పర్శనము అనే పదాలను దరిశనము, స్పరిశనము అని విడదీసి రాయడం అపసంస్కృతము అనబడుతుంది.

## 9.1.7.11 అశ్లీలము

ఒక వాక్యాన్ని సరిగ్గా రాయకపోతే ఈ దోషం సంభవిస్తుంది.

ఉదా. వాడు గుహ్యకేశ సమానుదు.

ఇందులో గుహ్యక+ఈశ అనేది అసలు పదం. కానీ వెంటనే గుహ్య+కేశ అనేదే స్ఫురిస్తుంది. ఇలా విపరీతార్థం స్ఫురించే విధంగా వాక్యనిర్మాణం చేయకూడదు.

## 9.1.8 జాతీయం

శైలి జాతీయమై ఉండాలి. వ్యాసం అన్ని విధాలా బాగున్నప్పటికీ, విజాతీయ పదాలను ఉపయోగిస్తే చదవడానికి అంత రమ్యంగా అనిపించదు. కాబట్టి విజాతీయ పదాల అన్వయాన్ని నిరసించాలి. వ్యాసంలో విజాతీయ పదాలు రావడానికి ప్రధానంగా నాలుగు కారణాలు చెప్పారు.

## 9.1.9 సంగ్రహము

సంగ్రహమంటే చెప్పాల్సిన విషయాలు కొన్ని చెప్పి, కొన్ని విడిచి వ్యాసాన్ని చిన్నదిగా చేయడం కాదు. చెప్పాల్సిన విషయాన్ని సారం చెడకుండా మొత్తం చెప్పటమే ముఖ్యం. ప్రయోజనం లేని మాటలతో పుటలు నింపటం వల్ల వ్యాసం పెద్దదై సారహీనమవుతుంది. కొన్ని సందర్భాలలో సంక్షిప్త వాక్యాల కంటే పెంచి రాసిన వ్యాసం బాగుంటుంది.

## 9.1.10 స్పష్టత్వం

వాక్యార్థం స్పష్టంగా ఉండాలి. ప్రత్యాయలు విడిచి ఇష్టం వచ్చిన పదాలు అన్వయం లేకుండా ప్రయోగించకూడదు. సందిగ్ధ దూరాన్వయ దోషాలు వాక్యానికి ఆస్పష్టతని చేకూరుస్తుంది.

## 9.1.11 వాక్యపరిమాణము

వాక్యాలన్ని పొట్టిగా ఉన్నా, పొడుగ్గా ఉన్న అందంగా ఉండవు. సమర్థుడైన లేఖరి సమయోచితంగా రెండిటి ఉపయోగిస్తారు.

## 9.1.12 వాగాడంబరము

నోటి ద్వారా వచ్చే ప్రతి పదాల్ని దీర్ఘ సమాసాలను వ్యాసాలలో రాయకూడదు.

## 9.1.13 అన్యదేశ్యములు

భాషకు అవసరమైన పదం మాతృభాషలో లేనప్పుడు దానికి సరిపడే అన్యదేశ్య పదాలను అక్కడక్కడ వ్యాసాలలో వాడుకోవచ్చు. ఆ పదమైన ఇంతకుముందే రూఢిగా వాడుకలో ఉండాలి. మనకు అవసరమని కొత్త పదాలను కల్పించి అన్యదేశాలను గ్రహించకూడదు.

## 9.1.14 పూర్వకథలు – విప్పుడు కథలు

పూర్వకథలను అనువదించేవారు ముందుగా ఆ కథలను పూర్తిగా తెలుసుకొని రాస్తే బాగుంటుంది. తెలియని విషయాన్ని ప్రస్తావించకపోవడం మంచిది. పురాణాలు, ఇతిహాసాలు చదివిన కొందరు విద్యార్థులు " **కృష్ణార్జునులు పరమమిత్రులు**" అనడానికి బదులుగా " **ధరా పుత్ర వైరియు ధారపౌత్ర వైరియు పరమ మిత్రులు**" వంటి విప్పుడు కథలను వ్యాసాలలో రాస్తుంటారు.

## 9.1.15 పరీక్ష సమయ చర్య

విద్యార్థులు పరీక్షకోసం పరీక్షాశాలకు వెళ్ళినప్పుడు వారు గుర్తుంచుకోవాల్సిన విషయాలను వావిలికొను సుబ్బారావుగారు ఈ విభాగంలో చెప్పారు.

వ్యాసం రాయడానికి ముందు ఇచ్చిన కాగితం ఎడమ వైపు రెండు అంగుళాలు వెడల్పుతో నిలువుగా లోపలి వైపుకి మడవాలి. ఆ మడతలు పరీక్ష పత్రం చేతికి రాకముందే చెయ్యాలి. ప్రతిపాదంలో మొదటి అక్షరం ఆ మడత దగ్గర నుండి మొదలు పెట్టాలి.

వ్యాస లేఖనానికి ఉన్న మూడుగంటల నియతికాలంలో ముందుగా వ్యాస నిర్ధారణ చేసుకొని మొదలు పెట్టాలి. వ్యర్థ ఆలోచనలతో సమయాన్ని వృధా చేయరాదు. పరీక్షకుడిని దృష్టిలో పెట్టుకొని వారి మెప్పు కొసమే వ్యాసం రాయకూడదు. వ్యాసం రాయడానికి పూనుకున్నప్పుడు తెలిసిన విషయాన్ని జాతీయమైన శైలితో రచనను కొనసాగించాలి. అనేక విషయాలు ఒకటిగా రాయకూడదు. అనేక గ్రంథాలు చదివినప్పటికీ విషయాన్ని దుష్ట సంధులతో, వర్ణ క్రమం లేకుండా లక్షణ విరుద్ధమైన భాషతో రాసిన ఆ వ్యాసం అందంగా ఉండదు. చివరి సమయంలో రాసినదంతా ఒకసారి చదవాలి. గుదులు, కొమ్ములు ఏవైనా రాయకపోతే సవరించుకోవాలి.

కేవలం వ్యాకరణ సూత్రాలు నేర్చుకోవడం వల్ల ప్రయోజనం ఉండదని, అవి ఏయే సందర్భాలలో ఏయే సూత్రాల ఆధారంగా రాయాలో తెలియడం ముఖ్యమని వావిలికొలనువారు అన్నారు. కొందరు విద్యార్థులకు వ్యాకరణ సూత్రాలు తెలిసినప్పటికి వారు ప్రయోగించు శబ్దాలను తప్పుగా రాస్తున్నారు. వాటిని దృష్టిలో పెట్టుకొని సంస్కృత శబ్ద దోషాలను, ఆంధ్ర శబ్ద దోషాలను వావిలికొలనువారు కొన్నింటిని పేర్కొన్నారు.

## ముగింపు:

తెలుగు వ్యాకరణాల్లో 'వ్యాస' చర్చ చేసిన గ్రంథాలు చాలా తక్కువుగా ఉన్నాయి. 'వ్యాసపరిచ్ఛేదము' అని ప్రత్యేక శీర్షిక పెట్టి వ్యాస శైలి, వ్యాసుకుని వ్యక్తిత్వ లక్షణాలు, వ్యాసంలో ఉపయోగించాల్సిన భాష మొదలైన వివిధ అంశాలను చర్చించిన మొట్టమొదటి గ్రంథంగా *సులభవ్యాకరణము* కన్పిస్తుంది. ఏదైనా ఒక విషయాన్ని విస్తరించి రాయడం వ్యాసలేఖనమని, ఆ విస్తరించి రాయబడ్డ గ్రంథం వ్యాసమని వావిలికొలను సుబ్బారావుగారు నిర్వచించారు. వ్యాసకుడు ఎలాంటి సమగ్రాతను కలిగి ఉండాలి? వ్యాస శైలి ఎలా ఉండాలి? వాసం ఎలా ఉండాలి వంటి విషయాలను సులభవ్యాకర్త చర్చించారు. బహుగ్రంథ పఠనం, వివేకం, మననం, పదసామగ్రి,

సంస్కృత పద జ్ఞానము, విషయ నిర్ధారణము, పరీక్ష సమయ చర్య మొదలైన అంశాలను ఈ అధ్యాయంలో పరిశీలించడం జరిగింది.

## 10.0 ముగింపు

తెలుగులో వచ్చిన వివరణాత్మక వ్యాకరణాలలో 'సులభవ్యాకరణము' ముఖ్యమైనది. వావిలికొలను సుబ్బారావుగారిని ఆధునికాంధ్ర వ్యాకర్తలలో ప్రామాణికులుగా జి. లలిత, అమరేశం రాజేశ్వరశర్మ వంటి పూర్వ పరిశోధకులు వారి గ్రంథాలలో పేర్కొన్నారు. ఆయన రచించిన ఒకే ఒక్క వ్యాకరణ గ్రంథం 'సులభవ్యాకరణము'. ఇది విద్యార్థులు పరీక్షలలో రాసే తప్పులను దృష్టిలో పెట్టుకొని ఈ వ్యాకరణాన్ని రచించానని వావిలికొలనువారు చెప్పుకున్నారు.

తెలుగుభాషలో వెలువడిన వ్యాకరణ గ్రంథాలలో ప్రతి ఒక్క గ్రంథానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. తెలుగుభాష కోసం కొన్ని వ్యాకరణ గ్రంథాలు సంస్కృతంలో రాశారు. ఆ తర్వాత తెలుగులో రచింపబడ్డాయి. తెలుగులో కావ్యభాషా లక్షణాన్ని తెలిపే గ్రంథాలుగా విశేషమైన ఆదరణ పొందినవి బాల, ప్రౌఢ వ్యాకరణాలు. సామాన్య భాషా లక్షణాన్ని 'బాలవ్యాకరణము' నిర్దేశించగా, అందులో విశేష లక్షణాలను ప్రయోగాలను 'ప్రౌఢ వ్యాకరణము' వివరించింది. వావిలికొలనువారు బాల, ప్రౌఢ వ్యాకరణాల ఆధారంగా విద్యార్థుల కోసం 'సులభవ్యాకరణము' ను మూడు భాగాలుగా రచించారు. విద్యార్థులు పరీక్షలలో రాసే తప్పులను దృష్టిలో పెట్టుకొని ఈ వ్యాకరణాన్ని రచించానని వావిలికొలనువారు చెప్పుకున్నారు. ఈ గ్రంథంలో 'సంజ్ఞా పరిచ్ఛేదం' నుండి 'వ్యాస పరిచ్ఛేదం' వరకు మొత్తం పన్నెండు పరిచ్ఛేదాలు ఉన్నాయి. వీటన్నింటిని ప్రస్తుత నా సిద్ధాంత గ్రంథంలో తొమ్మిది అధ్యాయాలుగా విభజించి పరిశీలించడం జరిగింది.

తెలుగు భాషా వ్యాకరణ చరిత్రలో బాల ప్రౌఢ వ్యాకరణాలు ప్రామాణిక గ్రంథాలు. వీటిని ఆధారంగా చేసుకొని వావిలికొలను సుబ్బారావుగారు రచించిన 'సులభవ్యాకరణము' పరిశీలించడం జరిగింది. బాల, ప్రౌఢ వ్యాకరణాల లోపాలను సవరించడం, విడిచిపెట్టిన అంశాలను పూరించడం, కొన్ని విషయాలను విస్తృతంగా వివరించడం, నూతన అంశాలను పరిచయం చేయడంలో 'సులభవ్యాకరణము' చూపిన ప్రత్యేకతలను విశ్లేషించడం జరిగింది.

## 10.1 పరిశోధనలో గమనించిన ప్రధాన అంశాల క్రోడీకరణ (అధ్యాయాల వారీగా)

పర్యవేక్షకులతో చేసిన నిరంతర సంప్రదింపుల ద్వారా రచించిన పరిశోధన గ్రంథంలోని కొన్ని ప్రధానమైన విశేషాలను అధ్యాయాల ఆధారంగా ఇక్కడ పేర్కొంటున్నాను.

**మొదటి అధ్యాయం:** 'కవి జీవితం– రచనా విశేషాలు' అనే అధ్యాయంలో వావిలికొలను సుబ్బారావుగారికి సంబంధించిన వ్యక్తిగత జీవితం, రచనా విశేషాల గురించి సంక్షిప్తంగా పరిచయం చేయడం జరిగింది.'జననం, బాల్యం– విద్యాభ్యాసం, వివాహ జీవితం, పుణ్యక్షేత్రాల సందర్శనం, శ్రీరామ సేవ, రచనావ్యాసంగం' వంటి శీర్షికలతో మొదటి అధ్యాయాన్ని పూర్తి చేయడం జరిగింది.

**రెండవ అధ్యాయం:** 'సులభవ్యాకరణ నిర్మాణ క్రమం' అనే అధ్యాయంలో '*సులభవ్యాకరణము*' రచనా ఉద్దేశాన్ని చర్చించి, పరిశోధనకి గ్రహించిన *సులభవ్యాకరణ* గ్రంథం ఆధారంగా 'సంజ్ఞా పరిచ్ఛేదం, సంధి పరిచ్ఛేదం, తత్సమ పరిచ్ఛేదం, ఆచ్ఛిక పరిచ్ఛేదం, కారక పరిచ్ఛేదం, సమాస పరిచ్ఛేదం, తద్ధిత పరిచ్ఛేదం, క్రియా పరిచ్ఛేదం, కృదంత పరిచ్ఛేదం, ప్రకీర్ణక పరిచ్ఛేదం, వాక్య పరిచ్ఛేదం, వ్యాస పరిచ్ఛేదం' వంటి శీర్షికలతో నిర్మాణక్రమాన్ని తెలియజేయడం జరిగింది.

**మూడవ అధ్యాయం:** 'వర్ణ విజ్ఞానం' అనే అధ్యాయంలో వర్ణాలు, వర్ణ విభాగ చర్చ, వర్ణోత్పత్తి స్థానాలు, గుణింతాలు, పూర్ణబిందువు, అర్ధ బిందు ప్రస్తావన, తాలవ్యాలు, దంత్యాలు, అంతస్థాలు, తెలుగు పదాలలో మొదటిరాని అక్షరాలు, సంజ్ఞలు, ఆంధ్రభాష: విభజన మొదలైన అంశాలను పరిశీలించడం జరిగింది.

**నాల్గవ అధ్యాయం:** 'సంధి విజ్ఞానం' అనే అధ్యాయంలో 'అత్వసంధి, ఇత్వ సంధి, ఉత్వ సంధి, అన్ని అచ్చులకు సంధి, స్వరలోప సంధులు, కళా సంధులు, ద్రుత సంధులు, సమాసగత సంధులు, నుగాగమ సంధులు, టుగాగమ సంధులు, ఆమ్రేడిత సంధులు, మువర్ణక సంధులు, ధ్వన్యనుకరణ సంధులు, అనుకరణ సంధులు, సంస్కృత శబ్ద సంధులు' మొదలైన సంధులను పరిశీలించడం జరిగింది.

**ఐదవ అధ్యాయం**: 'పదాంశ విజ్ఞానం' అనే అధ్యాయంలో 'తత్సమ పదాల నిర్మాణం, ఆచ్చిక పదాల నిర్మాణం, తద్ధిత పదాల నిర్మాణం, కృదంత పదాల నిర్మాణం' మొదలైన అంశాలను పరిశీలించడం జరిగింది.

**ఆరవ అధ్యాయం**: 'సమాస విజ్ఞానం' అనే అధ్యాయంలో 'ద్వంద్వ సమాసం, తత్పురుష సమాసం, బహువ్రీహి సమాసం, అవ్యయీభావ సమాసం' వాటిలోని ఉప విభాగాలను పరిశీలించడం జరిగింది.

**ఏడవ అధ్యాయం**: 'క్రియారూప విజ్ఞానం' అనే అధ్యాయంలో సమాక క్రియలు లైన 'వర్తమానార్థకం, భూతార్థకం, భవిష్యదర్థకం, తద్ధర్మాదులు, ఆశీశ్శాప సంప్రార్థనా విధులు, వ్యతిరేకార్థకాల్ని, అసమాపక క్రియలైన 'భావర్థకం, క్త్వార్థం, చేదర్థకం, ఆనంతర్యార్థకం, శత్రర్థకాలను,' ధాతుజ విశేషణాలు, ఇంచుక్ ప్రకరణం– ప్రేరణార్థక క్రియలను పరిశీలించడం జరిగింది.

**ఎనిమిదవ అధ్యాయం**: 'కారక, వాక్య–విజ్ఞానాలు'. ఈ అధ్యాయంలో మొదటగా 'కారక విజ్ఞానానికి సంబంధించి విషయాలను చర్చించడం జరిగింది. తర్వాత 'వాక్య విజ్ఞానానికి' సంబంధించి పదం, సంబోధనార్థం, నిత్య ఏకవచనాలు, నిత్య బహువచనాలు, కర్తృర్థక వాక్యాలు, విశేషణార్థక వాక్యాలు, అస్మద్– యుష్మద్ వాక్యాలు, కాలబోధక వాక్యాలు, అధ్యాహార్యం, సమాసం, విభక్తులు మొదలైన అంశాలు పరిశీలించడం జరిగింది.

**తొమ్మిదవ అధ్యాయం**: 'వ్యాస విజ్ఞానం' అనే అధ్యాయంలో వ్యాసకుడికి గాని, వ్యాసానికిగాని తోడ్పడే 'పద సామాగ్రి, సంస్కృత పద విజ్ఞానం, విషయ నిర్ధారణం, శైలి, దోషములు, జాతీయం, సంగ్రహము, స్పష్టత్వం, వాక్య పరిణామం, వాగాడంబరం, అన్యదేశ్యాలు, పూర్వకథలు– విప్పుడు కథలు, పరీక్ష సమయ చర్య వంటి విషయాలను  చర్చించడం జరిగింది.

## 10.2 పరిశోధన ఫలితాలు

నా పరిశోధన ఆధారంగా విభజించుకున్న తొమ్మిది అధ్యాయాలలోని కొన్ని ముఖ్యమైన విశేషాలను, నూతన అంశాలను ఈ క్రింద పేర్కొంటున్నాను.

### మొదటి అధ్యాయం: కవి జీవితం– రచనా విశేషాలు

1. తెలుగు సాహిత్య రంగాన్ని సస్యవంతం చేసిన మహానుభావులు, మహాయోగి శ్రీ వావిలికొలను సుబ్బారావుగారు. సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషా సాహిత్యాలలో పాండిత్యం సంపాదించి ఎన్నో భక్తి పరమైన, జ్ఞాన పరమైన, ముక్తి పరమైన రచనలను చేసి 'ఆంధ్రవాల్మీకిగా, వాసుదాసస్వామిగా' ఆంధ్రదేశంలో స్థానం సంపాదించారు.
2. వావిలికొలను సుబ్బారావుగారు బాలలను ఉద్దేశించి ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి నుండి పఠించడానికి వీలుగా ఆర్య నీతి కథలను ఎనిమిది భాగాలుగా *'ఆర్య కథానిధులు'* అనే పేరుతో రచించారు.
3. వావిలికొలను సుబ్బారావుగారు ఆంధ్ర ప్రజల హితాన్ని ఆశించి బాల్యం నుండి జీవితం ఉత్తమ పథంలో నడవడానికి వీలుగా 'హితచర్య మాలికా' గ్రంథాలను రచించారు.
4. వావిలికొలను సుబ్బారావుగారు *'ఆంధ్రవాల్మీకి రామాయణానికి' 'మందరము'* అనే పేరుతో విపులమైన వ్యాఖ్యానం రాశారు. గ్రంథకర్త, వ్యాఖ్యాత ఒక్కరే అవ్వడం వల్ల అన్ని విషయాలు ఉన్నది ఉన్నట్టుగా అందించారని తెలుస్తుంది.

## రెండవ అధ్యాయం: సులభ వ్యాకరణ నిర్మాణ క్రమం

5. వ్యాకరణం, వ్యాకరణ నిర్వచనాలు, సంస్కృతాంధ్ర వ్యాకరణాల పూర్వరంగాన్ని కొంత పరిచయం చేయబడింది.
6. ప్రస్తుతం పరిశోధనకు గ్రహించిన ***సులభవ్యాకరణము*** ప్రతిని తెనాలి సమీపంలోని దాసకుటి క్షేత్రానికి సంబంధించిన 'శ్రీ కోదండరాయ సేవక ధర్మసమాజము' వారు 1963వ సంవత్సరంలో ముద్రించారు. విద్వాన్ బులుసు సూర్యప్రకాశశాస్త్రిగారు ఈ గ్రంథాన్ని పరిశీలించి ముద్రణకు తోడ్పడ్డారు. అప్పటివరకు మూడు భాగాలుగా ఉన్న ***సులభవ్యాకరణాన్ని*** ఒకే సంపుటిలో ముద్రించారని తెలుస్తుంది.
7. వావిలికొలను సుబ్బారావుగారు బాల, ప్రౌఢ వ్యాకరణాల నిర్మాణాన్నే అనుసరించారు. విభాగాలను 'పరిచ్ఛేదాలనే' పిలిచారు. సులభవ్యాకరణంలో సంజ్ఞ, సంధి, తత్సమ, ఆచ్ఛిక, కారక, సమాస, తద్ధిత, క్రియా, కృదంత, ప్రకీర్ణక, వాక్య, వ్యాస పరిచ్ఛేదాలు ఉన్నాయి
8. వావిలికొలను సుబ్బారావుగారు రచించిన *'సులభవ్యాకరణము'* అనే గ్రంథాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు బాల, ప్రౌఢ వ్యాకరణాలకు పూరక గ్రంథంగా కన్పిస్తున్నది.

9. సులభ వ్యాకరణంలో వ్యాకరణాంశాలను సూత్రాలుగా చెప్పేటప్పుడు అవ్యాప్తి, అతివ్యాప్తి దోషాలను వదిలిపెట్టారు.

10. ఒక్కొక్క అంశానికి సంబంధించిన సూత్రాలను ఒకే చోట చెబుతూ ప్రకరణ ఔచిత్యాన్ని పాటించారు.

11. బాల, ప్రౌఢ వ్యాకరణాలలో సూత్రం క్రింద కన్పించే వృత్తి వాక్యాలను కూడా సులభ వ్యాకరణంలో సూత్రంగా చెప్పారు.

## మూడవ అధ్యాయం: వర్ణ విజ్ఞానం

12. బాల, ప్రౌఢ వ్యాకర్తలిద్దరు శకటరేఫని(ఱ) వర్ణంగా పేర్కొనలేదు. సులభ వ్యాకర్త దానిని వర్ణంగా భావించి "తెలుఁగునకు వర్ణములు ముప్పదియేడు" (సులభ. సంజ్ఞ:11)", "*ఆంధ్ర భాషకు వర్ణంబులు లేఁబది యాఱు*" (సులభ. సంజ్ఞ:12) అని సూత్రాలను చెప్పారు.

13. వావిలికొలనువారు 'వర్ణ విభాగ ప్రకరణం' లో వర్ణాల పేర్లను(సంజ్ఞలను), వాటి ఉత్పత్తి స్థానాలను చెప్పారు.

14. బాల, ప్రౌఢ వ్యాకర్తలు చెప్పిన విషయాలనే కాక 'అనుస్వారం' ఇంకా ఏయే సందర్భాలలో వస్తుందో, ఏ సందర్భాలలో రాదో వంటి నూతన అంశాలను సులభ వ్యాకర్త సూత్రీకరించారు.

15. అర్ధ బిందువు గురించి విపులమైన చర్చ వావిలికొలనువారు ***సులభ వ్యాకరణం***లో చేశారు. బాల ప్రౌఢ వ్యాకరణాలు అర్ధబిందువు గురించి పెద్దగా చర్చించలేదు.

16. అచ్చ తెలుగులో చజలు ఐకారంతో కలిసి ఉండవు. తెలుగు మాటలలో కనిపించకపోయిన తత్సమ రూపాలలో కన్పిస్తున్నాయని 'చైత్రము-జైత్రుడు' వంటి రూపాలను సులభవ్యాకర్త పేర్కొన్నారు. (సులభ. సంజ్ఞ:37)

17. బాల, ప్రౌఢ, సులభ వ్యాకర్తలు ముగ్గురూ 'రాజు' శబ్దాన్ని సంస్కృత సమంగా భావించారని తెలుస్తుంది. (సులభ. సంజ్ఞ:39)

18. సులభ వ్యాకర్త సంజ్ఞాపరిచ్ఛేదంలో 'యె' అనే అక్షరం సంధి వల్ల కాకుండా పదాల మధ్య ఎక్కడెక్కడ వస్తుందో(47-48) రెండు సూత్రాలలో వివరించారు. ఈ 'యె' కార చర్చ బాల, ప్రౌఢ వ్యాకర్తలు చేయలేదు.

19. సంయుక్తాక్షరాలలో, క్రియాంత రూపాలలో అలఘురేఫం లేదని, అలాగే ద్విత్వాక్షరాలలో లఘురేఫం లేదని సులభ వ్యాకర్త చెప్పారు. (సులభ. సంజ్ఞ:43)

20. బాలవ్యాకర్త చెప్పిన 'యకారం, వు, వూ వొ వో' లతో పాటుగా 'ఙ–ళ' అనే అక్షరాలు కూడా తెలుగు పదాలలో మొదటగా ఉండవని సులభవ్యాకర్త చెప్పారు. (సులభ. సంజ్ఞ:49)

21. వావిలకొలనువారు రేఫతో కూడిన సంయుక్తాక్షరాలు తప్ప, వేరే హల్లుతో కూడుకొన్న సంయుక్త అక్షరాలు తెలుగు మాటలలో మొదటగా ఉండవని చెప్పారు. ఉదాహరణకు 'వ్రాలు, ప్రాలు' ఇవి తెలుగు మాటలు. (సులభ. సంజ్ఞ:49)

22. బాలవ్యాకరణంలో సూత్ర రూపంలో చెప్పిన సంజ్ఞలను వావిలికొలనువారు కూడా సూత్ర రూపంలోనే చెప్పారు.

23. బాల వ్యాకరణంలో సందర్భోచితంగా ఆయా పరిచ్ఛేదంలో చెప్పిన విశేష సంజ్ఞలను కూడా సులభవ్యాకర్త సూత్రాలుగా నిర్వచించారు.

24. సులభ వ్యాకర్త కొన్ని సంజ్ఞలను బాలవ్యాకరణం నుండి మాత్రమే కాక, కొన్ని పాణినీయము, ఆంధ్రశబ్ద చింతామణిల నుండి కూడా గ్రహించారని తెలుస్తుంది.

25. బాలవ్యాకరణంలో చెప్పిన విధంగానే వావిలికొలనువారు కళలను, ద్రుత ప్రకృతికాలను సూత్రీకరించారు. వావిలికొలనువారు 'ఆంధ్ర శబ్దచింతామణి' లాగా ముందుగా కళలను చర్చించారు.

26. బాల వ్యాకరణంలో చిన్నయసూరి చెప్పినట్లుగానే ఆంధ్ర భాషా పదాలను 'తద్భవ, తత్సమ, దేశ్య, గ్రామ్య' అని నాలుగు రకాలుగా వర్గీకరించారు.

27. వావిలికొలనువారు దేశ్యాలతోపాటుగా అన్యదేశ్యాల చర్చ కూడా చేశారు. ఆంధ్రులు ఇతర భాషల నుండి తమ భాషలోకి చేర్చుకొనే పదాలను అన్యదేశ్యాలు అంటారు. ఉదాహరణకు 'పురే' ఇది మరాఠీ భాషా పదం. దీనికి 'చాలు' అని అర్థం. ఇది ప్రశంసార్థకమైన 'బాపురే' నుండి ఏర్పడినది కాదని చెప్పారు.

28. సులభ వ్యాకర్త గ్రామ్యాలుగా ఉన్న కొన్ని పదాలను పెద్దలు ఉపయోగించారని వాటిని (కఱకంఠుడు, కపిల గడ్డము)'అనింద్య గ్రామ్యాల'ని అంటారని బాలవ్యాకర్తతో ఏకీభవించెను. 'కఱ కంఠుడు' వంటివి తద్భవాలవుతాయని చెప్పిన ప్రౌఢవ్యాకర్త అభిప్రాయాన్ని అంగీకరించలేదని తెలుస్తుంది.

29. నామవాచకాలలో ఉండే బిరుదులు శాస్త్రానికి విరుద్ధమైనప్పటికీ వాటిని మార్చకుండా ఉన్నది ఉన్నట్టుగా రాయాలని చెప్పారు. ఉదాహరణకు ' రామారెడ్డి, సీతారావు, సుబ్బారాయుడు'. (సులభ. సంజ్ఞ:75)

30. నిందార్థంలో, అనుకరణార్థంలో గ్రామ్య పదాలు ప్రయోగించవచ్చుగాని, ఉత్తమ కావ్యాలలో ఉండకూడదు, అధమ కావ్యాలలో ఉండవచ్చని నిర్వచించారు.

31. మహాకవులు ప్రయోగించిన ప్రసిద్ధమైన పదాలనే ప్రయోగించాలి గాని, వారు ఇష్ట ప్రకారం కొండగుర్తులు పెట్టుకున్న పదాలు ప్రయోగించకూడదని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'సదా పశ్యంతిగాడు'.

32. పూర్వకవుల ప్రయోగాలలో కొన్ని పదాలు కనిపించకపోయినా, శాస్త్ర నిషిద్ధం గాని దేశ్య భాషా పదాలను ప్రయోగించవచ్చని సులభవ్యాకర్త చెప్పారు.

## నాల్గవ అధ్యాయం: సంధి విజ్ఞానం

33. వావిలికొలను సుబ్బారావుగారు 'సంధి' లక్షణాన్ని చిన్నయసూరిగారు చెప్పిన నిర్వచనాన్నే స్వీకరించి "**పూర్వపరస్వరంబులకుం బరస్వరం బేకాదేశంబగుట సంధి**" (సులభ. సంధి:1) అని సంధి గురించి చెప్పారు.

34. సులభ వ్యాకర్త 'సంధి పరిచ్ఛేదంలో' ఉత్వసంధి కాకుండా అత్వ సంధినే మొదటగా చెప్పారు.

35. ఇకారాంత నామాలకు శ్రేష్ఠార్థాన్ని ఇచ్చే అన్నాదులు(అన్న, అయ్య, అక్క, అమ్మ) పరంగా ఉంటే సంధి ప్రాయకంగా వస్తుందని చెప్పారు. అంటే కొన్నిచోట్ల సంధి జరగక యడాగమం వస్తుంది. ఉదాహరణకు 'లక్ష్మి+ అమ్మ= లక్ష్మమ్మ', అమ్మాజి +అమ్మ =అమ్మాజమ్మ, అమ్మాజియమ్మ'. (సులభ. సంధి:5)

36. రూపాంతరం వల్ల ద్విత్వం కలిగిన ఉకారాంత శబ్దాలకు(కను– కన్ను, మిను–మిన్ను) అచ్చు పరమైనప్పుడు సంధి జరగదు. ఉదాహరణకు 'కన్ను+ అదిరె= కన్నదరె' అవుతుంది. 'కను+ అదరె= కనదరె' అని చెప్పకూడదు. పైన చెప్పబడిన సూత్రం బాల, ప్రౌఢ వ్యాకరణాలలో చెప్పలేదు. (సులభ. సంధి:12)

37. సులభవ్యాకర్త 'కర్త, సమాపకక్రియ కలిగి సంపూర్ణమైన అర్థంగల శబ్ద సమూహాన్ని, పద్యములలో ఉండే ఒక్కొక్క పాదాన్ని వాక్యమని' చెప్పారు. (సులభ. సంధి:13)

38. సులభవ్యాకర్త ‘అందు, అవ శబ్దాల లాగా ‘అంత’ అనే శబ్దానికి కూడా ప్రయోగానుసారం సంధి జరుగుతుందని చెప్పారు. ఉదాహరణకు ‘గంప+అంత= గంపంత, గంప యంత’. (సులభ. సంధి:14)

39. సులభవ్యాకర్త పరిమాణార్థంలో ‘ఏసి’ శబ్దం వస్తుందని, అది పరమైనప్పుడు అన్ని అచ్చులకు సంధి నిత్యంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు ‘గంపడు+ఏసి= గంపడేసి. (సులభ. సంధి:15)

40. దీర్ఘమైన అచ్చుకు అచ్చులు పరమైనపుడు సంధి జరగదని అర్థం. సంధి రాని సందర్భాలలో ‘యట్’ ప్రత్యయం ఆగమంగా వస్తుంది. (సులభ. సంధి:16)

41. వ్యాకరణంలో కాకుండా వేరే చోట్ల చెప్పేటప్పుడు ఒక మాట రెండు, మూడు సార్లు చెప్తే వాటిలోని మొదటి శబ్దం కాకుండా మిగిలిన ప్రతి శబ్దం ఆమ్రేడితం అని సులభవ్యాకర్త చెప్పారు. (సులభ. సంధి:17)

42. హల్లు పరమైనప్పుడు ‘ఏని’ లోని ఇకారానికి లోపం వికల్పంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు ‘వచ్చెనేని చూచెద’ ఇకారం లోపించగా ‘వచ్చెనేన్ జూచెద– వచ్చె జూచెద’. (సులభ. సంధి:18)

43. అచ్చతెలుగు పదాల మధ్యలో అచ్చు లోపంచడం అనేది కొన్ని చోట్ల ఉకారానికి మాత్రమే కాక ఇతర అచ్చులైన అకారం, ఇకారం ఉన్నపుడు కూడా జరుగుతుందని ప్రయోగాలు కన్పిస్తున్నాయి. ఉదాహరణకు ‘చూడికి– చూడ్కి’, కలికి– కల్కి, పొలఁతి– పొల్తి, మెలఁత– మెల్త’. (సులభ. సంధి:22)

44. ద్రుతప్రకృతాలకు అచ్చు పరమమైనప్పుడు లోపం గాని, సంశ్లేష గాని చెప్పకూడదు. ఒకవేళ పూర్వ కవుల ప్రయోగాలలో అటువంటి రూపాలు కన్పించినా వాటిని అనుసరించరాదని వావిలికొలనువారు చెప్పారు. (సులభ. సంధి:29)

45. ద్విత్వంతో కూడిన ను, లు, ఱు మొదలైన వర్ణాలు చివరగల శబ్దాలకు హల్లు ఆది శబ్దాలు పరమై సమాసం ఏర్పడేటప్పుడు ద్విత్వం వికల్పంగా లోపిస్తుంది. ఉదాహరణకు ‘మిన్ను+వాఁక= మిన్నువాఁక,‘మినువాఁక’(సులభ. సంధి:42)

46. పట్టి ప్రత్యయం పరమైతే అన్నిచోట్లా 'ను' ఆగమంగా వస్తుంది. ఉదాహరణకు 'జ్ఞానముంబట్టి మోక్షము'. (సులభ. సంధి:51)

47. బాలవ్యాకర్త కర్మధారయ సమాసంలో 'టు' వర్ణ ఆగమాన్ని నిత్యంగా చెప్పారు. కాని సులభవ్యాకర్త 'టు' వర్ణ ఆగమన్ని బహుళంగా చెప్పారు. (సులభ. సంధి:57)

48. సులభ వ్యాకర్త కొన్ని శబ్దాలలో ఉకారం అంతంగా లేకపోయినప్పటికీ 'టు' వర్ణం ఆగమంగా వస్తుందని చెప్పారు. ఉదాహరణకు 'దుక్కిటెద్దు, తేనెటీగ, పల్లెటూరు'.

49. ధ్వన్యనుకరణ శబ్దాలు రెండు, మూడు, నాలుగు సార్లయిన చెప్పవచ్చును. 'గడ గడ, తళతళ, భగ భగ (సులభ. సంధి:73)

50. ధ్వన్యనుకరణ శబ్దాలకు 'అను' ధాతువు అనుసరించి వచ్చేటప్పుడు మువర్ణం ఆగమంగా వస్తే ద్విత్వం వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ' పటీల్మని'. (సులభ. సంధి:75)

51. సంస్కృత భాషలో ఉండే సుబంతాలు, తిజంతాలు, క్త్వాంతాలు, తుమున్నంతాలు మొదలైన శబ్దాలు ఆంధ్రభాషలో యథాతథంగా ప్రయోగించకూడదు. ఉదాహరణకు 'వాడురాముడు' అనడానికి బదులుగా 'వాడు రామః' అనరాదు. (సులభ. సంధి:77)

52. సదా, సర్వత్రా, నహి, నాస్తి, స్వస్తి ఈ శబ్దాలకు తెలుగు భాషలో స్వతంత్ర ప్రయోగం కనిపిస్తుంది.

53. నిషేధించ బడిన సంస్కృత శబ్దాలకు 'అను' ధాతువు పరంగా వస్తే ఆంధ్ర భాషలో ప్రయోగార్హతను పొందుతాయి. అనుకరణం అనగా ' అను' ధాతువు పరంగా కలిగినవి అని అర్థం. 'అను' ధాతువు చేరేటప్పుడు సంస్కృత శబ్దాలలో కొన్ని మార్పులు వస్తాయి. (సులభ. సంధి:81)

54. ద్విత్వంతో కూడిన హల్లు వేరొక హల్లుతో కలిసి సంయుక్తంగా ఏర్పడేటప్పుడు ద్విత్వానికి లోపం వస్తుంది. ఉదాహరణకు 'గొడ్డురాలు– గొడ్రాలు', (సులభ. సంధి:89)

55. అపవాద రూపాలు కొన్ని ప్రయోగించవచ్చుగాని ఎక్కువుగా ప్రయోగించకూడదు. ప్రామాణిక గ్రంథాలలో నిర్బంధం వల్లగాని, ప్రమాదం వల్లగాని ప్రయోగించబడినవి ప్రమాణంగ తీసుకొనరాదు. (సులభ. సంధి:90)

56. వావిలికొలనువారు మాహేశ్వర సూత్రాలను అనుసరించి ప్రత్యాహారాల ద్వారా సంస్కృత సంధులను సూత్రీకరించారు. గుణాలు, వృద్ధులు వంటి సంజ్ఞలను సూత్ర రూపంలో నిర్వచించారు.

57. సంస్కృత సంధులలైన సవర్ణదీర్ఘసంధి, యణాదేశ సంధి, పరరూప సంధి, అవాంజదేశ సంధి, ప్రకృతిభావ సంధి, శ్చుత్వ సంధి, ష్టుత్వసంధి, జశ్త్వ సంధి, అనునాశిక సంధి, పూర్వ సవర్ణ సంధి, విసర్గ సంధి, స్వాది సంధి మొదలైన సంధులను సూత్రరూపంలో సులభవ్యాకర్త నిర్వచించారు.

## ఐదవ అధ్యాయం: పదాంశ విజ్ఞానం

58. సులభవ్యాకర్త విభక్తి ప్రత్యయాలను పేర్కొంటూ 'సంబోధనా ప్రథమా విభక్తి' ని కూడా సూత్రంలో చెప్పారు.(సులభ. తత్సమ: 8)

59. సులభవ్యాకర్త 'లు' తో పాటుగా 'ల' అనే ప్రత్యయాన్ని కూడా బహువచనంలో ప్రత్యేకంగా చెప్పారు. (సులభ. తత్సమ:10)

60. బాలవ్యాకర్త శబ్దాలను ఎన్నిరకాలుగా ఉంటాయో వాటిని ఏమని పిలుస్తారో వంటి విషయాలు ఒకేచోట వివరించలేదు. సందర్భోచితంగా చెప్పుకుంటూ వెళ్లారు, కాని సులభ వ్యాకర్త వాటన్నింటిని ఒకేచోట ఆరు సూత్రాలలో ప్రస్తావించారు.

61. నీచ, మూర్ఖ, ధూర్త, వృద్ధ, గృహస్థ, భ్రష్ట, చార్వాక శబ్దాలకు ఉకారం వస్తుంది. 'దుఙ్' వికల్పంగా వస్తుంది. ఉదాహరణకు ''నీచు సుయోధనుడు– నీచుఁడు సుయోధనుడు' అనే రూపాలు ఏర్పడ్డాయి. 'నీచ' శబ్దానికి 'దుఙ్' వచ్చినపుడు 'నీచుఁడు' అని , 'దుఙ్ రానపుడు 'నీచ' అని ఉంటుందని సందేహించకూడదని విద్యార్థుల కోసం ఈ సూత్రం చెప్పానని సులభవ్యాకర్త చెప్పారు. (సులభ. తత్సమ: 20)

62. 'భట్ట' శబ్దానికి ఉకారం మాత్రం వస్తుందని 'దుఙ్' రాదని 'నన్నయ భట్టు', నారాయణ భట్టు' వంటి ఉదాహరణలను పేర్కొన్నారు. (సులభ. తత్సమ: 21)

63. సులభవ్యాకర్త 'ప్రభవ, విభవ' మొదలైన తెలుగు సంవత్సరాల పేర్లను స్త్రీ సమాలుగా, తెలుగు మాసాలుగా చెప్పబడే 'చైత్రం, వైశాఖం'మొదలైన వాటిని నపుంసక లింగాలుగా చెప్పారు. వీటిని బాల, ప్రౌఢ వ్యాకర్తలు చర్చించలేదు. (సులభ. తత్సమ: 75,76)

64. ప్రథమా ఏకవచన ప్రత్యయాలైన 'డు,ము,వు,లు' ఇకారం చివరగల శబ్దాలకు రావు . ఉదాహరణకు 'హరి, మతి'. (సులభ. తత్సమ: 30)

65. ఇకారం అంతంగా గల శబ్దాలకు బహువచన ప్రత్యయం పరంగా వచ్చేటప్పుడు ఉపధగా ఉండే 'శ' వర్ణానికి 'స' వర్ణం వస్తుంది. ఉదాహరణకు 'రాశి+లు =రాసులు'. (సులభ. తత్సమ: 74)

66. బహువచనాన్ని తెలిపే లువర్ణం పరమైతే 'వు' వర్ణం ఆగమం బహుళంగా వస్తుంది. ఉదాహరణకు ' గురువులు- గురులు', (సులభ. తత్సమ: 32)

67. ఊకారాంతాలకు తప్ప దీర్ఘాలైన ఏక అక్షరాలకు ప్రథమావిభక్తి ప్రత్యయాలు రావు. ఉదాహరణకు 'భ్రూవు'. (సులభ. తత్సమ: 42)

68. ఏకాది గణాలలో చేరిన ఒక్కడు-వాడు- వీడు- మగడు' మొదలైన శబ్దాలు కాకుండా మిగిలిన అచ్చతెలుగు శబ్దాలన్ని స్త్రీ సమాలుగా గానీ, క్లీబ సమాలుగా గాని అవుతాయి. (సులభ. ఆచ్ఛిక:1)

69. 'పగత' శబ్దం మహద్వాచకంగా, మహతీ వాచకంగా ప్రయోగించేటప్పుడు సంస్కృత శబ్దాలతో సమానమైనది. అనగా 'పగత' శబ్దం మహద్వాచక మైనపుడు 'పగతుఁడు' అవుతుంది. 'పగత' శబ్దం మహతీవాచకమైనపుడు 'ఆలు' శబ్దంతో సమాసమై ' పగతురాలు' అవుతుంది. 'పగత' శబ్దానికి 'పగతము' అని అమహద్వాచక రూపం లేదని సులభవ్యాకర్త చెప్పారు. (సులభ. ఆచ్ఛిక:3)

70. బాలవ్యాకర్త 'కూఁతు' శబ్దాన్ని గ్రహించి దానికి 'రు' వర్ణం వస్తుందని మాత్రమే చెప్పారు. సులభవ్యాకర్త 'కూతురు' శబ్దాన్ని తీసుకొని 'లు' మొదలైన ప్రత్యయాలు పరమైనపుడు రేఫకి లోపం వస్తుందని చెప్పారు. (సులభ. ఆచ్ఛిక:15)

71. ఒక' అనే శబ్దానికి 'అన్ని, అంత' అనే సర్వనామాలు పరమైనపుడు వర్ణవ్యత్యయంతో కూడిన సంయోగం కల్గుతుందని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు 'ఒక+ అన్ని= ఒక+ న్ని=కఒ+న్ని=కొన్ని, ఒక+అంత= ఒక+ంత= కఒ+ంత= కొంత'. ఇలాంటి రూపసాధనని బాల, ప్రౌఢ వ్యాకరణాలు చెప్పలేదు. (సులభ. ఆచ్ఛిక:35)

72. బాలవ్యాకర్త సర్వనామాల క్రింద చెప్పిన విషయాలలో వివిధ అర్థాలలో సర్వనామ రూపాలు ఇలా ఉంటాయని చెప్పారు తప్ప వాటి ప్రక్రియ చెప్పలేదు. సులభవ్యాకర్త వాటి ప్రక్రియ కూడా చెప్పారు.

73. సులభవ్యాకర్త బాల, ప్రౌఢ వ్యాకరణంలోని చెప్పబడిన తద్ధిత ప్రత్యయాలను స్వీకరించి తద్ధిత కార్యాలు చేశారు.

74. సులభవ్యాకర్త 'కాఁడు' ప్రత్యయం కొన్నిసార్లు తత్సమాల మీద కనబడుతున్నదని చెప్పారు. ఉదాహరణకు 'లిపికాఁడు'. కార్యగాఁడు'. బాల, ప్రౌఢ వ్యాకర్తలు ఈ విషయాన్ని చర్చించలేదు. (సులభ. తద్ధిత:22)

## ఆరవ అధ్యాయం: సమాస విజ్ఞానం

75. సులభ వ్యాకర్త ప్రసిద్ధమైన పదాలు కలిసి ఒక పదంగా ఏర్పడటం సమాసమని చెప్పారు. (సులభ. సమాస:1)

76. అచ్చ తెలుగు పదాలతో ఏర్పడే సమాసాన్ని ఆచ్ఛిక సమాసం అంటారు. ఈ ఆచ్ఛికసమాసాన్ని 'సమాసకం' అంటారని సులభవ్యాకర్త చెప్పారు. ఉదాహరణకు ' గొంతి కొడుకు'. 'అలరుఁ దేనియ'. (సులభ. సమాస:5)

77. మిశ్రసమాసంలో మొదట సంస్కృతశబ్దం ఉండదని సులభవ్యాకర్త చెప్పారు. 'బహుమంది, అనేకమార్లు' వంటి ప్రయోగాలు దుష్ట సమాసాలుగా సులభవ్యాకర్త పేర్కొన్నారు. (సులభ. సమాస:6)

78. సమాసాంతంలోని శబ్దం ఏ లింగంలో ఉంటుందో అదే లింగం ఆ సమాసం మొత్తానికి దాని విశేషణానికి కూడా అవుతుంది. ఉదాహరణకు 'సీతా రాములు' ఇందులో చివర ఉన్న 'రామ' శబ్దం పుంలింగం. దాని బహువచనమే సమాసం మొత్తానికి అవుతుంది.

79. ఆరు అక్షరాలు పరిమితిగల తెలుగు శబ్దం తత్సమ శబ్దంతో చేరి సమాసంగా (కర్మధారయ సమాసం) ఏర్పడుతుంది. ఉదాహరణకు 'వాఁడి మయూఖములు'. తెలుగు శబ్దం పూర్వంగా ఉండాలి, శుద్ధ సంస్కృత శబ్దం తెలుగు శబ్దంతో సమసించదు. (సులభ. సమాస:43)

80. సంఖ్యలు, అవ్యయాలు పూర్వ పదాలుగా ఉన్నప్పుడు పరంగా ఉన్న 'అంగుళి' శబ్దం అకారాంతమవుతుంది. సంఖ్య పూర్వానికి ఉదాహరణ 'ద్వ్యంగుళము దారువు'. అనగా

రెండంగుళాల ప్రమాణం గల కొయ్య అని అర్థం. అవ్యయ పూర్వానికి ఉదాహరణ 'నిరంగుళము'. (సులభ. సమాస:53)

81. ఏకదేశ (భాగము) శబ్దాలకు, సంఖ్యను తెలిపే అవ్యయాలకు, 'సర్వ-సంఖ్య- పుణ్య' శబ్దాలకు పరమైన 'రాత్రి' శబ్దం అకారాంతం అవుతుంది. ఏకాదేశం అనగా భాగము అని అర్థం. ఉదాహరణ 'అర్థ రాత్రము, మధ్య రాత్రము, పూర్వ రాత్రము, అపర రాత్రము. సంఖ్య అవయ్యాలకు ఉదాహరణ 'ద్విరాత్రము, త్రిరాత్రము, సప్త రాత్రము. 'సర్వ-సంఖ్య- పుణ్య' శబ్దాలకు ఉదాహరణ ' సర్వ రాత్రము, సంఖ్యా రాత్రము, పుణ్య రాత్రము'. (సులభ. సమాస:54)

82. తెలుగులో ఒక్కొక్కసారి సమాసంలోని పూర్వపదం వ్యవహితంగా ఉన్న ఒక ఉత్తర పదంతోగాని, పెక్కు(చాలా) ఉత్తర పదాలతోగాని అన్వయించబడుతుంది. ఉదాహరణకు 'వాని బలమును తేజమును'. ఇక్కడ 'వాని బలమును వాని తేజమును' అని అర్థం. (సులభ. సమాస:66)

## ఏడవ అధ్యాయం: క్రియారూప విజ్ఞానం

83. సంస్కృత ధాతువులకు 'ఇంచు' చేర్చగా ఏర్పడేవి తత్సమక్రియలని నిర్వచించి 'రంజించు' వంటి ఉదాహరణను సులభవ్యాకర్త పేర్కొన్నారు.

84. అసమాపక క్రియలు రెండు రకాలు. క్రియాకాంక్షా సమాపకాలు, నామాకాంక్షా సమాపకాలు

85. 'క్త్వార్థం' మొదలైన క్రియలు 'క్రియాకాంక్ష అసమాపకాలు. క్రియాజన్య విశేషణాలను 'నామాకాంక్ష అసమాపకాలు' అంటారు. (సులభ. క్రియా:6)

86. క్రియాఫలం కర్తకు చెందినదైతే దానిని 'ఆత్మనేపదం' అంటారు. ఆత్మనే పదాలకు 'కొను' ధాతువు అనుసరించి వస్తుంది. ఉదాహరణకు 'వండుకొనుచున్నాడు'. (సులభ. క్రియా:62)

87. క్రియాఫలం కర్తకు కాక ఇతరులకు చెందితే దానిని పరస్మైపదం అంటారు. ఉదాహరణకు 'వండుచున్నాడు'. ఇక్కడ వంటకము వండినవాడికి మాత్రమే కాక ఇతరులకు కూడా అని అర్థం. (సులభ. క్రియా:61)

88. భూతార్థక విశేషణంగా 'ఇన' కన్పిస్తుంది. ఉదాహరణకు 'వచ్చిన రాముఁడు'. (సులభ. క్రియా:55)

89. ఆశీరాద్యర్థంలో 'గాక' అనే అవ్యయం వస్తుంది. (సులభ. క్రియా:31)

90. కొన్నిసార్లు భావార్థక 'ట' ప్రత్యయం కూడా 'ఉ' శబ్దాన్ని చేర్చుకొని ఆనంతర్యార్థాన్ని బోధిస్తుంది. ఉదాహరణకు ' వాలియిట్లు చెప్పుటయు'(సులభ. క్రియా:51)

## ఎనిమిదవ అధ్యాయం: కారక– వాక్య విజ్ఞానం

91. బాలవ్యాకర్త ప్రాతిపదికర్థంలో, సంబోధనార్థంలో, ఉక్తార్థంలో ప్రథమావిభక్తి ప్రత్యయం వస్తుంద ని చెప్పగా, సులభవ్యాకర్త 'పరిమాణార్థకంలో' కూడా ప్రథమా విభక్తిని చెప్పారు. (సులభ. కారక:2)

92. కర్మార్థంలో ఉద్దేశార్థక ద్వితీయకు 'గుఱచి' అనేది అనుప్రయుక్తంగా వస్తుందని ప్రౌఢవ్యాకర్త చెప్పగా , సులభ వ్యాకర్త 'గూర్చి, గుఱచి, గుఱించి' వంటి మూడు ప్రత్యయాలు వస్తాయని చెప్పారు. ఉదాహరణకు ' దైవము గుఱించి జపము'. (సులభ. కారక:5)

93. సులభవ్యాకర్త 'చేత' అనే తృతీయా విభక్తి ప్రత్యయం కర్త్రర్థకంలో, కరణార్థకంలో, హేత్వర్థకంలో, గ్రహ్యాదులకు మాత్రమే కాక ప్రకృతార్థకంలో, గోత్రార్థకంలో, వస్తుందని చెప్పారు.

94. హేతువులుగా కనిపించే గుణ క్రియలకు, అన్నంత క్రియలకి 'పట్టి' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' విద్యను బట్టి గౌరవము కలుగును'. (సులభ. కారక:21)

95. పదాలు నామాలని, క్రియలని, అవ్యయాలని, విశేషణాలని, సర్వనామాలని ఐదు రకాలుగా సులభవ్యాకర్త నిర్వచించారు. (సులభ. వాక్య:1)

96. ఒక వ్యాపారాన్ని గురించి బోధించే దానిని క్రియ అనవచ్చు . ఉదాహరణకు 'చంపెను'. ఇక్కడ 'చంపెను' అనే మాట ఒక వ్యాపారాన్ని గురించి బోధిస్తుంది. కాబట్టి 'క్రియ' అంటారు. (సులభ. వాక్య:5)

97. 'క్రియచేత గర్త చెప్పబడిన కర్తరి ప్రయోగము'. ఉదాహరణకు ' వానరులు సేతువును గట్టిరి'.

98. క్రియచేత కర్మము చెప్పబడునేని యది కర్మణి ప్రయోగము'. 'వానరులచే సేతువు గట్టఁబడెను'

99. ఏకదేశి సమాసాలు ఆంధ్రభాషలో ఉన్నాయి. తన– నా– నీ– ఆ–ఈ– ఏలు మొదలైనవి సిద్ధ సమాసంలో అన్వయించబడతాయి. ఉదాహరణకు ' తన యశోవిశదముక్తాపాళి' ఇక్కడ

'తన' అనే తెలుగు పదం సిద్ధసమాసంలోని 'యశస్సు' అనే పదంతో అన్వయించును. (సులభ.వాక్య:44)

100. జంట, జోడు, జత మొదలైన ద్వంద్వాన్ని(రెండు సంఖ్యను) తెలిపే పదాలుకు ఏకవచన క్రియ వస్తుంది. ఉదాహరణకు 'జంట సరిగానున్నది– జోడు కుదిరింది'. (సులభ. కారక:55)

101. జాతిని తెలుపు సందర్భంలో ఏకవచనం వస్తుంది. ఉదాహరణకు ' అడవి మృగములలో సింహము శ్రేష్టము', ప్రాణి కోటిలో మనుష్య దుత్తముఁడు'. ఇక్కడ సింహము, మనుష్యుడు జాతిని తెలుపే ఏకవచన రూపాలు. పై ఉదాహరణలు బహువచనంలో కూడా ఉన్నాయి. (సులభ. వాక్య:53)

102. నామాలు బహువచనంతో గోత్రార్థకాలుగా ఉంటాయి. ఉదాహరణకు 'రఘువులలో రాముఁడు మేటి' రఘువులలో అనగా రఘువంశంలో పుట్టినవారిలో రాముఁడు మేటి అని అర్థం. (సులభ. వాక్య:56)

103. శ్లేషార్థంలో బిందువు కలిగిన లఘు రేఫం, అలఘు రేఫం , బిందువులేని లఘురేఫం, అలఘురేఫం వాడటం కొందరి కవులు ప్రయోగించారు. ఉదాహరణకు ' పొంగురాఁ+గల –పొంగు+ఱాఁగల = పొంగురాఁగల. (సులభ. వాక్య:62)

## తొమ్మిదవ అధ్యాయం: వ్యాస విజ్ఞానం

104. 'వ్యాసపరిచ్ఛేదము' అని ప్రత్యేక శీర్షిక పెట్టి వ్యాస శైలి, వ్యాసుకుని వ్యక్తిత్వ లక్షణాలు, వ్యాసంలో ఉపయోగించాల్సిన భాష మొదలైన వివిధ అంశాలను చర్చించిన మొట్టమొదటి గ్రంథం వావిలికొలనువారి ***సులభవ్యాకరణము***.

105. ఏదైనా ఒక విషయాన్ని విస్తరించి రాయడం వ్యాసలేఖనమని, ఆ విస్తరించి రాయబడ్డ గ్రంథం వ్యాసమని వావిలికొలను సుబ్బారావుగారు నిర్వచించారు.

## 10.3 ఆధార గ్రంథాలు

## 10.3.1 ప్రధాన ఆకర గ్రంథాలు

1. అధర్వణాచార్యుడు. 1955. ***వికృతి వివేకము అను అధర్వణ కారికావళి.*** మద్రాసు: వావిళ్ల రామస్వామి శాస్త్రులు&సన్స్. ద్వితీయ ముద్రణ.

2. అనంతపద్మనాభ శాస్త్రి, వారణాసి. 2007. *ఆంధ్రవ్యాకరణ వివేకము*. హైదరాబాదు: వి. వి. ఎ. పబ్లికేషన్స్.
3. అప్పకవి, కాకునూరి, దొరసామిశర్మ, రావూరి(సంపాదకుడు). 1966. *అప్పకవీయము* మద్రాసు: వావిళ్ల రామస్వామి శాస్త్రులు&సన్స్.
4. అబ్బాయినాయుడు, పాపనేని. 1914. *ఆంధ్ర వ్యాకరణ సంగ్రహం.* మద్రాసు: కాక్స్టన్ ప్రెస్. తొమ్మిదవ ముద్రణ.
5. ఇనాక్, కొలకలూరి.1980. *తెలుగువ్యాస పరిణామం.* అనంతపురం: జ్యోతిగ్రంథమాల ప్రచురణ: ప్రథమ ముద్రణ.
6. కామాక్షమ్మ, తురగా. 1935. *ఆంధ్ర వాల్మీకి శ్రీవాసుదాస జీవితము.* మద్రాసు: సరస్వతి ముద్రణాలయం.
7. కృష్ణకుమారి, దావులూరి. 2012. *ఆంధ్రశబ్ద చింతామణి తద్వ్యాఖ్యానాలు*. తిరుపతి: నవభారతి పరచురణలు. ప్రథమ ముద్రణ.
8. కృష్ణమూర్తి, భద్రిరాజు. 2018. *తెలుగు భాషాచరిత్ర.* హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణలు.
9. కేతన, మూలఘటిక. 1932. *ఆంధ్రభాషా భూషణము.* మద్రాసు: వావిళ్ల రామస్వామి శాస్త్రులు&సన్స్.
10. గురుమూర్తి శాస్త్రి, రావిపాటి. 1951. *తెనుఁగు వ్యాకరణము*. మద్రాసు: వావిళ్ల రామస్వామి శాస్త్రులు&సన్స్.
11. గోపాల కృష్ణయ్య, వడ్లమూడి. 1958. *వ్యావహారిక భాషా వ్యాకరణం*. రాజమండ్రి: సరస్వతి పవర్ ప్రెస్. ప్రథమ ముద్రణ.
12. చలపతిరావు, నందిరాజు.1936. *ఉపన్యాస దర్పణము*. స్థలం--. పబ్లిషర్ --.
13. చిన సీతారామశాస్త్రి, వఝల. 1977. *బాల వ్యాకరణోద్ద్యోతము*. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి. ద్వితీయ ముద్రణ.
14. చిన్నయసూరి, పరవస్తు. 1972. *బాలవ్యాకరణము*. మద్రాసు: వావిళ్ళరామస్వామి అండ్ సన్స్.
15. తిరుపతిరెడ్డి, గౌరు. 2007. *కడప జిల్లా సాహితీ మూర్తులు*. హైదరాబాద్: ప్రజాహిత పబ్లిషర్స్, చిత్రలిపి ప్రింటర్స్.

16. నన్నయ.1926. *ఆంధ్రశబ్దచింతామణి.* మద్రాసు: వావిళ్ల రామస్వామి శాస్త్రులు&సన్స్.

17. నాగభూషణం, అంబడిపూడి.1985. *ప్రౌఢవ్యాకరణ వ్యాఖ్యాన శీలనము(ప్రథమ&ద్వితీయ భాగములు).* స్థలం−−. పుబ్లిషర్స్−−.

18. నాగభూషణం, అంబడిపూడి.1988. *బాలవ్యాకరణ సూక్తులు(ప్రథమ, ద్వితీయ &తృతీయ భాగములు).* గుంటూరు: గౌతమి ప్రింటర్స్. ప్రథమ ముద్రణ.

19. నారాయణశాస్త్రి, జొన్నలగడ్డ. 1992. *బాల వ్యాకరణ పరిశోధనము.* మచిలీపట్నం: స్పందనప్రింటర్స్.

20. పురుషోత్తం, బొడ్డుపల్లి. 1969. *తెనుఁగు వ్యాకరణ వికాసము(ప్రథమ &ద్వితీయ సంపుటాలు).* గుంటూరు: శ్రీగిరిజా ప్రచురణలు.

21. పురుషోత్తం, బొడ్డుపల్లి. 1978. *వ్యాకరణ పదకోశము.* హైదరాబాదు: తెలుగు అకాడమి.

22. పెద్దన, విన్నకోట.1972. *కావ్యాలంకారచూడామణి.* మద్రాసు: వేదం వేంకటరాయ శాస్త్రి అండ్ బ్రదర్స్. ఏడవ ముద్రణ.

23. భాస్కరరావు, టి. 1992. *బాల ప్రౌఢ వ్యాకరణ సర్వస్వము(ప్రథమ&ద్వితీయ సంపుటాలు).* కాకినాడ: ప్రశాంతి పబ్లిషర్స్. ఐదవ ముద్రణ.

24. మహాదేవశాస్త్రి, కోరాడ. 2000. *వ్యాకరణ దీపిక.* విజయవాడ: గంగాధర పబ్లికేషన్సు. ప్రథమ ముద్రణ.

25. మోహన్ రెడ్డి, ఆలేటి.1996. *తెలుగు వ్యాకరణ దీపిక.* హైదరాబాదు: ఓరియంట్ లాఙ్మన లిమిటెడ్ ప్రచురణ.

26. మోహన్ రెడ్డి, ఆలేటి.2014. *బాలవ్యాకరణము (తెలుగు వ్యాఖ్య).* హైదరాబాదు: ఎమెస్కో ప్రచురణలు. ప్రథమముద్రణ.

27. రంగాచార్యులు, చెలమచెర్ల. 1977. *ఆంధ్ర లక్షణ రత్నాకరము.* హైదరాబాదు: శ్రీనివాస పబ్లికేషన్స్. తృతీయ ముద్రణ.

28. రమాపతిరావు, అక్కిరాజు.1971. *వ్యావహారిక భాషా వికాసం− చరిత్ర.* మద్రాసు: యం. శేషాచలం అండ్ కో., . మొదటి ముద్రణ.

29. రమాపతిరావు, అక్కిరాజు.1991. *ప్రతిభా మూర్తులు.* హైదరాబాద్: విజ్ఞాన దీపిక ప్రచురణలు.

30. రాజేశ్వరశర్మ, అమరేశం. 1973. *ఆంధ్రవ్యాకరణ వికాసము(ప్రథమ&ద్వితీయ భాగములు).* కామారెడ్డి: ప్రాచ్యవిద్యాపరిషత్తు. ప్రథమ ముద్రణ.

31. రాజేశ్వరి, శివుని. 2023. *ఆధునిక తెలుగు భాషా నిర్మాణం* . బెంగళూరు:ఓంకార్ ఆఫ్ సెట్ ప్రింటర్స్. ద్వితీయముద్రణ.

32. రాధాకృష్ణ, బూదరాజు. 2018. *తెలుగు భాషా స్వరూపం.* హైదరాబాద్:పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణలు.

33. రాధాకృష్ణ, బూదరాజు.1972. *వ్యావహారిక భాషా వికాసం.* విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. ప్రథమ ముద్రణ.

34. రామకృష్ణయ్య, కోరాడ. 1971*. సంధి.* మద్రాసు: ఫ్రీడం ప్రెస్ ముద్రణ. ఐదవ ముద్రణ.

35. రామకృష్ణారావు, వంతరాం. 1975*. ముక్త లక్షణ కౌముది.* త్రివేండ్రం: నేషనల్ రీసెర్చ్

36. రామకృష్ణారావు, వంతరాం. 2017. *బాలవ్యాకరణ ఘంటాపథము.* హైదరాబాద్: నవచేతన పబ్లిషింగ్ హౌస్. ప్రథమ ముద్రణ.

37. రామకృష్ణారావు, వంతరాం.2011. *ప్రౌఢవ్యాకరణ ఘంటాపథము.* హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. ద్వితీయ ముద్రణ.

38. రామబ్రహ్మం, బేతవోలు. 1983. *తెలుగు వ్యాకరణాలపై సంస్కృత ప్రాకృత వ్యాకరణాల ప్రభావం.* గుంటూరు: శ్రీలక్ష్మి ప్రెస్.

39. రామరాజు, బిరుదురాజు. 2003. *ఆంధ్ర యోగులు* (చతుర్థభాగం). హైదరాబాద్: ఓంసాయి గ్రాఫిక్స్.

40. రామారావు, చేకూరి. 2019. *తెలుగువాక్యం.* సికింద్రాబాద్: కావ్య పబ్లిషింగ్ హౌస్.

41. లక్ష్మీకాంతం, పింగళి. 1971. *సంస్కృత కుమార వ్యాకరణము.* తిరుపతి: శ్రీ బాలాజీ పబ్లిషర్సు.

42. లలిత, జి.1996. *తెలుఁగు వ్యాకరణముల చరిత్ర.* మద్రాసు: వెలగపూడి ఫౌండేషన్.

43. వీరేశలింగం, కందుకూరి. 1930. *సంగ్రహ వ్యాకరణము.* రాజమండ్రి: శ్రీ సత్యానంద ప్రెస్.

44. వెంకట రమణకవి, పొత్తపి, దొరసామిశర్మ, రావూరి(సంపాదకుడు). 1979. *లక్షణ శిరోమణి.* హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి. ప్రథమ ముద్రణ.

45. వేంకటపతికవి, గణపవరపు. 1935. *ఆంధ్రకౌముది.* కాకినాడ: ఆంధ్ర సాహిత్యపరిషత్తువారు

46. వేంకటరమణశాస్త్రి, దువ్వూరి. 1964. రమణీయము. వాల్తేరు: ఆంధ్ర యూనివర్సిటి ప్రెస్సు. ప్రథమ ముద్రణ.

47. వేంకటరమణశాస్త్రి, వేదము. 1951. *లఘు వ్యాకరణము.* మద్రాసు: వావిళ్ల రామస్వామి శాస్త్రులు&సన్స్.

48. వేంకటరామశాస్త్రులు, కల్లూరి. 2015. *బాలవ్యాకరణ గుప్తార్థ ప్రకాశిక*. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

49. వేంకటేశ్వర్లు, బూదాటి. 2014. *సంప్రదాయ తెలుగు వ్యాకరణాలు*. హైదరాబాదు: తెలుగు అకాడమి.

50. వేంకటేశ్వర్లు, వజ్ఝల. 1982. *ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం*. రాజమండ్రి: సరస్వతీ పవర్ ప్రెస్సు.

51. శేషాద్రి రమణ కవులు. 1942. *ఆంధ్ర వ్యాకరణ సర్వస్వము*. ఏలూరు : రామా అండ్ కో ., విద్యావిషయిక ప్రచారకులు.

52. శ్రీరామ చంద్రః, పుల్లెల. 1971. *లఘు సిద్ధాన్త కౌముదీ* . హైదరాబాదు: సంస్కృత భాషా ప్రచార సమితి.

53. శ్రీరామచంద్రమూర్తి, యంజీపి. 1977. *బాలవ్యాకరణ కల్పద్రుమము*. హైదారబాదు: మురళీ పవర్ ప్రెస్. మొదటి ముద్రణ.

54. శ్రీహరి, రవ్వా. 2015. *పాణినీయ అష్టాధ్యాయి వామన జయాదిత్యకృత కాశికావృత్తసహితం తెలుగు అనువాదం.* సం.1&2. హైదరాబాదు: తెలుగు అకాడమి.

55. సంగ శేషాచలశాస్త్రి, తురిమెళ్ళ. 1931. *ఆంధ్ర లక్షణ సారము*. తెనాలి: ఎద్యుకేషనల్స్ పుబ్లిషర్సు. ప్రథమ ముద్రణ.

56. సత్యనారాయణ శాస్త్రి, మధునాపంతుల. 1950*. ఆంధ్ర రచయితలు*. రాజమండ్రి: సరస్వతి పవర్ ప్రెస్.

57. సీతాపతిదాసుడు, మెట్టపల్లి. 2009. *శ్రీ వాసుదాస దేశిక వైభవము*. అంగలకుదురు: శ్రీ కోదండ రామసేవక సమాజం.

58. సుబ్బారావు, వావిలికొలను.1963. *సులభ వ్యాకరణము*. అంగలకుదురు: శ్రీ కోదండరామసేవక ధర్మసమాజము. ప్రథమ ముద్రణ.

59. సుబ్రహ్మణ్యం, పి. యస్. 2018. *ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు*. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

60. సూర్యనారాయణశాస్త్రి, పేరి+ అప్పలాచార్యులు, భాష్యం+ శ్రీరామచంద్రుడు, పుల్లెల (అనువాదకులు). 2001. *వాక్య పదీయము* (ప్రథమ ద్వితీయా భాగములు ). హైదరాబాదు: తెలుగు అకాడమి.

61. హనుమచ్ఛాస్త్రి, జానుమద్ది. 1973. *మా సీమకవులు*. కడప: మాసీమ పబ్లికేషన్స్.

## 10.3.2 పరిశోధన గ్రంథాలు

62. ఝాన్సీ లక్ష్మీభాయ్, హనుమంతు. 2008. *ఆంధ్రవాల్మీకి రామాయణం- ఒక పరిశీలన.* విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి సిద్ధాంత గ్రంథం.

63. దుర్గా ప్రసూనాంబ, నోరి. 1988. *కౌసల్యాపరిణయము – కావ్యానుశీలనము.* గుంటూరు: నాగార్జున విశ్వవిద్యాలయానికి సమర్పించిన యం. ఫిల్. పరిశోధనా వ్యాసం.

64. పవన్ కుమార్, పమ్మి. 2003. *కట్టా వరదరాజు ద్విపద రామాయణం: భాషా పరిశీలన.* హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి సిద్ధాంత గ్రంథం.

65. లక్ష్మీనారాయణ, గంగిశెట్టి. 2019. *ప్రాచీన ఆధునిక తెలుగు భాషలో కారక ప్రయోగం- పరిశీలన.* హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి సిద్ధాంత గ్రంథం.

66. వనిత, బడుగుల. 2013. *వైకృత చంద్రిక- సవిమర్శక పరిశీలన.* హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి సిద్ధాంత గ్రంథం.

67. శ్యామలాంబ, పెనుముచు. 2011. *లక్షణ గ్రంథాల్లో వ్యాకరణాంశాలు – అనుశీలన.* హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి సిద్ధాంత గ్రంథం.

68. శ్రీనివాస్, ఇ. 2016. *భాషాశాస్త్ర దృష్టితో బాలప్రౌఢవ్యాకరణాల పరిశీలన.* హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి సిద్ధాంత గ్రంథం.

## 10.3.3 నిఘంటువులు

69. వెంకటార్యుడు, మామిడి,(శుద్ధ చైతన్యస్వాములవారు- పరిష్కర్త). 1965. *ఆంధ్రదీపిక.* మచిలీపట్నం: శ్రీ వాసవీ గ్రంథ ప్రచారణ సమితి.

70. శ్యామల కామశాస్త్రి, కొ్రట. 1940. *ఆంధ్ర వాచస్పత్యము(నాల్గవ సంపుటి).* కాకినాడ: శ్రీలక్ష్మీ ముద్రాక్షరమాల.

71. సీతారామాచార్యులు, బహుజనపల్లి. 2021. *శబ్ద రత్నాకరము.* విజయవాడ: వి. జి. యస్. బుక్లింక్స్ సంస్థ: మూడవ ముద్రణ.

72. సుబ్బారాయుడు, మహాకాళి. 1942.*శబ్దార్థ చంద్రిక.* మద్రాసు: వావిళ్ల రామస్వామి శాస్త్రులు&సన్స్.

73. సుబ్రహ్మణ్యశాస్త్రి, కోట. *ఆంధ్ర సాహిత్య సర్వస్వము.* మద్రాసు: ప్రసాద్ అండ్ కంపెనీ. ద్వితీయ ముద్రణ.

### 10.3.4 వ్యాసాలు

74. కృష్ణమాచార్యులు, కో. వేం. 1928. ***కచటతపలు.*** కాకినాడ: ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక. సంపుటి–17, సంచిక–2, పుట:81–87.

75. గణపతిశాస్త్రి, చర్ల. 1932. *'నేను' ద్రుత ప్రకృతకమా? కళయా?.* కాకినాడ: ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక. సంపుటి–20, సంచిక–3, పుట:129–142.

76. రామస్వామి, ఎల్.వి. 1936. *ఆంధ్ర భాష యందలి ద్రుత స్వరూపములు.* కాకినాడ: ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక. సంపుటి–25, సంచిక–1, పుట:4–10.

77. : ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక. సంపుటి–26, సంచిక–4, పుట:168–173.

### 10.3.5 అంతర్జాల వనరులు

78. archive.org Internet Archive: Digital Library of Free & Borrowable Texts.

79. shodhganga.inflibnet.ac.in Shodhganga : a reservoir of Indian theses @ INFLIBNET

80. Sundarayya Vignana Kendram

81. www.teluguthesis.comteluguthesis.com

10.4 అనుబంధం–1 పుస్తకాల్లో ముద్రితమైన పరిశోధన పత్రాలు నకళ్ళు



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (3) హైదరాబాద్ మార్చి : 2025





వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన పత్రిక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 5
మార్చి - 2025
'క్రోధి' ఫాల్గుణ మాసం

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. MANOHARI**

*Type Setting at :*
Kavyasree Graphics
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక'
(MUSI Telugu Monthly Magazine)
పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

తెలుగు సంస్కృతి - వారసత్వ అధ్యయన ప్రాముఖ్యం ... ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ 7
వావిలికొలను సుబ్బారావు - సాహిత్య సేవ ... ఆచార్య పమ్మి పవన్ కుమార్, కప్పల సురేశ్ 11
వసంతశోభకు పునాది 'ఉగాది' ... ఆచార్య శ్రీవత్స 17
భారతీయ మహిళా వైభవం ... డా. భిన్నూరి మనోహరి 21
మాతృభాష మనుగడ ... రాఘవ మాష్టారు కేదారి 23
వసుచరిత్ర - సంగీత శాస్త్ర విశ్లేషణ ... కె. పాతన్న 23
డా. కపిలవాయి లింగమూర్తి పీఠికలు - పరిశీలన ... డా. కసప నరేందర్ 30
తెలంగాణ సాహిత్య చరిత్రలు - పరిచయం ... కావలి రాఘవేందర్ 35
జైలు సాహిత్యంలో వ్యక్తి వ్యవస్థ ... కొల్లూరి నాగరాజు 39
నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము... డా. గంద్ర లక్ష్మణరావు 41
దళిత సాంస్కృతిక సరోవరం - నాగప్పగారి సుందరరాజు కథలు ... ఆచార్య కె. శ్రీదేవి, పి. శివశంకర 43
గీతకార్మికుల వెతలను తిరుగ రాస్తున్న 'నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్' ... డా. కొత్తిరెడ్డి మల్లారెడ్డి 49

### సమీక్షలు

సాహిత్య సంకీర్తకుడు 'సన్నిధానం' జన్మదిన విశేష సంచిక ... ఘట్టమరాజు 53
'నాతి చెరామి' కథలు - వస్తువు ... తుడుం మోహన్ 55
జీవన సమరం - బి.సి. అస్తిత్వ ప్రకటన ... డా. మద్దిరాల సత్యనారాయణ రెడ్డి 57
పాత్ర నిర్మాణ పద్ధతిని విశ్లేషించే విశిష్ట రచన ... డా.డి. చంద్రశేఖర్ రెడ్డి 59

### కవితలు

తొక్కిసలాట ... ఆచార్య ఫణీంద్ర - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; విముక్తి ... నక్క హరికృష్ణ - 19; మా నాయిన ... బాలాజీ పోతుల ... 34; గురువు అంటే ... రైటర్ రాజు - 52; పరవశించి పోవు వరమ శివుడు... పసుపులేటి నరసింహారావు-52; ఆగుపాతకా ... గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్ - 59; అవును! నేను అబలనే !! ... ఎం. అనంత లక్ష్మి - 62

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by :*
**B. MANOHARI**, 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029, Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (11) హైదరాబాద్ మార్చి : 2025

# వావిలికొలను సుబ్బారావు – సాహిత్య సేవ

**ఆచార్య పమ్మి పవన్ కుమార్,** తెలుగు అధ్యయన శాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం,

**కప్పల సురేశ్,** తెలుగు పరిశోధక విద్యార్థి, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఫోన్ : 98664 86934

## 1. పరిచయం

తెలుగు సాహిత్య రంగాన్ని సస్యవంతం చేసిన మహానుభావులు ఎందరో ఉన్నారు. వీరిలో ఒక ప్రత్యేకకోణంలో అధ్యయనం చేయ దగిన కవి, మహాయోగి శ్రీ వావిలికొలను సుబ్బారావుగారు. వీరు జమ్మలమడుగు పట్టణంలో 1863వ సంవత్సరంలో జన్మించారు. వాల్మీకి రామాయణాన్ని ఆంధ్రీకరించి ఆంధ్ర వాల్మీకిగా, వాసుదాస స్వామిగా ప్రసిద్ధిచెందారు. పోతనామాత్యుడిలాగా ఇష్టదైవమైన శ్రీరామచంద్రుడికి తన రామాయణాన్ని అంకితం చేశారు. '**రామకథ అనే పాలసముద్రంలో నిత్యం స్నానం చేస్తాను. ఆకలిదప్పులు తీరడానికి రామకథనే అమృతంగా తాగుతాను. వృథా ముచ్చట్లాడుతూ పొద్దు పుచ్చకుండా రామకథ అనే దివ్యమైన వెలుగులో ఒకపుంజమై శ్రీరాముని నామాన్ని పారాయణ చేస్తాను. రామకథ అనే ఔషధాన్ని గ్రోలుతూ శాశ్వతసౌఖ్యాన్ని అనుభవిస్తాన**'ని సుబ్బారావుగారు (మందరము: బాల-47, పుట:77) పేర్కొన్నారు. శ్రీ రామ సేవా తత్పరులై ఆదర్శవంతమైన సామాజిక జీవితాన్ని గడిపారు. 1936వ సంవత్సరం ఆగష్టు ఒకటవ తేదీన శ్రీరామునిలో ఐక్యమయ్యారు.

## 2. జీవితం – అధ్యాత్మ జీవితం

వావిలికొలను వారి తల్లిదండ్రులు శ్రీమతి రనకమ్మ, శ్రీరామ చంద్రరావు గార్లు. వీరిద్దరూ శ్రీరామ భక్తులు. వాలికొలనువారు చిన్నతనం నుండే సీతారాముల విగ్రహాలను బొమ్మరింటిలో పెట్టుకొని పూజించేవారట. 22 సంవత్సరాల వయసులో చిన్నాన్న లక్ష్మీబీరావు గారి దగ్గర శ్రీమద్రామాయణం ఉపదేశం పొందారు. ఆనాటి నుండి తన జీవిత పర్యంతం రామ నామమే జపిస్తూ రామపాద సేవ చేశారు. కంపసముద్రం నివాసులైన శ్రీమాన్ చెట్లూరి నరసింహాచార్యులవారు తనంతట తానే వీరి దగ్గరకు వచ్చి శ్రీరామ షడక్షర మంత్రాన్ని ఉపదేశించారు. వావిలికొలను వారు శ్రీరామ తారక మంత్రాన్ని జపిస్తూ నీతి బోధకాలైన కృతులను రచించి శ్రీరామచంద్రునికి అంకితం ఇచ్చారు.

సుబ్బారావుగారికి 1910వ సంవత్సరంలో భార్యావియోగం కలిగింది. లౌకిక బంధాలపట్ల విరక్తులై యోగసాధన కోసం ఘటికాచలం వెళ్లారు. కోదండరాముని స్వప్నాదేశాన్ని అనుసరించి ఒంటిమిట్టకు వెళ్ళి తమకు ఉన్న ఆస్తులన్నిటిని శ్రీరాముని సేవకోసం వినియోగించారు. స్వామి కైంకర్యానికి అవి మాత్రమే చాలవని తెలిసి, టెంకాయ చిప్పను పాత్రగా చేసుకొని భిక్షాటన చేస్తూ, అనేక పల్లెలు, పట్టణాలు తిరిగి ధనాన్ని సంపాదించి శ్రీరామునిసేవ కోసం ఉపయోగించారు.

సుబ్బారావుగారి పేరు వినగానే ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ దేవాలయం కూడా గుర్తుకువస్తుంది. ఈ దేవాలయాన్ని పునరుద్ధరించి నిత్యం పూజా కార్యక్రమాలు, నిత్య ఉత్సవాలు జరిగేవిధంగా ఏర్పాటు చేశారు. ఒంటిమిట్టకు వచ్చే భక్తుల కోసం శ్రీ కోదండరామ సేవక సమాజాన్ని 1925లో ప్రారంభించారు. జబ్బుపడ్డ పేద ప్రజల కోసం ధర్మ వైద్యశాలలను స్థాపించారు.



సుబ్బారావుగారు భక్తిమత ప్రచారానికై శ్రీ కోదండ రామ సేవక సమాజ సభ్యులతో కలిసి ఆంధ్ర దేశమంతటా పర్యటిస్తుండేవారు. అహోబిలంలో జరిగిన శ్రీరామ సప్తాహంలో స్త్రీలకు దాంపత్య ధర్మాలను గురించి, సాధువులకు వారి విధుల గురించి తెలియ జేశారు. వేదాంతుల రూపంలో ఉంటూ మాయలు చేసేవారిని, డంబాచారాలను నిరసించారు. ప్రజలలో నిజభక్తి చైతన్యాన్ని కలిగించడానికి సుబ్బారావుగారు కళ్యాణ దుర్గం, ధర్మవరం, హిందూపురం, కడవ, జమ్మలమడుగు, మార్కాపురం, గుంటూరు, అంగలకుదురు, కంకిపాడు, నడిగడ్డపాలెం, జమ్ములపాలెం, సత్తెనపల్లి, నరసరావుపేట వంటి ప్రాంతాలలో పర్యటించి ధర్మోపదేశాలను అందించారు. కొన్నిచోట్ల భక్తుల కోసం వాల్మీకి ఆశ్రమాలను స్థాపించి వారికి వసతి సౌకర్యాలను కల్పించారు.

నేడు మనం పూజించుకొంటున్న ఎందరో యోగులు ఆ కాలంలో శ్రీ సుబ్బారావుగారిని దర్శించి ఆశీస్సులను అందుకొన్నారు. జిల్లెళ్ళమూడి అమ్మగా ప్రసిద్ధి చెందిన అనసూయాదేవి గారికి తొమ్మిది సంవత్సరాలు వయసు ఉన్నప్పుడు సుబ్బారావుగారిని దర్శించారు. శేషశయనదాసు, చక్కిరాల అన్నపూర్ణమ్మ, తురగా కామాక్షమ్మ, బుద్ధాం శ్రీరామ శరణ్ వంటివారు భక్తులుగా, శిష్యులుగా ఉంటూ శ్రీరామునిసేవలో

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (12) హైదరాబాద్ మార్చి : ౨౦౨౫

సుబ్బారావుగారికి సహకరించారు. సుబ్బారావుగారు తాను యోగిగా జీవించారు. ఎందరో యోగులకు, మహానుభావులకు మార్గదర్శిగా ఉన్నారు. ధర్మాచరణకు ఉపకరించే ఎన్నో గ్రంథాలను మనకు అందించి తన జీవితాన్ని, అధ్యాత్మ జీవితాన్ని పండించుకొన్నారు.

### 3. సాహితీసేవ

వావిలికొలను సుబ్బారావుగారు తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలలో రచనలు చేశారు. తమ సాహిత్యాన్ని కేవలం పండితుల కోసం మాత్రమే కాకుండా, పామరులకు, బాలురకు, స్త్రీలకు, వృద్ధులకు అర్థమయ్యే రచనలు సైతం చేశారు. సుబ్బారావుగారి ప్రబంధ, నాటక, శతక సాహిత్యం ఘనమైన వారి సాహితీ పటిమను అనేకమైన కోణాలలో ప్రదర్శిస్తుంది. తెలుగు సాహిత్య లోకంలో వీరికి విశిష్ట స్థానాన్ని సంపాదించి పెట్టిన రచన మందరము. నైతిక, సాహిత్య రంగంలో నాటి పెద్దలు పూండ్ల రామకృష్ణయ్య, వేదం వేంకటరాయశాస్త్రి, తిరుపతి వేంకటకవులు, కందుకూరి వీరేశలింగం పంతులు, ధర్మవరం రామకృష్ణమాచార్యులు... వంటివారు సుబ్బారావు గారికి మిత్రులు, సమాజ, సాహితీ సేవలలో సహచరులు.

వావిలికొలను వారి సాహిత్యాన్ని అధ్యాత్మ సాహిత్యం, ఉపదేశాత్మక సాహిత్యం, పురాణ కథా సంబంధ సాహిత్యం, విమర్శనా సాహిత్యం, శతకసాహిత్యం, ప్రబంధసాహిత్యం, నాటక సాహిత్యం, దండక రచనలు, గద్యలు, వ్యాకరణ రచన వంటి విభాగాలు చేసి అధ్యయనం చేయవచ్చు. ఈ పత్రంలో ప్రబంధసాహిత్యం వరకు చేసిన రచనలను రేఖామాత్రంగా పరిచయం చేయడం జరుగుతున్నది.

### 3.1 అధ్యాత్మ సాహిత్యం

వావిలికొలను సుబ్బారావుగారు ఆంధ్ర వాల్మీకి రామాయణము, భక్తి ప్రాశస్త్యము, భక్తి విజయము , శ్రీరామ నామ మాహాత్మ్యము, శ్రీకృష్ణ లీలామృతము, భగవదారాధన విధానము, యోగవిద్య, ప్రమేయ రత్నావళి, పరమార్థ తత్త్వము మొదలైన ఆధ్యాత్మిక గ్రంథాలను రచించారు.

#### 3.1.1 ఆంధ్ర వాల్మీకి రామాయణము

వావిలికొలను సుబ్బారావుగారు మూలాన్ని అనుసరించి (వాల్మీకి రామాయణం), ఆంధ్ర వాల్మీకి రామయణాన్ని రచించారు. ఏడు కాండలలో 24 వేల పద్యాలలో వెలువడిన బృహద్రచన ఇది. ఈ రచన 1904-1908 సంవత్సరాల మధ్య కాలంలో సాగింది. ఆయన ఈ గ్రంథాన్ని 1908వ సంవత్సరం అక్టోబరులో ఒంటిమిట్టలో శ్రీకోదండరామ స్వామి వారికి అంకితం ఇచ్చారు. గొప్ప కవులు, విద్వాంసులు, ఎందరో ఆ సభలకి వచ్చారు. విద్వత్కవులందరూ ఈ రామాయణ రచనని పరీక్షించి వారి అభిప్రాయాలను పద్యరూపంలోనూ, ఉపన్యాసరూపంలోనూ చెప్పి ఆశీర్వదించారు. ఈ సభలలోనే వావిలికొలను సుబ్బారావుగారికి ఆంధ్రవాల్మీకి అనే బిరుదును ప్రదానం చేశారు. వాల్మీకి హృదయాన్ని ఆవిష్కరించిన గ్రంథంగా ఆంధ్రవాల్మీకి రామాయణానికి తెలుగునాట, బయటా ఎంతో కీర్తి లభించింది.

#### 3.1.2 భక్తి ప్రాశస్త్యము

సుబ్బారావుగారు 1926వ సంవత్సరంలో గుంటూరులో నెలమైన శ్రీ కోదండ రామస్వామి కైంకర్యానికి వెళ్ళినప్పుడు, శ్రీ సీతారామ భక్త సంఘం వారు ద్వితీయ మహాజన సభ జరిపారు. ఈ సభలకు సుబ్బారావుగారు అధ్యక్షులు. సుబ్బారావుగారు భక్తి మార్గ ప్రాశస్త్యాన్ని చక్కగా వివరిస్తూ చేసిన ఉపన్యాసాన్ని తరువాతికాలంలో భక్తి ప్రాశస్త్యము అనే గ్రంథంగా ప్రకటించారు. భక్తియే అన్నింటికన్నా శ్రేష్ఠమైనదని ఈ గ్రంథంలో సుబ్బారావుగారు సిద్ధాంతీకరించారు.

#### 3.1.3 భక్తి విజయము

ఈ గ్రంథంలో సుబ్బారావుగారు నవవిధ భక్తి మార్గాలను గురించి వివరించారు. కపట వేదాంతుల మాయమాటలకు మోసపోకుండా అన్ని మతాలవారు, అన్ని వర్ణాలవారు, అన్ని వయస్సులవారు భక్తితో ఇష్ట దేవతలను తమ తమ సంప్రదాయాల ప్రకారం సేవిస్తే కృతార్థులు అవుతారని సుబ్బారావుగారు ఈ గ్రంథంలో విపులీకరించారు.

#### 3.1.4 శ్రీరామనామ మాహాత్మ్యము

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీ కోదండ రామ కైంకర్యం కోసం ఒకసారి చాగంటివారిపాలెం వెళ్లారు. అక్కడ కృష్ణమ్మ, రామమ్మ, సీతమ్మ, రంగారెడ్డి, మహానందిరెడ్డి అనే భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పిన విషయాలే తరువాత కాలంలో శ్రీరామ మహాత్మ్యము అనే గ్రంథంగా ప్రకటించారు. శ్రీరామ నామ శబ్ద ఔచిత్యాన్ని, వైశిష్ట్యాన్ని పురాణ సంబంధ పాత్రలు ద్వారా వివరించడం ఈ గ్రంథం యొక్క ప్రత్యేకత.

#### 3.1.5 శ్రీకృష్ణ లీలామృతము

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీకృష్ణ లీలామృతము అనే గ్రంథాన్ని నాలుగు భాగాలుగా రచించారు. ఆయన సోదరుడు రంగారావుగారు శ్రీకృష్ణుని చరిత్రను, లోక హితం కోసం రాయమని కోరినమీదట సుబ్బారావుగారు ఈ గ్రంథాన్ని రచించారు. శ్రీకృష్ణుని చరిత్రగా భాగవతం పరిచయం చేసిన విషయాలను, శ్రీకృష్ణ చరిత్రలోని అనేకమైన ఘట్టాలను వీరు 'లీల'లుగా ఈ గ్రంథంలో చిత్రించారు. అందుకే ఈ గ్రంథంలోని విభాగాలకు శ్రీకృష్ణ జన్మలీల, శైశవ లీల, బృందావన లీల, కళ్యాణ లీల, మహాత్మ్య లీల, విజయ లీల, క్రతురక్షా లీల, దూత కృష్ణ లీల, సూత కృష్ణ లీల, సాంత్వన లీల, దేశిక లీల, ద్వారక లీల, చిత్ర లీల, గర్వభంజన లీల అనే శీర్షికలను ఉంచారు. శ్రీకృష్ణుని చరిత్రను రమ్యంగా, సమగ్రంగా కళ్ళకు కట్టే రచన ఇది.



### 3.1.6 భగవదారాధన విధానము

వావిలికొలనువారు స్థాపించిన శ్రీకోదండరామ సేవక సమాజంలో సభ్యులుగా చేరిన కొందరు స్త్రీలు భగవదారాధన గురించి వెలిబుచ్చిన సందేహాలకు సమాధానంగా భగవదారాధన విధానము అనే గ్రంథాన్ని రచించారు. భగవధారాధనకు సంబంధించిన ప్రపన్న ధర్మసార సముచ్చయము అనే రచనలోని అనేకమైన విషయాలను తెలుగులోకి అనువదించి ఈ గ్రంథ పీఠికలో పేర్కొన్నారు. పూజా విధానంలో ఉండే ఉపచారాలను స్వామికి సమర్పించే విధానాన్ని ఉత్తర పీఠికలో పొందుపరిచారు. భగవధారాధన మార్గాలు, పూజోపకరణాల విషయంలో పాటించవలసిన ధర్మాలను, విధి విధానాలను శాస్త్ర సమ్మతమైన పద్ధతిలో ఈ గ్రంథంలో వివరించారు.

### 3.2 ఉపదేశాత్మక సాహిత్యం




వావిలికొలను సుబ్బారావుగారు ప్రజల హితాన్ని ఆశించి ఎన్నో రచనలు చేశారు. బాల్యం నుండి జీవితాన్ని ఉత్తమమైన మార్గంలో నడుపుకోడానికి మార్గదర్శనంచేసే బాలక హితచర్య, కుమార హితచర్య, పతిహితచర్య, కుమారీ హితచర్య, సతీహితచర్య, గర్భిణీ హితచర్య, వైధవ్య ధర్మచర్య, ముముక్షు హితచర్య మొదలైన హితచర్య మాలికా గ్రంథాలను రచించారు. వీటిలో కొన్ని గ్రంథాలు ఆ కాలంలో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలో పాఠ్యాంశాలుగా నిర్దేశించబడ్డాయి. శాస్త్రీయ ఆచారాలను, శాస్త్రీయ పద్ధతులను, వైదిక సంస్కారాలను అనుసరించటంలో సుబ్బారావుగారికి విశ్వాసం అధికంగా ఉండేదని ఈ గ్రంథాలను చదివితే అర్థం అవుతుంది.

### 3.2.1 బాలక హితచర్య

బాలురకు ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించే కొన్ని ఆచరణ యోగ్యమైన పద్ధతులను సుబ్బారావుగారు ఈ గ్రంథంలో చర్చించారు. శంకరుడు, రాముడు అనే బాలుర సంభాషణతో ఈ గ్రంథం మొదలవుతుంది. పంచేంద్రియాలను సక్రమంగా ఉపయోగించడం, హితాన్ని కూర్చే ఆహార వివరాలు, ఆహారం జీర్ణం అయ్యే విధానం, నవ రంధ్రాలు నిర్వహించే విధులు, దేహ నిర్మాణం, మనస్సు వంటి విషయాలను ఈ గ్రంథంలో వివరించారు.

### 3.2.2 కుమార హితచర్య




రంగన్న అనే ఆయన అడిగిన ప్రశ్నలకు జవాబుగా వావిలికొలను సుబ్బారావుగారు ఈ గ్రంథాన్ని రచించారు. కోరికలను అదుపులో ఉంచుకోవడం, ఆత్మను రక్షించుకోవాలనే కోరిక, సంతానాన్ని పొందాలనే కోరిక, శాశ్వతానందం కోసం దేహరక్షణ యొక్క ఆవశ్యకత, చదివేకాలం, చదివే విధానం, అభ్యాసం, వినయం, మర్యాద, బలం, ప్రాణం, బ్రహ్మచర్యం, సుఖం వంటి విషయాల గురించి ఈ గ్రంథంలో వివరించారు.

### 3.2.3 కుమారీ హితచర్య

అత్తవారింట కోడలు మసలుకోవలసిన విధానాన్ని తెలియజెప్పే విషయాలన్నీ కుమారీ హితచర్యలో వివరించబడ్డాయి.ప్రాతః కాలంలో నిద్రలేవటం, గృహ కృత్యాలు, స్నానం, వంట, వడ్డన, దుష్టస్త్రీ జన సాంగత్యంవల్ల వచ్చే ఆపదలు, విరామ కాలంలో విజ్ఞానదాయక గ్రంథాలను చదవడం, ఆటలాడటం, ఉన్నదాంతో సంతృప్తి చెందడం, దొంగ గురువులను నమ్మకుండా ఉండడం, మానహానిని కలిగించే పనులు చేయకుండా ఉండడం, భోజనం చేసేటప్పుడు గమనించదగిన జాగ్రత్తలు, ఓర్పు కలిగి గృహ కృత్యాల ను నిర్వహించటం వంటి విషయాలను సుబ్బారావుగారు ఈ గ్రంథంలో వివరించారు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక   సంపుటి -28 : సంచిక - 5   (14)   హైదరాబాద్   మార్చి : 2025

### 3.2.4 పతి హితచర్య

వావిలికొలను సుబ్బారావుగారు కుమారహితచర్య తరువాత రంగన్నగారికి గృహస్థ ధర్మాలను బోధించటానికి పతిహిత చర్య గ్రంథాన్ని రాశారు. ఇందులో వివాహ ప్రయోజనం, స్త్రీ పురుష స్వభావ తారతమ్యం, భార్య–భర్తల సంబంధం, భార్య విషయంలో భర్త కర్తవ్యాలు, సంభోగ విషయాలు, వంశ పరంపరాగతం, గర్భధారణ చిహ్నాలు మొదలైన విషయాలను చర్చించారు.

### 3.2.5 సతీ హితచర్య

రుక్మిణమ్మ అనే మహిళ, మహాలక్ష్మమ్మ అనే మహిళకు వివరించిన పద్ధతిలో సుబ్బారావుగారు ఈ గ్రంథాన్ని రచించారు. ఇందులో పతివ్రతా స్త్రీలకు ఉండాల్సిన లక్షణాలను, అనుసరించాల్సిన  నియమాలను పేర్కొన్నారు. ఆరోగ్య విషయం, యవ్వనంలో కలిగే శారీరక మార్పులు, గర్భస్రావం, ప్రసవవేదన, ప్రసవ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మొదలైన వివరాలు ఈ గ్రంథంలో ఉన్నాయి.

### 3.2.6 వైధవ్య ధర్మచర్య

కామేశ్వరమ్మ అనే మహిళ సుబ్బారావుగారికి రాసిన లేఖకు సమాధానమే ఈ గ్రంథం.  అందులో భర్త లేని ఒక స్త్రీ సమాజంలో ఎలా బ్రతకాలో మార్గాలను సూచించమని కోరారు. ఆ ప్రశ్నకు సమాధానంగా సుబ్బారావుగారు వైధవ్య ధర్మచర్య అనే గ్రంథాన్ని 1925లో రచించారు. ఈ గ్రంథంలో పూజ్య–అపూజ్యముల చర్చ, సహగమనం, పునర్వివాహం, ఉద్యోగంలో చేరడం, మిత భాషణం... మొదలైన విషయాలను బోధించారు.

### 3.2.7 ముముక్షు హితచర్య

ఒంటిమిట్ట కోదండరామ సేవా సమాజంలో సభ్యురాలిగా ఉన్న వెంకట సుబ్బమ్మగారి వల్ల ముముక్షు హితచర్య అనే గ్రంథం వెలువడింది. ఎన్నో సందేహాలను సుబ్బారావుగారి వద్ద ఆమె నిత్యం ప్రస్తావిస్తుండేది.  సుబ్బారావుగారు ఆమె అడిగిన సందేహాలన్నిటికీ ఓపికగా జవాబులు చెప్పేవారు.  కొంతకాలం తరువాత ఆ జవాబులే ఈ గ్రంథరూపాన్ని పొందాయి. మోక్షం పొందాలని ప్రయత్నించేవాడు ముముక్షువు. అలాంటి ముముక్షువు కార్య సాధనకు మేలు కలిగించే చర్యను బోధించే గ్రంథమవడంవల్ల దీనికి ముముక్షు హితచర్య  అనే పేరు పెట్టారు. ఇందులో సర్వ ముముక్షువులకు భక్తియే అవశ్యమని సుబ్బారావుగారు ప్రతిపాదించారు.

### 3.3 పురాణ కథా సాహిత్యం

జనశ్రుతిలో ఉన్న ప్రసిద్ధమైన పురాణ పాత్రలను చిన్న కథల రూపంలోకి మార్చి, వాటిని హరిశ్చంద్ర చరిత్రము, శకుంతలా చరిత్రము, నల చరిత్రము, రుక్మాంగద చరిత్రము, హనుమంతుని చరిత్రము, వామన చరిత్రము వంటి గ్రంథాలుగా మలిచారు సుబ్బారావుగారు.

### 3.3.1 హరిశ్చంద్ర చరిత్రము

సుబ్బారావుగారు ఈ గ్రంథాన్ని రాముడు, కృష్ణుడనే ఇద్దరు బాలకుల సంభాషణతో ప్రారంభించారు. ఈ గ్రంథంలో హరిశ్చంద్రుడు, చంద్రమతి, వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, నక్షత్రకుడు మొదలైన పాత్రల ద్వారా సత్య, ధర్మాలయొక్క ఔన్నత్యాన్ని గొప్పగా వర్ణించారు.

### 3.3.2 శకుంతలా చరిత్రము

వావిలికొలను సుబ్బారావుగారు సంస్కృతంలో కాళిదాస మహాకవి రచించిన అభిజ్ఞానశాకుంతలము నాటకంలోని ఇతివృత్తాన్ని కాకుండా, మహాభారతంలోని కథను ఆధారంగా చేసుకొని ఈ గ్రంథాన్ని రచించారు.  ఈ గ్రంథంలోని శకుంతల, దుష్యంతుల సంభాషణలు పఠితలకు ఆసక్తిని కలిగిస్తాయి. ఈ గ్రంథాంతంలో విద్య వల్ల కలిగే ప్రయోజనాలను సంక్షిప్తంగా పేర్కొన్నారు.

### 3.3.3 రుక్మాంగద చరిత్రము

సూర్య వంశ రాజైన రుక్మాంగదుడు విదిశాపురాన్ని పాలించిన విధానాన్ని సుబ్బారావుగారు ఈ గ్రంథంలో వివరించారు.  ఏకాదశి వ్రతం చేయడం వల్ల కలిగే సత్ఫలితాలను ఈ గ్రంథంలో హృద్యంగా చెప్పారు.

### 3.3.4 హనుమంతుని చరిత్రము

ఈ గ్రంథాన్ని సుబ్బారావుగారు రెండు భాగాలుగా రచించారు. హనుమంతుడు సూర్యున్ని మింగడం, మైనాకుడు హనుమంతునికి అడ్డంగా రావడం, హనుమంతుడు లంకను చూడటం, జంబుమాలిని వధించటం, రావణుడు ఇంద్రజిత్తున్ని హనుమంతుని మీదకు పంపడం వంటి విషయాలు ఇందులో ఆసక్తికరమైన రీతిలో వర్ణించబడ్డాయి.

### 3.3.5 వామన చరిత్రము

వావిలికొలను సుబ్బారావుగారు వామన వృత్తాంతాన్ని వచనంలో రాశారు. విష్ణుమూర్తి దశావతారాలలో వామన అవతారం ఒకటి. ఈ గ్రంథంలోని కథలో విష్ణుమూర్తి దానం అడగడానికి  వామనుడి రూపంలోవచ్చి బలిచక్రవర్తిని పాతళానికి అణిచివేస్తాడు.  ఈ వృత్తాంతాన్ని సుబ్బారావుగారు వర్ణించిన తీరు, పోతానామాత్యుని శ్రీమద్భాగవతములోని వామనావతార ఘట్టాన్ని కళ్ళకు కడుతుంది.

### 3.4 విమర్శనా సాహిత్యం

వావిలికొలను సుబ్బారావుగారు ఆధునిక వచనం, జాతీయవిద్య, అస్పృశ్యత, రామావతార తత్త్వం మొదలైన అంశాలను గ్రహించి విమర్శనాత్మకంగా, విరివిగా  వ్యాసాలు రాశారు.  భాష, సమాజం, సాహిత్యం... మొదలైన అంశాలకు సంబంధించి సూటిగా చెప్పదలచు కొన్న  విషయాలను మాత్రమే తమ వ్యాసాలలో చర్చించారు.  ఈ

వ్యాసాలే తరువాత కాలంలో ఈ ఉపవిభాగంలో వివరించిన గ్రంథాలుగా ప్రకటించబడ్డాయి.

### 3.4.1 ఆధునిక వచన రచనా విమర్శనము

వావిలికొలను సుబ్బారావుగారు మద్రాసు రాజధాని కళాశాలలో ఆంధ్ర పండితులుగా పనిచేస్తున్నకాలంలో ఆ కళాశాలలో ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం ఏర్పడింది. ఈ సమాజంవారు శెట్టి లక్ష్మీ నరసింహంగారు రచించిన గ్రీకు పురాణకథలు అనే నవీనాంధ్ర గ్రంథాన్ని నుబ్బారావుగారికి ఇచ్చి దీనిలోని శైలి సాధువా, అసాధువా? దీనిలో సూచించిన మార్గాలను అనుసరించి మేము పోవచ్చునా, పోకూడదా? అనే వివరాలను అందించవలసిందని కోరారు. సుబ్బారావుగారు ఆ గ్రంథాన్ని చదివి అందులోని శైలిని పాటిస్తే ఆంధ్ర భాషకు నష్టం కలుగుతుందని భావించారు. ప్రతిగా ఆధునిక వచన రచనా విమర్శనము రచించారు.

సుబ్బారావుగారు గ్రీకుపురాణ కథలు అనే గ్రంథంలో ప్రధానంగా– 1. సంభాషణ శైలి, 2. సంధి జ్ఞానమనావశ్యకం, 3. సంస్కృతం, తెలుగు, ఉర్దూ అని తేడా లేకుండా సర్వ పదాలు ప్రయోగించుట, 4.అర్ధానుస్వారం, శకట రేఫలను విడుచుట, 5. ఈ గ్రంథం విద్యార్థులకు ఉద్దేశిచబడింది – అనే విషయాలను విమర్శించారు. ఈ నియామాలన్నీ గ్రామ్యవాద ఖండనాన్ని తెలిపేవే. నాటి కవి పండితులైన వేటూరి ప్రభాకర శాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం, వేదం వేంకటరాయ శాస్త్రి... వంటివారు ఈ గ్రామ్య వాద ఖండనలో సుబ్బారావుగారికి సహకరించారు.

### 3.4.2 పోతన నికేతన చర్చ బమ్మెర పోత రాజ విజయముల వృత్తాంతము

వావిలికొలను సుబ్బారావుగారు తమ ఆంధ్రవాల్మీకి రామాయణములో బమ్మెర పోతనామాత్యుడు ఒంటిమిట్ట నివాసి అని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనకు ఆధారాలు తెలియజేయవలసిందని కొందరు సుబ్బారావుగారికి ఉత్తరాలు రాశారు. వారికి ప్రత్యుత్తరంగా సుబ్బారావుగారు వ్యాసాలను రాసి ప్రకటించారు. ఈ వ్యాసాలలోని ప్రతిపాదనను ఖండిస్తూ శ్రీ జయంతి రామయ్య పంతులు వంటివారు పోతానామాత్యుడి జన్మస్థలం ఏక శిలానగరమని వ్యాసాలు రాశారు. వీరిద్దరి వాదనలు ఆంధ్ర కవులచరిత్రములోని పోతన నికేతనచర్చలో ఉన్నాయి.

వావిలికొలను సుబ్బారావుగారి వ్యాసాలను చదివి, కందుకూరి వీరేశలింగంగారుకూడా ప్రత్యుత్తరంగా ఒక వ్యాసం రాశారు. సుబ్బారావుగారు కందుకూరి వారి అభిప్రాయాన్ని ఖండిస్తూ రాసిన ఐదు వ్యాసాలను కలిపి బమ్మెర పోతరాజ విజయము అనే గ్రంథంగా ప్రకటించారు. ఈ గ్రంథంలో పోతన ఒంటిమిట్టవాడని నిరూపించ డానికి ప్రధానంగా ఎనిమిది కారణాలను చూపించారు. ఆయన అభిప్రాయయాన్ని సమర్థించిన మంత్రిప్రెగడ భుజంగ రావుగారు, నాగపూడి కుప్పుస్వామయ్యగారు వంటివారిని కూడా ఈ గ్రంథంలో ప్రస్తావించారు.

### 3.4.2 ఆర్య విద్యోపన్యాసములు

ఈ గ్రంథాన్ని జగన్నాథపురం జాతీయపాఠశాలలో వావిలికొలను సుబ్బారావుగారు స్వయంగా చదివి వినిపించారు. ఇందులో పాశ్చాత్య నాగరికతను విమర్శించారు. సంప్రదాయ విద్యాభ్యాసానికి సంబంధించిన అంశాలను ఈ గ్రంథంలో వివరించారు.

### 3.4.3 అస్పృశ్యత

అడయార్ ఆంధ్ర పరిషత్తు ద్వితీయ వార్షికోత్సవాల సంధర్భంగా వావిలికొలను సుబ్బారావుగారు అధ్యక్షతన అస్పృశ్యత అనే విషయంపై ఒక సభ జరిగింది. ఆ సభ చివరలో అస్పృశ్యతకు సంబంధించిన అనేక అంశాలకు సమాధానాలను తమ ఉపన్యాసంలో వివరించారు. తరువాతి కాలంలో ఆ ఉపన్యాసమే అస్పృశ్యత గ్రంథంగా వెలువడింది.

### 3.5 శతక సాహిత్యం

సుబ్బారావుగారు రచించిన శతకాలు మూడు. తల్పగిరి రంగనాయక శతకము, టెంకాయ చిప్ప శతకము, శ్రీ కల్పద్రుమ శతకము. ఇందులో తల్పగిరి రంగనాయక శతకము మొదటిది, పాండిత్య నిరూపణ కోసం రచించబడినది. మిగిలిన రెండు శతకాలూ శ్రీకోదండ రామ కైంకర్యాలకు వెళ్ళినప్పుడు ఎదురైన అనుభవాలను వివరిస్తాయి.

### 3.5.1 తల్పగిరి రంగనాయక శతకము

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీకుమారాభ్యుదయము అనే ప్రౌఢ ప్రబంధాన్ని రచించారు. ఈ సందర్భంలో నెల్లూరులో శరభ లింగంగారు సన్మానసభ ఏర్పాటుచేశారు. ఆ సభలో కొంతమంది పండితులు ఆ గ్రంథం సుబ్బారావుగారు రాయలేదని, ఆయన పేరుతో వారి పెద్దలెవరో రాసి ఉంటారని విమర్శించారు. రెండు రోజుల తరువాత ఆ పండితుల విమర్శలు సుబ్బారావుగారికి తెలిశాయి. ఆ మరుసటి రోజే సుబ్బారావుగారు తల్పగిరి రంగనాయక శతకమును రచించి శ్రీ పూండ్ల రామకృష్ణయ్యగారికి అంకితం ఇచ్చారు.

విక్రమ సింహపురి రంగ నాయకులస్వామివారికి గిరియే తల్పము కాబట్టి, సుబ్బారావుగారు ఈ శతకానికి తల్పగిరి రంగనాయక శతకము అని పేరు పెట్టారు. ఈ శతకంలో మొదటి పద్యం నుండి పన్నెండు వరకు గల పద్యాలలో మొదటి అక్షరాలను కలిపి చదివితే **శ్రీ రంగనాయకీ నాయకాయ నమః** అని వస్తుంది. అంతేకాకుండా ఈ శతకంలో 81వ పద్యం నుండి 90వ పద్యంవరకు గల పద్యాల లోని మొదటి పాదంలోని ప్రాసాక్షరాలను కలిపి చదివితే వావిలికొలను సుబ్బారావు అని వస్తుంది. ఇలాంటి భాష–ఛందో ప్రయోగాలను సుబ్బారావుగారు ఈ శతకంలో హృద్యంగా ఆవిష్కరించారు.

### 3.5.2 టెంకాయ చిప్ప శతకము

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీకోదండరామస్వామి వారి కైంకర్యం కోసం వివిధ ప్రాంతాలను సందర్శిస్తున్నపుడు కలిగిన అనుభవాలను గుదిగుచ్చి టెంకాయ చిప్ప శతకాన్ని రచించారు. శ్రీరాముని కైంకర్యానికి మొట్టమొదటిగా తమకు సహకరించిన టెంకాయ చిప్ప మీద రమ్యమైన పద్యాన్ని చెప్పారు. **'నా చేతిలో నిలిచి, వేల రూప్యములను పోగుచేసి, ఒక్క దమ్మిడి కూడా దాచుకోకుండా, శ్రీరాముని సేవకు అర్పించి ధన్యమయ్యావు, ఓ టెంకాయ చిప్పా! నీ కంటే లోకంలో గొప్పదేముంది?'** (టెంకాయ చిప్ప శతకం. 1:30). లోకపురీతిని భక్తితో రంగరించి అందించిన కృతి ఇది.

### 3.5.3 శ్రీభక్త కల్పద్రుమ శతకము

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీకోదండరామ స్వామి వారి సామ్రాజ్య పట్టాభిషేక వైభవాన్ని వర్ణిస్తూ ఈ శతకాన్ని రచించారు. దీనిలో కూడా టెంకాయ చిప్ప శతకంలోలాగా శ్రీ కోదండ రామ కైంకర్యానికి వెళ్ళినప్పుడు కలిగిన అనుభవాలను చెప్పారు.

### 3.6 ప్రబంధ సాహిత్యం

వావిలికొలను సుబ్బారావుగారు శ్రీకుమారాభ్యుదయము, శ్రీ కౌసల్య పరిణయము అనే రెండు ప్రబంధాలు రచించారు. వీటిలో మొదటి గ్రంథాన్ని ప్రౌఢ కావ్యంగా రచించారు. రెండవది సరళమైన రచన.

### 3.6.1 శ్రీ కుమారాభ్యుదయము

సుబ్బారావుగారు కడపజిల్లా రాజంపేటతాలూకా టంగుటూరులో పనిచేస్తున్నప్పుడు రచించిన తెలుగు పద్యకావ్యం శ్రీకుమారాభ్యుదయము. ఈ కాలంలో రచించబడిన మిశ్ర ప్రబంధాలలో శ్రీకుమారాభ్యుదయము లాంటి పదగుంఫనం కలిగిన చమత్కారమైన కావ్యంలేదని ప్రతీతి. ఇందులో మూడు ఆశ్వాసాలు ఉన్నాయి. మొదటి ఆశ్వాసంలో మన్మథ సంహారం, ద్వితీయాశ్వాసంలో శ్రీకృష్ణుని - రుక్మిణీ కళ్యాణం, ప్రద్యుమ్నుని జననం, మూడవ ఆశ్వాసంలో ప్రద్యుమ్నుని విజయం మొదలైన ఘట్టాలు ఉన్నాయి. ఈ కావ్యంలో పద్మ బంధం, నాగబంధం, ఛత్ర బంధం, శ్వేత బంధం, ఖడ్గబంధం వంటి పద్య బంధాలు ఉన్నాయి.

వావిలికొలను సుబ్బారావుగారి మిత్రులైన లంకలవల్లి వేంకటసుబ్బయ్యగారు శ్రీకుమారాభ్యుదయము పద్యకావ్యం పాఠక లోకానికి సుబోధకంగా అర్థమవ్వడానికి సుమనోల్లాసము అనే పేరుతో టీకా తాత్పర్యాలను రాశారు. పూండ్ల రామకృష్ణయ్యగారు శ్రీకుమారాభ్యుదయానికి కృతి విమర్శనంచేస్తూ ఇందులోని దండకం దాదాపుగా భోగినీ దండక శైలిని పోలియున్నదని, కొన్ని పద్యాలు శృంగార నైషధము, రామాభ్యుదయములోని పద్యాలలాగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

### 3.6.2 శ్రీ కౌసల్యా పరిణయము

వావిలికొలను సుబ్బారావుగారు మాతృ ప్రేరణతో శ్రీకౌసల్యా పరిణయము అనే ప్రబంధాన్ని 1894 వ సంవత్సరంలో రచించారు. ఇది ఆరు ఆశ్వాసాల చంపూకావ్యం. ఈ కావ్యానికి మాతృకలు మరాఠీ భాషలో గేయాల రూపంలో ఉన్నాయని సుబ్బారావుగారు పీఠికలో ప్రస్తావించారు. ఇందులో మొదటిగా ఇష్ట దైవమైన శ్రీరామచంద్రుని స్తుతించారు. తరువాత సంస్కృతాంధ్ర కవులను ప్రస్తావించారు. స్త్రీ వర్ణనల కంటే, ప్రకృతి వర్ణనలను మెండుగా కలిగి ఉన్న ఈ గ్రంథం పాఠకులను ఎంతో ఆహ్లాదపరుస్తుంది.

### 4. ముగింపు

వావిలికొలను సుబ్బారావుగారి రచనలలో పైన చెప్పబడిన గ్రంథాలు మాత్రమే కాకుండా శ్రీమద్భగవద్గీత అనే వ్యాఖ్యాన గ్రంథం, శ్రీరాముని దండకము, ఆంజనేయ దండకము, వాసుదాసు దండకము మొదలైన దండక రచనలు, బమ్మెరపోతన రత్నములు, రహస్య రత్నాకరము అనే రెండు సంకలన గ్రంథాలు, చతుఃశ్లోకి, శరణాగతి గద్య అనే రెండు అనువాద రచనలు కూడా ఉన్నాయి.

వంగదేశంలో గౌరాంగుడిలాగా ఆంధ్ర దేశంలో భక్తి చైతన్యాన్ని ప్రజలలోనింపి, జీవితాన్ని, సాహిత్య జీవితాన్ని ఫలప్రదం కావించుకొన్న ధన్యజీవి శ్రీ వావిలికొలను సుబ్బారావుగారు.

### 5. ఉపయుక్త గ్రంథ సూచి

1. అహోబలరావు, కల్లూరి. 1975. రాయలసీమ రచయితల చరిత్ర. హిందూపురం: శ్రీకృష్ణ దేవరాయ గ్రంథమాల.

2. కామాక్షమ్మ, తురగా. 1935. ఆంధ్ర వాల్మీకి శ్రీవాసుదాస జీవితము. మద్రాసు: సరస్వతీ ముద్రణాలయం.

3. తిరుపతిరెడ్డి, గౌరు. 2007. కడప జిల్లా సాహితీ మూర్తులు. హైదరాబాద్ : ప్రజాహిత పబ్లిషర్స్.

4. రమాపతిరావు, అక్కిరాజు. 1991. ప్రతిభా మూర్తులు. హైదరాబాద్ : విజ్ఞాన దీపిక ప్రచురణలు.

5. రామరాజు, బిరుదురాజు. 2003. ఆంధ్ర యోగులు (చతుర్థ భాగం). హైదరాబాద్ : ఓం సాయి గ్రాఫిక్స్.

6. రామారావు, యస్వీ. 2017. సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర. హైదరాబాద్ : స్వయంప్రభ పబ్లిషర్స్.

7. సత్యనారాయణ శాస్త్రి, మధునాపంతుల. 1950. ఆంధ్ర రచయితలు. రాజమండ్రి : సరస్వతి పవర్ ప్రెస్.

8. సీతాపతిదాసుడు, మెట్టపల్లి. 2009. శ్రీ వాసుదాస దేశిక వైభవము. అంగలకుదురు : శ్రీ కోదండ రామసేవక సమాజం.

9. హనుమచ్ఛాస్త్రి, జానుమద్ది. 1973. మా సీమకవులు. కడప : మాసీమ పబ్లికేషన్స్.

❖ ❖ ❖ ❖ ❖

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

# వావిలికొలను సుబ్బారావుగారి 'సులభ వ్యాకరణము' పరిశీలన

**Mr. Kappala Suresh,** Ph.D. Research student

sureshbabu147147@gmail.com

Department of Telugu, University of Hyderabad, Hyderabad- 500046, TS. India.

Article Received: 25/09/2025

Article Accepted: 28/10/2025

Published Online: 29/10/2025

DOI:10.53414/Sahithyatharangini.2025.2450

## 1.ఉపోద్ఘాతం

మారుతున్న భాషా స్వరూపాన్ని తెలుసుకోవాలమంటే ఏ ఒక్క గ్రంథానికో పరిమితమైతే సరిపోదు. అందుకే తెలుగులో వచ్చిన వ్యాకరణ గ్రంథాలైన, భాషా గ్రంథాలైన ఏ ఒక్కటీ సమగ్రమని చెప్పలేము. ఆయా వ్యాకర్తలుగాని, ఆయా భాషా వేత్తలుగాని వారి కాలానికి సంబంధించిన విషయాలను లేదా వారికి ముందుతరంలో ఉన్న భాషాస్వరూపాన్ని మాత్రమే వివేచించి వ్యాకరణలనుగాని, భాషాగ్రంథాలను నిర్మించగలరు. భవిష్యత్తులో జరగబోయే భాషాపరిణామాన్ని ఏ ఒక్కరూ ముందుగా ఊహించలేరు. కాబట్టి పూర్వవ్యాకర్తలు చెప్పిన విషయాలను తర్వాత వచ్చిన వ్యాకర్తలు వారి కాలానుగుణంగా కొన్ని మార్పులతో వ్యాకరణాలను నిర్మిస్తారు. అలాంటి సందర్భంలో పూర్వవ్యాకర్తల అభిప్రాయాలను, సూచనలను కొన్నింటిని సవరించుకుంటూ, కొన్ని పూరించుకుంటూ, కొన్ని వివరించుకుంటూ ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అంతమాత్రాన ముందు చెప్పిన వ్యాకర్తలు చెప్పిన నియమాలు తప్పని మనం వారిని తక్కువ భావంతో చూడక్కర్లేదు. ప్రతి ఒక్కరూ వారి వారి కాలాలలో ఎంతో కొంత భాష కోసం కృషి చేసినవాళ్ళే.

ఈ కోవకు చెందివారిలో ఆధునికాంధ్ర వ్యాకర్తలలో వావిలికొలను సుబ్బారావుగారు ఒకరు. తాను రచించిన వ్యాకరణానికి *'సులభవ్యాకరణము'* అని పేరుపెట్టి వారికి పూర్వం రచించబడి, ప్రామాణిక గ్రంథాలుగా భావించబడుతున్న బాల, ప్రౌఢ వ్యాకరణాలలోని కొన్ని అంశాలను గ్రహించి, కొన్ని నూతన అంశాలను చేర్చి కొత్త వ్యాకృతని నిర్మించారు.

## 2. 'సులభవ్యాకరణము' రచనా నేపథ్యం

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

తెలుగులో వచ్చిన సంప్రదాయ వ్యాకరణాలలో 'సులభవ్యాకరణము' నకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. వావిలికొలను సుబ్బారావుగారు ***సులభవ్యాకరణము*** మొదటి కూర్పు పీఠికలో ఈ గ్రంథ రచనకు పూనుకోవడానికి గల కారణాలను ప్రస్తావించారు. వ్యాసలేఖనం గురించి విద్యార్థులు తెలుసుకోవడానికి సరైన గ్రంథం లేదని, ఏది చదవాలి? ఎలా రాయాలి అనే విషయాల పట్ల వారికి అవగాహన లేదని, వారికి బోధించే కొంతమంది అధ్యాపకులకు కూడా తెలియదని బాధపడ్డారు.

విద్యార్థులు వ్యాసం రాసేటప్పుడు వాక్యాలలో తెలుగు పదాలు , ఇంగ్లీషు పదాలు, ఉర్దూ పదాలు, స్వజాతిపదాలు, గ్రామ్య పదాలు కలిపి మిశ్రమ పదాలు రాయడం, కొన్నిసార్లు ఇంగ్లీషు అక్షరాలతోనే పదాలు రాయడం, ఏకవచనంలో కర్తను ఉంచి బహువచనంలో క్రియను రాయడం, స్త్రీలింగ విశేష్యానికి పుంలింగ విశేషణం పెట్టడం ఇలా చిత్ర విచిత్రాలుగా సంకర శైలిని రాస్తున్నారని; ఇలాంటి పరిస్థితులను పోగొట్టడానికి నా శక్తిని అనుసరించి ***సులభవ్యాకరణాన్ని*** రచించానని వావిలికొలనువారు చెప్పుకున్నారు.

వావిలికొనువారు ***సులభవ్యాకరణాన్ని*** ఆంగ్లేయుల వ్యాసలేఖన గ్రంథాలను అనుసరించి రచించానని చెప్పారు. నేను చెప్పే విషయాలకు కొంత ఉపబలాన్ని చేకూర్చే విషయాలను ఆంగ్ల గ్రంథాల నుండి అనువదించినప్పటికీ, విద్యార్థులు వ్యాసాలలో రాసే దోషాలను గ్రహించి ఈ గ్రంథంలో చేర్చి సవరించానని అన్నారు. వ్యాసాలు రాసేవారికి, క్షుద్ర గ్రంథాలు రాసేవారికి ఈ గ్రంథం ఉపయోగపడుందని, ఈ గ్రంథంలో చెప్పాల్సిన విషయాలు ఇంకా ఉన్నప్పటికీ, ఆవశ్యకమైన విషయాలు విడవలేదని వావిలికొలను సుబ్బారావుగారు చెప్పారు.

వావిలికొలనువారు రెండవకూర్పు పీఠికలో ***సులభవ్యాకరణము*** గురించి "తొలుత నీ గ్రంథమును గేవల విద్యార్థులకే యుద్దేశించి వ్రాసితినిగాని యనుభవమునఁ దదితరులకు నిది ప్రయోజన పడుచుండుట యెఱిఁగితిని. ఈ కూర్పునందు నెక్కువ విషయములు చేర్పఁబడినవి. అవి విద్యార్థులకేగాక కుఱ కుఱ గ్రంథకర్తలకును, సాధుభాష యందు కథలు వ్యాసములు లోనైనవి వ్రాయువారికి విశేషముగ నుపయోగపడఁగలవని నమ్మెదను"[1] అని చెప్పారు.

[1] సులభ. పీఠిక.పుట:70

ISSN:3048-5908
Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

వావిలికొలను సుబ్బారావుగారు 'సులభవ్యాకరణాన్ని' మూడు భాగాలుగా వెలువరించారు. సంజ్ఞా, సంధి పరిచ్ఛేదాలను ప్రథమ భాగంలో పేర్కొన్నారు. విద్యార్థుల ఆదరణతోపాటుగా పండితుల ప్రోత్సాహాన్ని పురస్కరించుకొని ద్వితీయ, తృతీయ భాగాలను కూడా రచించారు. ద్వితీయ భాగంలో తత్సమ, ఆచ్ఛిక, కారక, సమాస, తద్ధిత, క్రియా, కృదంత, ప్రకీర్ణ పరిచ్ఛేదాలు, తృతీయ భాగంలో వ్యాసపరిచ్ఛేదాన్ని పొందుపరిచారు. మొత్తంగా ఈ వ్యాకరణంలో పన్నెండు పరిచ్ఛేదాలు ఉన్నాయి.

## 3. సులభ వ్యాకరణ నిర్మాణ క్రమం

వావిలికొలను సుబ్బారావుగారు 'సులభవ్యాకరణము' లో అనుసరించిన నిర్మాణ క్రమాన్ని పరిచ్ఛేదాల ఆధారంగా ఈ క్రింద పేర్కొంటాను.

### 3.1.సంజ్ఞా పరిచ్ఛేదం

వావిలికొలను సుబ్బారావుగారు సంజ్ఞాపరిచ్ఛేదాన్ని 78 సూత్రాలలో చెప్పారు. బాలవ్యాకర ణంలో 'సంజ్ఞా పరిచ్ఛేదం'లో చెప్పబడిన 23 సూత్రాలలోని అంశాలను వదలకుండా సులభవ్యాకర్త తన వ్యాకరణంలో చెప్పారు. ప్రౌఢవ్యాకరణంలో 'సంజ్ఞా పరిచ్ఛేదం' లో చెప్పబడిన అంశాలను పెద్దగా చర్చించలేదు. బాలవ్యాకరణంలో ఒకే సూత్రంలో చెప్పిన నాలుగు, ఐదు విషయాలని సులభ వ్యాకర్త విడివడిగా సూత్రాలుగా చెప్పారు. సంజ్ఞాపరిచ్ఛేదంలో ప్రధానమైన సంజ్ఞలను ప్రకరణాలుగా విభజించి వివరించారు. అక్షర ప్రకరణం, గుణింత ప్రకరణం, వర్ణ విభాగ ప్రకరణం, అనుస్వార ప్రకరణం, అర్ధబిందు నిర్దేశ ప్రకరణం, దంత్య తాలవ్య ప్రకరణం, అంతస్థ ప్రకరణం, సంజ్ఞా ప్రకరణం, కళా ప్రకరణం, ద్రుత ప్రకృతికాలు, ఆంధ్ర భాష విభజన మొదలైనవి అంశాలు ఉన్నాయి.

తెలుగు భాషకు ప్రారంభదశ నుండి సంస్కృత, ప్రాకృత భాషలతో సన్నిహిత సంబంధమున్నది. అందుకే వావిలికొలనువారు తెలుగు భాషకు మొదటి ఉత్పత్తి స్థానంగా **"సంస్కృతం బాద్య ప్రకృతి"(సులభ. సంజ్ఞ:6)** సంస్కృతాన్ని, రెండవ ఉత్పత్తి స్థానంగా **"ప్రాకృతము ద్వితీయ ప్రకృతి(సులభ. సంజ్ఞ:7)** ప్రాకృతాన్ని ఆయా సూత్రాల్లో పేర్కొన్నారు

వావిలికొలనువారు ఆంధ్రశబ్ద చింతామణిని అనుసరించి సాధారణ సంజ్ఞలను, విశేష సంజ్ఞలను కొన్నింటిని సూత్రాలుగా సంజ్ఞా పరిచ్ఛేదంలోనే పేర్కొన్నారు. **"అనుస్వారము సున్న" (సులభ. సంజ్ఞ:18)**, "**ప్రాతిపదికము**

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

**నామము"(సులభ. సంజ్ఞ:50), "ప్రత్యయము వర్ణకము" (సులభ. సంజ్ఞ:51). "ధాతువు క్రియ" (సులభ. సంజ్ఞ:52)** మొదలైనవి.

### 3.2 సంధి పరిచ్ఛేదం

వావిలికొలనుసుబ్బారావుగారు సంధిపరిచ్ఛేదంలో తెలుగు సంధులకు సంబంధించి 90 సూత్రాలు, సంస్కృత సంధులకు సంబంధించి 30 సూత్రాలను పేర్కొన్నారు. బాల, ప్రౌఢ వ్యాకరణంలోని కొన్ని అంశాలను సులభ వ్యాకర్త చర్చించారు. బాలవ్యాకరణంలో ప్రకీర్ణక పరిచ్ఛేదంలో చెప్పిన కొన్ని సూత్రాలను సందర్భోచితంగా సులభ వ్యాకర్త సంధి పరిచ్ఛేదంలో వివరించారు. అచ్సంధులను అకారాది క్రమంలో సూత్రీకరించారు. కొన్ని విశేష సంజ్ఞలను సూత్రాలుగా చెప్పారు . సంస్కృత సంధులను కూడా ఈ పరిచ్ఛేదంలో సులభవ్యాకర్త చర్చించారు. ఈ సంధి పరిచ్ఛేదంలో అచ్సంధి ప్రకరణం, స్వరలోప ప్రకరణం, కళాసంధి ప్రకరణం, ద్రుతసంధి ప్రకరణం, సమాసగత పద సంధి ప్రకరణం, నుగాగమ ప్రకరణం, తుగాగమ ప్రకరణం, ఆమ్రేడిత ప్రకరణం, మువర్ణక ప్రకరణం, ధ్వన్యనుకరణ ప్రకరణం, సంస్కృత శబ్ద ప్రయోగ ప్రకరణం సంస్కృత శబ్ద సంధి ప్రకరణం ఉన్నాయి.

వావిలికొలనుసుబ్బారావుగారు సంధి లక్షణాన్ని చిన్నయసూరిగారు చెప్పిన నిర్వచనాన్నే స్వీకరించి "**పూర్వపరస్వరంబులకుం బరస్వరం బేకాదేశంబగుట సంధి" (సులభ. సంధి:1)** అని సంధి గురించి సూత్రీకరించారు. అంటే వావిలికొలను వారి దృష్టిలోకూడా అచ్చుకు అచ్చు పరమైనప్పుడే సంధి అవుతుందని గుర్తించవచ్చు. ఈ సూత్ర వివరణలో వావిలికొలనువారు తెలుగుభాషలో 'అ, ఇ , ఉ' అనే మూడచ్చుల మీద అచ్చులు వచ్చినప్పుడే మాత్రమే సంధి వస్తుంది తప్ప మిగిలిన అచ్చుల మీద అచ్చులు వచ్చిన సంధి జరగదు అని సులభ వ్యాకర్త చెప్పారు.

### 3.3 తత్సమ పరిచ్ఛేదం

అజంతాలు, హలంతాలైన సంస్కృత పదాలు తెలుగులో ఉపయోగించినప్పుడు ఆ సంస్కృత ప్రాతిపదికలను తెలుగు పదాలుగా మార్చే విధానం ఇందులో ఉంటుంది. ఈ పరిచ్ఛేదంలో మొదటి సూత్రం నుంచి ఎనిమిదవ సూత్రం వరకు విభక్తి పేరు, వాటిలో వచ్చే ప్రత్యయాలను పేర్కొన్నారు. తరువాత ఆ విభక్తులు ఏకవచనంలో ఏవేవి వస్తాయో, బహువచనంలో ఏవేవి వస్తాయో పేర్కొన్నారు. ఈ పరిచ్ఛేదంలో సులభవ్యాకర్త మొత్తం103 సూత్రాలు ఉన్నాయి.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

సులభ వ్యాకర్త కూడా తత్సమ పరిచ్ఛేదంలో మొదట ఎనిమిది సూత్రాలలో నామ విభక్తి ప్రత్యయలనే పేర్కొన్నాడు. సులభ వ్యాకర్త'సంబోధనా ప్రథమా విభక్తి' ని ప్రత్యేకంగా సూత్రంలో చెప్పారు. **"ప్రథమా విభక్తి :ంబు-ము-వు-లు"(సులభ. తత్సమ:1), "ద్వితీయా విభక్తి: ని-ను-ల" (సులభ. తత్సమ:2) "తృతీయా విభక్తి: చేత-చే-తోడ-తో" (సులభ. తత్సమ:3) "చతుర్థీ : కై -కొఱకు"(సులభ. తత్సమ:4),"పంచమీ విభక్తి: వలన- కంటె-పట్టి"(సులభ. తత్సమ:5),"షష్ఠీ విభక్తి: కి-కు -యొక్క-లోపల-లో ""(సులభ. తత్సమ:6)"సప్తమీ విభక్తి : అందు- న"(సులభ. తత్సమ:7),"సంబోధన ప్రథమా విభక్తి: ఓ-ఓయి-ఓరి-ఓసి" "(సులభ. తత్సమ:8).** సులభవ్యాకర్త పైన చెప్పిన సూత్రాలను ఒకచోట చెప్పి క్రింద కొంత వివరణ ఇచ్చారు. 'ంబు' మొదలైన వాటికే వర్ణకాలని ప్రత్యయాలని పిలుస్తారని సులభవ్యాకర్త చెప్పారు. ఒక శబ్దానికి ఆయావిభక్తియందు రూపం చెప్పాలనుకున్నపుడు ఆయా విభక్తికి ఎదురుగ ఉండే ప్రత్యయాలలో ఒకటి చేర్చాలి. ఉదాహరణకు 'రామ'శబ్దానికి తృతీయావిభక్తి రూపం 'రాము చేత-రాము చే-రాముతోడ-రాముతోనని చెప్పాలి. ఏ అర్థంలో ఏ ప్రత్యయం చేర్చాలో వంటి విషయాలు కారక పరిచ్ఛేదంలో వివరింపడుతుంది. పై ప్రత్యయాలలో ప్రథమ విభక్తి ప్రత్యయాలు,'కై-పట్టి యొక్క' అనేవి కళలు. మిగిలిన నుగాగమంబులు ద్రుతప్రకృతికాలు అని సులభవ్యాకర్త చెప్పారు.

**3.4 ఆచ్ఛిక పరిచ్ఛేదం**

ఆచ్ఛికం అంటే అచ్చ తెలుగు అని అర్థం. ఏకాది గణాలలో చేరిన ఒక్కడు-వాడు- వీడు- మగడు' మొదలైన శబ్దాలు కాకుండా మిగిలిన అచ్చతెలుగు శబ్దాలన్ని స్త్రీ సమాలుగా కానీ, క్లీబ సమాలుగా కానీ అవుతాయని సులభవ్యాకర్త నిర్వచించారు. ఈ ఆచ్ఛిక పరిచ్ఛేదంలో 71 సూత్రాలు ఉన్నాయి. సర్వనామాలు, ఔపవిభక్తికాలను ఈ పరిచ్ఛేదంలో చర్చించారు.

**3.5. కారక పరిచ్ఛేదం**

సులభవ్యాకర్త **"వాక్యంబునఁ గర్తకుఁ గ్రియకుఁ గల యన్వయ సంబంధమును దెలుపునది కారకము. ఇది కర్త-కర్మము-కరణము-సంప్రదానము-అపాదానము-అధికరణము అని యాఱు విధములు" (సులభ. కారక:1)** అని కారకాన్ని నిర్వచించారు. వాక్యంలో కర్తకు క్రియకు గల అన్వయ సంబంధాన్ని తెల్పేది కారకం. ఇది కర్త, కర్మ, కరణ, సంప్రదాన, అపాదాన, అధికరణం అని ఆరు రకాలు. ఈ కారక పరిచ్ఛేదంలో 43 సూత్రాలున్నాయి.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

**3.6. సమాస పరిచ్ఛేదం**

**"ప్రసిద్ధముగ వేఱువేఱగు నర్థంబులు గల పదంబు లేకపదం బగుట సమాసంబు" (సులభ.సమాస:1).** అని సమాస లక్షణాన్ని వావిలికొలను వారు నిర్వచించారు. ఆయన దృష్టిలో ప్రసిద్ధమైన పదాలు కలిసి ఒక పదంగా ఏర్పడటం సమాసమని అర్థమవుతుంది. ఈ సమాస పరిచ్ఛేదంలో 70 సూత్రాలు ఉన్నాయి.

భాషా భేదం చేత సమాసం మూడు రకాలు. అవి సాంస్కృతికం, ఆచ్చికం, మిశ్రమం. సాంస్కృతికం మళ్ళీ సిద్ధము, సాధ్యము అని రెండు రకాలు. విభక్తి లోపం వల్ల సమాసం రెండు విధాలు. విభక్తి లోపిస్తే 'లుక్సమాసం' అంటారు. విభక్తి లోపించకపోతే 'అలుక్సమాసం' అంటారు. అర్థ భేదం చేత సమాసం నాలుగు రకాలు 1. ద్వంద్వము 2. తత్పురుష 3. బహువ్రీహి 4. అవ్యయీ భావం. వీటి ఉప విభాగాలను కూడా ఈ గ్రంథంలో సులభ వ్యాకర్త చర్చించారు.

**3.7. తద్ధిత పరిచ్ఛేదం**

భావాద్యర్థాలలో 'తన' మొదలైన తద్ధిత ప్రత్యయాలు ఆచ్చిక ప్రాతిపదికల మీద చేరే విధానం మొదలైన వివరణ ఈ పరిచ్ఛేదంలో ఉంది. "**విశేష్యములకుగాని విశేషణములకుగాని భావార్థము స్వార్థములోనగు నర్థంబుల రాదగిన యొక విధమైన ప్రత్యయములు తద్ధితము లనబడును" (సులభ.తద్ధిత:1).** అనగా నామాలకుగాని, విశేషణాలకుగాని భావార్థంలో, స్వార్థంలో, మతుబదర్థం మొదలయిన అర్థాలలో చేరే వివిధ ప్రత్యయాలను '**తద్ధితాలు**' అంటారని వావిలికొలనువారు నిర్వచించారు. ఈ ప్రత్యయాలు పరమైనప్పుడు 'డు' వర్ణకం మొదలైన ప్రత్యయాలు లోపిస్తాయి. ఈ తద్ధిత పరిచ్ఛేదంలో 41 సూత్రాలు ఉన్నాయి.

3.8. **క్రియా పరిచ్ఛేదం**

ధాతువుల నుండి సమాపక క్రియలు, అసమాపక క్రియలు, విశేష్యాలు, విశేషణాలు ఎలా ఏర్పడతాయో ఈ క్రియా పరిచ్ఛేదంలో వివరించబడింది. సులభవ్యాకర్త ఈ పరిచ్ఛేదంలో 136 సూత్రాలు ఉన్నాయి. వావిలికొలనువారు క్రియలను తత్సమాలు, ఆచ్చికాలు అని రెండు రకాలుగా విభజించారు. **"సంస్కృత ధాత్వాదులకు 'ఇంచు' చేర్పఁగా నైనవి తత్సమక్రియలు"(సులభ. క్రియా:1)**. సంస్కృత ధాతువులకు 'ఇంచు' చేర్చగా ఏర్పడేవి తత్సమక్రియలు. ఉదాహరణకు ' రంజించు, పోషించు, స్తుతించు. ఆచ్చిక క్రియలకు ఉదాహరణ 'చేయు , కొట్టు, తిట్టు'.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

సులభ వ్యాకర్త క్రియలను రెండు రకాలుగా చెప్పారు. **"కర్మమును గోరునది సకర్మము" (సులభ. క్రియా:2)**. కర్మను కోరేది సకర్మకం . ఉదాహరణకు 'శూరుడు శత్రువులను కొట్టును'. **"కర్మమును గోరనిది అకర్మకము" (సులభ. క్రియా:3).** కర్మను కోరనిది అకర్మకం. ఉదాహరణకు 'అవివేకి పట్టిన కార్యము పాడగును'.

సమాక క్రియలు లైన 'వర్తమానార్థకం, భూతార్థకం, భవిష్యదర్థకం, తద్ధర్మాదులు, ఆశీశ్శాప సంప్రార్థనా విధులు, వ్యతిరేకార్థకాల్ని, అసమాపక క్రియలైన 'భావర్థకం, క్త్వార్థం, చేదర్థకం, ఆనంతర్యార్థకం, శత్రర్థకాలను,' ధాతుజ విశేషణాలు, ఇంచుక్ ప్రకరణం- ప్రేరణార్థక క్రియలను ఈ పరచ్ఛేదంలో చర్చించారు.

### 3.9. కృదంత పరిచ్ఛేదం

ధాతువుల నుంచి ఏర్పడే నామవాచకాలని కృదంతాలు అంటారని సులభవ్యాకర్త మొదటి సూత్రంలో నిర్వచించారు. **" ధాతువుల వలన గలుగు నామవాచకములు కృదంతములు" (సులభ. కృదంత:1).** ఈధాతువుల మీద చేరే ప్రత్యయాలను కృత్తులు అంటారని రెండవ సూత్రంలో చెప్పారు. **"ఈ నిమిత్తమై ధాతువులకు జేర్పబడు ప్రత్యయములు కృత్తులు"(సులభ.కృదంత:2).** అంతేకాకుండా 'కృత్' ప్రత్యయాలు చేరేటప్పుడు ధాతువుల చివర ఉండే ప్రత్యయాలు కొన్ని లోపిస్తాయని తరువాత సూత్రంలో వావిలికొలనువారు చెప్పారు. ఈ కృదంత పరిచ్ఛేదంలో 23 సూత్రాలు ఉన్నాయి.

**"కవర్ణకం బలుగ్వాదులకగు" (సులభ. కృదంత:4).** 'అలుగు' మొదలైన ధాతువులు నామవాచకాలైనప్పుడు 'క' ప్రత్యయం వస్తుంది. ఉదాహరణకు ' అలుగు- అలుక' నడచు- నడక' . 'కలుగు' మొదలైన శబ్దాలకు 'ఇమి' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' కలుగు- కలిమి', నేరుచు- నేరుమి'. 'చేయు' మొదలైన ధాతువులకు 'తజ్' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు 'చేయు- చేత' . పూయు- పూత'. 'అడుగు' మొదలైన ధాతువులకి 'కువ' వర్ణకం వస్తుంది. ఉదాహరణకు ' ఆడగు- అడకువ'. 'లోగు- లోకువ'.'వడి' మొదలైన ప్రత్యయాలు ధాతువులపైన చేరే విధానాన్ని మహా కవులు ప్రయోగాలను బట్టి తెలుసుకోవాలని చివరి సూత్రాన్ని వావిలికొలనువారు చెప్పారు. ఉదాహరణకు ' కొలువడి, నడవడి, లేమిడి.

### 3.10. ప్రకీర్ణక పరిచ్ఛేదం

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

ముందు పరిచ్ఛేదాలలో చెప్పగా మిగిలిన కొన్ని భాషారూపాల ప్రక్రియలను ప్రతిపాదించేది ప్రకీర్ణక పరిచ్ఛేదం. ప్రధానంగా ఆచ్ఛిక శబ్దాలలో కలిగే ధ్వనుల మార్పులు ఈ పరిచ్ఛేదంలో వావిలికొలనువారు చెప్పారు. ఈ పరిచ్ఛేదంలో 17 సూత్రాలు ఉన్నాయి.

సులభవ్యాకర్త కూడా **"పదాద్యంబులు ఋ ౠ వర్ణంబులు, ర ల తుల్యంబులు" (సులభ. ప్రకీర్ణక:1)** అని సూత్రీకరించారు. పదంలో మొదట అక్షరాలుగా ఉండే ఋ ౠ వర్ణాలు రకార, లకారాలతో సమానం. అనగా ఋ ౠ అచ్చులైనను వాటికి సంధి కార్యాలు చేసేటప్పుడు హల్లులైన 'ర-ల' లు పరమైనపుడు ఎటువంటి కార్యాలు జరుగుతాయో అటువంటి కార్యాలు వీటికి కూడా వర్తిస్తాయని సులభ వ్యాకర్త చెప్పారు . ఉదాహరణకు ' అతఁడు ఋషి , ఆ ఋషి . వచ్చెన్ ఋషి, వచ్చెను ఋషి'.

**3.11. వాక్య పరిచ్ఛేదం**

వావిలికొలను సుబ్బారావుగారు **'విషయబోధక పద రచన వాక్యంబు'.(సులభ. వాక్య:1)** అని సూత్రీకరించి విషయాన్ని బోధించు పదాలను లేదా పద సముదాయాన్ని వాక్యమని నిర్వచించారు. కొన్ని విషయాలను సైగల చేత తెలుపవచ్చని అలాంటి చేష్టలు వాక్యాలు కావని సులభవ్యాకర్త చెప్పారు. నోటి నుండి వచ్చు ధనులన్నీ పదాలు కావని, మూగవారు, శిశువులు సైగలచేత తమ అభిప్రాయాన్ని తెల్పినప్పటికీ అవి వాక్యాలు అనిపించుకోవని సులభవ్యాకర్త చెప్పారు. ఈ వాక్య పరిచ్ఛేదంలో 65 సూత్రాలు ఉన్నాయి. 'వాక్య విజ్ఞానానికి' సంబంధించి పదం, సంబోధనార్థం, నిత్య ఏకవచనాలు, నిత్య బహువచనాలు, కర్తృర్థక వాక్యాలు, విశేషణార్థక వాక్యాలు, అస్మద్- యుష్మద్ వాక్యాలు, కాలబోధక వాక్యాలు, అద్యాహార్యం, సమాసం, విభక్తులు మొదలైన అంశాలు ఈ పరిచ్ఛేదంలో ఉన్నాయి.

**"అర్థవంతమై, యన్వయయుక్తమై, ప్రయోగార్హంబైనది పదంబు" (సులభ.వాక్య:2).** పదాలు అర్థవంతాలై ప్రయోగార్హతతో దేనితో ఏది అన్వయించునో ఆ పదాలు చేరి ఉండాలి. అన్వయం సంబంధం గల రెండు పదాల మధ్యలో సంబంధం లేని వేరొక పదం రాకూడదు. పదానికి ఖచ్చితంగా ఏదొక అర్థంఉండాలి. ఈ పదాలను వావిలికొలనువారు ఐదు రకాలుగా సూత్రీకరించారు. అవి1.నామాలు,2. క్రియలు., 3. అవ్యయాలు 4. విశేషణాలు 5. సర్వనామాలు.

ISSN:3048-5908
Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

కర్త, కర్మ, క్రియలను నిర్వచించి కర్తరివాక్యాన్ని, కర్మణి వాక్యం నిర్వచించారు. 'క్రియచేత గర్త చెప్పబడిన కర్తరి ప్రయోగము'. అలాగే' క్రియచేత కర్మము చెప్పబడునేని యది కర్మణి ప్రయోగము'. సమాపకక్రియగల వాక్యం సంపూర్ణ వాక్యం' అని నిర్వచించారు. అసమాపక క్రియగల వాక్యంబు సంపూర్ణ వాక్యంబు.

### 3.12. **వ్యాస పరిచ్ఛేదం**

వావిలికొలను సుబ్బారావుగారు ***వ్యాస పరిచ్ఛేదం***లో వ్యాసం రాసేటప్పుడు విద్యార్థులు చేసే తప్పులను ప్రస్తావించారు. వ్యాసం రాసేటప్పుడు ఒక విద్యార్థికి ఉండాల్సిన లక్షణాలను, నియమాలను 21 భాగాలుగా విభజించి పూర్వభాగంలో చెప్పారు. ద్వితీయ భాగంలో సంస్కృత శబ్దాలను, తెలుగు శబ్దాలను రాసేటప్పుడు విద్యార్థులు చేసే తప్పులను కొన్నింటిని ఉదాహరించారు.

ఏదైనా ఒక విషయాన్ని విస్తరించి రాయడం వ్యాసలేఖనమని, ఆ విస్తరించి రాయబడ్డ గ్రంథం వ్యాసమని వావిలికొలను సుబ్బారావుగారు నిర్వచించారు. ఆయన వ్యాసలేఖనాన్ని ఒక శిల్పంగా భావించారు. వడ్రంగికి కొయ్య ఎలాంటిదో, లోహకారునికి లోహం ఎలాంటిదో, వ్యాసలేఖకుడికి మాటలు ప్రధాన పదార్థాలు. మంచి పదార్థాలతో శిల్పి మంచి రూపాన్ని కల్పించినట్లుగా, మేలి మాటలతో వ్యాసలేఖకుడు ఉత్తమ వ్యాసాన్ని రాస్తున్నాడని వావిలికొలను సుబ్బారావుగారు అన్నారు. విద్యార్థులు పరీక్షకోసం పరీక్షాశాలకు వెళ్ళినప్పుడు వారు గుర్తుంచుకోవాల్సిన విషయాలను కూడా వావిలికొను సుబ్బారావుగారు ఈ వ్యాస పరిచ్ఛేదంలో ప్రస్తావించారు.

### **ముగింపు**

వావిలికొలను సుబ్బారావుగారు *సులభవ్యాకరణాన్ని* చక్కని ప్రణాళికతో రచించారు. ప్రతి పరిచ్ఛేదంలో చెప్పాలనుకున్న విషయాలను ఒక క్రమంలో చక్కగా ప్రకరణాలుగా విభజించి చర్చించారు. ఈ గ్రంథాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు పేరుకు తగిన గ్రంథంగా మనకు కనిపిస్తుంది. వావిలికొలనువారు ఈ వ్యాకరణంలో చాలా వరకు సూత్రం క్రిందనే వివరణ ఇచ్చారు. సంస్కృత సంధులను తెలుగు వ్యాకరణ గ్రంథంలో చర్చించటం, వ్యాస పరిచ్ఛేదాన్ని పొందుపరచటం ముఖ్యంగా చెప్పుకోవాల్సిన విశేషాంశాలుగా ఈ గ్రంథంలో కన్పిస్తున్నాయి. ప్రస్తుత నా వ్యాసంలో సులభవ్యాకరణంలోని ముఖ్యమైన అంశాలను చర్చిస్తూ ఆ గ్రంథ వైశిష్ట్యాన్ని తెల్పడానికి ప్రయత్నం చేశాను.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

**ఉపయుక్త గ్రంథసూచి**

భాస్కరరావు, టి. 1992. ***బాల ప్రౌఢ వ్యాకరణ సర్వస్వము(ప్రథమ&ద్వితీయ సంపుటాలు)***. కాకినాడ: ప్రశాంతి పబ్లిషర్స్. ఐదవ ముద్రణ.

మోహన్ రెడ్డి, ఆలేటి.2014. ***బాలవ్యాకరణము (తెలుగు వ్యాఖ్య).*** హైదరాబాదు: ఎమెస్కో ప్రచురణలు. ప్రథమముద్రణ.

రాజేశ్వరశర్మ, అమరేశం. 1973. ***ఆంధ్రవ్యాకరణ వికాసము(ప్రథమ&ద్వితీయ భాగములు)***. కామారెడ్డి: ప్రాచ్యవిద్యాపరిషత్తు. ప్రథమ ముద్రణ.

రామకృష్ణారావు, వంతరాం. 2017. ***బాలవ్యాకరణ ఘంటాపథము***. హైదరాబాద్: నవచేతన పబ్లిషింగ్ హౌస్. ప్రథమ ముద్రణ.

రామకృష్ణారావు, వంతరాం.2011. ***ప్రౌఢవ్యాకరణ ఘంటాపథము***. హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. ద్వితీయ ముద్రణ.

లలిత, జి.1996. ***తెలుగు వ్యాకరణముల చరిత్ర***. మద్రాసు: వెలగపూడి ఫౌండేషన్.

సుబ్బారావు, వావిలికొలను.1963. ***సులభ వ్యాకరణము***. అంగలకుదురు: శ్రీ కోదండరామసేవక ధర్మసమాజము. ప్రథమ ముద్రణ.

10.5 అనుబంధం–2 జాతీయ సదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాల ధ్రువపత్రాల నకళ్ళు

సర్టిఫికేట్ –1



తెలుగుశాఖ, Department of Telugu

మాతృభాషలు, అంతరిస్తున్న భాషల అధ్యయన కేంద్రం

Centre for Endangered Languages and Mother Tongue Studies (CEL&MTS)

మానవీయశాస్త్రాల విభాగం, School of Humanities

హైదరాబాదు విశ్వవిద్యాలయం, University of Hyderabad

శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి రచనావైభవం

రెండురోజుల అంతర్జాల సదస్సు, 29, 30 సెప్టెంబరు, 2022.

CERTIFICATE

This is to certify that Prof./Dr./Sri/Smt/ K. SURESH

has participated and presented a paper on Ravishastri gaaru Rachinchina Natakalu: Samajaprathiphalanam

in the two days National webinar on "Sri Rachakonda VishwanathaSastrygari Rachana Vaibhavam" organized

jointly by the Department of Telugu, and the Centre for Endangered Languages and Mother Tongue Studies (CEL&MTS),

during 29-30 September, 2022.

Prof. Darla Venkateswara Rao
Head and Webinar Director

Prof. Pammi Pavan Kumar
Head, CEL&MTS and
Webinar Coordinator.

సర్టిఫికేట్ –2


ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల

జిల్లా: మంచిర్యాల, తెలంగాణ రాష్ట్రం – 504208

కాకతీయ యూనివర్సిటీ ,వరంగల్ అనుబంధం, NAAC చే B గ్రేడు పొందిన కళాశాల.

రెండు రోజుల జాతీయ సదస్సు

"తెలంగాణ క్షేత్రాలు- అక్షర దర్శనం"

ధృవీకరణ పత్రం

శ్రీ / శ్రీమతి / కుమారి / **KAPPALA SURESH** గారు **RESEARCH SCHOLAR, UNIVERSITY OF HYDERABAD, HYDERABAD** నుండి హాజరై రెండు రోజుల జాతీయ సదస్సు – మార్చి నెల 21 మరియు 22 తేదీలలో పాల్గొని "**భద్రాచల క్షేత్రము – రామదాసుని భక్తి**" అంశం పై కీలకోపన్యాసం / ప్రధానోపన్యాసం / సభాధ్యక్షులు / సమన్వయకర్త / పత్ర సమర్పణ చేశారు.

డా. శ్రీధర హరీష్ కుమార్
సదస్సు కన్వీనర్ , తెలుగు శాఖ అధ్యక్షులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల

ఆచార్య డా. వి. చక్రపాణి
సదస్సు అధ్యక్షులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల